

శ్లో॥ దోషబుద్ధ్యోభయాతీతో నిషేధాత్ న వివర్తతే
గుణబుద్ధ్యా చ విహితం న కరోతి యథా అర్భకః॥ అధ్యా 7 శ్లో.11

తా. దోషము - నిషేధముః ఇవన్నీ ఆత్మజ్ఞాని సమక్షములో బాలా లీలా వినోదములే !

శ్లో॥ మల్లక్షణమిమం కాయం లబ్ధ్వా మద్ధర్మ ఆస్తితః
ఆనందం పరమాత్మానం ఆత్మస్థం సముపైతి మామ్ ॥ అధ్యా 26 శ్లో.1

తా. పరమాత్మనగు నా తత్త్వమును గ్రహించి - ఆశ్రయించి - ప్రవేశించటమే మానవ జన్మ యొక్క సాఫల్యము

శ్లో॥ విసృజ్య స్మయమానాన్ స్వాన్ దృశం వ్రీడాం చ దైహికీమ్
ప్రణమేద్దండవత్ భూమావ అశ్వచాండాలగోఖరమ్ ॥ అధ్యా 29 శ్లో.16

తా. ఇతరుల పరిహాసాలను లెక్క చేయక ఒక గుఱ్ఱము - చండాలుడు - ఆవు - గాడిదకు కూడా పరమాత్మ భావనతో నమస్కరిస్తూ ఉండు.

అధ్యయన విద్యార్థి
**యేలేశ్వరపు హనుమ రామకృష్ణ**

యేలేశ్వరపు హనుమ రామకృష్ణ
శ్రీకృష్ణ - శ్రీ ఉద్ధవ సంవాదము
అధ్యయన పుష్పము

శ్రీమత్ భాగవత మహాపురాణే ఏకాదశ స్కంధౌ బహ్మ్రసూత్ర భాష్యే

# శ్రీకృష్ణ - శ్రీ ఉద్ధవ సంవాదము

## అధ్యయన పుష్పము (వచన కావ్యము)

## (ఉద్ధవ గీత)



మూలము : శ్రీ వ్యాసమహర్షి


రచన : యేలేశ్వరపు హనుమ రామకృష్ణ

శ్రీమత్ భాగవత మహాపురాణే ఏకాదశ స్కంధౌ బ్రహ్మసూత్ర భాష్యే

# శ్రీకృష్ణ - శ్రీ ఉద్ధవ సంవాదము

## అధ్యయన పుష్పము (వచన కావ్యము)

## (ఉద్ధవ గీత)



మూలము : **శ్రీ వ్యాస మహర్షి**

అనుశ్రుత : యేలేశ్వరపు హనుమ రామకృష్ణ

## ఉద్ధవగీత- శ్రీ శ్రీకృష్ణ- ఉద్ధవ- సంవాదము - వచన కావ్యము
## బ్రహ్మసూత్ర భాష్యము
## శ్రీమత్ భాగవత ఏకాదశస్కంధాంతర్గతము

### 1. దేవతల రాక

**శ్రీ శుకదేవుడు :** ఓ పరీక్షన్మహారాజా! భగవంతుడగు శ్రీ కృష్ణపరమాత్మ భక్తుడు - మిత్రుడు అగు ఉద్ధవునికి బోధించిన "పరమహంస విశేషము - బ్రహ్మసూత్ర భాష్యము" అని ప్రశంసించబడుచున్న విశేషములతో కూడిన **"పరతత్వ విచారణ - గురునిర్వచన"** ఇత్యాది విషయముల గురించి చెప్పుచున్నాను.

**మనం మననం చేసుకోబోయే ఈ విశేషాలు జీవుని సంసార సాగరము నుండి తరింపజేయగలవు**. అందుచేత ఓ మహారాజా! ఓ సర్వ సభికులారా! అందరు దయచేసి శ్రద్ధగా వినండి.

ఒకానొక రోజు సర్వలోక శుభంకరము-మరమానందప్రదము అగు శ్రీకృష్ణ భగవానుని దివ్య రూప సందర్శనము కొరకై బ్రహ్మ దేవుడు, రుద్రభగవానుడు ద్వారకకు వేంచేశారు. వారిని అనుసరించి ఇంద్రుడు, మరుత్తులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, అశ్వనీ దేవతలు, ఏకాదశరుద్రులు, సిద్ధులు, అనేకమంది పితృదేవతలు మొదలైన దేవతా శ్రేష్ఠులంతా కూడా శ్రీకృష్ణ సందర్శనానందమునకై వచ్చారు.

**స్వామి యొక్క దివ్య మంగళ విగ్రహాన్ని సందర్శించి పరమానందము పొందారు.**

మధుర సుగంధమును వెదజల్లు నందనవన పుష్పములను, పుష్పమాలలను శ్రీకృష్ణ భగవానునికి సమర్పించారు.

ఆ వేంచేసిన దేవతా శ్రేష్ఠులు శ్రీకృష్ణుడు ప్రేమాస్పదంగా చూపిన ఆసనములపై సుఖాసీనులై శ్రీకృష్ణ దేవుని స్తుతించసాగారు.

### 2. శ్రీకృష్ణ స్తుతి

**శ్రీ బ్రహ్మ రుద్రాది దేవతలు :** హే భగవన్! ఏ మహత్తరమైన సంపదను తమ హృదయ పద్మమునందు నిలుపుకొని మార్గాణ్వేషకులగు ముముక్షువులంతా అనుక్షణం ఉపాసిస్తూ

సర్వకర్మ పాశములనుండి విముక్తిని సముపార్జించుకుంటున్నారో, అట్టి తమ పాదార విందములకు మా బుద్ధి–ఇంద్రియ–ప్రాణ–మనో–వాక్ పూర్వకంగా నమస్కరిస్తున్నాము. **మీ పాద పద్మములకు సాష్టాంగదండ ప్రణామాలు!**

స్వామీ! మీరు మీయొక్క మాయావిశేషంచేత–మీ యందు మీరే–**చెప్పుటకు–ఊహించుటకు అలవికానిది, వ్యక్తరూపము, త్రిగుణసమన్వితము అయినట్టి ఈ ప్రపంచమును సృష్టించుకుంటున్నారు. పరిపాలిస్తున్నారు. లయింపజేసుకుంటున్నారు.** ఇంతటి చమత్కారం నిర్వహిస్తూ కూడా మీరు సర్వదా అప్రమేయులు. త్రిగుణ మాయాతీతులు. రాగ ద్వేషములచే స్పృంశించబడనివారు. మీ చిదానంద పరతత్త్వము ఆవరణ రహితము (Sans Borders). అఖండము (indivisible). సర్వరూప ఆవిష్కరణము (All forms are always yours). పరమానందము (Pleasant Form Beyond all else).

**అందుచేత మీచే నిర్వర్తించబడుచున్న లీలా విశేషములచేత, కర్మలచేత మీరు బద్ధులు కానేకారు.**

మీ యొక్క అవతార విశేషసంబంధమైన జన్మ–కర్మలను విని, మిమ్ము ప్రస్తుతిస్తూ సత్పురుషులు విశుద్ధత్వమును సముపార్జించుకుంటున్నారు.

అంతటి విశుద్ధత్వమును జీవులెవ్వరూ వేదాధ్యయనము చేతగాని, వేదార్థశ్రవణము చేతగాని, తపస్సు మొదలైన ఆయా క్రియా విశేషముల చేతగాని పొందవీలుకాదు. ముక్షువులగు వారు పరమశుభములు పొందటానికై ప్రేమార్ద్ర హృదయంతో మిమ్ము స్మరిస్తూ తరిస్తున్నారు. జితేంద్రియులగు మరికొందరు స్వర్గమును అధిగమించి పునరావృత్తి దోషం లేనట్టి విష్ణులోకం జేరటానికై మీ పాద పద్మములను త్రికాలాలలోను ఆశ్రయించినవారై వుంటున్నారు. ఆశ్రితులగు అనేక మంది భక్త జనులు మీ వాసుదేవ (Al-present) సంకర్షణ (Al-Attracting) ప్రద్యుమ్న (సృష్టిగా రూపొందుచున్న) అనిరుద్ధ (అప్రతిహతమైన) చతుర్విధరూపములను ఆరాధిస్తున్నారు.

**అట్టి మీ ఈ పాదపద్మములు మాపట్ల మా విషయవాసనలను మొదలంటా పెకలించివేయు ఝుంఝూమారుతమగుగాక!**

యజ్ఞములు నిర్వర్తించే యాజ్ఞీకులు ఋక్–యజుర్–సామవేద పూర్వకంగా మంత్రోచ్చారణ చేస్తూ యజ్ఞగుండమునకు ఆహూతులు సమర్పిస్తూ స్మరిస్తున్నది మీ

స్వరూపమునే! యోగులు అణిమ-గరిమ-లఘిమ-మహిమ-ఈశిత్వ-వశిత్వ-ప్రాకామ్య-ఇచ్ఛా ఇత్యాదిసిద్ధులు సంపాదించుటకై ధ్యానిస్తున్నది కూడా మీ స్వరూపమునే! పరమ భాగవతులు మోక్షాకాంక్షను కూడా త్యజించి తమ భక్తి పారవశ్యంతో ఆత్మానందానుభూతిని అనుభవిస్తూ ఇంకేమి అఖర్లేదు-అని ఆస్వాదిస్తున్నది మీ తత్త్వమే!

ఓ దేవాదిదేవా! మేము తమ సందర్శనానందాభిలాషులమై వస్తూ, నందనవనము-హిమాలయము మొదలైన ఆయా ప్రదేశములలో లభించిన సౌగంధిక పుష్పములు మొ॥వాటితో కూడిన పూలమాలలను తెచ్చి ఒక్కొక్కరము మిమ్ములను అలంకరించి ఆనందిస్తున్నాం. అయితే మీ హృదయ ప్రదేశమున నివసిస్తున్న లక్ష్మీదేవి-"ఇదేమిటి? - ఈ బ్రహ్మాది దేవతలు అల్పములైనట్టి భౌతిక రూప పుష్పమాలలను నేనున్న స్థానంలో అలంకరిస్తున్నారు?" అని కించిత్ అవేశముతో మిమ్ములను ప్రశ్నిస్తోంది. మరి మీరో? అది పట్టించుకోకుండా మేము తెచ్చి సమర్పించిన మాలలను నిరాఘాతంగా ధరిస్తున్నారు.

ఎందుకని? ఎందుచేత నంటే మీరు భక్తవత్సలులు కదా!

అట్టి పరమప్రేమాస్పదులగు మీ దివ్యచరణ కమలములు మా యొక్క 14 లోకముల సంబంధములైన సర్వ విషయవాసనలను తొలగించి మమ్ములను రక్షించునుగాక!

హే భగవన్! వామనావతారంలో బలిచక్రవర్తి యొక్క దానమును స్వీకరిస్తూ మీ యొక్క ఒక పాదము త్రిలోకములను ఆక్రమించి వేసింది. మీ పాద పద్మములనుండి జన్మించిన గంగానది లోకపావని అయి తన్ను సమీపించిన జీవులందరి పాపములను కడిగివేసి పవిత్రులుగా తీర్చిదిద్దుతోంది. అటువంటిదైన ఈ మీ చరణయుగళం మాయీ సాష్టాంగ దండ ప్రణామములు స్వీకరించి మాయొక్క -అల్ప- సంకుచిత-పరిమిత దృష్టుల నుండి మమ్ము సదా కాపాడును గాక!

**మాయందు తత్త్వదృష్టిని జనింపచేసి, పరిపోషించి, పరివేష్టించి పరిరక్షించును గాక!**
"ఈ ఎదురుగా కనిపించేవారంతా శ్రీకృష్ణ రూపులే"-అని మా మనస్సు పొందునుగాక!
"ఇదంతా చైతన్యానంద ప్రదర్శనమే!" అనే ఎఱుక మా బుద్ధియందు ప్రవృద్ధమగుగాక!

హే స్వస్వరూప చైతన్యమూర్తీ! మా బ్రహ్మ రుద్రాది దేహములతో సహా ఈ సర్వజగత్తులు పరస్పరం కలహపీడితములై కాలమునకు వశములై వుంటున్నాయి. ప్రకృతి-పురుషాతీతుడవగు కాలపురుషుడు మీరు! ఓ కాలః కాలా! కాలనియామకా! శంసస్తనోతు చరణః! పురుషోత్తమస్య! పురుషోత్తములగు మీ చరణములు మాకు సుఖశాంతులను

ప్రసాదిస్తాయని గ్రహించి మీ చరణ సన్నిధిని చేరుకున్నాం.

ఓ పురుషోత్తమా! ప్రతి ఒక్క జీవునిలో అనుభూతమగుచున్న ఉత్తమ పురుష (The First Person. The " I" in every body) గా ప్రదర్శిమగుచున్నది మీరే! కనుకనే మీరు పురుషోత్తములు! వేదములు **ఇక్కడి ప్రకృతి–పురుష–మహత్తత్త్వములకు నియామకుడు–ఆధారభూతుడు మీరే అని నిర్ణయించి ఎలుగెత్తి గానం చేస్తున్నాయి.** ఈ చరాచరజగత్తు యొక్క సృష్టికర్త–పరిపోషకుడు–లయకర్త మీరే! అందుచేత కూడా, మిమ్ము వేదోపనిషత్తులు పురుషోత్తముడని లయ–విన్యాసంగా పలుకుచున్నాయి.

**"కారణం కారణానిచ"** అనబడు కారణ కారణ స్వరూప సంజ్ఞయగు క్షీరసాగరమున శయనించువారు, అమోఘవీరుడు అగు మహావిష్ణువు కూడా సర్వతత్త్వస్వరూపుడగు మీ వలననే శక్తిని పొందుతున్నారు. అట్టి శక్తి చేత మాయతోగూడి ఈ జగత్తుకు బీజ స్వరూపమైన మహత్తత్త్వమును సృష్టిస్తున్నారు. అటు తరువాత ఆ మహత్తత్త్వమే త్రిగుణ రూపమాయను అనుసరించి సప్తవ్యాహృతులు అని చెప్పబడే ఓం భూః ఓంభువః ఓం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓ గుం సత్యం అను 7 ఆవరణములు తో కూడిన ఈ సువర్ణమయ బ్రహ్మాండమును (The universe with multi coverages) సృష్టించుచున్నది.

ఈవిధంగా ఈ ఎదురుగా దేహ–మనో–బుద్ధి–చిత్త–అహంకార–జీవ–ఈశ్వర అహంభావాలకు తారసబడే 7 ఆవరణములతో కూడిన బ్రహ్మాండము మీయందు కనిపించే నిర్విషయరూప విషయచమత్కారమే సుమా!

ఇక్కడి సృష్టి, ఈ సృష్టిని ఆస్వాదించే దృష్టి, ఆ దృష్టికి ఆధారమైన ద్రష్ట ఆ ద్రష్టను గమనిస్తున్న దృక్ స్వరూపముకూడా మీరే! మీరే జీవుడు! మీరే ఈశ్వరుడు! మీరే సర్వేశ్వరుడు! ప్రతి జీవుని యందు కనిపించే మనో–బుద్ధి–చిత్త అహంకారాలు మీ సంప్రదర్శనమే!

ఈ రీతిగా త్రిగుణ సమన్వితమైన మాయచే జనిస్తున్న ఇంద్రియ సమూహముకు, ఇంద్రియవిషయజగత్తుకు ఆధారము, ఇంద్రియములతో దృశ్యవిశేషాలను ఆస్వాదిస్తున్న ఇంద్రుడు కూడా మీరే! ఇంద్రియ విశేషాలన్నీ సర్వత్రా సర్వజీవులరూపంగా నేను – నీవులతో సంభవింపజేస్తున్నది–అనుభవిస్తున్నది మీరే! మీరే అయివుండి కూడా మీరు ఆయా ఇంద్రియ భూతరూప దృశ్య విశేషములచే బద్ధులు కానే కాదు! వాటివాటియందు

ఆసక్తుడు కూడా కాదు! అనగా సర్వ జగద్విశేషాలు అనుభవిస్తున్న జీవుడు అనబడువాడు మీరే అయి వుండి కూడా, ఈ జీవుడు-ఇంద్రియములు-దేహములు-దృశ్యములు-వగైరా మిమ్ము స్పృశించవు. వీటినన్నింటిని ఆస్వాదిస్తూనే వీటికి అప్రమేయులై స్వయంతేజోరూపంగా సర్వదా వెలుగొందుచున్నారు.

అందుచేతనే, అన్యయోగులు- వారు త్యజించ యత్నిస్తున్న విషయభోగములను వారే చూచుకొని, "ఎట్లాగురా త్యజించటం?" అని భయం పొందటం జరుగుతూవుంటే, యోగీశ్వరుడగు మీకు ఈ ఇంద్రియ విషయములతో కూడిన ఏడు ఆవరణల చమత్కారం కేవలం ఏడువారాల ఆభరణమువంటివి అగుచున్నాయి.

హే యోగ యోగీశ్వరా! శ్రీకృష్ణా! రుక్మిణి మొదలైన 16008 మంది భార్యలు సదా మిమ్ములను వెంటనంటి ఉంటున్నారు! తమ తమ చిరుమందహాసములతో, చిలిపి వీక్షణములతో ఆకర్షణ సంతరించుకున్న కనుబొమ్మలతో, రాసానుభూతిని ప్రేరేపించే కదలికలతో కూడిన సంజ్ఞలతో శృంగార చేష్టలను ప్రోత్సహించే ప్రణయ వాక్యార్ధముల రూపంతో అత్యంత సమ్మోహకములైన మన్మథ బాణాలు మీపై వదలుచున్నారు. మిమ్ము ఎట్లాగైనాసరే, తమతమ వైపుగా ఆకర్షించి ఎవరికివారే తమకు పరిమితం చేసుకోవాలని సర్వవిధాలా యత్నపరులై వుంటున్నారు. కాని ఏం లాభం? ఈ చరాచరసృష్టికి అతీతము-అన్నింటికీ ఆధారము అయిన మీ మనస్సును ఏ మాత్రం దోచుకోలేక పోతున్నారే!

మీరు మహామనోస్వరూపులు కదా! అందుచే ఓ దేవాదిదేవా! శ్రీకృష్ణప్రభూ! ఈ త్రిలోకములందలి సర్వజీవుల పాపరాసులను క్షాళనం చేయడానికై మీరు రెండు స్రవంతులను ఈ జగత్తులలో ప్రవహింపజేస్తున్నారు.

1. అమృతమయమగు మీ లీలా విశేషాలు- ఆధ్యాత్మిక విశేషార్ధాలతో కూడిన శ్రీకృష్ణ లీలావినోద చమత్కారాల స్రవంతి.

2. మీ పాదముల నుండి జనించి మీ పాద యుగళములకు ప్రదక్షణ చేసి ప్రవహిస్తూ సర్వలోకుల దోషములను కడిగివేస్తున్న గంగానదీ స్రవంతి.

అందుచేత ఈ లోకంలోని వివేకవంతులగు జీవులు మనోచక్షువులతో మీ లీలా విశేషాలను స్మరిస్తూ, ఈ భౌతిక శరీరంతో గంగానదిలో మునకలు వేసి వారివారి అధిభౌతిక-అధిదైవిక-ఆధ్యాత్మిక త్రివిధ తాపములను ప్రక్షాళనం చేసుకుంటూ ధన్యులగుచున్నారు.

హే శ్రీకృష్ణ చైతన్యానందమూర్తీ! సర్వాంతర్యామీ!

మా మనో–వాక్–కాయములచే త్రికరణశుద్ధిగా సమర్పిస్తున్న ఈ మా సాష్టాంగదండ ప్రణామములు మరొక్కసారి స్వీకరించండి. మా మనో–బుద్ధి–చిత్త–అహంకారాలను ఆత్మానంద లహరిలో పరిశుద్ధం అయి మీ పాదపద్మములను అలంకరించి ఉండును గాక!

---

ఈవిధంగా దేవతలంతా బృందగానంగా స్వామికి స్తోత్రాలు సమర్పించారు. క్రమంగా శబ్దజాలము ఉపశమించగా అక్కడికి వేంచేసిన వారంతా శ్రీకృష్ణ భగవానుని అవతారరూపం చూస్తూ, అలౌకికమైన ఆత్మానందంలో ఓలలాడసాగారు. అప్పుడు బ్రహ్మదేవుడు స్వామితో ఇట్లు చెప్పనారంభించినారు.

**బ్రహ్మదేవుడు:** హే ప్రభు! శ్రీహరీ! ఒకానొకప్పుడు మేమంతా సామవేదాంతర్గతమైన విష్ణుస్థవంతో ప్రార్థనచేయగా మాకు మీరు ప్రత్యక్షమైనారు. భూభారాన్ని హరించడానికి అవతరించవలసినదిగా మేము మిమ్ములను అభ్యర్థించాము. ఆహ్వానించాము! మా ప్రార్థనను మన్నించి ఈ కృష్ణావతారం మా అందరికి, అట్లాగే ఈ సర్వలోకాలకు ప్రసాదించారు. తగువిధంగా దుష్టశిక్షణ–శిష్టరక్షణ నిర్వర్తించారు. సత్యాన్వేషకులగు భక్తమానసుల క్షేమము కొరకై ధర్మమును పునః స్థాపింపజేశారు. సర్వలోకములలోని పాపదృష్టులను శమింపజేయగల మీ అవతార కీర్తిని వ్యాపింపజేశారు. సర్వోత్తమమైన ఈ శ్రీకృష్ణ సుందర రూపంతో యాదవ కులంలో అవతరించి జగత్‌హితమునకై అనేక కార్యక్రమములను నిర్వర్తించారు.

ఏ జనులైతే కలియుగంలో మీ ఈ లీలలను ఆధ్యాత్మార్థ పూర్వకంగా గానం – శ్రవణం చేస్తారో, వారంతా స్వభావసిద్ధంగా సాధుస్వభావులై సులువుగా అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసివేసుకోగలుగుతారు.

హే మహాత్మా! ఈ యదువంశములో మీరు జనించి పంచవిశాధిక (125) సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రభూ! మీరు నిర్వర్తించసంకల్పించిన దైవకార్యమంతా సంపూర్ణమైనది. ఇక కొద్ది కాలంలో కాలనియమానుసారం బ్రాహ్మణశాపమును అనుసరించి యదువంశం వినాశనం కానున్నది! కాల చక్రానుసారం కలియుగం ప్రారంభంకానున్నది. అందుచేత..! మీరు మాయొక్క ఈ విన్నపము ఉచితమేనని భావిస్తే, **పరమధామమగు విష్ణులోకానికి తిరిగి విచ్చేయండి.** మీ సేవకులము – మీచే కల్పించబడి వివిధ లోకములను పాలించువారము అగు మమ్ములను ఇతఃపూర్వంలాగానే పరిపాలించండి! మీ రాకకై విష్ణులోకాది ఊర్ధ్వలోక జనులంతా ఎంతగానో ఎదురు చూస్తూఉన్నారు. మీపట్ల

విరహంతో తపిస్తున్నారు. అందుచేత ఇంద్ర బ్రహ్మ రుద్ర లోకముల ద్వారా వేంచేసి వైకుంఠధామం అలంకరించండి.

**శ్రీకృష్ణుడు :** ఓ విబుధేశ్వరా! సృష్టికర్తా! బ్రహ్మదేవా! మీరు చెప్పినట్లుగా ఈ కృష్ణావతారము నిర్వర్తించవలసిన కార్యక్రమములన్నీ సంపూర్తి అయినట్లుగా నేనుకూడా భావిస్తున్నాను. దేవతలు కోరుకున్నట్లు భూ భారమంతా అవసరమైనంత వరకు తొలగినది కదా! అయితే మరొక్క చిన్న కార్యక్రమం మాత్రం ఇంకా మిగిలి ఉన్నది. ఇక్కడి ఈ యాదవకులమంతా అప్రతిహతమగు వీర్య-శౌర్య జనులతో నిండివున్నది. వీరు తమ ప్రతాపములచే గర్వించి భూమినంతా ఆక్రమించే అవేశ-కావేశములు కలిగినవారై ఉన్నారు. ఇన్నాళ్ళు వీరిని ఒక చెలియవికట్ట వలె ఆపి వుంచాను. ఈ యాదవవీరులను సంహరించకుండా నేను విష్ణులోకం జేరటం జరిగితే, ఇక్కడి యదువీరులంతా హద్దులను అతిక్రమించి బలగర్వంతో లోకములకు అశాంతిని కలిగించగలరు. అందుచేత బ్రాహ్మణులు ఇచ్చిన శాపమును అనుసరిస్తూ దుష్టశిక్షణవిభాగమైనట్టి ఇక్కడి యాదవవీరుల వినాశనమును ముగించుకొని బ్రహ్మ రుద్రలోకాలగుండా వైకుంఠధామం చేరగలవాడను.

శ్రీకృష్ణుని చిరునవ్వుతో కూడిన పెదముల నుండి జారువారిన ఈ వాక్యములు ప్రశాంత చిత్తముతో వినినవారై బ్రహ్మాది దేవతలు స్వామికి మరల ప్రణామములు సమర్పించి తమ తమ లోకములకు మరలారు.

## 3. శ్రీ ఉద్ధవ - శ్రీకృష్ణ సమాగమం

ఆ తరువాత ద్వారకా నగరంలో అనేక అపశకునాలు, మహోత్పాతాలు కనిపించసాగాయి. అది గమనించిన కొందరు ద్వారకానగర శ్రేష్ఠులు శ్రీకృష్ణుని సమీపించారు.

**శ్రీకృష్ణుడు :** ఓ యాదవకుల శ్రేష్ఠులారా! ద్వారకలో అనేక మహోత్పాతాలు జరుగుతూ ఉండడం నేనూ గమనిస్తున్నాను. ఇదంతా బ్రాహ్మణశాపప్రభావం కాబోలు. మనలో ఎవ్వరైనా తమ ప్రాణాలు రక్షించుకోదలచుకుంటే మాత్రం ఇక్కడ ఇంకా వుండటం ఉచితం కాదని నాకు అనిపిస్తోంది.

ఇక ఆలస్యం చేయకూడదు. మీరంతా కూడా ప్రభాసక్షేత్రమునకు ఇప్పటికిప్పుడే బయలుదేరి వెళ్ళటం మంచిది. ఆ క్షేత్రం పరమపవిత్రమైనదనే విషయం మీకు తెలుసు.

ఒకానొకప్పుడు దక్షప్రజాపతి శాపంచేత క్షయరోగమునకు గురి అయిన చంద్రుడు ప్రభాసక్షేత్రం సందర్శించి, అక్కడి నదిలో స్నానం ఆచరించి రోగవిముక్తుడైనాడని, కళాభివృద్ధిని పొందాడని మనమంతా వినియే వున్నాము కదా! మన యాదవకుల జనులంతా ఆ ప్రభాసక్షేత్రం వెళ్ళి స్నానాదులు నిర్వర్తించెదరుగాక! దేవతలకు నివేదనలు, పితృదేవతలకు తర్పణములు సమర్పించండి. అక్కడి ఉత్తమ బ్రాహ్మణులను పండితులను ఆహ్వానించి సంతర్పణలు చేయండి. దక్షిణలు ఇచ్చి వారి ఆశీర్వాదం పొందండి. వారి దయచేత, ఆశీర్వాద బలంచేత ఈ బ్రాహ్మణ శాప విపత్తు నుండి మిమ్ములను మీరు రక్షించుకోవటానికి ఒకప్రయత్నం చేయటం ఉచితం!

❑ ❑ ❑

శ్రీకృష్ణుని అభిప్రాయం విని అక్కడి పెద్దలంతా "అందరము పిల్ల-పాలతో సహా శ్రీకృష్ణుడు చెప్పినట్లే ప్రభాసక్షేత్రం సందర్శిద్దాం!" అని నిర్ణయించుకొన్నారు. అప్పటికప్పుడే యాదవ జనమంతా ప్రయాణానికి సన్నిద్ధులు కాసాగారు.

శ్రీ ఉద్ధవుడు శ్రీకృష్ణ నిత్యసేవా వ్రతుడు. ప్రకృతి వైపరీత్యాల గురించి శ్రీకృష్ణ సందేశము విన్నాడు. యాదవ జనులంతా ప్రభాస తీర్థానికి బయల్వెడలే ప్రయత్నంలో వుండటం గమనించాడు. అప్పటికప్పుడు మందిరంలో ఏకాంతంగా శ్రీకృష్ణుని సమీపించి - శ్రీ కృష్ణస్వామియొక్క చరణములకు నమస్కారములు సమర్పించాడు. చేతులు జోడించి నిలుచుని ప్రార్థనా పూర్వకంగా మనస్సులోని మాటలను చెప్పసాగాడు.

## 4. పరతత్త్వాశ్రయం

**ఉద్ధవుడు :** హేకృష్ణా! దేవదేవేశా! పుణ్యశ్రవణ కీర్తనా! నీ లీలలు శ్రవణం చేయటంచేత నిన్ను కీర్తించటంచేత జీవుడు పవిత్రత సంతరించుకోగలడు. నీవు పరమేశ్వరుడవే! భగవన్ స్వయమ్! సర్వ శక్తిమంతుడవే! అట్టి నీవు మన యాదవులకు పెద్దలను అవమానించడంచేత ప్రాప్తించిన బ్రాహ్మణ శాపము తొలగించలేవా? తప్పక తొలగించ గలవు. అయినాకూడా ఎందుకో నీవు అట్లా చేయటం లేదు. సృష్టి-స్థితి-లయ లీలా వినోదివగు నీవు ఈ యదు వంశనాశనం ఉద్దేశ్యించి ఉంటావని నేను అనుకుంటున్నాను. ఈ కనబడేదంతా కూడా నీ యొక్క మాయా విశేష చమత్కారమే కదా! అయితే నాదొక విన్నపం! మీరు త్వరలో విష్ణుధామం చేరనున్నారని నేను దేవతలు వచ్చినప్పుడు గమనించాను.

శ్లో॥ **నాహం తవాంఘ్రి కమలం క్షణార్ధమపి, కేశవ!**

**త్యక్తుం సముత్సహే, నాథ! స్వధామనయ మామఽపి॥** (అధ్యా 6 శ్లో 43)

నేనైతే నీ పాదపద్మములను వదలి అరక్షణం కూడా ఎక్కడా వుండలేను. నిలువలేను. అందుచేత నాథా! నన్ను కూడా మీవెంట విష్ణుధామం అనుసరించనివ్వండి.

హే యదుభూషణా! పరమమంగళ ప్రదము-చెవులకు అమృతప్రాయము అగు నీ లీలలు, వాటి అంతరార్ధాలు పానము చేసినవాడు ఇక ఈ లౌకిక విషయాలు-వాటిని సంబంధించిన విషయ వాసనలు అంటిపెట్టుకొని వుంటాడా? లేనే లేదు. మా ఆత్మేశ్వరుడువు, మా ఆత్మ స్వరూపుడవు, మాకు అధికాధిక అత్యంత ప్రియుడవు అగు నిన్ను నీ భక్తులమగు మేము-పరుండినపుడు గాని, కూర్చున్నప్పుడుగాని, నడుస్తున్నపుడు గానీ, స్నానం-భోజన-క్రీడాదులప్పుడుగాని - విడిచి వుండగలమా! లేనేలేదే!

ఓ శృంగార రత్నాకరా! బాల్యం నుండి ఇంతకాలమూ నిన్ను ఆశ్రయించాను. వెంటనంటి వున్నాను. ఎందరెందరో భక్తులు నీకు పుష్పమాలలను సమర్పిస్తూ వుంటే... వాటిని కొద్దిక్షణాలు నీవు ధరించి, ఇంతలోనే నా చేతులకు ఇస్తూ వుండేవాడివి. నేను వాటిని ధరించి ఆనందిచే వాడిని. నీవు ధరించి-త్యజించిన వస్త్రములను నేను మహాప్రసాద పూర్వకంగా ధరిస్తూ వస్తున్నాను.

స్వామీ! మేము నీకు సంబంధించినవారము. నీకు చెందినవారము. నీవారము. నీవు తినగా మిగిలిన తినుబండారాలను ఆప్యాయముగా తిని ఆనందించే మీ సేవకులం. అందుచేత మీ మాయ మమ్ము బంధించదు. కొందరు మునులు, ఋషులు, తపోబల సంపన్నులు, సన్యాసులు మొదలగువారు కఠోర నియమాలతో సాధనలు నిర్వర్తించి బ్రహ్మలోకం చేరుచున్నారు.

ఇక మోమో? ఇక్కడు కర్మమార్గమున పడి ప్రపంచంలో తెలిసీ తెలియకుండా వెట్టిగా పచార్లు చేస్తున్నాం.

అయితే ఏం? మీ భక్తజనంలో కలిసిపోయి, వారిలో ఒకరిమై నీకథలను గానం చేస్తూ నిన్ను కీర్తిస్తూ వున్నాము. లీలామానుష విగ్రహుడవగు నీ స్వరూపమును, సంచారములను, నీ అవతార క్రియా పరంపరలను, హాస్యభరిత సంభాషణలను, పరిహాసములను, ఉపదేశములను, మర్మగర్భబోధలను స్మరించుకుంటూ వుంటున్నాం. మిమ్ములనే కీర్తిస్తూ కాలం గడుపుచున్నాం. అందుచేత ఈ సంసార దుఃఖమంటే మేము

ఏమాత్రం భయపడటం లేదు. మీ అవతార విశేషములను చెప్పుకుంటూ సులభంగా సంసారసముద్రాన్ని దాటివేయగలం. అందుచేత మద్గురువగు నిన్ను అనుసరిస్తాను. కాల దేవతకు ఇక ఈ భౌతిక దేహమును సమర్పిస్తాను. ఏ కాల చమత్కారంచేత జలంలో బుడగవలె ఇది బయల్వెడలిందో ఆ కాలదేవత ఇచ్ఛానుసారం ఏది ఎట్లో అట్లే అగుగాక!

**శ్రీకృష్ణుడు :** ప్రియ మిత్రమా! మహాభాగా! ఉద్ధవా! నీవు చెప్పినట్లు నేను అనుకుంటున్న మాట వాస్తవమే! బ్రహ్మదేవుడు, రుద్రభగవానుడు మొదలైన లోకపాలకులు నాయొక్క విష్ణులోక పునరాగమనాన్ని వాంఛిస్తున్నారు. దేవతలు ఇతఃపూర్వం నన్ను కోరినట్లుగా దైవకార్యమంతా పూర్తి అయింది. వారు కోరుటచేతనే నేను, అన్న బలరామునితో కూడి భూమిపై అవతరించటం జరిగింది.

ఇక ఇప్పటి విషయానికివస్తే.... మన ఈ యదుకులం బ్రాహ్మణశాపాగ్నికి దగ్ధంకావడం ఇప్పటికే జరిగిపోయింది. ఇక తదనుసారంగా దృశ్యపరంగా పరస్పర వివాదములు మిషచే వినష్టం కానున్నది. నేటి నుండి 7వరోజుకు ఈ ద్వారకను సముద్రజలం ముంచివేయబోతోంది. నేను అవతారమును చాలించిన మరుక్షణం కొన్ని మంగళ ప్రదమగు విశిష్టవిశేషాలు కాలనియమానుసారం భూలోకమును వీడనున్నాయి. తదనుగతంగా కొద్దిరోజులలో కలియుగం ప్రవేశించబోతోంది. కలియుగంలో అధికమంది జనులు అధర్మవిషయాలపట్ల అధికమైన అభిరుచికలిగినవారై వుంటారు. అందుచేత నా అవతార పరిసమాప్తి తరువాత అనేక ప్రదేశాలు నీవంటి పుణ్యస్వభావ-కోమల-సహృదయుల నివాసమునకు యోగ్యమై వుండవు.

**ఉద్ధవుడు :** స్వామీ! రాబోయే కలియుగం గురించి, జనుల అధర్మ ప్రవృత్తుల గురించి పురాణ ద్రష్టల వద్ద నేను చూచాయగా విన్నాను. అందుకే మీ అవతారమును స్మరిస్తూ మీతో వైకుంఠానికి అనుసరించటానికి అనుజ్ఞను వేడుకుంటున్నాను.

**శ్రీకృష్ణుడు :** ఓ వుద్ధవా! నీవు-నేను కూడా కాలనియమానుసారమే వర్తించవలసియున్నది సుమా! అందుచేత నీవు నీకు ప్రసాదితమైన ఆయుఃపరిమాణంతో ఈభూమిపై మరికొంత కాలం కొనసాగించ వలసియున్నది.

**ఉద్ధవుడు:** అట్లాగా? అయితే ఇప్పుడు నాకు కర్తవ్య - అకర్తవ్యలేమిటో విశదపరచప్రార్థన! నావారైన యాదవులు అదిగో, వెళ్ళిపోతున్నారు కదా!

**శ్రీకృష్ణుడు :** ఇక ఇప్పుడు, నా వారు–నా బంధువులు నాకు స్వజనులు–నా స్నేహితులు –నాకు ఆత్మీయులైనవారు – ఇత్యాది పరిమిత దృష్టులను అధిగమించిన వాడవై వుండు.

**శ్లో॥ త్వం తు సర్వం పరిత్యజ్య స్నేహం స్వజన–బంధుషు।**
**మయ్యావేశ్య మనః సమ్యక్ సమదృక్ విచరస్వగామ్॥** (అధ్యా 7, శ్లో 6)

సర్వే సర్వత్రా సమదృష్టిని పెంపొందించుకొని సర్వతత్త్వస్వరూపుడనగు నాపై నీ మనస్సంతా నిలుపుకొని ఉండు. సమ్యక్ (ఒకే పరమాత్మయొక్క వివిధ రూపములుగా) భావనను ఆశ్రయించుకొని ఉండు.

శ్లో॥ **యత్ ఇదం మనసా – వాచా – చక్షుర్భ్యాం – శ్రవణాదిభిః**
**నశ్వరం గృహ్యమాణం చ విద్ధి మాయామనోమయమ్ ॥** (అధ్యా 7, శ్లో 7)

నీయొక్క మనస్సుకు, వాక్కుకు, కళ్ళకు, చెవులకు విషయములై తారసపడేదంతా కూడా...

1. నశ్వరము (Not Permanent)
2. మాయామనోకల్పితము (Created by own illusionary thought)

గా గ్రహించినవాడవై వాటన్నిటిపట్ల చిరునవ్వుతో కూడిన మౌనము వహించి ఉండు. ఎవరి మనో చిత్తములైతే (Thought and Interests) చంచలంగాను, అశాంతముగాను, అయుక్తము (Unbalanced) గాను వుంటాయో అట్టివారికి మాత్రమే ఈ దృశ్యజగత్తులో నానావస్తు విభ్రమమంతా (వారు వీరు–వారి వారు–నా వారు–నీ వారు–ప్రియము–అప్రియము–శుభము–అశుభము, ఇత్యాది భ్రమానుభవములన్నీ) సత్యము – నిత్యమువలె అనుభవమౌతూ ఉంటాయి. అట్టి చంచలమైన అనుభూతమంతా గుణ దోషములచేతనే ఏర్పడుతోంది. తద్వారా

1. కర్మ (నేను నిర్వర్తించగలుగుచున్న క్రియలు) (Do s)
2. అకర్మ (నేను నిర్వర్తించలేకపోతున్న క్రియలు) (Dont's)
3. వికర్మ (నేను నిర్వర్తించకూడని క్రియలు) (Wrong doings)

అనే భ్రమలు మనోవృత్తుల రూపంగా ఉదయిస్తున్నాయి.

**అందుచేత ఓ ఉద్ధవా!**

1. మొట్టమొదట నీవు నీ ఈ ఇంద్రియములను శాస్త్రాలు సూచిస్తున్న సాధన రూపములైన ఉపాయములలో నియమించు.

2. క్రమంగా దృష్టులను పవిత్రం చేసుకుంటూ ఇంద్రియములను వశం చేసుకో...
3. క్రమక్రమంగా నీ దృశ్యసంబంధమైన (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ సంబంధమైనవి) చిత్త వృత్తులను క్రమబద్ధం చేసుకుంటూ వాటిని నిరోధించటం అలవరచుకో.
4. **నాకు ఎదురుగా కనబడుతూ అనుభూతమగుచున్న ఈ జగదనుభవమంతా ఆత్మయందే-ఆత్మకు అభిన్నమై ఉన్నది**-అను ఉత్తమ దృష్టిని పరిపుష్టం చేసుకుంటూ ఉండు.
5. అటుపై ఆత్మ పరమాత్మయందే అభిన్నరూపంగా ఉన్నది కదా - అనే అవగాహనను, తద్భావనను పెంపొందించుకో!
6. నీవు నన్ను పరమాత్మ తత్త్వంగా గ్రహించి ఉపాసించు.

ఈవిధంగా నీ పరిమిత దృష్టులపై యుద్ధం ప్రకటించి జయించు. "**కనబడేదంతా** ఆత్మయందు శ్రీకృష్ణ పరమాత్మయందు అభిన్నరూపమై ఉన్నాయి". - అని గ్రహించిన తరువాత ఇక నీవు కోల్పోయిన దెక్కడుంటుంది? ఏమున్నది? క్రమంగా నీ యొక్క 1. నిశ్చయజ్ఞానము, 2. విజ్ఞానము - అనుభవజ్ఞానము పవిత్రమై నిశ్చలత్వము - పరమ పవిత్రత్వము సంతరించుకొనునుగాక!

భౌతిక దేహిత్వమును అధిగమించి - **నేను ఆత్మస్వరూపడను కదా! ఈ జగత్తు నాయందున్నది. అంతేగాని, నేను జగత్తులో వుండటమేమిటి?...** అనే అవగాహనతో జీవాత్మత్వమునకు ఆవల వున్న పరమాత్మత్వమును సంతరించుకో! అప్పుడు జగత్తు-తత్ జనితమైన విఘ్నములు నీపట్ల వుండవు. కనిపించవు. (లేక) స్వభావ సిద్ధంగా అధిగమించబడతాయి. అప్పుడు ఆత్మానుభవతుష్టాత్ముడవే నీవు. అనగా, ఆత్మానుభవముచే సంతుష్టుడువై వుంటావు. సంసారమును జయించటం అంటే - **దృశ్య-ద్రష్ట రూపములగు జగత్-జీవాత్మలు నా పరమాత్మతత్వమునందలి అంతర్విభాగ కల్పిత (అభిన్న) చమత్కారములే కదా** అను అవగాహనతో ఒకానొక సంతృప్తిని, సమగ్రత్వమును సంపూర్ణత్వమును సంతరించుకోవటమే సుమా!

**ఉద్ధవుడు :** హే జగద్గురూ! అట్టి పరమాత్మావగాహన సంతరించుకొన్నవాడు ఇక విహిత అవిహిత కర్మలను నిర్వర్తిస్తాడా? త్యజిస్తాడా?

**శ్రీకృష్ణ పరమాత్మ :**

**శ్లో॥ దోషబుద్ధ్యోభయాతీతో నిషేధాత్ న నివర్తతే**
**గుణబుద్ధ్యా చ విహితం న కరోతి యథా అర్భకః॥** (అధ్యా 7, శ్లో 11)

**శ్రీకృష్ణుడు :** చిన్న పిల్లవాడికి ఇది పాపం! చేయకూడదు. ఇది పుణ్యం! చేయాలి – ఇటువంటివి ఏమైనా ఉంటాయా? అటువంటివేమీ లేకుండానే ఒక క్రీడలాగా ఆడుకోవడం మొదలైన ఆయా బాలాలీలా వినోదాలు ప్రదర్శిస్తాడు కదా! అట్లాగే ఆత్మానుభవతుష్టాత్ముడు కూడా...! అతనిపట్ల విహితములు–నిషేధములు అనే ప్రతిపాదనలు అపాదించబడజాలవు.

గుణబుద్ధితో విహితములను అనువర్తించటం వుండదు. దోషబుద్ధి – భయములతో నిషేధములనుండి విరమించటము వుండదు. లౌకిక విశేషములైన శాస్త్ర నిర్దేశములైన విహిత–అవిహిత, విధి–నిషేధములు ఆతని ఆత్మదృష్టికి విఘాతం కలిగించలేవు. ఆతని ఆత్మదృష్టి ఆ రెండింటినీ అధిగమించినదై వుంటుంది. **ఆత్మదృష్టికి ఇదంతా వినోదమేగాని విషాదం కాదు.**

మిత్రమా! ఉద్ధవా! పరమాత్మను ఆశ్రయించువాడు ఈ విశ్వమంతా నా స్వరూపంగా గమనిస్తాడు. సర్వసహజీవులను పరమాత్మస్వరూపంగా సందర్శిస్తూ జ్ఞాన–విజ్ఞాన పూర్వకంగా సునిశ్చయుడై వుంటాడు. ఎక్కడెక్కడ ఏంచేస్తున్నా – చేయకున్నా.. నా చుట్టూ తనతో సహా పరమాత్మ ప్రదర్శనాచమత్కారమే కదా! – అని నన్ను అర్థం చేసుకొన్నవాడై వుంటాడు. సర్వ జీవుల పట్ల స్వభావసిద్ధంగా సుహృత్ స్వభావుడై మెలగుతాడు. మరల అట్టివాడు భౌతిక దృష్టికి – ద్వితీయత్వానికి దిగిరాడు. సర్వదా అద్వితీయత్వం ఆస్వాదిస్తూ వుంటాడు.

## 5. ఆత్మైవహి సద్గురుః

**ఉద్ధవుడు:**

శ్లో॥ **యోగేశ! యోగవిన్యాస ! యోగాత్మన్! యోగసంభవ!**
**నిశ్రేయసాయ మే ప్రోక్తః త్యాగః – సన్యాసలక్షణః ॥ (అధ్యా 7, శ్లో 14)**

హే యోగీశ్వరా! యోగాధారా! మిమ్ములను ఆశ్రయించినట్టి మా వంటి ఆశ్రితుల క్షేమము కొరకై **సన్యాసరూప త్యాగము** గురించి ఉపదేశించండి. ఎందుకంటారా? సర్వాత్మకుడవగు నీ పట్ల పూర్ణభక్తిని మా బుద్ధి సంతరించుకోనంతవరకూ మేము మా దృశ్య విషయాభిలాషకు బద్ధులమై మా ఈ బ్రతుకులను కొనసాగిస్తూనే వుంటున్నాము. విషయాభిలాష ఉన్నంతవరకు దృశ్య విషయములపట్ల కోరికలను

త్యజించలేము. కోరికలు కొనసాగుచున్నంత వరకు భగవత్-విముఖత్వం వదలదు.

**శ్లో॥ సోఽహమ్ - మమాహమ్ ఇతి మూఢ మతిః విగాఢః**
**త్వన్మాయయా విరచితాత్మని సానుబంధే**
**తత్త్వంజసా నిగదితం భగతా యథాఽహమ్**
**సంసాధయామి భగవన్! అనుశాధి భృత్యమ్॥ (అధ్యా 7, శ్లో 16)**

స్వామీ! నీ మాయచే రచించబడిన పుత్ర-మిత్ర- కళత్ర- ఇత్యాది విషయములపట్ల **నేను నాది** అనే గాఢమైన విమూఢత్వముచే మేము ఆవరించబడి, ఇరుక్కొని ఉన్నాము. అందుచేత నీవు ఇప్పుడు ఉపదేశించిన "**జగత్తును జయించటం - జీవాత్మను అధిగమించటం - పరమాత్మత్వము సంతరించుకోవటం**" అనే మార్గంలో మేము ప్రయాణించలేక పోతున్నాం. నేను దృశ్యములో మగ్నుడనై - మూఢుడనైన ఇక నాకు త్రోవ తెలియటం లేదు. ఈ ప్రాపంచక విషయాలు నేను ఎప్పుడు పట్టుకొన్ననో నాకే తెలియదు గాని, ఇప్పుడు మాత్రం వదలలేక పోతున్నాను. ఇదంతా - **ఆత్మయందు ఆత్మగా దర్శించటం -** ఎట్లాగో అర్థం కావటం లేదు. అందుచేత నీకు భృత్యుడనై నిన్నే ఆశ్రయిస్తున్నాను.

**ఈ జగత్తును జగత్తుగా త్యజించి ఆత్మ స్వరూపముగా సందర్శించటమెట్లా?**

**హే శ్రీ కృష్ణప్రభూ!**

నీవు భూత - భవిష్యత్ - వర్తమాన విభాగములతో కూడిన కాలముచే స్పృశించబడని నిత్యసత్యస్వరూపుడవు! సర్వప్రకాశకుడవు ! స్వయంప్రకాశకుడవు ! జన్మజన్మల సుకృతంచేత మీ సామిప్యత లభించింది. నాకు ఆత్మతత్త్వము తెలియజేయగలవారు నీకన్నా మరెవ్వరు సమర్థులు? ఎందుకంటే, మీరు మాయకు యాజమానులు! బ్రహ్మాది దేవతాశ్రేష్ఠులుకూడా మీ మాయకు వశులై దేహము పుత్రులు మొదలైన విషయములు పరమార్థములుగా భావిస్తున్నారు. ఇక నేనెంతటి వాడిని చెప్పండి? ఇదంతా గమనిస్తున్న నా ధైర్యమంతా నిర్వీర్యం (Mild and stoic) అవటం జరుగుతోంది. దుఃఖము - విరాగము నన్ను కమ్మివేస్తున్నాయి. అందుచేత సర్వజ్ఞుడవు, సర్వ శక్తి మంతుడవు, వైకుంఠవాసివి, దేశ-కాలములచే పరిమితము కానివాడవు, సర్వజీవులకు హితుడవు, నరసఖుడవు అగు నిన్ను శరణువేడుచున్నాము.

**శ్రీకృష్ణుడు:** ఓ ఉద్ధవా! ఈ జీవుడు బద్ధుడు అవటానికి విషయవాసలేకారణం సుమా!

అట్టి విషయవాసనలు చిత్తము యొక్క అంతరమున దట్టముగా వ్యాపించి **ఉపాధి పరంపరలు** అనే భ్రమలకు కారణమగుచున్నాయి. అందుచేత వివేకిఅయినవాడు తత్త్వవిచారణచేతను, వివేకముతో కూడినబుద్ధిచేతను తనను తాను విషయవాసనల నుండి సముద్ధరించుకోవాలి. మానవుడైనవాడు తన బుద్ధిచే విచారణకు ఉపక్రమించాలి. ఈ జీవుడు ప్రత్యక్ష - అనుమానముల ద్వారా తనకు ఏది హితమో, ఏది అహితమో నిర్ణయించుకోవటానికి సమర్థుడే! అయితే, వివేకముతో కూడి బుద్ధితో వివేచన చేసి ఆత్మదృష్టిని అభ్యసించి అలవరచుకొంటేనే ఆత్మవిద్య లభిస్తుంది.

**శ్లో॥ ఆత్మనో గురుః ఆత్మైవ పురుషస్య విశేషతః**

**యత్ ప్రత్యక్ష-అనుమానాభ్యాం శ్రేయోఽ_సావను విన్దతే ॥** (అధ్యా 7, శ్లో 20)

ఈ జీవునకు వాస్తవమైన గురువు ఆతని ఆత్మయే! నేను సర్వ జీవుల ఆత్మస్వరూపుడను. అది గ్రహించిన సాంఖ్యయోగ విశారదులగు ధీరులు నిర్మలము - సుతీక్షణము - విశాలము అగు బుద్ధిని పెంపొందించుకొని వర్తమాన జన్మయందే నన్ను సంపూర్ణ-సమగ్ర ప్రకటనపూర్వకంగా సందర్శిస్తున్నారు. సర్వాత్మత్వానందమును పుణికి పుచ్చుకుంటున్నారు.

ఓ ఉద్ధవా! నేను ఒకటి - రెండు - నాలుగు - అనేక పాదములతో కూడిన అనేక జీవజాతునెన్నిటినో సృష్టించాను. వాటిన్నింటిలో మానవ జన్మ ఉత్కృష్టమైనది. ఇది ఎంతగానో పురుషార్థ సాధకమైనది సుమా!.

వాస్తవానికి నా స్వరూపము ప్రత్యక్షము కాదు - పరోక్షము కాదు. అట్టి నా అపరోక్ష ఆత్మతత్త్వ స్వరూపం ఈ మానవ దేహులు తమ బుద్ధి కౌశలంతో **అనుమానము** అనే అన్వేషణ సహాయంతో తప్పక గ్రహించగలుగుతారు.

కాబట్టి నన్ను నీ ఆత్మ స్వరూపంగా గ్రహించు. అట్టి ఆత్మతత్త్వమునందే విద్యమానమైయుంటున్న జాగ్రత్ - స్వప్న - సుషుప్త జగత్తులు - కవియొక్క యోచనలోని కల్పిత కథా సంఘటనలవలె - భావనామాత్రమై కన్పిస్తున్నాయి. **వాస్తవానికి జన్మ - మరణముల మధ్య స్ఫురించేదంతా జ్ఞానాన్వేషకునకు జ్ఞాన సాధనా రూపమే!** గురువు వంటిదే స్వస్వరూపము. స్వస్వరూపమే సర్వమునకు ఆధారము, సర్వ స్వరూపము కూడా! స్వస్వరూపమే సద్గురువు సత్ శాస్త్రము కూడా!

అట్లాగే ఈ దృశ్యజగత్తు కూడా పాఠ్యాంశమే! గురువే!

ఈ విషయం నిరూపిస్తూ యాదవుల వంశ ఆది పురుషుడు, వివేకి, భయరహితుడు యయాతినందనుడు అగు యదుమహారాజుకు – ఒకానొక అవధూతకు మధ్య జరిగిన సంవాదమును చెప్పుతాను. విను!.

## 6. అవధూత – యదు సంవాదము

**శ్రీ కృష్ణుడు:** ఓ ఉద్ధవా! బాల్యంలో పెద్దల దగ్గర మనం విన్న యదుమహారాజుకు అవధూతకు జరిగిన సంభాషణను పునశ్చరణ చేసుకుంటున్నాం. సావధానంగా శ్రద్ధగా విను.

ధర్మజ్ఞుడగు యదుమహారాజు ఒకానొకరోజు యువకుడగు ఒకానొక అవధూతను ఇంటికి ఆహ్వానించి, ఉచిత మర్యాదలను సమర్పించి ఇట్లా ప్రశ్నించారు.

**యదుమహారాజు:** ఓ యువకుడా! మేము యజ్ఞ – యాగాది కార్యక్రమములను, అనుష్ఠానపూర్వకమై ఏవేవో సత్కర్మలను సుదీర్ఘకాలంగా నిర్వర్తిస్తున్నాము. ఇక మీరో? ఎటువంటి సుదీర్ఘకాల అనుష్ఠానములను, ఆయా శాస్త్రములు చెప్పు యజ్ఞ–యాగాలను, సాధనములను నిర్వర్తిస్తున్నట్లు మాకు కనిపించటంలేదు. ఆయినప్పటికీ ఆత్మజ్ఞాన పాండిత్యము సముపార్జించినట్లు గుర్తుగా తృప్తి – సంతోషములతో కనిపిస్తున్నారు. మీ బుద్ధిబలముతో సర్వ ఇంద్రియ విషయములను అధిగమించివేసినట్లుగా మీ చంద్రహాసముఖకవళికలు చూస్తుంటే నాకు అనిపిస్తోంది.

లోకంలో జనులనేకులు ధర్మ – అర్ధ – కామముల కొరకై ఆయుష్షును – యశస్సును – ఐశ్వర్యమును కోరి ప్రవర్తిస్తున్నారు. కొద్దిమంది మాత్రమే ఆత్మతత్త్వ జిజ్ఞాసువులై వర్తిస్తున్నారు. మీరు చూస్తే యువకులు. దక్షత గలవారు. సుందరమైన రూపంతో వెలుగొందుచున్నారు. అమృత ప్రాయమైన సంభాషణాచాతుర్యం మీలో కనిపిస్తోంది అయితే ఏసాధనా పరంపరల సంబంధమైన కర్మలూ మీరు చేస్తున్నట్లు కనిపించటం లేదేం? ఒక జడునివలె, ఒక మత్తుని వలె సర్వలౌకిక – శాస్త్ర విహిత కార్యక్రమములు నిరసించి లౌకిక పారలౌకిక మైనవేవీ కోరకుండా పిశాచంవలె ఊరికే లోక సంచారాలు చేసున్నట్లున్నారు. అయినాకూడా ఆత్మతృప్తి సంపన్నులై కనిపిస్తున్నారే! ఎందుచేత?

అది అట్లా ఉంచండి!

లోకంలో అనేక మంది జీవులు కామము – లోభము అనే రెండు భయంకరమైన అగ్ని శిఖలచే నిరంతరము దహించబడుచు అధైర్యము – నిరుత్సాహము – ఆవేదన – ఏదో

చెప్పరాని భయము - రేపటి గురించి దిగులు - ఏదో అసంతృప్తి - ని స్పృహలతో జీవితాలు గడపుచున్నారు. ఇక మీరో... ఆనందైశ్వర్యంతో లక్ష్మీదేవి తాండవిస్తున్న ప్రశాంత-పూర్ణత్వములతో కూడిన ముఖకవళికలతో ఈ భూమిపై నిశ్చింతగా సంచరిస్తున్నారే! గంగలో స్నానం చేస్తున్న తెల్ల ఏనుగులాగా సంతాపరహితులై కనిపిస్తున్నారే! మీ వద్ద సంపద లేదు. భార్య పుత్రులు - ఆప్తులు ఇటువంటివేవీ (నా వారు అనునది) మీ వద్ద కనిపించటం లేదు. అయితేకూడా ఏం? ఏ లోటు - ఏమాత్రము లేనివారై వేదాంతసిద్ధాంత భూషితులైనట్లుగా పరమానందంగా విహరిస్తున్నారే? ఇట్టి అనిర్వచనీయ ఆనందం మీరు ఎట్లా అనుభవించగలుగుచున్నారు? **ఇది నాకు తెలుసుకోవాలని ఉన్నది.**

గురువు లేకుంటే గురి లభించదని, తత్త్వజ్ఞానానికి అర్హత సంపాదించుకోలేమని లోక ప్రతీతి - లోక నానుడి కదా! మీరు ఏ గురువును ఆశ్రయించి లోక వ్యవహారమున్నింటికీ అప్రమేయత్వమును, అతీతత్వమును సముపార్జించుకొని ఈ భూమిపై క్రీడా మైదానమువలె లీలగా, ఆనందంగా విహరించగలుగుచున్నారు? అట్టి మీ ఆధ్యాత్మిక అవగాహన యొక్క రహస్య మేమిటో విశదపరచవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

## 7. 24 మంది గురువులు

**అవధూత ద్విజుడు:** ఓ యదుమహారాజా!

శ్లో॥ **సంతి మే గురవో రాజన్! బహవో బుద్ధ్యుపాశ్రితాః**
**యతో బుద్ధిమ్ ఉపాదాయ ముక్తో உటామి ఇహ - తాన్ శృణు॥** (అధ్యా 7, శ్లో 32)

నేను **తెలియవలసినది తెలుసుకోవాలి** - అని నా బుద్ధిని ప్రేరేపించాను. అట్టి వివేచనతో కూడిన విద్యార్థిబుద్ధితో దశదిశల అనేక విశేషములను ప్రకృతిలో గమనిస్తూ శిష్యత్వాన్ని ధారణ చేశాను. (I took the stance of wondering student). నాయొక్క లోకసంచారంలో నాకు 24 మంది మార్గదర్శకులై **ఆధ్యాత్మజ్ఞాన నిత్యత్త్వము, తత్త్వజ్ఞానార్ధ దర్శనము** అనే సుమధుర సుగంధపుష్పాలు వెల్లివిరిసే పూతోట వైపుగా నడిపిస్తున్నారు. అట్టి నాకు మార్గం చూపే గురువులు ఎవ్వరో వినండి.

1. భూమి, 2. గాలి, 3. ఆకాశము, 4. జలము, 5. అగ్ని, 6. చంద్రుడు, 7. సూర్యుడు, 8. పావురము, 9. అజగరము (కొండశిలువ), 10. సముద్రము, 11. పతంగము

(మిడుత), 12.తేనెటీగ, 13.ఏనుగు, 14.తేనెతుట్టెను పిండి తేనెను గ్రహిస్తున్న బోయవాడు, 15. హరితము (జింక), 16. చేప, 17.పింగళ అనే పేరు గల ఒక వేశ్య, 18. లకుముకిపిట్ట(కురరపక్షి), 19. బాలుడు, 20. కుమారి (కన్య), 21.బాణమును తయారుచేయువాడు 22. పాము, 23. సాలెపురుగు 24. భ్రమరకీటకము.

ఈ 24 మంది తమ తమ నడవడికలను అనుసరించి ఒక్కొక్కరు ఒక్కొక్క ముఖ్యవిశేషాన్ని నేను నేర్చుకోవటానికి - తెలుసుకోవటానికి కారణ భూతులైనారు. అందుచేత ఈ 24 మందిని గురువులుగా భావించి జ్ఞానమును సముపార్జించి ఈ లోకంలో లీలగా క్రీడగా సంచరించటం కొనసాగిస్తున్నాను.

**యదుమహారాజు:** ఓ మహానుభావా! మీరు చెప్పేది ఆశ్చర్యంగా వున్నది. లోకంలో గురువు అంటే వేదమో - మంత్రమో - వేదాంతార్థమో - శాస్త్రమో బోధించేవాడని అందరమూ అనుకుంటూ వుంటాము. మీరు చెప్పిన 24 విశేషాలను అందరము అన్ని చోట్లనో, ఆయాచోట్లనో చూస్తూనే వుంటాము. వాటి వాటి నుండి నేర్చుకోవలసినది - తెలుసుకోవలసినది ఏమి ఉన్నదో మేము ఎప్పుడూ గమనించటం లేదు. మాకు అట్లా తోచటమూలేదు. మాపై కనికరించి, మీరు వారి దగ్గర ఏమేమి గమనించి మీ మోక్షానందానికి - జ్ఞానానందానికి అధ్యాత్మిక మార్గసుగమనానికి ఉపకరణాలుగా తీర్చి దిద్దుకున్నారో ... నాకు వినాలని ఉన్నది.

**ఆశ - నిరాశల మధ్య - కొట్టు మిట్టాడే మాకు ప్రకృతి నుండి నేరువవలసిన పాఠ్యాంశాలు విశదపరచవలసినదిగా ప్రార్థిస్తున్నాను.**

**అవధూత:** ఓ యయాతి నందనా! యదు మహారాజా! ఆ 24 రిలో ఎవరెవరి నుండి ఏఏ జ్ఞాన విశేషాలు నేర్చుకొని హృదయస్థం ఏ తీరుగా చేసుకున్నానో విశదీకరిస్తాను. శ్రద్ధగా వినండి.

## 1వ గురువు: భూమి

ఏదైనా ఒక ధర్మ మార్గమో - సాధనయో ప్రారంభించామనుకో, **ఎవ్వరో ఏదో అన్నారు కదా? నేను ఈ కర్తవ్యాన్ని (లేక) ధర్మాన్ని (లేక) సాధనను విరమిస్తాను. వారు ఆ మాటలు అనుకుంటూ (లేక) అంటూ వుంటే నేనెందుకు కొనసాగించటం?...** అని పట్టుదలను సడలించటం, కార్యక్రమం నుండి వెనుతిరగటం సామాన్యంగా లోకంలో జరుగుతోంది! అయితే, ఫలితం? సహిష్ణత (లేక) తితిక్ష (Forbearence

Tolerence) తరగటంచేత తత్త్వజ్ఞాన - విజ్ఞాన మార్గం నుండి మనం వెనుకడుగు వేస్తున్నాము. వెనుకకు తిరుగుచున్నాము. కానీ ఈ భూమియో? ప్రాణుల పాదములచే త్రొక్క బడుతోంది. త్రవ్వబడుతోంది. కాల్చబడుతోంది. అయినా సరే! సూర్యుని నుండి సంపాదించుకుని - తనలో ప్రక్షిప్తం చేసుకున్న ఓజోశక్తిని ప్రాణుల ఆహారం కొరకై సమర్పిస్తూ తన స్వధర్మాన్ని - జీవుల పట్ల అవ్యాజమైన ప్రేమను, ప్రతి ఫలాపేక్షా, రహితమైన వాత్సల్యమును కొనసాగిస్తోంది! తనలోని జలమును జీవులకు ప్రేమతో ప్రసాదిస్తోంది.

అట్లాగే నేను కూడా దుఃఖ సంఘటనలను సహించటం, దైవాధీనంగా ఏర్పడే పరుల పీడనం చూస్తూ కూడా... అప్రతిహతమైన - అవ్యాజమైన - అఫలాపేక్షతో కూడిన వాత్సల్యం స్వభావంగా పెంపొందించుకోవటం ప్రారంభించాను. భూమాత వలె తదితర సర్వజీవుల పట్ల **నేను వీరికి ఏమి ఇవ్వగలను? ఏమి మంచి చేయగలను?** ... అను ఒకానొక సహజమైన త్యాగనిరతితో కూడిన బుద్ధిని అంతరంగంలో కలిగియుండి, పరిపోషించుకోసాగాను.

పర్వతము భూమిలో పాతుకొని ఉంటుంది. వృక్షములో, నేల గర్భంలో వ్రేళ్ళు కలిగి వుంటాయి. అందుచేతనే కాబోలు.. పర్వతములకు వృక్షములకు అంతటి పరోపకారబుద్ధి! పర్వతములోని పరోపకారవృత్తిని, వృక్షములోని పరులకు నీడ - ఆహారము నివాసము సమర్పించే వృత్తిని చూసి, **ఆహా! భూదేవత ప్రసాదంగా మానవదేహంతో పుట్టి ప్రకృతిచే బుద్ధి ప్రసాదించబడి.. నేను భూమాతవలె తోటి జీవులను సంతోష పెట్టడం శ్రేయో దాయకం కదా! ఈ శరీరము తదితర జీవుల సమర్పణచే పరిపోషించబడుచుండగా, పరులకు శుభప్రదంగా జీవించటం కనీసధర్మం కదా!**... అని నేర్చుకోసాగాను. (ఉత్తమే శిఖరే జాతే భూమ్యాం, పర్వతమూర్ధనీ! నమో నమః)

## 2వ గురువు: వాయువు - ప్రాణవాయువులు

ప్రాణశక్తి శరీరమంతా సంచరిస్తూ అన్నరసాన్ని ఇంద్రియములకు అందిస్తూ, తాను ఆ ఇంద్రియముల విషయానుభవముల పట్ల ఎట్టి అపేక్ష కలిగి వుండదు. పుష్పములపై ప్రసరిస్తూ వాయువు గంధమును జీవులకు అందజేస్తూ గంధమును మోస్తూ, తాను ఏమీ స్వీకరించకుండా జీవరాసుల ముక్కు పుటములకు అందిస్తూ వుంటుంది. ఆనందం కలుగజేస్తూ ఉంటుంది. తానుమాత్రం సుగంధమును గాని దుర్గంధమునుగాని పొందక సర్వదా వేరుగా వుంటుంది. అప్రమేయమై-పరమై ఉంటోంది.

అట్లాగే...

**"నేను కూడా  వాక్ - మనస్సుల ప్రాపంచక ధర్మములచే స్పృశించబడకుండెదను గాక! నా జ్ఞానము అతీతత్వమును - సహజ అప్రమేయత్వములను ధారణ చేయును గాక!**... అని వాయువునుంచి నేర్చుకొనసాగాను. ఇంద్రియ విషయముల యొక్క ప్రియ-అప్రియుత్వములచే నా జ్ఞానము - భావన-అనుభవావేశ రూపంగా స్పృశించబడకుండా, దోషము పొందకుండా జాగరూకుడనై వుండటం అభ్యసించసాగాను.

వింజామరలచే (విసనికర్రలచే) తాడనం పొందుతూ, వాయువు వారికి-వీరికి తన కదలికలచే ఆహ్లాదం కలుగజేస్తోందే!

వాయువు దేహంతో ప్రవేశించి ఆయా దేహ విభాగములలో సంచరిస్తూ కూడా ఆసక్తి (Attachment) పొందదు! గదిలో ప్రవేశించిన గాలి వస్తువుల రూపంగా మారుతుందా? ఈ పార్థివ దేహం (Material Body) బాల్య-యౌవన-వార్ధక్య- మరణాలు పొందుచున్నప్పటికీ, దేహంలో ప్రవేశించినట్టి నేను అట్లాగే (వాయుదేవునిలాగానే) దేహ ధర్మములను పొందనివాడనై వుండటం అలవరచుకోసాగాను. బ్రహ్మ స్వరూపాత్మ భావనను వాయువు నుండి నేర్చుకొని క్రమంగా  ఈ దేహ మంతా ఆత్మ స్వరూపముతో నింపివేస్తున్నాను. అట్లా ఈ దృశ్యమంతటినీ, దృశ్యాంతర్గతులగు సర్వ జీవరాసుల దేహములను ఆత్మస్వరూప భావనలో  ముంచి ఆత్మతో ఏకము చేసి వేయసాగాను. (నమస్తే వాయుః! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాఽసి!)

## 3వ గురువు: ఆకాశము

ఆకాశము అంతటా ఏర్పడినదై వుండి వుంటోంది. స్థావర - జంగమములలో (On the moving and Non moving aspects) వ్యాపించి వుంటూనే ఆసంగము (Non-Attached, Non Partitioned,  Non Divisible) గా వుంటోంది. ఒక ప్రదేశంలో (in a space) ఇల్లు కట్టబడవచ్చు. ఆ ప్రదేశము ఇల్లుగా మారుతోందా? ఆ ఇల్లు కూలినప్పుడు ఆ ప్రదేశము యధాతథమే కదా! అక్కడ ఏ దేవాలయమో నిర్మించినప్పుడు కూడా అక్కడి ఆకాశము (Space) మార్పు చేర్పులు పొందదు కదా! వాయువుయొక్క ప్రేరణ చేత ఆకాశంలో మేఘాలు పరుగులు తీస్తూ వుండవచ్చుగాక! ఆకాశం ఎల్లప్పుడు నిశ్చలం - సుస్థిరం - ప్రశాంతము - అతీతము - అప్రమేయముకదా!. ఈ దేహంలో ప్రవేశించి వున్నప్పటికీ సర్వ దేహాంతర్గత - దృశ్యవిషయముల పట్ల నిశ్చల మౌనత్వం

వహించివుండటం ఆకాశము నుండి అభ్యసిస్తున్నాను. ఆకాశంలాగా **ఆత్మాకాశ స్వరూపుడనై** అన్నిటా వేరువేరుగా (కానీ) అఖండుడనై దృశ్యమంతా ఆస్వాదించటం అలవరచుకుంటున్నాను. అన్నింటికీ పరమైవున్న పరమాత్మతత్త్వము నేనే అయి, క్రీడగా ఈ అనేకత్వముతో కూడిన జగత్ రూపంగా ప్రదర్శించుకుంటూ క్రీడిస్తున్నాను. ఆకాశంలాగా అపరిచ్ఛిన్నుడనై, అసంగుడనై లీలగా స్వయంకల్పిత భావనారూప జగత్తుగా వ్యక్తీకరించుకొని వ్యవహరిస్తున్నట్లు నన్ను నేను సందర్శించుకోనారంభించాను. మేఘముల రాక- పోకలతో ఆకాశం దోషం పొందుతోందా? లేదే! తేజస్సుచేత - జలముచే - వాయువుచే, వాటి వాటి మేలు కలయికలచే ఆకాశము స్పృశించబడదు కదా! అట్లాగే...,

**కాలగతిచే వచ్చి - పోయే దేహదశలుగాని, దేహదేహాంతరములుగాని, భావా భావములుగాని, సత్త్వ-రజో-తమోగుణముల రాక- పోకలు గాని లోక సంబంధమైన, స్నేహ బాంధవ్యము మొదలైనవి గాని ఆత్మను స్పృశించవు. ఆత్మకు దోషములు అంటవు. ఆత్మయొక్క అఖండత్వము - అప్రమేయత్వము - కాలముచే స్పృశించబడని నిత్యత్వము - సర్వమునకు అతీతత్వము మొదలైన విశిష్టలక్షణములు చెక్కు చెదరవు. నేను ఆత్మ స్వరూపుడను. అంతేగాని పాంచభౌతి దేహ- గుణ - భావ ఇత్యాది స్వరూప పరిమితుడను గాను! -** అని నా గురించి నేను నిర్వచనం కొనసాగించుకో సాగాను. (ఆత్మాత్ ఆకాశం! ఆకాశాత్ సర్వమ్! ఆకాశ సద్గురవే నమః). ఆకాశదేహినై అంతటా ఏర్పడి ఉన్న వాడనై సర్వమును ఆస్వాదించటం అభ్యసిస్తున్నాను.

## 4వ గురువు : జలము

జలము ప్రకృతిరీత్యా (సహజంగా - స్వభావ సిద్ధంగా) స్వచ్ఛంగా వుంటుంది. తనయందు రుచి అనే మాధుర్యం కలిగి వుండి జీవుల నాలుకకు మృదుమాధుర్యమును అనుభూతిగా ప్రసాదిస్తూ వుంటుంది. సహజ స్నేహశీలి అయి సర్వ జీవుల దాహతాపాన్ని ఉపశమింపజేసి ఆనంద సుఖాన్ని ప్రసాదిస్తూ వుంటుంది. జీవుల దేహములను - వస్త్రములను పరిశుభ్రపరస్తూ దుమ్ము - ధూళిని తొలగిస్తూ వుంటుంది. "దాహమును తీరుస్తూ బ్రతుకునే ప్రసాదిస్తున్న నేను మురికిని శుభ్రంచేయటానికి వినియోగించ బడటమా?" అని ప్రశ్నించదు. తప్పుపట్టుకోదు. తదితర జీవులకు పరిశుభ్రతను

ప్రసాదించటానికై వారి దేహ ధూళి – మురికి మొ॥న దోషములు స్వచ్ఛమగు తనయందు ప్రవేశించుచున్నప్పటికీ తాను తన పరోపకార నిరతినుండి ఏ మాత్రం వెనుకంజవేయదు. అట్లాగే నేను కూడా..., సర్వ సహజీవుల పట్ల ఏమీ కోరకుండానే ప్రేమాస్పదుడనై వుండెదనుగాక! స్నేహ మాధుర్యాన్ని అందించెదనుగాక! – అని అనుకోసాగాను. మధుర సంభాషణ – గౌరవము –కీర్తించటం– బోధనలచే వారి దోషములను వారు తొలగించు కోవటానికి సహకరించటం – వాక్కుచే వారి మనోవేదనలను ఉపశమింపజేయటం – ఇటువంటివన్నీ జలము యొక్క పరోపకార నిరతినుండి నేర్చుకుంటూ స్వభావసిద్ధం చేసుకొనే ప్రయత్నం నిర్వర్తిస్తూ వున్నాను. "నా సహాయం పొంది కూడా కొందరు నన్ను అల్పముగా చూస్తున్నారే?– అని ఎప్పుడైనా అనిపిస్తే "జలముకన్నా నేను ఏమిగొప్ప?" అని ప్రశ్నించుకుంటున్నాను. (ఓం నమో వరుణదేవ సద్గురవేనమః! రసానందతత్వాయ నమో నమః!)

## 5వ గురువు: అగ్ని

అగ్ని తన తేజస్సుచే చీకట్లను పారద్రోలి జీవులకు ఎల్లప్పుడూ ఎంతటి సహకారం అందజేస్తోంది! వెలుతురు లేకపోతే జీవుల గతి ఏమిటి? అగ్ని సదా–సర్వత్రా సదా ప్రభావసంపన్నము. సర్వదా యుక్త స్వరూపము. అనగా దేని చేతా బంధింపబడదు. దేని నుండి ఏదీ స్వీకరించదు. అన్నీ భక్షిస్తూ ఏదోషములు ఏ మాత్రం తనయందు ప్రవేశింపనీయదు. అగ్నిలేని చోటేలేదు కానీ, కొన్నిచోట్ల అగ్ని గూఢంగా – అప్రదర్శితంగా వుంటుంది. ఉన్నట్లనిపించదు. మరికొన్ని చోట్ల ధగధగ ప్రకాశమానంగా ప్రదర్శితం అగుచూ దిక్కులన్నీ తన తేజస్సుచే నింపివేస్తోంది. కారు చీకట్లను పటా పంచలు చేస్తోంది. లోక కళ్యాణకారకులగు మహనీయుల యగ్నకార్యములలో ప్రజ్వలించి ఆహూతులకు వాహకమై దేవతలను రంజింపజేస్తూ లోక జనులకు సర్వశుభములు ప్రసాదించబడటానికి కారణమగుచున్నది. యజ్ఞకర్తల పాపరాసులను – దోషములను పటాపంచలు చేస్తోంది. తేజోమయుడై ఉండటం, వస్తువులను స్పృశిస్తూ స్వీకరించక పోవటం, సర్వమును భక్షిస్తూ దోషమును పొందకపోవటం, ఇవన్నీ గమనించాను. కొన్ని చోట్ల నా అవగాహనలను – అభిప్రాయములను – ఆధ్యాత్మిక భావములను ప్రదర్శించకుండా గూఢంగా వుండటం, మరికొన్ని చోట్ల నా జ్ఞాన–తపో తేజస్సులను సహజీవుల అజ్ఞాకాంధకారమును తొలగించటానికై ఎలుగెత్తి ప్రదర్శించటము, నాకు

ఎవ్వరైనా ఏదైనా దానం చేస్తే వారి దాన-ధర్మ సౌహార్ధ్రతను దేవతలకు నివేదించి వారి యొక్క దోషములను నివారించటము- ఇవన్నీ కూడా అగ్ని నుండి నేర్చుకొని లోకంలో ప్రదర్శిస్తూవున్నాను. ఈ దేహ - ఇంద్రియములతో జీవిస్తూ కూడా, అగ్నివలె వీటి వీటి దోషములు నాయందు ప్రవేశించకుండా జాగరూకుడనై వుండటం అభ్యసిస్తున్నాను. అగ్నిదేవ గురవే నమః!

పరమాత్మచే సృష్టించబడిన సర్వ దేహములలోను అగ్ని ప్రవేశించి కట్టెలలో కాష్ఠమౌనము - దేహములలో వెచ్చదన ప్రదర్శనమును నిర్వర్తిస్తున్నది కదా! నేను కూడా ఆత్మతేజస్సుతో దృశ్యమంతా నింపివేసి నా జ్ఞానానందాకాశమును తగిన చోట్ల ప్రదర్శిస్తూ - మరికొన్ని చోట్ల మౌన భూమికను అవధరిస్తూ దృశ్య జగత్తులో సంచరించటం అభ్యసిస్తున్నాను.

ఒకప్పుడు అనివార్యంగా అగ్ని శిఖలు ఉత్పన్నమగుచు-వినాశనము పొందుచున్నాయి కదా! వాటి యొక్క ఉత్పత్తి-వినాశనములు ఏరీతిగా జరుగుచున్నదో అర్థం కావటం లేదు.

నదిలో కెరటములు ఆకారణంగా స్వభావంగా లేస్తున్నాయి. లయిస్తున్నాయి. అట్లాగే కాల ప్రవాహం చేత ఈ దేహములు ప్రతిక్షణం స్వభావసిద్ధంగా ఉత్పన్న మౌతున్నాయి. నశిస్తున్నాయి. నేను నా దేహమును చూసి "అగ్నిశిఖలవలె - నదీ జలానికీ తరంగలులాగా ఆత్మకు దేహాలు వస్తూ వుంటాయి. పోతూ వుంటాయి. ఇందులో సుఖమేమిటి? దుఃఖమేమిటి? వీటికి నేను వేరై ఆత్మజ్యోతి స్వరూపముతో వెలుగొందుచున్నాను కదా!" ... అని గమనిస్తూవున్నాను. ( వైశ్వానరాయ విద్మహే! లాలీయ ధీమహి! తన్నో అగ్నిః ప్రచోదయాత్!)

## 6వ గురువు: చంద్రుడు

కష్టముల ఉష్ణత్వమును నేను స్వీకరించి - లోకులకు చిరునవ్వుతో శుభదృష్టులు అందించటం చంద్రునివద్ద అభ్యసించి - నిర్వహిస్తున్నాను. చంద్రుని యొక్క చంద్రకళలు పాడ్యమి నుండి పౌర్ణమి రాత్రివరకు ప్రవృద్ధమౌతున్నాయి. మరల బహుళ పక్షంలో పాడ్యమి నుండి కళలు తరుగుచు అమావాస్య వచ్చేసరికి పూర్తిగా ఉపశమిస్తున్నాయి. అదంతా చంద్రుడు చంద్రమండల దేహంతో అనుభవిస్తూ తాను ఆ కళల పెరుగుదల - తరుగుదలలకు అతీతుడైవుంటున్నారు. భూమికి ఔషధరసమును తన మృదుమధుర ప్రశాంత అమృత కిరణముల ద్వారా ప్రసరింపజేస్తూ తనయొక్క లోక కళ్యాణ మూర్తిత్వమును అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. చంద్ర దేహమునకు సంబంధించిన వికారము లేవీ దేహిగా తాను పొందటం లేదు. అత్యంతతీక్షణమైన సూర్యకిరణములు

తనయందు ప్రవేసిస్తూ ఉంటే తాను వేడిమిని సహిస్తూ చల్లటి చంద్రకిరణములను లోకములకు ప్రసాదిస్తున్నారు.

సంపద – ఆపదలకు, సమృద్ధి – అసమృద్ధిలకు అతీతత్వమును చంద్రుని నుండి గమనించి, నేర్చుకొని, ఆచరిస్తున్నాను. జననము నుండి మరణము వరుకు (from Birth to Death) వచ్చి పోతున్న వికారాలన్నీ ఈ దేహమునకు సంబంధించివే గాని, నాకు సంబంధించినవి కానే కావు కదా! గౌరవించబడటం, అవమానించబడటం, సుఖము దుఃఖము మొదలైనవన్నీ ఈ దేహముతో జనించి – ఈ దేహంతో వుంటూ – ఈ దేహంతోనే పోతాయి. **నేను దేహిని కదా! నాకు వాటితో సంబంధమే లేదు** – అనే సునిశ్చితమైన నిర్ణయమును పరిపోషించు కుంటున్నాను. ఆత్మ స్వరూపడనై దేహముతో ప్రమేయము లేనివాడనై వుండటం చంద్రుని చూసి నేర్చు కుంటున్నాను. చంద్రభగవన్ సద్గురవే నమోనమః !

## 7వ గురువు: సూర్యుడు

సూర్యుడు  తన సహస్రాధిక కిరణజాలంతో సముద్రజలముపై ప్రసరించి జలమును ఆవిరి రూపంగా స్వీకరిస్తున్నారు. మరొకప్పుడు మరొక చోట వర్షింపజేసి లోకములకు మహోపకారం చేస్తున్నారు. అంతేకాదు. సూర్యుడు యథాతథంగా ఆకాశంలో వుంటూనే తటాక జలం, కుండలోని జలం మొదలైన అనేక చోట్ల భిన్న రూపములుగా కనిపిస్తూ ఉంటున్నారు. ఎన్నిచోట్ల ఎన్ని రూపములుగా ప్రతిబింబించినప్పటికీ సూర్యుడు తనయొక్క యధాతథత్వమును కించిత్కూడా కోల్పోవటం లేదు.

నేను ఈ ఇంద్రియములకు కనబడేవి–వినబడేవి– స్పృశించబడేవి– రుచిచూడబడేవి – వాసగా పొందబడేవి– మొదలైన విషయాలన్నీ స్వీకరిస్తూనే – సూర్యుడు జలమును వర్షరూపంగా త్యజించునట్లు .... పరుల శ్రేయస్సు ఆనందములను దృష్టిలో పెట్టుకొని ఈ దృశ్యప్రపంచమునకే సమర్పించివుంటున్నాను. **ఓ పరమాత్మా! నాది అనబడేదంతా వాస్తవానికి ఎల్లపుడు నీదేనయ్యా!** అని సంబోధించి వుండటం సూర్యుని దగ్గర నేర్చుకుంటున్నాను. సర్వ పదార్ధముల పట్ల – విషయముల పట్ల – విశేషముల పట్ల ఆసక్తి (Attatchment, Inquisitiveness, Involvement)ని తొలగించుకొని ఒకానొక పవిత్రమైన అతీతత్వమును పెంపొందించుకుంటూవున్నాను. అనేక నాటకాలలో నటించే నటుడు ఏనాటకానికీ పరిమితుడు కాదుకదా! అట్లాగే, ఇటువంటి అనేక దేహములలో జీవుడుగా ప్రతిబింబిస్తూ ఆకాశంలో సూర్యునివలె యదాతథ ఆత్మత్వమును

స్వభావసిద్ధంగా ధారణ చేస్తూ వుండటం కొనసాగిస్తున్నాను. తటాకంలో ప్రతిబింబించే సూర్యుడు ఆకాశంవదలి తటాకంలో ప్రవేశిస్తున్నాడా! లేదు కదా! నేను ఆత్మ స్వరూపుడను. జీవాత్మగా అనేక జగత్తులలో ప్రతిబింబింబించవచ్చు గాకా! ఆయా జగత్తులలో బద్ధుడవటం లేదనునది సూర్యుని చూస్తూ గమనిస్తున్నాను. పరమాత్మయే (పరమ్-ఆవల) నా వాస్తవ స్వరూపం కదా! - అని మననం చేస్తూ ఆస్వాదిస్తున్నాను. (భాస్కరాయ విద్మహే! మహద్యుతి కరాయ దీమహి! తన్నో ఆదిత్యః ప్రచోదయాత్!)

## 8వ గురువు - పావురము

ప్రకృతిలో ఆయా జీవుల పట్ల సందర్భపడుచున్న ఆయా సంఘటనల నుంచి నేర్చుకోవలసినది నేర్చుకుంటూ దేహం వచ్చినందుకు (లేక) పొందినందుకు ప్రయోజనంగా ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నాను.

ఓ రాజా! ఈ సందర్భంగా ఒక పావురము యొక్క చేష్టనుండి విద్యార్థినై ఏ విశేషము నేర్చుకున్నానో చెపుతాను. ఈ జీవుల సంబంధ - బాంధవ్యములు ఏ తీరుగా జీవుని నిబద్ధుని చేసి జన్మించిన అసలు కారణమైనట్టి స్వస్వరూప ఔన్నత్యావగాహనలకు సంబంధించిన పాఠ్యాంశములనుండి దారి తప్పిస్తూ వుంటాయో.... వినండి.

ఒకానొక వనంలో ఒక పావురముల జంట వున్నది. ఆ రెండు పావురములు ఒక దానితో మరొకటి మానసికమైన అత్యంతానుబంధం కలిగివుండేవి. మనోబుద్ధులతో పరస్పరత్వం ఏర్పరచుకొని గృహస్థధర్మం నిర్వర్తిస్తూ రోజులు - నెలలు - సంవత్సరాలు గడుపుతూ వున్నాయి. ఒకటి రెండవదానికి కనబడకపోతే స్నేహబంధం (లేక) దాంపత్యబంధంతో విలవిల్లాడిపోతూ వుండేవి. "ఆహాఁ! మా పరస్పరానుబంధం! ఎంత బాగు!" అని చెప్పుకుంటూ మురిసిపోయేవి!

ఆ పావురాలు రెండూ ఒకచోట కూర్చుని కబుర్లు చెప్పుకోవటం, కలసిసంచరించటం సరస-విరసాలు, ఆడుకోవటం, ఆహారాన్ని కలసి భుజించడం, ఒకే గూటిలో వానాకాలంలో - శీతాకాలంలో - యండాకాలంలో రోజుల తరబడి కలసి - మెలసి వుండటం చేస్తూ వుండేవి.

ఓ యదురాజన్ ! ఆడ పావురం గోముగా ఏది కోరితే అది మగ పావురం ఎంతో కష్టపడి సంపాదించి తెచ్చి ఇస్తూ వుండేది. ఇంద్రియనిగ్రహంలేని ఆ మగ పావురం ఆడపావురము యొక్క ముక్కు - కళ్ళు - రెక్కలు చూసి ఆకర్షించబడి, ఆ ఆకర్షణలో

అదీ ఇదీ చేస్తూ రోజులు గడపుతూ వుండేది. ఆడ పావురము తన క్రీగంటి చూపులతో, సరస విరస సంభాషణాచాతుర్యంతో మగ పావురాన్ని ఆకట్టుకుంటూ – ఇంతటి కులుకుబెలుకులు గల నేను ఎంత గొప్పదాన్ని! ఈ మగపావురం నన్ను విడచి వుండలేదు కదా! ఇంతకన్నా నాకు ఇంకేమి కావాలి? .... అని తలుస్తూ చిక చిక ధ్వనులతో గంభీరంగా గూటిలోను, ఆడవిలోను సంచరిస్తూ వుండేది.

ఈ విధంగా అనేక రోజులు గడచిపోసాగాయి. కాలము యొక్క చమత్కృతులు వర్ణనాతీతం కదా!

కొంతకాలానికి ఆడపావురం ఆ మగ పావురం సమక్షంలో గ్రుడ్లుపెట్టింది. ఆ శ్రీహరి యొక్క కాలస్వరూపపాశవైచిత్ర్యం చేత ఆ పావురపుగుడ్లు పొదగబడి, సున్నితమైన కాళ్లు ముక్కు–మెడ–చిట్టి చిట్టి కళ్ళు గల పావురపు పిల్లలు బయల్వెడలాయి. ఆ పావురపు పిల్లల కిచ్‌కిచ్‌ధ్వనులు చేస్తూ మెడలుసారించసాగాయి. రెక్కలాడించడం నేర్చుకోవటాలు ప్రారంభించాయి. ఇక ఆ పావురపు జంట ఆపిల్లలను ముక్కుతో – రెక్కలతో స్పృశిస్తూ "ఆహా! ఏమి మన భాగ్యం! మన పిల్లలు ఎంత ముద్దొస్తున్నారు!" – అని అనుకుంటూ మురిసి పోయేవి. క్రమంగా ఆ పావురపు జంట విష్ణుమాయా మోహితులై ఒకరిపట్ల ఒకరు, –పిల్ల పావురములతోను పరస్పరాసక్త చిత్తులై వుండేవారు. ఆహారం సముపార్జించుకోవటంలోను, పిల్లలను పరిపోషించు కోవటంతోను పగలంతా ఏకానేక శ్రమలతోకూడిన సంచారాలతోను, గూటికి రాక పోకలతోను గడచిపోయేవి. ఇక రాత్రి అయిందా,.. ఏదైనా పిల్లి ఎటువైపునుంచో వచ్చిపడదు కదా!–అని అనుకుంటూ చిన్న చప్పుడుకు కుహ్ కుహ్ శబ్దములతో లేస్తూ బహు వ్యగ్రతను పొందుతూ వుండేవి.

ఒకరోజు..., ఆ పావురముల జంట తెలతెల్లవారగానే పిల్లలకు ఆహారం సమకూర్చాలనే తాపత్రయంతో గూటినుండి బయల్వెడలాయి. నలువైపులా ఆకాశంలో ఎగురుతూ ఆహారం కోసం వెతుకసాగాయి. ఇంతలో... ఒక ఆటవికుడు ఆయా పనిముట్లతో త్రాళ్ళతో, వలలతో పక్షుల మెడలు క్రూరంగా విరచి భుజములకు తగిలించుకొనే కట్టెలతో కూర్చిన తాటియాకు బుట్టలతో ఆపావురముల జంట నివసించే మహా వృక్షమువైపు సమీపించాడు. అతని క్రూరమైన ఎఱ్ఱటి కళ్ళనుండి బయల్వెడలిన చూపులు దట్టమైన కొమ్మల మధ్యగల ఆపావురపు జంట నిర్మించుకొన్న విశాలమైన గూడుపై పడనే పడ్డాయి.

ఇంకేమున్నది? ఆ ఆటవికుడు ఆ మహావృక్షాన్ని ఎక్కి పావురపు పిల్లల దేహములను తన తరచేతి మధ్యగా వ్రేళ్ళతో బంధించి బుట్టలో వేసుకొని చెట్టు దిగాడు.

అప్పుడే ఆ పావురముల జంట ధాన్యపు గింజలను నోట ధరించి ఆ మహావృక్షమును సమీపించాయి. ముందుగా చూసిన ఆడపావురము బుట్టలో చిక్ చిక్ కూతలు వేస్తున్న పావురపు పిల్లలను గమనించింది. తన సంతానానికి పట్టిన దుర్గతిని చూసి ఆక్రోశించింది. అలవికానంత దుఃఖం పొందింది. ఆ పరమాత్మ యొక్క మాయారచనా విశేషం చేత యుక్తాయుక్తాలు ఆలోచించుకోకుండా స్మృతి పోగోట్టుకొని పరుగులు తీసి నేలపై పరచబడిన వలపై వ్రాలింది. ఆ ఆడ పావురము యొక్క కాళ్ళు వలత్రాళ్ళచే బంధించబడ్డాయి. పిల్లలమాట దేవుడికెరుక! తానే వలలో చిక్కుకున్నదాయె! ఇక చేసేది లేక రెక్కలాడిస్తూ వలలో చిక్కి దిక్కు తోచక ఏడవసాగింది. మగపావురం ఇదంతా అల్లంత దూరం నుండి గమనించింది. తన ప్రియమైె ఆడపావురమునకు ముద్దుల మూటలోలికే పిల్ల పావురములకు పట్టిన గతిని చూసి అత్యంత దుఃఖంతో ఏడువసాగింది.

**మగ పావురము:**

**అహో! మే పశ్యత అపాయమ్! అల్పపుణ్యస్య దుర్మతేః**
**అతృప్తస్య! అకృతార్థస్య ! గృహస్తః త్రైవర్గికో హతః!** (అధ్యా 7, శ్లో 68)

ఓ సహజీవులారా! ఓ దైవమా! ఇప్పుడు నాకు పట్టిన ఈ దౌర్భాగ్య స్థితిని చూస్తున్నారా? గమనిస్తున్నారా? నేను ఐహిక సుఖముల కొరకై అట్టులు చాస్తూ సుదీర్ఘకాలం ఆయుష్షును వెచ్చిస్తూ వచ్చాను. దేహం పొందినందినందుకు ఏ విధంగా కాలాన్ని సద్వినియోగ పరచుకోవాలో, ... అట్టి పారమార్ధిక సుఖముకొరకు (నేను దేహ–మనో–బుద్ధి–చిత్త–అహంకారలకు అతీతమై వున్న పరమాత్మ స్వరూపడను కదా! ... అనే అవగాహనను పెంపొందింపజేసుకునే ప్రయత్నముల కొరకు) సిద్ధపడకుండా కాలాన్ని వ్యర్థం చేసుకున్నాను. అకృతార్థుడనై పోయాను. దుర్మతిని. అల్పపుణ్యుడను. గృహస్థుడనై త్రివర్గములకై (ధర్మార్థకామముల కొరకై) శక్తి–యుక్తులను వృధా చేసుకున్నాను.

ఇప్పుడు జరిగిందేమిటో... చూడండి! పతివ్రత – అనుకూలవతి – సౌందర్యవతి – నాకు తోడు – నీడ అయినట్టి నా భార్య పావురము, సాధువులు – మృదు స్వభావులు – నా ముద్దుల మూటలు అయిన సంతానముతో సహా నా గృహాన్ని ఖాళీచేసి నన్ను వదిలి స్వర్గలోకానికి బయలు దేరి వెళ్ళుచున్నారు!

శ్లో॥ **సో ఽహం శూన్యేగృహే దీనో మృతదారో మృతప్రజః**
**జిజీవిషే కిమర్థంవా? విధురో దుఃఖజీవితః!** (అధ్యా 7, శ్లో 70)

ఇప్పుడిక నాకు ఖాళీ గూడు మిగిలింది. భార్య-పిల్లలు పొగొట్టుకొని అతిదీనుడైనాను విరహవేదనాగ్రస్తుడనైనాను. నా శేష జీవితమంతా దుఃఖమయం అయిపోయింది? ఇక నేను ఎవరికోసం బ్రతకాలి? బ్రతికి ఏం సాధించాలని, ఏమి అనుభవించాలని?

---

ఈ విధంగా ఆ మగ పావురం విలపిస్తూ తన భార్య బిడ్డలు చిక్కివున్న చోట చుట్టూ ఎగురుతూ ఎగురుతూ వుండసాగింది. ఒకానొక క్షణంలో దానికి దుఃఖముతో పిచ్చిపట్టిన దాని వలె అయి, ఎగురుతూ యాధాలాభంగా వెళ్ళి తాను కూడా వలపై వ్రాలి వల త్రాళ్ళలో చిక్కుకున్నది. పోయి పోయి తనంతట తానుగా మృత్యువును నెత్తిపైకి తెచ్చుకొని, "అయ్యో! చచ్చానురా బాబూ! పోయేవాడిని పోక వచ్చివచ్చి నేనే ఈ వలలో వాలానేంటిరా నాయనా?" అంటూ ఆక్రందనలు చేయసాగింది.

ఇక ఆ బోయివాడు, "ఆహా! ఏమి అదృష్టం! ఈనాడు సుదినం! నేను పెద్దగా ప్రయత్నించకుండానే ఈ ఆడ పావురం – ఆ మగపావరం తమకు తామే నావలలో చిక్కుకున్నాయే ! ఈ రోజంతా ఇక పండగే! ... ఇవి తెలివితక్కువ పావురాలు! హాఁ! హాఁ!" అని చాలా సంతోషించసాగాడు. అటు తరువాత ఆ పావురములన్నింటినీ బుట్టలో బంధించి ఇంటికి పోసాగాడు.

ఓ యదుమహారాజా! ఇంద్రియములకు దాసుడై, కుటుంబసంబంధములు శాశ్వతమని – సత్యమని నమ్ముకొని కాలం గడుపుతూ తదనంతర స్వీయస్థితి – గతులపై జ్ఞానదృష్టిని సారించని వాడి గతి ఏమిటి? అనేక సంబంధ బాంధవ్యములలో, వ్యవహార పరంపరలలో మనసంతా నిలుపుకొని ముందు వెనుకలను పరిశీలించనివాడుఅయి, ఏ జీవుడైనా జీవితమనే అవకాశమును సద్వినియోగ పరచుకోకపోతే? ఆ పావురమువలె ఇంద్రియములకు దాసుడై దృశ్య విషయముల పట్ల ఆసక్తులతో కాలమును గడపివేస్తుంటే? ఏ మౌతుంది? **దుర్గతిపాలు కాక తప్పదు!** – అనే విషయం ఆ పావురము యొక్క అనుభవమును గమనించి నేర్చుకున్నాను.

**ఆరూఢచ్యుతుడు**

శాస్త్రములు, మహనీయులు మనకు ఒకానొక ముఖ్యవిషయం చర్విత చర్వణంగా గుర్తు చేస్తున్నట్లు నేను గుర్తెరిగాను!

శ్లో॥ **యః ప్రాప్య మానుషం లోకం ముక్తిద్వారం అపావృతం,**
**గృహేషు ఖగవత్ సక్తస్తమ్ "ఆరూఢచ్యుతం" విదుః॥** (అధ్యా 7, శ్లో 74)

ఈ మానవజన్మ అతిదుర్లభమైన ఒకానొక మహత్తరమైన అవకాశం వంటిది! (It is a great, but unknown time-bound opportunity). ఎందుకంటారా? ఇది తెరువబడిన ముక్తిద్వారము. ఆత్మజ్ఞులు ఈవిషయం ఎలుగెత్తి గానం చెస్తున్నారే! మరి అటువంటప్పుడు ఆ మగ పావురం వలె ఇల్లు-వాకిలి -సంబంధాలు-అనుబంధాలు -బాంధవ్యాలు - భావావేశాలు - భావనా సంసర్గములు మొ॥న విషయాలపట్ల అత్యంతాసక్తి కలిగి ఉంటే.. ఫలితమేమిటి? బుద్ధి మాంద్యము! ఉత్తరోత్తరా అధమగతులు! - "ఈతడు శ్రేయోమార్గం పొంది కూడా పతితుడైనాడురా" - అని అనిపించుకుంటాడు. పండితులు అట్టివానిని "ఆరూఢచ్యుతుడు" అని పిలుస్తున్నారు. అందుచేత ఈ మహత్తరమై మానవ జన్మ అనే అవకాశముపట్ల నేను ఆ మగ పావురము వలె వ్యర్థం చేసుకోదలచుకోలేదు. ఆరూఢచ్యుతుడను కాకూడదు! - అని ఆ పావురం యొక్క అనుభవం నుండి నేను నేర్చుకోసాగాను.

శ్రేయోమార్గము నుండి పునః అధను గతులకు వెళ్ళకూడదని మననం చేయసాగాను. ఈ ఇంద్రియ-ప్రపంచంలో నాది అని అనిపించేది నాది కాదు. ఇదంతా పరమాత్మ యొక్క కల్పనా చమత్కారమే! - అనే ఆరూఢతను అంటిపెట్టుకొని ఉండటం అభ్యసిస్తున్నాను.

## 9వ గురువు: కొండచిలువ

ఓ రాజా! ఈ జీవుడు ఎక్కడో ఏదో సుఖం పొందాలని ఆశించి వర్తమానాన్ని నిష్ప్రయోజనం చేసుకుంటున్నాడు. ధనం సంపాదించాలి! సుఖమయమగు స్వర్గలోకం నాకు లభించాలి!... అని అనుకుంటూ, ఇంద్రియ సుఖములకై వెంపర్లాడుచున్నాడు. ధ్యాసంతా - ఏమి సంపాదించుకోవాలి? ఎట్లా సంపాదించుకోవాలి? .... అనే రంధిలో వర్తమానమును పీకలదాకా ముంచిఉంచుతున్నాడు. ఆత్మజ్ఞానమునకు సంబంధించి ప్రయత్నములను ఏమరుస్తున్నాడు. ఒక్కసారి "సుఖదుఃఖాలకు సంబంధించి వాస్తవం ఏమిటి?" - అని గమనిస్తే "అవి వచ్చి పోయేవే!" అని తెలుస్తోంది. స్వర్గలోకంలో వున్నా - నరకలోకంలో వున్నా ప్రాణులకు సుఖ-దుఃఖాలు అనివార్యం. అవి రాకతప్పదు. పోకా తప్పదు. దుఃఖాలు మనం పిలిస్తే వస్తున్నాయా? లేదు కదా! అట్లాగే సుఖాలు

కూడా వాటంతట అవే వస్తూ వుంటాయి. ఇంతలోనే పోతాయి. ఇది గ్రహించిన వివేకి ఇక్కడి పదార్ధముల పట్ల ఆసక్తి కలిగి వుండడు. వాటి కొరకై వ్యధ చెందడం వృధా ప్రయాసయే!. అందుచేత, యథా లభ్యమైనదానితో ప్రతిరోజు పరమాత్మకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ వుండటం ఒక అలవాటుగా చేసుకోసాగాను.

సుఖ–దుఃఖాలకై ఉదాసీనతయే ఉచితం!

ఈ విషయం నేను ఒక కొండచిలువను చూస్తూ గ్రహించాను. ఎట్లాగా?... వినండి.

అనేకమంది జీవులు "నాకు ఇట్టి ఆహారమేకావాలి"– అని నియమించుకొని ఇక అద్దాని కొరకై అనేక ప్రయత్నపరంపరలలో మునిగి–తేలుచున్నారు. మరి కొండచిలువయో? తాను ఉన్నచోటనే ఆహారం కొరకు వేచి వుండి, లభించిన దానిని రుచిని గురించి ఆలోచించకుండా స్వీకరిస్తోంది. యాదృచ్ఛికంగా లభించినదానితో తృప్తి పడుతోంది లభించనప్పుడు మౌనంగా వేచి వుంటోంది. నేను కూడా ప్రాప్తాప్రాప్తముల విషయములలో కొండచిలువను అనుసరించసాగాను. ఏ సమయంలో ఏ ఆహారం లభిస్తే, ఏఏ సాంఘిక గౌరవాగౌరవాలు, వస్తు సముదాయాలు ఎంతవరకు లభిస్తే అంతవరకు వాటిని దైవేచ్ఛగా స్వీకరిస్తున్నాను. "లభించినది – రుచికరమైనదేనా? ఇంకేదో లభిస్తే బాగుండునే! ఇట్లా అయితే గొప్పకదా!" ... ఇటువంటి ఆశ–నిరాశలను దరిరానీకుండా ప్రాప్తించిన దానిని స్వీకరిస్తున్నాను. ఎప్పుడైనా ఏదైనా అనుకున్న ఆహారము లభించకపోతే ఇది కూడా దైవేచ్ఛయే – అని భావించి ఉపవాసదీక్షాభావం వహిస్తున్నాను. ధైర్యమును సడలకుండా చూసుకుంటున్నాను.

నాకు ఈ శరీరంలో మనోబలము, ఇంద్రియబలము, భౌతిక బలము ఉన్నప్పటికీ, వాటిని అధిగమించిన దృష్టితో వాటి పట్ల మౌనత్వమును అలవరచుకొని ఉంటున్నాను. పడుకుని–నిద్రరానప్పుడు కూడా–మౌనంగా తపస్సు చేస్తూ వుండటం అభ్యసిస్తున్నాను. కర్మేంద్రియముకు – ఏదో చేయాలి! ఎక్కడో తిరిగిరావాలి ! ఏదో చూడాలి! ఇంకేదో ఆఘ్రాణించాలి! మరేదో తినాలి – ఇత్యాది భావావేశములను దరి జేరనీయటంలేదు. మౌనంగా రోజులు గడుపుచూ యాదృచ్ఛికంగా లభించినదానిని సంతోషంగా స్వీకరిస్తూ జీవించటమును కొండచిలువ దగ్గరే నేర్చుకున్నాను. ఆశించటం మొదలై – ఆ ఆశ దురాశగాను, నిరాశగాను పరిణమించకుండా జాగరూకత – వహిస్తున్నాను.

ప్రాపంచక సంబంధమైన సర్వ విషయాలపట్ల – సందర్భముల పట్ల – సంఘటనల పట్ల మౌనం వహించిన వాడనై వుండటం అభ్యిసిస్తూ మునినై వుంటున్నాను. ప్రసన్నంగా,

గంభీరంగా వుండటం అలవరచుకుంటున్నాను. నేను ఇంతటివాడను. అంతటివాడను –అని ఇతరులతో చెప్పుకునే బలహీనతను త్యజించసాగాను. అంతరంగంలో దోష వృత్తులను–బలహీనమైన భావాలను దరి జేర నీయకుండా ఇతరులకు దుర్గ్రాహ్యుడుగా ఇతరుల నిందాస్తుతులకు అతీతుడుగా వుంటున్నాను. ఇతరుల అభిప్రాయములకై ఆశించుకుండా దురత్యయుడనై వుంటున్నాను. దేశ–కాలముల ప్రభావానికి లోను కాకుండా నా నిశ్చలత్వాన్ని – సంతోషాన్ని పరిపోషించుకుంటున్నాను.

## 10వ గురువు – సముద్రము

ఒక తటాకమైతే వసంత – గ్రీష్మ ఋతువులలో (వేసవిలో) ఎండిపోతోంది. (వర్షాకాలంలో) నిండుగా కనిపిస్తుంది. అదే, సముద్రమో? వర్షరుతువులో వృద్ధిపొందదు. యండాకాలంలో ఎండిపోదు. ఎప్పుడూ యథాతదంగా వుంటుంది. ఇది గమనించి నేను **సంపదలకు పొంగిపోరాదు, ఆపదలకు కృంగిపోరాదు** – అని నేర్చుకున్నాను. ఎప్పుడూ నిండుగా, ప్రసన్నంగా, గంభీరంగా, ఇతరులకు దురవగాహ్యుడుగా వుంటున్నాను. "ఇదిగో! ఈ ఈ కష్టాలతో చచ్చి పోతున్నాననుకో!" అంటూ ఇతరులకు బాధలు చెప్పుకొని వారి మెప్పు– ఓదార్పులపై ఆధారపడటం లేదు.

కష్ట సుఖాలు ఎవరికుండవు?

అతి విస్తారము సమగ్రము, తనయొక్క అంతరమున అనేక జీవరాసుల జీవన – అనుభూతి – అనుభవములకు చోటును ప్రసాదించునది, సూర్యకిరణములకు అనుక్షణం తనజలమును అందించి లోక కళ్యానమునకు కారకము – అగు సముద్రమును గమనించి ఆశ్చర్యం పొందాను. సముద్రమును మనస్సులో తలచుకొని – **గురువర్యా! సముద్ర దేవా! మీ ఆయా మహత్తర లక్షణములను విద్యార్థినై నేను నేర్చుకొనెదను గాక!** అని వారికి మానసికంగా విన్నవించుకున్నాను. సర్వఋతువులందు సముద్రం ఒకే రీతిగా వుండటం లేదా? అట్లాగే సర్వసమృద్ధులను పొందిన సమయంలోను, దరిద్ర నారాయణునిగా వీధులలో సంచరించవలసి వచ్చినప్పటికీ యోగి (లేక) ముని సంతోషముగాని దుఃఖముగాని పొందదు. – అని యోగశాస్త్రం యోగుల గురించి చెప్పుతోందికదా! నేను ఆయా ఉభయ సందర్భములలో సుఖ దుఃఖ భావాలకు అతీతత్వము వహించి ప్రశాంతంగా గంభీరంగా చిరునవ్వుతో కాలం గడపటం అభ్యసించసాగాను. (సంయోగ – వియోగాతీతో యోగః)

# 11వ గురువు - పతంగము (మిడత)

మిడత ఎక్కడో ఏదో ఒక మూల ఆహారం భక్షిస్తూ హాయిగా కాలం గడుపుతూ వుండగా, ఇంతలో, మరెక్కడో దూరదూరంగా అగ్నిశిఖల మెరుపులు చూసి ఆకర్షణ పొందుతోంది. వెనువెంటనే ముందు – వెనుకలు ఆలోచించకుండా ఝుమ్... మని గాలిలోకి లేచి ఆ అగ్ని శిఖలవైపు దబదబ రెక్కలాడించుకుంటూ బయల్వెడలుతోంది. అగ్నిని సమీపిస్తున్నప్పుడైనా ఆ అగ్ని శిఖలు తన దేహమును బాధించి భస్మం చేస్తాయని గమనించి, ఆగి, వెనుకకు మరల వచ్చును కదా? లేదు. తను కదలుచున్న వేగమును ఉపసంహరించుకోలేక, అందరు చూస్తూ వుండగానే పోయి – పోయి అగ్నిలోకి దూకి భస్మం అవనే అవుతోంది. ఆవేశంలో అనుకున్నది నిర్వర్తించటమేగాని, విచక్షణతో ముందు వెనుకలను పరిశీలించటానికి ప్రయత్నించటం లేదు.

ఈ జీవుని విషయానికి వద్దాం! దుర్గుణములు–దుష్ట సంభాషణములు –దురభ్యాసములు కలిగియున్నవారు ఆ పతంగమువంటి వారే కదా!

ఎంతో కష్టపడి అనేక శ్రమ – త్యాగముల అనంతరం పంచేంద్రియములతో కూడిన మానవ దేహమును సంముపార్జించు కుంటున్నాడు. ఇది ఎంతోగొప్పవిశేషం! ఎందుకంటే మానవ దేహంతో మోక్షమును కూడా పొందవచ్చును కదా! అటువంటి ఆత్మ విద్యా సముపార్జన సందర్భంలో పంచేంద్రియములతో ఇంద్రియవిషయములగు భౌతిక రూపముల దర్శనం మొదలైన వాటిని పరికించి చూస్తున్నాడు. అంతటితో ఆగటంలేదు. వాటి చేత ఆకర్షించబడి, లభించిన అవకాశాన్ని దుర్వినియోగపరచుకొని మిడతలాగా అనేక లోపములు – అజ్ఞాన జన్మలకు దారి తీయగల మార్గములోనికి తనను తానే ఆవేశంగా – వెను తిరగలేనంత వేగంగా త్రోసివేసుకుంటున్నాడు. ఇంద్రియ–దృశ్యాకర్షణలు అనే అగ్నిలోకి వెనక–ముందు చూడకుండా దూకుచున్నాడే!

మానవ జన్మ వచ్చింది ఇంద్రివిషయానందము కొరకా? కానే కాదు. అందుకే అయితే... ఇక జంతుజన్మయే అధికమైనది కాదా ఏమి? ఆహార–నిద్రా–మైధునాలు జంతువులకూ ఉంటాయికదా!

**ఎవ్వడైతే ఈ ఇంద్రియ విషయముల ఆకర్షణపై, దురభ్యాసములపై యుద్ధము ప్రకటించి జయించటానికి అవకాశములను సద్వినియోగ పరచుకుంటాడో అట్టివాడే నిజమైన వీరుడు**.. ఇంద్రియములకు లోబడనట్టి జితేంద్రియుని మనస్సు మాత్రమే దైవమాయచే

నిర్మితమైన జడ-మెడ-భుజములు - ముక్కు ఇత్యాది స్త్రీ - పురుష రక్తమాంస నిర్మిత దేహములకు ధన-జన సంపదలకు ఆకర్షితావేశమును పొందకుండా ఉంటోంది. అజితేంద్రియుని మనస్సో - ప్రలోభము పొందుతోంది. ఫలితమేమిటి? అగ్నివైపు పరుగులు తీసే మిడుతవలె నరక స్థితి గతులలోపడి అనేక విధాలైన కష్టములను నెత్తికి తెచ్చుకొని మరీ అనుభవిస్తోంది.

ఇది మిడుతలో గమనించిన నేను, **ఓ మిత్రమా! మిడుతా! నీవలె నేను ధనము - దేహము ఇత్యాది ఇంద్రియ విషయల పరంపరలచే జనించే ప్రలోభాగ్ని వైపుగా పరుగుపరుగున పోయి వినాశనము తెచ్చి పెట్టుకోను. ఈ విషయం నాకు గుర్తుచేసి మార్గదర్శివగుచున్నావు కదా! అందుచేత నీవు నాకు గురువువే!...** అని సంబోధించి ప్రలోభముల నుండి నన్ను నేను రక్షించుకోవటం ప్రారంభించాను. మిత్రమా! యయాతిపుత్రా! యదుమహారాజా! మరొక్కసారి గుర్తు చేస్తున్నాను, విను

**శ్లో॥ యోషిత్ హిరణ్య ఆభరణాంబరాది ద్రవ్యేషు మాయారచితేషు మూఢః**
**ప్రలోభితాత్మా హి ఉపభోగ బుద్ధ్యా పతంగవత్ నశ్యతి నష్ట దృష్టిః॥ (అధ్యా 8, శ్లో 8)**

స్త్రీ పురుష దేహముల పరస్పరాకర్షణ, ధన-వస్తుసంపద, ఆభరణములు-ఇత్యాది మాయారచితమైన వస్తు- విషయజాలములను అనుభవించాలనే ప్రలోభములో పడుచున్న జీవుడి దృష్టి - ఆ జీవునికి నష్టము, ఆపదలు కలిగించటానికే! ఇంద్రియాకర్షణలన్నీ పై పైకి ప్రమోదంగానో, యండమావులలోని జలం వలె భవిష్యత్‌కాలంలో లభించబోయే సుఖాశాసిద్ధివలెనో, వినోదంగానో కనిపించవచ్చుగాక! అంతిమ ఫలితం మాత్రం మిడుతవలె అశాంతియే, వినాశనమే! ఇది మును-ముందుగానే గమనించటం ఉచితం అని- నేను మిడత నుండి నేర్చుకున్నాను.

## 12వ గురువు - తేనె టీగ

తేనె టీగలో మరొక విషయం గమనించాను.

**శ్లో॥ స్తోకం స్తోకం గ్రసేత్ గ్రాసం దేహో వర్తేత యావతా**
**గృహాన్ న హింసత్ న తిష్ఠేత్ వృత్తిం మాధుకరీం మునిః॥ (అధ్యా 8, శ్లో 9)**

తేనెటీగ పుష్పముపై వ్రాలుతుంది. తేనెను కొంచం కొంచం గ్రోలుతుంది. అయితే, ఆ పుష్పానికి ఎటువంటి చేటు కలిగించదు. పుష్పపు రెక్కలకు హాని కలుగనీయదు. అట్లాగే

రాజా! మనం సహజీవులకు ఎటువంటి హాని గాని, బాధగాని కలుగనీయకుండా, వారి వద్ద అత్యంతసుకుమారంగా ఆహారము - సహకారము మొదలైనవి స్వీకరించాలి. అంతేగాని ఎదుటివారి అభిమానమునో, మన అధికారములో అడ్డం పెట్టుకొని- ఏనుగు తటాకజలంతో ప్రవేశించి కలువపూతీగలను పీకి నేలపైకి విసరునట్లు - సహజీవులకు కష్టం కలిగించరాదు.

ఎందుకంటే... సహజీవులంతా ఈశ్వర స్వరూపులే కదా! మమాత్మస్వరూపులే కదా!.

సన్యాసాశ్రమవాసినైన నేను ఒకే గృహస్థుని వద్ద బహుకాలం తిష్టవేసుకొని వుండరాదని, తద్వారా మనో సంబంధ - అనుబంధం - బాంధవ్యాల వైపుగా నాకు తెలియకుండానే నా మనస్సు ప్రసరిస్తుందని గమనించాను. పైగా, ఆ గృహస్తునికి కొంత అసౌకర్యమే కదా! తేనెటీగ ఒకే పుష్పంపై బహుకాలం వ్రాలి ఉంటుందా? ఉండదుకదా!. అనివార్యమైతేనే తదితరులు సహకారము- వారికి అసౌకర్యం కలిగించకుండా పొందాలి!

**తేనెటీగ నుంచి మరొక విశేషం గమనించి, నేర్చుకున్నాను.**

అనేక చిన్న పెద్ద పుష్పాలపై వ్రాలి తుమ్మెద తేనెను స్వీకరిస్తోంది. "ఇది చిన్న పుష్పం కదా! నేను లెఖ చేయను గాక!" అని ఆ షత్పదము (ఆరు కాళ్ళుగల తుమ్మెద) తలచదు. అట్లాగే బుద్ధి మంతుడు చిన్నవి- పెద్దవి అగు అనేక శాస్త్రాలు వింటూ, పరిశీలిస్తూ... ఆ శాస్త్రముల సారాన్ని గ్రహిస్తూ వుంటాడు. ఈ శాస్త్రం వారి గురువు చెప్పింది కదా! ఆ పుస్తకము ఆ మతము వారి దేమో? - ఇత్యాది అల్పావగాహనలు కలిగి ఉండడు.

నేను కూడా అనేక శాస్త్రములు- అనేక మంది మహనీయుల వాక్యాలు వింటూ, వాటి సారమును గ్రహించటం అభ్యసించసాగాను. ఇది తేనెటీగ నుండి నేర్చుకొని అద్దానిని గురుతుల్యంగా భావించసాగాను. "వారి గురువులకంటే వీరి గురువులు గొప్పవారు. వీరికంటే మాగురువులు గొప్ప. మా శాస్త్రములు వారి శాస్త్రములకంటె అధికమైనవి" - ఇట్లా ఆలోచించటమే మానివేశాను.

**తేనెటీగ గురించి ఇంకొక విషయం కూడా గమనించి ఒకానొక జాగరూకతను ఆశ్రయించసాగాను.**

తేనెటీగ అనేక పుష్పములపై వ్రాలుచు గంటగంటకు శ్రమించి తేనె తెచ్చి తేనెతుట్టెలో గల అనేక తుట్టి విభాగములలో నింపుతూ జీవితమంతా గడపుతోంది. ఒకానొక రోజు ఏ బోయవాడో వచ్చి ఆ తేనెతుట్టెలోని తేనెటీగలను పాల ద్రోలి (లేదా) పొగతో తేనెటీగల

శరీరములను నేలకూల్చి తేనెతుట్టెను పిండి, తేనెను తన వెంట కొని పోవుచున్నాడు కదా!.

సంసార రహస్యమును, తదనంతర పర్యవసానములను ఎఱిగిన యోగి **భవిష్యత్తుకై ఏవేవో సంపదలను పెంపొందించుకోవాలి కదా?** ... అనే ధ్యాసకు తావియ్యడు. జ్ఞానియగు భిక్షువు అరచేతిని తెరచి గృహిణులు సమర్పించిన ఆహారమును స్వీకరించి వూరుకుంటాడు. రాత్రి – రేపు – మరి కొన్ని రోజులకు గ్రాసం.. అనే ఆవేశకావేశములను పొందడు.

నేను అధికముగా సామాగ్రి – సంపదలను సంపాదించి దాచుకొవటం తేనెటీగవలె ఒకానొకరోజు అంతా పోగొట్టుకోవటానికే! మృత్యువు సమీపించినవాడెవ్వడూ తన వెంట భోజనపు మూటలను, భవనములను, బంగారు ఆభరణములను వెంటబెట్టుకొని వెళ్లటం లేదు కదా!. ఎంతో కూడబెట్టాలి అని భావించి జీవితమంతా శ్రమించటం– **దృశ్యము** అనే స్వయంకల్పిత భావావేశముచే మోసపోవటమే కదా! – ఈ విషయం తేనెటీగ నుండి నేర్చుకున్నాను.

## 13వ గురువు - మగ ఏనుగు

సుదృఢము – మహాకాయము – అత్యుత్సాహముతోకూడినది అగు ఒకానొక గొప్పతెలివైన మగ ఏనుగు వున్నది. అది గంభీరంగా, హుందాగా సంతోషంగా కొండప్రాంతాలలోను అరణ్యాలలోను సంచరిస్తూ వుండేది. ఆ ఏనుగు యొక్క ప్రశాంతతతో కూడిన గంభీర్యరూపం చూసి ఆ అరణ్యంలో సంచరించే సింహము – పెద్దపులి మొదలైన జంతువులు కూడా సగౌరవంగా చూస్తూ వుండేవి. సహ జంతు జాలములను ఎంతో వాత్సల్యమైన–ప్రేమాస్పదమైన చూపులతో ఆ ఏనుగు ఆకట్టుకుంటూ ఉండేది!

అంతటి ఏనుగకు ఒక దుర్గుణం ఉండేది. ఆడ ఏనుగును చూడగా పరవశించి పోయి శృంగార చేష్టలకు ఉపక్రమించి, తన యొక్క గాంభీర్యత్వమును ఒక్క క్షణంలో సమూలంగా కోల్పోయేది.

ఒకానొక ఆటవికునికి ఆ మేఘగంభీర స్వభావియగు కొండ ఏనుగును బంధించి ఆ దేశపు రాజుకు అప్పజెప్పి ధనం సంపాదించాలనే పేరాశ కలిగింది. ఆ ఏనుగును బంధించాలని కందకము త్రవ్వటం మొదలైన అనేక ఉపాయాలకు ఉపక్రమించాడు. అవన్నీ – ఆ తెలివైన ఏనుగు ముందుగానే గమనించి తగు జాగరూకతతో ఉండేది.

అయితే, ఆ ఆటవికుడు-ఏంచేస్తే ఈ ఏనుగును బంధించవచ్చురా? ... అని ఆలోచించసాగాడు. కొంతకాలము తరువాత ఆ ఏనుగు యొక్క స్త్రీచాపల్యమును గమనించాడు. ఒక రోజు ఒక గొప్ప కందకము త్రవ్వి, ఆడ ఏనుగువలె ఘీవూ-ఘీవూ అంటూ ఆకర్షణ ఘీంకార శబ్దములు చేయసాగాడు. ఆ అడవి ఏనుగు ఆ శబ్దాలు విన్నది. శృంగార చాపల్యంచేత ముందు వెనుకలు చూచుకోకుండా పోయిపోయి ఆ ఆటవికుడు త్రవ్విన కందకంలో జారి పడి బంధము తెచ్చి పెట్టుకున్నది.

**ఈ సంఘటనను విన్న నేను ఆ అడవి ఏనుగు యొక్క దౌర్భాగ్యమైన పతనకారణాల నుండి కొన్ని ముఖ్య విశేషాలు గమనించాను.**

సాధకుడైనవాడు ఈ స్త్రీ-పురుష భౌతికాకర్షణలు మొ॥నవాటి పట్ల అతి జాగరూకుడై వుండాలి. పరాయి స్త్రీ మూర్తిని చేతి వ్రేళ్ళచే గాని – కాలి వ్రేళ్ళచే కూడా స్పృశించరాదు. చేతి కఱ్ఱతో కూడా స్పృశించకూడదు. లేదా,... ఆ మగ ఏనుగవలె వ్యామోహితుడై ఇంద్రియ విషయపరంపరలలో కూలిపోవలసివస్తుంది. ఆడ ఏనుగు క్రీగంటి చూపులకు బలమైన గజము ఓడి నేల కూలునట్లు – సాధకునికి భౌతికాకర్షణలు మృత్యు సదృశములు. **అతని మహాశయములు కూడా అల్పాకర్షణలచే కూల్చివేయబడతాయి.**

కాబట్టి ఓ మహారాజా! మృత్యువుతో పోల్చతగిన నామ-రూపాత్మకమైన భౌతికాకర్షణలపట్ల అత్యంత జాగరూకుడనై వుండటం ఆ అడవి ఏనుగు యొక్క దుస్థితి నుండి నేర్చుకుంటున్నాను. ఓ ఇంద్రియాకర్షణములారా! మీరు దూర-దూరంగా ఉండి!.... అను అభ్యాసము కలిగి ఉంటున్నాను.

## 14 వ గురువు – తేనెతుట్టెల నుండి తేనె గ్రహించేవాడు

**శ్లో॥ న దేయం నో ఉపభోగ్యం చ లుబ్ధైః యత్ దుఃఖసంచితమ్**
**భుంక్తే తదపి తచ్చ అన్యో మధుహేవ అర్థవిత్ మధుః॥** (అధ్యా 8, శ్లో 15)

ఓ రాజా! తేనెతుట్టి నుండి తేనెను గ్రహించువాడిని గమనిస్తూ... లోభగుణం యొక్క పర్యవసానమేమిటో పాఠ్యాంశంగా నేర్చుకున్నాను. తేనెటీగ ఎంతో కష్టపడి సంపాదించిన తేనె తాను అనుభవించక ఇతరులకు దానమివ్వక జీవిస్తోంది. ఈ లోగా ఏ బోయవాడో ఒకానొక రోజు వచ్చి తేనెను ప్రరిగ్రహించి తేనెటీగలను బయటకు వెడలత్రోయుచున్నాను.

ఈ ప్రపంచంలో ఎన్నో శ్రమలకు ఓర్చి సంపాదించిన ధనం లోభి నాది-నాది అని

అనుకుంటూ చూసుకుంటూవుంటున్నాడు. తాను తినడు, అనుభవించడు. ఇతరులకు పెట్టడు. ఒకానొకరోజు మృత్యువు వచ్చి ఈ జీవుని కాళ్ళకు చేతులకు బేడీలు వేసి తన వెంట గొనిపోతోంది. ఆలోభి దాచిన డబ్బు దొంగలపాలో, దొరలపాలోకావటం అనివార్యం కదా! అందుచేత తన సంపదలను నలుగురిని ఆనందింపజేయటానికి వినియోగించేవాడు తెలివికలవాడు. దాచి–దాచి, అవి అట్లా అట్లా చూచుకుంటూ, చివరికి దేహము వదలి పోతూ...లోభగుణం చేత సంపదల సముపార్జనశ్రమనుండి పొందవలసిన దాన పుణ్య ప్రయోజనం పొందనివాడు తెలివి తక్కువవాడుకాక, మరింకేమిటి? లోభగుణం మనస్సును అనేక దుఃస్థితులకు–అల్పజన్మలకు గొనిపోతూ వుంటుంది.

ఇది గమనించి నేను, **లోభగుణాన్ని దాన గుణంతో నిత్యము జయిస్తూ వుండాలి** అనే పాఠ్యాంశాన్ని మననం చేయసాగాను. దానం చేయటం చేతగాని ఇంటిలోకి లోభగుణం వచ్చి పెత్తనం చెలాయిస్తుంది. ఆ యజమానిని తన సేవకుడిగా చేసుకుంటుంది – అని గమనించాను.

## 15వ గురువు - వేటగాని సంగీత శబ్దాలు - జింక

ఒక వేటగాడు అడవిలో సంచరించే లేడిని బంధించటానికి ఇంపైన సుందర సంగీత శబ్దములను వినిపించి ఆ లేడిని ఆకర్షిస్తాడు. ఆరీతిగా, జన్మ అనే అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవలని అనుకునే సాధకుడు (ముముక్షువు) విషయ సంబంధములైన గీతములను (The songs pertaining to wordly attractions) వింటూ వింటూ వుండటం ఉచితం కాదు. లేడివలె ఆకర్షించబడకూడదు.

స్త్రీల నృత్యం – గానం – శృంగార మొదలైన గీతములందు ఆసక్తి కలవాని మనస్సు వాటివాటియందు ఆకర్షణ పెంపొందించుకొనుచు ఇక వాటికి బందీ అయిపోతుంది. ఋషి గర్భమునుండి జన్మ పొందిన ఋష్యశృంగుడు అనే మహాముని విషయసంబంధమైన గీత నృత్యాలయందు ఆసక్తుడై తపోమార్గం నుండి చ్యుతి పొందటం జరిగిందని మనం (శ్రీమద్రామాయణంలో) విన్నాము కదా!.

అందుచేత నృత్య–గీతములందు, సంసార (దృశ్య) సంబంధమైన సమాచారములందు ఆసక్తిని కలిగివుండటం ప్రమాదకరమైనది. అవి నాయొక్క ధ్యానము – తపస్సు ఇత్యాది ప్రయత్నములకు అవరోధము – చ్యుతి కలిగిస్తాయి. అందుచేత లేడివలె శబ్దాకర్షణకులోనై

ప్రమాదములను ఆహ్వానించరాదు - అనే విషయం నేర్చుకున్నాను. ఆధ్యాత్మిక పురోగతికి అవసరంలేని లౌకిక సమాచారములకు - సంఘటనలకు దూరంగా వుండటం అలవరచుకున్నాను.

## 16వ గురువు - ఎరకు ఆకర్షితమై గాలమునకు చిక్కుకుంటున్న చేప

చేప గాలమునకు తగిలించిన ఎరకు ఆకర్షితమై పోయి గాలములో చిక్కు కుంటోంది. ఈ జిహ్వ (నాలుక) దేహానికి ముఖ్యద్వారం వంటిది కదా! తదితర ఇంద్రియాలన్నీ నిరాహారం (Non using) చేస్తూ వుంటే క్రమంగా అవి జీవునిపై ప్రభావం చూపటం సన్నగిలుతుందేమో! కానీ ఈ నాలుకయో? దీనిని నిరాహారం చేస్తూ వున్నకొలది రెచ్చి పోతూ వుంటుంది. ఆహారం తిననివాడు కోపంగా వుంటాడు కదా! జిహ్వాచాపల్యం మరింత అధికమౌతుంది!.

**శ్లో॥ తావత్ జిత ఇంద్రియో న స్యాత్ విజిత అన్య ఇంద్రియః పుమాన్,**
**న జయేత్ రసనం యావత్ జితం సర్వం... జితే రసే॥ (అధ్యా 8, శ్లో 21)**

ఈ రసేంద్రియం జయించటం అతి ముఖ్యమైన పని. అన్ని ఇతర ఇంద్రియములను జయించినప్పటికీ.. రసేంద్రియాన్ని జయించనంతవరకు ఇంద్రియములపై విజయం లభించనట్లే! రసేంద్రియాన్ని వశం చేసుకున్నామా... అన్ని ఇంద్రియాలను జయించినట్లే! అందుచేత చేప వలె కాకూడదు నేను. ఈ రసేంద్రియాన్ని (నాలుకను) జయించి వుండాలి. ఎప్పుడు ఏది ఆహారంగా లభిస్తే అద్దానిని ప్రసాదంగా భావించాలి. అంతేగాని **నాకు ఆ రుచి ఇష్టం! ఈ పదార్థాన్ని మాత్రమే తింటాను.** - అని తిష్టవేసుకొని కూర్చోను. అట్టి మార్గంలో రసేంద్రియాన్ని జయించే ప్రయత్నాలు చేయసాగాను!.

అంతేకాకుండా, సాత్వికమైన ప్రేమ పూరితమైన సంభాషణలతో రసేంద్రియ దేవతను ఉపాసించ నిశ్చయించుకున్నాను. వాక్కు సత్యం-శివం-సుందరంగా వుండటమే వాక్-తపస్సు కదా!

## 17వ గురువు - పింగళి అనే పేరు గల ఒక వేశ్య

ఓ యదుమహారాజా! ఇక నా 17వ గురువు గురించి చెప్పుతాను. విను.

ఒకానొకప్పుడు పెద్దలచే చెప్పబడిన ఒక ఉదాహరణ నాకు గురువై, నేను నేర్చుకోవలసినది గుర్తు చేయసాగింది.

ప్రాచీన కాలంలో...., విదేహనగరంలో (మిథిలానగరంలో) పింగళ అనే ఒక వేశ్య వుండేవారు. ఆమె ఒక రోజు సాయంకాలం సుందరంగా అలంకరించుకొని వాకిట నిలుచుని ధనము ఇవ్వగల విటులను ఆకర్షించే ప్రయత్నం ప్రారంభించింది.

ఎవరో ఒకరు అత్రోవన రాగానే "**ఈతడు నేననుకున్నంత ధనం ఇవ్వడేమో! ఈతనిని పోనిద్దాం. ఇంకో పెద్ద ధనికునికోసం మరికొంత వేచి ఉందాం!**" అని భావిస్తూ వేచి వుండసాగింది. ఆమె మనస్సులో దురాశ కొండంతగా ఎదగసాగింది. చాలా సేపు ఎదురుచూచింది.

ఇంతలో ఆమెకు నిద్రముంచుకురాసాగింది. అయినా సరే, ఎట్లాగోఅట్లా నిద్రను త్యజించి తన ప్రయత్నాలు కొనసాగించింది. ఇంట్లోకి పోవటం, కొంచం నడుం వాల్చడం, మరల ప్రవేశద్వారం వద్దకు వచ్చి కులుకు - బెలుకులు చూపుతూ నిలుచోవటం, చాలా సేపు అటువైపుగా ఎవ్వరూ రాకపోవటం, వచ్చినవారు ధనికులు కాకపోవటం.. ఇట్లా తెల్లవార్లూ... వేచి వేచి వుండసాగింది. ఆమెలో ధనాశ-పేరాశ-దురాశ అధికమై ఇక, ఆమెనిరుత్సాహపడుతూ ఊసురోమనసాగింది. అనుకున్నట్లుగా ధనం ఇవ్వగలిగిన విటుడెవ్వడూ తారసపడక పోవటంచేత ఆమెలో కసి - కోపం - ఆవేశం - నీరసంతోకూడిన ఆక్రోశము అధికాధికం కాసాగాయి.

ఈ విధంగా నిమిషాలు గంటలు గడచిపోయాయి. ఒకానొక సమయంలో ఆమెకు విటులపై - వారిచ్చే ధనంపై గల అనురక్తి కాస్తా విరక్తిరూపం దాల్చసాగింది. వైరాగ్య భావాలు ఆమెలో ఉదయించసాగాయి.

ఓ రాజా! **ఏవేవో ఆశించటం నిరాశ పొందటం** అనే దురభ్యాసమే **సంసారము** అనబడుదాని మూల పదార్థం (Raw-material)కదా! అందుకు ఔషధం? వైరాగ్యమే సుమా!

**ఉత్తములు "నిరాశా" సందర్భములను "వైరాగ్యం" గా మలచుకుంటారు. అంతేగాని ఊసూరుమంటూ ఊరుకొని వుండరు.**

**శ్లో॥ నహి అంగాజాత నిర్వేదో దేహబన్ధం జిహాసతి,**
**యథా విజ్ఞానరహితో మనుజో మమతాం! నృప! (అధ్యా 8, శ్లో 29)**

ఓ యదు మహారాజా! విజ్ఞాన రహితుడైన మనుజుడు మమకారమును (నాది, నాకు సంబంధించినదే... అనే భ్రమావేశమును) వదలుకో గలడా? లేదు. ఉత్తమమైన

వైరాగ్యం పొందనంతవరకు ఈ జీవుడు దేహముతో అనుబంధరూపమైన బంధమును వదలటానికి ఇష్టపడడు.

విరక్తి–వైరాగ్యము పొందిన ఆ పింగళమాత్రం ఏవిధంగా వైరాగ్య మార్గము గురించి గానం చేసిందో, ......చెపుతాను, వినండి.

పింగళ : ఓ సహజనులరా!

**శ్లో॥ అహో! మే మోహవితతిం పశ్యతా విజితాత్మనః**
**యా కాన్తాత్ అసతః కామం కామయే యేన బాలిశా॥ (అధ్యా 8, శ్లో 30)**

అహో! ఈ ఇంద్రియములకు ఆధీనంఅయి వాటిచే జయింపబడి వుండటం చేత, నేను ఎంతటి మోహంలో పడిపోయానో గమనిస్తున్నారా? నా వివేకమంతా నశించటం చేతనే స్వప్నసదృశులగు (వాస్తవానికి లేక పోయినప్పటికీ కలలో కనిపించి మాయమయ్యే వారితో సమానమగు) దుష్టపురుషులకు తుచ్ఛ విషయసుఖముల కొరకై దాసోఽహం అయిపోతున్నాను. ఇదంతా ఎంతటి దుఃఖ విషయం!

నాకు నిజంగానే బుద్ధి నశించింది. ఎందుకిట్లా అంటున్నావని అడుగుచున్నారా! అయితే వినండి!

సర్వతత్త్వస్వరూపుడగు పరమాత్మ ఈ జగద్రూపుడై, సర్వజీవులకు సుఖప్రదాతయై, సర్వులకు సంపదలను ప్రసాదించువాడై, నిత్యుడై, ప్రతి ఒక్కరికి ఆత్మసముడై కళ్ళకు ఎదురుగా వేంచేసియే ఉన్నారు. అట్టి పరతత్త్వ స్వరూపుడగు ఆత్మారాముని ఆశ్రయించటం ఏమరచాను. ఆజ్ఞానం చేత సమర్థత లేనివారు, కోరుకున్న నిత్యసుఖాన్ని ఇవ్వలేని వారు, పైగా దుఃఖము – భయము – శోకము– మోహములను ప్రసాదించేవారు అగు భౌతిక దేహాలని–దేహులను ఆశ్రయించానే! ఇంతకన్నా తెలివితక్కువదనం ఇంకెక్కడన్నా వుంటుందా?

అహాఁ! ఎదో బ్రతుకుతెరువు కోసం ఈ వేశ్యవృత్తిని ఆశ్రయించాను. ఈ శరీరాన్ని పోషించుకోవటానికి దీనికి అలంకారాలు – షోకులు చేసి ఈ దేహాన్ని విటులకు సమర్పిస్తూ వచ్చాను. ఎవ్వరైనా పిల్లలను పోషించుకోవటానికి ఆ పిల్లలనే అమ్ముకోవటం ఎంత అర్థంలేని విషయమో.. నా విషయం అంతే కదా...! శరీరమును పొందింది మనస్సును నిర్మలము – శక్తి యుతము చేసుకోవటానికే అయివుండగా.. ఇప్పుడు ఈ శరీరమును మనస్సును కూడా వేశ్యవృత్తిద్వారా మరింత కలుషితం చేసుకుంటున్నానే!

ఈ పవిత్రమైన శరీరాన్ని నేను లోభులకు - మూర్ఖులకు, ఇంద్రియలోలులకు, లంపటులకు వ్యర్థవాక్యకలాలాపులకు, అధర్మ నిరతులకు ధనాశచే అప్పగించి ఎంత ఆత్మ ద్రోహం చేసుకుంటున్నాను! మోక్ష సాధనమగు ఈ శరీరమును ధనము కోసము-రతి కోసము మూర్ఖురాలనై ఇంతకాలం దుర్వినియోగం చేసుకుంటూవస్తున్నానే!.

ఈ నాశరీరము ఎటువంటి దంటే.. ఇది ఒక చూరిల్లు వంటిది. దీనిలో వెదురు బొంగుల స్థంభములవలె బొమికలు అమర్చబడి వున్నాయి. బొమికలు-చర్మముచే, వెంట్రుకలచే, గోళ్ళచే కప్పబడివున్నది. ఈ దేహ గృహానికి 9 ద్వారాలు వున్నాయి. (రెండు  కళ్లు, రెండు చెవులు, రెండు ముక్కుపుటాలు, నోరు, గుదము, గుహ్యాము). ఈ 9 ద్వారాలనుండి ధూళి-దుర్వాసనలతో కూడిన జలము - కళ్ళె -మలము - మూత్రము ఇత్యాది దుర్గంధభూయిష్టమైన పదార్థాలు ఎల్లప్పుడూ బయల్వెడలుచూ వుంటాయి. దీనిలో దాగివున్న సంపదలు మలము-మూత్రము మొదలైన దుర్వాన-దుమ్ము - దుష్ట పదార్థములతో కూడిన పదార్థములు, రక్త - మాంస -బొమికలే కదా! ఇటువంటి ఈ శరీరములో ఒకరు అభిమానించటానికి గాని, మరొకరు, ద్వేషించటానికి గాని విలువైన - పనికి వచ్చే పదార్థ మేమున్నది? ఈ నా వెంట్రుకలు - మలము - దుష్టరసములు - మూత్రము - రక్త మాంస బొమికల శరీరంలో విటులకు కనిపిస్తున్న ఆనంద వస్తువేమిటి? ఇక వారిచ్చే ధన సంపదచే ఈ నా దేహము క్రొత్తగా పొందుచున్న దేమిటి? ఇదంతా పరస్పరం మోసగించుకొని ఒకరికొకరం లంపటంలోకి (బురదలోకి) త్రోసుకోవటమే అవుతోంది. శబ్ద స్పర్శరూప రస గంధ శక్తులతో కూడిన ఈ శరీర గృహంలో ప్రవేశించినది ఎందుకు? అజ్ఞాన ప్రవృత్తులను మరింత దట్టంగా ప్రవృద్ధి పరచుకోవటానికా? కాదు. కాకూడదు!

నాయందు ఆత్మానంద స్వరూపుడై సర్వదా వేంచేసియున్న నాప్రియమైన శ్రీహరిని ఏమరుస్తున్నానే? తుచ్ఛము - దుఃఖ ప్రదము అగు భోగ వస్తువుల కోసం అన్యజనులగు విటులు మొదలైన వారిని ఆశ్రయిస్తున్నానే? ఇంతటి మూఢత్వం ఇంకెక్కడన్నా వుంటుందా? ఈ విదేహనగరంలో నా కన్నా తెలివి తక్కువవారు మరెవ్వరూ వుండరేమో? ఇంటిలో గల మధుర పదార్థాలను తినటానికై వంటగది తలుపులు తెరవటానికి బద్ధగించి,.... ఒకామె ఒకబొచ్చె తీసుకొని ప్రక్కింటివారిని మాధవకోళం కొరకై బిచ్చమెత్తటం-వంటిదే కదా, నాయొక్క విటులనుండి ధనాశ!

ప్రతి ఒక్క జీవునికి అత్యంత ప్రియమైన వస్తువు - ఆతని అంతరంగమునకు సాక్షిగా వేంచేసియున్న శ్రీహరియే! ఆయనయే అందరికన్నా ప్రియతమము, స్నేహితుడు, శ్రేయోభిలాషి, ప్రభువు, అంతర్యామి, ఓదార్చేవాడు, తోడైననాడు కూడా! ఆ లక్ష్మీ సమేత శ్రీమన్నారాయణుని "**ఆత్మ నివేదన**" అనే ఉపాయంతో "ఆత్మార్పణ" అనే ధనంతో కొనుక్కొని శాశ్వతసుఖం సంపాదించుకోవాలి. ఆయనతో కూడి విహరించాలి. ఈ విటులతో కాదు.!. పాంచభౌతికము - భ్రమాత్మకము - దుఃఖపర్యవసానము అగు ఇంద్రియ విషయములతో కానేకాదు!

ఇక జగత్తు విషయమంటారా! ఇందులో కనిపించేదంతా కాలముచే వచ్చి - పోతూ వుంటుంది. ఒకరికి మరొకరు కలిగించగల సుఖమెంతటిది? ఆయా కామప్రదులగు జీవులతో సంబంధముచే అజ్ఞాన జనితమైన కోరికలు పెంపొందించుకోవటమే అవుతుంది. కోరికలు కలిగి వుండటమే సర్వ దఃఖాలకు మూలకారణం. కోరికలు, తీరాలని మానవులను ఆశ్రయించి ఏం ప్రయోజనం? దేవతలంతటివారు వారి భార్యలకు ఏం సుఖం కటబెట్ట గలిగారు?

అమ్మయ్య! ఏ జన్మలో ఏం గురుసేవ చేశానో ఏమో? ఏ సత్కర్మల ప్రభావం చేతనో సర్వాంతర్యామి యగు విష్ణు భగవానుడు నాకు ఈరోజు స్ఫురిస్తున్నారు. ఆయన నాపట్ల ప్రసన్నుడు అవటం చేతనే నా లోని దృశ్యతాపత్రయం నీర్వేదమౌతోంది. ఆయన కృపచేత నాకు వైరాగ్య సంపద ఉద్భవించి క్షణక్షణం ప్రవృద్ధమౌతోంది. ఈ వర్తమాన వైరాగ్యము నాకు శాశ్వత సుఖమును ప్రసాదించటానికే అయివున్నది.

అహో! ఇంతకాలం నేను పొందిన కష్టాలే నాకు బాధగురువులు. కష్టాలే వుండి వుండకపోతే వైరాగ్యము అనే సౌభాగ్యం నా బుద్ధికి ప్రాప్తించేది కాదుకదా! క్లేశాలే ఇంద్రియ విషయముల పట్ల వైరాగ్యము ప్రసాదించి, బంధమును త్రెంచి శాంతికి మార్గమును ప్రసాదిస్తాయి. అన్నీ ప్రసాదించేది పరమాత్మయేకదా! కష్టాలు ప్రసాదించిననట్టి ఆ పరమాత్మకు నేనిప్పుడు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఆయన కరుణచే ఈ రోజునేను దురాశను వదలి ఆ జగదీశ్వరుని శరణువేడుచున్నాను. ఇప్పుడు... ఇక నేను ఏం చేయాలి? అప్రయత్నంగా భగవదనుగ్రహంచేత లభించిన శేష జీవితము - అనే అవకాశాన్ని సంతోషంగా - శ్రద్ధగా సద్వినియోగ పరచుకొంటాను. సర్వాత్ముడు - మమాత్మస్వరూపుడు అగు ఆ సర్వేశ్వరునితోనే ఇకనుంచి విహరిస్తాను.

అవును! ఈ జగత్తంతా కాలము అనే సర్పముచే మ్రింగి వేయబడియే వున్నదని వర్తమానంలో అందరము గమనించియే వుండటం ఉచితం. వివేకి అయినవాడు సర్వ విషయముల పట్ల అనురక్తిని దరిచేరనీయడు. ఎవ్వడు ఎల్లప్పుడు సర్వ విషయముల పట్లా విరక్తుడై వుంటాడో, అట్టివాడుమాత్రమే మాయనుండి తనను తాను రక్షించుకున్నవాడగుచున్నాడు. నేను శేషజీవితాన్ని **వైరాగ్యసమన్వితంగా, సర్వాత్మకుడగు మహావిష్ణు సమర్పితంగా, భగవత్‌మహిమాగానపూర్వకంగా, మహనీయుల ఆప్తవాక్యముల** మననముతో గడిపెదనుగాక!.

----

ఓ యదు మహారాజా! ఆ పింగళ ఈ విధంగా ఆలోచన కొనసాగించింది. విటులతో సమాగమం, దేహమును అమ్ముకొని ధనం సంపాదించటం మొదలైన ఆలోచనలను అప్పటికప్పుడు పరిత్యజించింది.

క్రమంగా - **సర్వరూపములు తానై, సర్వసాక్షి అనగవేరై- సర్వ బ్రహ్మాండములకు తానె సూత్రధారియై - సర్వ జీవ బుద్ధులందు సంకల్ప వికల్పములను సర్వత చేయుచు నిర్వికల్పుడగు-** అటువంటి విష్ణుతత్త్వాన్ని మననం చేస్తూ ప్రశాంతంగా నడుం వాల్చింది. అప్పుడు ఆమె హాయిగా నిదుర ఆస్వాదించసాగింది.

**ఓ రాజా! ఇంద్రియ సుఖాలు త్యజించి ఆత్మేశ్వరుని శరణువేడటం అనేది ఆ పింగళ అనే వేశ్య దగ్గర నేర్చుకున్నాను. కష్టాలు-కష్టపెట్టేవారు కూడా నాకు గురువులే! వైరాగ్యమును నేర్చుకోవటానికి సహకరిస్తున్నారు కదా!**

## 18వ గురువు కురర పక్షి (లకుముకి పిట్ట)

ఒకానొక చోట ఒక లకుముకి పిట్ట ఒక సుందరవనంలో హాయిగా ప్రశాంతంగా ఆనందిస్తూ రోజులు గడపుతూ వుండేది. ఒక రోజు ఆ పిట్టకు మధురమైన మాంసాహారం ఒక గుట్టగా దొరికింది. **ఆహా! సాధ్యమైనంత అధికంగా నోట కరచుకొని గూటికి చేరి సంతానంతో - బంధు మిత్రులతో ఈ మాంసాహారాన్ని ఆస్వాదించెదను గాక!** - అని అనుకున్నది. పొడవైన ముక్కు నంతా కప్పివేయగల మాంసపు ముక్కలను నోటకరచుకొని బయల్వెడలింది. కొన్ని వేరైన పెద్ద పిట్టలు ఆ లకుముకి పిట్టను చూసి-ఈ ఆహారం దీని నుండి బలవంతంగానైనా లాగివేసి భుజిద్దాం-అని అనుకున్నాయి. వెంట బడి తమ ముక్కులతో ఆ పిట్టనుహింసించసాగాయి. ఇక ఆ లకుముకి పిట్ట ఆ తదితర

పిట్టల హింసలకు తుట్టుకోలేక పోయింది. ఏం చేయాలి? దానికి ఓ ఉపాయం తోచింది. వెంటనే ఒక బండరాయి పై వ్రాలింది. నోటనున్న మాంసపు ముక్కలను అక్కడ బండరాయిపై వదలి తుఱ్ఱున గాలిలోకి ఎగిరింది. అప్పుడు పిట్టను వెంటబడి బాధిస్తున్న తదితర పక్షులు ఆ పిట్టను హింసించటం ఆపాయి. వదలిన మాంసపు ముక్కలకై బండరాయివైపుగా పరుగులు తీశాయి.

చూసావా, యదు మహారాజా! ఆ లకుముకి పిట్ట యొక్క అనుభవానికి శిష్యుడనై ఒకానొక ముఖ్యమైన విశేషం నేర్చుకొని పాటించసాగాను.

**శ్లో॥ పరిగ్రహో హి దుఃఖాయ యద్వత్ ప్రియతమం నృణామ్**
**అనంతం సుఖమాప్నోతి తద్విద్వాన్ యస్తు అకించనః॥** (అధ్యా 9, శ్లో 1)

స్వయమానంద స్వరూపుడగు ఈ జీవుడు దుఃఖం పొందటానికి అసలు కారణం ఏమిటి? ఆసక్తియే సుమా! **ఈ ఈ వస్తువులు నాకు ప్రియాతి ప్రియములు అని మననం చేస్తూ క్రమంగా -తనకు తెలియకుండానే-సుఖ-దుఃఖ భావ పారవశ్యానికి లోను అవటం చేతనే!** ఇది ప్రియం ఇది అప్రియం అనే పరిమిత భావావేశములను, అల్ప ఆశయములను పరిత్యజించిన మరుక్షణం సర్వ దుఃఖాలు తమకు తామే తొలగిపోతాయి.

ఆ లకుమిక పిట్ట మాంసపు ముక్కను త్యజించినట్లు – **వీరు మాత్రమే నాకు చెందినవారు. నేను వీరికి మాత్రమే చెందిన వాడిని** – అనే హ్రస్వదృష్టులను త్యజించసాగాను.

క్రమక్రమంగా మానావమానములకు సంబంధించిన, బంధువుల-సంబంధీకుల, భార్య పుత్ర సంబంధమైన సర్వ చింతలను త్యజించసాగాను. నాది-నాకుండాలి-నాకే వుండాలి-నాకు చెందినవి సంరక్షించుకోవాలి.... ఇటువంటి లోభ-మోహాలు దూరంగా ఉండేటట్లు జాగ్రత్తపడుచున్నాను.

## 19వ గురువు - బాలుడు

ఒక బాలుడు అన్నీ మరచి ఆటలలో లీనమై కేరింతలు కొడతాడు చూచారా? అట్లాగే నేను ఆత్మసందర్శానందము అనే క్రీడా స్థలంలో బాలునివలె క్రీడోత్సాహంతో క్రీడించటం ప్రారంభించాను. ఈ జగత్తులో ఇద్దరు మాత్రమే చింతా రహితులై ఇదంతా ఆట స్థలంలాగా ఆస్వాదిస్తూ విహరిస్తున్నారు. పరమానందాన్ని అనుభవిస్తున్నారు.

**1. చిన్నపిల్లవాడు.** ఈతనికి సంపద ఆపదల గురించి ఏమీ తెలియదు కనుక, ఆశ భయం లేకుండా హాయిగా ఆటలలో లీనమై ఆనందిస్తున్నాడు, అయితే ఇది అజ్ఞానంతో

కూడిన నిశ్చేష్టత చేత! విషయాలేమీ ఇంకా తెలుసుకొని వుండకపోవడం చేత – లభిస్తున్న బాలానందమేగానీ అఖండానందం కాదు.

**2. గుణాతీతత్వం ఆశ్రయించిన జ్ఞాని.** ఈతనికి కనబడేదంతా ఆత్మయే! సత్య–నిత్య నిర్మల స్వస్వరూపాత్మయే జగత్తు రూపంగా ఇంద్రియములచే పొందబడుతోంది – అని గమనించి, ఆత్మసాక్షాత్కారం ఆస్వాదిస్తున్నాడు. కష్ట–సుఖాలు ఇత్యాదులన్నీ ఆతనికి జగత్ క్రీడా విశేషాలుగా అయి ఉంటాయి.

నేను గుణాతీతుడనై ఈ దృశ్యమును క్రీడగా ఆస్వాదిస్తూ బాలునిలా కేరింతలు కొట్టడం – లీనం కాకుండానే క్రీడగా వీక్షించడం అభ్యసించసాగాను.

## 20వ గురువు : కన్యక గాజుల గల గల త్యజించి ధాన్యం దంచటం

ఓ యదుమహారాజా! "నాకు ఈ బాధలు ఆ బాధలు ఉన్నాయి సుమా! నేనే ఎంతో కష్టపడుచున్నాను! నేను అంతటి వాడిని. వారేమో మంచివారు కాదు! వారందరూ లోపాలు గలవారే!" – ఇటువంటి మాటలు పరస్పరం రోజుల తరబడి చెప్పుకోవటం రజో తమో గుణాధిక్యత చేతనే!

ఇతరులతో ఏదో మన కష్టాలు చెప్పి, ఇతరుల తప్పుల గురించి మరొకరితో మాట్లాడి స్వాంతన పొందాలనుకోవటం ఆధ్యాత్మమార్గంలో ముందుకు అడుగు వేయలేక పోవటానికి స్వయంకృత దోషంగా కల్పించుకుంటున్న అవరోధాలు! నిరోధాలు!

తమోగుణంచేతనే – "నాకు వారి వలన వీరి వలన కష్టాలు వస్తున్నాయి. వారు ఇటువంటి వారు. వీరు అటువంటివారు" – అనే మాటలు మనస్సులోంచి వుబుకుతున్నాయి.

రజోగుణం చేతనో ఇదంతా నా కర్మ! పూర్వకర్మల దోషం! – అని అనిపిస్తూ వుంటుంది.

సత్వగుణంచేత, ఈ కష్టసుఖాలు పరమాత్మ నన్ను బాగు పరచటానికి ప్రసాదిస్తున్న పరీక్షావిధానాలు!–అని భావించబడుచున్నాయి. (These are all teachings but not teasing)

గుణాతీతునకో, – "ఇదంతా నాటకం! లీల! క్రీడ! స్వప్నం వంటిది! కథా శ్రవణం వంటిది!" – అనే అవగాహన పరిపుష్టిపొందుతూ వుంటుంది.

**ఇదంతా ఒక సందర్భములో ఒక కన్యక వడ్లుదంచుతూ ఆశ్రయించిన ఒక ఉపాయం నుండి నేర్చుకున్నాను.** ఆ కథా విశేషం చెప్పు చున్నాను. వినండి.

❑

కనకావతి అనే పురంలో పుణ్య కార్యములు - దాన గుణములు - పరోపకారము - మొ॥న ఉత్తమ గుణములచే లోక ప్రసిద్ధి - ప్రశంసలు పొందుచున్న ఒకానొక రైతుకుటుంబం వుండేది. వారి ఇంటిలో సుగుణాల రాసి, సౌందర్య రాసి అయిన ఒక కన్యక వుండేది. "ఒకసారి ఏమి జరిగిందంటే ..., ఆహాఁ! ఈమె మాయింటికి కోడలుగా వస్తే ఎంత బాగు! లక్ష్మీదేవి వేంచేసినట్లే!" అని అపరిసరాలలోని చాలా ధనికుడైన ఒకానొక ఉత్తమ కుటుంబీకుడు తలచాడు.

ఒకానొక రోజు.. కాబోయే వరుడు, అతని తల్లిదండ్రులు, తదితర బంధువులు ఆ కన్యను చూడటానికి పెళ్ళిచూపులకు వచ్చారు.

ఆ సమయానికి ఇంటి పెద్దలు వేరే పని మీద బయటకు వెళ్ళివున్నారు. వారంతా తిరిగి రావటానికి కొంచం సమయం పట్టేట్లుగా వున్నది. ఇంటిలో ఆ కన్యక మాత్రమే వున్నది. అభ్యాగతిః స్వయం విష్ణుంః అని పెద్దల భాష్యంకదా! వచ్చినవారికిక అతిథి మర్యాదలు చేయటం గృహస్థధర్మం. పైగా మగ పెళ్ళివారాయె! ఆమె సిగ్గుతో చిరునవ్వుతో వారందరిని అహ్వానించి అసనాలు సమకూర్చింది. అటు తరువాత వారికి ఆహార పానీయాలు సమకూర్చే ప్రయత్నాలు ప్రారంభించింది.

ఆ రైతు కుటుంబం సద్గుణములచే లోక ప్రసిద్ధమే అయినప్పటికీ ధన ధాన్య సంపదలతో తులతూగే కుటుంబమేమీ కాదు. ఇంటిలో అప్పుడు చూసుకుంటే అతిథులందరికీ భోజనము పెట్టగల బియ్యము ఉన్నట్లుగా లేదు. అందుచేత ఆకన్య కొట్టంలోంచి వడ్లు తెచ్చి అప్పటికప్పుడు వంట ఇంటిలో రోకలితో దంచటానికి ఉపక్రమించింది.

వడ్లు దంచటం ప్రారంభించగానే ఆమె రెండు చేతులకు నిండుగా గల  గాజులు బహు సుందరంగా గల గల శబ్దం చేయసాగాయి. వెంటనే ఆమె దంచటం ఒక్క క్షణం ఆపింది.

"అరెరే! ఈ నా గాజుల శబ్దం ఈ వచ్చిన మగపెళ్లివారికి - వారి బంధువులకు వినబడుతుందేమో? వినబడితే ఇప్పటికిప్పుడు నేను వడ్లు దంచుచున్నానని వారికి తెలిసిపోతుంది. అనగా, ఈ ఇంటిలో బియ్యం సమృద్ధిగా వుండవని, మేము పేద వారిమని, పనివారు ఎవ్వరూ లేరని, నేనే వడ్లు దంచుచున్నానని వారు అభిప్రాయ పడతారు. కుటుంబంలోని కష్టసుఖాలు ఇతరులకు తెలియటం ఉచితం కాదు కదా! అది ఇంటి పరువుకు శోభకాదు. అట్లా అని, బియ్యం దంచకపోతే, మా ఇంటిపెద్దలు వచ్చిన తరువాత బియ్యము కొరకై బయటకు వెళ్ళటంకూడా మర్యాదకానే కాదు. అతిథుల ముందు ఆహార సామాగ్రి తేవటం గౌరవప్రదం కాదు. మరిప్పుడు ఏమి చేయాలి?..

ఇట్లా యోచిస్తూ చేతి గాజులను చూచుకుంటూ ఉన్నది. ఇంతలో తెలివిగలది సౌభాగ్యవతి అగు ఆ కన్యకు ఒక ఉపాయం తళుక్కున తోచింది. వెంటనే **ఈ చేతికి ఆ చేతికి రెండు రెండు గాజులు మాత్రమే వుంచి, మిగతాగాజులన్నీ తీసి ప్రక్కన పెట్టి ఇక నెమ్మదిగా వడ్లు దంచసాగింది**. ఈ ఇంటి కన్యకయే వడ్లు దంచుతోంది– అనే విషయం చావడిలో ఆసీనులైన పెళ్ళికొడుకు వైపు బంధువులకు తెలిసే అవకాశం లేకుండా చేసింది. అయితే...

అప్పుడు ఆమె ధాన్యం దంచుతూ వుంటే రెండు – రెండు గాజుల శబ్దం మాత్రమే వెలువడసాగింది. **ఈ మాత్రం గాజుల శబ్దం కూడా ఉచితం కాదు. ఇంటి గుట్టు రచ్చకు ఎందుకు ఎక్కాలి?** అని తలచి ఆ కన్యక ఒక్కొక్క గాజును కూడా తీసి వేసింది. అప్పుడు ఈ చేతికి ఆ చేతికి ఒక్కొక్క గాజు మాత్రమే మిగిలివున్నది. అసలు గాజుల శబ్దమే కావటంలేదు.

---

ఓ యదుమహారాజా! జనుల ఆచార వ్యవహారాలు పరిశీలించే నిమిత్తం అనేక ప్రదేశాలు సంచారం చేస్తూ దైవికంగా ఆ పురం వెళ్ళిన నేను ఈ సంఘటనను స్వయంగా గమనించాను.

అనేక మంది జనులు వున్నచోట అసంగతమైన సంభాషణ – అనుచితమైన అభిప్రాయాలు దోష నిర్ణయాలు, ఆవేశకావేశాలు, కలహాలు, తప్పొప్పుల మననములు జరుగుతూనే వుంటుందిగాని, శాశ్వత శ్రేయష్షు గురించి తగినంత యోచన జరగటం చాలాసార్లు జరుగదు. ఇద్దరు ఉన్నచోట కూడా ఎక్కువగా లోక విషయాలు, లౌకిక సంఘటనలే చర్చకు వస్తూ వుంటాయి.

అందుచేత కన్యకచేతి ఒకగాజువలె **ఒంటరిగా అవకాశమున్నంతకాలం సంచరించటం, ఏకాంతంగా ఆధ్యాత్మికమైన యోచనలు చేయటం** జీవునకు శుభప్రదం!. – అనే పాఠము నేనుర్చుకున్నాను.

ఆ కన్యక ఒకే గాజుతో ధాన్యాన్ని దంచినట్లుగా ఏకాంతంగా ఈ జగత్తును పాఠ్యాంశాలవలె దర్శిస్తూ – **నేర్చుకోవలసినది నేర్చుకోవాలి. విడువవలసిన లౌకిక భావావేశాలు, అభిలాషలు త్యజించి వుండాలి**. అతీతుడనై వుండాలి – అని మరల మరల గుర్తు చేసుకోసాగాను!.

# 21వ గురువు: బాణము తయారు చేసేవాడు

మనస్సును ఏకాగ్రం చేయాలి. అందుకుగాను మనస్సును ఒకే లక్ష్యం వైపుగా అధికాధిక కాలం నియమించాలి. అప్పుడుగాని, ఈ మనస్సు దృశ్యస్వభావమును అధిగమించి సర్వాతీతమగు నిర్మలద్రష్ట (ఆత్మ) యొక్క దర్శనమునకు సిద్ధపడజాలదు. అట్టి ఏకాగ్రత ఈ మనస్సుకు లభ్యపడేది ఎట్లా? అందుకు ఉపాయాలుగా మహనీయులగు జ్ఞాన కోవిదులు శాస్త్రముల ద్వారా ప్రాణాయాయము, ఆసనము, ధ్యానము, తపస్సు, పూజ, ఇష్టదైవస్తోత్రం ఇత్యాది ఉపాయాలు అందిస్తున్నారు. జాగరూకతతో తదితర-లోక సంబంధమైన ఆలోచనలు కట్టిబెట్టి ప్రాణాయామాది సాధనలు నిర్వర్తించాలి. అనేకాగ్రత (Multy priority)వలననే జీవుడు **దృశ్యమునకు ద్రష్టకు పరము** అగు ఆత్మభావనను ఆశ్రయించలేక పోవుచున్నాడు.

ఈ విషయంలో నాకు గొప్ప సూచనగా లభించటానికి కారణమైన ఒక సంఘటనను నీకు చెప్పుచున్నాను. విను.

అతి నిపుణుడైన, ఇనుముతో పరికరములు తయారు చేయగల ఒకానొక కంసాలి వుండేవాడు. ఆ దేశపురాజు ఆతని పనితనం గురించి విని అతనిని పదునైన బాణములు తయారుజేసే ఉద్యోగంలో నియమించాడు. ఒకానొకరోజు... మహారాజు గారు సేనా సమేతంగా వ్యాహ్యాళికై వెళ్ళుచూ, ఆ కంసాలి ఇంటి ముంగిట ఆగి, ఆ పరిసరాలను ఆస్వాదిస్తూ ఉన్నాడు. ఆ రాజు నిలబడినచోటికి అతి సమీపంలో కంసాలి పదునైన నిడుపైన బాణమును తయారు చేస్తూ ఏకాగ్రతతో బాణపు కొనకు పదును పెట్టుచున్నాడు. మహారాజు ఆతనిని గమనిస్తూ చూస్తు అతి సమీపంగా నిలబడ్డాఋ. పేరుపెట్టి పిలిచారు. కానీ, ఆ కంసాలి మాత్రం ఎటూ చూడక, పదునుపెట్టే పనిలో లీనమై యున్నాడు. ప్రక్కనే వచ్చి మహారాజు నిలబడినప్పటికీ ఏ మాత్రం గమనించకుండా, పరిసరాలను మరచి బాణపుకొసకు పదును పెట్టటం ఏకాగ్రతతో కొనసాగించసాగాడు.

అదంతా ఆ బాటన వెళ్లుచూ నేను గమనించాను. అప్పుడు అనుకున్నాను.

ఆహా! ఏమి ఈ కంసాలి యొక్క ఏకాగ్రత! పరిసరాలన్నీమరచి బాణముకొసకు పదును పెట్టే ప్రయత్నంలో మనసంతా సంపూర్ణంగా నియమించటం చేత అతడు తన మహారాజు యొక్క రాకను కూడా గమనించటం లేదే! నేను కూడా బాహ్యా - అభ్యంతరములను మరచి, **సర్వాత్మకుడు సర్వతత్త్వ స్వరూపుడు అగు ఈశ్వరునియందు దృష్టినంతా ఏకాగ్ర పరచటము అభ్యసించెదనుగాక!** - అనే నిర్ణయం చేసుకొనసాగాను!.

# 22వ గురువు - పాము

పాము ఒంటరిగా సంచరిస్తూ రోజులు గడుపుతూ వుంటుంది. ఒక ఇల్లు కట్టుకొని - ఇక్కడే వుంటాను- అనే నియమం దానికిలేదు. పరిసరముల పట్ల మమకారం కలిగి వుండదు. ఎప్పుడు ఏ ఆహారం పొందితో అదే ప్రేమగా ఆస్వాదిస్తుంది. ఎక్కడ చోటు దొరికే అక్కడ చుట్టలు చుట్టుకొని ఏ కాంతంగా రోజులు రోజులు గడిపివేస్తుంది. **ఎక్కడికో వెళ్ళాలి. అప్పుడుగాని సాధనకుదరదు. అప్పుడుగాని హాయి లేదు. ఇదికాదు మరొక ఆశ్రమం. ఇక్కడ ఇక ఎక్కువ కాలం నాకు ఇష్టంలేదు** - అని భావిస్తూ ఈ మానవుడు వర్తమానంలో ఆత్మతత్త్వ జ్ఞాన సముపార్జనకు యోచించకుండా కాలమంతా బుగ్గిపాలు చేసుకుంటున్నాడు.

పాము తన కొరకు తానుగా ఇల్లు కట్టుకోదు. పరుల ఇళ్ళలో (అనగా) చీమలు నిర్మించిన పుట్టలలో జీవితకాలం గడిపివేస్తుంది.

**శ్లో॥ గృహారంభో హి దుఃఖాయ, విఫలశ్చ అధ్రువాత్మనః**
**సర్పః పరకృతం వేశ్మ ప్రవిశ్య సుఖమేధ తే॥ (అధ్యా 9, శ్లో 15)**

అనిత్యము అల్పఫల ప్రదాతయగు ఈ శరీరమును ఏదో దీర్ఘకాలం కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో గొప్ప ప్రదేశంలో గొప్ప గొప్ప గృహాలు కావాలని అభిలషించటం అల్పప్రయోజన విషయమే! ఈ విశేషం చీమలు నిర్మించిన పుట్టలో తలదాచుకొని తనకంటూ ఏ గృహము కలిగి వుండని పామును గమనించి నేను నేర్చుకున్నాను.

ఈ కనబడేదంతా మాయాజాగత్తు. కేవలం దైవ కల్పితం. **ఇందులో నాకు ఇళ్ళు లేవు. సంపదలు లేవు** - అని అనుకుంటూ ఉసూరుమనటం అర్థంలేని వ్యర్థమైనపని!.

ఈ జగత్తుకు ఈశ్వరుడు, సర్వజన అంతర్యామి సర్వతత్త్వ స్వరూపుడు, అందరికి ఆరాధ్యుడు అగు నారాయణుడొక్కడే! ఆయన తన మాయా చమత్కారంతో ఈ జగత్తును ఒకానొకప్పుడు సంకల్ప చమత్కారంగా నిర్మిస్తున్నాడు. మరొకప్పుడు కాల స్వరూపుడై హరిస్తున్నాడు. తన అంశరూపంతో జీవుడు అనునది కల్పించుకుంటున్నాడు. ద్రష్ట అయి ఆస్వాదిస్తూ, ఎప్పుడో తనయందు ఇదంతా లయింపజేసుకుంటున్నాడు. ఆ నారాయణుడే సర్వజీవాత్మలకు ఆధారుడు! ఈ సర్వమునకు మూలకారణుడు! అందరియొక్క అంతరాత్మ!

సర్వము తానే అయి, దృశ్య రూపంగా ఆవిర్భవించి తానే ఆస్వాదిస్తున్న శ్రీమన్నారాయణునికి తన–మన – తనవారు – కాని వారు – ఏకము–ద్విత్వముల అనేకము – అనబడే భేదమంతా ఎక్కడున్నది? లేనే లేదు. ఆతడే జన్మలకు కర్మలకు మునుముందే వెలుగొందుచున్న సనాతన పురుషుడు.

ఆత్మయే ఆ నారాయణుని స్వరూపం! నేను – నీవు – వారు – వీరు... అంతా నారాయణ స్వరూపమే!

ఆత్మానుభవ స్వరూపమగు కాలముచే సత్వ–రజ–తమో గుణ సంపద ఒకానొకప్పుడు సామ్యం పొందినపుడు పురుషుడు – (Experiencer) ప్రకృతి (Experiences) లను పరమపురుషుడు తనయందు లయం చేసుకొంటున్నాడు. ఆ పరమ పురుషుడే నారాయణుడు! సనాతన పురుషుడు! నిరుపాధికుడు! తానే సర్వమునకు ఆధారమై – తనకు "ఉపాధి–ఆధారము" యొక్క ఆవస్యకతయే లేనట్టి **సత్ స్వరూపుడు! కేవలానుభవ ఆనందస్వరూపుడు!** కైవల్యము అనే సంజ్ఞచే చెప్పబడువాడు. నారాయణుడే ఈ సర్వమునకు బాహ్య–అభ్యంతర స్వరూపము.

ఆ సనాతనపురుషుడొక్కడే సర్వ జగత్ సంజ్ఞారూపంగా విరాజిల్లుచున్నాడు! అతడే సదా ఆవరణుడు! నిరావరణుడు! పరము! పరమాత్మ! ఈ జగత్ అనే అనుభవమునకు ఆవల ఉన్న – జీవులందరియొక్క స్వస్వరూపమే – నారాయణుడు! పరాత్ పరుడు – అని విజ్ఞులచే దర్శింబడుచున్నాడు! కీర్తించబడుచున్నాడు. నేను నారాయణ స్వరూపుడను **ఆయనయే నా గృహం**. ఇక ఈ భౌతిక దేహమంటారా, ఇది ఎక్కడో అక్కడ కొన్నాళ్ళు భూమిపై గడుపునుగాక! మరెప్పుడో – తనదారి తాను చూచుకొనును గాక!

## 23వ గురువు - సాలెపురుగు

ఓ శత్రుమర్ధనా! యదుమహారాజా!

కేవలం ఆత్మానంద స్వరూపుడు – నిర్గుణుడు – నిరాలంబుడు – మనందరి వాస్తవ స్వస్వరూపుడు అగు ఆ నారాయణుడు అనుభవము (Experiencing) అనే ఒకానొక చమత్కార సంజ్ఞను అకారణంగానే స్వీకరిస్తున్నారు.

అట్టి ఆత్మానుభవ విశేషం చేత స్వమాయచే త్రిగుణాత్మకంగా (సత్త్వ – రజః – తమోగుణ రూపంగా) ఈ కనబడే సర్వముగా ప్రదర్శించుచున్నారు.

తనయొక్క త్రిగుణాత్మకమగు మాయను సంక్షోభింపజేసి మహత్తత్త్వమును ఒక లీలగా (As a play) క్రీడగా (As a sport) వినోదంగా సృజించుచున్నారు. అట్టి త్రిగుణ స్వరూపమగు మహత్ తత్త్వము నుండి ఈ విశ్వములను ప్రకటించుచున్నారు. (Manifesting the Universe)

❑

ఒకడు వినోదం కోసం ఒక కథ చదువుచూ (లేక) వింటూ, ఆ కథలోని సంఘటనలతో, పాత్రలతో కల్పిత గుణ విశేషములతో తన్మయం పొంది సుఖము – దుఃఖము – ఆశ్చర్యము – ఆనందము – భయము – ఆవేదన – జిజ్ఞాస (Comfort - Discomfort - surprise - Pleasure - Fear - Lamentation - Inquistiveness) ఇత్యాది పొందుతాడు చూచావా! అట్లాగే... ఈ దృశ్యము కూడా!

ఈ దృశ్య వ్యవహారమంతా ఎక్కడి నుండి వచ్చింది? దృశ్యాతీతుడు – జీవజగత్ అతీతుడు అగు నారాయణుడే సృష్టికాలంలో జీవుడు అనే ద్రష్టరూప – అంశను కల్పించుకొని దృశ్యము అనే చమత్కారమును కూడా రచించుకొని రసాస్వాదనను నిర్వర్తిస్తున్నారు. మరొకప్పుడు కాలము అనే మరొక అంశచే ఈ దృశ్యమును తనయందు ఉపశమింపజేసుకుంటున్నారు. ప్రతి జీవుని యొక్క వాస్తవస్వరూపము ఆ నారాయణుడే! ఆయనయే జీవాత్మలకు ఆధారుడు, ఆశ్రయుడు! ఆయన ఒక్కటిగానే ఉన్నారు! రెండు గాను, అనేకంగాను, అసంఖ్యాకంగాను కనిపిస్తున్నది కూడా ఆయనే! అంతటా – అన్నింటా – అన్నీగా కనిపిస్తున్నది ఆయనయే! ఇక ఆయనకు తన – పర భేదం ఎక్కడుంటుంది? ఆయనకు సజాతీయ – విజాతీయ భేదం లేనేలేదు!. కల కనేవానికి తన కలలో కనిపించినవారిలో అయినవారెవ్వరు? కానివారెవ్వరు? కలంతాకూడా ఆ స్వప్నదర్శియొక్క స్వయంకృత కల్పనా విశేషమేగా? కల కనేవానికి తన కలలో కనిపించే ప్రియమైనవారు–ప్రియం కానివారు – ఇరువురు స్వకీయ కల్పనా వినోద విశేషాలే కదా!

కాలము అనునది కూడా నారాయణుని యొక్క ఆత్మానుభవ స్వరూప చమత్కారమే!

అట్టి కాలముచే ఒకానొకప్పుడు సత్త్వము మొదలైన శక్తులన్నీ సామ్యత్వం సంతరించు కుంటున్నాయి.

అప్పుడు సనాతన పురుపురుడగు నారాయణుడు ఒక్కడే శేషించుచు విరాజిల్లుచున్నాడు. ఆతని నుండి బయల్వెడలిన బ్రహ్మదేవుడు (సృష్టికర్త) - జీవుడు (సృష్టించబడినవాడు) మొదలైనవన్నీ ఆయన యందు లయిస్తున్నాయి. ఆయనయే సర్వ జీవులకు ఆశ్రయయోగ్యుడు! ఆయన ఉపాధి రహితుడు! పరమానందరూపుడు! ఆయన యొక్క స్వానుభవమే కైవల్యము!. నేను "ఓం" సంజ్ఞాస్వరూపుడనగు నారాయణడనే... అనునదే నిత్య సత్యము.

---

**యదుమహారాజు:** ఓ సాధూ! అవధూతా! ఈ కనబడే దృశ్యమంతా ఏరీతిగా ఎవరిచే ఏర్పడుతోంది? మరింతగా వివరించండి!

**అవధూత:** ఈ జగత్తుగా కనిపించేదంతా ప్రతి జీవుని స్వస్వరూపమగు శ్రీమన్నారాయణుడే! ఆయనయే అకారణంగా కల్పనామాత్రంగా, పిల్లలకు కల్పించిచెప్పే కథలాగా, ఒక వినోదంగా తనయందు తానే తనకు అద్వితీయంగా సృష్టి అనే చమత్కారమునకు ఉపక్రమిస్తున్నారు. అట్టి సృష్టి అనే కారణంగా మొట్ట మొదట కాలము అనే కార్యము జనిస్తోంది. అట్టి కాలము అనే అనిర్దేశ్యము - అభౌతికము (Non Definable, Non-material) నుండి (కాలచమత్కారంచేత) ఆత్మయొక్క స్వకీయ ప్రభావ రూపములగు **సత్వము - రజము - తమము** అనే త్రిగుణాలు బయల్వెడలుచున్నాయి. ఆ త్రిగుణములనుండి ప్రదర్శన రూపమగు కార్య- కారణ - కర్తృత్వ భేదరూపంతో కూడుకొనిన క్రియాశక్తి వెలువడుతోంది. అట్టి క్రియా శక్తి యొక్క చమత్కారంగా మహత్తత్వము (Multiplicity) ప్రదర్శితమౌతోంది. అట్టి మహత్తత్వము త్రిగుణములచే జనింప బడుచున్నది!... అని చెప్పబడుతోంది.

ఆ మహత్తత్వము చేతనే జీవుడు-ఆ జీవుని ఊహానుభవజనితమగు జగత్తు (Experiencer and Visualization of Experiences) బయల్వెడలుచున్నాయి. **జీవుడు - అనుభూతి** అనే జంటకవులగానమే ఈ అనేక విశ్వముల చమత్కారం! ఇదంతా ఒక వ్యక్తి యొక్క అనేక వేరు - వేరు స్వప్నపరంపరా సందర్శనముల వంటిదే!. ఈ విధంగా ఆత్మనుండే ఈ విశ్వములు (Flock of Universe from one's own self) బయల్వెడలుచున్నాయి. అనే శాస్త్ర పాఠ్యాంశాన్ని నేను సాలెపురుగును చూసి ఆరాధ పరచుకున్నాను.

సాలెపురుగు తన హృదయము నుండి ముఖము ద్వారా దారమును వ్యాపింపజేస్తోంది.

ఆ దారములో తానే విహారాలు చేస్తోంది. అట్లాగే పరమాత్మ స్వకీయ కల్పనచే జీవాత్మలు అనే దారములను విస్తరింపజేసుకొని వాటియందు విహరిస్తున్నారు. ఈ విశ్వము పరమాత్మచే సృష్టించబడి, పరమాత్మ యొక్క స్వప్నాంతర్గత ద్రష్ట వంటి జీవాత్మచే అనుభవించబడుతోంది.

మరొకప్పుడు పరమాత్మ యొక్క అంశమగు ఈ జీవాత్మ (Expriencer) తాను అనుభవ రూపంగా పొందుచున్న విశ్వముతో సహా పరమాత్మ యందు లయస్తున్నాడు – తరంగం జలంలో లయిస్తున్నట్లుగా! అయితే తరంగము జలము కానిదెప్పుడు? ఈ జీవుడు పరమాత్మస్వరూపుడు కానిదెప్పుడు? ఎప్పుడూ లేదు!

జీవాత్మయే ఈ దేహము యొక్క ధారణచే దేహి అయివుంటున్నాడు.

## 24వ గురువు – భ్రమర కీటకము

**శ్లో॥ యత్రయత్ర మనో దేహీ ధారయేత్ సకలం ధియా**
**స్నేహాత్ – ద్వేషాత్ – భయాత్వాపి యాతి తత్తత్ స్వరూపతామ్॥** (అధ్యా 9, శ్లో 22)

ఈ దేహి మనన రూపమగు మనస్సుచే దేని దేని పట్ల ఎక్కడెక్కడ స్నేహము – ద్వేషము –భయము – రూపంగా ఏకాగ్రతను లగ్నం చేస్తాడో (where ever the Holder /User of body applies concentration by virtue of friendship, envy or fear ....) అక్కడక్కడ ఆయా సంబంధమైన వస్తు విషయ రూపంగా పరిణమిస్తూ, ప్రదర్శితమగుచూ వుంటాడు.

**ఈ విషయం నేను భ్రమర కీటక న్యాయం అనే సంఘటన నుండి నేర్చుకున్నాను.**

ఒక గండు తుమ్మెద ఒక కీటకమును తెచ్చి తనున్న ప్రదేశంలో వుంచుతుంది. ఆపై ఆ తుమ్మెద ఝుమ్ – ఝుమ్ అంటూ పెద్ద శబ్దములు చేస్తూ ఆ కీటకము చుట్టూ తిరగటం ప్రారంభించుతుంది.

ఆ కీటకం (చిన్నపురుగు) ఆ శబ్దం వింటూ **ఈ తుమ్మెద నన్ను మ్రింగుతుందేమో? చాచికొడుతుందేమో?** అని భయపడుతూ వణకసాగుతుంది. దృష్టినంతా తుమ్మెద యొక్క కదలికల వైపు లగ్నం చేయసాగుతుంది. అనుక్షణం ఆ తుమ్మెద గురించే భయముతో అతి తీవ్రంగా యోచిస్తూ నవనాడులను ఏకాగ్రం చేసి దృష్టంతా తుమ్మెదపై నిలుపుతుంది.

**శ్లో॥ కీటః పేశస్కృతం ధ్యాయన్ కుడ్యాం తేన ప్రవేశితః**
**యాతి తత్సాఽఽత్మతాం, రాజన్! పూర్వ రూపం అసంత్యజన్॥** (అధ్యా 9, శ్లో 23)

ఆ చిన్న పురుగు ఈ తుమ్మెద ఎప్పుడు నన్ను మ్రింగుతుందో, ఏమో? - అని క్షణ క్షణం గండు తుమ్మెదపై ఏకాగ్రంగా దృష్టి నిలుపుతుంది కదా!. క్రమక్రమంగా ఒకానొక చమత్కారం జరుగుతోంది. ఆ చిన్న కీటకం తన పూర్వ శరీరం త్యజించకుండానే క్రమక్రమంగా అద్దాని శరీరం వ్యాకోచం పొంది ఆ చిన్న పురుగు కాస్తా గండు తుమ్మెదగా మారిపోతోంది. ఇది ఒక ప్రకృతి చమత్కారం!.

ఆ కీటకం గండు తుమ్మెదపై భయంతో దృష్టిని - శ్రద్ధను కేంద్రీకరించినట్లుగా నేను మహనీయులగు గురువుల వద్ద శ్రద్ధ - భయ - భక్తులతో ధ్యాసను బుద్ధిని ఏకాగ్ర పరచటం కొనసాగించసాగాను. వారిచే సుశిక్షితుడనై ఆ మహనీయులవలెనే సంస్కరించబడిన నిర్మల - సునిశిత బుద్ధిని పొందసాగాను. అంతేగాని అల్పదృష్టి-ధ్యాసల గురించి, అట్టివారి గురించి మననమే చేయటం లేదు. తద్వారా అల్పత్వం వచ్చిపడుతుందని గమనించాను కనుక!

---

ఓ యదు మహారాజా! ఈ విధంగా 24 మంది గురువుల దగ్గర కొన్ని తాత్త్వికమైన సూక్ష్మరహస్యాలను గ్రహించాను. అందుచేతనే ఈ దృశ్యప్రపంచాన్ని, ఈ దృశ్య ప్రపంచంలో కదలించబడుతూ కనిపించే ఈ భౌతికదేహాన్ని, ఇక్కడి ప్రకృతి యొక్క సంపదలగు మనో- బుద్ధి-చిత్త- అహంకారాలను నాకు వేరుగా చూస్తూ **స్వాత్మాణి పరమేశ్వరః** అను ఆత్మజ్ఞానానందాన్ని పెంపొందించుకుంటూ పరిపుష్టిచేసు కొంటున్నాను.

**యదుమహారాజు :** ఓ యతీశ్వరా! ఈ దేహమే దేహికి ఐహిక మోహం కదా! దేహ బద్ధునికి సంసారం (illusionary perecptual blocade) తొలగదు కదా?

**అవదూత:** ఓ యదు మహారాజా! ఈ దేహము ముఖ్య వేదాంత శాస్త్ర సిద్ధాంతాలను అవగతం చేసే దృష్టాంతగరువు సుమా! ఇది కూడా నాకు గురువే!

**శ్లో॥ దేహో గురుః మమ, విరక్తి - వివేక హేతుః**
**బిభ్రత్ స్మ సత్త్వ నిధనం సతతార్త్యుదర్కమ్!**
**తత్త్వ - అన్యనేన విమృశామి యథా తథాపి**
**పారక్యమిత్యవసితో విచరామ్యసంగః॥** **(అధ్యా 9, శ్లో 25)**

ఈ దేహమే గురువుగా భావించి కొన్ని విశేషాలు నేర్చుకుంటున్నాను! ఇది ఎటువంటిది? దీనికి ఉత్పత్తి పరిణామము ఉన్నట్లే వినాశనము కూడా వున్నది. ఇది సుఖంగా పైకి కాసేపు అనిపించినా దీనిలో ఎన్నో దుఃఖ పరిణామాలు – బాధలు అనుక్షణికంగా కట్ట కట్టుకొని వేచివున్నాయి. ఎప్పుడో – ఏ క్షణంలోనో నేలకూలి చెప్పాపెట్టకుండా వచ్చినట్లే – చెప్పాపెట్టకుండా నేలకూలనున్నది. ఎప్పుడు నక్కలకు – కుక్కలకు ఆహారం అవుతానా! – అని ఎగిరెగిరి పడుతోంది. అయితేఏం? ఇదినాకు వైరాగ్యమును వివేకమును ప్రసాదించగల గురువు సుమా! నాశన శీలమగుటచే దీనిపై ఆసక్తి వదలి, గురువుగా భావించి తత్త్వానుసంధానము కలిగే వరకు అవసరమైనంత మాత్రమే సంబంధం పెట్టుకొనుచున్నాను. తత్త్వ విచారణకై ఈ శరీరం గొప్ప ఉపకరణం కదా!.

ఆహా! ఈ జీవుడు ఈ భౌతికదైహాన్ని సంతోషపెట్టాలనే ఉద్దేశ్యంతో చాలా చాలా కష్టపడి ధనమును కూడబెట్టుచున్నాడే! భార్య – పుత్రులు – మిత్రులు పశువులు – సేవకులు – ఇళ్ళు – ఆత్మీయులు ఇటువంటి సంపదలను పెంపొందించుకుంటూ నానాహైరానా పడుచున్నాడే! సరే! ఇంత శ్రమపడి ప్రోగు చేసినదంతా ఏమి కానున్నది? ఈ శరీరానికి ఆయుర్దాయం అనేది ఒకటి వున్నది కదా! ఆయర్దాయం పూర్తికాగానే ఈ శరీరం నశించి గుప్పెడు బూడిదగా మిగిలిపోబోతోందే!

చెట్టు కొన్ని బీజములను జనింపచేసి భవిష్యత్తులో మరికొన్ని వృక్షములకు బీజభూతమై తాను నశిస్తోంది చూచావా? అట్లాగే ఈ దేహం కూడా మరికొన్ని దేహోత్పత్తులకు కారణమై తాను ఎప్పుడో నామరూపాలు లేకుండా నశించిపోతోంది!

ఇది ఇట్లా వుండగా.....,

ఒక గృహస్తు వున్నాడు. ఆయనకు అనేక మంది భార్యలు. వాళ్ళంతా ఆ గృహస్తుని ఎవరికివారే తమ వైపుగా తీవ్రంగా లాక్కుంటూ వుంటే... ఆ ఇంటాయనయొక్క బాధలు వర్ణనాతీతం కదా!

అట్లాగే, ఈ దేహమును ధరించిన దేహిని నాలుక ఒక వైపుకు లాగుతూ వుంటుంది. (రుచికై). మరొకవైపుకు చర్మము స్పర్శకై, పొట్ట ఆకలి వైపుగా.., చెవులేమో ... శబ్దము దిక్కుగా, ముక్కు..... సువాసనల కొరకు, కళ్ళు .... రూపముల మార్గంలో, ఈ విధంగా దేహముపై అభిమానము పెంచుకొన్న జీవుని ఒక్కొక్క ఇంద్రియం ఒక్కొక్క

వైపుగా బలవంతంగా లాగుతూ వుంటోంది. ఈ జీవుడు (లేక దేహి) ఆపై అసంఖ్యాక విషయములలోపడి దారి - తెన్ను లేక అవిశిపోతున్నాడు.

అదంతా ఒకవైపు! ఇక మరొకవైపు!

ఆహా! వాస్తవానికి ఈ మనుజ దేహం ఎంతటి అవకాశం! మానవదేహం చిన్న సందర్భం కాదు! గొప్ప అవకాశం పొందిన ఈ జీవుడు ఈ మానవదేహాన్ని గొప్ప ఉపకరణంగా ఉపయోగించుకోవాలిసింది పోయి, వీటిలోని ఒక్కొక్క ఇంద్రియానికి దాసానుదాసుడై విషయములచే బుద్ధుడు అవటమా? ఎంతటి హాస్యం! చదువుకునేందుకు బడికి వెళ్ళి అల్లరి-చిల్లరి పనులు మాత్రమే నేర్చుకొని రావటంవంటిదే గదా అది!

**శ్లో॥ సృష్ట్వా పురాణి వివిధాని అజయాఽఽత్మశక్త్యా**
**వృక్షాన్ - సరీసృపపశూన్ ఖగదందశూకాన్**
**తైస్తైరతుష్ట హృదయః పురుషం విధాయ**
**బ్రహ్మావలోకధిషణం ముదమాప దేవః!** **(అధ్యా 9, శ్లో 28)**

ఆ పరమాత్మ యగు బ్రహ్మదేవుడు తన యొక్క అజేయమగు ఆత్మశక్తిచే మాయారచనాచమత్కారంగా వృక్షాలను, నదీ-తటాకాలను, జంతువులను పక్షులను సృష్టించారు. అయితే - "నా సృష్టిలో ఏదో అసంపూర్ణత్వం ఇంకా కొనసాగుతూనే ఉన్నది!".- అని అనుకున్నారు. తృప్తి కలుగలేదు. అప్పుడు **బ్రహ్మసాక్షాత్కారము సముపార్జించే యోగ్యత గల బుద్ధితో కూడుకొనియున్న మానవులను సృష్టించారు**. అప్పటికి గాని ఆయనకు సృష్టి అనే చమత్కారము యొక్క ఆనందం కలుగలేదు!. అనేక జన్మల తరువాత మహత్తరమైన మానవ జన్మ ఈ జీవునికి గొప్ప అవకాశంగా లభిస్తోంది. ఇది అనిర్దేశ్యకాలబద్ధమైన అవకాశం (It is an unknown time bound opportunity). ఇక ఈ దృశ్యము పట్ల గల **అవేశము** అను రూపమగు **సంసారము** విషయమందామా? ఇక్కడి అర్థ - నారీ - బంధు- పేరు ప్రతిష్ఠ ఇత్యాది సంపదలు అనిత్యం. ఎల్లవేళలా మృత్యువు అనే సంఘటన ఈ దేహమును వెంటనంటియే ఉంటోంది. బుద్ధి గల వాడెవ్వడూ ఇక్కడి అర్థ సంపదను నమ్ముకొని కాలం వ్యర్థం చేసుకోడు. మృత్యువు వచ్చి తలుపు తట్టకముందే నిఃశ్రేయమగు ఆత్మజ్ఞానానందమును పరిపుష్టపరచుకొని ఉంటాడు. **ఈ జీవాత్మలక్షణములకంటే విలక్షణము, జీవాత్మకు**

**కేవల సాక్షి యగు పరమాత్మయే నా వాస్తవ స్వరూపము - స్వభావము కూడా!**. అనే అవగాహనతో కూడిన బుద్ధిని నిర్దుష్టపరచుకొంటాడు. బుద్ధిని నిర్మలం చేయగల సాధనలను పరిపూర్తిచేసుకొని వుంటాడు.

ఇక శబ్దము - స్పర్శ - రూపము - రసము - గంధము - ఇటువంటి విషయ సుఖముల గురించి చెప్పుకోవలసి వస్తే...

**నిః శ్రేయసాయ విషయః ఖలు సర్వతః స్యాత్** **(అధ్యా 9, శ్లో 29)**

విషయ సుఖాలు కుక్కలు - నక్కలు - మేకలు - పక్షులు - కీటకములు మొదలైనవి కూడా అనుభవిస్తూనే వున్నాయి. అందుకొరకై అతిదుర్లభమైన మానవ జన్మను ఖర్చు చేసుకోవలసిన అవసరం వున్నదా? ఏ మున్నది?

❑

ఓ యదుమహారాజా! ఈ విధంగా అనేక మందిని - సందర్భములను సంఘటనలను శిష్య భావంతో గురోపాసన చేశాను. గురియే గురువు - గురుతే గురువు కదా! నాలో జనించిన వైరాగ్యాన్ని ఆయా పాఠ్యాంశాలతో పరిపోషించుకొంటున్నాను. విజ్ఞాన దృష్టితో ఆత్మావలోకనం చేస్తూ సంగరహితుడనై వ్యష్టి అహంకారాన్ని త్యజిస్తూ ఈ భూమిపై వ్యాహ్యాళిగా సంచరించే ప్రయత్నం చేస్తున్నాను.. బుద్ధిని ఆత్మయందు నిలిపి **ద్రష్ట - దృశ్యములు నా యొక్క చమత్కారమైన అంశలే** అనే అవగాహనను సుస్థిరం చేసుకుంటూ వున్నాను. (మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః)

**నేను బ్రహ్మమే! బ్రహ్మమే జగత్తుగా ప్రదర్శితమౌతోంది!**. అని అనేక మంది మహర్షిత్వము అవధరించిన గురువులు ఎలుగెత్తి గానం చేస్తున్నారు. వివిధ వర్ణనలతో - పాఠ్యాంశాలతో మనందరికీ బోధిస్తున్నారు. అయితే నా ఉద్దేశ్యంలో ఒక్క వ్యక్తి మాత్రమే గురువు - అనేది పరిమితమైన అవగాహన ! సుస్థిరమైన నిశ్చలమైన బ్రహ్మీదృష్టికి జీవితమే గురువు! జీవితంలో సందర్భాలన్నీ గురువులే! అనేక సంఘటనలు గురువులతో సమానమే!. **గురువు-సద్గురువుల ఉద్దేశ్యముకూడా అదేనని నేను గమనిస్తూ ఉన్నాను.**

❑

**శ్రీకృష్ణ భగవానుడు:** మిత్రమా! ఉద్ధవా! ఆ అవధూత ఈ విధంగా యదుమహారాజుకు గురువు అనే విశేషానికి నిర్వచనం చెప్పి, మహారాజు యొక్క నమస్కారమును ప్రసన్నమైన హృదయంతో స్వీకరించినవాడై యథేచ్ఛానుసారంగా అక్కడి నుండి బయల్వెడలారు!.

మా పూర్వీకులకు పూర్వీకుడైన మా వంశకర్త శ్రీ యదుమహారాజు ఆ అవధూత యొక్క వచనములు విన్నవారై మరలమరల మననం చేసుకున్నారు. ఆయా సందర్భములనుండి ఆయా దృశ్య సంఘటనలనుండి గ్రాహ్యములు - త్యాజ్యములు- నేర్వవలసినవి గమనించినారు. క్రమంగా దృశ్య సంగమ - ఆసక్తుల నుండి విడివడినవాడయ్యారు. సమ చిత్తులై దేదీప్యమానంగా **ఆత్మాఽహం** ధ్యానంతో ప్రకాశించారు.

## 8. స్వధర్మనిరతి పుష్ప సమర్పణ (10వ అధ్యాయము)

**శ్రీకృష్ణ భగవానుడు:** ఓ ఉద్ధవా! జీవులందరికి వారు తరించటానికి సులభమైన ఒక ఉపాయం ఇప్పుడిక గుర్తు చేస్తున్నాను. విను.

దేహధారి దేహమున్నంతవరకు కర్మలు నిర్వర్తించక తప్పేది కాదు కదా! కనుక, స్వధర్మము తప్పక నిర్వర్తించవలసిందే!

కర్మ ధర్మానుకూలంగా ఉండటమే జీవునికి వాస్తవమైన సంపద.

అయితే అట్టి స్వధర్మమును సర్వంతర్యామియగు నన్ను ఉపాసించుటలో విభాగంగా నిర్వర్తించాలి సుమా! (Let alotted work be done as a worship to me)

**విషయముల పట్ల నమ్మకముగల దేహి ఈ ఎదురుగా గల జగత్తు సత్యమే అని నమ్మి చేసే ప్రయత్నాలన్నీ విపరీత పరిణామప్రదములే** అని జ్ఞానులు గమనిస్తున్నారు. అందుచేత అట్టి తత్త్వవేత్తలు - ఇక్కడ నాకు ఏదో లభించును గాక! - అనే కామమును త్యజించి పరమాత్మను పూజించే సాధనయొక్క అంతర్విభాగంగా నిష్కామభావంతో విశుద్ధచిత్తంతో స్వకర్మలు - స్వధర్మములు నిర్వర్తిస్తున్నారు!.

ఉదాహరణకు..., అనేక విషయచింతలతో రాత్రి నిద్రపోయిన వ్యక్తికి స్వప్నంలో భోగ్యవస్తువులు, సుఖ దుఃఖ సంఘటనలు కనిపిస్తాయి. అవన్నీ నిజమా? కాదు కదా! అట్లాగే ఈ జాగ్రత్‌లో కూడా ఇంద్రియములకు తారసపడుచున్న - మనస్సుకు అనుభూతిగా కలుగుచున్న - భేదబుద్ధికి ప్రాప్తిస్తున్న వివిధములైన దృశ్యసంబంధమైన అనుభవములన్నీ **స్వప్నసదృశమే** సుమా! ఇంద్రియములకు విషయములైన సుఖ- దుఃఖ - మిశ్రమ విశేషాలన్నీ కూడా **అస్థిరం**! పైగా, **అర్థరహితం**! ఇంద్రియముల ద్వారా కలిగే భేదబుద్ధిఅంతా **వ్యర్థమే**!.

అందుచేత..., కామ్యకర్మము (Acts to satisfy one's own expectations and cravings) వదలి, నిత్య- నైమిత్తిక కర్మలు (Acts that are to be discharged on a

daily basis or on occasional basis) మాత్రం నిర్వర్తిస్తూ సర్వ తత్త్వ స్వరూపుడనైన నన్ను ఆశ్రయించి ఉండటమే సముచితం!

క్రమ - క్రమంగా ఆ నిత్య - నైమిత్తిక ప్రవృత్తి ధర్మాలుకూడా త్యజించునుగాక! కర్మ చోదనములను (Prompting factors for discharging various duties) కూడా వదలి నన్నే ఆశ్రయంగా కలిగి ఉండటం (అనగా నివృత్తి మార్గం ఆశ్రయించటం) ఉచితం! ఆత్మవిచారణ యందు సంప్రవృత్తుడగుచు, దృశ్యప్రపంచమునుండి నివృత్తుడగుచూ ఉండును గాక!. **జగత్తును ఆత్మ కళావిన్యాసముగా, ఆత్మ చైతన్యమునకు అభిన్నముగా సందర్శించును గాక!**

క్రమంగా ఈ మానవుడు నాపట్ల సంపూర్ణ చిత్తమును ప్రవృద్ధ పరచుకునే నిమిత్తం యమము - నియమము - అహింస - శౌచము ఇటువంటి సాధనములను ఆత్మజ్ఞాన లక్ష్యముతో పాటించుగాక!

**జిజ్ఞాసువు అయి నన్ను ఎరుగుటకై శాంతభూషితుడగు విజ్ఞులైనవారిని కూడా గురుభావంతో ఆశ్రయించాలి! సేవించాలి!.**

## 9. గురు-శిష్య లక్షణాలు

**గురులక్షణాలు:** శాంతుడు, శిష్యుని యొక్క సందర్భ (ఇహ) - సహజ (పర) స్వరూపములను ఎరిగినవాడు అవతారమూర్తి యొక్క శబ్ద - అర్థములను శిష్యుని స్వస్వరూపానుభవరూపంగా విశ్లేషించి ప్రవచించువాడు అయివుండుగాక!. "నీవు-జన్మ-కర్మ రహితమగు ఆత్మవే అయిఉండి సృష్టిగాకూడా అవతరించుచున్నావు" అని నిరూపించి చూపువాడు, "సాక్షాత్తు తత్త్వమసి" అని సుస్పష్టపరచువాడు - అయి ఉండాలి!

**శిష్యలక్షణములు : శిష్యుడు... ఎట్లా ఉండాలి మరి?**

గురువు పట్ల సేవానిరతిని ప్రదర్శించువాడు.

శరణాగతిని ప్రకటించువాడు.

స్వాభిమానము అనే జాడ్యమును జయించినవాడు.

అహంకారమును అధిగమించినవాడు.

మత్సరమును మొదలంట్లా వదలినవాడు.

"వినటము – అవగాహన – సమన్వయములలో" దక్షత (Efficiency of assimilating and interpreting) గలవాడు.

నాది – నేను అనే అల్ప మమకారములను త్యజించినవాడు.

దృఢమైన పట్టుదల పెంపొందించుకొనుచుండువాడు.

దిగులు – వ్యగ్రత మొదలైన బలహీనతలను దూరం చేసుకున్నవాడు.

తత్త్వజ్ఞానము పట్ల జిజ్ఞాసతో ఉన్నవాడు.

అసూయ – ద్వేషములు లేనివాడు.

"ఇది ఇంతేకదా! అది అంతేకదా" అను రూపమైన అల్పభావములను – వ్యర్థ సంభాషణలను వదలివేసినవాడు.

**అయివుండాలి!**

అతడు అందరిపట్ల – ఆయా అన్ని సందర్భముల పట్ల సమదర్శి అయువుండుగాక! భార్య – పుత్రులు – బంధువులు – గృహము – భూ సంపద – ధన వ్యవహారము మొదలైన ప్రాపంచక విషయముల పట్ల ఉదాశీనత్వము కలిగిఉండును గాక!. అవన్నీ ఆగమాపాయనో అనిత్యాః ... అను ఎరుక ఏమరచకుండునుగాక!

❑ ❑ ❑

**ఉద్ధవుడు :** హే జగద్గురూ! మహాత్మా! ఆత్మ యొక్క విలక్షణ లక్షణము అభౌతికము అని అంటారుకదా! అట్టి అభౌతికత్వం గురించి చెప్పండి! భౌతిక దృష్టులనుండి నివృత్తిగురించి కూడా చెప్పండి.

**శ్రీకృష్ణుడు :** ఒక కట్టెను అగ్ని కాలుస్తోందనుకో!

కాలుస్తూ, కాంతిని వెదజల్లే అగ్ని – కట్టె ఒక్కటా? కాదు. వేరు వేరే కదా! అట్లాగే **స్థూల దేహానికి** (పాంచ భౌతిక దేహానికి) – (ఆలోచన, ఇష్టఅయిష్టములు, అవేశకావేములు మొదలైనవన్నీ సమావేశమగుచున్న) సూక్ష్మ దేహానికి (Both physical body and thought body containing feeling, expectation, fears. opinions etc.) కూడా ఆత్మ (మండే కట్టెకు వేరైన అగ్నివలె) సర్వదా వేరై వున్నది. విలక్షణమై యున్నది. భిన్నమైయున్నది.

అగ్ని కట్టెలో దాగి వుంటుంది. ఆ అగ్ని కట్టెల ఆకారంగా కనిపించే అణువులఆవరణలో

దాగి ఉంటుంది. ఇసుక రేణువులతో చేసిన ఏనుగువలె ఆ అణువుల ఆకారాదులచే, రంగుచే, రసాయిన స్వభావములచే అగ్ని కప్పబడి ఉంటోంది.

అట్లాగే ఆత్మ దేహాంతర్గతంగా ప్రవేశించి దేహము యొక్క రక్తము–బొమిక–మాంసము–చర్మము ఇత్యాదులచే కప్పబడి వుంటోంది. అంతే కాకుండా కోపము – ఆవేశము – ఆశ – నిరాశ ఇత్యాది గుణసమన్వితమగు భావనా దేహంచేకూడా (సూక్ష్మ దేహంచే కూడా) కప్పబడి వుంటోంది.

ఆత్మ యొక్క చమత్కారమైనట్టి స్వకీయమైన ఈశ్వరాధీన మాయచేత ఈ వస్తు గుణ సమన్వితమగు – స్థూల దేహము – సూక్ష్మదేహము రచించబడుచున్నాయి.

జీవుడు ఇంద్రియ విషయములగు దృశ్యము అనే సంసారములో స్వయం కల్పితమైన ప్రియాప్రియ అహంకార – మమకార విశేషములచే నిబద్ధుడగుచున్నాడు.

సంగము (Attachment) సంసార బంధమునకు కారణం. **నిస్సంగముతో కూడిన ఆత్మవిద్యచే సర్వాతీతత్వమును సంతరించుకొని చిదాత్మస్వరూపుడై వెలుగొందుచున్నాడు.** అందుచేత, వస్తు బుద్ధిచే ఏర్పడుచున్న సంగము (Attatchment) ను ఈ జీవుడు నిరసించివేయాలి!

అట్టి జ్ఞానమును మహనీయులనుండి సాధకుడు శ్రద్ధగా వినాలి! జిజ్ఞాసతో పరస్వరూపము (That which is beyond all else) అగు స్వస్వరూపాత్మ వస్తువు గురించి తెలుసుకొని, ఆస్వాదించటమే ఉపాయం!. అహమ్ సర్వస్య ప్రభవో– నాచేత ఏదేది ఎట్లు చూడబడుచున్నదో అనుభూతపరచుకోబడుచున్నదో... అదంతా నేనేకదా! అని గమనించి–తెలుసుకొని బ్రహ్మమే తానై ఉండటం–అనుననది ఆస్వాదించనారంభించాలి.

⌘

ఆచార్యులవారు క్రిందవున్న అరణి (Lower stone)

శిష్యుడు పైనున్న అరణి (Upper Stone)

ఉపదేశ వాక్యములు ఆ ఉభయ అరణుల ఒరిపిడి. జనించేది జ్ఞానాగ్ని. కాల్చబడునది "అజ్ఞానము" అనే కొయ్యి చెక్క.

ఆచార్య – శిష్యుల సంయోగముచే ఉత్పన్నమయ్యేదే అగ్నితుల్యమగు ఆత్మ తత్త్వ జ్ఞానము! ఆ జ్ఞానాగ్నిచే అజ్ఞానము దగ్ధమై ఈ జగత్తును స్వకీయ ఆత్మ స్వరూపంగా సందర్శించగల

ఆత్మసుఖం అనుభవమౌతుంది!

నిపుణుడైన గురువుచే ప్రవచితమైన **సాక్షాత్ తత్ త్వమ్ అసి** అను విశుద్ధజ్ఞానముచే గుణపూర్వకంగా ఆవరించిన మాయ తనంతటతానే స్వభావసిద్ధంగా అంతర్హితమౌతుంది.

ఈ విశ్వము తన కార్య–కారణ–గుణ పరిధిని అధిగమించి స్వస్వరూపాత్మ చమత్కారంగా, ఇంధన రహితమగు అగ్నివలె స్వయమాత్మతేజో విలాసమై అనుభవం కాగలదు.

**అదియే విషయ–అభావస్వరూపమగు నివృత్తి రూపముతో కూడిన సమగ్రావగాహన!**

## 10. భిన్నంగా కనిపిస్తున్న ఏకత్వం

**ఉద్ధవుడు:** హే భగవన్! ఈ జగత్తులో వేరు వేరు గుణ సంయోగములచే జీవులు, జన్మలు, పునర్జన్మలు, జ్ఞానులు, అజ్ఞానులు, విజ్ఞులు, మూర్ఖులు, మునులు, మహర్షులు, భక్తులు, యోగులు, ఇంద్రియలోలులు ఇత్యాది వేరువేరైన – రకరకముల స్వభావములుగా కనిపిస్తున్నారు కదా! వీరంతా ఎవరి సంకల్పము చేత వివిధ రీతులుగా ఉత్పన్నమౌతున్నారు? పరమాత్మచేతనేనా? మరొకరి చేతనా? జీవుని స్వభావానికి సంబంధించిన కర్తృత్వము జీవునిదా? ఈశ్వరునిదా? పరమాత్మదా? మరింకెవరిదన్నానా?

**శ్రీకృష్ణుడు:** ఇక్కడ ఏకము – అక్షరము అగు పరమాత్మయే ఉన్నారు. ఏకైక పరమాత్మయే వివిధ రూపములుగా మనస్సుచే పొందబడుతోంది. ఏకోసత్! ఏకమే అయివుండి భావావేశరూపమగు మనస్సుచే అనేకముగా భావించబడుతోంది!

**ఒక వేళ..,** నీకు – కర్మ–కర్తృత్వము, భోక్తృత్వము, సుఖము – దుఃఖముల దృష్ట్యా వేరువేరుగా కనిపించేదంతా నిత్యమని, సత్యమని అనిపిస్తోందా? సర్వ భోగ ప్రతిపాదితములైన శాస్త్రముల దృష్ట్యా సుఖ–దుఃఖములు, స్వర్గ–నరకాది వివిధలోకములు, జీవుల రాక–పోకలు వాస్తవమేనని భావిస్తున్నావా? ఆయా వస్తు ప్రభావం చేత అజ్ఞానం – జ్ఞానం ఉత్పన్నమై, కాలాంతరంగా మారుతూ వుంటుందని అనుకోదలచావా?

అట్లా అయితే....,

అప్పుడు ఈ జీవుల దేహములు, సంవత్సరముల రూపంగా కనిపించే కాలము, ఆ కాలముచే ఏర్పడే జనన – బాల్య – యౌవన – వార్ధక్యాది అవస్థలు కూడాస్వతఃగానే సత్యమని నిత్యమని అనుకోవలసివస్తుంది!.

అప్పుడు.., ఈ జీవుడు ఏదో శక్తిచేత నియమితుడై పరతంత్రుడై సుఖదుఃఖాలు అనివార్యంగా అనుభవిస్తున్నాడు – అని సమీక్షించవలసి వస్తుంది.

(If he is under strict control of some out-side Force) ఇక పరతంత్రుడైనవాడు తానుగా మోక్షం పొందలేడని, ఎవ్వరో ఎక్కడినుండో ఆతనికి మోక్షం ప్రసాదించవలసి యున్నదని చెప్పవలసి వస్తుంది.

అనగా..., శాస్త్రములు తాము చెప్పే సాధనలు నిర్వర్తించాటానికి కూడా జీవుడు స్వతంత్రుడు కాదని, సాధనలు కూడా దైవము అనబడే మరొకరి ఆధీనంలో వున్నాయని అనవలసివస్తుంది.

శాస్త్రములు అట్లా చెప్పటంలేదుకదా! "సాధన చేయవయ్యా! పొందుతావు" – అనిగదా, అనిచెప్పుచున్నది!

**ఉద్ధవుడు :** అవునయ్యా! సాధనచే మోక్షంలభిస్తుందని సూచిస్తున్నాయి కృష్ణయ్యా! నాకొక అనుమానం. ఈ జీవుడు పారతంత్రుడా? స్వాతంత్రుడా?

**శ్రీకృష్ణుడు :** ఒక వేళ జీవుడు పారతంత్రుడై (Under control of some remote force) సాధనములు గాని, జన్మ – మృత్యు – పునర్జన్మలుగాని పొందుచున్నాడని సిద్ధాంతీకరించ వలసివస్తే... అప్పుడు శాస్త్రములు జీవునితో **నాయనా! నీవు బ్రాహ్మీ ముహూర్తంలో నిదురలే! సాధనలకు ఉపక్రమించు!**..., అని సంబోధించి ప్రయోజనం ఏమిటి? అందుచేత అనేకత్వము – పారతంత్ర్యము (Multiplicity and forced bondage) అనివార్యమని చెప్పవలసి వస్తే శాస్త్రములు తాము చెప్పే సాధనల ప్రయోజనములను తామే ఖండింపవలసివస్తుంది.

పరాధీనము (Remotely controled by some body) అయినట్టివానికి ఎట్టి పురుషార్థము సిద్ధించదు కదా! తానుగా ఏమీ చేయలేనప్పుడు శ్రద్ధ–సాధనాలగురించి శాస్త్రాలు నొక్కి వక్కాణించటమెందుకు?

**ఉద్ధవుడు:** హే సద్గురూ! వేదములచే విధి – విధానపూర్వకంగా చెప్పబడే దేవతోపాసన యజ్ఞయాగాది క్రతువులు ఎరిగిన పండితులు **జీవుడు ఇహంలో సుఖం – పరంలో స్వర్గలోకాది సుఖ శాంతులు పొందాలంటే దేవతోపాసన, యజ్ఞ – యాగాలు నిర్వర్తించాలి. వేద విభాగాలైన యజ్ఞ యాగ విధానం తెలిపే సంహిత బ్రాహ్మణముల పాండిత్యము లేకపోతే ఈ జీవునికి ఉద్ధరణ లేదు** – అని అంటూ వుంటారు కదా! అట్టి కర్మవిదుషుల ప్రతిపాదన గురించి తమ అభిప్రాయం చెప్పండి!.

**శ్రీకృష్ణుడు :** నీవు చెప్పిన కర్మకుశలురకు (దేవతోపాసకులకు) (Experts in yagna / yaga/ vedavignana) ఎల్లప్పుడు సుఖమే లభిస్తోందని మనం చెప్పలేం. అట్లాగే అట్టి విషయాలలో నిష్ణాతులు కాని మూఢులకు దుఃఖములే వస్తున్నాయని కూడా సిద్ధాంతీకరించలేము.

ఒకవేళ, వేద ప్రవచిత కర్మల రహస్యం తెలిసినవారికి సుఖ దుఃఖ విఘాతాల గురించి తెలియవస్తోంది... అని అందామా? అయితే వారివద్ద కూడా అనివార్యమగు మృత్యువు సంభవించకుండా ఉపాయాలు లేవుకదా! మృత్యు భయం కొనసాగుచునే ఉండగా, కర్మల వలన కోరికలు తీరుతాయి... అనే ప్రయోజనం నిష్ఫలమేకదా? ఉరితీయటానికి తీసుకుపోబడుచున్న మానవుడికి సుగంధద్రవ్యాలు ఇస్తే అవి ఆతనికి ఏంసుఖం?

అట్లాగే మృత్యువును ఎదురుగా పెట్టుకొని, **మీరు ఈ ఆ కర్మలు చేయండి! అప్పుడు ఈ ఆ సుఖాలు పొందుతారు..** అని శాస్త్రీకరించటం అటువంటిదే కదా!

పోనీ! యజ్ఞ యాగ కర్మలు నిర్వర్తించటానికి ఇప్పుడు శ్రమిస్తే ఉత్తరోత్తరా స్వర్గలోకంలో స్థానం, స్వర్గ సుఖాలు లభిస్తాయి – అని కర్మ వాదులు అంటారంటావా? స్వర్గలోకంలో లభించే సుఖాలకు కూడా స్పర్ధ – అసూయ – క్షయము – నాశనము (Conflict - mutual Hatred - Decrease - End all) అనేవి ఉండియే తీరుతాయి. అనగా స్వర్గసుఖాలు కూడా ఇక్కడి ధనము – గృహములు మొదలైన ఐహిక భౌతిక సంపదలవలెనే అనేక దుఃఖములతో కూడుకొని ఉన్నవేకదా! (They are also accompanying many worries). పైగా..., యజ్ఞ యాగరూపములైన కృషికర్మలు నిర్వర్తించేడప్పుడే అవన్నీకూడా అనేక శ్రమలు విఘ్నములతో కూడుకొని ఉంటున్నాయి.

సరే! ఆ విఘ్నములన్నీ అధిగమించి అవి నిర్వర్తించినా కూడా, వాటి ఫలితంగా దేహ పతనానంతరం లభించే స్వర్గలోక సుఖాలు మాత్రం శాశ్వతమా? కాదే!

ఎట్లా అంటావా?

యజ్ఞములు చేసే పురుషుడు ఈ లోకంలో ఆ యజ్ఞములు ద్వారా దేవతలను ఆరాధించి స్వర్గమును పొందుచున్నాడు. తాను చేసిన పుణ్యకర్మలకు ప్రయోజనంగా స్వర్గలోకంలో దేవతాలోకాలలో దివ్య భోగాలు అనుభవిస్తున్నాడు. మనోహరమైన ఆభరణాదులు ధరించి దేవతావిమానాలలో దేవతాస్త్రీల మధ్య విహరిస్తున్నాడు. గంధర్వ గణముచే కీర్తించబడుచున్నాడు. అయితే! అవన్నీ ఇంద్రియ–విషయ సంబంధమైన భోగ–

విలాసములే కదా! దేవతా స్త్రీలతో కలసి నందనవనాలలో విహరిస్తున్నంతవరకు – ఈ భోగమంతా కొంతకాలానికి ముగిసిపోయి, "నాకు పతనం అనివార్యం" – అని గమనించకుండానే కాలం గడిపివేస్తూ వుండవచ్చుగాక! పుణ్యమున్నంతవరకే స్వర్గలోకం! పుణ్యము క్షీణించగానే కాలముచే త్రోయబడి తిరిగి క్రిందకు రావలసిందే!

**ఉద్ధవుడు :** అలా యజ్ఞ యాగ దేవతోపాసనాది కర్మలు కాకుండా..., ఇంద్రియలోలుడై దుష్టసంగముతో అధర్మరతుడై ఇంద్రియ వాంఛలకు వశుడై జీవితమును గడపివేస్తేనో...?

లోభ బుద్ధితో దానము ధర్మము వంటి సత్కార్యాలు నిర్వర్తించకుండా ఇతరులను మోసగించటం, బాధించటం మొదలైన దుష్టకర్మల లంపటంలో ఆయుష్షును వెచ్చిస్తూ వుంటేనో...?

ప్రాణి హింస చేస్తూ అమాయక జంతువులను హింసిస్తూ భూత–ప్రేత–పిశాచాదులను ఉపాసించి, ప్రకృతి శక్తులతో ఇతరులకు భయము – హాని కలుగజేస్తూ వుంటేనో...?

**శ్రీకృష్ణుడు :** అప్పుడాజీవుడు పశువుల కంటే కూడా హీనమైన నరకయాతనలు గల లోకాలలోకి కాలముచే నెట్టివేయబడుచున్నాడు. స్వార్థ – పరమార్థ శ్రేయస్సు లభించక అజ్ఞానముతో కూడి అనేక అల్ప ఉపాధులలో రాక–పోకలు నిర్వర్తిస్తున్నాడు.

అందుచేత, ఓ ఉద్ధవా!

**శ్లో॥ కర్మాణి దుఃఖోదర్కాణి కుర్వన్ దేహేన తైః పునః**
**దేహమాభజతే తత్ర! కిం సుఖం మర్త్య ధర్మిణః? (అధ్యా 10, శ్లో 29)**

ఈ దేహముచే చేయబడే కర్మలు వాస్తవానికి ఒక రకంగా దుఃఖ జనకములే! ఎందుకంటే అవన్నీ జన్మ – మృత్యు పరంపరలు కొనసాగటాన్ని ఆపలేకపోతున్నాయి. మరి? మరణము అనివార్యమై ఉండగా, ఈ జీవునికి లభించగల వాస్తవ సుఖం ఈ జగత్తులో ఏమున్నది? (లేక) ఏలోకంలోనైనా ఏ మున్నది చెప్పు?.

అనంతకాలము యొక్క సుదీర్ఘ ప్రదర్శనలో లోకాలు – లోక పాలకుల జీవితాలే అల్పకాలానికి పరిమితమైవుంటున్నాయి. లోకాలు మహా అయితే, ఒక కల్పము వరకు కొనగాసుగుతాయి. బ్రహ్మదేవుడు కూడా కాలపరిమితుడేకాబట్టి, కాలస్వరూపుడనగు నన్ను చూసి భయమును పొందటం జరుగుతుంది. ఇక మానవుని ఆయుఃపరిమాణం గురించి వేరే చెప్పేదేమున్నది? స్వర్గము మొ॥న లోకములలో నివాసం కోరుకొని మాత్రం శాశ్విత ప్రయోజనమేమున్నది?

ప్రకృతిలోని సత్త్వ-రజో-తమో గుణాలు కర్మలను (Individual Roles and functions) కల్పిస్తూ వుంటాయి.

ఆ కర్మల నుండి గుణాలు, మరల గుణముల నుండి కర్మలు!

గుణములతో తాదాప్యము చెంది ప్రవర్తించే జీవుడు ఆ కర్మల ఫలములను అనుభవిస్తూ ఆ అనుభవం నుండి గుణ - కర్మలను అంతులేని ప్రవాహంలాగాకొనసాగిస్తూనే వుంటాడు. ఎంతెంతవరకైతే త్రిగుణములనబడే వైషమ్యం దృష్టియందు కొనసాగుచూ వుంటుందో.. అంతంత వరకు ఈ జీవునిపట్ల - "నేను వేరు - వారు వేరు- దేవతలు వేరు - మంచివారు వేరు - చెడువారు వేరు - పాపములు - పుణ్యములు - సుఖములు - దుఃఖములు - స్వర్గము - నరకము" .. ఇటువంటి నానాత్వమంతా ఉండియే ఉంటుంది. ఈ జీవుడు నిజం-నిజం అనుకుంటూ నానా రూపములు పొందుచూనే ఉంటాడు. **బుద్ధియందు కల్పితమగు నానా రూపములు కొనసాగునంతవరకు జీవునికి కర్మలకు అధీనత్వము - పారతంత్ర్యము ఉండియే తీరుతోంది!** అట్టి కర్మాధీనం ఉన్నంత వరకు కర్మ ఫల ప్రదాత నుండి సాంసారిక భయం ఏర్పడుతూనే వుంటోంది. గుణ వైషమ్యము, అద్దానిచే భోగానుభవము-బంధము ఉంటూనే ఉంటాయి. బంధకారణంగా కర్మల అనివార్యంగా బలవంతంగా నిర్వర్తించటం - కర్మవలన సుఖ దుఃఖాలు.... ఇవన్నీ చేయి చేయి కలుపుకుని కొనసాగుచున్నాయి.

కర్మ - కర్మ ఫలముల పట్ల ఆశ-అభినివేశము - నమ్మకము కొనసాగుచున్నంత వరకు ఈ జీవునికి శోక - మోహములు తప్పేవి కావు. త్రిగుణమాయకు లోను అయిన జీవులు పరమాత్మయగు నన్ను - కాలము - లోకము - స్వభావము - ధర్మము ఇటువంటి రూపములుగా దర్శిస్తాడే గాని, "**పరమాత్మ నా స్వస్వరూపమే!**" - అనే విషయం గమనించలేకపోతున్నాడు.

**శ్రీ ఉద్ధవుడు:** స్వామీ! శ్రీ కృష్ణా! నాది మరొక్క సందేహం.

ఈ జీవునికి త్రిగుణముల ప్రభావం చేతనే దేహ పరంపరలు వచ్చి పోతున్నాయి కదా! అనగా దేహం ఉన్నంతవరకు గుణములు పరిఢవిల్లుతూనే వుంటాయి కదా! మరప్పుడు దేహము ఏర్పడి ఉండికూడా, ఈ త్రిగుణములకు అతీతుడై వుండగలడా? దేహం ఉండికూడా గుణాతీతుడై వుండటం ఎవ్వరికైనా సాధ్యమా? సాధ్యమైతే అట్టి గుణాతీతుడగు జీవుడు (దేహి) ఎట్లా ఉంటాడు? గుణాతీతుడైనవాడు దేహం ఉంది

కాబట్టి, బద్ధుడా? లేక ముక్తుడా? అతని విహారం ఎక్కడ? గుణాతీతుణ్ణి ఏ లక్షణములచే మనం గుర్తించగలం? ఆయన స్వీకార విసర్జనలు ఎట్లా వుంటాయి? ఎక్కడ ఎట్లా నివసిస్తాడు, ఎక్కడ శయనిస్తాడు? ఓ అచ్యుతా! గుణములు ప్రదర్శిస్తున్నప్పటికీ గుణాతీతుడై వుండేవాడిని గురించి మీరు మాత్రమే విశదీకరించగలరు.

**ఒకే ఆత్మ నిత్య బద్ధమై వుంటోందా? నిత్య ముక్తమై కూడా వుంటోందా!**

ఆత్మ సర్వదా ఏకమే అయి ఉండికూడా, బద్ధులు – అజ్ఞులు–విజ్ఞులు–ముక్తుల రూపాలు ఎందుకు దాల్చుతున్నది? – అన్నటువంటి ఈ విషయంలో నాకు ఎన్నో అనుమానాలు ఉంటున్నాయి. మీ సమాధానంతో నా అనుమానాలను తొలగించ ప్రార్ధన!.

"నిత్య బద్ధాత్మ – జీవాత్మ :: నిత్యముక్తాత్మ–పరమాత్మ" – అనునది అధ్యాత్మశాస్త్ర సమీక్షయేనా? శాస్త్రీయదృష్టిచే యుక్తియుక్తమేనా?

**శ్రీకృష్ణ భగవానుడు :** ఆధ్యాత్మశాస్త్రము బంధముక్తుల గురించి నిర్వచిస్తోంది. అయితే, ఓ ఉద్ధవా! త్రిగుణములను దృష్టిలో పెట్టుకొని మాత్రమే "ఈతడు బద్ధాత్ముడు– ఈతడు ముక్తాత్ముడు" – అని శాస్త్రములు వ్యాఖ్యానించటం జరుగుతోంది. త్రిగుణములు మాయ చే కల్పించబడినవి మాత్రమే కదా!. అందుచేత,..., ఆత్మకు వాస్తవానికి బంధము లేదు. బంధమనునదే లేదు కాబట్టి, ముక్తి అనబడునదేదీ కూడా లేదు!. స్వప్నంలోని కొన్ని సంఘటనలకు స్వప్న ద్రష్టబద్ధుడౌతున్నాడా? మరికొన్ని సంఘటనలచేత ముక్తుడౌతున్నాడా? లేదే! స్వప్నము తనదైనవాడు స్వప్నంలో ఏదేది కనిపించినాకూడా మెళుకవ వచ్చినతరువాత యథాతథుడే కదా!

ఇక్కడి సుఖ దుఃఖాలు స్వప్నంలోని సంఘటనల వంటివే! నేను జీవాత్మను – బద్ధుడను, అనునది కూడా స్వస్వరూపాత్మ దృష్ట్యా ఒకరాత్రి ఒకడికి వచ్చిన ఒక కలవంటిదే! కలగనేవాడికి కలలో బంధము ఉన్నట్లా? లేనట్లా?

ఒకడు స్వప్నంలో ఒక గొప్ప 3 అంతస్తుల మేడ కట్టుచున్నానడనుకో! రెండవ అంతస్తు కట్టుచుండగా మేస్త్రీ – పనివారితో ఏవేవో ఇబ్బందులు వస్తున్నాయి. ఇంతలో... మెళుకువ వచ్చింది. నిద్ర లేవగానే, ఆ మేడ ఎక్కడ? ఆ పనివారు ఇంకా రారేం? .. అంటూ ఆ స్వప్న అప్పటి దర్శి ఇప్పటి జాగ్రత్‌లో – ఇంటి నుండి బయలు దేరుతాడా? లేదు

కదా! అదంతా స్వప్నమే కదా!.. అని అంతా క్షణంలో త్యజించి, ఇక వర్తమాన జాగ్రత్‌లో తన దిన చర్యలకు ఉపక్రమిస్తాడు కదా!. దేహ-దేహాంతరాలు ఈతీరైనవే!

స్వప్న బుద్ధి స్వప్నంలో అనేక సుఖ - దుఃఖాలుగా వివర్త మగుచున్నది కదా! అట్లాగే... జాగృత్ బుద్ధి దృశ్యమును పొందుచూ- **ఇదంతా వాస్తవం - శాశ్వతం**... అనే భ్రమకు ( వర్తమానము పట్ల) లోను అగుచున్నది. ఏది ఎట్లైనా ఉండవచ్చుగాక! ఇక్కడ జాగ్రత్‌లో అనుభవమగుచున్న శోకము - మోహము సుఖము - దుఃఖము - సామాన్యము - ఆశ్చర్యము - జననము - మరణము ఇవన్నీకూడా దేహమునకు సంబంధించిన మాయా విశేషాలు అని గ్రహించు. మాయ అనగా? ఒకడు ఒక కథ వింటున్నాడు (లేక) ఒక నాటకం చూస్తున్నాడు. అందులోని సుఖ-దుఃఖ - హాస్య- సంగతి - సందర్భ- సంబంధ- బాంధవ్యాలన్నీ నిజమే అని భావించి తాను అక్కడి పాత్రలకు సంబంధించిన రసానుభూతిని తన హృదయంలో పొందుచున్నాడు. నిజానికి **అతడు ఆమెతో అన్నన్ని బాధించే మాటలు అంటూవుంటే.. నాకు బాధ వేస్తోంది -** అని నాటక పాత్రలను చూసి అనుకోవటం వంటిదే, ఈ దృశ్యము నుండి జీవుడు అనుభవించే సుఖ దుఃఖాలు కూడా! కనుక "ఇక్కడి సుఖ దుఃఖాలకు వాస్తవమైన ఉనికి లేదు. ఇది కాల బద్ధము స్వప్న సదృశమేగా ఇదంతా!" - అనునది మరచి ఈ జీవుడు ఆ - యా విషయాలతో తదాత్మ్యము పొంది వాటితో అవినాభావపూర్వకమైన అనుభవమును పునికిపుచ్చుకుంటూ కొనసాగించటమే జగత్తు (లేక) సంసారము అనబడుదాని నిర్వచనం.

ఓ ఉద్ధవా! "**ఈ మాయా రచనకు రచయితను సర్వాంతర్యామినైన నేనే**" - అని గ్రహించు! విద్య-అవిద్య.. ఈ రెండూ కూడా నా యొక్క మాయా రచనయే! ఈ శరీరి నా మాయా రచన యందు నిమగ్నుడగుచున్నాడు. జీవుల యొక్క బంధము మోక్షము అనే రెండింటికీ కారణం సర్వ తత్త్వస్వరూపుడగు నా మాయా చమత్కారమే!. మాయా రచయితను నేనే! దేహిని నేనే! దృశ్యము నేనే!

ఇక ఈ బద్ధ-ముక్తులగు జీవులు (దృష్టిలో) ఎవ్వరంటావా? ఇక్కడి ద్రష్టలంతా కూడా అద్వితీయ స్వరూపుడనగు నా అంశయే! అట్టినా అంశభూతులగు జీవులకు అవిద్య చేత బంధము, విద్య చేత బంధరాహిత్యము కలుగుతోంది.

"నేను జీవుడను" అను భావనయే బంధము. "ఇక్కడి ద్రష్టత్వమంతా ఏ పరమాత్మ యొక్క అంశయో అట్టి పరమాత్మనాకు అద్వితీయుడు" - అని గమనించటంచేత

మోక్షము. ఇంతకు మించి వేరే బంధము లేదు. మోక్షము లేదు.

ఇప్పుడు నీకు బద్ధుని లక్షణములు, ముక్తుని లక్షణములు వివరిస్తాను. విరుద్ధమైన బంధ మోక్షములు ఆత్మకు ఏవిధంగా ఆపాదితములో (Attributed features) చెప్పుచున్నాను. విను!.

## 11. జీవ-ఈశ్వర న్యాయం

ఒకానొక చోట ఒక మహావృక్షం వున్నది. దాని వ్రేళ్ళు నేలలో విస్తారంగా లోతుగా విస్తరించి వున్నాయి. ఆ వృక్షము యొక్క కొమ్మలు, ఆ కొమ్మల ఉపకొమ్మలు అతి వైశాల్యంగా ఆచోటును ఆక్రమించుకొని వున్నాయి. ఆ కొమ్మలకు ఆకులు ఫలములు పిందెలు అసంఖ్యాకంగా వ్రేలాడు చున్నాయి.

ఎక్కడి నుండో రెండు పక్షులు వచ్చి ఆ మహా వృక్షముపై వ్రాలాయి. ఒకటి పెద్దది. ఒకటి చిన్నది. కొద్దిసేపైన తరువాత - చిన్న పక్షి అక్కడి కొమ్మల పై వ్రాలింది. ఫలాలు తింటోంది. అటుఇటు చూస్తోంది. గంతులేస్తోంది. కిచకిచ శబ్దాలు చేస్తూ ఆకొమ్మ - ఈకొమ్మవైపుగా వ్రాలి అక్కడి ఆకులలో పూలలో తన దేహమును దాచుకుంటోంది. మరల ఎగురుతోంది. మరల మరల ఆ వృక్షముపై అనేక చోట్ల వ్రాలుతోంది. అవిశ్రాంతంగా కదులుతోంది. ఎన్నో ధ్యాసలు! ఎన్నో రుచులు ! ఎన్నో వేదనలు, రోదనలు ! ఆశిస్తోంది! నిరాశపడుతోంది! ఆవేశపడుతోంది! నవ్వుతోంది! దుఃఖిస్తోంది! పుల్లపళ్లు తింటోంది! బాధగా కూతలు పెడుతుంది! ఇంతలోనే తీయ పళ్ళు కొరకు వెతకుతోంది. గర్విస్తోంది! భంగపడుతోంది! అద్దాని అన్వేషణా-ఆవేదనా-ఆలోచనా-ఆకాంక్షా-ఆలింగనా వ్యవహారములకు అంతు ఉండుటలేదు. ఏది ఏమైతేనేం? అది పెద్ద పక్షిని ఒక వైపు చూసుకుంటూనే వున్నది. పెద్ద పక్షిని ఏమరచటమూలేదు, వదలటమూ లేదు. కొమ్మలపై చంగ్ చంగ్ గంతులు ఆపటమూ లేదు!

### ఇక పెద్ద పక్షియో!

ఆ మహావృక్షానికి పైన గల ఒక ఏకాంత ప్రదేశంలో ప్రశాంతంగా ఆనందంగా సమగ్రమైన విజ్ఞతతో తనను తానే సంపూర్ణమైన అవగాహనతో ఆస్వాదిస్తూ చిద్విలాసంగా చూస్తోంది.

ఒక తండ్రి పిల్లవాడితో తమ ఇంటికి దూరంగా గల ఒకానొక ఉద్యానవనంలోకి వచ్చాడు. ఆ పిల్లవాడు ఉద్యానవనంలో ఆటలు ఆడుకుంటూవుంటే, తండ్రి ఒకానొక

వాత్సల్యతతో గమనిస్తూ తన అనుభూతితో తాను ఉంటాడు చూచావా? పిల్లవాడు నాన్నను చూచుకుంటూనే ఆటలలో మునిగి గంతులు వేస్తూ వుంటాడు కదా!

అట్లా ఆ పెద్ద పక్షి చిన్న పక్షియొక్క వైనమంతా వాత్సల్యంగా గమనిస్తూనే తాను ప్రశాంత ముద్ర వహించివుంటోంది!. అప్రమేయమై మౌన-ఆనందముల ఆస్వాదన కొనసాగిస్తోంది.

ఆటలాడుకునే పిల్లవాడి వైనం- తన వైనం తండ్రికి తెలుసుకదా! అట్లాగే పెద్ద పక్షికూడా చిన్న పక్షి తన ఆనంద కల్పిత భావనా రూపము - అని ఎరిగి తానుమాత్రం చిత్స్వరూప చమత్కారంగా వెలయుచున్నది.

ఈ దృష్టాంతం పరమాత్మ (పెద్ద పక్షి) జీవాత్మ (చిన్న పక్షి) పరంగా గమనించు. జీవాత్మ తనను తాను దృశ్యాంతర్గతమైన దేహిగా దర్శిస్తోంది. దేహము అనే పంజరంలో చిక్కుకున్న పక్షివలె ఎరుగుచున్నది. సంగతి - సందర్భము - సంఘటనల మధ్య పరిమిత విశేషంగా తనను ఎరుగుచున్నది! కర్మలకు సంబంధించిన సత్ఫల - దుష్ఫలభోక్తగా స్వకీయంగా భావిస్తోంది. అనగా, సత్ఫల దుష్ఫలబోక్తగా తనను తాను ఎరుగుచున్నది. ఈ దేహమునకు ఇక్కడి జన్మ - జరా - మృత్యు సంఘటనలకు వేరుగా తనను తాను ఎరుగుట లేదు. తనేమిటో ఎట్టిదో ఎందుచేతనో తానే ఏమరుస్తోంది!

**ఇక పరమాత్మయో?**

నిత్య జ్ఞానాశ్రయుడు. జీవుడు అనబడు దానికి కేవల ఆనందస్వరూప సాక్షి! జన్మలు - కర్మలు - గుణములు - దృశ్యములు - సందర్భము - సంబంధములు మొ॥ వాటిచే స్పృశించబడనివాడు.

జీవుడు అవిద్యచే జనించుటచేత నిత్యబద్ధుడు!

పరమాత్మ విద్యామయుడై వుండటంచేత నిత్యముక్తుడు!

ప్రతి ఒక్క వ్యక్తి పరమాత్మ (నిత్యముక్తుడు) జీవాత్మ (నిత్య బద్ధుడు)- ఈ ఇరువురి ఏక స్థానవాస చమత్కారమే!. (Everybody is a combination of mere silent al-powerful witness (+) worldly participant). ఈ పాంచభౌతిక దేహమే ఆ మహావృక్షము.

జీవాత్మ పరమాత్మల ఏకస్థాన - ఏకత్వపు చమత్కారం గమనించి సునిశ్చితుడైనవానిని **వివేకి అని, విద్వాంసుడు అని, జ్ఞాతజ్ఞేయుడు** అని శాస్త్రములు పిలుస్తున్నాయి.

"పరమాత్మ మరెక్కడో! జీవాత్మనగు నేనిక్కడ!" - అని పరిమితావగహనకు అనుబంధుడైన

వానిని **అవిద్వాంసుడు** అని చెప్పుతారు. అనగా ప్రతి ఒక్కడు జీవాత్మగా నిత్యబద్ధుడు. పరమాత్మగా నిత్యముక్తుడు.

**ఉద్ధవుడు :** హేపరంజ్యోతి స్వరూపా! పరమాత్మా! జీవ బ్రహ్మైక్యానుభవుడడగు విద్వాంసుడు దేహమును ధరించవలసిన అవసరం కలిగి వుంటాడా? పాంచభౌతిక దేహం త్యజించినవాడై వుంటాడా?.

**శ్రీ కృష్ణపరమాత్మ :**

**శ్లో॥ దేహస్థోఽపి న దేహస్థో విద్వాన్ స్వప్నాత్ యథోత్థితః**

**అదేహస్థోఽపి దేహస్థః కుమతిః స్వప్నదృక్ యథా! (అధ్యా 11, శ్లో 8)**

మిత్రమా!

**నటించువాడు-నాటకములోని పాత్రల** వలె పరమాత్మ జీవాత్మ ప్రతి దేహంలోను యదాతథంగా ప్రదర్శితులైవున్నారు. ఇది గమనించి ఆస్వాదించు. విద్వాంసుడు సదా ముక్తపురుషుడైవుంటాడు. " నేను దేహ బద్ధుడను! .." అనే భ్రమ - బంధ భావాలచే పరిమితుడై వుండడు.

నిద్ర లేచినవాడు, " నేను నిద్ర సమయంలో (కలలో) కనిపించిన సంపద ఆపదలకు చెందినవాడను!" అని భ్రమిస్తాడా? లేదు కదా! స్వప్నంలో కనిపించిన సంపదకు యజమాని ఎవరు? స్వప్నాంతర్గతుడైన ద్రష్టయా? స్వప్న సాక్షియా? మరొకరెవరన్నానా? ఊహచే జనించి - ఊహచే లయించేదానికి యజమాని అనునదేమున్నది?

నిద్ర లేచినవాడు స్వప్న దృశ్యాన్ని తన జ్ఞప్తిలో ఏ విధంగా చూస్తాడో.. విద్వాంసుడు (లేక) నిత్యవివేకి ఈ జాగృత్ దృశ్యాన్ని ఆ విధంగా వర్తమానంలోనే చూస్తూ ఆస్వాదిస్తాడు. దేహంలో ఉంటూనే దేహము నాది. అంతేగాని నేను దేహమునుగాను... అనునది గమనిస్తున్నాడు.

"ఈ వాహనము నాది" అని చెప్పుచున్నాడు - "ఈ వాహనము నేను" - నేను అనడు కదా! దేహము విషయం కూడా అంతే!

**అవివేకియో?** నిద్రలో అడవిలో చిక్కుకున్నట్లు కలవచ్చిందనుకో? ఆ స్వప్నద్రష్టతన ఇంట్లో పరుపుపై బంధువుల మధ్య వుండి నిద్రుస్తున్నప్పటికీ, - నేను అడవిలో చిక్కుకున్నానే! నా గతి ఏమిటి? ఏ మృగమైనా వచ్చి నా వెనక పడదు కదా! .. అనే భయం పొందుతాడు చూచావా? ఆ విధంగా కుమతి అయినట్టి అవివేకి దృశ్యము

ఉన్నప్పుడు – లేనప్పుడు కూడా దృశ్యజాడ్యమును అనుభూతిగా పొందుచూనే ఉంటాడు. అనగా...

**అవివేకి** దేహం ఉన్నప్పుడు, దేహం లేనప్పుడు కూడా దృశ్యతదాత్మ్యరూపమైన సంసారము అనబడేదానిని అనుభవిస్తూనే వుంటాడు.

వివేకికి, దేహం ఉన్నప్పటికీ ఆతని పట్ల సంసారము స్వప్న మాత్రమువలె మొదలే లేనిదై వుంటుంది. అందుచేత...

వివేకికి దేహము యొక్క రాకతో వచ్చేదేదీ లేదు. పోయేదేదీలేదు. అతని సందర్శనము (perception / interpretation) సుఖ – దుఃఖాలకు అతీతమై వుంటుంది.

అవివేకికి దేహము యొక్క పోకతో బంధము పోయేదీకాదు. అన్ని సంబంధ – బాంధవ్యాల బీజములు అంతరమున కొనసాగిస్తూనే ఉంటాడు.

**సుఖ దుఃఖాలు స్వమనోకల్పితాలు!. సంసారము అనునది ఉన్నది మనస్సులోనే! దేహములో కాదు. దృశ్యములో కాదు. జగత్తులో కాదు. ఆత్మయందు కాదు.**

స్వస్వరూపాత్మతత్త్వము గురించి వేదాంగములు – విజ్ఞులు చెప్పుచున్న వాక్యములను వివేకముతో గ్రహించాలి సుమా! అట్టి వివేకి – ఇంద్రియములను (అనగా ఈ భౌతిక శరీరమును) ఇంద్రియార్థములను (శబ్ద–స్పర్శ– రూప – రస – గంధములను) గుణములను (సత్వ – రజో – తమో త్రిగుణములను) గ్రహిస్తూ – ఉపయోగిస్తూ – పాల్గొనుచూ కూడా **ఇదంతా జగన్నాటకంలోని పాత్రకు సంబంధించినవే గాని, నాకు సంబంధించినవి కావు!...** అని గమనిస్తూనే వుంటాడు. " నేను జీవుడుగా మారి పోయాను! గుణములు నన్ను ఆవరిస్తున్నాయి! ఈ శరీరం నాకు బంధము. ఇంద్రియ విషయాలు నన్ను పట్టుకొని పీడిస్తున్నాయి. .." ఇటువంటి ఆయా అల్ప భావనలకు చోటివ్వడు. "నేను వీటికి కర్తను! భోక్తను! ఇవి నాకు సంబంధించినవి! నేను వీటికి సంబంధించనవాడను ..." అనే పరిమిత దృష్టులను స్వస్వరూపముపై ఆపాదించుకోడు. నటుడు నవరసాలు ప్రదర్శిస్తూ – ఈ కోపం, ఈ ప్రేమ, ఈ ఇష్టం, ఈ అయిష్టం, ఈ ఆవేశం నేను ప్రదర్శిస్తున్నప్పటికీ, **ఇవన్నీ నేను నటిస్తున్న పాత్ర సంబంధమైనది! పాత్ర నాటకంలోనిది. నేను సర్వదా వీటితో ప్రమేయం లేని స్వరూపం కలవాడినే! –** అని తెలిసియే వుంటాడు కదా! అందుచేత వివేకి (లేక విజ్ఞుడు) ఇంద్రియార్థరూపమగు జగత్తు చేతగాని, ప్రకృతి రూపమగు గుణముల చేతగాని, సహ జీవులతో సందర్భానుచితంగా ఏర్పడే సంబంధ – అనుబంధ – బాంధవ్యముల చేతగాని

ప్రమేయము పొందదు! వాటిని స్వీకరిస్తూనే, స్వీకరించనివాడై ఉంటాడు. ఆతనికి ఏదీ బంధముకాదు. ఇక క్రొత్తగా పొందవలసిన మోక్షమేమున్నది? "నేను పాత్రధారినై వుంటూనే...త్రిగుణములకు సూత్రధారినికదా!" అని ఎరిగి వుంటాడు.

**ఇక అవివేకి విషయానికివస్తే...!**

దైవాధీనంగా జగత్ కల్పనలోని ఒకానొక అంతర్భాగంగా వచ్చిపోయే ఈ శరీరములను చూస్తున్నప్పుడు గాని, ఇక్కడి త్రిగుణ విన్యాసం చేత ఏర్పడుచున్న ఇష్ట-అయిష్ట, సానుకూల్య ప్రాతికూల్య, ప్రియ -అప్రియములను గమనిస్తున్నపుడుగాని, **దీనికి నేను కర్తను! దానికి వారు కర్త!...** అనే భ్రమాహంకారానికి చోటిస్తున్నాడు!. ఎప్పుడైతే కర్తృత్వము వహించటం - ఆపాదించటం ప్రారంభిస్తున్నాడో.. అప్పుడు జగదనుభవములచే నిబద్ధుడు అగుచున్నాడు" కర్తాఽస్మి!.. అని భావించి బంధంకొని తెచ్చుకుంటున్నాడు. " నాఽహమ్ కర్తా! మమ మాయా కర్తా!" - అనే విజ్ఞతను ఏమరుస్తున్నాడు.

విద్వాంసుడు నిత్యానిత్య వివేకి, వైరాగ్యయుక్తుడు అయినవాడు...,

పడుకున్నప్పుడు, కూర్చున్నపుడు, వ్యవహారాలలో ప్రవేశిస్తున్నప్పుడు, చూస్తున్నప్పుడు, స్పర్శిస్తున్నపుడు, వాసన చూస్తున్నప్పుడు, భుజిస్తున్నపుడు - వింటున్నప్పుడు- ఇటువంటి సర్వ సందర్భములలోనూ ఈ ఈ త్రిగుణ ప్రదర్శన సందర్భాలలోను **నేను బద్ధుడిని** అని భ్రమించడు. వాటిచే అతడు నిబద్ధుడు కాడు.

"ఈ శరీరములోని ఇంద్రియాలు ఇంద్రియార్థాలచే ప్రేరేపించబడి ప్రవర్తిస్తున్నాయి. వీటిచే నేను నిబద్ధుడను కాదు! పరిమితుడనుగాను!"- అని గమనించుచున్నవాడై ఉంటున్నాడు.

సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. అట్టి సూర్య బింబం ఒక తటాక జలంలో ప్రతిబింబిస్తోంది. సూర్య బింబము తటాక జలంలో ప్రతిబింబిస్తోంది కాబట్టి... అది తటాకజలంచే బంధింపబడింది - అని అంటామా? ప్రతి బింబించినంత మాత్రం చేత సూర్యబింబం జలానికి సంబంధించినదని గాని, జలంలో సూర్యబింబం చిక్కుకున్నదని గాని ఎవ్వరూ అర్థం చేసుకోరు కదా!. గాలి అంతటా వీస్తూ వుంటుంది! అటువంటి గాలి దేహాలలోను, వస్తువులలోను, పాత్రలలోను ( Eg. In four wheeler Tyres, Foot Balls ect.,) చిక్కుకున్నదని ఎవ్వరమూ అనం కదా!. స్వప్నం గురించి ఎరుకగలవాడు **స్వప్నంలో నేను చిక్కుకున్నాను.. ఇప్పుడేమో, బయటకు వచ్చాను** అని అనుకోడు కదా!.

అట్లాగే విద్వాంసుడు కూడా – నేను ఈ దేహముచే నిబద్ధుడను. ఈ ఇంద్రియార్థములు – ఈ పరిస్థితులు – ఈ సంబంధ బాంధవ్యములు నన్ను నిబంధిస్తున్నాయి – అనే భ్రమను పొందడు.

నేను జీవుడుగా జగద్విషయాలలో ప్రతిబింబిస్తున్నాను. అయితేఏం? **ఆకాశంలో సూర్యునివలె ఆత్మస్వరూపుడనై, అప్రమేయుడనై ఈ ఈ భావాభావములను వెలిగిస్తున్నాను.** – అని గమనించినవాడై వుంటాడు. (లేక) **ఆత్మ సూర్యుడనగు నేను ఈ మనో – దేహ – జగత్ తటాకాలలో ప్రతిబింబిస్తున్నాను. ఇంత మాత్రమే!**... అని గ్రహించి వుంటున్నాడు.

ఒకడు అద్దంలో ముఖం చూచుకుంటూ, ఈ అద్దంలో నా ముఖం చిక్కుకున్నది – అని వాపోతాడా? పసిపిల్లవాడు అద్దం గురించి తెలియక అట్లా (Having no knowledge about a mirror) అనుకుంటాడేమో మరి!

ఒకడు నిదురలేచిన తరువాత స్వప్నదృశ్యం గురించి ఎట్లా అనుకుంటూ వుంటాడు? వివేకి వర్తమానంలోనే తన ఎదురుగా వున్న ఇంద్రియార్థ సమ్మేళనము – సంగతి, సందర్భముల మేళావంటి ఈ జగత్తును ఆ రీతిగా చూస్తు ఉంటాడు. జగత్తు నుండి, దేహమునుండి, తదితదిత దేహ సంబంధములనుండి సదా – సర్వదా నివృత్తుడై, అతీతుడై, దర్పణ స్వబింబదర్శనదృష్టి కలవాడై వుంటాడు. **విజ్ఞానియగు వివేకి** ఇంద్రియములను విషయములతో ప్రవర్తింపజేస్తూ.. తాను సర్వదా అతీతమైన అప్రమేయత్వమును వహించియే ఉంటాడు. ఎవని సంకల్పమైతే ప్రాణ – ఇంద్రియ – మనో – దేహాదుల క్రియలతో తాదాత్మ్యము చెందకుండా వుంటుందో.. అట్టివాడు దేహస్థుడై వుండి కూడా, గుణములకు అతీతుడు, వినిర్ముక్తుడు (Ever - beyond and Ever- relieved) అయివుంటాడు.

ఎవ్వరైతే ఈ శరీరము ఒకరిచే అర్చించబడుచున్నప్పుడు, మరొకరిచే అవమానించ బడుచున్నప్పుడు ఉభయ సందర్భములలో కూడా సంతోష – దుఃఖములచే స్పర్శించబడకుండా ఇదంతా "యాదృచ్ఛికం (No body as cause)" అని గమనిస్తూ– సమదృష్టితో చూస్తూ వుంటాడో – అతడే బుధుడు! ముక్త పురుషుడు! అట్టివాడు సాధువులను చూసి స్తుతించడు! అసాధువులను దూషించడు (లేక) నిందించడు. గుణ దోషములకు వ్యధచెందడు! సద్గుణములను చూసి మురిసిపోడు! దేనినీ – ఎవ్వరినీ

దూషించడు, ఆశ్చర్యపడిపోడు. ఆతడు జగత్తుకు ఆవల ఆత్మారాముడై జగత్ వృత్తులకు పట్టుబడనివాడై వుంటాడు! ఒక జడునివలె ప్రాపంచిక సత్ అసత్ విషయ పరంపరలలో చిక్కుకోడు, మాట్లాడడు, ధ్యానించడు. అన్నింటా ఆత్మనే ధ్యానిస్తూ వుంటాడు. జగత్ నాటకంలో నటిస్తూనే ప్రేక్షకుడిలాగా చూస్తూ ఉంటాడు.

**ఉద్ధవుడు:** స్వామీ! అంతటి అతీతత్త్వము ఆత్మారామత్వము ఒనగూడాలంటే వేద - వేదాంగ పాండిత్యం అవసరమంటారా? (లేక) వాటి ఆవస్యకత అనివార్యం కాదంటారా?

**శ్రీకృష్ణుడు: ఓ ఉద్ధవా! ఆత్మ యొక్క జగత్ ప్రదర్శనా చమత్కారము - జగత్తు ఆత్మకు అద్వితీయము** ... అను విశేషం ఎరుగక, **నా ఆత్మయే జగత్ దృష్టిచే జగత్ రూపంగా కనిపిస్తోంది...** అని గమనించక... రోజులు గడుపుచున్నవానికి ఏ పాండిత్యమువలన ఏం లాభం? శబ్ద బ్రహ్మము (వేద మంత్రోచ్ఛారణము) నందు నిష్ణాతుడైకూడా ఆత్మతత్త్వము యొక్క అవగాహన యందు నిష్ణాతుడవకపోతే,... అట్టి శాస్త్ర పాండిత్యము నిష్ఫలమైన శ్రమయే సుమా!. పాలు ఈయని ఆవు, పతి పట్ల శ్రద్ధలేని భార్య, పరాధీనమైన దేహం, దుష్టగుణములు గల కొడుకు, దానం చేయని లోభియొక్క ధనము, అర్ధంలేని వాక్ శబ్దాలు ఏ విధంగా వ్యర్థమో, అనేక దుఃఖములకు కారణమో... అట్లాగే ఆత్మ జ్ఞానమును, ఆత్మతత్త్వానుభూతిని పెంపొందించుకొనే ఉద్దేశ్యము లేని వేద శబ్దోచ్ఛారణ నిష్ఫలము, దుఃఖభారము కూడా! ఈ దృశ్య జగత్ యొక్క ఉత్పత్తి - స్థితి లయములు ఎందులో చమత్కారంగా దృష్టికి అగుపిస్తున్నాయో - అట్టిదంతా ఆత్మతత్త్వ స్వరూపుడనగు నా లీలావినోదావతారముగా గమనిస్తూ - ఈ జగత్తు నాయొక్క లీలగా, క్రీడగా - స్తుతించే వాక్కే ప్రయోజనకరము. **ఈ దృశ్యమంతా పరమాత్మయొక్క లీలా వినోదమే!** అని గమనించక, ఇక్కడి ప్రాప్తాప్రాప్తములకు - సుఖదుఃఖములకు సంబంధించిన మాటలనే చెప్పుకుంటూ పోతుంటే ఏమి లాభము? బుద్ధిమంతుడైనవాడు అటువంటి వాక్యాలు ఉచ్చరించడు! ఇంకొకరు మాట్లాడుతుంటే వినడు!. ఆహాఁ! ఈ బంగారము ఎంత విలువైనది!.... అని గమనించేవానికి ఆభరణముయొక్క వంపుసొంపులు విషయమే కాదు కదా!

## సర్వము బ్రహ్మమే!

ఓ ఉద్ధవా! ఇక్కడ నీకు కనిపించే నానాత్వము (Multiplicity) అనే భ్రమను విడచిపెట్టు. ఇక్కడి భిన్నత్వంలోని ఏకత్వస్వరూపుడను - సర్వగతుడను అగు నన్నే ఆశ్రయించు. నీ

మనోబుద్ధులను పరస్వరూపుడనగు నాకు సమర్పించు. నిర్మలమైన మనస్సుతో **అంతా పరమాత్మ యొక్క ప్రదర్శనమే** అని గమనించటం ద్వారా మనస్సును నాకు సమర్పించు. "నా యొక్క దేహమనోబుద్ధి చిత్తాహంకారాలతోసహా ఈ సర్వము ఈ సర్వ జీవులు పరమాత్మ స్వరూపమే" - అని గ్రహించి వర్తించు. సర్వకాల - సర్వావస్థల యందు జిజ్ఞాసాపూర్వకంగా ఆత్మ ధ్యానం చేయి. నానాత్వ దర్శనం మొదలంట్ల విడనాడు!.

## 12. దైవకార్యంగా స్వధర్మ నిర్వహణ:

ఒక వేళ జీవాత్మ-పరమాత్మ **అంతా బ్రహ్మమే!** ... అనే మనోనిశ్చయం నీకు కుదరటం లేదా? సరే! అయితే, సర్వ కర్మలు ఎటువంటి లోక సంబంధమైన అపేక్ష లేకుండా కేవలం నాకు సమర్పిస్తూ సమాచరించు. చక్కగా నిర్వర్తించు!. లోక పావనము - క్షేమకారకము (శుభద్రము) అగు నా అవతార విశేషముల కథాశ్రవణం చేయి! సర్వ తత్త్వస్వరూపుడనగు నన్నే స్మరించు. గానం చేయి. దివ్యమైన నా జన్మ - కర్మ విశేషములను (చిన్ని కృష్ణుని లీలలు - అవతార విశేషాలు) ఇత్యాది మననం చేయి.

ఓ ఉద్ధవా! నన్నే ఆశ్రయించినవాడవై నీ యొక్క ధర్మ - అర్ధ - కామములను నన్ను ఉద్దేశ్యించి ఆచరిస్తూవుండు. అప్పుడు సనాతనపురుషుడనైన నా పట్ల నీకు క్రమంగా నిశ్చలమైన - ఏకాగ్రమైన - అచంచలమైన భక్తి రూపు దిద్దుకుంటూ వుంటాయి. సత్సంగమును ఆశ్రయిస్తూ వుండు. ధ్యానిస్తూ వుండు. నన్ను దర్శిస్తున్నావాడనై నా స్వరూపమును పొందగలవు.

**ఉద్ధవుడు:** ఓ దేవదేవా! ఎందరోసాధువులు సత్పురుషులు వివిధ రీతులుగా నిన్ను కీర్తిస్తూ వుంటారు! నీ గురించి ఆర్తులై - జిజ్ఞాసువులై - అర్ధార్థులై - మోక్షార్థులై గానం చేస్తూ వుంటారుకదా! వారిలో ఎవ్వరు ఉత్తములు? ఎట్టివారి మార్గము మాకు మరింత అనుసరణీయం? ఎట్టి సాధువుల మార్గం అనుసరిస్తే మేము సత్పురుషులకు ఆదరణీయులం అవుతాం? ఓ పరుమపురుషా! పురషోత్తమా! ఓ లోకాధ్యక్షా! జగత్ప్రభూ! నీకు ప్రణామం చేస్తూ నీపట్ల అనురక్తుడనై అడుగుచున్నాను? శరణాగతుడనై వేడుకొనుచున్నాను. ఎవరియొక్క ఏఏరీతి అయిన - మార్గము మాకు శిరోధార్యమో, అనుసరణీయమో... చెప్పండి!.

హే శ్రీ కృష్ణా! మీరు ప్రకృతికి అతీతులు! పరబ్రహ్మ స్వరూపులు! ఆకాశమువలె అంతటా మౌనంగా వేంచేసి ఉన్నవారు! నిర్వికారులు! నిరాకారులు! అట్లు అయివుండి కూడా,...

మీ భక్తుల సౌలభ్యం కొరకై బిన్నభిన్న రూపములతో అవతరిస్తున్నారు! అట్టి మీ అవతారమును శ్రవణ-మననం చేస్తున్న భక్తులు మాకు అనుసరణయులు కదా! అట్టి భక్తుల గుణగణములు కూడా చెప్పండి! వారిని గుర్తించటమెట్లా? వారిని మేము శరణువేడి మనస్సును జయించటం, తమకు సమర్పించటం నేర్చుకుంటాం!.

**శ్రీకృష్ణుడు:** ఓ ఉద్ధవా! ఎవ్వరు ఏకారణంగా నన్ను ఆశ్రయించినాసరే వారు నాకు ఇష్టులేనయ్యా! ఎవ్వరు ఏకారణముగా దీపమును సమీపించినా కూడా, వారిపై కాంతి ప్రసరితమౌతుంది కదా!

మహనీయులగు మార్గదర్శకుల విలక్షణ లక్షణములను వివరిస్తాను. ఏ ఏ మార్గములలో నీవు ఆదిపురుషుడనగు నన్ను జేరవచ్చునో... కొన్ని మార్గాలను ఇక్కడ ఉదహరిస్తున్నాను. విను... ఇవి ప్రవృద్ధం చేసుకోవటమే మీకు శ్రేయోదాయకం!

## 13. భక్తిలక్షణములు

**శ్లో॥ కృపాలుః అకృతద్రోహః తితిక్షుః సర్వదేహినామ్**
**సత్యసారో అనవద్యాత్మా సమః సర్వోపకారకః ॥**

**కామైరహతధీః దాంతో మృదుః శుచిః అకించనః**
**అనీహో మితభుక్ శాంతః స్థిరో మచ్ఛరణో మునిః**

**అప్రమత్తో గభీరాత్మా ధృతిమాన్ జితషడ్గుణః**
**అమానీ మానదః కల్యో మైత్రః కారుణికః కవిః ॥** **(అధ్యా 11, శ్లో 29-31)**

1. **కృపాలుడు :** ఆతడు సర్వ జీవుల పట్ల అపారమైన - అకారణమైన కృపారసం కురిపిస్తూ వుంటాడు. **ఈ కనబడే వారంతా కృష్ణ చైతన్యవిన్యాసమే కదా! ...** అనే ఎరుకచే అతని ప్రేమ, కృప సర్వజీవులపట్ల స్వభావసిద్ధమై వుంటుంది. (Their love for all is natural and unconditonal by habit).
2. **అకృతద్రోహుడు:** ఆతని బుద్ధియందు ఎవ్వరిపట్ల ద్రోహచింతన ఈషన్మాత్రం కూడా వుండదు. తాను ప్రేమించే పరమాత్మకు వేరైనది ఏదైనా వుంటే కదా... ద్వేషించటానికి? (Non-violent, Non-revengeful to anybody)
3. **సర్వ దేహినామ్ తితిక్షః..** సర్వ దేహుల పట్ల మాతృ వాత్సల్యం కురిపిస్తూ ఓర్పు వహించినవాడై వుంటాడు (Maintaing utmost forbearance)

4. **సత్యసారుడు:** ఆతడు సర్వదా అనిత్యమైన దానికి ఆధారమైన నిత్యమగు సత్ పట్ల దృష్టి, ధ్యాస కలిగి ఉంటాడు. (cogitation towards Final Truth)

5. **అనవద్యాత్మా:** దృశ్యముచే జయింపబడక, తానే దృశ్యమును జయించినవాడై, అతీతుడై ఆత్మాభిషిక్తుడై వుంటాడు. (Sensing unity inspite of Diversity)

6. **సమః** : సర్వదా సర్వత్రా సమభావము కలిగి ఉంటాడు. గుణములకావల గుణాతీత దృష్టిచే సర్వ సమభావంగా సర్వస్థితి గతులను చిరునవ్వుతో దర్శిస్తూ వుంటాడు. (Maintaining beyondness smilingly).

7. **సర్వోపకారకః:** సర్వజీవుల పట్ల సమరస పూర్వక స్నేహ – సేవాభావనతో వీరికి నేనేమి సేవలు అందించగలను... (What is that I can do for these) అనే భావనచే సర్వులకు ఉపకారి అయివుంటాడు.

8. **అహతకాముడు :** కోరికలు ఆతనని జయించలేవు. ఆతడు ప్రాపంచిక కోరికలకు దాసుడైవుండడు. ఆతని బుద్ధి కోరికలను దాటి వేసినదై వుంటుంది. సంయమి అయివుంటాడు. ఇంద్రియములను తన ఆధీనంలో ఉంచుకున్నవాడై వుంటాడు. (Wordly expectations or possessions do not influence his stance)

9. **మృదుః :** మృదు మధుర స్వభావుడై వుంటాడు. (Soft and positive expressions)

10. **శుచిః :** ఇతరుల పట్ల – ఆయా సంగతి, సందర్భముల పట్ల అశుచి అయిన – అపవిత్రమైన అభిప్రాయాలు దరిజేరనీయడు. శుచి అయిన పవిత్రమైన భావాలు పెంపొందించుకొని వుంటాడు. (Healthy, optimistic and pure ideas, views and opinions)

11. **ఆకించనుడు:** వాళ్ళు అజ్ఞానులు – వీరు కారు. వారు మంచివారు – వీరు కాదు.... ఇట్టి కించత్వము తదితరులపైగాని, తనపై గాని ఆపాదించుకోడు. (Belittling neither others nor self since one's own self is pervading in and as all others)

12. **అలోకుడు:** ఈ లోకంలో ఉంటూనే లోక రహితుడై లోకాతీతుడై వుంటాడు. పడవ నీళ్లల్లో ఉంటుంది. నీళ్లు పడవలోకి ప్రవేశించనీయం కదా! అట్లాగే విజ్ఞుడు జగత్తులో వుంటూ కూడా, హృదయంలో ఆత్మ స్వరూపమునే మననం చేస్తూ వుంటావు. బాహ్య రూప – గుణాలు కాదు!. (Beyond the world but not belonging of the world)

13. **మితభుక్తుడు:** ఏది ఎంతవరకు స్వీకరించాలో, తత్సమయంలోనే ఎంతవరకు త్యజించినవాడై వుండాలో... ఎరిగినవాడై వుంటాడు. **మితంగా ఆహార (దృశ్య) స్వీకారం** అనే సమర్ధమైన కళను ఎరిగినవాడై వుంటాడు!. (Wel-controled while receiving the world)

14. **శాంతః :** ఈ ప్రాపంచక విషయాలు ఆతనిని సమీపించినపుడు అవన్నీ తమతమ ఉద్వేగాలన్నీ త్యజించి సశాంతించినవై వుంటాయి. ఆయన పరమశాంతుడై జగద్విషయాలు చిద్విలాసంగా వీక్షిస్తూ వుంటాడు. (Peaceful and pleasant)

15. **స్థిరుడు:** ఇదంతా పరమానందమగు పరమాత్మ స్వరూపమే! శ్రీ కృష్ణ చైతన్యాందమే – అనే ఎరుక విషయంలో అచ్యుతుడై వుంటాడు!. ఈ కనబడేవారంతా నారాయణము అను పరతత్త్వముయొక్క ప్రత్యక్షరూపమే... అని గమనిస్తూ ఉంటాడు. (All this is manifestation of Divinity)

16. **మచ్ఛరణో :** సర్వదా పరమాత్మ యొక్క మహిమను మననం చేస్తున్నవాడై, శరణాగతుడై వుంటాడు. మత్–పాదాశ్రయుడై, మత్–శరణాగతుడై వుంటాడు.

17. **మునిః :** సర్వ ప్రాపంచక సందోహాల పట్లా – ఇది ఇట్లా ఉన్నా ఒక్కటే! మరొక రీతిగా ఉన్నా ఒక్కటే – అను రూపంగా మౌనం వహించినవాడై వుంటాడు! జగద్విషయముల పట్ల చిరుమందహాసముతో కూడిన మౌనము వహించినవాడై వుంటాడు!. (మౌనేన కలహం నాస్తి).

18. **అప్రమత్తుడు:** సర్వము మమాత్మయే! అను భావనలో నిత్యోదితుడై వుంటాడు! ప్రమత్తత (Drowsyness/ Dullness / sleepy/ / Mildness) లేనివాడై వుంటాడు. సర్వదా **మామాత్మా సర్వభూతాత్మా** భావనలో మెళుకువ కలిగి వుంటాడు.

19. **గభీరాత్మా :** పిరికితనం వదలి వుంటాడు! మేఘగంభీర స్వభావుడై వుంటాడు!. హృదయంలో సర్వేశ్వరుడే కర్త–భోక్తగా వేంచేసి ఉండగా, ఇక లోటేమిటి?

20. **ధృతిమాన్:** ఆత్మ సర్వదా స్వస్వరూపంగా ఉండగా... ఇక భయం దేనికి? ఆతడు సర్వదా ఆయా సర్వ పరిస్థితులందు ధైర్యము కలిగిన వాడై వుంటాడు!.

21. **జితషడ్గుణుడు:** శోకము – మోహము – జననము – మరణము – ఆకలి – దప్పిక ... అనే ఆరు గుణములచే నిబద్ధుడు– ఆకర్షితుడు కానివాడై వుంటాడు.

తినటం కోసం జీవించడు. జీవించటం కోసం తింటాడు. ఆ ఆరింటికి అందక వేరైన స్వభావము పెంపొందించుకొనినవాడై వుంటాడు.

22. **అమాని :** నన్ను ఇతరులు గౌరవించెదరు గాక! గుర్తించెదరుగాక! నా గొప్పతనములను గమనించెదరుగాక! – అను రూపమైన సాంసారిక మానత్వజాడ్యం ఆతనికి ఉండదు.

23. **మానదః** ఇతరుల గొప్పతనము, ఆధ్యాత్మికత, ఔన్నత్యములను గుర్తించి, గమనిస్తూ... సంభాషించువాడై వుంటాడు. ఇతరులకు గౌరవమును తెలియజేయువాడై వుంటాడు. (Respectful towards other Learned)

24. **కల్యో :** (Out spoken) బ్రహ్మ జ్ఞానమును ఇతరులకు తెలియజేయుటలో వివరణ పూర్వకమైన వాక్ సంపత్తి, నిపుణత్వము కలిగినవాడై వుంటాడు. సంశయ రహితంగా భాగవతత్వమును ప్రకటించువాడై ఉంటాడు.

25. **మైత్రః** : ఇతరులపట్ల స్నేహభావము, సౌహార్ద్రత కలిగి వుంటాడు. (Friendly)

26. **కారుణికః** ఆతని హృదయం ప్రేమతో, కరుణతో సర్వదా నిండివుంటుంది. (Love, Kindness and Empathy)

27. **కవిః :** తత్త్వజ్ఞానము దృష్టాంత పూర్వకంగా గ్రహించువాడై, ఉపదేశించగల వాడై వుంటాడు. (Expertise in understanding and interpreting Celestial messages and Ideas)

28. **ససత్తముడు:** గురువులు బోధిస్తున్న చెప్పుచున్న గుణదోషములను తనయందు గమనించి, వాటిని తన దరిజేరనీయనివాడై వుంటాడు. తను విన్న గుణ దోషవాక్యములను తనపట్ల అన్వయించుకుంటూ, తన గుణదోషములను సరిదిద్దుకునే ప్రయత్నంలో వుంటాడు.

సర్వ ధర్మములను (దేహ–మనో– చిత్త – బుద్ధి – అహంకార ధర్మాలను) (The functional ) పరిత్యజించి, సర్వదా సర్వాత్మకుడనగు నన్నే భజిస్తూ వుంటాడు!.

29. **భజంతి అనన్య భావేన!**

అన్నీ వదలి పరమాత్మపై దృష్టిపెట్టి భజిస్తూనే ఉంటాడు.

పరమాత్మ ఈ సర్వ జీవుల ప్రత్యక్షత్వమునకు అన్యము కాదు! – అని గ్రహించి ఈ విశ్వమును ఉపాసిస్తూ ఉంటాడు.

స్వామికి వేరుగా నేను లేను. నేను ఆయన యొక్క అనేక యోచనలలోని ఒక యోచనను నావి అనిపించేవన్నీ మనో-బుద్ధి - చిత్త - అహంకారాలలతో సహా ఆయనవే...! అని నిర్ద్వంద్వుడై ఉంటాడు.

పై లక్షణములు గల వారు - ప్రవృద్ధ పరచుకొనుచున్నవారు... భక్తులుగా కీర్తించబడుచున్నారు!.

తెలిసికొనియో, తెలియకయో.. ఎవ్వరైతే అనన్యభావం అనే ఉపకరణంతో సచ్చిదానందుడను-అనంతుడను-సర్వాంతర్యామినియగు నన్ను-నా సత్ స్వరూపమును విని-గమనించి-గ్రహించి ఏకాంతభావంతో కీర్తిస్తున్నారో.., అట్టివారు **భక్తులు** అని చెప్పబడుచున్నారు!.

ఓ ఉద్ధవా!

- నా మూర్తిని దర్శించు!
- నా భక్తులను సందర్శించు. వారి పాదపద్మములను స్పృశించు. వారిని సేవించు. స్తుతించు. నమస్కరించు.
- భగవత్ గుణములను - కర్మలను మననం చేయి.
- భక్తుల గుణ - గణాలను గానం చేయి.
- శ్రద్ధాసక్తులతో నా కథలను విను.
- నిరంతరం నన్ను ధ్యానించు.
- **"నేను పరమాత్మకు దాసుడనుకదా!"** అను దాస్య భావనతో, **"నాది అనునదేమీ లేదు! అంతా పరమాత్మదే! పరమాత్మయే!"** - అని ఆత్మనివేదన చేయి!.
- నా జన్మ - కర్మ - కథనములను మననం చేయి.
- నాకు సంబంధించిన పర్వదినములను (Festival Occasions / Days relating to Divine Activities) ఆనందంతో, ప్రత్యేక శ్రద్ధలతో నిర్వర్తించి వినియోగించుకో!.
- గానము - నృత్యము - గోష్ఠి (ఉపన్యాసములు) - మందిరములలో ఉత్సవములు జరుపుకోవటం .... మొదలైనవన్నీ నిర్వహిస్తూ - నిర్వర్తిస్తూ వుండు!.
- పవిత్ర స్థలములను సందర్శిస్తూ తీర్థయాత్రలు సేవిస్తూ వుండు!

- ఉత్సవములలో పాల్గొనుము
- **వైదికమైన** (ఉపవాసము - వేదగానము మొదలైన) - **తాంత్రికమైన** (రుద్రాభిషేకము - వ్రతములు మొదలైన) దీక్షలను స్వీకరిస్తూ వుండు.
- ఆలయములలో శ్రద్ధాభక్తులతో దేవతామూర్తులను ప్రతిష్ఠిస్తూ వుండు! ఒంటరిగా చేయి. అట్లాగే నలుగురిని కలుపుకొని కూడా అట్టి కార్యములను నిర్వర్తించు.
- పరమాత్మ కొరకై పుష్పగుచ్ఛాలను, పూదండలను, ఉద్యానవనాలను, పూజామందిరాలను, తీర్థ ప్రదేశాలను, ఆలయములను నిర్మించటంలో పాల్గొనుము. నీవంతు సేవ నీవు నిర్వర్తించు.
- సేవకాభావం కాలవాడవై శ్రద్ధాసక్తులతో, నిష్కపట భావనలతో భగవత్ మందిరాన్ని శుభ్రం చేయటం, అలకటం, నీళ్ళు జల్లటం, ముగ్గులు వేయటం... ఇటువంటి పనుల ద్వారా ఆలయసేవలు చేయి.
- అమానిత్వము (Not-Deeming himself as some thing greater than others), అదంభిత్వము (Not Trying to pose as better than others) త్యజించు. నీవు చేసే మంచి పనులను ధంభముతో చెప్పుకోవద్దు,
- **పరమాత్మ సమక్షంలో దీపము వెలిగిస్తున్నాను...** అని భావించి దీపం వెలిగించు. ఆ దీపపు కాంతిలో పరమాత్మ సమక్షంలో కార్యములు నెరవేరుస్తున్నాను కదా! అనే భావనను ఆశ్రయించివుండు!.
- నీకు ఎప్పుడు - ఏ వస్తువు ప్రియంగా వుంటుందో... ఆ పదార్థాన్ని నాకు సమర్పించు! ప్రియమైన వస్తువును పరమాత్మకు సమర్పించినప్పుడు అట్టి సమర్పణ స్వతఃసిద్ధంగానే అమోఘఫలం ప్రసాదించగలదు.

## 14. ఉపాసన - పూజావిభూతులు

**ఉద్ధవుడు:** స్వామీ! మీ పూజా స్థానములు ఏవేవి?

**శ్రీకృష్ణుడు:** సూర్యుడు - అగ్ని - బ్రహ్మజ్ఞులు - ఆవు - విష్ణుభక్తులు - ఆకాశము - వాయువు - జలము - ఈ భూమి - ఆత్మ - సమస్త ప్రాణులు ... ఇవన్నీ కూడా నా పూజా స్థానములే!. ఉపాసనకొరకై విభూతులే! ఎక్కడ నీకు పవిత్రమైన భగవత్ భావన ఏర్పడి ఉపాశించాలని ఉంటుందో,... అక్కడ అట్లే నేను వేంచేయుటకు సంసిద్ధుడనై ఉంటాను.

- వేద మంత్రములతో **సూర్యుని రూపంగా** ఉన్న నన్ను పూజించు.
- నేయి – హవము చే నాయొక్క **అగ్ని రూపాన్ని** పూజించు.
- **సన్యాసుల – బ్రాహ్మణుల** రూపంలో ఉన్న నన్ను **ఆతిథ్యముచే** పూజించు.
- **గోవు – కుక్క** మొదలైన రూపములలో ఉన్న నన్ను పచ్చగడ్డి – ఆహారము సమర్పిస్తూ పూజించు.
- **పేదవారి** రూపములలో ఉన్న నన్ను **దానము, ప్రియవాక్యములు, కుశల ప్రశ్నలు** మొదలైనవాటిచే పూజించు.
- భక్తుల రూపంగా ఉన్న నన్ను ఆత్మబంధు భావంతో – జ్ఞానుల రూపములో ఉన్న నన్ను సత్కారముల ద్వారా పూజించు.
- నిరంతరం ధ్యానం ద్వారా నీ హృదయాకాశంలో **ముఖ్యప్రాణ** రూపంగా ఉన్న నన్ను పూజించు. పంచప్రాణములను ప్రాణేశ్వరరూపంగా భావించి పూజించు!
- **అర్ఘ్యప్రదానము – పుష్పములతో** జల స్వరూపుడనై ఉన్న నా రూపమును పూజించు!.
- షోడశ – ఉపచారములతో, మంత్రోచ్ఛారణతో నా **శిల – మృత్తికా – పఠరూపములను పూజించు.**
- **సహజీవుల** రూపములో ఉన్న నన్ను **సాత్వికవచనములు – సహకారము – సేవా భావము – శబ్దము – ఆహార సమర్పణ...** ఇత్యాదులతో పూజించు!.
- **సమదర్శివై, సర్వ జీవరాసులలో సర్వదా అంతర్యామిగా వేంచేసియున్నన్న నన్ను** "పరమాత్మయే ఇన్ని రూపాలుగా కనిపిస్తున్నారు" – అను మననముచే సమదర్శనముతో అద్వితీయ కృష్ణచైతన్యానంద దర్శనంగా పూజించు.
- సమహితత్వముతో సహ జీవులను ప్రేమాస్పదంగా – వాత్సల్య దృక్కులతో దర్శించటం ద్వారా సర్వాంతర్యామియగు నన్ను ఆరాధించుచున్నట్లే అవుతుంది.
- ఈ సర్వ ప్రదేశములలోను శంఖు – చక్ర – గద – పద్మముల ధరించిన నా చతుర్భుజ సమన్వితమైన శాంతరూపమును ఏకాగ్రచిత్తంతో మనస్సులో మనోపూర్వకంగా, మనస్సు అనే కుంచతో చిత్రించుకొని ధ్యానించు! పూజించు.

**ఇష్టా-పూర్తములతో నన్ను అనుష్ఠించు.**

**ఇష్టములు :**

- "ఇష్ట" అనబడే కర్మలయినట్టి యజ్ఞ - యాగ - సహస్రనామార్చనాదులతో ఏకాగ్ర చిత్తంతో నన్ను మనన పూర్వకంగా ఆరాధించు! పూజించు!.

**పూర్తములు :**

పూర్తములు అనబడే సహజీవుల సౌకర్యకర్మలు అయినట్టి....

- బావులు త్రవ్వించటం, చెఱువులు శుభ్రం చేయించటం, రహదారులు నిర్మించటం.
- త్రాగునీటి వసతి కల్పించటం.
- గ్రామాలలో వైద్య వసతి కల్పించటం, ఇటువంటి కర్మల ద్వారా... **సర్వ రూపములునావైన నన్ను పూజించు! ఆరాధించు! ప్రవృత్తిని పవిత్రం చేసుకొని ప్రదర్శించు!.**

## 15. సత్సంగము

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! ఈ సందర్భంలో మరొక ముఖ్యమైన విషయం కూడా నీకు సూచిస్తున్నాను. నేను సత్పురుషులచే సదా సమాకర్షుడను! వారున్న చోట నేను శంఖ - చక్ర - గదా - పద్మధారుడనై చతుర్భుజాలంకారుడనై ప్రియభావంతో వేంచేసి ఉంటాను. అందుచేత, సత్పురుషులు శాశ్వతానందప్రదమగు ఆత్మతత్త్వమును సంభాషించుకునే చోట నేను శాంత - ఆనంద - జగద్రక్షక విశేషరూపంతో నాకు నేనే (నన్ను వేరుగా / ప్రత్యేకంగా ఆహ్వానించకుండానే) వచ్చి వుంటాను!.

అట్టి మహనీయుల అమృత వాక్కులు ప్రవచనమగుచున్నచోటు అతి పవిత్రమైనది. సంత్సంగము అని చెప్పబడే వారి ఆత్మజ్ఞాన - ఆప్త వాక్యములు పరస్పర సంవాదములు, గురు-శిష్య బోధలు అమోఘమైన ప్రభావం కలిగిఉంటాయి.

నా మహిమ శ్రేయోదాయకమై అక్కడివారి వెంటనంటి వుంటుంది. సత్సంగం చేత భక్తి - జ్ఞానములు ప్రవృద్ధమైనట్లుగా మరొక ఉపాయం చేత ప్రవృద్ధం కాదని అందరికీ మనవిచేస్తున్నాను.

ఓ యదునందనా! ఉద్ధవా! నీవు నాకు భృత్యభావంతో సేవిస్తున్నవాడివి! స్నేహితుడివు! భక్తి-ప్రపత్తులు కలవాడివి! అందుచేత నీపై నాకు ఉన్న అవ్యాజమైన ప్రేమచే... ఇప్పుడు

**సాధుసాంగత్య మహిమ - గురించి విను!**

ప్రాపంచికమైన సాధారణ మమకారములను పరమాత్మ వైపుగా నడిపించటం వలన ప్రాప్తించగల సర్వోత్కృష్టమైన ఫలితాలు గురించి కూడా కొన్ని గూఢమైన రహస్యాలు చెప్పుబోవుచున్నాను! శ్రద్ధగా విను....

## సత్సంగ మహిమ

ఓ ఉద్ధవా! నాయొక్క పరతత్వం నీ వశం చేసుకోవటానికి **అనేక ఉపాయాలు ఉన్నాయి. మార్గాలు ఉన్నాయి.**

**విచారణా మార్గం (లేక సాంఖ్య మార్గము)**

"ఇది **దేహము** - ఇది ఆలోచనారూపమైన **మనస్సు** - ఇది విమర్శన-విచక్షణ-విచారణ-వివేచనా రూపమైన **బుద్ధి** - ఇది ఇష్టము అనురూపమంగా ప్రదర్శితమగుచున్న **చిత్తము** - ఇది **అహంకారము**- ఇది **జీవుడు** - ఇది తత్‌సాక్షి అయిన **ఆత్మ**... ఇది సర్వ జీవులలోని **సాక్షి - అట్టి కేవల సాక్షి-సర్వుల రూపము!**" నేనే ఇట్టి విభాగ పాండిత్య అంతర్యామి, - పరిశీలనా-పరిచింతనా-పరియోచనా యోగం!

**ధర్మ మార్గం :** పరమాత్మకు అనుకూలమైన ప్రార్ధన - ఆలాపన - సహజీవుల పట్ల దయ... మొదలైనవి. నియమిత కర్మలు - ధర్మములు (The Duties and functions expected of you by the Society) ఉపాసనా పూర్వకంగా నిర్వర్తించటం.

**స్వాధ్యాయ యోగం (లేక మార్గము):** భగవంతునికి సంబంధించిన పాఠ్యాంశాలు - వేద వాక్కులు మరలమరల పఠించటం. (Chanting and singing individually or in a group)

**ఇష్టాయోగం (లేక మార్గము):** భగవంతునికి ఉపాసించే విధంగా వ్రతాలు - యాగాలు - యజ్ఞాలు పూజలు మొదలైనవి నిర్వర్తించి పరమాత్మకు ప్రియం కావటం!. (The acts of Adoration)

**పూర్తయోగం (లేక మార్గము):** లోక ప్రయోజన కారకములైన నూతులు త్రవ్వించటం, దేవాలయాలు కట్టించటం, బాటలు నిర్మించటం మొదలైన నలుగురికి పనికివచ్చే ఆయా శోభప్రదమైన కార్యక్రమములు నిర్వర్తించటం. ( Acts that ccarry good to others)

**వ్రతనియమ యోగం (లేక మార్గము) :** ఇంద్రియనిగ్రహం కొరకై వ్రతములు - ఉపోషముల వంటి ఇంద్రియ నియమములు నిర్వర్తించటం.

**దక్షిణవ్రత యోగం :** తనకున్న సంపద పరులకు సమర్పించటం. ఇతరులతో పంచుకోవటం. పేదవారిని దాన - దక్షిణలతో తృప్తిపరచటం!. (అంగసంబంధమైన శాస్త్రీయ ఉపాసనములు కూడా ఇందులోకి వస్తాయి)

**ఛందోవ్రత యోగం (లేక మార్గము) :** భాషాయుక్తమైన భగవత్ స్తోత్రాలు పురాణాలు, వేదమంత్రాలు చదవటం, వ్రాయటం, వ్యాఖ్యానగ్రంధాలు రచించటం మొదలైనవి.

**తీర్ధయోగం:** తీర్థ ప్రదేశాలు సందర్శించి ఆయా భగవత్ స్థానములను నమస్కార - ప్రదక్షణల పూర్వకంగా ఉపాసించటం.

**యమ నియమ యోగం:** ఇంద్రియములను అదుపులోపెట్టి వైదిక - ధ్యాన యోగాది మార్గాలలో నియమించటం.

**ఇక సత్సంగము గురించి .....**

ఇవన్నీ గొప్ప మార్గాలే! అయితే, సంత్సంగము (Association and Sharing of Spirituology and Godly Idealogies) అన్నిటికన్నా సులభము - మహత్తరము అయిన మార్గము సుమా! సత్సంగముతో మరేవీ సాటిరావు-అని నా అభిప్రాయం!

**సత్సంగము** అనే సాధనా యోగం కేవలం మానవులకే పరిమితమనుకోకు. అది దేవతలు - రాక్షసులు - పక్షులు - మృగములు -నాగులు - మొదలైన వారంతా ఆచరణలో పెట్టుచున్నదే!.

ప్రతి యుగంలోను సత్సంగ ప్రభావం చేత అనేకులు పరమాత్మనగు మత్-పదమును జేరుచున్నారు.! సాత్వికులైన దేవతలే కాదు! రజోతమోగుణ సంపన్నులైన మానవులు, దైత్యులు, మృగములు, పక్షులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, సిద్ధులు, చారణులు, గుహ్యకులు, విద్యాధరులు, సిద్ధులు, సాధ్యులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీస్వభావులు, అంత్యజులు ఇతర రజోగుణ స్వభావులు, తమోగుణ, స్వభావులు... వీరంతా కూడా యుగయుగాలుగా అనేకానేకులు సత్సంగ ప్రభావంచేత జీవాత్మ పరిమితత్వమును అధిగమించి పరమాత్మత్వమును సముపార్జించుకుంటున్నారు!. అసుర - దానవ జాతులలో వృత్రాసురుడు, ప్రహ్లాదుడు, వృషపర్వుడు, బలి, విభీషణుడు, బాణుడు,

మయుడు...., అట్లాగే జంతుజాతులలో సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, గజేంద్రుడు, జటాయువు, తులాదారుడు, వణిజుడు..., ఇదే విధంగా ధర్మవ్యాధుడు, కుబ్జ, వ్రజగోపికలు, యజ్ఞానుష్టానపరులగు కొందరి భార్యలగు యజ్ఞపత్నులు... వీరంతా కూడా శ్రవణంచేత వింటున్న ఆత్మవిద్య యొక్క మననం చేత సత్సంగ ప్రయోజనంగా అస్మత్‌పదమును సులభంగా పొందటం జరిగిందయ్యా! వారిలో అనేకులు శ్రుతుల (వేదముల)ను నేర్వలేదు! మహనీయులగు వారికి శిష్యత్వము - ఉపాసనత్వము నిర్వర్తించనూ లేదు! వారంతా కేవలం సత్సంగ ప్రభావంచేత నన్ను అతి తేలికగా పొందటం జరిగింది! జరుగుతోంది! జరుగగలదు!

పరమాత్మతో అనన్యత్వం సంపాదించటానికి సత్సంగము కేవలం మానవులే కాదు! వృక్షములు - జంతువులు - కొండలు కూడా మహత్తత్వము సముపార్జించుకోగలవు సుమా! సత్సంగమువలన కలిగిన అనన్య భావం త్రత్త్వ శాస్త్ర శ్రవణం (త్వమ్ తత్ అసి అని నిరూపించే శాస్త్రీయ ప్రవచన శ్రవణం) చేత వ్రజగోపికలు, వ్రజములోని ఆవులు, అనేక వృక్షములు, నాగులు, ఇతర మూఢ గతిని అనుభవిస్తున్న కీటకము వంటి జీవులు సముద్ధరించబడ్డారు. **వీరంతా కూడా - నేను కృష్ణ చైతన్యమే! నేనే ఈ సర్వ జగత్ రూపంగా విస్తరించి నాకు అగుపిస్తున్నాను. ఈ జగత్తులు నాలో ఉన్నాయికాని, నేను ఈ జగత్తులలో లేను...** అనురూపమైన కేవలీ ద్రష్టత్వ పరతత్వాన్ని ఆస్వాదించారు!.

ఓ ఉద్ధవా! సంత్సంగమును ఆశ్రయించకుండా, యోగ - సాంఖ్య - దాన - వ్రత - తపో - వ్యాఖ్యాన పాండిత్యము - స్వాధ్యాయనము - సన్యాసము మొదలైన అనేక రీతులగా కూడా నన్ను అంత సులభంగా పొందలేరని మరొక్కసారి గుర్తుచేస్తున్నాను!. నా అభిప్రాయము చేతులెత్తి ప్రకటిస్తున్నాను. (ఊర్ధ్వ బాహుర్విరేమ్యేష!)

## 16. పరాభక్తి : పరాప్రేమ : వ్రజ గోపికలు

ఓ ఉద్ధవా! పరమాత్మ యగు నా పట్ల అకుంఠితమైన - అనన్యరూపమైన ఆసక్తి ఏ రూపంగా ఏ కారణంగా కలిగి ఉన్నా సరే, వారికి సర్వాంతర్యామినగు నేను వశం అవుతాను. **ఆసక్తి నా పట్ల అనురక్తిగా రూపుదిద్దుకొని తదితరమైనదంతా అనాకర్షితమైనపుడు నేను తప్పక పట్టుబడతాను.** ఇందుకు దృష్టాంతం మన వ్రజగోపికలే!.

నేను చిన్ని కృష్ణునిగా మన గోపబాలురతో కూడి గోపికల ఇళ్ళలో దొంగగా ప్రవేశించి అనేక బాలాలీలా వినోదరూపమైన అల్లరి పనులు చేశావాడిని కదా!

అప్పుడు గోపికాస్త్రీలంతా అమ్మ యశోదతో, "ఓ యమ్మ! నీకుమారుడు మా ఇళ్ళను పాలుపెరుగు మననీడమ్మా! పోయదమెక్కడికైనను!" – అంటూ మా అల్లరి పనులను ఏకరువుపెట్టేవారు! అమ్మఏమో, "కృష్ణయ్యా! ఎందుకురా ఈ అల్లరి పనులు? వాళ్ళ ఇళ్ళలోని పాలు – పెరుగు – వెన్నలతో నీకేమి కర్మ? మన ఇంట్లో పాడి తక్కువనా?" – అని నన్ను నిలబెట్టి ప్రశ్నించేది. అది విని నేను "అమ్మా! ఎప్పుడూ నీ చీరకొంగుపట్టుకునే ఉన్నాను కదా! వీళ్ళవన్నీ లేనిపోని చాడీలు!" అని చెప్పితే, "ఆహా! మా బాబే! నిజమే నాయనా!" అని ముద్దు పెట్టుకునేది.

క్రమంగా కొన్ని గంటలు నేను అల్లరి చిల్లరి పనులు చేస్తూ ఆ గోపికల ఇళ్ళలో కనబడకపోతే

**"అయ్యో! కృష్ణయ్య ఏడీ! మా ఇంటికొచ్చి నాలుగు గంటలయింది? ఒక్కసారి వచ్చి కనబడితే బాగుగదా!"**

అంటూ వారు నారాకకోసం, నన్ను చూడటానికి విరహం పెంచుకోసాగారు. ఒక్కొక్కరోజు నేను వారి ఇళ్ళకు వెళ్ళకపోతే "ఓ యమ్మా! ఆక్కా! వదినా! చిన్ని కృష్ణుడిని చూడక ఈ రోజంతా గడచింది. మీ ఇంటికేమన్నా వచ్చాడా? యశోద వదినగారింటికి వెళ్ళితే ఆమె, "మా పిల్లవాడితో మీ కేమి పని? అని – విసుగుకోదు కదా?" ... ఈ విధంగా చిన్ని కృష్ణుని చూడటానికి బెంగపడసాగారు! ఎక్కడైనా చిన్నికృష్ణుడు కనబడగానే ఒళ్ళు – ఇల్లు – పరిసరాలు మరచి ముద్దు చేస్తూ ఆనందంగా అడుగులు వేయసాగేవారు!. చుట్టూ నిలబడి పరవశంతో నృత్యం చేసేవారు.

ఆ గోపికలు బృందావనంలో మేమున్న చోటికి వచ్చి మాకు క్రొత్త క్రొత్త తినుబండారాలు పెట్టేవారు. ఇంతలో నేను కాస్త మరుగు అవగానే " మీ పొదలమాటున లేడుకదమ్మ చెప్పరే?" .. అంటూ ఉత్సుక – ఆవేదన – నివేదనాభావాలతో వెతికేవారు. నా వేణుగానం వినగానే పరవశంతో నా చూట్టూ చేరి నృత్యం చేయసాగేవారు. వారి తన్మయత్వాన్ని చూసి నేను కూడా నా విష్ణుత్వము – అవతార మూర్తిత్వము ఏమరచి వారితో నృత్యం చేసేవాడను!.

వారు "నేను జీవుడను కదా!" అనునది అధిగమించి, **ఈ చరాచర సృష్టి అంతా ఎందులో అయితే కల్పితచమత్కారంగా కనిపించేస్తోందో అట్టి శ్రీకృష్ణచైతన్య స్వరూపులము...** అని తన్మయముతో విన్యాసం చేయసాగేవారు! ఇట్లా అనేక రోజులు నెలలు - సంవత్సరాలు గడిచాయి.

---

ఒకానొక రోజు కాల చమత్కారంగా అక్రూరులవారు మా మేనమామ కంసుని పనుపుపై నన్ను, అన్న బలరాముడిని మధురానగరం తీసుకెళ్ళటానికి వేంచాశారు.

**అప్పటి పరిస్థితి ఏమిటంటే...?**

గోపికలు నన్ను చూడటానికి నాతో గడపటానికి అత్యంత అనురక్త చిత్తులై వుండేవారు. తెల్లవారుజాము లేచి ఇంటి పనులన్నీ చక్క బెట్టుకొని గబగబా మేముండే బృందావనానికి దగ్గిరగా గల అడవి ప్రదేశాలకు వచ్చేవారు. " ఇంకా తెల్లవారటానికి రెండు ఘడియల కాలం వున్నదా? నిన్న సాయంకాలం కృష్ణుని చూసాం! ఎప్పుడు తెల్లవారాలి? ఎప్పుడు కృష్ణుడు కనిపిస్తాడు?...." అని విరహవేదనతో వాత్సల్యావేశంతో క్షణక్షణం గడిపేవారు!.

**విః అహమ్ అవిహితాహంకారత్యాజ్యం - విరహం**

**విహితాహంకార సమాశ్రమం**

అప్పుడు...,

నన్ను - అన్న బలరాములవారిని మధురా నగరానికి అక్రూరుని వెంట పంపటానికి మా నాన్న నందులవారు, అమ్మ యశోద అతి కష్టంమీద అంగీకరించారనే విషయం గోపికలకు తెలిసింది. నాపై గాఢమైన ప్రేమతో అత్యాసాసక్తులైయున్న గోపికల విరహ పూర్వక మనస్తాపాన్ని చూసి అక్రూరులవారు ఆశ్చర్యం పొందారు!.

" అహా ! ఈ గోపికలు గృహము పుత్ర-పౌత్రుల పట్ల గల విరహవేదన - ప్రేమావేశం చిన్ని కృష్ణునిపై అచంచలంగా నిలిపారు! వీరు శ్రీ కృష్ణునితో ప్రియసమాగం తప్ప మరింకేమీ ఏమాత్రం కోరటంలేదే! శ్రీ కృష్ణునిపై కొంచము ప్రేమ సంపాదించుకోవటానికి నేను ఎన్నో వ్రత - జప - తపో - ధ్యాన - నియమాలు నిర్వర్తించవలసి వచ్చిందే! ఈ గోపికలు ఎంత ధన్యులు!..." అని మురిసిపోయారు!.

ఓ ఉద్ధవా! ఆ గోపికలకు వారికి ప్రియతముడనగు నాసాంగత్యంలో సంవత్సరాలు క్షణాలుగా గడచిపోయాయి. నాతో ఎడబాటులో వారికి ఒక్కొక్క రాత్రి ఒక్కొక్క యుగంగా

సుదీర్ఘంగా గడవసాగింది! నదులు సముద్రంలో కలసిన తరువాత - ఇక ఇది గంగానదీజలం, ఇది గోదావరి నదీజలం, ఇది కృష్ణా నదీ జలం, ఇది కావేరీ నదీ జలం... అనే తేడా వుండదు కదా!.

సమాధిలో ప్రవేశించిన మునీశ్వరులు నామ రూపములను అధిగమించినవారై, వాటిని గమనించరు కదా!. అట్లాగే,

**ఆ వ్రజగోపికలు నాయందు పరమ ప్రేమ చిత్తులై క్రమంగా సర్వమును మరచారు!.**

ఓ ఉద్ధవా! వాస్తవానికి నిర్వికారము - నిరామయము, ఓంకార సంజ్ఞార్థము అగునా పరస్వరూపతత్త్వము గురించి వారికి ఏమాత్రం తెలియదు! వారికి నన్ను తమ **ప్రియాతిప్రియ గొల్లవానిగా, తమవానిగా** మాత్రమే తెలుసు!.

నాయందు అద్వితీయము, అమోఘము అగు ప్రేమతత్పరత మాత్రం వారు చూపుతూ ఎల్లప్పుడు నన్ను ఆశ్రయించినవారై వున్నారు! వారికి ఇంకే సాధనలు తెలియదు! అటువంటి ప్రేమోత్కంఠత చేత - తల్లి బిడ్డను తనకే సొంతమని భావించినట్లుగా ... కృష్ణుడు తమవాడేనని భావించసాగారు.

తమకు మాత్రమే చెందినవాడని కామోత్కంఠత పొందసాగారు.

కృష్ణుడు ఎదురుగా ఉంటేచాలు! మరింకేమీ కించిత్ కూడా అవసరంలేదు అనే అనన్య చింతన ఆస్వాదించనారంభించారు.

అమ్మ కొద్దిసేపు కనబడకపోతే బిడ్డ బెంగ పడునట్లు, వారు కృష్ణ సాన్నిధ్యం కొరకై అనుక్షణికంగా బెంగ పడుచున్నారు.

ఒక ప్రియురాలు తన ప్రియుడితో ఏకాంతము కొరకై తదితర బంధువుల నందరినీ త్యజించి ఎవ్వరికీ చెప్పా-పెట్టకుండా బయల్వెడలుతుంది చూచావా? ఆ గోపికలు నాసాన్నిధ్యం కొరకై బంధువులు - ఐనవాళ్ళు మొదలైన వన్నీ త్యజించి జారభావంతో నేనున్న చోటుకు పరుగులు పెట్టుకొని వచ్చేవారు! నన్ను చూడగానే లోకమును దేహమును ఉపేక్షించి తన్మయులై వుండేవారు. మేము దేహులము కదా! స్త్రీ దేహులము కదా! ఇల్లు-వాకిలి-భర్త-పిల్లలు కలవారము కదా!.... అనే స్పృహ-అహంకారాలు వారికుండేవి కావు!

నేను బృందావనం వదలి వెళ్ళిన తరువాత కూడా, వారు నేను సంచరించిన ప్రదేశాలను మరల మరల ప్రవేశించి నాతో గడిపిన జ్ఞాపకములతో అనుక్షణం మనోసంయోగం

పొందుతూ వుండేవారు!.

వారిది తపస్సు కాదు! భక్తి కాదు! వేదా ధ్యయనం కాదు! యజ్ఞయాగాది క్రతునిర్వహణం కాదు! వ్రతాలు కాదు! సేవ కాదు!

మరి?

బిడ్డకు తల్లి కనబడకపోతే ఏర్పడే బెంగ . విరహము . దర్శనాకాంక్ష . తదితరమైనదంతా అవిషయమై పోవటం. ఇంకేదీ రుచించకపోవటం. అన్నింటినీ వదలి అమ్మను చూడటానికి పరుగులు తీసే బాలభావావేశము. ఈ మొదలైన విశేషములతో కూడిన అనుక్షణిక మననము!.

ఏ సాధనము చేయని ఆ అబలలు – **కృష్ణుడిని చూడాలి! కృష్ణుని నామ రూపములతో సంగము కలిగి ఉండాలి! కృష్ణ మననముచే ఏర్పడే ప్రియభావము కొరకై తదితరమైనదంతా ఉపేక్షార్హమే! ధర్మార్థ కామమోక్షములు కృష్ణునిపై అపేక్షారూపమగు విరహం ముందు కొరగానివి!** .....మొదలైన కామోత్కంఠావేశముచే పరబ్రహ్మరూపుడగు నన్ను ఆశ్రయించారు. వారికి క్రమంగా సర్వము కృష్ణతత్త్వంగా అనుభూతం కాసాగింది! – క్రమంగా పరబ్రహ్మమే తామై ఆనందించసాగారు!. కనుక మిత్రమా! ఓ ఉద్ధవా!

**శ్లో॥ తస్మాత్ త్వమ్, ఉద్ధవ! ఉత్సృజ్య చోదనామ్ – ప్రతి చోదనామ్,**
**ప్రవృత్తించ – నివృత్తించ శ్రోతవ్యం – శ్రుతమేవచ!**

**శ్లో॥ మామేకమేవ శరణమ్ ఆత్మానం సర్వ దేహినామ్**
**యాహి సర్వాత్మభావేన మయాస్యా హి అకుతోభయః! (అధ్యా 12, శ్లో 14, 15)**

నీవు చోదనములు (Driving Tools) ప్రతి చోదనములు (Tools for withdrawing) ప్రవృత్తి ధర్మాలు – నివృత్తి ధర్మాలు, వినవలసినవి – వింటున్నవి... అన్నీ ప్రక్కకు పెట్టు! అధిగమించు! సర్వదేహులలో ఆత్మగా ప్రదర్శితమగుచున్న నన్ను మాత్రమే వాత్సల్య భక్తితో ఆశ్రయించు! శరణువేడు! **పరమాత్మయే ఈ కనబడే అన్ని రూపాలుగా కనిపిస్తున్నారు కదా!** – అను పరతత్త్వమును అనుక్షణికంగా మహాభావన చేయి! తల్లికి బిడ్డపై, ప్రియురాలికి ప్రియునికి పై, తండ్రికి కొడుకుపై ఉండే ప్రేమంతా రంగరించి ఆత్మబంధువగు నాకు సమర్పించు. **నేను నాదిగా కనిపించేది కూడా పరమాత్మయే...** అని క్రమంగా స్వభావ సిద్ధంగా నీవప్పుడు సంతరించుకుంటావు.

**పరబ్రహ్మమే నీవై ప్రకాశిస్తావు.**

అప్పుడు నీవు ఎక్కడ - ఎట్లా వున్నా సర్వ కాంక్షలను - కుతిని అధిగమించి అభయస్వరూపుడవై, కేవలం దృశ్య సాక్షివై, దృశ్యాంతర్యామివై తదితరమైనదానికంతటికీ అంతర్గతాంతుడవై ఆనందిస్తావు! అప్పుడు.... **ఈ జగత్తులు నీలో వుంటాయి! నీవు జగత్తులలో కాదు!**

---

**శ్రీ ఉద్ధవుడు:** హే యోగ యోగీశ్వరేశ్వరా! మీరు చెప్పిన దంతా శ్రద్ధగా వింటున్నాను. సంతోషం! అయితే కూడా, ఎందుకో నీకు కొన్ని సందేహాలు తీరటం లేదు. నాకు భ్రాంతి కొనగాసుగుచున్నట్లే వున్నదని అనిపిస్తోంది!. అంతేకాదు. నాలో ఏవేవో క్రొత్త-క్రొత్త అనుమానాలు చిగురిస్తున్నాయి.

మీరు చెప్పుచున్నదేమిటి? విధి - నిషేధాలు (Do's and Donts) వేదాలు - శాస్త్రాలు చెప్పుచున్నాయి కదా! అవన్నీ వదలి వేయమంటారా!

శాస్త్రాలచే చెప్పబడే సాధనలు (చేయవలసినవి) - ప్రతి సాధనలు (వదల వలసినవి) ఆశ్రయించటం - వదలటం చేయనవసరం లేదా?

శ్రోతవ్యం - శ్రుతం (to be listened to and already listened to) అయినట్టి పురాణ ఇతి హాస ప్రవచిత ధర్మాలు పట్టించు కోనఖర్లేదా?

మీరు చెప్పినదంతా విన్న తరువాత నా మనస్సు భ్రాంతిని వీడటం లేదు-ఎందుకోమరీ, నివృత్తి పొందటంలేదు! ఆత్మయందు నిలవటం లేదు!.

అల్పజ్ఞుడగు ఈ జీవుడు గోపికలవలె దర్శనోత్కంఠట స్పర్శనాకాంక్ష మొదలై మార్గముల సహాయంతో (లేక) తదితర ఆట-పాటల రూపమైనట్టి వ్రజ గోపికల బాల చేష్టల సహాయంతో పరమాత్మతో మమేకమౌతాడా! సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడుగా రూపు చెందుతాడా? మీపట్ల చూపే లోకసంబంధమైన విరహం - తపస్సు, వేదపఠనము ప్రాణాయామాది విధానములకంటే గొప్పవంటారా? మీరు అంటున్నదేమిటో, విడమరచి చెప్పండి!

**శ్రీ కృష్ణుడు (పక పక నవ్వుతూ)**

ఓహో! అల్పజ్ఞుడు - కించజ్ఞుడు అగు ఈ జీవుడు విరహోత్కఠతతో పరమాత్మత్వమును ఎట్లా సంతరినిచు కుంటాడనియా, నీ ప్రశ్న? సర్వ ధర్మాలు, విధి నిషేధాలు వదలితే

పరతత్త్వంతో ఐక్యత లభించేదేట్లా? – అనిగదా నీ సంశయం?

అసలు ఒక్క ముఖ్యమైన ప్రశ్న?

ఈ జీవాత్మగా కనిపిస్తున్నదెవ్వరు? పరమాత్మయే కదా!

సర్వ విషయమతీతుడు – సర్వ తత్త్వాతీతుడు అగు పరమాత్మ ఒక లీలగా – ఒక క్రీడగా నాద స్వరూపమగు ప్రాణశక్తిని ధరించి సూక్ష్మ దేహంలోను (Into Body of Feeling and thought), అటుతరువాత శబ్ద – స్పర్శాది ఇంద్రియములతోను కూడిన స్థూల దేహాలలోను ప్రవేశించి స్వయంకల్పిత దృశ్యరూపమనతగు ఈ జగత్తును ఆస్వాదిస్తున్నాడు. దేహమంతా తన ప్రాణ శక్తితో నింపుతున్నాడు. (మూలాధారాది) చక్రములలో వేంచేసి, పంచతన్మాత్రలు (శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములు) స్వరము, వర్ణము (గుణ సముదాయము) మొదలైన వాటిని వస్త్రము వలె ధరించుచున్నాడు!. అనగా, పంచతన్మాత్రలు–స్వరము–వర్ణములతో కూడిన ఈ పాంచ భౌతిక దేహం ధారణ చేసి, **తెలియబడేది** అనబడే – వేదశబ్దార్థ దృశ్యముగా వెల్లడి అగుచున్నాడు! కనుక, ఇక్కడ జీవుడుగా పదర్శితమగు చున్నది... ఆ జీవుడికి దృశ్యము (వేదము–తెలియబడేది)గా వెల్లడిఅగుచున్నది కూడా యథాతథంగా పరబ్రహ్మమే సుమా!.

అగ్ని ఆకాశంలో సూక్ష్మరూపంగా వుంటుంది. ఒకడు రెండు కొయ్యముక్కలను ఒక చోటికి జెర్చి ఒరిపిడి కలిగించినప్పుడు నిప్పురవ్వలు బయల్వెడలుతాయి.

ఆ అగ్నియే ఆహుతి ఇచ్చినప్పుడు (నేయిపోసినపుడు) జ్వాజ్వల్వమానంగా అగ్ని శిఖలతో వెలుగొందుతుంది. అనగా..., అగ్ని ఆకాశంలో అప్రకటిత రూపంగాను, కట్టెల ఒరిపిడికి నిప్పురవ్వలుగాను, వెలుగుచున్న కట్టెలపై నేయి పోసినప్పుడు అత్యంత కాంతి వంతంగాను వెలుగుచున్నది. అట్లాగే, పరమాత్మతత్త్వమే సర్వాతీతనిర్విషయంగాను, సూక్ష్మ దేహంతోను (Body of feeling and throught), స్థూల దేహం (physical body that is solidly being experienced) గాను ప్రదర్శితమౌతోంది! ఈ విధంగా..... అంతా పరమాత్మ యొక్క అభివ్యక్త రూపమేనయ్యా! ఈ జీవుడు, వాక్కు, కర్మ, గతి (మార్గము), స్వీకారము, విసర్జనము, ఘ్రూణము (smelling), రస గ్రహణం (Tasting), దర్శనము (seeing), స్పర్శ (touching), శ్రవణము (hearing), సంకల్పము (ideation), విజ్ఞానము (knowing), అభిమానము (deeming / treating / assuming), ప్రకృతివ్యాపారము (playing roles in the drama of the world), సత్త్వ – రజ – తమో గుణములు, వాటి

వికారములుచే కలిగే సుఖ దుఃఖానుభూతులు (అధిదైవికము) పంచభూత సమ్మేళన రూపమైన ఈ ప్రపంచము... **ఇవన్నీ కూడా, ... ఇదంతా కూడా పరమాత్మయొక్క ప్రదర్శనా విన్యాసమే!** దృష్టాంతానికి స్వప్నములో ఉన్నది-కనిపించేదీ.... ఆ సర్వములో స్వప్నద్రష్ట యొక్క **స్వప్నచిత్కళా విన్యాసము** కానిదేది?

అంతేకాదు! **పరమాత్మ సర్వదా యథాతథము!** స్వప్నంలో ఏమున్నా, ఏమి జరిగినా - జరగకున్నా... స్వప్నద్రష్ట సర్వదా యథాతథము కదా!

ఇంకొక దృష్టాంతం. ఒక చిన్న మట్టి బీజంలో మహత్తరమైన అంకుర శక్తి వేంచేసి ఉన్నది. అది అప్రదర్శితంగా వున్నది!. ఆ బీజమును నేలలో నాటామనుకో! అప్పుడేమౌతుంది?

**ఉద్ధవుడు:** అది మహావృక్షమై కొమ్మలు ఆకులు, వేళ్ళు, కాయలు ఇత్యాధికంగా విస్తరించి కనబడుతుంది.

**శ్రీకృష్ణుడు :** అట్లాగే సనాతనుడు, ఆదిపురుషుడు అగు పరమాత్మ మొట్టమొదట (బీజంలో భవిష్యత్ అంకుర చమత్కారంగా) అవ్యక్తుడై వుంటాడు. ఆయన త్రిగుణములు ఆశ్రయించి లోక కారకుడగుచున్నాడు. ఏక స్వరూపుడైవుండి, ఒకానొక కాలంలో కళ్ళు- చూపు - నోరు-వాక్కు; చెవులు-వినికిడి ఇటువంటి వికారక్రమంగా బహురూపములుగా వ్యక్తుడగు చున్నాడు. దృష్టాంతానికి-గొప్ప నటునియొక్క నటనాచాతుర్యము.... ఆతడు స్నేహితులతో ఉన్నప్పుడు అవ్యక్తంగాను, నాటకంలో నటిస్తున్నప్పుడు వ్యక్తంగాను ఉంటుంది.

వస్త్రము అంటే ఏమిటి? ధారముల అల్లికయే కదా! జగత్తు అనబడే దృశ్యము పరమాత్మ అనే దూది నుండి తీయబడిన దారముచే ప్రదర్శితమగుచున్న వస్త్రము వంటిది!.

దృశ్యమునకు సంబంధించిన **అనుభూతి - అనుబంధ భావనయే** సంసారము!. ప్రవృత్తిచే సంసారము ఏర్పడుతోంది! ఈ సంసార వృక్షము **భోగరూప పుష్ప ఫలములను** ఆత్మరూపుడగు జీవునకు అందిస్తోంది.

ఈ సంసార వృక్షము పాప-పుణ్యములు అనే రెండు విభాగములు గల బీజం నుండి పుట్టింది. దృష్టులచే పరిపోషించబడుతోంది.

అపరిమిత వాసనల రాసి (Limitless Bundle of Tendencies) దీని మూల విభాగం.

సత్త్వ - రజ - తమో గుణములచే ఈ సంసారవృక్షము యొక్క కాండము రూపుదిద్దుకుని ఉన్నది.

పంచ భూతములు ఈ వృక్షముయొక్క కొమ్మల ప్రారంభప్రదేశం.

11 ఇంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు ఈ సంసార వృక్షములోని రసము.

రక్తము – శ్లేష్మము ఇందులోని అంతరంగ ద్రావణములు.

సుఖ – దుఃఖములనబడే రెండు వేరైన తియ్యని – పుల్లని పళ్లు దీనికి కాస్తున్నాయి.

ఈ విశాల సంసార వృక్షము భూమండలము నుండి అటు ఆకాశమంతా – ఇటు పాతాళంలోకి విస్తరించి ఉన్నది!

జీవుడు – ఈశ్వరుడు అనే జంట పక్షులు ఈ వృక్షమును అంటిపెట్టుకొని ఉన్నాయి!

ఈ సంసార వృక్షమును కాముకులైన జీవులు అనే గబ్బిలాయిలు అంటి పెట్టుకొని ఉన్నాయి. వివేకులు త్యాగ నిరతిగలవారు అగు హంసలు కూడా ఇదే వృక్షమును ఆశ్రయించి జీవిస్తున్నాయి! వాళ్ళు ఈ వృక్షము యొక్క ఆత్మ సుఖము అనే రూపముగల ఫలములను సదా రక్షిస్తున్నారు!. తాము ఆస్వాదిస్తున్నారు!

ఓ ఉద్ధవా! **వాస్తవానికి ఉన్నది సత్ స్వరూపుడనగు నేనొక్కడినే!**

**మాయా శక్తి ప్రభావము చే నేనే ఇన్ని రూపములుగా, నామములుగా వ్యవహారములుగా చూడబడుచున్నాను!**ఇదియే తత్త్వార్థజ్ఞానం! తత్త్వరహస్యం! అద్వైతం!

ఎవ్వరైతే గురువులను ఆశ్రయించి **(ఏకోసత్! విప్రా బహుధా వదంతి)** అనే జ్ఞానవాక్యము యొక్క, వేద–వేదాంగములచే గానము చేయబడుచున్న యథార్థతత్త్వము తెలుసు కుంటాడో, .. అట్టివాడు విదితవేద్యుడు, తత్త్వజ్ఞాని అవుతాడు. "నాకు నేనే ఇన్ని రూప **నామాలుగా స్వయం (జలమున తరంగాలవలె) అనుభూతమగుచున్నాను!**" – అని ఆతడు గ్రహిస్తున్నాడు!.

మిత్రమా! నేను చెప్పుచున్న భిన్నత్వంలోని అంతర్లీన ఏకత్వం (The inner unity in the outward diversity) గ్రహించి సర్వదా గమనిస్తూ ఆస్వాదిస్తున్న గురువులు ఉన్నారు. వారిని సమీపించి సేవించు! ఏకాంత భక్తి కొరకై ప్రశ్నించి నీ సంశయములను నివర్తించుకో!.

అట్టి ఏకాంత భక్తితో క్రమంగా– నేను విశ్వరూపమగు పరబ్రహ్మమును – అను పరతత్త్వమును ఆశ్రయించు! అట్టి నీ ప్రయత్నముచే నీ ఈ త్రిగుణాత్మకమగు కారణ శరీరము (లేక) త్రిగుణ శరీరము (లేక) త్రిలింగశరీరమును ఖండించివేయి!. ఆత్మయందు ఆత్మకు అభిన్నంగా ఆత్మస్వరూపుడవై ఉండు.

పరమాత్మ తత్త్వము విను. మననం చేయి. భక్తితో ఉపాసించు! క్రమంగా పరమాత్మ స్వరూపుడవై నీయందే కల్పితమైన ఆత్మ స్వరూపజగత్తును ఆత్మగా ఆస్వాదించగలవు!.

ఆ తరువాత జ్ఞానమును అందుకొరకై సాధనలు మొదలైన వ్యవహారాలను కూడా పరిత్యజించు!.

పరమాత్మవై పరిపూర్ణుడవై... నీ యొక్క జీవాత్మత్వమునకు కర్తవు – కల్పించుకొన్నవాడివి, (One who visualized individual self) సాక్షివి... అయి ఉండు! ఆపై ఈ ఆత్మాఽభిన్న జగత్తులో నీ ఇష్టానుసారం ఉండు!. జగత్ రూపుడవై జగత్తును ఆస్వాదించు! జగత్ అతీతుడవై నిర్లిప్త పరమానంద స్థితి నుండి చ్యుతి పొందకు! అచ్యుతుడవై వుండు.

## 17. గుణత్రయ త్యాగ ఉపాయాలు

**శ్రీ ఉద్ధవుడు:** ఓ అనంతా! అద్వితీయా! శ్రీ కృష్ణా! నిర్మలుడు – నిత్యుడు – స్వయమానంద స్వరూపుడు అగు పరమాత్మ దేహధారియై దేహ బంధమును పొంది జీవాత్మగా కనిపిస్తున్నాడు కదా! మరి ఈ దేహ బంధము ఏ రూపంగా ఏర్పడుతోంది.

**శ్రీ కృష్ణుడు :** పరమ్ ఆత్మ – ఆ ఆవల ఉన్న ఆత్మ – అనికదా, శబ్దార్థము! మరి దేనికి ఆవల? జగత్–దేహాదులకు ఆవలవున్న ఆత్మ స్వరూపం. తెలియబడేదంతా తెలుసు కుంటూ వున్నట్టిది " ఆత్మ.". తెలుసుకుంటున్న వానిని కూడా తెలుసుకొనుచున్నట్టిది"

ఆత్మ సదా నిర్మలము – అప్రమేయము – సర్వాతీతము అయినదే!

అట్టి ఆత్మ స్వస్వరూపమును కించిత్ ఏమరచి గుణములను ఆశ్రయిస్తోంది. అట్టి సత్వ రజ తమోగుణ సంబంధంచేత (అనగా నేను గుణ సంబంధితుడను – అనే భావన యొక్క పరిపుష్టిచేత) స్థూల దేహ భ్రమ రూపుదిద్దుకొన్నదై, ఈ శబ్ద స్పర్శ రూప రస గంధముల సమ్మేళన రూపమగు దృశ్యములో దేహముగా బంధింపబడినట్లుగా కనిపిస్తోంది! అనగా, **స్థూల దేహ స్వరూపానుభూతి ఏర్పడుతుంది**.

ఇక ఆత్మ తన పరతత్వాన్ని ఏ మరచి ఇహత్వమును అభ్యసిస్తూ (having ignored the Beyondness to what is here and practising whatever here) దేహ పరంపరలు పొందటం కొనసాగిస్తోంది. దృశ్యముపట్ల గల పరిమిత దృష్టిచే ఏర్పడిన ఒకానొక బంధనపూర్వక అవినాభావ సంబంధమునే **సంసారము** అని పిలుస్తున్నారు!

**ఉద్ధవుడు:** స్వామీ! ఈ జీవుడు వాస్తవానికి సర్వదా ఆత్మస్వరూపుడే కదా! ఆత్మ అఖండము

– అప్రమేయము అని వేద – ఉపనిషత్ ప్రవచిత ఆత్మ శాస్త్రములచే, ఆత్మజ్ఞులగు మహనీయులచే సిద్ధాంతీకరించబడుతోంది. మరి, ... ఆత్మకు సత్త్వ – రజ – తమో గుణములు ఎక్కడి నుండి వచ్చి బంధం కలిగిస్తున్నాయి? ఈ దృశ్యము ఆత్మరూపమే అయివుండగా, ఆత్మయందు గుణ రూప లింగ దేహ బంధం, ఆ లింగ దేహంచే స్థూల దేహ బంధం, "ఈ దృశ్యములో దృశ్య తదాత్మ్యముచే జీవాత్మగా దేహ బద్ధుడనై ఈ ఈ సంగతి సందర్భము ఇత్యాది వ్యవహారములలో చిక్కుకున్నానే!" ... అనే అనుబంధభావం, ఇవన్నీ ఎట్లా ఎవరి కారణగా ఏర్పడుచున్నాయి?

**శ్రీకృష్ణుడు:** ఓ ఉద్ధవా! నీవుచెప్పినట్లు ఆత్మ ఎల్లపుడూ అతీతము నిర్మలము అఖండము –నిత్యోదితము – ఆనందస్వరూపమే!.

మరి త్రిగుణ రూపమగు ఈ లింగ శరీరము (సూక్ష్మ శరీరము అని కూడా అంటారు) గురించి అడుగుతావా?

**శ్లో॥ సత్త్వం రజస్తమ ఇతి గుణా బుద్ధేః! న చ ఆత్మనః!**
**సత్త్వేన అన్యతమౌ హన్యాత్ సత్త్వం సత్త్వేనచైవ హి॥** **(అధ్యా 13, శ్లో 1)**

సత్త్వము – రజము – తమము అను త్రిగుణములు ఆత్మకు సంబంధించినవి కానేకావు. మరి? అవి బుద్ధికి సంబంధించినవి మాత్రమే!

**అజ్ఞానము – నిద్ర – బద్ధకము – భయము** – మొదలైన అంతర్గత విశేషములతో కూడిన **తమోగుణమును, నేను ఇది చేస్తున్నాను – అది చేయాలి – ఏదో చేయలేక పోతున్నాను – అక్కడికి వెళ్ళాను – ఇక్కడి వెళ్ళాలి – ఈ లోకంలోకి వస్తున్నాను – ఆ లోకంలోకి ఇక వెళ్ళాలి–** ఇటువంటి రూపమగు రజోగుణమును మునుముందుగా జయించాలి, అది ఎట్లా?

శాంతి – ప్రేమ – ఓర్పు – దాక్షిణ్యము ఇటువంటి విశేషములతో కూడిన సత్త్వగుణ సంపదతో రజ – తమోగుణములను జయించు. ఆవిధంగా (సత్య–దయా– శాంతి – ప్రేమ – ఓర్పు – దాక్షిణ్యము ఇటువంటి విశేషములతో కూడిన సత్త్వగుణ సంపదతో రజ – తమోగుణములను) జయిస్తూ అటు తరువాత, **గుణాతీత వృత్తిచే** సత్య – దయా – శాంతి – ప్రేమ రూప వృత్తులకు కూడా క్రమంగా అతీతుడవు–సాక్షివి– గుణాతీతుడవు అగుము.

ఎప్పుడెప్పుడైతే సత్త్వగుణము వృద్ధి పొందుతూ వుంటుందో, అట్టి సందర్భాలలో క్రమక్రమంగా సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడనగు నాపట్ల భక్తి - ప్రపత్తి స్వభావసిద్ధంగా ఉత్పన్నమౌతూ వుంటుంది.

అట్టి భక్తి లక్షణములు కించిత్ సాధనచే కొంచెముకొంచము ప్రవృద్ధం అగుచుండగా, సత్త్వగుణం మరింతగా తనంతటతానే వృద్ధి అగుచూ వుంటుంది. సత్త్వగుణం నుండి **ధర్మము** అనే రుచికరమైన సాత్విక గుణఫలం ఫలదీకరిస్తూ వస్తుంది. అధర్మము క్రమంగా బలహీనమౌతూ వుంటుంది.

ఈ సత్త్వ - ధర్మ గుణాలు పరస్పరం అభివృద్ధి పరచుకుంటూ వుంటాయి. ధర్మమును మరికొంత - మరికొంతగా ఆశ్రయిస్తూ వుండగా, రజోతమో గుణాలు బలహీనమగుచూ, క్రమక్రమంగా మొదలంట్లా జయించివేయబడుతూ వస్తాయి, రజ-తమో గుణాలు బలహీనమగుచూ వుండగా, ... ఆ రెండింటికీ మూలమైన అధర్మము కూడా (అధర్మభావాలైన కామము - రాగము - క్రోధము - లోభము మొదలైన ఆత్మానుభవానికి వ్యతిరిక్త భావాలు) శీఘ్రంగా బలహీనపడుచూ వస్తాయి..

**ఉద్ధవుడు :** త్రిగుణములు ఎందులోంచి జనిస్తున్నాయి? ఎందులో ఏర్పడి ఉంటున్నాయి? వాటిని జయించినప్పుడు ఎటువైపుగా పోతున్నాయి?

**శ్రీకృష్ణుడు:** త్రిగుణములు బుద్ధిలోనే ఏర్పడి, బుద్ధిలోనే దాగి ఉంటున్నాయి. అయితే, ఈ త్రిగుణములు ప్రదర్శనమవటానికి స్థానం ఏమిటంటావా?

1 **ఆగమము :** తెలియబడే దృశ్యజగత్తు
2. **ఆపః :** జలము. ఆపోమయప్రాణః : శక్తి : ప్రకృతి
3. **ప్రజా :** జనులతో సంసర్గము
4. **దేశః :** దేశము (Place factor)
5. **కాలము :** (time factor)
6. **కర్మ :** (The acts / actions)
7. **జన్మ** : నేను జన్మించినవాడను అను రూపమైన స్వస్వరూపమునకు సంబంధించిన ఏ మరుపు
8. **ధ్యానము :** (The sense of Avocation)
9. **మంత్రము :** (The act of Chanting)
10. **సంస్కారము** : (Tedency)

ఈ పది వస్తువులు ఆయా వివిధ గుణ ప్రదర్శనమునకు కారణమవుతూ వుంటాయి.

**మోక్ష శాస్త్రము ఎఱిగిన మహనీయుల బోధ విను :**

1. తామసగుణమును తిరస్కరించటానికి శాస్త్రప్రవచితమైన సాధనలకు సిద్ధపడండి. **ఉత్సాహ - సాహసాలు** పెంపొందించుకోండి!
2. తామసగుణాన్ని జయించే ప్రయత్నంలో జనించే రజోగుణాన్ని **ఉపేక్ష** (just ignoring) అనే సమరసపూర్వక బుద్ధిబలంతో జయించండి.
3. తామస రాజసగుణములు బలహీనబడుచుండగా స్వాతిక గుణం బలపడుచున్నది (లేక) సత్త్వ గుణం బలం పుంజుకుంటూ వుండగా రజోతమోగుణాలు వాటికవే బలం కోల్పోతూ వస్తాయి.

ఏఏ అభ్యాసాలు సత్త్వగుణమును పెంపొందించుతాయో, అట్టి అభ్యాసములు ఆశ్రయించటం ఉచితం! అవసరం! అత్యావస్యకం కూడా!- **అని బోధిస్తున్నారు!.**

ఓ ఉద్ధవా! జగత్ సంబంధమైన **స్మృతి- అపోహ** కొనసాగునంతవరకు, ఈ దృశ్యము స్వస్వరూపాత్మ యొక్క ప్రత్యక్షరూపంగా అనుభూతంకానంతవరకు, స్థూల - సూక్ష్మదేహభావాలు తొలగనంతవరకు,.... **ఎంతెంత వరకైతే** అవి కొనసాగుతూ వుంటాయో..., **అంతతవరకు** సత్త్వ గుణాభివృద్ధికై సాత్త్విక గుణాలు సేవిస్తూనే ఉండాలి!. ఉత్తమగుణాలు, దైవీసంపత్తి పెంపొందించుకొనే ప్రయత్నాలకు ఉపక్రమించకుండా "కృష్ణా! రక్షించు!" అని మాత్రమే పలుకుతూ ఉంటే, ఈ సంసారపయోధి నుండి నేను రక్షించేదెట్లా? అయితే నాపట్ల భక్తి స్వభావసిద్ధంగా సాత్త్వికగుణములను ఉత్తేజపరచగలదు.

సాత్త్విక గుణాలు సేవిస్తూ వుండగా ధర్మము అనే ఉత్తమ బుద్ధి ప్రేరేపించబడుతూ వుంటుంది. ధర్మముచే తత్త్వజ్ఞానం (త్వమ్ తత్ సత్ ఇతి జ్ఞానః – నీవుగా కనిపిస్తున్నది ఆత్మయొక్క ప్రత్యక్షానుభవరూపమే... అనే జ్ఞానం) వృద్ధి చెందుతూ వుంటుంది. కనుక బద్ధకం వదలు. ప్రేమ–కరుణ–త్యాగము ఇత్యాది గుణాలను వృద్ధి చేసుకో!

**ఉద్ధవుడు:** ఓ శ్రీకృష్ణ ప్రభూ! మా జీవుల కథ – కమామీషు చూస్తూ వుంటే, .. నాకు ఆశ్చర్యం! ఈ జగత్ విషయాలు, ఇక్కడి ఆయా సంబంధ – బాంధవ్య లౌకికాశయాలన్నీ అనేక దుఃఖపరంపరలకు కారణములగుచున్నాయని మేము అనేక సందర్భాలలో గమనిస్తూనే ఉన్నాము. అల్పజ్ఞాన జంతువులగు కుక్క – గాడిద – మేకవలె అనేక

దుఃఖాలు సహిస్తూ కూడా... మేము విషయానుభవములు కొనసాగించటానికే సిద్ధపడుచున్నామే! ఎందుచేత? దీనికి కారణం ఏమిటి? అట్టి విషయానుభవములపట్ల భావావేశము – అనే రజోగుణసంబంధమైన వృధాయాసమునుండి విరమించటం ఎట్లా?

**శ్రీకృష్ణుడు:** అవివేకం చేతనే – **ఈ దేహరూపమే నా రూపం! దీనితోనే నా ఉనికి! ఇద్దాని స్థితిగతులే నా యొక్క స్థితి గతులు...** అనే రూపముతో కూడిన దోషబుద్ధి ప్రమత్తతచేత (because of lazyness of intelligence), అవివేకంచేత రూపుదిద్దు కుంటోంది!. దేహాత్మబుద్ధి యొక్క కొనసాగింపువలన దుఃఖాత్మకమైనట్టి ఘోర (స్థూల) రజోగుణం వచ్చి మనస్సు (thought) ను కప్పివేస్తోంది.

రజోగుణప్రభావంచేత సత్త్వగుణం కప్పబడినదై... సంకల్ప – వికల్పాలు అనుక్షణికంగా, అవిశ్రాంతంగా బయల్వెడలుచున్నాయి!. అట్టి తరుణంలో అల్పబుద్ధితో కూడిన ఈ జీవుడు విషయములను ప్రవాహపతితంగా ఆలోచించనారంభిస్తున్నాడు.

ఇకప్పటినుండి పరంపరంగా విషయవాసనలు పుట్టుకొస్తున్నాయి.

విషయకామవశుడైన ఈ జీవుడు మరికొన్ని కర్మలు! **కర్మపరంపరల వలన ప్రయోజనం దుఃఖమే!**.. అని తెలిసికూడా, ఇచ్ఛలేకున్నప్పటికీ అభ్యాసము యొక్క బల – వేగ ఉద్విగ్నతలకు లోను అయి, చేసిన కర్మలనే మరల – మరల నిర్వర్తిస్తున్నాడు. చర్విత చర్వణుడౌతున్నాడు! జన్మ తరువాత మరణం, మరణం తరువాత జన్మ – ఇట్లా జన్మ పరంపరా వ్యవహారములను కొనసాగిస్తూనే పోతున్నాడు.

**ఉద్ధవుడు :** స్వామీ! మరి, ఉపాయం?

శ్రీ కృష్ణుడు: విద్వాంసుడు వివేకి అయినవాడు రజోగుణం – తమోగుణములచే విక్షిప్తుడు (sorrounded) అయినప్పటికీ, మనస్సుచే – ఇంద్రియములకు – ఇంద్రియార్ధముల చమత్కారములగు జగత్ విషయములకు **అతీతత్వము** అభ్యసిస్తున్నాడు. చిత్తమును నిగ్రహించి, విషయములకు అతీతత్వము సంపాదించినవాడై వుంటున్నాడు. "కర్మల యందు, కర్మ ఫలముల యందు దోషం ఉంటూనే ఉంటుంది – అని గ్రహించినవారై... సర్వదా కర్మల యందు, వాటికి సంబంధితమై యుండే తదితర వ్యవహార పరంపరల యందు వారు **అనాసక్తులై** (Mentally unattached) **వుంటున్నారు.**

కనుక మిత్రమా! ఈ జీవుడు సర్వదా అప్రమత్తుడై క్రమక్రమంగా మనస్సును సర్వతత్త్వ

స్వరూపుడనైన నాయందు నిలిపి ఉంచుగాక! "ఇదంతా మమాత్మ చైతన్య ప్రభావ వీచికా చమత్కారమేగదా!" అని ఆస్వాదించునుగాక!

అందుకుగాను అభ్యాసపూర్వకంగా **శ్వాసను ప్రాణాయామాదుల సహాయంతో నిశ్చలంచేస్తూ శిరస్సుకు ఊర్ధ్వంగా నిలుపుచూ ఆసనజయం సముపార్జించునుగాక!** క్రమంగా విషయాలకు అతీతమైన ఏకాగ్రతను అనుసంధానం చేయునుగాక!.

## 18. హంసబోధ - సాంఖ్యయోగము

**శ్రీకృష్ణుడు :**

**యోగము :** సాధకుడు సర్వ జగద్విషయాల నుండి ధ్యాసను ఉపశమింపజేసి, ఈ దృశ్య జగత్తు ఏ ఆత్మయందు స్వయం కల్పనా చమత్కృతిగా కల్పితమై కనిపిస్తోందో,... అట్టి నా పరమాత్మ వైభవమునందు అతని ధ్యాసను నిశ్చలం చేసి వుంచటం!

(లేక) గుణమయమగు జగత్తులో కనిపించే సహజీవులందరినీ పరమాత్మ యొక్క ప్రదర్శనాచమత్కార విన్యాసంగా సందర్శించటాన్ని సర్వదా అభ్యసించటం! ఇదియే సనకుడు మొదలైన యోగశాస్త్ర ప్రావీణ్యులగు శిష్యులకు నేను ఒకానొక సందర్భంలో సిద్ధాంతీకరించి చెప్పటం జరిగింది!

**ఉద్ధవుడు :** ఓ కృష్ణా! మీరు ఎప్పుడు ఏ సందర్భంలో సనకుడు మొదలైన యోగ పండితవరేణ్యులకు గురువులై యోగశాస్త్రం బోధించారో... నాకు తెలుసుకోవలెనని కుతూహలంగా ఉన్నదయ్యా!

**శ్రీ కృష్ణుడు :** విను! చెప్పుతాను!

### హంస ప్రవచనం

ఒకానొకప్పుడు ఒక సందర్భంలో బ్రహ్మమానస పుత్రులైనట్టి సనకుడు, సనందుడు మొదలైనవారు తమ తండ్రియగు బ్రహ్మదేవుని సమీపించి ప్రణామములు సమర్పించి... ఈ విధంగా ప్రశ్నించారు.

**సనత్కురుడు మొదలైన బ్రహ్మమానసపుత్రులు :** సృష్టికర్తా! పితృదేవా! మా దొక సందేహం. యోగం అనే సాధనలో పరాకాష్ట ఏమిటి? సుసూక్ష్మము –ఉత్తమము అయినట్టి యోగసాధనము యొక్క అంతిమ ప్రయోజనస్థితి ఏమిటో అభివర్ణించి చెప్పవలసినదిగా

ప్రార్థిస్తున్నాం. (What is the final state for the practices of yoga?)

బ్రహ్మదేవుడు ఆప్రశ్నను ప్రశాంతంగా విన్నారు. తాను స్వయంగా అకారణ స్వరూపులు, కారణాలన్నింటికీ **కారణకారణుడు!** అఖిల భూతకారణుడు! అయితే నిరంతరం సృష్టి అనే నిత్య కర్మనిష్టుడు అయివుండటం చేత, అనేక రీతులుగా ఆలోచించి – ఆలోచించి, ప్రయత్నించి యోగ సాధనానంతర పరాకాష్టస్థితి ఏమిటో ఆతని పుత్రులకు అభివర్ణించి చెప్పినాకూడా వారు తృప్తిపడినట్లు కనబడలేదు. ఆ బ్రహ్మమానసపుత్రులు యోగ పరాకాష్ఠను బుద్ధితో గ్రహించి నిస్సందేహులు కాలేదు! అప్పుడు ఆయన తనమానస పుత్రులకు మరింత సమాధానము అందించటానికై నన్ను స్మరించటం జరిగింది. ఆయన యొక్క సంకల్పమును సిద్ధింపజేసే ఉద్దేశ్యముతో నేను హంస రూపంతో ఆయనముందు ప్రత్యక్షమైనాను.

అప్పుడు సనక–సనందాదులే కాకుండా, బ్రహ్మలోకములోని మునీశ్వరులు, బ్రహ్మదేవునితో సహా వచ్చి నా ఎదురుగా నిలబడి "**మీరు ఎవ్వరు?**" అని ప్రశ్నించారు!

అక్కడి మునులు యోగతత్త్వాన్ని తెలుసు కోవాలనే ఉద్దేశ్యంలో ఉన్నారని గమనించినట్టి నేను ఇట్లా సమాధానం చెప్పాను.

----

**హంసరూప నారాయణ స్వామి:** ఓ మునీశ్వరులారా? పరమార్ధవస్తువగు పరమాత్మ యందు నానాత్వమే లేదు. **అన్ని నామరూపములకు వేరై – అన్నీ నేనై** ఉన్నప్పుడు నేను దేవతనా? జీవుడనా? జీవుడను నేనే! జీవాత్మనూ నేనే! పరమాత్మనూ నేనే! ఇట్లా ఏమైనా చెప్పవచ్చు! అంతా–అన్నీ నేనే అయివుండగా, ఇక నేను ఎవ్వరినని చెప్పమంటారు? ఒక బొమ్మల కొలువులో రాజు–మంత్రి–సైనికులు... అన్నీ ఒకేమట్టి అయి ఉండగా, "ఓ మట్టీ! వీటిలో ఎవరు నీవు? రాజువా? మంత్రివా? సైనికునివా?" – అని అంటే ఆ మట్టి ఏమి చెప్పుతుంది?

ఒక వేళ – నేను ఇది! ఈ నామరూపములు కలవాడను! – అని చెప్పాలంటే కూడా ఎట్లా చెప్పను? ఎవ్వరైనా, "నేను ఇది! ఇది కాదు!" అని – చెప్పవలసివస్తే వారు కొన్ని జాతి – గుణ – క్రియా సంబంధాలను ఆశ్రయించి మాత్రమే చెప్పటం సాధ్యంకదా! **ఇప్పుడు నేనెవ్వరో మీరు కోరినట్లు వివరించి చెప్పటానికి నేను ఇప్పుడు ఏ జాతి – గుణ – క్రియలను ఆశ్రయించి చెప్పాలో,...** అదికూడా మీరే ముందుగా చెప్పండి?

అప్పుడు నేను సమాధానం చెప్పుతాను.

లేక... మరొక విధంగా మనం చెప్పుకోవాలంటే...,

జీవులందరు నారాయణ స్వరూపమే కదా! నారాయణుడు అనగా ఒక జీవుడా? కాదు కదా! సర్వజీవులు తానైనవాడు నారాయణుడు కదా! అందుచేత "నీవెవ్వరు?" అనే ప్రశ్నే సరికాదు, సమాధానం ఇవ్వదగ్గ ప్రశ్న కాదు!

పంచ మహాభూత నిర్మిత భౌతిక దేహం దృష్ట్యా :

ఈ దేవ – మనుష్య – జంతు దేహాలన్నీ వస్తుతః పంచమహా భూతాలతో తయారైనవే కదా? అందుచేత ఒక దేహధారిని పిలచి, "నీవెవరు?" అని ప్రశ్నించటం ఏమి ఉచితం? అన్ని ఆభరణాలు బంగారంతో తయ్యారు అయివుండగా ఒక ఆభరణాన్ని పిలచి **నీవెవ్వరు**? – అనే ప్రశ్నకు సమాధానం ఏమి చెప్పగలదు? – ప్రశ్నించేవాడు – సమాధానం చెప్పేవాడు కూడా ఒకే పంచ భూత సమన్వయమే అయి వుండగా!

అందుచేత ఈ దేహం దృష్ట్యా "నీవెవ్వడవు?" అనే ప్రశ్న అర్ధరహితం! కేవలం వాచారంభమే! పంచభూతములు – అనే 5 వస్తువుల కలగలపుగా ఒక బొమ్మను తయారుచేసి, ఓ బొమ్మా! నీవవరు?– అని అడిగితే? మట్టిని అంటుందా? జలమును అంటుందా?

"గాలికి గాలి అనే పేరు ఎందుకు పెట్టారు?" – అనే ప్రశ్నవలె మొదలే అర్ధరహితం కదా!. ఒక మట్టి బొమ్మకు ఎక్కడో మట్టి కనబడతే "ఓ మట్టీ? నీవెవరు?" అని ప్రశ్నించనట్లున్నది మీ ప్రశ్న–అని మరల గుర్తు చేస్తున్నాను.

అందుచేత ఓ బ్రాహ్మణోత్తములారా! : ఈ నామ– రూపాలు నేను కాదు.

అయితే కూడా...,

**ఈ మనస్సు చేత, వాక్కు దృష్ట్యా పొందబడేది, చెప్పబడేది.. తదితర ఇంద్రియములచేత పొందబడేదంతా నా స్వరూపమే! నాకు వేరైనది, నేను కానట్టిది ఎక్కడా ఏదీ లేదు! ఉండజాలదు!**.. ఈ నగ్న సత్యాన్ని తత్త్వచారణచే ముందుగా జాగరూకులై ఏకాగ్రతతో గ్రహించండి.

**సనకాదులు:** ఓ పరమహంసోత్తమా! తత్త్వ విచారణ చేసినప్పుడు కదా, మీరు చెప్పినట్లు అనిపించేది! జీవులమగు మాకు ఈ కనబడేదంతా నా ఆత్మ స్వరూపమే– అని అనిపించటంలేదే! మేము ఆవిధంగా గ్రహించటమూ లేదు. గమనించటల్లేదు. ఎందుచేత?

**హంస :** మమాత్మ స్వరూపులగు ఓ బిడ్డలారా! ఈ మానవుల చిత్తము ఇంద్రియ విషయములలో ప్రతిబింబిస్తోంది. అప్పుడు ఇంద్రియ విషయాలు తాము పోయి చిత్తములో ప్రతి బింబించటం జరుగుతోంది. అయితే ఈ మానవుని (జీవుని) వాస్తవ రూపం ఏమిటి?

భౌతిక శరీరమా? కాదు!

భౌతిక శరీరం జీవునిచేత కదలించబడుచున్నట్టిది. జీవుడు పాంచభౌతిక దేహముకంటే విశిష్టుడు! అతడు కదిల్చేవాడు గాని, కదిలేవాడు కాదు! ఆలోచనలు చేయు వాడే గాని, ఆలోచనలలోని వాడు కాదు. ఆలోచనాపరిమితుడు కాదు! ఆలోచనలు ఆతని రూపము కాదు!

చిత్తము – విషయములు కూడా ఆతని స్వరూపం కాదు. అవి రెండు ఆతడు ధరించిన ఉపాధి రూపములు మాత్రమే! రంగు చొక్కా ధరించినవాడు ఆ రంగు చొక్కాగా మారుతాడా? లేదు కదా! అట్లాగే జీవుడు చిత్త – విషయములు ధారణ చేస్తున్నప్పటికీ . చిత్త విషయములుగా రూపం దిద్దుకోవటం లేదు! ఆ రెండింటికీ అప్రమేయుడైవున్నాడు.

జీవుడు బ్రహ్మమే మూలస్వరూపంగా కలిగి ఉన్నాడు. ఈ జీవుని వాస్తవ రూపం బ్రహ్మమే! దేహ–మనో – బుద్ధి – చిత్త – అహంకారాదులన్నీ అతడు ధరించే ఉపాధిరూపాలేగాని స్వరూపస్వభావాలు కాదు. అవి స్వస్వరూపమునకు సంబంధించినవీ కాదు. అనగా, బ్రహ్మతత్త్వ స్వరూపుడు మనో–బుద్ధి–చిత్త–అహంకారములతోను, దృశ్య సమన్వితుడుగాను కనిపించవచ్చుగాక! అవిగా ఆతడు అవటమే లేదుగా!

జీవాత్మ బ్రహ్మము కాని క్షణమే లేదు. కనుక, మీరు మీగురించి జీవాత్మలం అని చెప్పుకుంటున్నప్పటికీ, సాక్షాత్ బ్రహ్మమే – అయివున్నారయ్యా!

ఈ దేహ – మనో – బుద్ధి – చిత్త – అహంకారాది ఉపాధులు (వస్త్రములవలె) ధరించినప్పటికీ అవి జీవునికి స్వస్వరూపములు కావు. నాటకంలో నటించేవాడు ఆ పాత్రగా మారిపోతాడా? లేక, ఆ పాత్రయొక్క స్వరూప – స్వభావాలు ఆతని స్వస్వరూపం అవుతాయా? లేదు కదా! ఇదీ అంతే!.

**సనకాదులు :** ఓ హంస గురువర్యా! మరైతే, నిర్మలాత్మస్వరూపులమగు మేము జీవాత్మలుగా కనిపిస్తూ, ఎందుచేత విషయాసక్తులమై వున్నాము?

**హంస :** బిడ్డలారా! వినండి! ఆత్మ సర్వదా మీరు చెప్పినట్లు నిర్మలము, నిత్యోదితము, సర్వమునకు అప్రమేయమే!. అయితే, నిరాకారమగు బంగారమునకు అకారణంగా - స్వభావంగా ఆకారము ఉంటోంది కదా! అట్లాగే ఆత్మ అకారణంగా, స్వభావసిద్ధంగా తనయందు తానే ద్వితీయానుభవమును ఆస్వాదించటానికి చిత్తమును కల్పించుకుంటోంది. అనగా చిత్తము యొక్క వాస్తవ స్వరూపము చిత్‌యే!. చిత్‌కల్పనయే చిత్తముయొక్క రూపము! చిత్ + ఆ చిత్‌యొక్క ఊహ = చిత్తము

లేక, చిత్‌యే చిత్తముగా అగుపిస్తోంది! ఆ చిత్తము త్రిగుణరూపంగా చెన్నొందుతోంది.

అట్టి చిత్తము తనయొక్క త్రిగుణత్వము నుండి బయల్వెడలే విషయములను తానే సేవించటం జరుగుతోంది! కనుక విషయములు చిత్తము నుండి జనించినవే! చిత్తము ఆత్మనుండి జనించినదే!. ఆత్మ అద్వితీయం సుమా! ఆత్మకు భిన్నమైనది - ద్వితీయమైనది ఎక్కడా, ఏదీలేదు!

**సనకాదులు :** సరే! అయితే, ఇప్పుడు బంధము అనుభవమౌతోందికదా?

**హంస :** "ఇప్పుడు నేను విషయములచే బద్ధుడనే అగుచున్నానే!" - అని బంధము అనుభవిస్తున్న జీవుడు **సర్వతత్త్వ స్వరూపుడనగు నన్ను ఆశ్రయించి క్రమంగా విషయాసక్తిని త్యజించుగాక! అప్పుడు పరతత్త్వమే శేషిస్తోంది!**

## విషయాసక్తిని జయించటానికి "ఆత్మయందు ఆసక్తి" యే ఉపాయం!

ఏ వివేకము యొక్క విభాగము చిత్తము రూపమును సంతరించుకొని విషయములను ఆసక్తితో ఆస్వాదిస్తోందో.. అదియే బుద్ధి యొక్క విషయవృత్తులు (Avocation) లేక, బుద్ధి వృత్తులు అయివున్నాయి.

1. జాగ్రత్ 2.స్వప్నము 3. సుషుప్తి...

ఈ మూడు కూడా త్రిగుణములచే కలిగిన బుద్ధివృత్తులే సుమా! ఈ జీవుడో? ఆ బుద్ధివృత్తులకు ఆవల కేవల సాక్షిస్వరూపుడై తురీయస్వరూపంగా వెలుగొందుచున్నాడు! అందుచేత జీవుడు సర్వదా చిత్తమునకు బుద్ధి వృత్తులకు విషయములకు సర్వదా విలక్షణుడు... అని వేదాంత శాస్త్రం అనేక దృష్టాంతాల ద్వారా నిర్ద్వంద్వంగా నిరూపిస్తోంది! ఆత్మజ్ఞులు సుస్పష్టంగా ఈ విషయం ప్రకటిస్తున్నారు!

ఓ వత్సలారా! స్వకీయమైన బుద్ధి వృత్తుల ద్వారా ఈ జీవునకు సంసార బంధం

ఏర్పడుతోంది. అంతేగాని, సంసారబంధం – మరెవ్వరి చేతనో బయట నుండి ఈజీవునకు కల్పించబడుచున్నది కానే కాదు! అందుచేత, **మీరు సర్వ జీవులలో సర్వదా ప్రకాశిస్తున్న నాయందు మీ బుద్ధి వృత్తులను ప్రసరింపజేయండి!** తద్వారా బుద్ధి వృత్తుల చాంచల్యమును ఉపశమింపజేయండి. అప్పుడు చిత్తము విషయములచే బంధింపబడదు. విషయములు లేనప్పుడు చిత్తము లేదు!

ఈ జీవుడు ఆనంద స్వరూపుడే! అయితే తాను కల్పించుకొన్న చిత్తముద్వారా బుద్ధి వృత్తులచే సేవిస్తున్న విషయముల ప్రభావం చేత అహంకారం (Relative sense of individually confined 'I') జనిస్తోంది. అట్టి అహంకారము స్వభావసిద్ధమగు ఆనందమును కప్పివుంచి బంధనభావములను కల్పిస్తోంది! ఆ బంధభావమే జీవుని పట్ల అనర్థమై సర్వ దుఃఖములకు కారణమౌతుంది! మరి ఉపాయం? క్రమంగా ఈ జీవుడు విషయముల పట్ల విరక్తుడై జగదతీతస్వస్వరూపమగు తురీయమును ఆశ్రయించటమే! తురీయమును ఆశ్రయిస్తూ క్రమంగా అభిమానము – భోగ చింతన... ఈ రెండింటినీ విడచివేయును గాక!

ఓ ప్రియ బాలకులారా! ఆత్మానంద – ఆత్మాకాశ స్వరూపుడనగు నేనే ఇన్ని రూపాలుగా మీ యొక్క భేదజ్ఞానముచే మీ ఆలోచనలకు ఆహారరూపమై లభిస్తున్నాను! ఇప్పుడు మీరు యుక్తితో కూడిన ఆలోచనలచే భేద జ్ఞానమును నివృత్తింపజేసుకోండి. **భేదజ్ఞానం నివృత్తి కానంతవరకు .. అసత్యము–స్వప్నతుల్యము అగు దృశ్యము వాస్తము–నిత్యమువలె అనుభవమౌతూనే వుంటుంది.** మీరు ఎంత సావధానుడవైవున్నప్పటికీ, నిత్యకర్మలను ఎంతగా నిర్వర్తిస్తున్నప్పటికీ, ఎంతగా జాగృతులైనప్పటికీ,... భేద జ్ఞానం జయించ బడనంతవరకూ మీకు అనుభవమయ్యేదంతా స్వప్న–సదృశము, కల్పితము, అసత్యము కూడా! అమ్మ కల్పించిచెప్పే కథలోని పాత్రలను – సంఘటనలను పిల్లవాడు ఊహతో ఆస్వాదిస్తూ – అవన్నీ ఎక్కడో ఉన్నాయని అనుకుంటూ, అనుభూతి పొందటం వంటిదే, ఇదంతా!

స్వప్నంలో కనిపించిన స్వప్నదృశ్యమునకు, స్వప్నములోని ప్రియ – అప్రియరూపములకు ఆస్తిత్వము ఉన్నదా? లేదు! అట్లాగే **పరమాత్మకు భిన్నంగా కనిపించే ఈ దేహముల సంబంధంగా అట్టి ఈ దేహములకు కల్పించబడే వర్ణాశ్రమ భేద ధర్మములకు, వాటికి ప్రయోజనంగా చెప్పబడే స్వర్గలోకము మొదలైన కర్మఫలములకు, ఆ కర్మ ఫలములకు కారణమగుచున్న పూర్వ – తదనంతర కర్మలకు అస్తిత్వమే లేదు!** స్వప్న దర్శి స్వప్నంలో

నిర్వర్తించిన కర్మలకు స్వప్నఫలములు లభించటం ఎటువంటిదో..., ఇక్కడి కర్మలు వాటి ఫలములు, స్వర్గాది లోకములు అటువంటివే సుమా! అందుచేత **పరమాత్మయే ఇన్ని రూపములుగా కనిపిస్తున్నారు** .... ఇటువంటి అభేదభావనతో కూడిన **జగదోపాసన అభ్యాసములను** ఆశ్రయించి మీరు **"స్వప్నదర్శనము"** అనురూప మనతగిన **జగద్దర్శనము** నుండి సత్యమగు **సమదర్శనమును** అభ్యసించండి. అదియే తురీయోపాసన!

1. ఈ జాగృత్‌లో అనుభమయ్యే....

ఇంద్రియముల ద్వారా వెల్లడి అగుచుండే క్షణికములైన బాల్య – యౌవ్వన – వార్ధక్య అవస్థలు, స్థూల దేహముల రాక – పోకలు, మనస్సుకు–ఇంద్రియములకు అనుభవమయ్యే రూప – నామ – స్పర్శాది అనుభవములు

2. స్వప్నావస్థలో అనుభవమయ్యే....

స్వప్న జాగ్రత్‌లో వాసనల ప్రభావంచేత కనిపించే విషయములు–స్వప్నదృశ్య పరంపరలు

3. ఆ స్వప్న విషయములను అనుభవించే స్వప్న ద్రష్ట (లేక) స్వప్నదర్శి (మరియు జాగ్రత్‌దర్శి

ఈ మూడింటినీ అధిగమించండి. ప్రతి – అనుసంధానం (Counter Practices) ద్వారా వాటిని దాటివేయండి. ప్రక్కన పెట్టి వుంచటం అలవాటు చేసుకోండి!.

**జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు అనబడే అవస్థాత్రయమును నేను వేరుగా ఉండి చూచువాడను! సాక్షిని! ఈ ఇంద్రియములకు అధిష్టాన స్వరూపుడనై, అతీతుడనై ఉన్నాను** అని గమనించటం అభ్యసించండి! క్రమంగా ఇంద్రియ "విషయములతో తాదాత్మ్యము"ను సాక్షి స్వరూపముతో తాదాత్మ్యము,... యొక్క ప్రభావంతో జయించివేయండి. ఒక సందర్భంలో వుంటూకూడా, **ఈ సందర్భమునకు నేను వేరై వున్నాను** అని గమనించటం ఏమి కష్టమున్నది చెప్పండి?

క్రమంగా ఇట్లా యోచిస్తూ, అభ్యసిస్తూ... **సత్త్వ – రజ – తమో – త్రిగుణ రూపములగు జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు నామనస్సు యొక్క అవస్థలు మాత్రమే! అవి నా యొక్క అవిద్యా ప్రభావపూర్వకంగా నాచేతనే నాయందు కల్పించబడుచున్నాయి కదా!..** అనే సత్యబుద్ధిని పరిపుష్టి చేసుకుంటూ వుండండి!

1 **ప్రత్యక్షమును పరిశీలించి సత్యమును ఆశ్రయించటం.**

2 **అనుమానమును ఆశ్రయించి శాస్త్రపరిశీలన చేయటం**

3 **గురూపదేశము** గురువు ఏ **తత్‌త్వమ్** అసి అనే సిద్ధాంతాన్ని సోదాహరణ – దృష్టాంతపూర్వకంగా తన సదుపదేశములతో మీ ముందు ఉంచుచున్నారో,.. అర్థానిని (తత్–త్వమ్‌ను) బుద్ధి పూర్వకంగా అవగాహన చేసుకోవటం...

ఇటువంటి ప్రయత్నముల ద్వారా మీ జ్ఞానఖడ్గానికి పదునుపెట్టుకోండి! సంశయములన్నింటికీ ఆధారం అహంకారమే!

అట్టి అహంకారము అనే దట్టమైన మబ్బును జ్ఞానఖడ్గంతో ఛేదించండి! మీ హృదయంలో వేంచేసియున్న సర్వాంతర్యామినగు నన్ను సమీపించి సేవించండి!.

నాయనలారా! ఈ కనబడేదంతా మనో విలాసం! చిత్త భ్రమాకల్పితం! త్రాడును గాలిలో త్రిప్పుతూఉండగా కనిపించే చక్రముల (ఆలాతచక్రముల) వంటిది! కాలముచే నశించబోయేది! మరొకవిధంగా ఇదంతా చిద్విలాసమే!

శుద్ధ విజ్ఞానస్వరూపము – ఏకము అగు బ్రహ్మమే ఈ తదితర జీవులరూపంగాను, గుణముల భేదం గాను, మనోబుద్ధి చిత్త అహంకారాలుగాను, జాగ్రత్ – స్వప్న – సుషుప్తులుగాను, ఈ జన్మ – వచ్చే జన్మ ఇత్యాదులుగాను అగుపిస్తోంది! అవన్నీ స్వప్నంలో చూసిన భవనముల అనుభవం వంటివే! వాస్తవానికి ఇక్కడ నానాత్వం లేదు! (న ఇహ నానాస్తి కించన)!

స్వస్వరూప బ్రహ్మమే ఈ సర్వ వివిధ రూపములుగా స్వకీయమాయాదృష్టికి అగుపిస్తోంది!.

❖ భిన్నత్వంలో సర్వదా వేంచేసియున్న ఏకత్వం దర్శించండి!

❖ **అనేకంగా కనిపిస్తున్నప్పటికీ ఒకటిగా కనిపించే** పవిత్ర దృష్టిని ఆశ్రయించండి.

❖ దృష్టిని ఆయా ఉపాయాలద్వారా – అభ్యాసముల సహాయంతో దృశ్య ప్రపంచము నుండి, **అనేకత్వ సందర్శనం** నుండి మరలించండి!.

❖ ఏదో పొందాలి! దొరకాలి! లభించాలి! ఇంకేదో తొలగాలి! – ఇటువంటి రూపముగా ఏర్పడి ఉన్న విషయ తృష్ణను క్రమంగా రహితం చేసుకోండి! తృష్ణను తూష్ణీకరించండి!

❖ ధ్యానము – భక్తి – యోగము మొదలైన ప్రయత్నములతో అంతరమున (Inner

zone) ను, బహిర్జగత్తును ఆత్మస్వరూపంగాను ఆస్వాదించి ఆనందించటం అభ్యసించండి! **నిజాత్మసుఖశీలురై ఉండటం అలవాటుగా చేసుకుంటూ వుండండి!**

---

మరొక్కసారిచెప్పుచున్నాను! వినండి!

❖ ఈ దేహ – ఇంద్రియ – విషయ జగత్తు ఎదురుగా ఆయా ఆహార – విహారాది సందర్భములలో అనివార్యంగా అగుపిస్తున్నప్పటికీ,... **ఇదంతా స్వప్న సదృశమే! ఆత్మయే ఇదంతా! పరమాత్మయే ఇట్లా అగుపిస్తోంది...** అనే మననమును సర్వకాల – సర్వావస్థలలోను అభ్యసించండి! **వస్తు దృష్టిని వదలుతూ, ఆత్మీదృష్టిని పెంపొందించుకోండి!.** దేహం ఉన్నంత వరకే ఇక్కడి సంబంధాలు! దేహికి దేహమే భ్రమ! ఇక ఇవన్నీ భ్రమకాక మరేమిటి? ఇది దృష్టిలో ఉంచుకొని మరల మరల ధ్యానం చేయండి! సర్వ స్మృతులను (జ్ఞాపకాలను) ఆత్మగా దర్శించే సాధనలో లయింపజేయండి. అప్పుడు మోహము దానంతట అదే తొలగిపోతుంది!.

ఓ సనక–సనందనాదులారా! దేహం ఉన్నంత వరకు సంబంధములు – అనుబంధములు – బాంధవ్యములు .. ఇత్యాది రూపములతో కూడిన వర్తమాన దృశ్య సంబంధం కొనసాగుతూనే వుంటుంది. దేహ సంబంధమైనవి దేహంతోనే పోతాయి. కాని సంస్కారములో? తదనంతర దేహముల రాక – పోకలకు కారణమగుచు ఉన్నది! అనగా, మరల ఆ సంసారము క్రొత్త క్రొత్త పిందెలతో కొనసాగుతోంది. అయితే,... దేహము ఈ దేహికి **ఐహికమోహము లేక ఐహిక భ్రాంతి!** ఏ **ఆత్మసత్యము**ను సిద్ధింపజేసుకోవలనే ప్రయత్నించుచున్నారో.. అటి సిద్ధయోగాభ్యాసకులు "ఈ దేహము నశ్వరము. నాశన శీలము. కనుక వర్తమాన సంబంధ బాంధవ్యములు నశించబోవు చున్నాయి!" అని మునుముందుగానే గమనిస్తున్నారు. దానిని సాధన వస్తువుగా మాత్రమే చూస్తున్నారు. మమకార – అహంకారాదులతో కాదు!

**అజ్ఞానియో...?**

దైవవశాత్ వచ్చిపోతున్న ఈ దేహము, ఈ సహజీవుల సంబంధమైన మమకారములు, అనుబంధ బాంధవ్యములు, ఈ దేహముతో పెంపొందించుకున్న అవినాభావతాదాప్యము.. ఇవన్నీ చూసుకొని మురిసి పోతున్నాడు! **ఆహా! ఇవన్నీ ఎంత సత్యం! ఎంత ప్రియమైనవి! ఇవన్నీ కదా, నాకు సుఖం కలిగించేవి! అయ్యబాబోయ్!**

**వీరితో ఈ సంబంధం దూరం అయిందా,.. ఇక నా పని ఖాళీయే కదా! వీరిని చూడకుండా ఉండలేను! వారంటే నాకు అయిష్టం! ఎట్లా వదులుతారో, ఏమో? ..** ఇత్యాది భ్రమలన్నీ పొందుతూ జీవితము అనే గొప్ప అవకాశమును బూడిద చేసుకుంటున్నాడు. దృష్టిని దృశ్య పరిమితం (What is being seen with physical eyes) చేసినవానికి – **ఇది నిజమా? నిత్యమా? శాశ్వతమైన సుఖం ప్రసాదించేదా? ఈ దేహాలు ఎందుకు వస్తున్నాయి? దీనిని ఏ దృష్టితో చూస్తే జీవితావకాశం సద్వినియోగం అవుతుంది?** – ఇటువంటి మార్గములలో పరిశీలించబుద్ధియే కావటం లేదు!

సిద్ధయోగియో....?

మత్తుపానీయం సేవించినవానికి తన ఒంటికి వస్త్రాలు ఉన్నాయో–లేవో కూడా తెలియకుండా తిరుగుతూ ఉంటాడు చుసావా? అట్లాగే... సిద్ధపురుషుడు ఈ దేహం ఉన్నదా? ఊడిందా?.. అనే పరిమితభౌతికానుభూతిని అధిగమిస్తున్నాడు! నశ్వరమగు ఈ దేహం ఉన్నపుడు – లేనప్పుడు కూడా నిశ్చలంగా నిశ్చింతుడై వుంటాడు! దైవవశంగా ఈ శరీరం వచ్చినప్పుడు, మరొకప్పుడు తొలగుచున్నప్పుడు, జీవిస్తూవున్నపుడు కూడా, తన దృష్టిని ఇంద్రియవిషయములవైపు సారించడు. సహజీవులను ఇంద్రియవిషయములుగా కాకుండా, సహజాత్మ స్వరూపులుగా సందర్శిస్తూ ఆత్మావలోకనం చేస్తూ వుంటాడు. ఎట్టి సందర్భములలోను, స్థితి–గతులలోను ఆత్మావనులోకనము నుండి చ్యుతి పొందడు!. (బ్రహ్మావలోకధిషణం న జహాతి యోగీ)

ఇక ఈ దేహముయొక్క గతి గురించి ఏమిటంటారా?

ఈ దేహం కర్మానుసారంగా దైవవశాత్ ప్రాణములతో కూడి జీవిస్తూ వుంటుంది! ఈ ఇంద్రియములు ప్రవర్తిస్తూ వుంటాయి! "సర్వసమ దర్శనము (లేక) ఆత్మౌపమ్యేవ సర్వత్రా సమం పస్యతి – అనురూపంగా నాకు నేనే నన్ను నేనే ఈ సర్వరూపాలుగా భావన చేసుకొని ఆస్వాదిస్తున్నాను" – ఇటువంటి అనుభూతిని నిశ్చలంచేసుకొన్న తరువాతనో? ఆతడు **తత్త్వజ్ఞుడు** అనిచెప్పబడుచున్నాడు. సిద్ధసమాధియోగి అని పిలువబడుచున్నాడు!

ఓ ప్రియ బిడ్డలారా! పరమార్ధ తత్త్వజ్ఞులు అవండి! సమాధియోగులుగా మిమ్ములను మీరు తీర్చిదిద్దుకోండి!

ఈ భౌతిక దేహంతో ఆసక్తి విడచినవారై ఉండండి!.

**"నేను – నాకు కనబడేవారు.. అంతాకూడా అఖండమగు ఆత్మయొక్క చమత్కార ప్రదర్శనమే! ఆత్మ సర్వదా, యథాతథం! అనేకత్వం ఎక్కడా లేదు! ఏకము – నిత్యము అగు ఆత్మయే నేను – నీవు కూడా!"** అను దృష్టిని సిద్ధించుకున్నవారై... ఆపై ఇక యథేచ్ఛగా మీ ఇచ్ఛ వచ్చినచోట సంచరించండి!

సిద్ధయోగి సర్వత్ర ఆత్మనే దర్శిస్తున్నాడు! ఇక ఆపై  స్వప్న తుల్యమగు ఈ దేహ – ఇంద్రియవిషయ పరంపరలను స్వప్న దృశ్యంగా దర్శిస్తున్నాడు! అనగా,... భౌతిక దేహము – విషయముల పట్ల అనాసక్తి (ఆసక్తిరహితుడై) ఉంటున్నాడు!. (లేక) తాను చదువుచున్న కథలో కల్పించబడిన పాత్రలవలె సందర్శిస్తున్నాడు.

ఓ విప్రవర్యులారా! హంసరూపుడనై ఇప్పుడు మీకు సాంఖ్య యోగ రహస్యాన్ని దేహమును – దృశ్యమును దర్శించవలసిన విధానాన్ని, దర్శించకూడని విధానాన్ని వివరించాను!.

---

**సనకాదులు :** ఓ హంస మహాశయా! పరమహంసా? ఎవరు మీరు? దేహతదాత్మ్యముతో కూడిన  చిత్త విభ్రమముల మధ్య చిక్కియున్న మాకు సిద్ధపురుషయోగాన్ని ప్రభోదించినమీరు మా యందు దయతో పరమసత్యాన్ని బోధించి నిద్రలేపారు! ఆత్మసాక్షాత్కారం అభ్యసింపజేసినట్టి తమరెవ్వరు?

**హంస:** నాయనలారా! నేను స్వయంగా విష్ణు భగవానుడను! మీకు సాంఖ్యయోగ రహస్యం వివరించటానికి మీ ముందు ఈ హంసరూపంగా ప్రత్యక్షం అయ్యాను! నా స్వరూపం సాఖ్యం – యోగం – సత్యం – ఋతము (ఆప్తవాక్యాలు) తేజస్సు – శ్రీ – కీర్తి – దమము ... ఇత్యాతులన్నింటికీ సమాశ్రయమగు సర్వముగా ప్రదర్శితమగుచున్న విష్ణుతత్త్వమే! సర్వ జీవరాసులలోను సర్వదా స్వస్వరూపంగా ప్రత్యక్షమైయున్న విష్ణుత్వమే నా వాస్తవరూపం!.

నిత్యుడను! నిత్య సత్యమును!

అప్రాకృతుడను! నిర్గుణుడను! నిరాకారుడను!

సంగరహితుడను!

అపేక్షారహితుడను!

సర్వ జీవులకు హితుడను! దయామయుడను!

సర్వుల స్వస్వరూపుడనై వుండటం చేత, సర్వ ప్రేమాస్పదుడను! అందరిచే ప్రేమించబడుచున్నది నేనే! సర్వులు నా ప్రేమాస్పద స్వరూపాలే!

సర్వాంతర్యామిని!

నిర్గుణుడగు నన్ను సర్వగుణములు సేవిస్తూ వున్నాయి! నేను మీ యొక్క స్వస్వరూరుడనే సుమా!

---

ఓ మిత్రమా! ఉద్ధవా! ఆవిధంగా నా సిద్ధపురుషవాక్యములు విన్న తరువాత సనకుడు మొదలైన మునులంతా సంశయ నివృత్తులు అయ్యారు! ప్రేమాస్పదంగా నన్ను పూజించారు! దివ్యస్తోత్రములతో....

భావమును నీవయ్యా...,

రాగమును నీవయ్యా....,

యోగమును నీవయ్యా.....,

సకలమును నీవే!

నేనే నీవు! మేమే నీవు! నీవే మేము!

నీ యొక్క అంశయే మేము!

మేము మీకు అద్వితీయులం! ఇక్కడ, ఈ దృశ్యములోని దేహ-బుద్ధి -చిత్త - అహంకారాలు ఆత్మను సేవించటానికై ఆత్మచే కల్పించబడి - కదలింపబడుచున్నాయి! మేము ఆత్మ స్వరూపులం

త్వమేవాఽహమ్ ! త్వమేవాఽహమ్!....,

అని గానం చేశారు! తమ ఆత్మేశ్వరుడనగు నన్ను కీర్తించారు!

అప్పుడు నేను అలవోకగా చిరునవ్వు చిందిస్తూ అక్కడి వారంతా చూస్తూ వుండగా.... వాయుతరంగం వాయువులో ఐక్యం అయినట్లు - జలతరంగం జలంతో ఐక్యత పొందినట్లు - ఆహంస రూపం ఉపశమింపజేసి నిజధామమునకు వెడలాను!.

# 19. భక్తియోగము - ధ్యాన విధానము

**శ్రీ ఉద్ధవుడు:** హే శ్రీకృష్ణా! భగవానుడగు బ్రహ్మదేవుడు వివిధ ఋషులు-మానవుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సాంఖ్యమార్గం, యోగ మార్గం, ధ్యాన మార్గం, త్యాగ మార్గం ఈ విధములైన వివిధ సాధన మార్గాలు బోధిస్తున్నారు కదా! ఆయా మార్గాలలో అన్నింటికన్నా శ్రేష్టమైన మార్గంఏదో... అది చెప్పండి! మా అందరికి సులభము - ఉత్తమమైనది - శ్రేయస్సు కలుగజేయగల అతిముఖ్యమైనదేదో.. చెప్పండి!

మీరు భక్తి యోగం బోధిస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. మీ పట్ల నిష్కామమైన భక్తి **యోగం సర్వగురువుల సమ్మతమా!** లేక, యోగ - ధ్యాన - కర్మ - యాగాదులు ప్రదిపాదిస్తున్న వేరు వేరు గురువులయొక్క వారు బోధిస్తున్న ఆయా మార్గాలే అధికంగా సమ్మతమా!

జీవుడుగా నాకు ఏ మార్గం సులభము? సర్వజనామోదం? నన్ను త్వరితగతిని ఉద్ధరించ గల మార్గమేదో... అదీ చెప్పండి!

**శ్రీ కృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! పూర్వాపర వివరణలతో ఇక్కడ నీ ప్రశ్నకు సమాధానంగా కొన్ని విశేషాలు చెప్పుతాను! విను!

**ఈ కనబడేదంతా నా ఆత్మ యొక్క విన్యాసమే! ఆత్మ సర్వదా అఖండమైవుండి, ఈ తదితరంగా అనిపిస్తోంది!...** అను జ్ఞానమే ఆత్మజ్ఞానం! వేదములు అట్టి ఆత్మ ధర్మమును ఎలుగెత్తి గానం చేస్తున్నాయి అట్టి ఆత్మ ధర్మము (The characterisitc feature of self) ను మొట్టమొదట నేను సృష్టికర్త యగు బ్రహ్మ దేవునికి బోధించటం జరిగింది. అట్టి ఆత్మధర్మము అను పరమసత్యము సృష్టికి ముందు - సృష్టికి తరువాత - సృష్టి సందర్భంలో కూడా సర్వదా అనునిత్య సత్యమై యున్నది.

అట్టి ఆత్మధర్మము యొక్క అవగాహన ప్రళయకాలంలో ఏమరచబడటంచేత సృష్ట్యాదిలో బ్రహ్మ దేవునికి వేదవాణి రూపంగా బోధించాను. బ్రహ్మదేవుడు తన కుమారుడు-స్వయంభువు అగు మనువుకు బోధించారు. **భృగువు, అంగీరసుడు, మరీచి, పులహుడు, అత్రి, పులస్త్యుడు, క్రతువు...** అను సప్త బ్రహ్మమహర్షులకు బోధించటం జరిగింది! భృగువు మొదలైన ఆ సప్త బ్రహ్మమహర్షులు - తమ తమ సంతానమగు దేవతలు దానవులు, గుహ్యకులు, మనుష్యులు, సిద్ధ - గంధర్వ-విద్యాధర - చారణులు, కింపురుషులు, కిన్నెరులు - నాగులు - రాక్షసులు - కింపురుషులు మొ॥వారికి బోధించగా

వారిలో అనేకులు అది గ్రహించారు. అయితే...., ఆయా జీవులంతా భిన్న భిన్నములైన సత్వ - రజో - తమోగుణ సంపన్నులై ఉండటంచేత భిన్న భిన్నములైన దృష్టి - అవగాహనలు కలిగి ఉండసాగారు! వాసనలను (tendencies) అనుసరించే దేవతలు - అసురులు - మనుష్యులు - భూతములు - భూతపతులు భిన్న-భిన్నంగా ఉంటారు కదా! ఆయా జీవులంతా వారి వారి చిత్ర - విచిత్రమైన వాసనలను అనుసరించి ఆత్మ తత్త్వ జ్ఞానము (త్వమ్ స్వరూపతః మమాత్మ యేవ - అను పార్యాంశాము) విషయమై అన్వయించుకోసాగారు. ఆవిధంగా చిత్ర విచిత్రములైన వర్ణనలు వేదవ్యాఖ్యానరూపంగా వెలువడసాగాయి. వెలువడుచున్నాయి. అనేక శబ్దాలు వాటికి వేరు వేరైన అర్థ ప్రయోగాలు బయల్వెడలుచున్నాయి. అంతేకాదు! ఈ మానవుల స్వభావాన్ని అనుసరించి బుద్ధిభేదం ఏర్పడుతోంది. ఇంకా కొందరు వేదముల అధ్యయనం చేయనివారై ఒకానొక గురువు యొక్క కొన్ని వాక్యములను (లేక) అభిప్రాయములను మాత్రమే ప్రమాణంగా తీసుకొని పారంపర్యంగా ఆవాక్యాలకు మరికొన్ని అర్థాలను కల్పించుకొని "ఇంతే! ఇంతవరకే ! మరింకెవరు ఏది చెప్పినా ఆలోచించవద్దు! విచక్షించవద్దు! అసలు ఇంకేమీ వినవద్దు!" - అనే పరిమితమైన అవగాహనకు కట్టుబడినవారై వుంటున్నారు. ఇందులో కొందరు పాషండమతస్థులై "పరమాత్మలేదు! దేహమే వున్నది ! మరణానంతరం ఈ జీవుడు నశిస్తాడు! ఇక ఆపై మరేమీ లేదు! ఉన్నంత వరకు తినండి! త్రాగండి! అంతే! ఇంతకుమించి ఏదీ విచారణ చేయకండి! ఇదే వేదసారం!".. అని కొన్ని దేహసంబంధమైన సంకుచిత భావాలకు - అభిప్రాయాలకు కట్టుబడినవారై వుంటున్నారు.

ఇక, మరికొందరు, "మనమంతా ఒక జాతివారం! ఇతర జాతివారిని హింసించటం, బాధించటమే మన గురువుయొక్క సేవ!"-అనికూడా భావన చేస్తున్నారు. హింసాత్మకమైన ప్రవర్తనకు సిద్ధమగువారు! అందుకు చావుకైనా సిద్ధపడేవారు కూడా ఉంటున్నారు!.

ఓ ఉద్ధవా! పురుషశ్రేష్ఠా! నా మాయచే మోహితులైన మరికొందరు వారివారికి రుచించే క్రియలు-కర్మలను అనుసరించి నానా విధములైన సాధనలను, సాధనాక్రమమును నమ్మి... అదే తదితరులకు బోధించే వారుకూడా వున్నారు!. ఉండబోవుచున్నారు కూడా!

"ధనమే అన్నింటికీ మూలం! దైవభక్తి వలన ధనం లభిస్తుంది" - అనే భావం ఆశ్రయించి దైవభక్తిని సాధనముగాను, ధన-సంపదలను సాధ్యముగాను భావించటం కూడా కొందరి విషయంలో జరుగుతోంది.

మరికొందరు ధర్మమే శ్రేయోసాధనం. పరోపకారులమై వుంటే చాలు. ఆత్మవిచారణతో పనిలేదు – అను భావన కలిగి ఉంటున్నారు.

యశస్సు – కామము – దమము – శమము – ఐశ్వర్యము – భోగములు – యజ్ఞము – తపస్సు – వ్రతనియమము ... ఇత్యాదులు ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా శ్రేయోసాధనములుగా కలిగి వుంటున్నారు?.

ఈ విధమైన భావనలచే ఆశ్రయిస్తున్న అనేక కర్మపరంపరలను ఆశ్రయించటంచేత,... కాలక్రమేణా వాటిలో కొన్నిటియొక్క అంతిమ ప్రయోజనములన్నీ దుఃఖ పరిణామములు గాను, మోహజనకములుగాను, అల్పఫలప్రదాతలు గాను, శోకయుక్తములు గాను అయి వుండటంకూడా జరుగనారంభించాయి.

ఓ ఉద్ధవా! ఎవ్వరైతే తమ మనస్సును సర్వాత్మకుడనగు నాయందు నిలుపుతూ క్రమక్రమంగా మనస్సును విషయశూన్యం చేసుకుంటూ వుంటారో.. అట్టివారు నా పరతత్త్వమును తెలుసుకుంటారు. పరతత్త్వాన్ని ఎఱిగి ఆస్వాదించుచున్న వారి ఆత్మ సుఖమును– స్వప్నతుల్యమగు ఇంద్రియ సుఖంతో ఏ మాత్రం పోల్చ వీలుండదు సుమా!

మనో – బుద్ధులలో కించత్వము లేనివారు (వారు తక్కువవారు – ఇది గొప్పది ఇత్యాది అభిప్రాయములను ఆశ్రయించనివారు), శమ – దమాది గుణాలంకారులు, శాంత మనస్కులు, తమలోని పరస్వరూపుడనగు నన్ను చూసి ఆనందించువారు – ఇట్టివారు మాత్రమే ఈ సర్వజగత్తును సుఖమయంగా దర్శించగలుగుచున్నారయ్యా!

**ఇంద్రియ విషయాభిలాషికి ఈ జగత్తంతా దుఃఖమయంగానే అనుభవమౌతూ వుంటుంది!.**

సర్వాంతర్యామిని సర్వతత్త్వ స్వరూపుడను – ద్రష్టయొక్క స్వస్వరూపుడను అగునాపై మనస్సు నిలిపినవాడు ఇక ఆపై బ్రహ్మ – ఇంద్ర – మహేంద్ర – సార్వ భౌమాది పదవులను గాని, పాతాళలోకాధిపత్యమును గాని, అణిమ–గరిమ మొదలైన సిద్ధులను గాని కోరుకోడు!.

## స చ మే భక్తి మాం ప్రియః !

ఓ ఉద్ధవా! నా భక్తుడు నాకు **ఇష్టమైనంతగా** – నాపుత్రుడగు బ్రహ్మదేవుడు గాని, హృదయేశ్వరియగు లక్ష్మీదేవిగాని, స్వరూపభూతుడగు  శంకరుడుగాని, నా సోదరుడుగు బలరాముడుగాని, నా ఆత్మగాని **ఇష్టం కాదు** సుమా! నేను భక్త సులభుడను! ఇష్టంగా

భక్తులను సర్వదా ఆశ్రయించి ఉంటాను. అంతేకాదు! భక్తుల పాదధూళితో బ్రహ్మాండములన్నీ పవిత్రం చేయటానికై నేను వారి వెంటనంటియే ఉంటాను. నిస్పృహుడు (One who does cross the relatedness of wordly matters), సదా పరతత్త్వజ్ఞాన మననశీలుడు, పరానందస్వరూపముచే పరమానందుడు, శాంతుడు, వైరభావరహితుడు, సమదర్శియు అగు నాభక్తుని నేను సర్వదా అనుసరించియే ఉంటాను! ఆతడు అల్పభావములను త్యజించినవాడై (నిష్కించనుడై) నాకు సమర్పించిన అనురక్త బుద్ధికలవాడై, శాంతుడై, మహాశయుడై వుంటాడు! సర్వజీవరాసులను వాత్సల్యదృష్టితో చూస్తూ ఉంటాడు.

అట్టివారు బాహ్య దృశ్యములపట్ల సర్వ అపేక్షలకు అతీతమైన అనిర్వచనీయమైన ఆత్మసుఖం ఆస్వాదిస్తూ వుంటారు.

ఆపేక్ష (Inquisitiveness towards what is being outwardly seen) కొనసాగించేవారు ఆత్మ సుఖమును పొందలకేపోతున్నారని గుర్తుచేస్తున్నాను!. ఉపేక్షచే ఆత్మసుఖానుభవులగుచున్నారు.

---

## భక్తి - ప్రపత్తి

**ఉద్ధవుడు:** స్వామీ! మీపై భక్తి ప్రవత్తులు ఉండికూడా.. పూర్వాభ్యాసవశంచేత ఇంద్రియములను ఇంకను జయించని నా వంటి ప్రాకృత భక్తుల స్థితి - గతుల మాట ఏమిటి?

**శ్రీకృష్ణుడు :** నా యందు భక్తి ప్రవత్తులు పవృద్ధమౌతూ ఉంటే... క్రమంగా సామాన్య విషయాలకు - ప్రలోభాలకు లొంగని బుద్ధి దానంతట అదే బలం పుంజుకుంటూ ఉంటుంది. దృశ్యాకర్షణ క్రమంగా తొలగనారంభిస్తుంది!.

అంతేకాదు...!

భక్తియోగమే కాకుండా, అనేకమైన అధ్యాత్మ మార్గాలు ఉన్నాయి, సాంఖ్య (విచారణా మార్గం) - స్వధర్మ నిర్వహరణ, సమర్పణ - స్వాధ్యాయం (వేదమంత్రాల పఠణం) - తపస్సు మొదలైనవి! అయితే అవన్నీ భక్తియోగానికి సాటిరావని, పరమాత్మనగు నన్ను వశం చేసుకోవటానికి భక్తితో సమానంగా సులభంకాదని రెండు చేతులు ఎత్తి ప్రకటిస్తున్నాను!. **అవన్నీ భక్తిలో అంతర్విభాగాలవటమే నాకు ఇష్టం.**

భక్తి శ్రద్ధచే ప్రవృద్ధమౌతుంది. భక్తి క్రమంగా అనునిత్యసాధనాక్రమంగా **అనన్య భక్తిగా** రూపుదిద్దుకుంటుంది. అప్పుడు ఈ జగత్తంతాకూడా కృష్ణచైతన్యానందంగా అనుభవమౌతుంది! సాధువులు **పరమాత్మను - సర్వప్రియ స్వస్వ రూపుడను** అగునన్ను భక్తితో లాభింపజేసుకుంటున్నారు! ఏకాగ్రతచే, **సర్వ జీవులుగా ఉన్నది పరమాత్మయే....** అనే భావనను ఆశ్రయిస్తూ ఉంటే భక్తి రూపుదిద్దుకుంటోంది.

అట్టి అనన్య భక్తిచే చండాలురుకూడా పరమపవిత్రులౌతారు!.

పరమాత్మ స్వరూపుడనగు నాయందు భక్తి ప్రపత్తి లేని వానిలో గల దయ-ధర్మము - సత్యము - తపస్సు - జ్ఞానము ఇవన్నీకూడా పరాకాష్ఠయగు పవిత్రతను సంతరించు కోలేవు సుమా!

శరీరము పులకితం కానంతవరకు, చిత్తము ద్రవించనంతవరకు, ఆనందాశ్రువులు కళ్ళ నుండి ప్రవహించనంతవరకు భక్త్యావిర్భావము యొక్క ఔన్నత్యము గాని, భక్తివలన కలిగే చిత్తశుద్ధిగాని, భక్తియొక్క ప్రభావమైన అనిర్వచనీయ ఆత్మానందముయొక్క అనుభూతి గాని పూర్తిగా అర్ధంకావు!.

భక్తిచే కంఠం గద్గదమౌతుంది! చిత్తము వెన్నవలె ద్రవీభూతమౌతుంది! అట్టివాడు ఒక్కొక్కసారి ఆనందంగా నవ్వుతాడు! సిగ్గువిడిచి పెద్దగా గానం చేస్తూ వుంటాడు! తన్మయత్వంతో నృత్యం చేస్తూ వుంటాడు!.

అట్టి భక్తుడు తనయొక్క పరాప్రేమచే మూడులోకాలను పరమపావనం చేస్తూ వుంటాడు!.

అగ్నిచే సంతప్తమై బంగారు ఖనిజం తనలోని మలినములను తొలగి పోగా దగ దగాయానంగా ప్రకాశిస్తుంది చూచావా! ఆ విధంగా, స్వభావంగా దృశ్య సంబంధం గల చిత్తముకూడా **భక్తి యోగం** చేత తప్తమై తనయందలి దోషములను తొలగించుకొని ప్రకాశిస్తుంది! చిత్స్వరూపుడనగు నన్ను స్వభావసిద్ధంగా సేవిస్తుంది! ఆస్వాదిస్తుంది! తన్మయమౌతుంది. అంతా తానే అయి, అంతటికీ వేరై... అనిర్వచనీయ చిదానందముగా అగుచున్నది.

ధూళిచే ఆవరించబడిన కనులు గలవారికి అంజన ఔషధంచేత (కాటుకమందుచేత) కంటిదోషం తొలగించితే వస్తువులు చూడగలుగుతారు చూచావా? అట్లాగే, నాయొక్క అవతార లీలలు, మహిమలు కీర్తించటంచేత చిత్తములోని దోషములు తొలగిపోతాయి. విషయములను సదా ఆలోచించే చిత్తము ఆ విషయములందే చిక్కుకుంటోంది! అదే

చిత్తము సర్వతత్త్వస్వరూపుడనగు-సత్యరూపమగు **నా గురించి ఆలోచన చేస్తూ వుంటే, నాయందు లీనమౌతుంది!.**

స్వప్నంలో కనిపించిన ఇల్లు మెలువవచ్చేటప్పటికి కనబడదేం?.. అని ఎవ్వరైనా దుఃఖిస్తున్నారా? లేదు కదా! ఇక్కడి ఆశ – నిరాశ – దురాశల రూపమైన మనోరథాలు స్వప్నసదృశాలే సుమా! "ఇక్కడ నాకు ఇంకా ఏదో – ఏదేదో లభించలేదు.." అనే వేదనలను మొదలంట్లా వదలి,... పరమాత్మనగు నన్నే ఏకాగ్రతతో అనుస్మరించటం ఉచితమని గుర్తుచేస్తున్నాను! వివేకవంతుడైనవాడవు కనుక, నీవు భౌతిక దేహ సంబంధమైన సాంగత్యములకు అతీతత్వమును సముపార్జించుకుంటూ, సంగమును త్యజిస్తూ ఏకాంతంగా, సావధానంగా ధ్యానం అభ్యసిస్తూ చిత్తమును నా వైపుగా నడిపెదవుగాక!

ఓ ఉద్ధవా! దృశ్య సంగముచేతనే ఈ జీవునికి క్లేశములన్నీ వచ్చి పడుచున్నాయయ్యా! బంధమునకు కారణం దృశ్య ధ్యానం చేత ఏర్పడే సంగమేగాని, (Attchment –సంగాత్ సంజాయతే కామః), **మరొకదెవరూ జీవునికి బంధం కల్పించటం లేదు.**

## ధ్యానయోగము

**ఉద్ధవుడు:** ఓ అరవిందాక్షా! శ్రీ కృష్ణా! ముముక్షువులు నీ యొక్క ఏ రూపమును ఏ భావనతో ఏ విధంగా ధ్యానం చేస్తూ ఉన్నారో, అది నా సాధన కొరకై నాకు తెలియజేయప్రార్ధన. ధ్యానయోగ విధానం తెలుపండి!

**శ్రీకృష్ణుడు :**

**శ్లో॥ సమ ఆసన అసీనః సమకాయో యథా సుఖమ్**
**హస్తావుత్సంగ ఆధాయ స్వ నాసాగ్రకృతేక్షణః (అధ్యా 14, శ్లో 32)**

**శ్లో॥ ప్రాణస్య శోధయేత్ మార్గం పూర – కుంభక – రేచకైః**
**విపర్యయేణా అపి శనైః అభ్యసేత్ నిర్జితేంద్రియః (అధ్యా 14, శ్లో 33)**

ధ్యానయోగ ప్రావీణ్యులు ఎత్తుగాని – పల్లంగాని కానటువంటి సమ–ప్రదేశంలో సమమగు సుఖాసనం ఆశ్రయించి చేతులు ఒడిలో పెట్టుకొని దృష్టిని నాసాగ్రంపై సారించి ధ్యానం అభ్యసిస్తున్నారు. ప్రాణాయామం–ఇంద్రియ జయయోగం కొరకై ఉద్దేశ్యించ బడింది! ఇంద్రియములను జయించాలి (లేక) ఇంద్రియవిషయములన్నింటినీ

దాటి వేసి మనోబుద్ధులను సమస్థితికి తేవాలి.

పూరక - కుంభక - రేచక - వరుసలోగాని, రేచక - కుంభక - పూరక - వరుసలోగాని నెమ్మదినెమ్మదిగా.. కాలం పెంచుకుంటూ అభ్యాసం చేయాలి! అప్పుడు క్రమక్రమంగా మనో - బుద్ధులు తమయొక్క దృశ్య సంబంధమైన సంస్కారాలను అధిగమించి క్రమక్రమంగా ఏకాగ్రత - మౌనము సంతరించుకోగలవు.

**కుండలినీ శక్తిని అవిచ్ఛిన్నంగా కంఠ స్థానంలో లయింపజేయటం :**

**శ్లో॥ హృత్ అవిచ్ఛిన్నమ్ "ఓం" కారం ఘంటానాదమ్ బిసోర్ణవత్**
**ప్రాణేన ఉదీర్య తత్ర అథ పునః సంవేశయేత్ స్వరమ్.** (అధ్యా 14, శ్లో 34)

తామరతూడు లోని దారం బీజాంకుర స్థానం నుండి - పుష్పము యొక్క అడుగుభాగం వరకు విస్తరించి యున్న తామరతూడు చివరస్థానం వరకు అవిచ్ఛిన్నంగా విస్తరించినదై ఉంటోంది కదా! ఆ విధంగా మూలాధార స్థానం నుండి హృదయస్థానం వరకు ప్రసరిస్తున్న (ఘంటానాదంతో పోల్చతగిన) నాదస్వరూప-ఓంకారమును మూలాధార స్థానము నుండి ప్రాణవాయువుతోసహా 12 అంగుళముల వరకు అవిఛిన్నముగా విస్తరింపజేస్తూ స్వరస్థానం (కంఠబిందువు, పంచదశ బిందువు) వరకూ విస్తరించి అక్కడ లయింపజేస్తూ వున్నారు-విజ్ఞులగు కుండలినీ ఉపాసకులు!

**శ్లో ॥ ఏవం ప్రణవ సంయుక్తం ప్రాణమేవ సమభ్యసేత్**
**దశకృత్వస్త్రిషవణం మాసాదర్వాగ్జితానిలః (అధ్యా 14, శ్లో 35)**

1. ఆసన జయం - నాసాగ్ర స్థాన ధ్యానం
2. పూరక - కుంభక - రేచకముల అభ్యాసం, రేచక - కుంభక - పూరకముల అభ్యాసం
3. ఓంకార రూపమగు ప్రాణముల కదలికకు కారణమయ్యే శక్తిని మూలాధారం నుండి-హృదయస్థానం ద్వారా-కంఠస్థానం వరకు నడిపించి, ఆ స్వరస్థానంలో ప్రతిక్షేపించటం. లయింపజేయటం.

ఈ విధానముల ద్వారా ప్రతిరోజు కనీసం 3 వేళల ఓంకారముతో కూడిన ప్రాణాయామమును అభ్యసిస్తూ వుండగా ఒక నెల కాలంలో ప్రాణవాయువు-ప్రాణశక్తి స్వాధీనం అవుతాయి.

# హృత్ పుండరీక ధ్యానం-పరతత్త్వ ధ్యానము

హృదయంలో ఇష్టదైవ రూపాన్ని ప్రతిక్షేపించుకొని-పరమాత్మత్వంతో మమైకమయ్యే ఒకానొక మార్గమును ఉదహరిస్తున్నాను. విను.

**శ్లో ॥ హృత్పుండరీకమ్ అన్తఃస్థమ్-ఊర్ధ్వనాలమ్-అథోముఖమ్**
**ధ్యాత్వోర్ధ్వముఖమున్నిద్రమ్ అష్టపత్రం సకర్ణికమ్**
**కర్ణికాయాం న్యసేత్ సూర్య-సోమ-అగ్నీన్ ఉత్తరోత్తరమ్**
**వహ్నిమధ్యే స్మరేత్ రూపం మమ ఏతత్ ధ్యానమంగళమ్** (అధ్యా 14, శ్లో 36,37)

దేహమునకు అంతర్గతమై, ఊర్ధ్వనాళములు కలదై, ముకిళితమై, కర్ణికములతో కూడినదై 8 దళములు గల హృదయ పుండరీకమును ధ్యానం చేస్తూ వుండాలి. అట్టి హృదయము యొక్క కర్ణికలలో సూర్య చంద్రులను, అగ్నియొక్క తేజస్సును భావన చేస్తూ వుండాలి. అట్టి తేజస్సులో మంగళప్రదమగు నా రూపమును ధ్యానం చేస్తూ ఉండాలి!

- సమము, ప్రశాంతము, సుముఖము,
- చతుర్భుజములు గలది,
- చారుసుందరమైనది,
- అందమైన నుదురుగలది,
- చిరునవ్వు చిందించేది,
- రెండు చెవులు - కుండలములు ధరించినది,
- బంగారు ఛాయగల పంచ ధరించినది,
- నీల మేఘ ఛాయ దేహము గలది,
- శ్రీవత్సమణి ధరించిన హృదయస్థానము కలది,
- శంఖ-చక్ర-గద-పద్మములను ధరించినది,
- విస్తారమైన - ఎత్తైన పాదములు గలది,
- కౌస్తుభమణి ధరించిన కంఠము గలది,
- కిరీటము మొదలైన ఆభరణములతో శోభిల్లునది,
- సర్వాంగ సుందరమైనది,

- మనోహరమైనది,
- చల్లటి చూపులు ప్రసరిస్తున్న కళ్ళుగలది,
- అతి కోమలము ....

అయినట్టి నాయొక్క భగవదవతారరూపమును హృదయంలో మననం చేస్తూ వుండు.

బుద్ధిమంతుడైనవాడు మనస్సును ఇంద్రియవిషయ ధ్యాసలనుండి ఉపసంహరించి, బుద్ధి అనే సారధి సహాయంతో చిత్తమును నాయొక్క వివిధాంగముల దర్శనాభ్యాసంలో నియమించుచున్నాడు! క్రమంగా అనేకచోట్ల ఉబుసుపోకగా విహరించే చిత్తమును నాయొక్క ఒక్కొక్క అవయవంపై ఏకాగ్రం చేస్తూ వస్తున్నాడు! అన్నిటికంటే చిరునవ్వులు చిందించే ముఖమండలముపై ధ్యాస నిలపటం సౌలభ్యముతో కూడిన అభ్యాసం – అని నా అభిప్రాయము.

క్రమంగా "అన్ని రూపములుగా – భావములుగా – స్వభావములుగా – గుణములుగా కనిపిస్తున్నది సర్వతత్త్వ – తత్త్వానంద స్వరూపుడగు పరమాత్మయే" .... అనే నిశ్చయమును బుద్ధిచే **ధ్యానం – ఆరాధనం – సందర్శనం** ఒకేసారి అభ్యసిస్తూ ఉండాలి! గుర్తు చేసుకుంటూ మరల మరల మననం చేసుకుంటూ ఉండాలి!

అనగా....

1. మొట్ట మొదట... "అనేక విషయములు ధ్యానించటము" అనే మనోరుగ్మతను **"ఇష్టదైవము – అవతారమూర్తియొక్క ఒక్కొక్క అవయవ మననము"** అనే ఔషధం సేవిస్తూ ... బుద్ధిని లౌకికమైన విషయములనుండి మరల్చాలి.

2. క్రమంగా అనేక అవయవముల ధ్యానం నుండి దృష్టిని మరల్చి **అవతారమూర్తియొక్క చిరునవ్వుతో కూడిన ముఖమండలమును మాత్రమే ధ్యానించటం** – అను అభ్యాసమును ఆశ్రయించాలి.

3. ఆ తరువాత ముఖమండలమునుండి కూడా చిత్తమును ప్రత్యాకర్షింపజేస్తూ భూమి–జలము–అగ్ని–వాయువులకు ఉనికిస్థానమైన ఆకాశమునందు ప్రతి క్షేపిస్తూ అభ్యాసం కొనసాగించాలి. పరమాత్మయొక్క ఆకాశతత్త్వాన్ని ఉపాసిస్తూ ఉండాలి.

4. ఆ తరువాత ఆకాశమునుండి కూడా చిత్తమును వెనుకకు మరలుస్తూ శుద్ధ బ్రహ్మస్వరూపమును **సర్వదా సర్వముగా – సర్వాతీతంగా** దర్శించే అభ్యాసమునకు

ఉపక్రమించాలి. అనన్యధ్యానంతో సర్వ అన్యమైన ధ్యాసలను జయించి చిత్తమును లోకాతీతంగా–దృశ్యాతీతంగా– సమగ్రంగా, పూర్ణభావసమేతంగా తీర్చిదిద్దాలి.

నీవు–నేను–అది–ఇది గుణములు. అంతఃకరణము అంతా పరమాత్మయే. చిత్తము చిత్ స్వరూపమై సర్వమును తనయందు దర్శించునట్లుగా "కృష్ణా! నీవు కానిదేదీ లేదయ్యా!" అను భావామృతమునుండి – కృష్ణ చైతన్యమునకు వేరైనదంటూ ఏదీలేదు. నేను కృష్ణచైతన్యమునే! నేను కానిదేది లేదు కదా! అను గానామృతమును ఆస్వాదించుగాక! సందర్శించునుగాక! తత్వమ్–సోహమ్ ఏకత్వము పొందిపరిఢవిల్లును గాక!

అట్టి సందర్శనముచే ఆతడు **"సమాహిత చిత్తుడు"** అని చెప్పబడుచున్నాడు!

అట్టి సమాహితచిత్తుడు ...,

ఒక జ్యోతియందు మరొకజ్యోతివలె తనయందు సర్వసహజీవులను, ఈ జగత్తును.... పరమాత్మయందు జీవాత్మను, పరమాత్మయే జీవాత్మగాను సమదర్శనమును సర్వదా ఆస్వాదిస్తున్నాడు!

పరమాత్మలో జీవాత్మను,

జీవత్మ పరమాత్మగాను,

జీవబ్రహ్మైక్యముగాను,

స్వస్వరూపమే సర్వస్వరూపంగాను,

జీవాత్మకు కేవల సాక్షిగాను,

తనను తాను – తనలో తాను – తానైన తనను దర్శిస్తాడు. ఆస్వాదిస్తాడు! "**ఇదంతా నాలోని నేనైన నేనే!**" అను అనుభూతితో పరవసిస్తాడు.

---

ఓ ఉద్ధవా! ఈవిధంగా **ధ్యానయోగం అను దైనందికమైన అభ్యాసం** చేత పరమాత్మయగు నాయందే మనస్సును లగ్నం చేయి! క్రమంగా ద్రవ్య (Material) – జ్ఞాన (Knowledge and thought related )– క్రియ (దేహ–మనో–బుద్ధిచర్యలు కదలికలు) అనే భ్రమలను త్యజించు! ఆధిభౌతిక – ఆధిదైవిక –ఆధ్యాత్మిక భ్రమలను నీ మనస్సు అధిగమించివేయును గాక! కర్మ–భక్తి–యోగ మార్గాలు "అఖండాత్మత్వాహమ్" స్థానమునకే దారితీస్తున్నాయని గమనించు.

త్రివిధ భ్రమలను త్యజించిన చిత్తము స్వయంగా - స్వభావసిద్ధంగా పరమాత్మయగు నాయందు మమేకం కాగలదు! పరమాత్మవే అయి **మత్తః పరతరం నాన్యత్ కంచిదస్తి** అని సర్వము నీవై, సర్వసాక్షిగా అయి ప్రకాసించగలవు. నా స్థానమును చేరగలవు.

## 23. అష్టాదశ సిద్ధులు - నిత్యసిద్ధ పరమాత్మ

**శ్రీకృష్ణ భగవానుడు :** ఓ ఉద్ధవా! జగదంతర్-బహిర్స్వరూపడనగు నేను సర్వదా సిద్ధ స్వరూపుడను! ఏ యోగి అయితే ఇంద్రియములను, వాటి విషయములను జయించిన వాడై (అధిగమించిన దృష్టి కలవాడై) శ్వాసను జయించినవాడై (కదలే శ్వాసకు ఆవల శ్వాసను కదలించే ప్రాణశక్తితో మమేకత్వము పొందినవాడై) స్థిరచిత్తుడై క్రమంగా సర్వతత్త్వ స్వరూపము-సర్వతత్త్వ విదూరకము అగు నా తత్త్వమునందు చిత్తమును నిలుపుతూ వస్తాడో... అట్టి వానిని కొన్ని సిద్ధులు తమంతట తామే ఒక మిత్రుని సమీపించినట్లుగా ఆశ్రయిస్తూవుంటాయి. అనునది-ఒకానొక జగత్ చమత్కార విశేషము!

**ఉద్ధవుడు :** హే అచ్యుతా! ఏఏధారణలచేత ఏఏ సిద్ధులు యోగికి సిద్ధిస్తూ వుంటాయో, ... అది మీ నుంచి కించిత్ వినాలని ఇప్పుడు అనిపిస్తోంది. యోగులకు సిద్ధులను ప్రసాదించే సిద్ధపురుషడవు నీవే కదా! అందుచేత నీ నుండి యోగ సిద్ధులు - అవి సిద్ధించటానికి కారణమయ్యే సాధనలు - వాటివాటి ప్రయోజనములు - చిత్తము మీయొక్క పరతత్త్వంలో లయించటానికి ఆయా సిద్ధులు ఎంతవరకు అవసరం - ఎంతవరకు ఉపకరిస్తాయి... ఇత్యాది విశేషాలు తెలియజేయవలసినదిగా నా విన్నపం!

**శ్రీకృష్ణభగవానుడు :** (చిరునవ్వు చిందిస్తూ) ప్రియ ఉద్ధవా! మనం ఇంతదాకా చెప్పుకుంటున్నట్టి చిత్తమును పరతత్త్వ ధ్యానం ద్వారా సర్వభూతాత్మానుభూతియందు లయింపజేయటానికి - నీవు తెలుసుకోవాలనుకుంటున్న సిద్ధులతో పనేమీలేదు. ఎందుచేతనంటావా! సిద్ధులు దృశ్య సంబంధమైనవి! ఆత్మానందమో... **దృక్ స్వరూపధ్యాన సంబంధమైనది.** దృశ్య వాసనా సంబంధమైన సిద్ధులు అనేక సందర్భాలలో బ్రహ్మజ్ఞానానుభవానికి అడ్డంకులవవచ్చు కూడా!

పై విషయాలను దృష్టిలో పెట్టుకొని, నీవు అడిగావుకాబట్టి చెప్పుతాను. మహదాశయమగు పరతత్త్వానందమును ఏమరువకుండా ఇప్పుడు సిద్ధులగురించి విను.

---

యోగశాస్త్ర పారంగతులగు మహనీయులు సిద్ధులను 18 విశేషములుగా విభజించి శాస్త్రీకరిస్తూ వున్నారు. అందులో 8 సిద్ధులు భగవత్ సంబంధమైనవి. స్వాభావికమైనవి! 10 సిద్ధులు సత్త్వగుణమును పెంపొందించుకోవటానికి ఉపకరించేవి! (లేక) గుణ సంబంధమైనవి.

## స్వాభావికమైన అష్ట సిద్ధులు (8)

**శ్లో॥ అణిమా మహిమా మూర్తేః లఘిమా ప్రాప్తిరిన్ద్రియైః**

**ప్రాకామ్యం శ్రుత - దృష్టేషు శక్తి ప్రేరణమీశితా ॥ (అధ్యా 15, శ్లో 4)**

| | |
|---|---|
| I. దేహసంభందమైన సిద్ధులు :<br>(మూర్తి సంబంధమైనవి) | 1. అణిమ,<br>2. మహిమ,<br>3. లఘిమ, |
| II. ఇంద్రియముల సబంధమైన సిద్ధులు<br>(ఇంద్రియ అధిష్ఠాతృ దేవతలకు సంబంధించినవి) | 4. ప్రాప్తి, |
| III. అనుభవ సంబంధమైన సిద్ధులు<br>(లౌకిక-పార లౌకిక పదార్థాలు - కోరుకొన్నవి ఇష్టానుసారం అనుభవంగా పొందటం) | 5. ప్రాకామ్య |
| IV తదితరులకు ప్రేరేపణ కలిగించగల సిద్ధి : | 6. ఈశ్వితసిద్ధి |
| V విషయములందు ఉండికూడా వాటియందు ఆసక్తి లేకపోవటం, గుణములతో అసంగత్వము సిద్ధింపచేసే సిద్ధి | 7. వశిత్వసిద్ధి |
| VI కోరుకున్న సుఖములను సిద్ధింపజేసే సిద్ధి | 8. కామావసాయిత సిద్ధి |

ఈ 8 సిద్ధులు స్వాభావికములు. నిరతిశయములు.

## సత్త్వగుణజాత సిద్ధులు - (ప్రత్యేక సిద్ధులు 10)

| | | | |
|---|---|---|---|
| 1. | అనూర్మిమత్త్వ సిద్ధి | : | ఆకలి - దప్పికల వేగమును జయింప జేయగల సిద్ధి |
| 2. | దూరశ్రవణ సిద్ధి | : | దూరంగా ఎక్కడో వున్న దృశ్యమును |
| 3. | దూరదర్శన సిద్ధి | : | చూడగల - వినగల సిద్ధులు |

| | | | |
|---|---|---|---|
| 4. | మనోజవ సిద్ధి | : | మనోవేగంతో ఇష్టం వచ్చిన ప్రదేశమునకు శరీరంతో వెళ్ళగలిగినట్టి సిద్ధి |
| 5. | కామరూప సిద్ధి | : | తాను కోరుకొన్న రూపం ధరించగల సిద్ధి |
| 6. | పరకాయప్రవేశన సిద్ధి | : | మరొక దేహంలో ప్రవేశించి ప్రవర్తించగల సిద్ధి |
| 7. | స్వచ్ఛందమృత్యు సిద్ధి | : | తానుకోరుకొన్నంత కాలం వర్తమాన దేహమును జీవింపజేగలిగినట్టి సిద్ధి |
| 8. | దేవానాం సహక్రీడానుదర్శన సిద్ధి | : | అప్సరసలతో కూడిన దేవతల సంచారములను సందర్శించగల సిద్ధి |
| 9. | యథా సంకల్ప సిద్ధి | : | ఎట్లా భావనచేస్తే ఆవిధంగానే సిద్ధించునట్టి సిద్ధి |
| 10. | ఆజ్ఞా అప్రతిహతాఆదేశ సిద్ధి | : | ఇతరులను అప్రతిహతంగా ఆజ్ఞాపించగల సిద్ధి |

ఈ 10 సత్త్వగుణ జాత సిద్ధులు.

ఇవి కాక మరికొన్ని సిద్ధులు :

## రజో - తమోగుణ సంబంధ సిద్ధులు (5)

| | | | |
|---|---|---|---|
| 1. | త్రికాలజ్ఞత్వము | : | జీవుల భూత-భవిష్యత్-వర్తమానములను తెలుసుకోగల సిద్ధి |
| 2. | అద్వంద్వము | : | శీత-ఉష్ణాది ద్వంద్వములను భరించగల - సహించగల సిద్ధి |
| 3. | పరచిత్తాది అభిజ్ఞతా | : | ఇతరుల చిత్తములను ఆలోచనలను క్షుణ్ణంగా తెలుసుకొని ఉండగల సిద్ధి |
| 4. | ప్రతిష్ఠంభ సిద్ధి | : | అగ్ని - సూర్య కిరణములు - విషము మొదలైన వాటిని నిరోధించగల సిద్ధి |
| 5. | అపరాజయ సిద్ధి | : | ఎదుటివారి బలమును హీనపరచి తనదయ్యేటట్లుగా పరివర్తింపగల సిద్ధి |

ఈ ఐదు రాజసిక - తామసిక సిద్ధులు. ఇవి ఇతరులపై కొంతవరకు పెత్తనమునకు సంబంధించినవి అవటం చేత **క్షుద్ర సిద్ధులు** అని కూడా చెప్పబడటం జరుగుతోంది!

## 21. చిత్తముయొక్క ధారణచే సిద్ధులు

యోగధారణచే సిద్ధించగల నామరూప లక్షణములు విన్నావు కదా! చిత్తమును (లేక మనస్సును) ఆయా విశేషములందు బహుకాలం నిలిపి ఉంచటంచేత ఆ సాధనయోగికి కాలక్రమంగా ఆయా సిద్ధులు సిద్ధిస్తూ వుంటాయి. ఇప్పుడు ఏ ధారణచే ఏవిధంగా ఎటువంటి సిద్ధులు కలుగగలవో... ఆ ధారణలగురించి కొన్ని విశేషాలు వివరిస్తున్నాను.

| **సిద్ధి** | | **అధ్యా 15** |
|---|---|---|
| **అణిమ** | భూత సూక్ష్మాత్మని మయి తన్మాత్రం ధారయేన్మనః | |
| | అణిమానమవాప్నోతి తన్మాత్రోపాసకో మమ ॥ | ( శ్లో 10) |
| **మహిమ** | మహత్తత్త్వాత్మని మయి యథా సంస్థం మనో దధత్ | |
| | మహిమానమవాప్నోతి భూతానాం చ పృథక్ పృథక్ ॥ | (శ్లో 11) |
| **లఘిమానః** | పరమాణుమయే చిత్తం భూతానాం మయి రంజయన్ | |
| | కాల సూక్ష్మార్థతాం యోగీ లఘిమానమవాప్నుయాత్ | (శ్లో 12) |
| **ప్రాప్తిః** | ధారయన్ మయ్యహంతత్త్వే మనో వైకారికేఽఖిలమ్ | |
| | సర్వేంద్రియాణామాత్మత్వం ప్రాప్తిం ప్రాప్నోతి మన్మనాః | (శ్లో 13) |
| **ప్రాకామ్య** | మహత్యాత్మని యః సూత్రే ధారయేన్మయి మానసమ్ | |
| | ప్రాకామ్యం పారమేష్ఠ్యం మే విన్దతే ఽవ్యక్త జన్మనః | (శ్లో 14) |
| **ఈశిత్వ** | విష్ణౌ త్ర్యధీశ్వరే చిత్తం ధారయేత్ కాలవిగ్రహే | |
| | స ఈశిత్వమవాప్నోతి క్షేత్ర-క్షేత్రజ్ఞ చోదనామ్ | (శ్లో 15) |
| **వశిత్వ** | నారాయణే తురీయాఖ్యే భగవచ్ఛబ్ద శబ్దితే | |
| | మనో మయ్యాదధద్యోగీ మద్ధర్మా వశితామియాత్ | (శ్లో 16) |
| **అకామః** | నిర్గుణే బ్రహ్మణి మయి ధారయన్ విశదం మనః | |
| | పరమానందమవాప్నోతి యత్ర కామోఽవసీయతే | (శ్లో 17) |

| | |
|---|---|
| అనూర్మిత్వ | శ్వేత దీప పతౌ చిత్తం శుద్ధే ధర్మమయేమయి |
| | ధారయన్ శ్వేతతాం యాతి షడూర్మిరహితో నరః (శ్లో 18) |
| దూరశ్రవణ | మయ్యాకాశాత్మని ప్రాణే మనసా ఘోషముద్వహన్ |
| | తత్రోపలబ్ధా భూతానాం హంసోవాచః శృణోత్యసౌ (శ్లో 19) |
| దూరదర్శన | చక్షుస్త్వష్టరి సంయోజ్య త్వష్టారమపి చక్షుసి |
| | మాం తత్ర మనసా ధ్యాయన్ విశ్వం పస్యతి దూరతః(శ్లో 20) |
| మనోజవ | మనో మయి సుసంయోజ్య దేహం తదనువాయునా |
| | మద్ధారణానుభావేన తత్రాత్మా యత్ర వై మనః (శ్లో 21) |
| కామరూప | యదా మన ఉపాదాయ యద్యద్రూపం బుభూషతి |
| | తత్తద్భవేత్ మనోరూపం మద్యోగబలమాశ్రయః (శ్లో 22) |
| పరకాయప్రవేశ | పరకాయం విశన్ సిద్ధ ఆత్మానం తత్రభావయేత్ |
| | పిండం హిత్వా విశేత్ ప్రాణో వాయుభూతః షడంఘ్రివత్(శ్లో 23) |
| బ్రహ్మరంధ్ర | పార్ష్ణ్యాపీడ్య గుదం ప్రాణం హృదురః కంఠమూర్ధసు |
| ద్వార ప్రవేశ | ఆరోప్య బ్రహ్మరంధ్రేణ బ్రహ్మనీత్వోత్ సృజేత్ తనుమ్ (శ్లో 24) |
| సాత్విక దేవతా | విహరిష్యన్ సురాక్రీడే మత్థ్సం సత్త్వం విభావయేత్ |
| సందర్శన | విమానే నోపతిష్ఠంతి సత్త్వ వృత్తీః సురస్త్రియః (శ్లో 25) |
| సత్యసంకల్ప | యుథా సంకల్పయేత్ బుద్ధ్యా యదా వా మత్పరః పుమాన్ |
| | మయి సత్యే మనో యుంజం స్తథా తత్సముపాశ్నుతే (శ్లో 26) |
| అప్రతిహతాజ్ఞ | యో వై మద్భావమాపన్న ఈశితుర్వశితుః పుమాన్ |
| సర్వనియామక | కుతశ్చిన్న విహన్యేత తస్యచాజ్ఞా యథా మమ (శ్లో 27) |
| త్రికాలజ్ఞ | మద్భక్త్యా శుద్ధసత్త్వస్య యోగినో ధారణా విదః |
| | తస్య త్రైకాలికీ బుద్ధిః జన్మమృత్యూపబృంహితా ॥ (శ్లో 28) |

| | | | |
|---|---|---|---|
| అప్రతిహత వజ్ర దేహ | } | అగ్న్యాదిభిః న హన్యేత మునేః యోగమయం వపుః<br>మద్యోగశ్రాన్త చిత్తస్య యదసాముదకం యథా | (శ్లో 29) |
| అజేయ అపరాజితః | } | మద్విభూతీః అభిధ్యాయన్ శ్రీవత్సాస్త్ర విభూషితాః<br>ధ్వజాతప పత్ర వ్యజనైః స భవేత్ అపరాజితః | (శ్లో 30) |

**1. అణిమాసిద్ధి :** సహజీవుల స్థూలరూపమును మనోదృష్టి పరంగా అధిగమించి, వారిలోని– మనస్సును (చిత్తమును) మనోతత్త్వమును (లేక) సూక్ష్మరూపమును ఉపాధిగా ధారణ చేస్తున్న స్వస్వరూప అంతర్యామియగు నన్ను ఉపాసిస్తూ రాగా ఇతరుల కంటికి కనబడనంత సూక్ష్మరూపమును సిద్ధించుకోగల **అణిమ** సిద్ధిలభిస్తుంది.

అనగా, ఇతరులను భౌతికదేహంగా కాకుండా...., **శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములను అలంకారప్రాయంగా ఆభరణములవలె ధరిస్తున్న సూక్ష్మదేహధారులుగా** సందర్శిస్తూ రాగా, అణిమాసిద్ధి (అణువంతరూపంగా) భౌతికదేహమును కుదించగల సిద్ధిలభిస్తుంది.

**2. మహిమాసిద్ధి :** పరమాత్మయొక్క మహదాకృతియే ఈ సమగ్రదృశ్యము... అనురీతిగా మహదాకృతియందు చిత్తమును అభ్యసింపజేసే యోగాభ్యాసంచేత **మహిమ** అనే సిద్ధి లభిస్తుంది. సిద్ధి అనగా, అట్టివాడు "దేహాత్ముడను" అను సంకుచిత దేహాత్మ భావనుండి, "ఈ దృశ్యమంతా నా దేహమే! ఈ సర్వలోకాలు – లోకవాసులు... ఇదంతా కూడా నాయొక్క ఆత్మ మహిమయే..." అనే అనుభవానంద స్థితిని సుస్థిరీకరించుకవడం. అట్లు అనుకుంటూ ఉండగా.... మహిమాసిద్ధి సిద్ధిస్తోంది. అంతేకాకుండా అద్దానిని ఆశ్రయించినవారికి అనేకమైనట్టి అవతారపురుషుల మహిమలు కూడా అనుభూతమౌతూ ఉంటాయి.

**3. లఘిమాసిద్ధి :** పంచభూతములుగా... వాటి వాటి ధర్మములుగా విరాజిల్లుచున్నట్టి పరమాణువుల అంతర్యామిగా నన్ను తమ చిత్తమునందు ధ్యానిస్తూ లగ్నంచేసే యోగులకు స్థూలదేహస్వరూపమును పరమాణునులతో ధారణ చేయగలసిద్ధి లభిస్తోంది. అనగా, సూక్ష్మపరమాణురూపం ధరించగల సిద్ధిని పొందుచున్నారు. "నేను (లేక నా ఆరాధ్య దైవం) పంచభూతములయొక్క అణువణువు విస్తరించియున్న–ప్రసరించియున్న అంతర్యామిని కదా!" అణువులను ఉత్తేజపరరచి దేహానిర్మాణమును ఇంద్రియ చమత్కారమును ఉత్తేజపరచే పరతత్త్వమే కదా!"... అను ఉపాసనచే ఎక్కడినుండి ఎక్కడికైనా ప్రయాణించగలడు.

**4. ప్రాప్తిసిద్ధి :** సర్వజీవుల అహమ్ స్వరూపంగా పరమాత్మయే ప్రదర్శితమౌతున్నారు... అను సందర్శనమునందు చిత్తమును నిలుపుచున్న యోగ సాధకులకు క్రమంగా సర్వేంద్రియములకు అధిష్టానత్వం లభిస్తుంది. సర్వేంద్రియములు, వాటివాటి సర్వ అనుభవాంతర్గతములు నేను ధరిస్తున్న ఆభరణములువంటివి... అను భావనాక్రమంగా సర్వదృశ్యమునకు అధిష్ఠానత్వంగా చెప్పబడే ప్రాప్తిసిద్ధి లభిస్తోంది. "మట్టిబొమ్మలన్నిటికీ మట్టియే అధిష్ఠానమైనట్లు నేనే సర్వదృశ్యములకు అధిష్ఠానమును" ...అను భావనచే ఏది ప్రాప్తించాలనుకుంటే అది ప్రాప్తించే సిద్ధి లభిస్తోంది. ఆశయమును సిద్ధింపచేసుకొనే సిద్ధి లభించగలదు.

**5. ప్రాకామ్యసిద్ధి :** పరమాత్మయే అహమ్‌ను వ్యక్తీకరించే అవ్యక్త – మహదత్వ స్వరూపమై ఉన్నారు... అను భావనయందు చిత్తమును ఏ యోగులైతే ఏకాగ్రం చేస్తూ సాధన చేస్తున్నారో.... అట్టివారు నాయొక్క సర్వమును వ్యక్తీరిస్తూ .... తాను అవ్యక్తంగా ఉంటూ ఉండే ప్రాకామ్య సిద్ధిని పొందుచున్నారు. ఇదంతా నాయొక్క ఇష్టమును అనుసరించే సంప్రదర్శితమౌతోంది!.... అను సిద్ధిని ప్రాకామ్యసిద్ధిగా చెప్పబడుతోంది. అతడు ఏది ఇష్టపడతారో, అవన్నీ పొందగలుగుతారు. సహజీవులకు ఆత్మీయులౌతారు. "ఆత్మయే పిపీలికాది బ్రహ్మపర్యంతము వ్యక్తీకరిస్తోంది"... అను ధారణచే ప్రాకామ్యసిద్ధి సిద్ధిస్తోంది.

**6. ఈశిత్వ సిద్ధి :** త్రిగుణమాయ ఎవ్వరియొక్క ఆధీనంలో ఉన్నదో, ఎవ్వరైతే కాలస్వరూపుడై లీలగా క్రీడిస్తున్నాడో... అట్టి నాయొక్క విష్ణుతత్త్వముపై మనస్సును లగ్నంచేస్తూ ఉపాసించే యోగి క్రమంగా సర్వజీవులలో ప్రేరణాశక్తి కలిగించే ఈశిత్వము అనే సిద్ధిని పొందుచున్నాడు. తదితరులను తన వాక్–ఆలోచనలచే ప్రోత్సాహపరచగల– ఆకర్షించగల– ఉజ్జీవింపజేయగల సిద్ధిని పొందుచున్నాడు. ((Ability to inspire others). ఎవ్వరు ప్రేమతో సమీపిస్తే వారిని కర్మ–భక్తి–జ్ఞాన–యోగ మార్గాలలో ప్రేరణ – రక్షణ–ఉపశాంతి సంతోషము కలిగించగల సిద్ధి సిద్ధిస్తోంది.

**7. వశిత్వసిద్ధి :** జాగ్రత్ – స్వప్న– సుషుప్తులకు ఆధారము, తత్ప్రదర్శకుడు, వాటికి కేవలసాక్షి తురీయము కదా! అట్టి తురీయుడే నారాయణుడు అని పౌరాణికంగా చెప్పబడుచున్నాడు. ఏ యోగి అయితే తన మనస్సును నారాయణుడు–భగవంతుడు మొదలైన శబ్దములచే ఉద్దేశ్యించబడేతురీయస్వరూపుడనగు నాయందు లగ్నం చేసి ఉపాసిస్తూ ఉంటాడో,... అట్టివాడు త్రిగుణాతీత స్వరూపమగు వశిత్వ సిద్ధిని

పొందుచున్నాడు. **గుణములచేత వశుడు కానివాడై ఆసక్తులను జయించినవాడై వుంటున్నాడు.** త్రిగుణములకు, మనో-బుద్ధి-చిత్త-అహంకారాలకు సాక్షిత్వము వహించటం అభ్యసించుచుండగా వశిత్వము సిద్ధిస్తోంది. త్రిగుణాదులు - ఇంద్రియములు మొదలైనవి వశములో వుండటంచేత మాయను జయించటానికి సుమార్గమగుచున్నది.

**8. అకామసిద్ధి :** నాయొక్క నిర్గుణ పరబ్రహ్మతత్త్వము నందు మనస్సును నిలిపి ధారణను అభ్యసించువాడు సర్వ కామములు నశింపజేసుకొని స్వాభావికమైన అనునిత్య పరమానంద స్థితిని సిద్ధింప చేసుకుంటున్నాడు. లభించిన - లభించని వస్తు విషయములకు అతీతుడై అకామసిద్ధిని సిద్ధింపజేసుకుంటున్నాడు.

**9. సాత్విక సిద్ధి :** సత్వాత్మ స్వరూపుడనుగా శ్వేతదీప్తునిగా, (శ్వేత ద్వీప పతిగా) సాత్వికధర్మస్వరూపుడనుగా నన్ను ఉపాసిస్తూ మనస్సును ఏకాగ్రము - లగ్నము చేయు అభ్యాసం కొనసాగించేవాడు ఆకలి - దప్పికలు షడూర్ములను జయిస్తాడు. శుద్ధ రూపమును పొందుతాడు. రజో-తమో గుణముల ప్రభావమును జయించివేస్తున్నాడు! సాత్విక భావాలు - సాత్విక గుణం త్వరత్వరగా స్వభావసిద్ధమగుచున్నది.

**10. దూరశ్రవణ సిద్ధి :** ఆకాశరూపుడను - శుద్ధ ప్రాణ (శక్తి) స్వరూపుడను అగు నాయందు బుద్ధిని నిలుపుతూ ఉపాసనకు ఉపక్రమించేవాడు... క్రమంగా అట్టి ఆకాశంలో అభివ్యక్తమయ్యే ప్రాణుల శబ్దాలను అత్యంత దూరంనుండి కూడా వినగల దూరశ్రవణ సిద్ధిని పొందుచున్నాడు.

**11. దూరదర్శన సిద్ధి :** రెండు కళ్ళలో సూర్యమండలమును-సూర్యమండలములో రెండుకళ్ళను సంయుక్తం చేస్తూ నాపట్ల ధ్యానం కొనసాగించే యోగులు.... దూరంనుంచే సర్వవస్తువులను - దృశ్యములను సందర్శించగల సిద్ధిని పొందుచున్నారు.

**12. మనోజవ సిద్ధి :** "నాయొక్క - తదితర సర్వ జీవులయొక్క మనోదేహములు - ప్రాణవాయువులతో సహా పరమాత్మసంప్రదర్శనమే" .... అని ధ్యానించువాడు "అనుకున్న ప్రదేశమునకు క్షణంలో పోవటం".... అను మనోజవ సిద్ధిని పొందుచున్నాడు.

**13. కామరూప సిద్ధి :** మనస్సును ఒక ఉపకరణంగా పరమాత్మ యందు లగ్నం చేయువాడు ఆ మనస్సు సహాయంతో తాను కోరుకొన్న భౌతిక రూపమును ధరించగల కామరూప సిద్ధిని సిద్ధింపజేసుకుంటున్నాడు. అచింత్య శక్తియుతుడనగు నాయందు

(చేతులతో ఒక వస్తువును పట్టుకున్నట్లుగా) తన మనస్సును ఉపాసనారూపంగా లగ్నం చేయువాడు అట్టి కామరూపసిద్ధి పొందుచున్నాడు. అతడు అనుకున్న రూపముగల దేహమును ధరించి తదితరులకు దర్శనమీయగలడు.

**14. పరకాయ ప్రవేశసిద్ధి :** యోగాభ్యాసంచే సర్వదేహములలో వేంచేసియున్న నన్ను ఏకాగ్రతతో ఉపాసించువాడు తాను అనుకున్నప్పుడు మరొక దేహంలో ప్రవేశించి "ఈ శరీరములో నేను ఉన్నాను"... అను పరకాయ ప్రవేశసిద్ధిని పొందుచున్నాడు. అట్టివాడు ప్రాణమును ఒక ఉపకరణమువలె ధారణచేసి వాయు మార్గములో ప్రాణశక్తిని ప్రయాణింపజేసి మరొక శరీరములో ప్రవేశించి "ఇది నా శరీరమైయుండు గాక! ఈ దేహమును నేను ఉపకరణంగా ఉపయోగించెదనుగాక!" అను ప్రక్రియను సిద్ధింపజేసుకోగలడు. ఒక పుష్పమును వదలి మరొక పుష్పముపై వ్రాలు తేనెటీగవలె ఆతడు ఒక శరీరమును వదలి మరొకరి శరీరమును ధారణ చేయగలడు. ఈవిధంగా పరకాయప్రవేశ సిద్ధి లభిస్తోంది.

**15. బ్రహ్మరంధ్ర ద్వార ఆత్మసంయోగ సిద్ధి :** కాలియొక్క మడమచే గుదద్వారమును నిరోధించి ప్రాణశక్తిని ఊర్ధ్వముఖం చేసే యోగులు క్రమంగా ఆ ప్రాణ శక్తిని హృదయంలోకి ప్రయాణింపచేస్తున్నారు. మరల ఆ హృదయ స్థానం నుండి శిరోభాగానికి, శిరస్సుయొక్క ఊర్ధ్వభాగానికి తరలింపజేస్తూ యోగ సాధన చేస్తున్నారు. అటుతరువాత బ్రహ్మరంధ్రము ద్వారా బ్రహ్మవస్తువునందు ప్రాణశక్తిని విలీనంచేసి దేహమునకు - విషయ ప్రపంచమునకు అతీతులై కేవలం సాక్షిస్వరూపులై సర్వము చిరునవ్వుతో ఆస్వాదిస్తున్నారు. బ్రహ్మకపాల మోక్ష స్వరూపులై విరాజిల్లుచున్నారు!

**16. సత్త్వగుణ దేవతాసందర్శన సిద్ధి :** శుద్ధ సాత్విక స్వరూపులు - ఆనంద స్వరూపులు అగు దేవతల సందర్శనేచ్ఛగల యోగి శుద్ధ సత్వభావన యొక్క అభ్యాసముచే క్రమంగా శుద్ధ సాత్విక స్వరూపమును సిద్ధించుకుంటున్నాడు. అట్టి యోగసాధన కొనసాగిస్తూ ఉండగా క్రమంగా సత్వగుణాంశ స్వరూపులగు దేవతా స్త్రీలను ఎదురుగా సందర్శించగల సిద్ధిని పొందుచున్నాడు. "సర్వులు నా ప్రేమ-స్నేహములకు మాతాశిశు వాత్సల్యములకు సర్వసందర్భములలోను అర్హులే!" -అను అభ్యాసముచే సత్త్వగుణ దేవతార్హత లభిస్తోంది.

**17. సత్యసంకల్ప సిద్ధి :** సత్యసంకల్పమయుడనగునాయందు శ్రద్ధతో తన మనస్సును నిలపటం సర్వమును పరమాత్మ సంకల్పంగా దర్శించటం- అభ్యసించువాడు క్రమంగా

సత్యసంకల్పికాగలడు. తాను ఏది సంకల్పిస్తే అది లోకంలో సత్యమై సిద్ధింపజేయగల సిద్ధిని పొందగలడు.

**18. అప్రతిహత ఆజ్ఞా సిద్ధి :** పరమాత్మనగు నాయొక్క సర్వ నియామకత్వము - సర్వవశీకరణత్వములతో కూడిన యోగీశ్వరత్వమును ఉపాసించు యోగి క్రమంగా సర్వమును తన నిర్ణయములకధీనంగా సిద్ధింపజేసుకోగలడు. జంతువులు – మనుష్యులు తన ఆజ్ఞానువర్తులై ఉండటం అనే ఆజ్ఞాసిద్ధిని పొందగలడు.

**19. త్రికాలజ్ఞత్వ సిద్ధి :** యోగాభ్యాసంచే నాయొక్క **జాగ్రత్–స్వప్న–సుషుప్త సాక్షియగు** స్వరూపమునందు ఎల్లప్పుడు తన మనస్సును నిలిపి ఉంచే యోగసాధకుడు నాపట్ల భక్తిని పెంపొందించుకోగలడు. తద్వారా నాయొక్క ప్రభావముచే శుద్ధుడు కాగలడు. అట్టి శుద్ధ బుద్ధిచే ఈ దేహము ముందు–దేహ సమయం–దేహానంతరం... ఏర్పడి ఉన్న స్థితి గతులను, అందు అంతర్లీనమై నిశ్చలమైయున్న అప్రమేయత్వమును ఎరుగగలడు. లౌకికమైన భూత–భవిష్యత్–వర్తమానములను, **జీవుల తత్త్వమును** కూడా ఎరుగగలడు.

**20. అప్రతిహత వజ్రదేహసిద్ధి :** పరమాత్మయొక్క **పాంచభౌతిక–అతీత్వమును** ఉపాసించు యోగి క్రమంగా భక్తి యోగ సంపన్నుడు – శాంతచిత్తుడు అవుతాడు! వజ్ర దేహసిద్ధిని కూడా పొందుచున్నాడు. అట్టివాని మనో సంకల్పిత భౌతికదేహమును అగ్ని కాల్చలేదు. నీరు తడుపజాలదు. అగ్నిలోని జీవులను అగ్నికాల్చదు కదా! నీటిలో నివశించే జీవుల శరీరములను నీరు హానికలిగింపలేదు కదా! అట్లాగే పరతత్త్వ స్వరూపుడనగు నాయందు భక్తి–ప్రపత్తులు నిలిపి ధ్యానం చేసే యోగి యొక్క శాంత చిత్తమును–భక్తి పారవస్యమును పంచభూతములుగాని, సంగతి–సందర్భములు గాని హాని కలిగించజాలవు. "పరమాత్మ అనే మహాసముద్రజాలంలో నేను ఒక తరంగమును".... అను రూపంగా ఉపాసించువాడు పంచభూతములచే హానికలుగని దేహమును పొందటానికి సమర్థుడౌచున్నాడు.

**21. అజేయ సిద్ధి :** ఏ యోగి అయితే నాయొక్క ధ్వజము–శంఖము–చక్రము–గద–పద్మము, మొదలైన విభూతులతోకూడిన నారాయణ–శ్రీకృష్ణ ఇత్యాది రూపమును ధ్యానం చేస్తూ వుంటాడో, నాయొక్క త్రిమూర్త్యాది అవతారములలో తనకు ఇష్టమైన రూపమును ఉపాసనాస్వరూపంగా భావించి ఆరాధిస్తూ వుంటాడో.... ఆతడు సర్వదా తదితరులచే అజేయత్వము అగు ఆనందస్థితిని ఆస్వాదిస్తూ వుంటాడు. ఆతని ఆనందస్థితిని ఛేదించేది ఏదీ వర్తమానంలోగానీ, జన్మ–జన్మాంతరాలలోగాని ఉండజాలదు.

ఓ ఉద్ధవా! ఇప్పుడు నీకు కొన్ని కొన్ని యోగ ధారణల స్థితిగతులేమిటో... అవి సిద్ధింప జేయగల సిద్ధులు ఏరీతిగా ఉంటాయో విశదీకరిస్తూ వచ్చానుకదా! ఒక్కమాటలో చెప్పాలంటే **ఎవ్వడైతే ఇంద్రియములను జయించి, వాటి వాటి విషయపరంపరలకు అతీతత్వము సముపార్జించి, ఇంద్రియ-మనో నిగ్రహము కలవాడై శ్వాసను-ప్రాణమును-చిత్తమును పరతత్త్వమవైపుగా నియమించి నాయొక్క పరతత్త్వ ధ్యానమును అభ్యసిస్తాడో** - అట్టి వానికి ఈ 14 లోకాలలో అసాధ్యమైనదేదీ ఉండదయ్యా!

❖ ❖ ❖

మనం ఇప్పుడు చెప్పుకున్న సిద్ధులు - వాటివాటి ప్రయోజనములు ఆత్మానందానుభవము యొక్క సమక్షంలో చిన్న చిన్న విశేషములే సుమా! ఎవ్వడైతే నాయందు భక్తితో నా స్వరూపనందమును సముపార్జించుకునే ప్రయత్నంలో ఉంటాడో.... అట్టివాడు ఆయా సిద్ధులన్నిటినీ "**ఇవన్నీ నా పరతత్త్వ చింతనకు, పరమేశ్వర విభూతియందు లయం పొందటానికి మధ్యేమార్గంలో కలిగే విఘ్నములేకదా!**" అను దృష్టితో చూస్తూ వుంటాడు.

పరతత్త్వ ధ్యానం అభ్యసించే వానికి ఇహలోకంలో ఔషధము-తపస్సు-మంత్రము మొదలైన వాటివలన కలిగే సిద్ధులు తమంతటతామే సమీపిస్తాయి. అయితే-"**భక్తి-ప్రత్తులచే లభించే నా పరతత్త్వ సారూప్యస్థితి సిద్ధులచే లభించేది కాదు**" అని గమనించు.

**శ్లో॥ సర్వాసామపి సిద్ధీనాం హేతుః పతిః అహం ప్రభుః**
**అహం యోగస్య సాంఖ్యస్య ధర్మస్య బ్రహ్మవాదినామ్ ॥** **(అధ్యా 15, శ్లో 35)**

- సర్వ యోగములకు, యోగసిద్ధులకు...

- సాంఖ్యుల - నిష్కామకర్ముల - బ్రహ్మవాదుల ఆశయములకు...,

**ఆశయసిద్ధి**ని నేనే సుమా! సర్వ జగత్ చమత్కారములకు అంతర్గతుడను, నేనే!

అవన్నీ ఉన్నది నాయందే!

సర్వధర్మములకు చరమస్థానం నేనే!

సర్వజీవులయొక్క ఆత్మ నేనే!

నాయందే సర్వజీవులు సర్వదా స్థానము పొందినవారై ఉన్నారు!

సర్వజీవుల బాహ్య-అభ్యంతరములలో-బాహ్యాభ్యంతరములుగా సర్వదా విరాజిల్లుచున్నది నేనే!

సర్వజీవులు నాయొక్క విభూతులే!

**అట్టి నాయొక్క స్వస్వరూప విభూతి యోగాన్ని ఆశ్రయించు యోగి నన్నే పొందుచున్నాడు!** ఇక ఆతనికి వేరే సిద్ధులతో పనిఏమున్నది? ప్రయోజనమేమున్నది? అవసరమేమున్నది?

## 22. భగవత్ విభూతులు - అనాసక్త యోగం

**శ్రీఉద్ధవుడు :** ఓ దేవదేవా! మీరు ఆద్యంతరహితులు! సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపులు! సర్వపదార్థములయొక్క సృష్టి-స్థితి-లయములకు కారణస్వరూపులు. సర్వమునకు ఆస్థానం మీరే! స్వామీ! వేదార్థములు తెలిసి ఆనందించే మహనీయులలోను, కర్మరహస్యం తెలిసి ఆచరించు ఉత్తమ కర్మయోగులలోను, దృశ్యతాదాత్మ్యముచే పారవస్యం పొంది ఉపాధి పరంపరలను పొందుచున్న అజ్ఞానులలోను సమానంగా వేంచేసి ప్రత్యక్షమై యున్నారు! **సర్వజీవుల అనుభవరూపమైన బాహ్య-అభ్యంతరములు మీయొక్క చమత్కారమే! మీరే!**

మహనీయులెందరో మిమ్ములను ఉపాసించి మీ పాదాలు చేరుచున్నారు. హే మహదాశయ సిద్ధి స్వరూపా! ఇప్పుడు మరొక వివరణకొరకై విన్నవించుకుంటాను.

యోగ-ఉపాసన మార్గంలో అడుగులు వేస్తూ వుండే ఆయా మహానుభావులు మీయొక్క ఏఏ విభూతులను సాధనగా స్వీకరించి మిమ్ము ఉపాసిస్తున్నారో, అట్టి మీ విభూతి విశేషములను ప్రవచించవలసినదిగా ప్రార్థన చేస్తున్నాను.

సర్వజీవులలో వేంచేసి ఉండి, సర్వజీవులకు రక్షకుడవగు ఓ పరంధామా! మీరు సర్వజీవులలో అంతర్యామిగా ఉన్నారు. అయితే ఏం? మేము సర్వతత్త్వ స్వరూపుడుగా ఆస్వాదించలేకపోతున్నాం! మీ మాయకు విమోహితులమై "వీరు అయినవాళ్ళు - వాళ్ళు కానివారు" ... అని భ్రమిస్తూ సంసారంలో చిక్కుకుంటున్నాం! ఈ రీతిగా సంసారంలో చిక్కుకున్న మాకు దివ్యౌషధం మీ విభూతులే కదా!

అచింత్యమైన యోగేశ్వరులగు ఓ ఆదిదేవా! ఇక్కడి స్వర్గ - మర్త్య - పాతాళాలలో మీ చమత్కారముగా అమర్చబడియున్న మీ విభూతులను నాకు సవివరంగా చెప్పండి! ఏఏ విభూతిని సాధనకొరకై ఆశ్రయించటంచేత మేము సర్వాత్మ స్వరూపమగు మీ పాదాలు చేరి క్షేమంగా ఉండగలమో... ఆయా విభూతులను గురించి విశదీకరించండి!

**శ్రీకృష్ణభగవానుడు :** ప్రశ్నించుటలో అత్యంత ప్రావీణ్యంగల ఓ మిత్రమా! ఉద్ధవా!

కౌరవ- పాండవ సంగ్రామ ప్రారంభంలో నీలాగానే అర్జునుడు నన్ను నాయొక్క త్రిలోక విభూతులను ఉపాసనకొరకై వివరించవలసినదిగా కోరటం జరిగింది. ఆ యుద్ధ ప్రారంభంలో, "అయ్యో! నాకు ఈ నా బంధువులను చంపుచున్నానే! బంధుజనులను చంపిన పాపం నన్ను చుట్టుకోబోతోందే!"... అనే ప్రాకృతిబుద్ధి, భౌతిక దేహ దృష్టి ఆతని బుద్ధిని ఆవరించటం జరిగింది! "నా బంధువులను చంపి నేను దుఃఖం పొందనున్నానే!" ... అని భావించి, నేను యుద్ధం చేయలేను! నిన్ను శరణు వేడుచున్నాను! ఇప్పుడు నేనేం చేయాలి? నా కర్తవ్యం ఏమిటి?... అని శరణాగతుడై ప్రశ్నించడం జరిగింది. అప్పుడు నేను యుక్తియుక్తంగా సాంఖ్యయోగం, భక్తియోగం, జ్ఞానయోగం, శరణాగతి యోగం, ఇత్యాది విశేషాలన్నీ నిర్వచనపూర్వకంగా చెప్పటం జరిగింది. ఆ సందర్భంలోనే - మూడులోకములలోని నా విభూతులగురించి చెప్పిన విశేషాలు నీ ప్రశ్నకు సమాధానంగా - కొంత వేరైన వివరణగా - చెప్పుచున్నాను. ఏ ఏ రీతులుగా నన్ను ఉపాసించటం సానుకూల్యమో విను!

----

- సర్వజీవుల ఆత్మస్వరూపుడను నేను!
- సర్వప్రాణులకు హితం చేస్తున్నవాడను!
- సర్వ ప్రాణుల బాహ్య-అభ్యంతరములు నాయొక్క విభూతి చమత్కారమే!
- సర్వజీవులు జనించింది నాయందే! ఉన్నది నాలోనే! లయిస్తున్నది నాయందే! ఈ సర్వమునకు సృష్టి-స్థితి-లయము నేనే!
- గతిశీలములైనవాటికన్నిటికీ గతిని నేనే! (I am the feature of movement in all moving objects),
- ఈ కనపబడే సర్వము కాలముచే జనించి - కాలముచే నశించేదేకదా! అట్టి ఉత్పతి వినాశనములకు కర్తయగు "కాలము" నా స్వరూపమే!
- కాలఃకాలుడను, కాల నియామకుడను!
- సర్వ జీవులలో నేనుగా ఉన్నది నేనే! నేను - నీవు - అది - ఇది - ఆతడు - ఇతడు ఇవన్నీ నేనే!
- గుణయుక్తములైన సర్వవస్తువులు పుష్పములుగా గమనిస్తే... ఆ గుణముల పుష్పమాలకు అంతర్యామిని. సూత్రాత్మను, పూలదండలోని దారమువంటివాడను!

- సూక్ష్మ పదార్థములలో సూక్ష్మాత్మను, మహత్ పదార్థములలోని మహదత్త్వము నేనే!
- దుర్జ్ఞయములుగా కనిపించే సర్వవిశేషములకు మనఃస్వరూపుడను నేనే! సర్వుల మనోరూపము నాయొక్క విభూతియే! నేనే సర్వులలోని మనోరూపుడను!
- తెలియబడేదంతా నాస్వరూపమే! తెలుసుకుంటున్నది కూడా నేనే! నేను వేద స్వరూపుడను. వేదాంత స్వరూపుడను! (I am that what all being known. I am the knower. I am the witness to the knower)
- శాస్త్రరూపములగు వేదములు నా స్వరూపమే! వేదములు అంతిమసారంగా గానం చేస్తున్నది నా తత్త్వమే! నన్నే! ఆ గానము – గానము చేస్తున్నది కూడా నేనే!
- వేదమంత్రములు ప్రతిపాదిస్తున్న ఓం కారస్వరూపము నేనే!

  అ ఉ మ { అ – self (ఆత్మ) ఉమ – ప్రకృతి (Self related) }
- అక్షరాలలో అ కారము నేనే!
- ఛందస్సులలో **భర్గో దేవస్య ధీమహి** అని అభ్యర్థనాగాన స్వరూపమగు త్రిపదాగాయత్రి నాస్వరూపమే!
- దేవతలలో ఇంద్రుడను.
- అష్టవసువులలో అగ్నిని!
- ఆదిత్యులలో విష్ణువును!
- ఏకాదశరుద్రులలో నీల లోహితుడను నేనే!
- రాజర్షులలో మనువును!
- దేవర్షులలో నారదుడను!
- ధేనువులలో కామధేనువును!
- సిద్ధేశ్వరులలో కపిలమునిని!
- పక్షులలో గరుడుడను!
- ప్రజాపతులలో దక్షప్రజాపతిని!
- పిత్రుగణంలో అర్యముడను!
- దైత్యులలో ప్రహ్లాదుడను.

– ఆకాశదీపికలలో, నక్షత్రాలలో ఔషధప్రదాతయగు చంద్రుడు నా విభూతియే!
– యక్ష – రాక్షసులలో కుబేరుడను!
– ఏనుగులలో ఐరావతము నా చిత్కళయే!
– జలదేవతాస్వరూపులలో జలచరముల ప్రభువగు వరుణుడను!
– తపింపజేస్తూ దీప్తితో వెలుగొందు వస్తువులలో సూర్య గోళమును!
– మానవులలో రాజు నా ప్రదర్శనమే! వ్యక్తీకరణమే!
– అశ్వములలో **ఉచ్ఛైశ్రవము (దేవతా లోకంలోని అశ్వము) నేనే!**
– ధాతువులలో **బంగారమును!**
– జీవుల దుష్టకర్మల శిక్షకులలో **యమధర్మరాజును!**
– సర్పములలో **వాసుకిని!**
– నాగులలో అనంత నామధేయ **ఆదిశేషుడను!**
– నాలుగు కాళ్ళ – కొమ్ములు కోఱలు మొ॥నవి గల జంతువులలో **సింహమును!**
– ఆశ్రమములలో తుర్యము అనబడే **సన్యాసాశ్రమమును!**
– వర్ణములలో బ్రాహ్మణ **వర్ణమును!**
– తీర్థము – నదులలో **గంగను!**
– జలాశయములలో **సముద్రమును!**
– ఆయుధములలో **ధనుస్సును!**
– ధనుర్ధాదులలో త్రిపురసంహారియగు **ఆదిశంకరుడను** నేను!
– స్థానములలో **మేరు పర్వతమును!**
– పర్వతములలో **హిమాలయ పర్వతమును!**
– వృక్షములలో **రావివృక్షమును!**
– ఓషధములలో **ధాన్యమును!**
– పురోహితులలో **వసిష్ఠ మహర్షిని!**
– బ్రహ్మజ్ఞానులలో **బృహస్పతిని!**
– సేనాపతులలో **కార్తికేయుడను!**
– అగ్రగణ్యులలో భగవంతుడగు **బ్రహ్మదేవుడను!** సృష్టిభావ కవిని!

- యజ్ఞములలో "సర్వము బ్రహ్మమే" అను సాధనా ద్రవ్యముతో కూడిన **బ్రహ్మయజ్ఞమును!**
- వ్రతములలో **అహింసావ్రతమును!**
- పరిశుద్ధము చేయు సాధనములలో **వాయువు – అగ్ని – జలము – వాక్కు** నేనే!
- అష్టాంగయోగములలో **ఆత్మ సంయమయోగమును!**
- మంత్రద్రష్టలలోని **మంత్ర మననము** నేనే!
- కౌశలములలో "దృశ్యమును ఆత్మగా దర్శించు **అన్వీక్షికీ కౌశలము**" ను!
- ఖ్యాతి వేదులలో **వికల్పస్వరూపము** నేనే!

  (ఖ్యాతి – ఆత్మ జగత్తుగా కనిపించటం అనే చమత్కారము ఎరిగినవారు)
- స్త్రీలలో శతరూపను. పురుషులలో **స్వాయంభువన మనువును!**
- మునులలో **నారాయణుడను!**
- బ్రహ్మచారులలో **సనత్కుమారుడను!**
- ధర్మములలో ఇంద్రియ – మనో – బుద్ధి – చిత్త– జీవ – సాక్షి ధర్మమును విశదీకరించు **కర్మసన్యాస యోగమును!** అభయప్రదాన **ధర్మస్వరూపుడను** నేనే!
- క్షేమములలో అంతరంగ సంస్థాపనా క్షేమమును! అంతర హృదయములో ప్రత్యక్షమై యుండే **ఆత్మానుభవమును! అబహిరనుభవమును!** (I am the inner devine sense).
- రహస్యములలో పరమసత్యమును నేనే! సూనృతం అహమేవ! ప్రియవచన స్వరూపుడను. (I am the sweet and enjoyable words and verses)
- రూపములలో **మౌనరూపమును!**
- మిధునములలో **ప్రజాపతిని! అజుడను!**
- మార్పు–చేర్పులకు అతీతమైన – అప్రమత్త పదార్ధములలో **సంవత్సరము** అనునది నేనే!
- ఋతువులలో **వసంత ఋతువును.**
- మాసములలో **మార్గశీర్షమును**
- నక్షత్రములలో **అభిజిత్ నక్షత్రమును!**
- యుగములలో **కృతయుగమును!**

- ధీరులలో దేవలుడను, **అసితుడను!**
- వేదవిభాగులలో **ద్వైపాయనుడను.** (వ్యాసమహర్షిని)
- కవులలో **కావ్య స్వరూపుడను!**
- పండితులలో, వివేకవంతులలో **శుక్రాచార్యుడను!**
- భగవత్ ప్రదర్శనములలో **వాసుదేవుడను!**
- భాగవత శ్రేష్ఠులలో **ఉద్ధవుడను!** (నీవే నేను)!
- కింపురుషులలో **హనుమంతుడను!**
- విద్యాధరులలో **సుదర్శనుడను నేనే!**
- రత్నములలో **పద్మరాగమును.**
- సౌందర్యముతో కూడిన పదార్థములలో **పద్మకోశమును!**
- దర్భజాతులలో **కుశమును!**
- హవ్యములలో **ఆవునెయ్యిని!**
- పరిశ్రమించు వారిలో శ్రమశక్తి స్వరూపిణియగు **లక్ష్మిని నేనే!**
- కపట విశేషములలో **ద్యూతమును!**
- కష్టములు అనుభవించువారిలో **సహనమును, తితీక్షను నేనే!**
- సాత్వికులలోని **సత్త్వగుణమును.**
- బలవంతులలోని **ఉత్సాహం, పరాక్రమం, సాహసం నేనే!**
- సాత్వికులలోని **సాత్విక ప్రదర్శనం** నేనే!
- నవ విధ సాత్వతమూర్తులలో ఆదిమూర్తియగు **వాసుదేవుడను** నేనే.
  (నవమూర్తులు – వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, నారాయణుడు, హయగ్రీవుడు, వరాహుడు, నృశింహుడు, బ్రహ్మ)
- గంధ్వరులలో వి**శ్వావసుడను!**
- అప్సరసలలో **పూర్వచిత్తిని!**
- భూతత్వంలో **స్థైర్యమును.**
- పృధివిలోని **గంధతన్మాత్రను!**

- జలములో **రుచి - దాహక స్వాంతనము - జీవపోషకము** నేనే!
- తేజోమయ వస్తువులలో **సూర్యగోళమును!**
- సూర్యచంద్ర - నక్షత్రములలో **తేజస్సు - ప్రభ** నేనే!
- ఆకాశంలోని **శబ్దతత్వము** నేనే!
- బ్రాహ్మణ భక్తులలో విరోచనపుత్రుడగు **వైరోచనుడను** (బలిచక్రవర్తిని).
- వీరాధివీరులలో అర్జునుడను.
- ప్రతిప్రాణియొక్క **ఉత్పత్తి - ఉనికి - వినాశనము** నా యొక్క చమత్కారమే!
- పాదాలలో దాగి ఉండి ప్రదర్శితమగుచున్న **గమనశక్తి** నేనే!
- నోటియొక్క **మాట్లాడేశక్తి**, విసర్జనేంద్రియములలో **విసర్జనశక్తి**, చేతులలోని **గ్రహణశక్తి**, జననేంద్రియములోని **ఆనందభోగ శక్తి**, చర్మముయొక్క **స్పర్శశక్తి**, కళ్ళలోని **చూపుశక్తి**, ముక్కుయొక్క **ఆఘ్రాణశక్తి** నేనే! నా విన్యాసమే! అస్మత్ కళా సంప్రదర్శనమే!
- పంచభూతములగు పృథివి - వాయువు - ఆకాశము - జలము - అగ్నిగా కనిపించే **పంచభూతములు** నేనే! పంచ మహాభూతములు నా ప్రదర్శనమే!
- **అహంకారము, మహత్తత్త్వము, ప్రకృతి, పురుషుడు, సత్త్వరజస్తమోగుణములు, మనోబుద్ధి చిత్తాలు, సర్వపదార్థాల పరిగణము, జ్ఞానము, వాటి ఫలస్వరూపమైన తత్త్వనిర్ణయమును, పరబ్రహ్మము** కూడా నేనే!
- ఈ సర్వ నామరూపములుగా విస్తరించి యుండి, సర్వజీవుల అంతర్బహి స్వరూపంగా సర్వజీవులకు అనుభవమగుచున్నట్టి **ఈశ్వరుడను - సర్వేశ్వరుడను** కూడా నేనే! **సర్వాంతర్యామిని, సర్వప్రదర్శన విన్యాసమును** నేనేనయ్యా!
- నేనే **జీవుడను! నేనే గుణములు! నేనే గుణిని! క్షేత్రజ్ఞుడను - సర్వాత్మకుడను** కూడా నేనే! నేను కానిదంటూ మరెక్కడా ఏదీ లేనే లేదు!
- **సంఖ్యాస్వరూపుడను, అసంఖ్యా స్వరూపుడను - పరమాణు స్వరూపుడను - కాల-క్రియా తత్త్వమును** నేనే!
- అయినప్పటికీ అసంఖ్యములగు బ్రహ్మాండములను సృష్టించు నా విభూతులను నేనే లెక్కించి చెప్పజాలను!

- సర్వవస్తువులలోని - జీవులలోని తేజస్సు - శ్రీ - కీర్తి - పరాక్రమము - ఓర్పు - నేర్పు - విజ్ఞానము... మొదలైనవన్నీ నా అంశలే!

  నీవు - నీ సందర్శనము-ఉభయము నేనే సుమా!

❖❖❖

ఓ ఉద్ధవా! నాయొక్క విభూతులను ఈవిధంగా సంక్షిప్తంగా వర్ణించి చెప్పాను!

**అయితే ఒక్క విషయం గుర్తుంచుకో!**

**ఈ దృశ్యములో కనిపించే అజ్ఞాన-సాంసారిక సంగతులు - సందర్భములు - సంఘటనలు మొదలైనవన్నీ పరమార్థవస్తువులు కావు!** అవన్నీ మనస్సుయొక్క వికార చమత్కారములే! వాక్కుకు మాత్రమే విషయములు - కల్పితములు సుమా! ఆకాశంలో సరస్సువలె ఊహా చమత్కారములు! కాబట్టి ఈ దృశ్యపదార్థములపట్ల అభినివేశము కలిగి ఉండటం అనుచితం!

నాటకంలో నటించేవాడు తన పాత్రయొక్క సుఖ - దుఃఖాలు, ప్రేమ-ద్వేషాలు తనవేనని అనుకోడుగా! తనవిగా ప్రేక్షకులకు భ్రమింపజేయటం మాత్రమేచేస్తాడు కదా!

**జగత్తులో సందర్భానుచితంగా (సందర్భములను అనుసరించి) వుంటూనే సందర్భములకు అతీతుడవై వుండటం అభ్యసించు.**

---

అందుచేత ఓ ఉద్ధవా! నీవు మొట్టమొదటే వాక్కును - మనస్సును - ప్రాణములను - ఇంద్రియములను సంయమనం చేసే ప్రయత్నంలో ఉండు! అనగా, ఆమూడింటిని శాస్త్రములు, పెద్దలు సూచిస్తున్న సాధనా విధానములందు నియమించి బుద్ధిని సత్త్వ సంపన్నం చేసి తద్వారా **బుద్ధి సంయమనం** సముపార్జించు. **సర్వము నాస్వరూపంగా సందర్శించు.** అప్పుడిక సంసారమార్గంలో పడవలసిన అవసరం నీకుండదు! నీవు పడవు!

సాత్వికమై - సంయమనముతో కూడిన బుద్ధితో వాక్-మనస్సులను పరిశుద్ధ పరచుకుంటూ సర్వమునకు కేవలసాక్షిత్వము అవధరించి ఉచితానుచితానుసారంగా కర్మ-ధర్మములను నిర్వర్తించుచూ ఉండటం అలవరచుకో! క్రమంగా వ్రతములు -

తపస్సు మొదలైన సాధనలన్నీ–భక్తిని ప్రవృద్ధపరుస్తూ – ఎప్పుడో పచ్చికుండలో పోసి ఉంచిన నీరువలె తమంతట తామే ఇగిరిపోగలవు!

సర్వకాల – సర్వావస్థలలో పరాప్రేమతో కూడినవాడవై – నాకు భక్తుడవైవుండు. భక్తియోగంచే బుద్ధి–వాక్కు–మనస్సు సంయమింపజేయటం సులభమే! సాధ్యమే! అందుచేత **నిరుత్సాహం వదలిపెట్టు.**

సంయమముచే (చంచలత్వాన్ని అధిగమిస్తూ వుండగా) కృతకృత్యుడవు కాగలవు! నీ త్రోవలో – మార్గములో సర్వ సందర్భములలో తోడుగా నేను సర్వదా ఉండియే ఉన్నాను! ఉండియే ఉంటాను! ఉండి తీరుతాను. కాస్త యోచన–శ్రద్ధలతో–సాధనలకు ఉపక్రమించు. భక్తి–యోగ–సాధన మార్గములలో తోడుగా వుండటమే ఈ నా అవతారము యొక్క ముఖ్యోద్దేశ్యం.

## 23. మార్గములు : స్వకర్మ – ధర్మము – జ్ఞానము

**శ్రీ ఉద్ధవుడు :** స్వామీ! శ్రీకృష్ణా! సర్వాంతర్యామివి, సర్వప్రదర్శన స్వరూపడవు అగు నీపట్ల ఏకాగ్రమైన ధ్యాస–ధ్యానం నిర్వర్తించటం గురించి చెప్పుతూ వస్తున్నారు! ఏకాగ్రత లభించాలంటే భక్తిని పెంపొందించుకోవాలని మీ వాక్యానుసారం గ్రహించాను! వర్ణాశ్ర ధర్మములు పాటించేవారికి – పాటించనివారికి కూడా భక్తి శ్రేయోమార్గమైయున్నదని మీ మాటలననుసరించి గ్రహించాను!

భక్తిచే నీపట్ల ధ్యాస లభిస్తుంది. అయితే, భక్తి ప్రవృద్ధం కావాలంటే ధర్మాచరణ (లేక) కర్మాచరణ ఉపాయం కదా!

ధర్మాచరణ పూర్వకమై కర్మచేత భక్తి – భక్తిచేత దృఢమైన భగవత్ ధ్యాస – అట్టి భాగవత ధ్యాసచే పరమాత్మ లభిస్తాయని నేను మీ ప్రవచనం ద్వారా గమనిస్తూ వస్తున్నాను.

ఇప్పుడు కర్మవిషయకమైన ధర్మాచరణ ఎట్లా వివరించబడిందో, నిర్దేశించబడిందో... మీనుంచి వినాలని ఉన్నది. ఓ మాధవా! ఒకప్పుడు మీరు హంసరూపంలో బ్రహ్మదేవుని ముందు ప్రత్యక్షమై జీవుల శ్రేయస్సు కోరి వర్ణాశ్రమాలు – ఆశ్రమ ధర్మాలు – సర్వమానవ ధర్మాలు.... వివరించి చెప్పటం జరిగిందని నేను పెద్దల ద్వారా విని ఉన్నాను. పరమధర్మము గురించి కూడా చెప్పడం జరిగిందట! మీరు చెప్పిన ఆశ్రమధర్మాలు – కర్మను అనుష్ఠాన పూర్వకంగా నిర్వర్తించటం మొదలైన విశేషాలు చాలాకాలం గడచుటచే

జనులు ఏమరచి కర్మలకు బద్ధులగుచున్నారని, ఆ కారణంగా ఈభూలోకం నష్టప్రాయమైనదని అనుకోగా కూడా వింటూ ఉంటాము. పునరుద్ధరించటమే మీ అవతరాముయొక్క ముఖ్యోద్దేశ్యమని వసుదేవుడు -మొదలైన పెద్దలు చెప్పగా విన్నాను.

ఓ అచ్యుతా! కర్మ-ధర్మము అను శబ్దములకు గల సశాస్త్రీయమైన నిగూడార్థం వివరించగలిగినవారు మీతో సమానమైనవారు ఎవ్వరు? ఎవ్వరూ లేరు!

మీరు ధర్మస్వరూపులు! ధర్మమునకు ప్రవర్తకులు! ధర్మరక్షకులు! ధర్మనిర్దేశకులు! మీరు అవతారం చాలించిన తరువాత మాకు ధర్మవిశేషాలు ఎవరు బోధించగలరు చెప్పండి! అందుచేత ఓ సర్వధర్మజ్ఞా! ఈ సందర్భంలో మాకు ధర్మాలు – ధర్మ రక్షణ – ధర్మనిరతి – మీ పాదలకు త్రోవతీయగల భక్తి యోగం మొదలైనవాటిగురించి మరొక్కసారి ఇప్పుడు వివరించండి!

**శ్రీ శుక మహర్షి :** ఓ పరీక్షన్మహారాజా! ఆవిధంగా ధర్మవిషయం గురించి ఉద్ధవుడు ప్రశ్నించగా,... సర్వ జీవులను మోహింపజేసే చిరునవ్వు చిందిస్తూ,.... శ్రీకృష్ణభగవానుడు ఇట్లా సమాధానం ప్రసాదించ సాగారు.

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ మిత్రమా! ధర్మవిశేషము గురించి నీవు అడిగిన ప్రశ్న సముచితము. మానవుడు స్వధర్మగురించి, వర్ణాశ్రమ ధర్మాల ప్రాముఖ్యత గురించి, ధర్మనిరతిని ఏమరచటంచేత వచ్చే దుష్ప్రయోజనముల గురించి చక్కగా వివరణ పూర్వకంగా ఎరిగి ఉండటం అత్యంతావస్యకం! ధర్మనిరతిచేత భక్తి సుదృఢమౌతుంది సుమా!

**కృతయుగం :**మొట్టమొదటిదైన కృతయుగారంభంలో "హంస" అను (సర్వము పరతత్త్వమే... అను శబ్దార్ధంతోకూడిన) వర్ణము ఒక్కటే ఉండేది! అప్పుడు అట్టి సమయంలో జనులు జన్మతః అనన్యభక్తి పారాయణులై వుండేవారు! జగత్తును ఈశ్వరభావంతో ఉపాసిస్తూ – అనన్యభక్తిచే సాధకులు అతిత్వరగా కృతకృత్యులయ్యేవారు. హంసయోగపారాయణం లోకప్రసిద్ధమై ఉండేది.

**హంసయోగం – సోऽహమ్ –** **ఈ చరాచర సృష్టి ఆత్మయొక్క ప్రతిబింబ రూపమే!ఇహ స్వరూపానుభవమంతా స్వస్వరూపాత్మయొక్క క్రీడావినోద – లీలా చమత్కారమే... అనే దృష్టి ఎఱుక-జ్ఞప్తి**

జనులు హంసయోగంచే కృతకృత్యులయ్యేవారు కాబట్టి "కృతయుగము" అని కాలశాస్త్ర వేదులచే పేరుపెట్టబడింది! కృతయుగంలో వేదము ప్రణవాత్మకంగా అనుభవమయ్యేది.

అనగా....,

తెలియబడేదంతా (వేదము).... **ఆత్మోపమ్యేవ సర్వత్రా - ఆత్మైవమిదగ్ంసర్వమ్** ... అను అనుభూతిగా ఆస్వాదించబడేది.

అట్టి కృతయుగంలో ధర్మస్వరూపుడనైన నేను నాలుగు పాదములతో ఆనందంగా గోవునై సృష్టియందు సంచారాలు చేస్తూ వుండేవాడను!

నా ధర్మధేను స్వరూపం యొక్క నాలుగు పాదములు....,

1. సత్యము
2. దయ
3. శౌచము
4. తపస్సు

ఈ నాలుగు పాదములతో జీవులకు ముక్తిని ప్రసాదిస్తూ వుండేవాడను! తపోనిష్ఠులై మహనీయులు ఈ జగత్తును నాయొక్క విశుద్ధ హంసరూపముగా ధ్యానిస్తూ ఉండేవారు.

**తరువాత త్రేతాయుగం!**

త్రేతాయుగంలో నా ప్రాణశక్తి – హృదయములనుండి ఋక్‌వేదం (మంత్రం), యజుర్వేదం (తంత్రం) సామవేదం (గానం) అనే 3 వేదములు ఆవిర్భవించటం జరిగింది. అదే త్రయీవిద్య అట్టి త్రయీవిద్యగా ....

**ఋక్** నుండి ------ హౌత్ర (మంత్రములు, మంత్రపూర్వక దేవతాహ్వానములు)

**యజుర్** నుండి ------ అధ్వర్యవ (యజ్ఞవిధానాలు)

**సామ** నుండి ------ ఔద్గాత్రము (గానము / స్తోత్రములు)

అను మూడు విధములైన యజ్ఞరూపములను నేను ధరించటం జరుగుతోంది. ప్రతి యజ్ఞములోను, కార్యక్రమములోను ఈ మూడు ఉంటూనే ఉంటాయి.

నాయొక్క విరాట్ రూపధారణ నుండి స్వధర్మము అనే ఒకానొక ధర్మతత్త్వము సృష్టి చమత్కారము కొరకై బయల్వెడలింది! అట్టి స్వధర్మ లక్షణయుక్తములకై సృష్టియొక్క

లీలా వినోదము కొరకై చతుర్విధ (4 రకములైన) స్వధర్మ నిరతులు బయల్వెడటం జరిగింది!

నా విరాట్ పురుష - ధర్మదేవతా చమత్కారము యొక్క....

ముఖమునుండి ...... విప్రజన స్వధర్ములు (శాస్త్ర పారంగతులు-శాస్త్రార్ధ నిరతులు)

బాహువుల నుండి ....... క్షత్రియజన స్వధర్ములు (శౌర్య - ధైర్య - పరాక్రమ నిరతులు)

ఊరువులు (తొడలనుండి) ....వైశ్యజన స్వధర్ములు (కృషి-గో రక్షణ నిరతులు)

పాదముల నుండి .... శూద్ర స్వధర్మ నిరతులు (సేవానిరతి గల స్వధర్మ నిరతులు)

బయల్వెడలుచున్నారు. నాలుగువిధములైన స్వధర్మోపాసనలు చాతుర్వర్ణ్యములుగా గణుతికెక్కాయి.

ఈ నలుగురు స్వధర్మనిరతులు. సృష్టికి నాలు స్థంభాలవంటివారు!

ఆపై...,

నా విరాట్ రూపం నుండి 4 ఆశ్రమాలు బయల్వెడలాయి.

మోకాళ్ళ (జఘన) ప్రదేశం నుండి ....... చాతుర్వర్ణ్య ప్రియులకు గృహస్థాశ్రమం

హృదయం నుండి ........ బ్రహ్మతత్త్వోపాసకులగు నైష్ఠిక బ్రహ్మచర్యాశ్రమం

వక్షస్థలం నుండి .... వనవాసప్రియులగు వానప్రస్థాశ్రమం

నుదురు (మస్తకము) నుండి ..... సన్యాసాశ్రమం

వివిధములైన గుణసంపన్నులగు ముముక్షువులగు సాధక జనుల సానుకూల్యత కొరకై పైన చెప్పిన నాలుగు ఆశ్రమములు సంకల్పించబడ్డాయి.

ఈ నాలుగు ఆశ్రమాలలో కూడా ఆయా మానవుల స్వభావమును అనుసరించి ఉత్తములు - మధ్యములు - అధములు అగువారు (నాలుగు ఆశ్రమాలలో) వుంటూ వుండటం జరుగుతోంది. (బాగా చదువుపట్ల శ్రద్ధగలవారు - ఒక మాదిరైన శ్రద్ధగలవారు - శ్రద్ధ ఇంకా ఏర్పడనివారు ఉన్నట్లే అదికూడా!) అదంతా కూడా నానుండి బయల్వెడలినట్టి ప్రకృతియొక్క దివ్య ప్రదర్శనా చమత్కారమే! జగన్నాటక కథారచనా కళా విన్యాసమే!

**1. బ్రాహ్మణ స్వధర్మల స్వాభావిక లక్షణాలు :**

| | | |
|---|---|---|
| శమము | – | (మనోనిగ్రహం) |
| దమము | – | (ఇంద్రియ నిగ్రహం) |
| తపస్సు | – | భగవత్ విశేషముల పట్ల – సాధనలపట్ల తపనతో కూడిన యత్నము చేయు స్వభావము |
| శౌచము | – | శుచి అయిన భావాలు – అంతా భగవత్ ప్రసాదము – భగవత్ సంకల్పము అను అభిప్రాయముతో కూడిన భావన |
| సంతోషము | – | పొందుచున్న దానిని గమనిస్తూ సంతోషము – తృప్తితో కూడిన అవగాహన పెంపొందించుకోవటం |
| క్షాంతి | – | "కష్ట సుఖములు సాధనలో విభాగాలు"... అను ఉత్తమ అవగాహనతో (బ్రాహ్మీ) దృష్టిని పెంపొందించుకొంటూ ఓర్పు వహించి ఉండటం! |
| ఆర్జవమ్ | – | మనస్సు – వాక్కు – కాయము వివిధంగా కాకుండా ఏకత్వం కలిగినవై ఉంచుకోవటం. వంకర – టింకర దృష్టులను దరిజేరకుండా చూచుకొంటూ ఉండటం. త్రికరణశుద్ధిని అభ్యసిస్తూ వుండటం. |
| భక్తి | – | పరాప్రేమను పెంపొందించుకుంటూ వుండటం. |
| దయ | – | తాను ఇష్ట దైవం నుండి ఏ **దయ** కోరుకుంటాడో అట్టి **దయ** సహజీవులపట్ల కలిగి ఉండటం<br>ఇతరుల కష్టములు తనవైనట్లుగా భావించి తాను చేయగలిగినదేదో .... అది యోచనచేస్తూ వుండటం! సత్ప్రయత్నశీలుడవటం! |
| సత్యం | – | సర్వ జీవులలోని నిత్యమైన సత్యమును ఆశ్రయిస్తూ – సందర్శిస్తూ అవలంబిస్తూ – ఆరాధిస్తూ ఉండటం |

బ్రాహ్మణ వర్ణ ధర్మములు బ్రాహ్మణ స్వధర్మ నిరతులకు స్వభావసిద్ధంగా సాధనములు అగుచున్నాయి. అవి పెంపొందింపబడుచూ వారిచే అభ్యసించబడుతూ ఉంటాయి!

**2. క్షత్రియ స్వధర్మల స్వాభావిక లక్షణాలు :**

తేజస్సు – విషయములను సత్యదృష్టితో – పవిత్రదృష్టితో ఆకళింపు చేసుకొనే వివేకకాంతి పుంజములతో వెలుగొందుతూ వుండటం! తేజస్సుతో విరాజిల్లుతూ ఉంటారు.

బలము – దేహ–మనో–బుద్ధి బల సంపన్నతను పెంపొందించుకుంటూ ఉంటారు!

ధృతిః – ధైర్య – స్థైర్య సంపన్నులై వుంటారు.

శౌర్యం – శౌర్యము కలవారై సమస్యలను సమర్థతతో ఎదుర్కొనే ఉత్సాహము–సాహసము వృద్ధి చేసుకుంటూ వుంటారు.

తితిక్ష – సహనము, ఓర్పు అలవరచుకొంటున్న వారై వుంటారు.

ఔదార్యము – తదితరులపట్ల త్యాగనిరతి కలవారై వుంటారు! ఉదారులై వుంటారు! "నేను తదితరుల సుఖ – శాంతి – సంతోషముల కొరకై ఏమి చేయగలనా?" –అనియోచన చేస్తూ వుంటారు.

ఉద్యమః – ఏదైనా కార్యక్రమం ప్రారంభించటానికి, నిర్వహించటానికి, నిర్వర్తించటానికి ఉత్సాహముతో సంసిద్ధులై వుంటారు. సదా ఉద్యమించే శక్తి సంపన్నులై ఉంటారు!

బ్రహ్మణ్యం – బ్రహ్మజ్ఞానులను సేవించి తద్వారా లోకహితైషిత్వము కలిగియున్నవారై ఉంటారు!

**3. వైశ్య స్వధర్మల స్వాభావిక లక్షణాలు :**

ఆస్తిక్యము – పరమాత్మయొక్క సర్వతత్త్వస్వరూపము పట్ల బుద్ధి – చిత్తములను పెంపొందించుకుంటూ వుంటారు.

దానము – దాన – ధర్మములు నిర్వర్తించే శ్రద్ధ – అభ్యాసము పెంపొందించుకుంటూ వుంటారు.

నిష్ఠ – శాస్త్రములచే చెప్పబడే కార్యక్రమములపట్ల "నిర్వర్తించాలి" అనే నియమము – నిష్ఠ కలిగియున్నవారై ఉంటారు.

అదంభము - గర్వము - దర్పము - దంభములను త్యజిస్తూ అణకువ-ప్రతిపత్తి శరణాగతితో కూడిన భావములు కలవారై ఉంటారు.

బ్రహ్మసేవనం - బ్రహ్మజ్ఞులు - వేదజ్ఞులపట్ల సేవాభావం కలిగినవారై ఉంటారు.

అతుష్టిరర్థో ఉపచయేత్ - సంపదలను పెంపొందించే ఉత్సాహముతోకూడి ఉంటారు.

**4. శూద్ర స్వధర్మ స్వభావులు**

శుశ్రూషణం అమాయయా - దేవ - గురు - బ్రాహ్మణులు మొదలైనవారిపట్ల నిస్వార్థ - నిష్కపట సేవానిరతి కలిగి ఉంటారు.

తత్ర-లబ్దే సంతోషః - సేవించి, తద్వారా లభించిన దానితో సంతృప్తులై జీవిస్తూ ఉంటారు.

## అంత్యజ స్వధర్మ స్వభావులు (Negative Features)

ఓ ఉద్ధవా! వీరు బ్రాహ్మణ - క్షత్రియ-వైశ్య - శూద్ర స్వధర్మ నిరతిని ఏమరిచినవారు సుమా!

**శ్లో॥ అశౌచమ్ అనృతం స్తేయం నాస్తిక్యం శుష్క విగ్రహః**
**కామ క్రోధశ్చ తర్షశ్చ స్వభావోఅన్తేవ సాయినామ్ (అధ్యా 17, శ్లో 20)**

అశౌచము - దోషములను ఆపాదించి - అశుభమైన భావములతో జగద్దర్శనం చేస్తూ ఉంటారు.

అనృతము - అసత్యమును సత్యమైనవాటి వలె ఆశ్రయించి రోజులు గడుపుతారు!

స్తేయం - ఇతరుల సంపదలను దొంగిలించాలని, పొందాలని ఆవేశము పెంపొందించుకొంటూ ఉంటారు. దొంగిలిస్తే తప్పేమున్నది? దొంగలెంతమంది లేరు?... ఇటువంటి దుష్ట వివేకము పెంపొందించుకొని వుంటాడు.

నాస్తిక్యం - సమస్తము ప్రసాదిస్తూ - పరిరక్షిస్తున్న పరమాత్మయొక్క ఉనికినే ప్రశ్నిస్తూ ఉంటారు.

| | | |
|---|---|---|
| శుష్కవిగ్రహులు | - | వృథాగా సరిఅయిన కారణంలేకయే కలహము - శతృత్వము ప్రదర్శించువారు |
| కామము | - | "ఇంకా ఇంకా ఏదో కావాలి! ఇంకేదో పొందాలి!"... అనే తపనతో కాలం గడుపుతూ వుంటారు. అసంతృప్తితో అనుక్షణం అలమటిస్తూ ఉంటారు. |
| క్రోధము | - | ఇతరుల తప్పులను మననము చేస్తూ.... ఇతరులపై కోపము - క్రోధము వదలనివారై ఉంటారు! |
| తర్షము | - | ఇంద్రియ విషయములపట్ల సదా మననము - తపన పెంపొందించుకుంటూ ఉంటారు. |

ఇవి లక్షణములుగా గలవారు మానవులలో కింద తరగతివారు. అధములుగా చెప్పబడువారు.. మానవ జన్మను వారు సద్వినియోగ పరచుకోకపోగా దుర్వినియోగ పరచుకుంటున్నారు.

**చాతుర్వర్ణ్యములు అనుసరణీయమైన ధర్మములు.**

పంచమ స్వభావము త్యజించవలసిన మార్గం.

---

మిత్రమా! ఇప్పుడు సర్వమానవులకు అనుసరణీయము - సుసాధ్యము - ఆవస్యకము అయిన సమానధర్మాలు కొన్ని ఇక్కడ ఉదహరిస్తున్నాను విను. ఇది 4 రకాల (common features) స్వధర్ములు తప్పక ఆచరించాలి.

| | | |
|---|---|---|
| అహింస | - | ఇతరులను శారీరకంగాగాని, మానసికంగా గానీ బాధించక పోవటం |
| సత్యము | - | సత్యమును-ఆశయంగా కలిగివుండటం, దర్శించటం, ఆశ్రయించటం, పలకటం "యమ్ సత్ - ఏదైతే పరమసత్యమో" అను అన్వేషణ కలిగి ఉండటం |
| అస్తేయం | - | ఇతరుల సంపదలను దొంగిలించాలనే చోరబుద్ధి లేకుండటం. |

| | | |
|---|---|---|
| అక్రోధం | - | ఎవ్వరిపట్లా కూడా క్రోధము, తత్సంబంధమైన ఆవేశము త్యజించటం రహితం చేసుకోవటం |
| అలోభం | - | నాది నాకే వుండాలి! మరెవ్వరితోనూ పంచుకోను.... అనే లోభబుద్ధిని త్యజించి ఉండటం! |
| భూతప్రీతి | - | సహజీవులకు ప్రీతి - సంతోషము కలుగజేయు ఉద్దేశ్యములు కలిగి ఉండటం! |
| భూతహితము | - | ఇతరుల హితము - శ్రేయస్సు కోరుకోవటం. అందుకు ప్రయత్నించటం. సహజీవులగు జంతువులను-పక్షులను-వృక్షములనుఆహార-పానీయములతో సంతోషింపజేయటం! |

ఇవి మానవ ధర్మాలు! సర్వులు, సర్వవర్ణులు పాటించవలసిన ధర్మాలు.

----

## 24. ఆశ్రమ ధర్మాలు

ఓ ఉద్ధవా! మానవుడు దేనిని ఆశ్రయించి అభ్యాసం కొనసాగించాలో... అట్టి సాధనాక్రమములను ఉదహరిస్తూ శాస్త్రకారులు చతుర్విధమైన ఆశ్రమములు - ఆశ్రమ ధర్మములు ప్రవచిస్తున్నారు!

అట్టి ఆశ్రమ ధర్మాల గురించి కూడా ఇక్కడ ఉదహరిస్తున్నాను. విను!

1. బ్రహ్మచర్యాశ్రమం
2. గృహస్థాశ్రమం
3. వానప్రస్థాశ్రమం
4. సన్యాసాశ్రమం

### 1. బ్రహ్మచర్యాశ్రమం

దేహభావం ఆశ్రయించటంచేత జన్మ వస్తోంది. దేహంతో సంబంధం ప్రారంభమౌతోంది. అటు తరువాత శాస్త్ర ప్రతిపాదితమైన ఉపనయనము అను ప్రక్రియచే ద్విజత్వము ప్రారంభమౌతోంది. పరమాత్మ తత్త్వము యొక్క సామీప్యము - సందర్శనారంభమే ఉపనయన శబ్దార్థం!

ఉపనయన ప్రక్రియచే ఈ జీవుడు విద్యకు అర్హుడై విద్యార్థి అవుతాడు. అట్టి ద్విజత్వ నియమముచే ఆతడు గురుకులం జేరి బ్రహ్మవిద్యను అభ్యసించటానికి గురువును ఆశ్రయించాలి. ఇంద్రియ ధ్యాసలను ప్రక్కకుపెట్టి వేదాధ్యయనమునకు ఉపక్రమించాలి.

అట్టివాడు వస్త్రధారణ – అలంకారముల విషయములలో కూడా కొన్ని విధి – విధానములను నియమములను శాస్త్రములు నిర్వచిస్తున్నాయి. అట్టి బ్రహ్మచారి జడధారిఅయి, చేతిలో దండము – అక్షమాలను ధరించి, యజ్ఞోపవీతధారణ చేసి, దర్భలను చేబూనినవాడై వుండాలి! దంభము – దర్పము – అభిమానము ప్రదర్శించే వస్త్రధారణ – ముఖాలంకారం – దంతాలంకారం – పీఠాసనం ... ఇటువంటి కృత్రిమమైన విషయాలకు దూరంగా ఉండాలి.

మౌనంగా ఉండటానికి ప్రయత్నశీలుడై ఉండాలి! అనవసరమై సంభాషణ – ఇతరులపై నిందారోపణ... ఇత్యాదులు దగ్గరకి రానివ్వకూడదు. ముఖ్యంగా స్నానంచేసేటప్పుడు, పఠించేటప్పుడు, భుజించేటప్పుడు, జపించేటప్పుడు లౌకిక – ప్రాపంచ విషయాలు మననం చేయరాదు! భగవత్ విషయాలే మననం చేయాలి! రోమములకు – గోళ్ళకు అలంకారములను ఆశ్రయించరాదు! అసంకల్పితంగా వీర్యపతనమైనప్పుడు స్నానము – ప్రాణాయామము నిర్వర్తించాలి. గాయత్రీ జపం చేయాలి. సంకల్పితంగా – బుద్ధిపూర్వకంగా వీర్యపతనము చేయరాదు.

- పవిత్రుడై వుండాలి!
- ఏకాగ్రచిత్తమును అలవరచుకోవాలి! **అనేకములో దాగియున్న ఏకమును చింతించుచూ ఉండటమే ఏకాగ్రచిత్తము!**
- తదితర సర్వజగద్విషయాలపట్ల మౌనము వహించి ఉండాలి! మౌనిత్వము అభ్యసిస్తూ ఉండాలి!
- ప్రాతః – మధ్యాహ్న – సాయం సమయములలో త్రిసంధ్యోపాసకుడై గాయత్రిని జపిస్తూ వుండాలి.
- అగ్నిని, సూర్యుడిని, ఆచార్యుని, గోవుని, బ్రాహ్మణుని, గురువును, వృద్ధులను, దేవతలను పూజిస్తూ – సేవిస్తూ వుండాలి!

**శ్లో॥ ఆచార్యం మాం విజానీయాత్**
**నావమ్ అన్యేత కర్హిచిత్।**
**న మర్త్యబుద్ధ్యా అసూయేత**
**సర్వదేవమయో గురుః ॥** **(అధ్యా 17, శ్లో 27)**

ఆచార్యుని (Teacher) ప్రత్యక్ష భగవత్ స్వరూపంగా భావించాలి. ఆయనను సాధారణ మనుష్యునితో పోలుస్తూ దోషదృష్టితో చూడకూడదు! **జన్మజన్మలుగా అభ్యసించిన దోష దృష్టియే మహనీయులలో దోషాలు ఎన్నుతూ వుండటానికి కనబడటానికి కారణం! పరమాత్మయే ఆచార్యుల రూపంగా నాకు ఎదురుగా కనిపిస్తున్నారు - అను ఆచార్యస్య భగవన్ స్వయం** దృష్టిని అలవరచుకోవాలి! గురి చేత సర్వము లభిస్తాయి. గురి లేనిచోటకాదు. గురియే గురువు! గురి లేకుంటే గురుతు లభించదు.

ఉదయం - సాయంకాలం భిక్షాటణలో లభించే దానిని గురువుకు మునుముందుగా సమర్పించాలి. ఆతరువాత, ఆయన అనుజ్ఞను అనుసరించి ఆయా ఫలములు, పదార్థములు సేవించాలి.

ఆచార్యుడు ముందు నడుస్తూవుంటే, ఆయన వెనుక సేవా భావంతో "నేను స్వల్పుడను..." అను అభిప్రాయంలో అడుగులు వేస్తూ వుండాలి. వినమ్రతగా నడవాలి.

నిద్రాసమయంలో గురుసేవపట్ల అప్రమత్త భావనతో నిదురించాలి. విశ్రాంతి సమయంలో ఆచార్యులకు పాదములు ఒత్తుతూ ఉండాలి! ఆచార్యులు కూర్చుని ఉన్నప్పుడు చేతులు జోడించి కృతాంజలుడై వుండాలి. వారు కూర్చున్న ప్రదేశానికి కొద్ది దూరంలో ఉండి వారి ఆజ్ఞలు నిర్వర్తించటానికి సంసిద్ధత తెలుపుచూ ఉండాలి! ఆయనను ఉపాసించాలి.

వేదాధ్యయనం పూర్తి అయ్యేవరకు భోగములను విడచి, ఇప్పుడు మనం చెప్పుకొన్న విధి-నియమములు పాటిస్తూ గురుకులంలో అఖండ బ్రహ్మచర్యవ్రతం పాటిస్తూ వుండాలి.

అట్టి శ్రద్ధతో కూడిన అఖండబ్రహ్మచర్య వ్రతం నిర్వర్తిస్తూ తన జీవిత సర్వస్వమును ఆచార్యునకు సమర్పించు నైష్ఠిక బ్రహ్మచర్యవ్రతుడు సులభంగా మహర్లోకము - బ్రహ్మలోకమును ఎరుగగలడు! బ్రహ్మమై ప్రకాశించగలడు! **శిష్యత్వమునకు అంతటి** ప్రభావమున్నది! ఓ ఉద్ధవా! బ్రహ్మచర్యవ్రతుడు క్రమంగా బ్రహ్మ తేజోసంపన్నుడై అగ్నియందు, గురువునందు, సర్వ సహజీవులయందు, తనయందు అబేధబుద్ధి యుతుడై నిర్మలము - అప్రమేయము -అఖండము అగు ఆత్మను సందర్శించగలుగుతాడు! సర్వత్రా ఆత్మనే ఆస్వాదించగలుగుతాడు!

బ్రహ్మచర్య - వానప్రస్త - సన్యాసాశ్రమం సేవించేవారు స్త్రీలతో సరససంభాషణము - పరిహాసము మొదలైనవాటికి దూరంగా ఉండాలి.

బ్రహ్మచర్యాశ్రమమే కాకుండా అన్ని ఆశ్రమముల వారికి సంబంధించి కొన్ని నియమ - అభ్యాసములు ఇక్కడ ఉదహరిస్తున్నాను.

1. శౌచము ( శుచి అయిన భావాలు పెంపొందించుకోవడం) 2. ఆచమనము 3. స్నానము 4. సంధ్యోపాసన 5. జపము 6. జగత్ భావావేశములపట్ల అస్పృశ్యత 7. మత్తు - బద్ధకము - ఆవేశము పెంపొందించే పదార్థములు స్వీకరించకపోవడం - సాత్వికాహారం 8. లౌకిక విషయాలు సంభాషించకపోవటం 9. సర్వజీవులలో వేంచేసియున్న అంతర్యామినగు నన్నే సర్వదా సందర్శిస్తూ - ఉపాసిస్తూ ఉండటం. 10. మనస్సును, వాక్కును కాయమును అదుపులో ఉంచుకొని ఉండటం.

నైష్ఠిక బ్రహ్మచారిగాని, తదితరులుగాని... పై గుణములను అభ్యసిస్తూ ఉండటంచేత బ్రహ్మతేజోసంపన్నులై అగ్నివలె ప్రకాసిస్తున్నారు.

గురుసేవ - అధ్యయనం - తపస్సుల ప్రభావంచేత కర్మవాసనలన్నీ క్రమంగా తమంతట తామే నాశనమగుచున్నాయి. తద్వారా ఆతడు నిష్కామభక్తిని సంపాదించుకో గలుగుచున్నాడు. ముక్తుడగుచున్నాడు!

## 2. గృహస్థాశ్రమము

బ్రహ్మచర్యవ్రతం నిర్వర్తించిన తరువాత గృహస్థాశ్రమం ప్రవేశించదలచుకొన్నవాడు వేదాధ్యయనం పూర్తి అయిన తరువాత గురుదక్షిణ సమర్పించుచున్నాడు. గురు ఆజ్ఞతో సకాముడైతే .... బ్రహ్మచర్యాశ్రమం నుండి గృహస్థాశ్రమం స్వీకరించుచున్నాడు.

| | |
|---|---|
| అకాముడు- నిష్కాముడు-అయితే - | బ్రహ్మచర్యాశ్రమం నుండి వానప్రస్థాశ్రమం స్వీకరించుచున్నాడు. |
| నిష్కాముడు - బ్రహ్మజ్ఞాన - శ్రేష్ఠుడు అయితే } | సన్యాసాశ్రమం స్వీకరించుచున్నాడు. |

లేదా....

ఒక ఆశ్రమం నుండి మరొక ఆశ్రమాన్ని స్వీకరించవచ్చు. భక్తజనులు తమయొక్క ఆశ్రమ విధానములను, నియమములను సగౌరవిస్తూ వుంటారు!

**వివాహం :** "గృహస్థాశ్రమం స్వీకరించాలి" అని అనుకొనువాడు విద్యానంతరం తన భావాలకు అనుకూలమైనది, సంఘముయొక్క కట్టుబాట్లకు సానుకూలమైనది, తనవలె

ఆశయములు - దృక్పథములు కలది, పెద్దలు సదుద్దేశ్యములకు అనుకూలమైనది, తన వర్ణము (లేక) అవరోహణవర్ణమునకు చెందిన కన్యను వివాహమాడవచ్చును!

అధ్యయనము - దానము - యజ్ఞయాగాలు ఇవన్నీ బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య వర్ణులకు సరిసమానమైన ధర్మములు.

ప్రతిగ్రహణము - అధ్యయనము - యజ్ఞములు నిర్వర్తింపజేయటం... ఇవి బ్రాహ్మణ కుల జాతులకు ముఖ్య స్వధర్మరూపములై వున్నాయి.

దానము స్వీకరించటం... అనేది తపస్సుకు, తేజస్సుకు, యశస్సుకు దోషము కలిగిస్తాయేమో కదా!... అని ఎవరికైనా అనిపిస్తూ వుంటే ... అప్పుడు అట్టివాడు జీవనోపాధికై న్యాయబద్ధమైన - లోకసమ్మతమైన ఏదైనా ఆదాయంవచ్చే వృత్తిని నిర్వరిస్తు ఇక ఆపై కులధర్మ - యజ్ఞ - దానాదులు నిర్వర్తిస్తూ ఉండవచ్చు.

ఓ ఉద్ధవా! ఈ పవిత్రమైన మానవ దేహమును క్షుద్రమైన కామ భోగములకు మాత్రమే వెచ్చిస్తూ ఆయుష్షను నష్టపరచుకోవటం ఏమాత్రం ఉచితం కాదయ్యా! **ఈ దేహము ముఖ్యముగా పరతత్త్వజ్ఞానము యొక్క సముపార్జనకై ఉద్దేశ్యించబడిందని గమనించబడు గాక!** బుద్ధికి భాగవత ధర్మములు అభ్యాసం కావటానికై మానవజన్మ గొప్ప అవకాశం!

జీవించటం కోసం మాత్రమే ఆహారం! ధర్మమునకు ప్రతికూలంగాని లౌకిక వృత్తిచే లభించిన దానితో సంతృప్తుడై, కష్ట - సుఖములు పరమాత్మయొక్క ప్రసాదిత విశేషాలుగా దర్శిస్తూ, స్వధర్మ నిరతుడై వుంటూ, సర్వము పరమాత్మయొక్క ప్రత్యక్షరూపంగా వీక్షిస్తూ భోగపారాయణం త్యజిస్తూ గృహస్థాశ్రమము దివ్యభావాలతో స్వీకరించేవాడు అతి సులభంగా మోక్షార్హుడు కాగలడు!

ఎవ్వరైతే నా భక్తుల కష్టములను - దారిద్ర్యమును తొలగిస్తూ, రక్షణ ఇస్తూ సేవిస్తూ వుంటాడో అట్టివానిని సంసార సముద్రం నుండి నావవలె నేను ప్రయత్న పూర్వకంగా కాపాడుతాను.

**ఇది నా ప్రతిజ్ఞ!**

# క్షత్రియ ధర్మం

**శ్లో॥ సర్వాః సముద్ధరేత్ రాజా, పితేవ వ్యసనాత్ ప్రజాః**
**ఆత్మానమాత్మనా ధీరో యథా గజపతిః గజాన్ (అధ్యా 17, శ్లో. 45)**

ఒక గజరాజు తదితర గజములను రక్షిస్తూ వున్నట్లు ధీరుడగు నరపతి ప్రజలను కన్నబిడ్డలనువలె రక్షించాలి! పరిపాలించాలి! క్షత్రియధర్మము ఆశ్రయించేవాడు తనను తదితరులను రక్షించే ధర్మమును ఆశ్రయించినవాడై వుంటాడు.

ఏరాజైతే ప్రజలను సేవాభావంతో ధర్మనిరతితో, ప్రేమాస్పదంగా పరిపాలిస్తూ వుంటాడో... అట్టి క్షత్రియుడు ఇహపరలోకములలోని సర్వదోషములనుండి విముక్తుడౌతాడు. సూర్యునివలె ప్రకాశిస్తాడు ఇంద్ర లోకంజేరి స్వర్గసుఖాలకు సర్వానందములకు అర్హుడౌతాడు. ఇంద్రసమానుడౌతాడు.

# వైశ్య ధర్మం

జీవనోపాధికై క్రయ విక్రయములను నిర్వర్తించువాడు వైశ్యుడు. ఇతడు తదితరములైన యోగాభ్యాసం - యజ్ఞం - దానం - తపస్సు నిర్వర్తిస్తూ స్వధర్మం - లౌకిక ధర్మంగా వైశ్య వృత్తులను నిర్వర్తించువాడు- అట్టి ధర్మనిరతిచే మోక్షార్హుడు అగుచున్నాడు!

విప్రుడు అత్యవసమైనప్పుడు జీవనోపాధికై క్షత్రియ - వైశ్య ధర్మములు నిర్వర్తించవచ్చు.

క్షత్రియుడు ఆపదల సమయంలో వైశ్య వృత్తిని - బ్రాహ్మణవృత్తులను ఆపద్ధర్మంగా అవలంబించి తద్వారా జీవితము గడుపవచ్చు.

వైశ్యవృత్తివాడు ఆపదల సమయాలలో చాపలు అల్లటం మొదలైన కారుజాతి వృత్తులను అవలంబించవచ్చు!

## దూష్యవృత్తిః మాత్రము నిషిద్ధం

బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రులలో ఎవ్వరూ నీచ వృత్తులైన దొంగతనం, హింస... ఇటువంటి దూష్యవృత్తులకు (దుష్ట-తదితరులను బాధించే వృత్తులకు) సంసిద్ధుడు కారాదు సుమా!

---

గృహస్థుడు చేయవలసియున్న దినచర్యలు

-- వేదాధ్యయనం చేస్తూ... తద్వారా ఋషులకు పూజా పుష్పాలు సమర్పించటం.

-- స్వధా మంత్రముచే పిత్రుదేవతలను పూజిస్తూ ఉండటం.

-- స్వాహా మంత్రముచే దేవతలను పూజించటం

-- ఉపాహార వస్తువులను సమర్పిస్తూ భూతజాలములను పూజించటం.

-- అన్న - ఉదకాలతో సహజీవులను పూజించటం.

-- ధన - సంపదల సమర్పణతో ఆశ్రిత - సేవక జీవులను పూజించటం.

- యథాశక్తిగా యజ్ఞ - యాగ - పూజాదులు నిర్వర్తించటం.

గృహస్థుడు ధనికుడైనను, పేదవాడైనను- కుటుంబవిషయాలలో తన్మయుడై అత్యాసక్తుడై, వేదనాపరుడై (As mentally worried) వుండరాదు. ఇక్కడి సందర్భాలు - సంబంధాలు - సుఖ - దుఃఖాలు, సంపద ఆపదల నశ్వరం కదా! "ఇవన్నీ అశాశ్వతం - కాలబద్ధము కూడా!" అను అవగాహన అంతరంగమున సజీవమై ఉండుగాక! భగవత్ తత్త్వమునందు సర్వదా సావధానుడై ఉండుగాక! అప్రమత్తుడై ఉండుగాక! స్వర్గాది సుఖలోకాలు కూడా ఇట్టివే! కాలబద్ధమే! భ్రమాత్మకమైనవే!.... అని గమనిస్తూ వుండుగాక!

**శ్లో॥ పుత్ర దార - ఆప్తబంధూనాం సంగమః పాంథ సంగమః**
**అనుదేహం వియన్త్యేతే స్వప్నో నిద్రానుగోయథా ॥** (అధ్యా 17, శ్లో 53)

కలలో కనిపించే స్వప్నదృశ్యాంతర్గత జీవులు, సంపదలు, సందర్భములు, బాంధవ్యములు మెళుకువరాగానే ఏమౌతున్నాయి? మటుమాయమైపోతున్నాయి కదా!

అట్లాగే...

గృహస్థుడు కూడా- "**ఇక్కడి పుత్రులు - భార్య - భర్త - ఆప్తులు - బంధువులు మొదలైనవన్నీ చలివేంద్రంలో బాటసారుల కొద్దిసేపు సమావేశం చేత ఏర్పడినవై, ఆ బాటసారులు ప్రయాణం కొనసాగిస్తున్న మరుక్షణం మటుమాయమైయ్యే విశేషాలవంటివే కదా!**"... అని జ్ఞానదృష్టితో అవగాహన కలిగి ఉండాలి. ఒకరికొకరం సంబంధించిన వారమే కాదు. ఎవరి ప్రయాణం, ఎవరి గొడవ వారిదే! ఈ కాసేపు "ఒకొరికొకరం సర్వస్వమైనట్లు కలిసి వుంటాం. కానీ, విడిపోవటం అనివార్యం" - అని జ్ఞాపకం పెట్టుకొనే వుండాలి.

ఒక అతిథి తాను ప్రవేశించిన ఒక గృహస్థుని ఇంట్లో మమత్వరహితుడై అనాసక్తుడై వుంటాడు కదా! అట్లాగే గృహస్థుడు కూడా తన గృహంలోను, ఈ జగత్తులోను అనాసక్తుడై, మమత్వరహితుడై **బహుదూరపు బాటసారి ఒక గృహ ప్రాంగణంలో కొద్దిసేపు సేదదీర్చుకొను రీతిగా** ఉండటం అలవరచుకోవాలి.

**భక్తుడు :**

భక్తుడగువాడు మమత్వ - ఆసక్తరహితుడై స్వకర్మలను నిర్వహిస్తూ వుంటాడు. గృహస్థుడై వుంటే తాను నిర్వర్తిస్తున్న కర్మలద్వారా... నన్ను ఆరాధిస్తూ వుంటున్నాడు.

లేక, సర్వసాంఘిక విషయములు త్యజించి అరణ్యంలో ఏకాంతంగా ప్రవేశించవచ్చు! కాదా, సన్యాసము స్వీకరించి ఆశ్రమవాసియై వుండవచ్చు.

భక్తి మనోవికాసానికి సంబంధించినది. అంతేగాని, దృశ్య సంబంధమైనది కాదు. ఆశ్రమములకు - లోకసంబంధమైనది కాదు! వస్త్రధారణలకుగాని, చాతుర్వర్ణ్యములకు గాని సంబంధితమైనది కానేకాదు. ప్రతి ఒక్కడు భక్తికి అర్హుడే!

## గృహస్థాశ్రమం - మోక్షప్రదాత / బంధప్రదాత

గృహస్థాశ్రమం మోక్ష ప్రదాత తప్పక కాగలదు సుమా! ఏ ఆశ్రమవాసి అయినాసరే, మోక్షానికి అర్హుడే కూడా!

అయితే...,

గృహస్థాశ్రమం ఎప్పుడు మోక్షమార్గానికి ప్రతిబంధకము, బంధప్రవృద్ధము అవగలదో... అది కూడా జనుల జాగరూకతకొరకై చెప్పుచున్నాను. విను!

- గృహస్థుడు కనుక మూఢుడై, వివేకశూన్యుడై, బంధు-మిత్ర-కళత్రాది విషయముల పట్ల రాగద్వేషములు పెంపొందించుకొని, ఆసక్తిని ప్రవృద్ధపరచుకొంటూ వుంటే... ఇక ఆపై జీవుడు అహంకార - మమకారములకు బద్ధుడు కాగలడుసుమా!
- "నేను ఏదో పొందాలి! ఇంకా ఇంకా ఏదేదో చేయాలి! - నావారి గతి ఏమి కానున్నదో? నా భార్య, పిల్లలు దీనులు - అనాధలు అవుతారేమో? వారు దుఃఖం పొందరాదు. అందులకై ధన సముపార్జనయే ముఖ్యము కదా! నా ధనరాసులు, గృహసంపదలు ఏమి కానున్నాయెూ! మా వ్యాపార విశేషాలు ఇట్లాగే కొనసాగుతాయా? లేక పిల్లల తెలివి తక్కువ చేత ఆదాయాలు కుంటుపడవుకదా!" - ఇట్లా యోచనలపై యోచనలు చేస్తూ గృహస్థాశ్రమంలో కాలం వృధా చేసుకొనేవాడు అవివేకియే!

  చేయవలసింది చేయటం! జరుగవలసింది జరుగుతుంది! మౌనంగా, అతీతంగా, చిద్విలాస పూర్వకమైన చిరునవ్వుతో చూస్తూ ఉండటం - ఇది సిద్ధులగు మహనీయులు గృహస్తునికి చెప్పే ఉపాయం.

- అసంతృప్తి, ఏదో లేదని – ఆవేశము, బంధువుల సమాచారములపట్ల అభినివేశము ఇత్యాదులు ప్రవృద్ధపరచుకొంటూ ఆయిష్షును గడుపువాడు ఉత్తరోత్తర మరణానంతరం అధమగతులకు చేరగలడని నా హెచ్చరిక!

## 3. వానప్రస్థాశ్రమము

ఉద్ధవా! ఇప్పుడు వాన ప్రస్థాశ్రమవాసుల విశేషాలు చెప్పుచున్నాను. విను.

వానప్రస్థాశ్రయులు గృహస్థాశ్రమబాధ్యతలన్నీ పుత్రులకో, సత్పురుషులకో చేతికందించి, ఆ గృహస్థాశ్రమం పరిత్యజించి ఏకాంత వాసాన్ని ఆశ్రయిస్తున్నారు. భార్యను పుత్రుల సంరక్షణలో ఉంచిగాని, (లేక) వెంటనిడుకొనిగాని బయల్వెడలుచున్నారు.

వనములలోనో, అరణ్యములలోనో, కొండప్రాంతాలలోనో,,, మరెక్కడో ఏకాంత ప్రదేశం ఎన్నుకొనుచున్నారు.

శాంతచిత్తులై జీవితముయొక్క మూడవ విభాగం (The third part of life) వానప్రస్థం ఆశ్రయించటం అహంకార – మమకారత్యాజ్యములకు ఔషధమై యున్నది సుమా! గొప్ప ఉపాయమైయున్నది!

వానప్రస్థులు వనములలో – అడవులలో గాలివాటుగా దొరికే కందమూలములను, ఫలములను ఆహారంగా స్వీకరించనారంభించుచున్నారు. జింకచర్మమును, నారచీరలను, ఆకులను వస్త్రములుగా ధరిస్తూ ఏకాంత సాధన కొనసాగిస్తున్నారు. వెంట్రుకల అలంకరణ, గోళ్లు – మీసముల – దంతముల – శరీరసంబంధమైన అలంకార వ్యవహారములు త్యజిస్తున్నారు. మూడు వేళల స్నానం చేస్తూ, నేలపై పరుండి... జీవితము గడుపుచూ తదితర సర్వసమయములలో తమ తమ ఆధ్యాత్మసాధనలు నిర్వర్తిస్తున్నారు. **తమను తాము ఆధ్యాత్మ మార్గంలో ఉత్తేజపరచుకొంటున్నారు.**

- కొందరు వేసవి కాలంలో పంచాగ్నులమధ్య, వర్షాకాలంలో శీతల జల – నదీ ప్రదేశాలలోను ప్రకృతిని సాధనగా చేసుకొని అభ్యాసం కొనసాగిస్తున్నారు. ప్రకృతిని ఉపాసనా దైవంగా భావనచేస్తున్నారు.

-- వారిలో మరికొందరు అగ్నిపక్వమైన కందమూలాలుగాని, కాలపక్వమైన ఫలములతోగాని రోట–రాయితో దంచబడివైన ధాన్యపుగింజలను గాని ఆహారంగా స్వీకరిస్తూ ఇంద్రియాకర్షణను జిహ్వారుచులను జయిస్తున్నారు.

- దేశ - కాలానుసారంగా సామాన్యంగా లభించే వస్తువులలో (దాచిపెట్టుకోవటం - కూడబెట్టుకోవటం లేకుండా) - సమయానుకూల వస్తువులతో సామాన్య జీవితం గడుపుచూ వానప్రస్థాశ్రమ జీవితం గడుపుచున్నారు.

**అట్టి వానప్రస్థాశ్రమం ఆశ్రయించు వారు**

- వనములో - అడవులలో (తామున్నచోట) లభించే సస్యములు మొదలైన పదార్థములతో లోకోత్తరమై ఉపాసన - ధ్యాన - యజ్ఞాదులు నిర్వర్తిస్తూ వుంటారు.

## జీవహింస కూడదు

ఓ ఉద్ధవా! జీవహింస చేయటమనేది నన్ను బాధించటమే! అందుచే ప్రతివిహితములైన పశు-పక్షి మాంసములతో పరతత్త్వ స్వరూపుడను - సర్వాంతర్యామిని అయిన నన్ను పూజించవలసిన అగత్యము లేదు. ఆ అవసరము-అట్టి అభిలాష సర్వజీవాంతర్గతుడును సర్వదేవతా స్వరూపుడను అగునాకు ఉండదు.

## మరికొన్ని వానప్రస్థ విశేషాలు:

- జీవితాంతం దేహపతనం వరకు నన్ను వానప్రస్థాస్రమంలో ఉపాసించువారు బ్రహ్మలోకవాసులు కాగలరు.
- మోక్ష జనకము - మహాకష్ట సంచితము అయిన తపస్సును స్వర్గము మొదలైన అల్పమైన ఫలములకో, లౌకికమైన రాజ్యాధికారంవంటి స్వప్నంతో సమానమైన ప్రాప్తాప్రాప్తముల కొరకో ఉద్దేశ్యించటం సముచితం కానేకాదు! జీవితం అనేది జన్మ-జన్మాంతర సంబంధమైన బహు విలువైన అవకాశము.

అందుచేత, గృహస్థాశ్రమంలోగాని, వానప్రస్థాశ్రమంలోగాని, సన్యాసాశ్రమంలోగాని అనుష్ఠానములు నిష్కామంగాను, లోకకళ్యాణార్ధంగాను నిర్వర్తించటమే ఉత్తమము! నిష్కామకర్మ మోక్ష సిద్ధిని సులభంగాను, దృఢంగాను ప్రసాదించగలదు.

వానప్రస్థులు తమ ఆశ్రమమునకు సంబంధించిన నియమములను నిర్వర్తించలేని దేహస్థితికి వచ్చినప్పుడు,.... అట్టివారిలో కొందరు యజ్ఞాగ్నిని భావనచేసి, ఆ అగ్నులను తమ అంతఃకరణంపై ఆరోపించి మనస్సును నాయందు నిలిపి, ఆ భావజనిత యోగాగ్నిలో భౌతికదేహము ప్రవేశింపజేయటం జరుగుచూ ఉంటోంది. లేదా వంశజుల-బంధువుల-మిత్రుల-శిష్యుల గృహాలలో (లేక) సిద్ధపురుషుల ఆశ్రమాలలో అంతిమదినము గడపవచ్చు.

# 4. సన్యాసాశ్రమం

కొందరికి కర్మ పరిపాకమైనట్టి లోకవిషయములపట్ల వాటియొక్క తదనంతర పరిణామములపట్ల సంపూర్ణ వైరాగ్యం కలుగుతోంది. అట్టి వైరాగ్యము పొందగలిగినవారు యథావిధిగా యజ్ఞాగ్నులను పరిత్యజించి సన్యాసాశ్రమం స్వీకరిస్తున్నారు!

సన్యాసాశ్రమం స్వీకరించే అభిలాష గలవారు...,

- యజ్ఞములద్వారా నన్ను ముందుగా ఆరాధిస్తున్నారు.
- వేదజ్ఞులను, ఋత్విక్కులను ఆహ్వానించి తమకున్నదంతా సమర్పించివేస్తున్నారు.
- వేదమంత్రములద్వారా ఆత్మను అగ్నిగా భావనచేసి చిత్త విషయములను అట్టి ఆత్మాగ్నిలో వ్రేల్చి నిరపేక్షతో కూడిన చిత్తముతో సన్యాసాశ్రమం స్వీకరిస్తున్నారు.

**ఇక్కడ ఒక చమత్కారం!**

"నేను సన్యాసధర్మం సీకరిస్తాను. అట్టి సన్యాస ధర్మంయొక్క సాయంతో పరబ్రహ్మమును పొందదలచుకున్నాను!".... అని సంకల్పించే యత్నపరులకు కొందరు అధిష్ఠాన దేవతలు "ఈతడు మమ్ములను తిరస్కరిస్తున్నాడే! మేము కల్పించిన జగత్తును తూష్ణీకరిస్తున్నాడేం?"... అని తలచి కొన్ని విఘాతాలు కలిగిస్తూ ఉండవచ్చు. ఓర్పు - నేర్పులలో భక్తి-జ్ఞాన-వైరాగ్య-యోగ పూర్వకంగా అట్టి అడ్డంకులను సన్యాయోగి అధిగమిస్తూ ఉండవలసి వస్తుంది. భార్య-స్త్రీ-పుత్రులు-... ఇత్యాది విశేషాలతో కూడా వారు పరీక్షించబడుతూ ఉంటారు.

సన్యాసి....,

- కౌపీనం ధరిస్తూ ఉంటాడు.
- ఆ కౌపీనము కనిపించకుండా చిన్న వస్త్రం ధరిస్తున్నాడు.
- దండము-కమండలము తప్ప ఆతడు మరింకేమీ ధరించడు.

**ఆపదసమయములో ఆతనికి ఏ నియమములు వర్తించవని కూడా గమనించు.**

ఆతడు...,

- దృష్టిని పవిత్రం చేసుకుంటూ అంతా పరమాత్మయొక్క ప్రత్యక్ష రూపంగా సదా దర్శిస్తూ ఉంటాడు.

- తన ఆశీర్వాదము-కష్టముల ఉపశాంతి కోరివచ్చువారికి భగవత్స్తోత్రములతో ధైర్యము సూచిస్తూ ఉంటాడు.
- పవిత్ర భావాలు వెల్లివిరిసే ప్రదేశాలలో మాత్రమే ఉంటాడు. పవిత్ర ప్రదేశాలను మాత్రమే సందర్శిస్తూ అపవిత్ర ప్రదేశములలో అడుగుపెట్టడు. లౌకిక విషయాలలో తల దూర్చడు.
- వస్త్రముతో వడగట్టిన జలము త్రాగుతూ ఉంటాడు.
- నిర్మోహమాటంగా సత్యమునే అన్వేషిస్తూ - పలుకుతూ ఉంటాడు. సత్యమును ప్రేమిస్తూ ఉంటాడు! పరమాత్మతత్త్వము గురించియే సంభాషిస్తూ, తనకు తెలిసినంత వరకుసాధకజనుల సందేహములను తొలగిస్తూ వుంటాడు.
- తనను గౌరవించేవారిపట్ల, అగౌరవించేవారిపట్ల, తటస్థులపట్లా (సర్వే-సర్వత్రా) సమమైనట్టి వాత్సల్య సహితుడై ఉంటాడు.
- వాక్-మనో-కాయములచే సమ-సత్కర్మవర్తనుడై ఉంటాడు.
- శరీరముచే కామ్య కర్మ త్యాగి అయి ఉంటాడు.
- మనో దేహానికి ప్రాణాయామమే అతని దండము. మనో నిగ్రహము-పరమాత్మ ధ్యానములే ఆతని కమండలము-కమండలోదకం!

ఓ ఉద్ధవా!

- వాక్కుకు మౌనము,
- **శరీరమునకు కామ్యకర్మ త్యాగము, మనస్సుకు ప్రాణాయమము,** అనే మూడు దండములు (త్రిదండములు) ధరించనివాడు భౌతికమైన కొయ్య దండమును భౌతికమైన చేతులతో ధరించినంతమాత్రంచేత సన్యాసి కాలేదు సుమా!
- ద్రోహచింతన హింసాస్వభావము గల ఇళ్ళను వదలి తదితర చాతుర్వర్ణ్యముల గృహస్థులవద్ద ఆతడు భిక్ష స్వీకరించవచ్చు!
- పేదవారిని భిక్ష కోరరాదు! అయాచితముగా ఆశీర్వదిస్తూ, పలకరిస్తూ, ప్రేమిస్తూ వారితో శాంత-స్వాంత వచనములు పలుకుతూ వుండాలి.
- గృహములలో లభించిన, లభించని వానితో తృప్తి చెందినవాడై వుండాలి!
- సర్వదా-సర్వులపై వాత్సల్యము కురిపిస్తూ వుండాలి!

- భిక్షగా లభించినదానిని గ్రామము చివరగల చెఱువు దగ్గిరకు తీసుకొనిపోయి సంప్రోక్షణతో పవిత్రం చేసి, విష్ణువు - బ్రహ్మ - సూర్యుడు మొదలగు దేవతలకు వారి వారి భాగములను విభాగించి పక్షులు మొదలైనవి తిర్యక్ జంతువులకు సమర్పించి, శేషించిన ఆహారం మాత్రమే స్వీకరిస్తూ ఉండాలి.

**అట్టి సన్యాసాశ్రమవాసి**

- **ఈ జగత్తంతా ఆత్మయొక్క సంప్రదర్శనమే!** - అను భావనతో పరమాత్మశీలుడై, ఆత్మరతుడై, ధీరుడై ఇంద్రియనిగ్రహముతో, సంగరహితుడై, ఏకాకియై ఈ భూమిపై సంచరిస్తూ ఉంటాడు!
- ఆత్మచే సంతృప్తుడై (ఆత్మ తృప్తుడై) వుంటాడు!
- నిర్జన ప్రదేశాలలో ఉండి, నిర్భయంగా నాపై ధ్యాసనంతా నిలిపినవాడై ఉంటాడు.
- క్రమక్రమంగా విశుద్ధచిత్తుడై తనతో సహా సర్వము పరమాత్మయొక్క లీలా-క్రీడా విన్యాసముగా సందర్శించే శుద్ధమైన బుద్ధిని సముపార్జించుకుంటూ వుంటాడు! ఆత్మతత్త్వము మాత్రమే ధ్యానిస్తూ వుంటాడు!

**సన్యాస యోగి...,**

- మునియై సర్వదా తనయొక్క బంధ-మోక్షములు గురించియే విచారణ చేస్తూ వుంటాడు!
- లోకశ్రేయస్సుకై చేసే స్తోత్రములు, బోధలు, పరిభాషణలు- ఇవన్నీ కూడా ఆతని ఉపాసనా విధానం! జనులకు మేలుచేసే వచనములే ఆతని లోకేశ్వర ధ్యాన విభాగాలు!
- "ఇంద్రియ విషయములపట్ల నాకు గల చాపల్యమే బంధముయొక్క ప్రకటన రూపం..." అని గమనించుచున్నవాడై వుంటాడు!
- మనస్సుచే "అన్ని రూపాలు పరమాత్మయే! అందరిలోని అందరుగా కనిపించే పరమాత్మయే నిత్యసత్యము! నాయొక్క ఆరాధ్య వస్తువు"... అని సర్వదా మననం చేపట్టినవాడై వుంటాడు! నామరూపాత్మకమైన భేదమంతా బాహ్యమునందే త్యజించి, సన్యసించి సత్‌ను న్యాసం ఆశ్రయించుటయే ఆతని కార్యక్రమం.

**శ్లో॥ తస్మాత్ నియమ్య షడ్వర్గం మద్భావేన చరేత్ మునిః ।**

**విరక్తః క్షుద్రకామేభ్యో లబ్ధా ఆత్మని సుఖం మహత్ ॥** **(అధ్యా 18, శ్లో 23)**

అందుచేత సన్యాసయోగి క్రమక్రమం కామ-క్రోధాలు విడచివేసినవాడై వుంటాడు. క్షుద్రములైన విషయసుఖములపట్ల మొదలంట్లా విరక్తుడై వుంటాడు! చిదానందమును అనుభవిస్తూ "**ఈ కనపబడేదంతా మమాత్మ స్వరూపమే! అంతరాత్మయొక్క బాహ్య చమత్కారమే!**"... అనుభావనను - ఆస్వాదనను ప్రవృద్ధపరచుకుంటూ వుంటాడు అనుకుంటూ - అనుకుంటూ వుంటే అనిపిస్తుంది కదా!

అధికంగా పవిత్రమైన ప్రదేశములలో, నదీనద స్థానములలో, పర్వతశ్రేణులలో, ఆశ్రమములలో సంచరిస్తూ వుంటాడు. గ్రామ-పట్టణములను భిక్షాటనకై మాత్రమే దర్శిస్తూ వుంటాడు. అధిక సందర్భాలలో వానప్రస్థులవద్దను, తీర్థయాత్రీకులవద్దను భిక్ష స్వీకరిస్తూ వుంటాడు. శిలావృత్తి (రాత్రిపూట గృహస్తులను శేషించిన ఆహారపదార్థములను భిక్షకోరటం, మాధవకోళం) వలన లభించిన ఆహారము భుజిస్తూ వుండుటచే చిత్తము మోహరహితమై, పరిశుద్ధమౌతూ ఉంటుంది. మోహరహితమైన బుద్ధికి మోక్షము సులభంగా సిద్ధించగలదు.

## 25. యోగి - విశేష ధర్మాలు

**శ్రీకృష్ణుడు :** సర్వ ఆశ్రమములలో యోగసాధన అభ్యాసవశంగా సుసాధ్యమే! యోగి- "ఈ ప్రత్యక్ష దృశ్యాన్ని చూస్తూ **ప్రత్యక్షంగా కనిపించే దృశ్యవస్తువులన్నీ కాలంచేత నాశనంపొందే ధర్మము కలిగి యున్నవికదా!**" అని గమనిస్తున్నవాడై వుంటాడు. నాశనధర్మమును దృష్టిలో పెట్టుకొన్నవాడై దేనియందూ ఆసక్తుడు కాడు. "**ఏదీ నాది కాదు. అంతా కాలస్వరూప భగవానునదే కదా!...**" అని అంతరంగంలో గమనించి వుంటాడు.

ముముక్షువైనవాడు గృహము - ధనము ఇత్యాది ఐహిక సంపదలందు, స్వర్గము మొదలైన ఆముష్మిక సంపదలపట్ల అనాసక్తుడై వుంటాడు. నిష్కామ కర్మలయందు నిరతుడై వుంటాడు.

తనయొక్క తార్కిక జ్ఞానంతో **ఈ భౌతిక దేహము ప్రాణ-మనో-బుధ్యాదులతో కూడిన అహంకార దేహము స్వప్నతుల్యమే కదా! మాయారచితమే కదా!** - అని గమనిక

కలిగి వుంటాడు. సుఖ- దుఃఖములను స్వప్నతుల్యంగాను, మనో కల్పితంగాను, లీలావినోదంగాను దర్శిస్తూ ఉంటాడు. **సర్వమును త్యజించి ఆత్మనిష్ఠుడై సర్వమును స్వాత్మ ప్రదర్శనా చమత్కారంగా దర్శిస్తూ వుంటాడు.**

బాహ్య విషయాలను బాహ్యమునందే త్యజించి ఉంచి సర్వదా మోక్షముకొరకై జ్ఞాన నిష్ఠుడై ఉంటాడు. లేదా... నాయందు తన ధ్యాసను - నిష్ఠను - భక్తిని పెంపొందించుకుంటూ మోక్షము అను దానిపట్ల ఇచ్ఛతో కూడి సర్వమును అంతరంగంలో త్యజించి ఉంటాడు. ఇక త్రిదండము-కాషాయవస్త్రాలు - ఆశ్రమ పరిమిత నివాసము - ఇటువంటి సన్యాసాశ్రమ చిహ్నాలు అట్లాగే తదితరులు - వారివారి బ్రహ్మచర్యము మొదలైన ఆశ్రమ చిహ్నాలు కూడా మానసికంగా త్యజించివేస్తాడు. విధి-నిషేధములకు అతీతుడై, సందర్భానుచిత ధర్మాలు మాత్రం నిర్వహిస్తూ ఉంటాడు.

**శ్లో॥ బుధో - బాలవత్ క్రీడేత్,**
**కుశలో - జడవత్ చరేత్।**
**వదేత్ ఉన్మత్తవత్ విద్వాన్,**
**గోచర్యాం నైగమశ్చరేత్॥** **(అధ్యా 18, శ్లో 29)**

- ప్రాజ్ఞుడు-వివేకి అయికూడా ఒక బాలునివలె క్రీడిస్తూ వుంటాడు. చిన్నపిల్లవానివలె ఏమీ ఎరుగనివానివలె కనిపిస్తూ వుంటాడు.
- అన్నీ తెలిసి, గొప్ప నిపుణుడై కూడా ఒక జడుడి వలె ఏమీ తెలియనట్లే చరిస్తూ ఉంటాడు.
- విద్వాంసుడై ఉండికూడా లౌకికుల దృష్టిలో సామాన్యునివలె - పిచ్చివానివలె మాట్లాడుతూ ఉంటాడు.
- వేదార్థములపట్ల నిష్ఠ వదలకయే నియమరహితమైన వృత్తితో మెలుగుతూ ఉన్నట్లు కనిపిస్తాడు!

---

పరమహంసత్వము వైపుగా ప్రయాణించువాడు కర్మకాండయొక్క విధి- ఫలముల గురించి పట్టుదల - మొండితనములతో "అదియే చేయాలి - ఇట్లాగే చేయాలి - అట్లాగే ఉండాలి - ఇట్లా ఉండనేకూడదు" అనే రూపంగా మొండిగా ఉండటం కూడదు. అట్లా అని.... దేనినీ పట్టించుకోకుండా రాయిలాగా (పాషండునివలె) అవకూడదు.

కేవలము తర్కవాద (Logically supporting some concepts and opposing certain other concepts) రతుడై ఉండరాదు. "వాళ్ళది తప్పు! వీళ్ళు తెలివితక్కువ వారు! మరొకళ్ళు తెలివిగలవారు కాదు".. అంటూ శుష్కవాదము – నిష్ప్రయోజనములైన వాద–వివాదములు చేయరాదు. ఏదో ఒక పక్షము వహించి (Taking one side) మిగతా వారు – మిగతా పక్షములపట్ల (Others and other Theories) తప్పులెన్నుతూ దోషములను వర్ణించువాడు అయి ఉండకూడదు. తదితరులను చూచి "వాళ్ళట్లా అంటారేం? వీళ్ళిట్లా ఉన్నారేం? ఇట్లా కాకూడదు! అట్లా ఉండాలిసిందే.." అని సహజీవులను కలత పెట్టరాదు. తాను కలత చెందరాదు. తనను గురించి ఎవ్వరైనా అతివాదంతోను, ఆవేశంతోను, దూషణ పదజాలముతోను మాట్లాడుచున్నప్పుడు – తానుమాత్రం ఓర్పుతో, శాంతముతో – సంతోషము – అతీతత్వము వీడకుండా సహనంగా బాలాలీలావినోదివలె వుండుగాక! ప్రశాంత చిత్తము వీడకుండా ఉండాలి. ఎవ్వరినీ అవమానించరాదు. విరోధము కలిగి ఉండకూడదు. పశువత్ వైరమ్ అను శాస్త్రనానుడి! **తదితర దేహములను దేహులను – చూచి విరోధము–కలత – రాగద్వేషములు కలిగి వుండటం–కొనసాగించటం పశులక్షణం.** అది మానవునికి అర్హం కాదు సుమా!

ఓ ఉద్ధవా! పరమహంస లక్షణములు పునికిపుచ్చుకున్నవారు చతుర్విధ ఆశ్రమములలో ఎక్కడైనా వుండివుండవచ్చు సుమా! ఇంకా పరమహంస యొక్క విశేషదృష్టి ఎట్లా ఉంటుందో – విను!

**శ్లో॥ ఏక ఏవ పరోహి ఆత్మా భూతేషు ఆత్మన్యవస్థితః**

**యథా ఇందు ఉదపాత్రేషు భూతాని ఏకాత్మకాని చ॥ (అధ్యా 18, శ్లో 32)**

ఆకాశంలో శీతలకాంతులు వెదజల్లుచున్న పూర్ణచంద్రుడు అనేక చోట్లగల అనేక పాత్రలలోని జలములో అనేక ఆకారాలుగా ప్రతిబింబిస్తూ ఉంటారు! ఆవిధంగా ఒకేసారి అనేకచోట్ల గల జలంలో అనేక ఆకారాలుగా ప్రతిబింబించినంత మాత్రంచేత.,.. ఆ అనేకత్వము చంద్రబింబముపై ఆపాదించగలమా? చంద్రబింబమును అనేకత్వం స్పృశిస్తుందా? లేదే!

అట్లాగే ....,

ఒకే పరమాత్మ విభిన్న దేహములలో విభిన్నమైన రూప-నామ-గుణాదులతో విభిన్న జీవాత్మలవలె ప్రతిబింబిస్తున్నారు! అయితే ఏం? సర్వ దేహములలో అఖండము - అప్రమేయము అగు ఒకే ఆత్మ ప్రకాసిస్తూ ఉన్నది! నేనే అనేక దేహులలో అనేక రీతులుగా ప్రదర్శినమగుచు వినోదిస్తున్నాను అనునది-పరమహంస యొక్క విశేష దృష్టి!

❖❖❖

పరమయోగి(లేక) సన్యాసి (లేక) పరమహంస పరమ ధైర్యముకలవాడై ఉంటాడు. ఆతడు తనకు రుచికరమైన - తాను కోరుకున్న ఆహారము లభించనప్పుడు దుఃఖించడు. మరికొన్ని రోజులు తాను కోరుకున్న మృష్టాన్నము - రుచికరమైన ఆహారపదార్థాలు లభించటంచేత సంతోషము పొందడు. ఆహారముగాని, మరింకేమైనాగాని ఒకరోజు లభించటం - మరొకరోజు లభించకపోవటం - ఇదంతా దైవాధీనంగా, దైవలీలగా గమనిస్తూ ఉంటాడు.

**శ్లో॥ ఆహారార్థం సమీహేత యుక్తం తత్ప్రాణధారణమ్**
**తత్త్వం విమృశ్యతే తేన తద్విజ్ఞాయ విముచ్యతే ॥ (అధ్యా 18, శ్లో 34)**

ప్రాణాలు కాపాడుకోవాలి కాబట్టి ఏదో ఒక ఆహారం సంపాదించుకోవాలి. ప్రాణరక్షణ దేనికి? తత్త్వ విచారణ చేయటానికి! తత్త్వవిచారణచే తత్త్వ జ్ఞానము లభించి ముక్తి కలుగుతుంది కాబట్టి ఇక అదృష్టవశంగా లభించే ఆహారంగాని, విశ్రమించే చోటుగాని ఎటువంటిదైనా... అది పెద్ద విశేషం కాదు! - అని సమన్వించుకుంటూ వుంటాడు.

ఓ ఉద్ధవా! సర్వాంతర్యామిని - ఈశ్వరుడను- సర్వతత్త్వ స్వరూపుడనుగా నన్ను నేను ఎరిగివుండి కూడా, విధి - నిషేధములకుపరిమితముగాని-లొంగని అపరిమిత స్వరూపుడను అయినప్పటికీ,... లోక నియమానుసారం శాస్త్రానుకూలంగా విధి-నిషేధ పూర్వకంగా కర్మలు ఆచరిస్తూ ఉంటాను.

పరమహంస-సన్యాసమార్గముగా ఆత్మసాక్షాత్కారము ఆశయముగా గలవాడు, అయి కూడా, విధి - నిషేధములకు లొంగకుండానే, శౌచము - ఆచమనము - స్నానము - వస్త్రధారణ ఇత్యాది కర్మలు లోకానుకూలంగా - శాస్త్రానుకూలంగా ఆచరిస్తూవుంటాడు! (Be as is convenient to the situations and the world but with no bondage to any thing)

❖❖❖

ఓ ఉద్ధవా! ఈవిధంగా ఆత్మజ్ఞానుకూలమైన జీవనసరళి కొనసాగిస్తూ ఉండగా... ఇక అట్టి జ్ఞాననిష్ఠునిపట్ల భేదప్రతీతి (the sense of differences) సన్నగిల్లుతూ వస్తుంది. సరిఅయిన సమయంలో అట్టివాడు నా అనుగ్రహం చేత నాస్థానం పొందుతాడు. **సర్వభూతములు తానై-సర్వసాక్షి అనగవేరై**... అను స్వాత్మానంద సంస్థానమును జేరుతాడు.

అందుచేత కొంచెము తెలివిగలవాడు "**ఈ విషయానుభవములవలన అంతిమ ఫలితము దుఃఖమే!**" అని గమనిస్తున్నాడు. సర్వదృశ్య విషయములపట్ల అనురక్తిని ఉపశమింప జేసుకుంటున్నాడు. విరక్తుడగుచున్నాడు. నన్ను పొందే సాధనలకు సంసిద్ధుడగుచున్నాడు. ఆత్మసుఖాభిలాషి అయి పరబ్రహ్మ నిష్ఠుడగు గురుదేవుని శరణువేడుచున్నాడు. శ్రద్ధ ఆసక్తి కలవాడై, అసూయా రహితుడై, భక్తికలవాడై గురుదేవునియందు నారూపమును భావించి, సేవించి ఆత్మజ్ఞానసమాచారమును ఆలకిస్తున్నాడు.

ఇక్కడ ఒకానొక జాగరూకత (caution), సందర్భం వచ్చింది కాబట్టి, ప్రస్థావిస్తున్నాను. విను

ఎవ్వడైతే ....,

- జ్ఞాన - వైరాగ్యముల సంపదలేనివాడై....,
- కామము - క్రోధము ఇత్యాది అరిషట్ వర్గముపై యుద్ధము ప్రకటించనివాడై,
- ఇంద్రియ వ్యవహారములపట్ల అభినివేశము గల బుద్ధియొక్క చాంచల్యము వదలకుండా...,
- ఉదరపోషణార్ధం (పొట్టకూటికొరకు)

సన్యాసము కొనసాగిస్తూ, కేవలము కాషాయవస్త్రధారణతో సంచరిస్తూ వుంటాడో...,

- అట్టివాడు అపరిణతుడు విషయవాసనాగ్రస్థుడు మాత్రమే అగుచున్నాడు.

"**ప్రపంచము పరమాత్మస్వరూపమే**" అనే దృష్టిని పెంపొందించుకొనే ప్రయత్నాలు చేయకుండా "**నేను సన్యాసిని! గమనించండి! గుర్తించండి!**"... అనే లౌకికత్వము కొనసాగించువాడు ఆశ్రమ-ధర్మనాశకుడే! అట్టివాడు తన ఆత్మను, పరమాత్మనగు నన్ను వంచించుచు ఇక ఆపై ఉభయ భ్రష్టుడు అవుతున్నాడు సుమా!

ఓ జనులారా! ధర్మనిరతిని వీడకండి! (ధర్మోరక్షతి రక్షితః)

| | | |
|---|---|---|
| గృహస్థుని ప్రధాన ధర్మములు | – | సహజీవులను సేవించడం, భూత దయ తపస్సు, శౌచము, సంతోషము, యజ్ఞము, వ్రతము ఇత్యాదులు |
| | – | పరస్త్రీ వ్యామోహములేనివాడై. మాతృభావన కలిగి వుండాలి. |
| | – | అతడు నియమిత (ఋతుకాలము) నందు మాత్రమే భార్యతో సాంగత్యము కలిగి ఉండడం బ్రహ్మచర్యమే అవుతుంది. |
| బ్రహ్మచారి ప్రధాన ధర్మము | – | గురుసేవ |
| సన్యాసి ప్రధాన ధర్మము | – | శమము (ఇంద్రియ నిగ్రహము), అహింస, తత్త్వచింతన, తత్త్వబోధ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రోత్సహించటం |
| వానప్రస్థుని ప్రధాన ధర్మము | – | తపస్సు, సత్సంగము, భగవత్‌స్తోత్రము. |

ఈ నలుగురు ఆశ్రమవాసులకు 1. ఆత్మజ్ఞాన సముపార్జనము, 2. భగవతోపాసన ఈ రెండు ముఖ్య ధర్మములు అయి ఉన్నాయి.

ఈ విధంగా తమ వర్ణాశ్రమ ధర్మాన్ని అనుసరిస్తూ అనన్య భావనతో, "**నేను పరమాత్మను ఈఈ ధర్మ–కర్మలతో సేవిస్తున్నాను**" అను అవగాహనతో జీవితము అనే అవకాశమును సద్వినియోగపరచుకుంటూ, "**సర్వులయొక్క అంతర్యామిగా నా ప్రియమైన పరమాత్మయే సర్వదా వేంచేసియున్నారు...**" అను అనుభూతిని దృఢపరచుకొనుచుండగా నాపట్ల పరాభక్తి స్వభావసిద్ధంగానే దృఢమౌతుంది. "ఈ బాహ్య–అభ్యంతర జగత్‌కళా విశేషమంతా పరమాత్మయే! నేను కూడా ఆయన యొక్క కళావిశేషమే! కనుక నేను ఆయనకు చెందినవాడినే" ఇటువంటి త్రోవలో నిరంతరంగా ప్రవృద్ధమగుచున్నట్టి అఖండ భక్తిచేత సృష్టి–స్థితి–లయకారకుడను, సర్వలోకేశ్వరుడను, జగత్కారణుడను పరబ్రహ్మమే స్వరూపముగా గలవాడు.... అగు నన్ను పొందుచున్నాడు. " అహమ్ బ్రహ్మాస్మి" – మహావాక్యమును క్రమక్రమంగా స్వతఃసిద్ధంగా అనుభవైకవేద్యం చేసుకుంటున్నాడు. సంసారమునుండి తరిస్తున్నాడు.

ఓ ఉద్ధవా! స్వధర్మము (స్వీయ ఆశ్రమ ధర్మము) అనునది ఈవిధంగా పరమాత్మను చేరటానికి మహత్తరమైన మార్గమై ఉన్నది. స్వధర్మమును ఉపాసనగా భావించి నిర్వర్తించువాడు అంతఃకరణశుద్ధిని సంపాదించుకొని నా ఐశ్వర్యమును తెలుసుకొన్నవాడై, జ్ఞాన-విజ్ఞాన సంపన్నుడై నన్ను తప్పక పొందుతాడు. ధర్మస్వరూపుడనగు నేను స్వ-ఆశ్రమధర్మనిరతులకు సర్వదా తోడుగా వుంటూ వుంటానయ్యా!

మిత్రమా! ఈవిధంగా ఈ సందర్భంలో నీకు వివిధ వర్ణాశ్రమ ధర్మములేమిటో, ఆచార-విచారాదులు ఏవిధంగా ఉంటాయో.... వివరించాను.

**నాయందు భక్తిచే ముక్తి తప్పక లభిస్తుంది!** ఇందులో సందేహమే లేదు.

ధర్మము(సమర్పిత భావముతో నిర్వర్తించబడే స్వ ఆశ్రమ ధర్మము) భక్తిని ప్రవృద్ధం చేసి నన్ను పొందేటట్లు చేయగలదు!

కనుక సర్వ నిరుత్సాహములు త్యజించి స్వ-ఆశ్రమ ధర్మమును శ్రద్ధగా ఆచరించి నాకు సమర్పించి నన్ను పొందటమే గొప్ప ఉపాయమని అందరికి గుర్తుచేస్తున్నాను.

## 26. జ్ఞాన - భక్తి - యోగ విశేషములు

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! అజ్ఞానము తొలగటానికి, ఆత్మజ్ఞానము వికశించటానికి సాధకులకు చతుర్విధ వర్ణాశ్రమ ధర్మాలు వేదవేదాంత శాస్త్రములు చెప్పుచున్నాయి. వాటిలో మరికొన్ని ముఖ్య విషయాలు కొన్ని మనం ఇక్కడ చెప్పుకుందాము.

❑

వర్ణాశ్రమానుసారంగా శ్రద్ధ-భక్తులతో నిర్వర్తిస్తున్న స్వధర్మనిరతి భగవత్ ధ్యానముల యొక్క ప్రభావంచేత జీవుడు ప్రత్యక్ష-పరోక్ష జ్ఞానములను అధిగమించి అపరోక్ష జ్ఞానములో ప్రవేశిస్తున్నాడు. క్రమంగా ఆత్మతత్త్వజ్ఞుడు అగుచూ వేదాంత శాస్త్రముయొక్క పాఠ్యాంశసార శాస్త్రజ్ఞాన సంపన్నుడగుచున్నాడు.

అటుపై,

ఈ ఇంద్రియానుభవమైనట్టి ద్వైతప్రపంచమును, అట్టి ద్వైతానుభవముయొక్క నివృత్తి కొరకై ఆశ్రయించిన ప్రవృత్తి సాధనములను క్రమంగా మాయా కల్పితముగా ఎరుగుచున్నాడు. వాటిని కూడా త్యజించి ఆత్మసాక్షాత్కారం పొంది సర్వేసర్వత్రా ఆత్మగా

ఎరుగుచు, తానే ఆత్మ స్వరూపుడై ఆనందిస్తున్నాడు. ముల్లును ముల్లుతో తొలగించి ... ఆపై రెండు ముల్లులను దూరంగా వదలివేస్తాం కదా! ప్రవృత్తి సాధనములచే ప్రవృత్తి స్వభావం అట్లే అగుచున్నది.

❑

భక్తిచే నన్ను ఆశ్రయిస్తున్నాడు.

భక్తిచే పొందబడేది నన్నే! మద్భావోపపద్యతే ॥

అట్లాగే...,

సర్వకర్మల సాధనఫలములు, స్వర్గాపవర్గములు నేనే! జ్ఞానులు ఏ అంతిమ స్థితిని లక్ష్యముగా కలిగి జ్ఞాన సాధనలచే పొందుచున్నారో, అది నన్నే! అందుచేత జ్ఞానిగాని, భక్తుడుగాని నన్నే కోరుకుంటాడు గాని, మరింకేమీ కోరడు! అనగా జ్ఞాన - విజ్ఞాన సంపన్నులంతా నా చరణారవిందములే శ్రేష్ఠముగా భావిస్తున్నారు.

జ్ఞానియగువాడు జ్ఞానసంపదతో నన్ను పూజించి, నాకు ఎంతో ఇష్టమైనవాడగుచున్నాడు.

కొంచెము తత్త్వజ్ఞానముచే కలుగగల సిద్ధి - అనేక తపో తీర్థ దాన ఇత్యాది అనేక పుణ్యకార్యములచే కూడా లభించదుసుమా! అందుచే ఓ ఉద్ధవా! నీవు జ్ఞానముచే నీ ఆత్మస్వరూపుడనగు నాయొక్క ఔన్నత్యమేమిటో గ్రహించు. జ్ఞాన-విజ్ఞాన (conceptual knowledge-Applied knowledge) ల సహాయంతో భక్తి భావనతో నన్ను ఆరాధించు. సర్వయజ్ఞేశ్వరుడనైన నన్ను పూర్వము మునులెందరో జ్ఞాన-విజ్ఞాన రూపమగు యజ్ఞముచే పూజించి మద్భావన-మత్ స్వరూపము-మత్ స్థానమును సిద్ధింపజేసుకున్నారు.

మిత్రమా! ఉద్ధవా! నిన్ను ఆవరించియున్న ఆధ్యాత్మిక - ఆధి దైవిక - ఆధి భౌతిక వికారములను "మాయామాత్రమే" కదా! అని ఎఱుగుము. ఒకానొకడు ఒక త్రాడును చూచి పాము అని అనుకొని భయపడుచున్నాడనుకో... త్రాడును చూడకముందు పాముయొక్క భావన ఉన్నదా? లేదు. "ఇది త్రాడేకదా!" అని గ్రహించిన తరువాత? పాముయొక్క అనుభూతి మిగిలి ఉంటోందా? లేదుకదా! అట్లాగే... ఈ జగత్తు ఆదిలో లేదు. అంతమున లేదు. మధ్యలో అగుపిస్తోంది. పాము మొదలే లేనట్లే- జగత్తు ఆత్మకు వేరుగా మొదలే లేదు!

| సర్పంజ్జు భ్రాంతి | జగత్ భ్రాంతి |
|---|---|
| భ్రాంతికి ముందు - భ్రాంతి సమయంలోను | భ్రాంతికి ముందు - భ్రాంతి సమయములోను |
| భ్రాంతి తొలగిన తరువాత కూడా అక్కడ ఉన్నది | భ్రాంతి తొలగిన తరువాత కూడా ఇక్కడ ఉన్నది |
| త్రాడు మాత్రమే! సర్పము ఎన్నడూ లేదు | ఆత్మయే! జగత్తు అనబడునది ఎన్నడూలేదు! |

సర్పము ఎన్నడూ లేదు. ఇక, "సర్పము ఎక్కడినుండి వచ్చింది? ఎటు వెళ్ళింది?".... అని ప్రశ్నిస్తే? సమాధానం ఏమున్నది?

ఆత్మయే జగత్తుగా భ్రమదృష్టి (భ్రాంతిచేత) అనిపిస్తోంది. ఇక జగత్తు ఎప్పుడు ఉత్పన్నమైనది? ఎటు ఎప్పుడు పోతోంది? అనే ప్రశ్న ఎక్కడిది?

జనించటం - జీవించటం - మరణించటం ఇత్యాది ధర్మాలు శరీర సంబంధమైనవే గాని ఆత్మ సంబంధమైనవి కాదు. వస్త్రము ధరిస్తే వస్త్రముతోకూడి ఇతరులకు కనిపిస్తాము. కానీ వస్త్రరూపముగా అగుచున్నామా? లేదు.

"శరీరధారణచే శరీరధారుడుగా అగుపిస్తున్నాను. శరీరము నేను ధరించినదేగాని.... శరీరము నేనుకాదు!"

**"నేను ఆత్మస్వరూపుడను! శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందమును....!"**

ఇది గమనించు. ఓ ఉద్ధవా! ఆత్మ స్వరూపడవగు నీకు ఎన్నడూ వినాశనము లేదు.

రజ్జువుయే (త్రాడుయే) సత్యము. సర్పము సత్యము కాదు. కనుక అసత్!

ఆత్మయే సత్యము. దేహము ఇత్యాది వికారాలన్నీ (త్రాడులో పాముగా కనిపించిన వైనమువలె) అసత్!

**ఆత్మకు భిన్నమైనదానికి దేనికీ సత్త లేదు.**

**ఆత్మకు అభిన్నమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు.**

**శ్రీ ఉద్ధవుడు :**

**శ్లో॥ జ్ఞానం విశుద్ధం విపులం యదైతత్**
**వైరాగ్య-విజ్ఞానయుతం పురాణమ్**
**ఆఖ్యాహి విశ్వేశ్వర! విశ్వమూర్తే!**
**త్వద్భక్తి యోగం చ మహద్విమృగ్యమ్॥ (అధ్యా 19, శ్లో 8)**

ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! మరికొంత వివరణతో జ్ఞాన-భక్తి యోగములనబడే ఈ రెండు విషయాలు మరొక్కసారి నాకు బోధించవలసినదిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

1. విశుద్ధము - విపులము - వైరాగ్య విజ్ఞానయుతము అయినటువంటి **జ్ఞానయోగము.**

2. మహనీయులు ఎల్లప్పుడు ఆశ్రయిస్తు - పరిపోషించుకుంటూ - పరిరక్షించుకుంటూ ఉండే **భక్తియోగము.**

ఈ రెండింటి భేదమేమిటి? ఏకత్వమేమిటి?

స్వామీ! ఎప్పటినుంచో తెలియదుగాని, మేము తాపత్రయములతో కూడిన ఘోరమైన సంసార మార్గంలో ఎందుకో చిక్కుకొని ఉన్న బాటసారులం! అమృతము వర్షించే భక్తి-జ్ఞానయుతమైన మీ మనోహరమైన వాక్కులు, మీ పాదపద్మములే మాకు గతి - త్రాణ కూడా! వేరే ఛత్రము మాకు లేదు.

హే మహామహనీయా!

మేము సంసారము అనే నూతిలో చిక్కి కప్పలవలె చిక్కుకుని నిస్సహాయంగా బెకబెకలాడుచున్నము. కాలరూపము అనబడే సర్పముచే కరవబడి ఉన్నాము. క్షుద్రమైన విషయ సుఖములు - అనే తృష్ణచే కాలము అనే కట్టుకొయ్యకు కట్టుబడిపోయి ఉన్నాము. మావంటి బద్ధజీవులకు మోక్ష బోధకములైన మీ వాక్సుధయే దివ్యౌషధం! అందుకని వినిఉన్న దాని గురించే మరొక్కసారి అడుగుచున్నాను.

**శ్రీకృష్ణభగవానుడు :** మిత్రమా! ఉద్ధవా! జ్ఞానయోగము - భక్తియోగముల గురించి ఒక సందర్భంలో ఒక మహానుబావుడు చెప్పిన విశేషాలు చెప్పుతాను విను.

----

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. యుధిష్ఠరుడు (ధర్మరాజు) ఆతరువాత ఎంతో మానసిక వేదన చెందాడు. ఒకరోజు గ్రామ-పట్టణాలలో సంచరిస్తూ - "అయ్యో! నాయొక్క రాజ్యకాంక్ష వల్లనేకదా,.... అనేకమంది మరణించారు! వారి భార్యలు అంతా పోగొట్టుకొని ఇంటిలో రోదిస్తున్నారు! ఇంతమంది బంధువుల మరణానికి నేనేకదా కారణం!" అని దుఃఖించసాగాడు. "నువ్వు కారణమవటమేమిటయ్యా? ఇదంతా ఈశ్వరమాయ..." అని నేను చెప్పినా, ఆయనకు దిగులు - దుఃఖము తొలగలేదు. అప్పుడేం చేయాలి? ఆయన వేదన తొలగేది ఎట్లా? నాకొక ఉపాయం తట్టింది.

"ఓ యుధిష్ఠరా! నీ దుఃఖం తొలగాలంటే ఏదైనా గొప్ప ఉపాయంచేత అజ్ఞానం తొలగాలి. అందుకు ఒకే మార్గం. మహనీయుల సత్సాంగత్యం. పద మహాజ్ఞాని-భక్తమహాశయుడు అగు పితామహుడు శ్రీ భీష్ములవారి వద్దకు వెళ్దాం! వారి వాగమృతమే మనందరికి దివ్యౌషధం..." అని చెప్పాను. అక్కడున్న భీమ- అర్జున-నకుల-సహదేవులు, తదితరులు, "అవును! శ్రీకృష్ణ వాక్యంతు కర్తవ్యం! తాతగారు భీష్మమహాశయుల భక్తి-జ్ఞాన పార్శ్యాంశాలే మనకు ఇప్పుడు దివ్యౌషధం" అని పలికారు.

అందరము కలసి యుద్ధభూమిలో ఒకానొకచోట అంపశయ్యపై పవళించియున్న మహాత్ములగు శ్రీభీష్ములవారిని సమీపించాము.

అప్పుడు భీష్మపితామహులవారు అనేక ధర్మ సూక్ష్మ విశేషాలు చెప్పుతూ - చెప్పుతూ, చివరికి సర్వ శాస్త్ర సార విశేషమైనట్టి మోక్షధర్మము గురించి ప్రవచించారు. అది జ్ఞాన-విజ్ఞాన-వైరాగ్య విశేషాలతో కూడిన మహత్తర అనుభవపూర్వక మహావాక్యాలు, భావాలు కలిగియున్నట్టిది. ఆయన చెప్పిన వాక్యసారాంశము కొంత ఇప్పుడు చెప్పుచున్నాను. విను.

❑ ❑ ❑

**ఆత్మజ్ఞానము :** సృష్టికర్తయగు బ్రహ్మదేవునినుండి - కదలకుండా కనిపించే రాయివంటి స్థావరముల వరకు (ఆబ్రహ్మ స్థంభ పర్యంతము) ఇదంతా కార్యరూపము అంటారు.

అనగా.... (దృష్టాంతానికి)......

మట్టితో కొన్ని బొమ్మలు (రాజు-మంత్రి-సైనికుడు-గుఱ్ఱము-ఏనుగు మొదలైనవి) తయారు చేసారనుకుందాం.

మట్టి **కారణరూపము** అంటారు.

బొమ్మలు వాటివాటి కథ-కమామీషు **కార్యరూపముగా** అనుకో!

ఇప్పుడు

కార్యరూపము - కారణరూపముగా గమనిస్తే.... ఇదంతా సర్వదా శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందమే! మట్టి బొమ్మలలో మట్టియే సత్యము కదా!

**కార్యరూపము :**

1. పురుషుడు (Indvidual experiencer)
2. ప్రకృతి (Nature స్వభావము)
3. మహత్తత్వము (Multi presentation అనేకముగా కనిపించటం)
4. **అహంకారము :** (నేను-నేను అనిపించటం)

**5-9 పంచతన్మాత్రలు:** శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలు

**10.-20 ఏకాదశ ఇంద్రియములు** : కళ్ళు, చెవులు - కాళ్ళు - చేతులు - ముక్కు - నాలుక - చర్మము - గుహ్యము - గుద - మనస్సు - బుద్ధి - జ్ఞప్తి అనుభూతి

**21-25 పంచభూతములు :**

| | |
|---|---|
| స్థూలము | (Solid - భూమి) |
| ద్రవము | (Liquid - జలము) |
| అగ్ని | (Fire-Heat - అగ్ని) |
| వాయువు | (Vapour - Air) |
| స్థలము | (Placement - ఆకాశము) |

- 26-28 గుణత్రయము - సత్వగుణము, రజోగుణము, తమోగుణము

ఇవన్నీ 28 తత్వములుగా వేరువేరుగా వేరువేరు ధర్మములతో కనిపిస్తున్నాయి కదా! ఇవన్నీ కార్యరూపములు.

ఇవన్నీ వేరువేరుగా అగుపిస్తున్నప్పటికీ వీటియొక్క మూల పదార్థము (The main material all these made up of) పరమాత్మయే! అట్టి భిన్నత్వములో ఏకత్వమే అయినట్టి (unity in the Diversity) పరమాత్మతత్త్వమును నిర్వచించి చెప్పు జ్ఞానమే ఆత్మజ్ఞానము!

**విజ్ఞానము :**

ఎవ్వరికైతే పూర్వమున ఉన్నవి - ఇప్పుడు కనిపిస్తున్నవి - ఇవన్నీ వేరువేరుగా కాకుండా - సర్వము పరమాత్మ స్వరూపముగా అనిపిస్తుందో, అట్టి స్థితి - స్థానమే విజ్ఞానము అనే శబ్దముతో చెప్పబడుతోంది. రూపముల-నామముల-ధర్మముల దృష్టిచే **అనేకంగా**

**కనిపిస్తున్నప్పటికీ, ... ఒక్కటిగా అనిపించటమే** విజ్ఞానము. "సృష్టిగా–స్థితిగా–లయముగా–అప్రమేయముగా, అద్వితీయముగా కనిపించేదంతా మమాత్మయే!–నేనే" అని ఆస్వాదించబడుచుండటమే విజ్ఞానము!

ఏదైతే...,

- సృష్టి–ప్రళయముల సందర్భాలలో కారణరూపంగాను,
- స్థితి కాలంలో సర్వము ఆశ్రయించి ఉన్నట్టి... ఆశ్రయరూపంగాను,(కార్యరూపంగాను)
- ఒక కార్యమునుండి మరొక కార్యమునకై నిరంతరం ప్రయాణిస్తున్న అప్రమేయరూపంగాను (ఉదాహరణకు జాగ్రత్‌లోంచి స్వప్నంలోకి – స్వప్నంలోంచి సుషుప్తికి, సుషుప్తినుండి స్వప్నమునకు – ఆమూడు తనవై ప్రయాణిస్తూ – తాను మాత్రం యధాతథంగా ఏర్పడి ఉన్న సర్వుల స్వస్వరూపంగాను....)
- అంతా లయించినప్పుడు కూడా అప్పటికీ శేషించి ఉన్నదిగాను,

.... **ప్రకాశిస్తోందో... అదియే సత్త–సత్–ఆది–పరతత్త్వము–తురీయము**! అదియే ఓంకారము...గా కూడా చెప్పబడుతోంది!

అదియే సత్త! (Existant) తదితరమైనదంతా అసత్త! (Non-Existant) ఈ జగత్తు సందర్భరూపంగా అసత్తు. సహజరూపంగా బ్రహ్మమే!

జీవుడు ఆ సత్ వస్తువుగురించి, అద్దానితో తనకుగల అభేదత్వము, అద్వితీయత్వము, తనయొక్క నిర్వికల్పము, అవాక్‌మానస గోచరత్వము గురించి ఎఱుగటమే విజ్ఞానము.

❑ ❑ ❑

ఇక దృశ్యమంటావా... ఇదంతా స్వప్నసదృశం మాత్రమే! కలలోని సంఘటనల గురించి మెళుకువ వచ్చిన తరువాత దుఃఖించటంలో అర్థమేముంటుంది?

చూచావా ఉద్ధవా! ఎదురుగా ప్రత్యక్షంగా ఈ నామ–రూప జగత్తు (ఇంద్రియములకు అగుపిస్తోంది. అయితే, ఇదంతా అసత్తు. దీనికి ఆవల (పరము)గా ఉన్న పరమాత్మ తత్త్వమే సత్యము. సత్తుకూడా! మూలతత్త్వము! బ్రహ్మము! కనుక సందర్భ సత్యమగు నామ రూప జగత్తును దాటి సహజసత్యమగు, బ్రహ్మమును ఆలంబన చేసుకో!

**ఉద్ధవుడు :** 1. ఎదురుగా ఘనీభూతమై కనిపిస్తున్న దృశ్య–భావనా జగత్తు 2. పుణ్య కర్మఫలములుగా చెప్పబడుచూ – కొందరిచే జీవిత లక్ష్యములుగా భావించబడే స్వర్గము

మొదలైన సుఖమయ లోకములు... ఇవన్నీ అసత్తే అని, కేవలము కాలబద్ధమని తేల్చి చెప్పుచున్నారు కదా! ఈ వాక్యము ఆత్మవిద్యను బోధించే గురువుల మొదటి వాక్యముగా మేము విన్నాము. వింటూనే ఉన్నాము.

అయితే...,

ఈ ఎదురుగా అగుపించేదంతా మాకు దుఃఖభరితంగాను, అనుల్లంఘ్యమైనట్టి సంసార సముద్రముగాను, అనేక జన్మల కర్మార్జిత బంధంగాను అనిపిస్తోందేగాని,...

- ఇదంతా సందర్భరూపంగా అసత్తు!
- సహజరూపంగా చూస్తే ఆత్మయే!

అని ఏమాత్రం అనిపించటమేలేదు!

ఎవ్వరో మాయందు అనురక్తిని కల్పించి మమ్ములను ఈ దృశ్యమునకు, జన్మ-కర్మలకు బద్ధునిగా చేసి ఉంచుచున్నట్లుగా అప్పుడప్పుడు అనిపిస్తోంది!

సంసార సాగరము అనబడే మా ఈ దృశ్యసత్తాధ్యాస తొలగేది ఎట్లా?

**శ్రీకృష్ణభగవానుడు :** ఔను! "నతు సత్యమిహ అణ్వపి" అని విబుధులు, ఆత్మకోవిదులు ఎలుగెత్తి, తట్టి చెప్పుచున్నప్పటికీ, "ఇదంతా నాకు బంధము!..." అనే భ్రమ అనేకమంది జీవులపట్ల తొలగటం లేదు! "ఈ కనబడేదంతా మమాత్మ స్వరూపమే! నేనే! నా కళా విన్యాసమే!..." అనే ఆత్మజ్ఞాన విజ్ఞానోదయం కావటంలేదు.

ఇందుకు ఔషధంగా నాలుగు ప్రమాణాలు విజ్ఞులచే చెప్పబడుచున్నాయి.

**1. శ్రుతి ప్రమాణము :** వేద-ఉపనిషత్తులు మహావాక్యాలు ప్రసాదిస్తున్నాయి.

| | |
|---|---|
| తత్ త్వమ్! | అదియే నీవుగా కనిపిస్తోంది |
| జీవోఽబ్రహ్మైఽతి నాపరః! | జీవుడుగా నాకు కనిపిస్తున్నది బ్రహ్మమే! |
| అయమాత్మా బ్రహ్మ! | జీవాత్మయే పరబ్రహ్మము! |
| అహమాదిర్హి! | అన్నిటికీ మొదలే నేనున్నాను! |
| సోఽహమ్! | నేను పరమాత్మ స్వరూపుడనే! |
| త్వమేవాఽ హమ్! | నీవుగా కనిపించేదంతా నేనే! |
| అహమ్ సర్వస్య ప్రభవో! | అన్నిటినీ ప్రభవింపజేస్తున్నది నేనే! |

మత్తఃపరతరమ్ న అన్యత్ కించిదస్తి! నాకు వేరైనదంటూ ఎక్కడా ఏదీ లేదు!

ఇత్యాది శ్రుతి – స్మృత మహావాక్యాల అర్థము విచారణచేస్తే, గురుముఖతః వింటే స్వస్వరూపమగు ఆత్మయొక్క ఔన్నత్యం గ్రహించబడుచుండగా ఈ దృశ్యానుభవముయొక్క స్వాప్నికత, దీనికి ఆధారమైన అనన్యపరతత్త్వము – మహదత్వము విశదీకరణమౌతోంది. **ఇది శాస్త్ర ప్రమాణము!**

**2. ప్రత్యక్ష ప్రమాణము :** ఇంద్రియములకు గోచరమయ్యేది!

– శాశ్వతమా?

– సత్యమా?

– మనోకల్పనయేనా?

ఒక సందర్భము – సంఘటన అజ్ఞులు ఎట్లా చూస్తున్నారు? ఆ అజ్ఞాని విజ్ఞానమును సంపాదించుకొని అటుపై చూస్తే.... వాటి వాటి నిర్వచనాలు ఏవిధంగా ఉంటున్నాయి?

చూడబడేదంతా

చూచేవాడియొక్క మనోచమత్కారమేనా?

చూచేవాడిని చూచేవాడు (One who is perceiving the own perceiver of the world) అనబడే ఆత్మ ప్రమేయమా? (Is it bounded and related to what is being seen?) అప్రమేయమా? (is it beyond and unrelated)

ఇటువంటి ప్రత్యక్షముయొక్క విచారణచే ప్రత్యక్షము–పరోక్షము కూడా కానట్టి **అపరోక్షజ్ఞానము** ఉదయిస్తోంది. ఆత్మయే అంతటా సాక్షాత్కారమై అభిన్నమై అనుభూతమౌతోంది! ఈ మార్గమునే ప్రత్యక్షప్రమాణము అని అంటారు.

**3. ఐతిహ్య ప్రమాణము :** నాకు అనుభూతమైయ్యేదంతా ఆయా తీరుగా సత్యమా? కాదా?.... అని అనుమానం వచ్చినప్పుడు ఈ జీవుడు ఏం చేయాలి? విజ్ఞులను మహనీయులను ఆశ్రయించాలి. వారి అనుభవమును – నిర్ణయములను ప్రమాణంగా తీసుకోవాలి కదా! అట్టి మహనీయుల చరిత్రలు – ప్రవచనములు – అంతిమసార వాక్యములు – అభిప్రాయములను ఇతిహాసములుగా గ్రంథస్తమైనాయి. అట్టి (రామాయణ–భారత–భాగవతాది) ఇతిహాసములు ముముక్షువులకు ప్రమాణములై అంతిమసత్యమును సాక్షాత్కరింపజేస్తున్నాయి. (శ్రీవసిష్ఠవిరచిత యోగ వాసిష్ఠం, బ్రహ్మ సూత్రములు... ఇత్యాదివి అందుకు ప్రమాణములు).

**4. అనుమానము–గూరువుల అనుభవ వాక్య ప్రమాణము :** స్వకీయమైన పరిశీలన – విశ్లేషణయే చివరికి జీవునికి ఆత్మ జ్ఞానమును – ఆత్మదర్శనమును – ఆత్మానుభూతిని – ఆత్మానందమును ప్రసాదించగలవు.

(శ్రుతి – ప్రత్యక్షము – ఐతిహ్యము /ఇతిహాసములు) – గురువులు స్వకీయమైన విచారణకు తోడగుచున్నాయి. మార్గదర్శకమౌతున్నాయి.

**శ్లో॥ శ్రుతిః ప్రత్యక్షమ్ ఐతిహ్యమ్ అనుమానం చతుష్టయమ్**
**ప్రమాణేషు అనవస్థానాత్ వికల్పాత్ స విరజ్యతే॥ (అధ్యా 19, శ్లో 17)**

పైన చెప్పబడుచున్న 4 ప్రమాణముల సహాయంతో జీవుడు దృశ్యముపట్ల క్రమంగా విరక్తుడై, ఆత్మసందర్శనము పట్ల అనురక్తుడగుచున్నాడు.

ఇక ఇహ–పరములైన సంపద–స్వర్గాదిఫలముల సంగతేమిటంటావా?

యజ్ఞాదులవలన లభించగల స్వర్గలోకనివాసము ఇత్యాది ప్రత్యక్ష విషయ సుఖములన్నీ

- నశ్వరములు (అశాశ్వతము - Time Bound)
- దుఃఖకరములు (Worries do continue)
- అమంగళములు (Does not lead to true welfare)

అని మునుముందుగానే గ్రహించినవారై ఉంటున్నారు.

## 27. భక్తియోగ సాధనములు

**శ్రీ ఉద్ధవుడు :** మహాత్మా! సద్గురూ! శ్రీకృష్ణా! ఇప్పుడు నాకు భక్తియోగ సాధనల గురించి చెప్పండి.

**శ్రీకృష్ణుడు :** ఓ ఉద్ధవా! నాకు ప్రియమానుడవగు నీకు భక్తియోగం గురించి ఇతఃపూర్వమే చెప్పియున్నానుకదా! ఇప్పుడు నీకు భక్తియోగ సాధనల గురించి కూడా కొన్ని విశేషాలు చెప్పుచున్నాను. విను.

### నాపట్ల భక్తి ప్రవృద్ధం కావాలంటే త్రోవలు.

**1. కథాశ్రవణం :** అమృతమయములైనట్టి నా అవతార కథలను వినటం.

**2. సంకీర్తనం – స్తవనం :** నిరంతరం నా గుణములను, లీలలను, నామములను సంకీర్తించటం, గానం చేయటం, నామస్మరణ చేయటం, స్తోత్రములతో స్తుతించటం.

**3. పూజ :** పుష్పాదులతోను, ఇంద్రియములతోను నన్ను పూజించుటయందు నిష్ఠకలిగి ఉండటం.

**4. సేవ :** భగవత్ సంబంధమైన సేవలు, సహజీవుల రూపాలుగా ఉన్నట్టి నా ప్రత్యక్ష రూపములను సేవాభావంతో ఉపాసించటం.

**5. ప్రణామము :** ఎనిమిది అంగములతో సాష్టాంగ దండ ప్రణామములు సమర్పించటం (సర్వాంగైరభివందనం)

**6. మద్భక్తపూజ :** నా భక్తులను సేవించటం. పూజించటం, సన్మానించటం, వారి మనస్సులకు ఆహ్లాదం కలిగించటం.

**7. సర్వభూతేషు మన్మతిః :** సర్వ ప్రాణులలోను - సర్వప్రాణులుగాను నన్నే చూచే బుద్ధిని పెంపొందించుకోవటం.

**8. మదర్థేషు అంగచేష్టా :** శరీరముతో చేస్తున్న సర్వకార్యములు నన్ను ఉద్దేశ్యించియే నిర్వర్తించటం. స్వధర్మములను భగవత్ సేవాభావంగా ఉద్దేశ్యించి నిర్వర్తించటం!

**9. వచసామద్గుణేరణమ్ :** ఈ ప్రకృతికి రచయితనయిన నా అవతారముల గుణవిశేషములనే కీర్తించటం, వాక్కుతో గానం చేయటం, వర్ణించటం.

**10. మయ్యర్పణంచ మనసః :** తన మనస్సును - మనోభావాలను సర్వాత్మకుడు-సర్వతతత్త్వ స్వరూపుడు అగు నాకు సమర్పించటం. "మనస్సు పరమాత్మయొక్క సొత్తేగాని నాది కాదు".... అని భావించటముద్వారా సమర్పించటం.

**11. సర్వకామ వివర్జితమ్ :** దృశ్యములో ఏదో లభిస్తేకాని - మరేవో స్థితిగతులచేతగాని నాకు ఆనందం కలుగదేమో!... అనేరూపమైన సర్వకామములు **వదలి** ఉండటం విసర్జించటం, పరిత్యజించటం.

**12. మదర్థే-అర్థపరిత్యాగో-భోగస్యచ-సుఖస్యచ :** ఓ పరమాత్మా! నావి అనిపించే ఈ ధనములు-భోగములు-సహ జనులు ఇవన్నీ నావి కావయ్యా! నీవి! - అని సమర్పణ భావంతో భోగత్యాగభావంతో జీవిస్తూ ఉండటం.

**13. ఇష్టందత్తం హుతం జప్తం మదర్థం :** యజ్ఞము - దానము - హోమము - జపము ఇవన్నీ నాకొరకై నిర్వర్తించటం.

**13. మదర్థం మద్వ్రతం - తపః :** పరాత్పరస్వరూపుడైన నన్ను చేరటానికై వ్రతములు - తపస్సు నిర్వర్తించటం.

ఓ ఉద్ధవా! ఇప్పుడు మనం చెప్పుకున్న ఈ ఈ ధర్మములను పాటిస్తూ, ఆత్మనివేదన నిర్వర్తిస్తూ ఉన్నవాని హృదయంలో పరాభక్తి ఉదయించి బాలచంద్రునివలె ప్రకాశిస్తుంది. ఇక ఆతనికి 14 లోకాలలో లభించనిదంటూ ఏదీ ఉండదు. (కో అన్యో అర్థో అస్య అవశిష్యతే? (What is that he shall not get?) పరమాత్మరూపుడైన నాకు సత్వ గుణసంపన్నము - శాంతము అగు తన చిత్తమును ఎవ్వడు సమర్పిస్తాడో అట్టివానికి - ధర్మ-జ్ఞాన-వైరాగ్యయుక్తమైన ఐశ్వర్యములు స్వభావసిద్ధంగానే నాచే ప్రసాదించ బడతాయి.

❑ ❑ ❑

**రజోగుణయుక్తమైన మనస్సు :** ఎవ్వరి మనస్సైతే

- దేహములు - ఇళ్ళు - నామరూపములు ఇత్యాది దృశ్యాది విషయములందు లగ్నమగుచూ...,
- ఇంద్రియములవెంట పరుగులు తీస్తూ....
- ఇంద్రియ విషయములపట్ల ఆవేశము - ఆకర్షణ - ఆలోచన - ఆభావన మొదలైనవాటిని కొనసాగిస్తూ...
- రజోగుణయుక్తమై....,

అసత్తు - అసద్వస్తు - అయివున్న ప్రాపంచక సంఘటన-సందర్భములందు లగ్నమై ఉంటుందో....

అటువంటి మనస్సు

అధర్మమునకు...

అజ్ఞానమునకు....,

మోహమునకు ....,

భ్రమ - విభ్రమములకు....,

ఆవేశ - కావేశములకు,

రాగ - ద్వేషములకు ఆలవాలమై, నిలయమై ఉంటోంది. అందుచేత ఓ ఉద్ధవా!

**ధర్మము :** ఏఏ ఉద్దేశ్యములు - ప్రయత్నములు నాయందు భక్తిని పెంపొందింపజేస్తుందో

అదియే **ధర్మము** గా చెప్పబడుతోంది. **ధర్మో మద్భక్తి-కృత్ ప్రోక్తో**

**జ్ఞానము** - ఏఏ అవగాహనలు - సమాచారములు - పాఠ్యాంశములు - గురుబోధలు మొదలైనవి అంతటా ఒకే పరమాత్మను సందర్శించటం(seeing unity in diversity , సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్) అభ్యసింపజేస్తూ ఉన్నాయో- అదియే **జ్ఞానము** గా చెప్పబడుతోంది. **జ్ఞానం చ ఏకాత్మ్య దర్శనమ్**

**అసంగము** - త్రిగుణ జగత్తైనట్టి ఈ దృశ్యమునకు సంబంధించినంత వరకు గుణత్రయములపట్ల విరాగము కలిగి సర్వగుణములకు కేవలసాక్షినగు నాపట్ల మాత్రమే ధ్యాస - అనురాగము పెంపొందించుకోవటం. **గుణేషు అసంగో వైరాగ్యమ్!**

**మహదాశయము** -లౌకికలాభాలాభముల పట్ల - అణిమ - గరిమ - ఇత్యాది సిద్ధులపట్ల విరాగులై ఉండటం. ఆత్మ భావనను సిద్ధించుకునే లక్ష్యము మాత్రమే కలిగి ఉండటం.

ఇవి సాధనలుగా స్వీకరించబడుగాక!

----

**శ్రీ ఉద్ధవుడు :** స్వామి! సందర్భము వచ్చింది గనుక అడుగుచున్నాను.

- యమము - నియమము అనగానేమి? ఎన్నివిధములైనవి?
- శమము దమము - తితిక్ష - ధృతి అనగా ఏమిటి?
- దానము - తపస్సు - శౌర్యము - సత్యము - ఋతము - త్యాగము - ఇష్టము - ధనము - యజ్ఞము - దక్షిణ వీటిగురించి కూడా దయయుంచి వివరించ ప్రార్థన! అంతే కాకుండా
- ఈ జీవునికి ఏది బలము? దయ అనగా? లాభము ఏది? దేనిని ఉత్తమ విద్య - అంటారు? లజ్జ-శ్రీ-సుఖదుఃఖములు వీటి కార్య - కారణ స్వభావాలు ఏమిటి?
- పండిత లక్షణములు ఎట్టివి?
- మూర్ఖుడు ఎవ్వడు?

- సన్మార్గమేమిటి? దుర్మార్గమేమిటి?
- స్వర్గ నరకములు అనగా?
- బంధువులు – గృహము – ధనవంతుడు – నిర్ధనుడు – కృపణుడు – ఈశ్వరుడు అని ఎవరెవరిని అంటారు?

ఈ ప్రశ్నలకు సమాధానములు, తదితర వ్యతిరిక్తములు కూడా ఏమిటో మీరు చెప్పగా వినాలని నా మనవి!

**శ్రీకృష్ణుడు :** ఓహో! ఉద్ధవా! చాలా ప్రశ్నలు ఒక్కసారిగా సంధిస్తున్నావే! మంచిదేనయ్యా! సరేఁ! కొన్ని విశేషాలు క్లుప్తంగా సమాధానంగా చెప్పుచున్నాను. విను.

**1. యమము :**

**1. అహింస** - Non-violence, Non troublling others - Either Physically or mentally ఇతరులపట్ల అవ్యాజమైన ప్రేమ వృద్ధి పొందితే మాత్రమే ఇది సాధ్యము.

**2. సత్యము** – యమ్ సత్ – సత్‌పై ధ్యాస – అసత్‌పై ఉదాసీనత. (Attention towards original and absolute truth)

**3. అస్తేయము** – తనదికానిది – తనదిగా కావాలనుకొనే దొంగబుద్ధి లేకపోవటం. ఓయీ జీవుడా! ఈ జగత్తులో ఏదీ నీది కాదు. ఇక లోభము–మోహము–మాత్సర్యము ఎందుకు?

**4. అసంగము** – దేనిపట్లా సంగము లేకుండటం. (Non-attachment)

**5. హ్రీ** - నాకంటే గొప్పవారు ఎందరు లేరు? అని సిగ్గుతో ఉండటం. (Feel shy for your mistakes and tolerence towards other's mistakes)

**6. అసంచయము** – దృశ్యముతో తన్మయం కాకపోవటం. Keepign away. Main taining beyondness

**7. ఆస్తిక్యము** – ఈ దృశ్యమునకు ఆధారమై ఒకానొక పరతత్త్వము అన్నిటికీ కారణమై ఉన్నది – అని గమనించి ఉండటం. (Respect towards divinity which is the Author and Owner of all that is being seen).

**8. బ్రహ్మచర్యము** – లౌకిక పాంచభౌతిక జగత్ భావములను ఉపశమింపజేస్తూ – అధిగమిస్తూ ..., ఇదంతా పారలౌకికమగు పరబ్రహ్మమే కదా అను భావనలయందు ప్రవేశించటం – చరించటం.

బ్రహ్మము గురించిన పఠనము – మననము – హృదయస్థం చేసుకోవటం – తత్‌దర్శనము.

- To Keep withdrawing from (or) keep going beyond senses of the world.

- To begin to interpret all this being sean as 'Brahmam - Divinity' .

- To keep on following along with it.

**9. మౌనము** – సర్వ జగద్విషయములపట్ల అతీతత్వభావనచే ప్రశాంతదృష్టితో నిస్పర్ధులై ఉండటం. (Silently and pleasently witnessing all this without conflict)

**10. స్థైర్యము** – "బ్రహ్మమే ఇదంతా కదా" – అనే స్థిరభావం వదలకపోవటం. బ్రహ్మవలోకధిషణం నజహాతి. (Couragious in divine convictions).

**11. క్షమ** – ఓర్పు! పోనీలే... అనే క్షమించే గుణం. తల్లికి తప్పే కనిపించదు కదా! అటువంటి మాతృవాత్సల్యం కలిగి ఉండటం.

**12. అభయము** – భయపడక – బుద్ధితో ధైర్యము వహించి ఉండటం. (Why should I fear when Lord Krishna is in me as me and as this world?)

ఈ పంద్రెండు యమములు అని అధ్యాత్మ శాస్త్రముచే విడమర్చి చెప్పబడుచున్నాయి.

## 2. నియమము

**1. బాహ్య శౌచము** – తదితరులతో ప్రవర్తిస్తున్నప్పుడు శుచి అయిన (ప్రేమ–సహకారము–క్షమ ఇత్యాది) భావాలు ప్రదర్శించటం.

(Positive behaviour and Responses)

**2. అభ్యంతర శౌచము** - హృదయంలోను - మనస్సులోను శుచి అయిన భావాలు - అభిప్రాయాలు - గుణాలు పెంపొందించుకొంటూ పరిపోషించుకోవటం."వారు అట్టివారు. వీరు ఇట్టివారు".. ఇత్యాదులు త్యజించటం. భౌతిక సంఘటనలకు, స్వభావాలను చూచి కోపము-ద్వేషము పొందకపోవటం Positive inside the Heart)

**3. జపము** - భగవంతుని అవతారమూర్తుల - గురువుల నామరూపములు జపించటం, ఉపాశించటం!

**4. తపము** - తపనయే తపస్సు. పరమాత్మ పాదాలు - సన్నిధికి మనోబుద్ధులను చేర్చాలనే తపన కలిగి ఉండటం

**5. హోమము** - వేదవిధానాలైన అగ్నోపాసన

**6. శ్రద్ధ** - నియమిత కర్మలపట్ల - భగవత్ సాధనములపట్ల బుద్ధిని మరీ మరీ నియమించటం.

**7. ఆతిథ్యము** - తదితరులను పరమాత్మయొక్క ప్రత్యక్ష రూపములుగా భావించి సేవాభావం కలిగి ఉండటం

**8. అర్చన** - పరమాత్మను అర్చించటం. పూజించటం, కృతజ్ఞతలు పలకటం. ఉపాసించటం. ఆరాధించటం.

**9. తీర్థాటనము** - తీర్థప్రదేశములను - ఆశ్రమములను - గురువాసములను సందర్శించటం. మ్రొక్కటం.

**10. పరార్థసేవ** - "పరోపకారార్థమ్ - ఇదమ్ శరీరమ్" అనేది జ్ఞాపకముంచుకొని "లోకాన్ సమస్తాన్ సుఖినోభవంతు" అను భావనచే ఇతరులకు హితైషులై ఉండటం

**11. సంతుష్టి** - లభిస్తున్నదానికి దైవమునకు కృతజ్ఞులై ఉండటం లభించని దానిగురించి ఊసురోమని కాలాన్ని వృధా చేసుకోకపోవటం. "నారు పోసినవాడు నీరు పోయక మానుతాడా?" అని నమ్మి ఉండటం.

12. **గురుసేవ** – ఆత్మజ్ఞులను – మహనీయులను – గురువులను సమీపిస్తూ "వీరికి నేను ఏవిధమైన సేవ అందించగలను!".... అనే భావము – శ్రద్ధ!

ఈ 12 నియమములు అని చెప్పబడుచున్నాయి.

----

## ఇంకా మరికొన్ని నిర్వచనాలు విను.

| | |
|---|---|
| **శమము** –<br>శమో మన్నిష్ఠతా బుద్ధేః | బుద్ధిని పరమాత్మయందు లగ్నము చేయటం. |
| **దమము** –<br>దమ ఇంద్రియ సంయమః! | ఇంద్రియములను నిగ్రహించటం. ఇంద్రియ విషయముల పట్ల అభినివేశము లేకుండటం, ఇంద్రియములను పరమాత్మ సేవాభావంతో నియమించటం. |
| **తితిక్ష** –<br>తితిక్షా దుఃఖ సంమర్షో | దుఃఖములు – కష్టములు సందర్భపడుచున్నప్పుడు – "ఆc! ఇటువంటి కష్టాలు ఎంతమందికి లేవు! నాకన్నా ఎక్కువ కష్టాలు పడుచున్నవారు ఎంతమంది లేరు?".. అన్న అవగాహనతో ఓర్పువహించటం. "ఓర్పు నేర్చుకోవటానికే కష్టాలు..." అనే ప్రజ్ఞతో కూడిన అవగాహన పెంపొందించుకోవటం. నేర్పుతో ఓర్పు కలిగి ఉండటం. |
| **ధృతి/ధైర్యము** –<br>జిహ్వా-ఉపస్థ జయో ధృతిః | నోటిని – జననేంద్రియములను అదుపులో ఉంచుకోవటం. వాటిని జయించటము. |
| **దానము** –<br>దండన్యాసః<br>పరం దానం | ఇతరులకు ద్రోహం చేయకుండా-కష్టపెట్టకుండా ఉండటము. వారి కష్టాలు తొలగించే ప్రయత్నం. వారిని సంతోషింపచేయటం. |
| **తపస్సు** –<br>కామత్యాగః తపః స్మృతమ్ | కోరికలను త్యజిస్తూ ఉండటము. |

| | |
|---|---|
| **శౌర్యము** -<br>స్వభావ విజయః శౌర్యం | వాసనలను జయిస్తూ ఉండటము.<br>స్వభావాన్ని అధిగమించి స్వా-భావాన్ని ఆశ్రయించటం. |
| **సత్యము** -<br>సత్యం చ సమ దర్శనమ్ | (యమ్ సత్) - బ్రహ్మమునకు సంబంధించిన విచారణ<br>సమదర్శనమే సత్యము - సత్యవ్రతము. |
| **ఋతము** -<br>ఋతం చ సూనృతా వాణీ | సత్యము - ప్రియముతో కూడిన వాక్కు - ఋతము<br>పరమసత్యమును ప్రకటించే వాక్యాలే సూనృతవాణి. |
| **శౌచము** -<br>కర్మసు అసంగమః శౌచం | లౌకిక కర్మలయందు అనాసక్తులై ఉండటం. |
| **సన్యాసము** -<br>త్యాగః సన్యాస ఉచ్యతే | కోరికలను త్యజిస్తూ ఉండటం. త్యాగ భావము. |
| **ధర్మము - ధనము** -<br>ధర్మం ఇష్టం ధనమ్<br>నృణామ్ | ధర్మమే నిజమైన ప్రీతిపూర్వకమైన ధనము. (ధర్మో రక్షతి<br>రక్షితః) లోకక్షేమం కొరకు ధర్మము. |
| **యజ్ఞము** -<br>యజ్ఞోఽహం భగవత్తమః | పరమాత్మనగు నేను యజ్ఞపురుషుడను. యజ్ఞకర్తను.<br>యజ్ఞ ఫలస్వరూపుడను. యజ్ఞస్వరూపుడను. |
| **దక్షిణ** -<br>దక్షిణా జ్ఞానసందేశం | ఆత్మజ్ఞానమును పఠించడం, నేర్పటం, ఉపదేశించటం.<br>ఇదియే దక్షిణ. |
| **బలము** -<br>ప్రాణాయామం పరం బలమ్ | ప్రాణాయామం ఆధ్యాత్మిక మార్గంలో శ్రేష్టమైన బలము. |
| **భగము** -<br>భగో మే ఐశ్వరో భావో | పరమాత్మయొక్క ఐశ్వర్యము. ఈ జగత్తంతా<br>పరమాత్మయొక్క ఐశ్వర్యమే! 14 లోకాలు - జీవులు<br>అంతాకూడా నా ఐశ్వర్యమే! ప్రతి ఒక్కరు నారూపమే!<br>నావారే! నేను ఆ పరమాత్మయొక్క ఐశ్వర్యమునే! |
| **లాభము** -<br>లాభో మద్భక్తిరుత్తమః | భక్తియొక్క ప్రవృద్ధియే లాభము.<br>భక్తియొక్క ఉన్నతియే జీవితాశయం! |

| | |
|---|---|
| **విద్య** –<br>విద్యాఽఽత్మని భిదా బాధో | జీవుడే ఈశ్వరుడు. జీవుడే పరమాత్మ అను అఖండ–అభిన్న–అద్వితీయ తత్త్వమును బోధించు శబ్దాలు – వాక్యాలు – వాక్యార్థాలు–పాఠ్యాంశాలు – భేదములన్నిటినీ బోధించునదే విద్య! |
| **హ్రీ** –<br>జుగుప్సా హ్రీర కర్మసు | చెయ్యకూడని వికర్మలయందు / పట్ల హేయత్వము (I should not do. Let me not do. I feel shy to keep on doing wrong things) అనుదానిని<br>లజ్జ–సిగ్గు అని హ్రీ అని చెప్పబడుతోంది. |
| **శ్రీర్గుణాః** –<br>శ్రీర్గుణా నైరపేక్ష్యాద్యాః | దృశ్యములో కనిపించే దేనిపట్లా కూడా అపేక్షలేనివాడై – నిరపేక్షుడై ఉండటం. కావాలనిగాని – అఖర్లేదనిగాని ఆవేశపడక పోవటం |
| **సుఖము**<br>సుఖం దుఃఖ సుఖాత్యయః | సుఖ–దుఃఖములను అతిక్రమించి ఉండటమే నిజమైన సుఖము |
| **దుఃఖము** –<br>దుఃఖం కామ సుఖాపేక్షా | నాకు విషయభోగములు–లోక సంబంధమైన సుఖములు లభించాలి. కావాలి – అని అనుకోవటమే దుఃఖము. |
| **పండితుడు** –<br>పండితో బంధ–మోక్ష విత్ | దేనివలన బంధము – ఏది బంధము, దేనివలన మోక్షము – ఏది మోక్షము–ఈ తతత్త్వము ఎఱిగినవాడు పండితుడు. |
| **మూర్ఖుడు** –<br>మూర్ఖోదేహాద్యహం బుద్ధిః | ఈ శరీరము – ఆయా దృశ్య విషయములపట్ల బంధు–మిత్ర – గృహ–తదితర లోకసంబంధమైన విషయాల పట్ల **ఇవి నావి! నేను వీటికి చెందినవాడను** అను భావములను బలముగా ఆశ్రయిస్తున్నవాడు. |
| **మార్గము/సత్‌పంథా** –<br>పన్థా మన్నిగమః స్మృతః | సర్వాంతర్యామి – సర్వతత్త్వ స్వరూపుడు అగు నన్ను చేరే ప్రయత్నములే పంథా! |
| **కుపథము** –<br>ఉత్పథః చిత్త విక్షేపః | చిత్త విక్షేము – తత్త్వమునుఏమరుస్తూ – ప్రవృత్తి మార్గము కుపథము (Right path). ప్రాపంచక విషయములపట్ల సదా మననం చేయు చిత్త – విక్షేపము. |

| | |
|---|---|
| **స్వర్గము** –<br>స్వర్గః సత్త్వగుణోదయః | సత్ వర్గము<br>సత్వగుణమునకు సంబంధించిన ప్రేమ–వాత్సల్యము–దయ–దాక్షిణ్యము ఇత్యాదియొక్క ప్రవృద్ధి. |
| **నరకము** –<br>నరకః తమ ఉన్నాహో | కోపము – ఆవేశము – కసి – ద్వేషము – నిరుత్సాహము – బద్ధకము – బుద్ధి మాంద్యము... ఇవన్నీ అధికమౌతూ ఉంటే తమోగుణము వృద్ధి చెందుతున్నట్లు!<br>తమోగుణములు వృద్ధి చెందుతూ ఉండటమే నరకము! |
| **బంధువు, గురువు, సఖుడు** –<br>బంధుః గురురహం సఖే | సర్వాంతర్యామినగు నేనే సర్వజీవులకు వాస్తవమైన బంధువును, నీయొక్క – ప్రతి ఒక్కరియొక్క ఆత్మస్వరూపుడనగు నేనే శ్రేయోభిలాషిని. గురువుని. స్నేహితుడను. సఖుడను. |
| **గృహం** –<br>గృహం శరీరంమానుష్యం | ఈ మానవ శరీరమే ఈ జీవునకు గృహము. ఇంటి ఇల్లాలు ఇంటిలోకి చెత్తను రానిస్తుందా? ఉత్తమబుద్ధి గల బుద్ధిమంతుడు దేహములోనికి కామ–క్రోధ–మద–మాత్సర్యాలను రానీయడు. |
| **ధనవంతుడు** –<br>**గుణాఢ్యోహి ఆఢ్య ఉచ్యతే** | ఉత్తమ గుణములు కలవాడే ధనవంతుడు. |
| **దరిద్రుడు** –<br>దరిద్రోహి యస్తు అసంతుష్టః | లభించినదానిని చూచుకొని సంతోషించకుండా లభించని వాటిని వరుసగా వ్రాసుకొని అసంతృప్తితో ఉన్నవాడు. అసంతుష్టుడు. |
| **కృపణుడు–అల్పుడు** –<br>కృపణోయో అజితేంద్రియః | ఇంద్రియములను జయించనివాడు, ఇంద్రియములకు వశుడై రోజులు గడిపేవాడు. |
| **సంపద** – | పరోపకారము – దానము... ఇవే సంపద |

| | |
|---|---|
| **ధీరుడు-స్వతంత్రుడు** - గుణేషు అసక్తః ధీరీశో | ఎవ్వడైతే విషయములందు ఆసక్తిలేనివాడై ఉంటాడో, అనుబంధ - సంబంధ - బాంధవ్యములను కలిగి ఉంటూనే సర్వదా అతీతుడై ఉంటాడో, విషయములపట్ల అంతరంగంలో అప్రమేయత్వమునకు సంబంధించిన అవగాహన కలిగి ఉంటాడో.... ఆతడు స్వతంత్రుడు. ఈ జీవుడు అంతరంగమున సర్వస్వతంత్రుడై బాహ్యము ఆయా స్థాన-సందర్భ-పాత్రౌచిత్యములలో మెలగటం నేర్చుకుంటే.... ఆతడు సర్వదా స్వతంత్రుడే! నాటకంలో పాత్రగా నటిస్తూ ఉంటే నాటకంలోని నాటకపాత్ర యొక్క సాధక-బాధకాలు నటుడివి అవుతాయా? అవవు.కానీ అయినట్టు ప్రదర్శనం నిర్వర్తిస్తాడు. ఈ కనబడేదంతా జగన్నాటకమేగా! |
| **అస్వతంత్రుడు/** - **గుణసంగుడు** **(గుణ సంగో విపర్యయః)** | విషయములపట్ల - సందర్భ సంఘటనలపట్ల తీవ్రమైన సక్తత - గుణ సంబంధమైన ఆవేశము కొనసాగించు వాడు అస్వతంత్రుడు. గుణసంగుడు. |

ఓ ప్రియమిత్రమా! ఉద్ధవా! నీవు అడిగిన ప్రశ్నలన్నిటికీ సంక్షిప్తంగా నా సమాధానమేమిటో వివరించాను. మరొక్క విషయం!

గుణదోష లక్షణములగురించి మనం ఎంతైనా చెప్పుకోవచ్చు. ఏం లాభం? దానికి అంతు-పొంతు లేదు కూడా!

**గుణదోష దృశిర్దోషో**

**గుణస్తూభయ వర్జితః** **(అధ్యా 19, శ్లో 45)**

గుణ దోషముల గురించి పెద్దగా మననం-ఆలోచన పెద్ద తప్పు! దోషం! వాటిని పెద్దగా పట్టించుకోక పోవటమే ఉచితం. ఆత్మవస్తువు నిత్య నిర్మలము-అప్రమేయము-నిర్దోషము-సమము అని గుర్తు పెట్టుకొనెదవుగాక!

సద్గుణ-దుర్గుణములను రెండింటినీ ప్రక్కకుపెట్టి - **సర్వే సర్వత్రా ఆత్మయే** అని గమనిస్తూ ఆత్మోపాసనకు ఉపక్రమించటమే ఉపాయం. అదే సర్వాత్మకుడనైన నన్నుజేరే

**తరుణోపాయం! మంచివారి గురించి, మహనీయుల గురించి పెద్దగాను, గుణ దోషములగురించి చాలా చిన్నగాను పట్టించుకోవటం - మాట్లాడుకోవటం - సంసార నివృత్తికి సాహకారికమని నా అభిప్రాయము.**

## 28. విధి నిషేధములు - యోగాధికారములు

**శ్రీ ఉద్ధవుడు :** హే పరంధామా! శ్రీకృష్ణ పరమాత్మా! నీ బోధలు ఈ సందర్భములో నన్ను పవిత్రం చేస్తూ వున్నాయి. అంతేకాదు. అవి నా ద్వారా అనేకమంది ముముక్షువులకు అందజేస్తున్న పాఠ్యాంశములు! అమోఘములు! ఒక్కమాటతో చెప్పాలంటే, మీరు మా అందరిపై ప్రేమామృతమును కురిపిస్తున్నారు.

కృష్ణయ్యా! జ్ఞానః సంచ్ఛిన్న సంశయః అని మీరే ఒక సందర్భములో అని ఉన్నారు కదా! అందుచేత వేదములు ప్రవచిస్తున్న వైదిక ధర్మాల విషయంలో నాకు చూచాయగా గల కొన్ని సంశయాలను మీ ముందుంచుతాను అనుజ్ఞ ఇవ్వండి.

----

**శ్లో॥ విధిశ్చ ప్రతిషేధశ్చ నిగమో హి ఈశ్వరస్యతే।**
**అవేక్షతే అరవిందాక్ష! గుణం దోషంచ కర్మణామ్॥** (అధ్యా 20, శ్లో1)

ఓ అరవిందాక్షా! కమలనయనా! వేదపురుషా! పురుషోత్తమా! వేదములు మీ విధి-నిషేధ రూపమైన ఆదేశములే.... అని వేదజ్ఞులు ప్రవచనం చేస్తూ ఉంటారు. అట్టి వేదములు...

- కర్మ దోషములను
- గుణ దోషములను
- పాపపుణ్యముల గురించి

వివరిస్తూ పాఠ్యాంశాలు అందిస్తున్నాయి. అటువంటి వేద శాస్త్రములు...,

- వర్ణాశ్రమ భేదధర్మాల గురించి చెప్పుచున్నాయి.
- ప్రతిలోమజ - అనులోమజ (అనుసరించటంచేత - నిర్వర్తించకపోవటం చేత) కొన్ని కొన్ని గుణదోషముల గురించి కూడా చెప్పుచున్నాయి.
- ద్రవ్య-దేశ-వయస్సు-ఆశ్రమ సంబంధమైన నియమములు బోధిస్తున్నాయి.

- కాలగతమైనటువంటి యోగ్యత – అయోగ్యతలగురించి, స్వర్గ–నరకముల గురించి వివరణలు అందిస్తున్నాయి.

స్వామీ!

విధి–నిషేధములగురించి వేదవాఙ్మయం చెప్పుచున్నప్పుడు, గుణ–దోష–భేద దృష్టి లేకుండా ఆ విధి నిషేధాలు వేదాలు చెప్పలేవు కదా!

"మానవునికి ముక్తి కలగాలి" అని కదా ఆధ్యాత్మశాస్త్రము (లేక) వేదాంత శాస్త్రము యొక్క ఉద్దేశ్యం? విధి–నిషేధాలు లేకుండా ముక్తిగురించి చెప్పటం కుదరదు కదా!

ఓ దేవదేవా! వేదవాక్కులే ఆచరణీయములు అని శాస్త్ర ప్రసిద్ధి. నీ వాక్కే దేవతలకు – పితృదేవతలకు వేదము కదా! అట్టి నీవాక్కు మా అందరికీ ప్రమాణము.

అయితే వేదములు

1. సర్వ అనుభవములకు అతీతమగు కర్మ–జన్మలకు అప్రమేయమగు మోక్షసాధన గురించి చెప్పుచున్నాయి.
2. మరొకవైపు స్వర్గ–నరకమార్గముల గురించిన విశేషాలు చెప్పుచున్నాము.
3. ఇంకొకవైపునుండి సాధ్య–సాధన సంబంధమైన వివరణలను, జ్ఞానమును వెల్లడి చేస్తున్నాయి.
4. వేరొకవైపు నుండి జనులలో పరస్పర ప్రేమ–స్నేహ–వాత్సల్య–సానుకూల్యతలను ఉద్దేశ్యిస్తున్నాయి.

వేదవాక్కులు గుణ దోషముల గురించి భేద దృష్టిగా ప్రవచిస్తున్నప్పటికీ.... అదంతా సందర్భ బోధయేగాని,.... స్వతఃసిద్ధమైన బోధ–ఆత్యంతికమైన బోధకాదు. భేదము కల్పిస్తున్న వేదములు సర్వభేదములను తొలగించటానికే అయి ఉన్నది. (Differences are being dealt for the sake of taking off differences as well as taking us to beyond differences ) అని నాకు అనిపిస్తోంది.

అది అట్లా ఉండగా, నాకు ఎందుకో ఇంకా ఒక సందేహము వదలటం లేదు.

వేదముల ముఖ్యోద్దేశ్యం ఏమైవున్నది?

- భేదములగురించి (పుణ్యపాప–అల్ప–మహనీయ గుణ భేదాల గురించి) అంతిమంగా చెప్పటమా?

- లేక "సర్వమ్ ఖల్విదం బ్రహ్మ" - "ఏకోసత్ విప్రాబహుధా వదంతి"... ఇత్యాది బోధలద్వారా సమము అఖండము - అప్రమేయము - స్వస్వరూపము అగు పరమాత్మ తత్త్వమును జీవులకు అందించటానికే అంతిమంగా ఉద్దేశ్యిస్తున్నాయా?

నాకు గల ఈ సందేహం దయయుంచి తొలగించండి!

**శ్రీకృష్ణ భగవానుడు :**

ఓ ఉద్ధవా! మిత్రమా! మంచి ప్రశ్న అడిగావయ్యా! చెప్పుతాను విను. ఈ జీవుని- శివునిగా, నరుని - నారాయణునిగా, మానవుణ్ణి - మాధవునిగా తీర్చిదిద్దటమే ముఖ్యోద్దేశ్యం. అయితే మరందుకు మార్గం, ఉపాయము కావాలికదా!

**శ్లో॥ యోగాః త్రయో మయాప్రోక్తా నృణాం శ్రేయో విధిత్సయా।**
**జ్ఞానం కర్మ చ భక్తి శ్చ నోపాయో అన్యో అస్తి కుత్ర చిత్ ॥ (అధ్యా 20, శ్లో 6)**

మానవులకు శుభం కలగాలని,మానవజన్మలో కృతార్ధులవటానికి, జన్మ సార్ధకతకొరకై నేను సృష్టి సందర్భంలో వేదములద్వారా మూడు యోగములను నిర్దేశించటం జరిగింది.

1. కర్మయోగము (సాధనలు)
2. జ్ఞాన యోగము (విచారణ)
3. భక్తి యోగము (పరాప్రేమ)

**నో ఉపాయో అన్యోస్తి కుత్రచిత్ ।**

ఈ మూడింటికన్నా వేరుగా ఎక్కడా మరొక త్రోవ - మార్గము ఏదీ లేదు. వేదములు ప్రతిపాదిస్తున్నది, అభివర్ణిస్తున్నది, నిర్వచిస్తున్నది, గానం చేస్తున్నది ఈ మూడింటినే! మిగతావన్నీ ఈ మూడింటిలోనే ఉన్నాయని, అంతేకాకుండా, వాటిలో ప్రతిఒక్క దానిలో మిగతా రెండు అంతర్లీనమై ఉన్నాయని కూడా. గమనించు.

## ఎవరు దేనికి అధికారులు?
## (Who deserve to take which path?)

**1. కర్మయోగాధికారులు - వేదములలోని కర్మకాండ (సంహిత):** ఎవ్వరికైతే కర్మలు నిర్వర్తించటంలో అభిరుచి ఉంటుందో, కర్మఫలములందు ఎవ్వరికైతే ఆసక్తి మానసికంగా కొనసాగడం జరుగుతోందో... అట్టివారి కొరకై కర్మయోగము నాచే మోక్షమార్గంగా చెప్పబడింది.

అనగా,

- కర్మ ఫలములపట్ల విరక్తి చెందనివారు,
- "కర్మఫలములు అంతిమంగా దుఃఖముతో కూడినవే కదా!.... "అనే అవగాహనతో కూడిన బుద్ధిని ఇంకనూ పెంపొందించుకోనివారు,
- సకామకర్ములు

వీరు కర్మయోగ మార్గమునకు అధికారులు. (They better deserve to the path of Karma Yoga)

వీరికొరకై నిత్య - నైమిత్తికంగా నిర్వర్తించవలసిన ఆయా విధానము - తీరు, వాటికి సంబంధించిన నియమ-నిష్ఠలు ఇత్యాదులన్నీ వేదములచే చెప్పబడుచున్నాయి. అవి ఎప్పటిదాకా అవసరం? సకామకర్మలపట్ల - కర్మఫలముపట్ల అభిలాష ఉన్నంతవరకు!

అయితే....,

సకామి అయి యజ్ఞ యాగ-వ్రత-ప్రాణోపాసన-నియమాదులు నిర్వర్తించుటచే ఈ జీవుడు సుఖమయమగు స్వర్గలోకాలు పొందుచున్నాడు కూడా!

నిషిద్ధ కర్మలు నిర్వర్తించటంచేత దుఃఖదాయకములగు లోకములు పొందటం జరుగుచున్నది.

వేదములలోని కర్మవిభాగము - ఇవి నిషిద్ధ కర్మలు
- ఇవి ఆశ్రయించవలసిన కర్మలు

అని బోధిస్తున్నాయి. సూచిస్తున్నాయి. నియమిస్తున్నాయి. హేయ-ఉపాదేయ కర్మ మార్గాలను నిర్దేసిస్తున్నాయి. వాటిని శ్రద్ధగా ఆశ్రయించుచున్నవాడు క్రమంగా నిష్కామి అయి, మోక్షమునకను అర్హుడగుచున్నాడు!

## 2. భక్తియోగాధికారులు - వేదములలోని ఉపాసనాకాండ (బ్రాహ్మణములు)

- ఏదో కారణంచేత అవతారమూర్తుల కథలయందు త్రిమూర్తులయందు, దేవతామూర్తులయందు ఆదరము కలిగియున్నవాడు
- విషయములపట్ల వైరాగ్యము కలిగియున్నవాడు (లేదా) ఆదరణ - ఆకర్షణ (Attraction) తగ్గుచూ వస్తున్నవాడు...,

అట్టివాడు భక్తియోగమునకు అర్హుడై ఉంటున్నాడు. ఆతనికి భక్తియొక్క అభివృద్ధికొరకై దేవతా - అవతారమూర్తుల ఉపాసనలు, స్తోత్రములు, ధ్యాననిష్ఠలు... ఇత్యాదులన్నీ వేదములయొక్క వివిధ బ్రాహ్మణముల విభాగములో అందించబడుచున్నాయి.

నిషిద్ధకర్మ త్యాగి-శుద్ధచిత్తుడు - స్వధర్మపరాయణుడు... ఇట్టివాడు మరేలోకం వెళ్ళవలసిన అవసరం లేకుండానే ఇక్కడే క్రమంగా జ్ఞానభూమికలను అధిగమిస్తూ భక్తిని పెంపొందించుకుంటున్నాడు. జ్ఞాన భక్తి సంపాదించుకుంటున్నాడు.

ఓ ఉద్ధవా! ఈ మానవజన్మ గొప్ప అవకాశం సుమా! ఎందుకంటావేమో?

అటు స్వర్గలోకంలోగాని -- ఇటు నరకలోకంలో గాని

జ్ఞానభక్తిని సాధించటానికి ఇంతటి అవకాశాలు వుండవు. అందుచేత జ్ఞానభక్తుడుగా రూపుదిద్దుకుంటున్నవాడు - మానవజన్మనే అధికంగా కోరుకుంటాడు గాని స్వర్గలోక నివాసం కాదు.

క్రమంగా భక్తి ప్రపత్తులు ప్రవృద్ధం అవుతూ ఉండగా...,

**శ్లో॥ న నరః స్వర్గతిం కాంక్షేత్, నా నరకీం వా విచక్షణః**
**న ఇమం లోకం చ కాంక్షేత దేహావేశాత్ ప్రమాద్యతి ॥** (అధ్యా 20, శ్లో 13)

దేహమే దేహికి ఒక తీరుగా సాధన వస్తువు - మరొక తీరుగా ఐహిక మోహం కదా! అందుచేత ఉత్తమ భక్తి-ప్రపత్తులు రూపుదిద్దుకుంటూ ఉండగా....ఇక ఆతడు స్వర్గము కోరడు. నరకము కోరడు. ఈలోకంలో ఏదో స్థానము కోరడు. **ఏ దేహం వచ్చినా - రాకున్నా నా బుద్ధి మాత్రం సర్వదా మీ పదాలు ఆశ్రయించి ఉండే వరం ప్రసాదించు స్వామీ!....** అని మాత్రమే నన్ను కోరుకుంటూ ఉంటాడు. ఆతడికి నేను తప్పితే మరింకేమీ అఖర్లేదు. ఆతనిపట్ల - భక్తియే మోక్షస్థానమై ప్రకాశిస్తోంది!

### 3. జ్ఞానయోగాధికారులు :

భక్తిచే జ్ఞానము - జ్ఞానముచే భక్తి ప్రవృద్ధమై ఏకత్వము సంతరించుకొని ఆత్మోపమ్యేవ సర్వత్ర - సమంపస్యతి... అను ఆత్మసాక్షాత్కార స్థితిని కోరుకొనేవారికి జ్ఞానయోగ మార్గము ఉపనిషత్తులద్వారా, తదితర వేదమహా వాక్యములద్వారా (తత్త్వమసి జీవోబ్రహ్మేతి నాఽపరః - అయమాత్మా బ్రహ్మ - సోఽహమ్ - తత్త్వమ్ ఇత్యాది మహావాక్య శబ్దముల ద్వారా) వేదములు బోధిస్తున్నాయి.

ఓ ఉద్ధవా! ఈ మానవ దేహము అశాశ్వతమైనది. వినాశనశీలము. వార్ధక్యము–అనారోగ్యము–ఇత్యాది దోషములు కలిగియున్నట్టిది! ఇది అందరికీ తెలిసిన విషయమేకదా! అయితే మాత్రం ఏం? జీవితము అనేది మహత్తరమైన అవకాశము. ఈ మానవ దేహము జీవునికి కర్మయోగము – భక్తియోగము – జ్ఞానయోగము ప్రసాదించగల అవకాశములు కలిగి ఉన్నట్టిది. మోక్షము అనే పురుషార్ధమును ప్రసాదించగలిగినది సుమా! అందుచేత జీవుడు ఏం చేయాలి?

– ఈ పురుషుడు అప్రమత్తమైన–సముత్సాహముతో కూడిన (Very alert and enthusiastic) భావన – ప్రయత్నము – ఉద్దేశ్యములతో...
– మృత్యువు సమీపించటానికి మునుముందే...,
  ముక్తికై ప్రయత్నాలు చేయాలి! కర్మ–భక్తి–జ్ఞానయోగములు మూడిటినీ ఒకేసారి సమీకరించుకోవాలి!

**అని గమనించబడు గాక!**

**కర్మ–భక్తి–జ్ఞాన మార్గాలను వేరువేరైనట్లుగా చూడవద్దు. అనుకోవద్దు. ప్రతి ఒక్క దానిలో మిగిలిన రెండూ ఉన్నాయనేది గమనించు!**

---

ఓ ఉద్ధవా! ఒక ముఖ్యమైన పాఠ్యాంశాన్ని గమనించాలని నీద్వారా జనులందరికి గుర్తు చేస్తున్నానయ్యా!

**శ్లో॥ ఛిద్యమానం యమైరేతైః కృతనీడం వనస్పతిమ్**
**ఖగః స్వకేతమ్ ఉత్సృజ్య క్షేమం యాతి హి అలంపటః** (అధ్యా 20, శ్లో 15)

ఒకానొక గరుడ పక్షి ఒక పెద్ద వృక్షముపైగల అనువైనచోట ఒక పెద్దగూడు అందంగా కట్టుకొని భార్య, పిల్ల – పాపలతో హాయిగా నివసిస్తోంది. రోజులు గడుపుతోంది. ఒక రోజు కొంతమంది బోయవాళ్ళు ఆ మహావృక్షముక్రింద నిలబడి, "అరై! రేపు మళ్ళీవద్దాం! ఈ మహావృక్షమును వంటచెరకుకై రాజుగారి వంటశాలకు అందజేద్దాం! దుడ్లు (డబ్బు) బాగా లభిస్తాయి...." అని చెప్పుకుంటున్నారు. కొంతసేపైన తరువాత వారంతా వెళ్ళిపోయారు.

తన గూడులో హాయిగా కూర్చుని ఉన్న ఖగరాజు (పక్షి) ఇట్లా అనుకొన్నది, "ఆహాఁ!

యమభటులవంటి ఈ ఆటవికులు రేపువచ్చి ఈ వృక్షమును నరకబోతున్నారుకాబోలు! వాళ్ళ కళ్ళ బడ్డామా, నన్ను - నా భర్య - బిడ్డలను బంధించి తీసుకుపోగలరు. ఏం చేద్దాంరా బాబు?" అని ఆలోచించసాగింది. ఆడ పక్షిని పిలిచి తాను విన్నదంతా చెప్పి "ఏంచేద్దాం? చెప్పు?" అన్నది. ఆడపక్షి అంటోంది

- **ఇంక చేసేదేమున్నదయ్యా? ప్రమాదం వచ్చేవరకు తీరికగా కూర్చుని ఉంటామా? లేదు. పదండి. ఈ వృక్షము ఈ గూడు వదలి మరొక చెట్టును చూచుకొని గూడు కట్టుకుందాం!**

వెంటనే ఆ పక్షుల కుటుంబం రాత్రికి రాత్రే మకాంమార్చి సుదూరంగా ఉన్న వేరొక మట్టిచెట్టుపై వ్రాలి గూడు కట్టుకోనారంభించాయి. ఆమాత్రం పక్షులకు ఉన్న తెలివి మానవుడికి ఉండనక్కర్లేదా? ఏమాత్రం తెలివి ఉన్నాకూడా....,

- అయ్యో! రోజు రోజుకు ఆయుష్షు తగ్గుతోందే! యమభటులు ఒకానొకరోజు చెప్పా పెట్టకుండా వచ్చి ఈ దేహమును లాక్కుపోబోతున్నారు కదా! కనుక అత్యవసరంగా- శేషించి ఉన్న ఆయుష్షును సద్వినియోగం చేసుకోవాలికదా!

అని తలుస్తాడు. భయపడతాడు. సంగమును త్యజించి పరబ్రహ్మమును గుర్తించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు. దృశ్యము - దేహములకు సంబంధించిన సర్వ కామములు త్యజించి క్రమంగా నిష్కాముడై పరమశాంతిని సముపార్జించుకుంటాడు. ఆత్మభగవానునితో మమేకమయ్యే ప్రయత్నములను తీవ్రపరచుకుంటాడు.

ఈ మానవశరీరము సర్వఫలములు సంపాదించుకోవటానికి గొప్ప ఉపకరణము. అత్యంత దుర్లభంగా మాత్రమే లభిస్తుంది. చక్కటి కరణాలు (చూపు - వినికిడి మొదలైన ఇంద్రియ శక్తులు) ఈ దేహంలో ఉన్నాయి. కనుక సంసార సాగరమును దాటటానికి ఇది గొప్ప దృఢమైన నౌక!

- శరణువేడితే చాలు, గురు దేవులు ఆత్మ విద్యను బోధిస్తారు. కర్ణధారులై (పడవను నడిపే ఆయన) అటు సంసారసాగరం దాటిస్తారు.
- భగవంతుని స్మరిస్తూ, శాస్త్రానుకూలమైన మార్గంలో కర్మలు నిర్వర్తిస్తూవుంటే... ఈ పడవ లక్ష్యము వైపుగా తీసుకుపోతుంది

**అని ఈ జీవుడు తీవ్రంగా అనుకోవాలి.**

ఇంత చక్కని సర్వానుకూలమైన మానవదేహమును ఉపయోగించుకుని శాస్త్ర-గురు ప్రవచిత సాధనలకు ఉపక్రమించి **సంసారసాగరమునుండి తరించటం, ఆధ్యాత్మిక జ్ఞానమును పెంపొందించు కోవటం** అనే మార్గంలో ప్రయత్నాలు నిర్వర్తించకపోతేనో? అట్టివాడు లభించిన అవకాశమును రెండుచేతులా జార్చుకుంటున్నట్లే! ఆత్మద్రోహం చేసుకుంటున్నట్లే! అధఃపతనమును తెచ్చిపెట్టుకుంటున్నట్లే! చదువుకోరా అని తండ్రి మంచి బడిలో జేర్పిస్తే, అల్లరి-చిల్లరి పనులతో రోజులు వృధా చేసుకోవటం వంటిదే!

ఈ మనస్సు ఇంద్రియ విషయముల వైపుగా అతివేగంగా ప్రయాణిస్తోంది! ఒక్క విషయం కాదు, రెండుగాదు ఒకేసారి సహస్రాధికంగా అనేక విషయములను అనుక్షణం మార్చి మార్చి యోచనలు చేస్తూ దేహమున్నంతవరకు అతి చంచలమై ఉంటోంది. దేహము బాగున్నంత వరకు ఆత్మ జ్ఞానమునకు ఉపక్రమించకపోవటంచేత, వేదములు చెప్పే సాధనలను శ్రద్ధగా నిర్వర్తించి యత్నించకపోవటంచేత - పర్యవసానం? దేహమున్నప్పుడు - దేహానంతరం - మరొక దేహము ఆరంభమౌతున్నప్పుడు కూడా ఉద్విగ్నత - దుఃఖము - భయము ఇత్యాదులు తొలగటమేలేదు. విజ్ఞులగువారు ఇదంతా గమనిస్తున్నారు. "యేహి సంస్పర్శజా భోగాః దుఃఖయోనయ ఏవతే। ఆద్యంతవంతః" అని ముందుగానే గుర్తిస్తున్నారు. కర్మ-కర్మఫలములపట్ల విరక్తులగుచున్నారు. దృశ్య ఫలములపట్లగల అనురక్తిని ఉపశమింపజేసుకొనే మార్గమును అన్వేషించి - ఆశ్రయిస్తున్నారు. ఆత్మజ్ఞానమునకు సంబంధించిన వృత్తులను స్వీకరిస్తూ నిశ్చలమైన భావంతో-యోగభావంతో మనస్సును ధరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే...

ఈ మనస్సు సముద్రతరంగాలకన్నా - వాయుతరంగాలకన్నా అతి చంచలం కదా! ఇది లక్ష్యవస్తువుపై నిలకడగా ఉండదు. అది గమనించినయోగి ఈ మనోబాలకుణ్ణి (లేక) చిత్తబాలకుణ్ణి అనురోధమైన (అనుకూలమైన - through positive methods) మార్గములద్వారా స్వాధీనం చేసుకోవాలి. అంతేగాని, మనోగతిని ఉపేక్షించి, తగిన సాధనలకు ఉపక్రమించకుండా రోజులు గడుపరాదు.

**శ్లో॥ మనోగతిం న విసృజేత్ జితప్రాణో జితేంద్రియః**

**సత్త్వ సంపన్నయా బుద్ధ్యా మనః ఆత్మవశం నయేత్ ॥** (అధ్యా 20, శ్లో 20)

ఇంద్రియములను సాధనలద్వారా జయిస్తూ (జితేంద్రియుడగుచు), ప్రియస్వరూపమైన

ప్రాణములను వశం చేసుకుంటూ (జితప్రాణుడగుచు)... సత్యగుణ సంపన్నమైనట్టి బుద్ధి ద్వారా **బుద్ధిని ఆత్మవశం చేసుకోవాలి!**

అది ఎటువంటి ప్రయత్నమంటే....,

అశ్వారూఢుడు (గుర్రపురౌతు) గుర్రమును అధిరోహించి ఒక ముఖ్యమైన పనికోసం ఒకచోటికి బయలుదేరాడనుకో! ఆ గుర్రము తనకు యిష్టం వచ్చిన మార్గంలో ఎటో అడవులవైపుగా మేతకోసం పరుగులు తీస్తూ ఉంటే, "ఆఁ! ఏం చేద్దాం! పోనీలే!" - అని చూచీచూడనట్లు ఊరుకుంటాడా? ఊరుకుంటేనో? (లేక) ఏవేవో అనవసరమైన వ్యాపకాలు మననం చేస్తూ మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ ఉంటేనో? ఏమౌతుంది? ఆ గుర్రపుస్వారీ చేసే ఆయన తను చేరవలసిన స్థానం (పట్టణం) చేరుతాడా? లేదు. ఏ అడవులలోనో చిక్కుకుని బహుయాతనలు పడతాడు. ఇది గమనించి, ఆ రౌతు ఏం చేస్తున్నాడు? "ఈ గుర్రము నా మనోభావాలు గమనించి నేను వెళ్ళవలసిన వైపుగా పరుగెత్తాలి? ఈ గుర్రం నామాటవినేటట్లు చేసేది ఎట్లా? ..." అని ఉపాయాలు యోచిస్తున్నాడు. కార్యరూపంగా ఆ ఉపాయాలు నిర్వర్తించి గుర్రము తన స్వాధీన మయ్యేటట్లు చేసుకుంటున్నాడు.

- పగ్గములను పట్టుకొంటాడు.
- పూర్తిగా విడువడు. అట్లా అని గుర్రములు కదలనంతగా పట్టుకోడు.
- మంచి శబ్దములతో - స్పర్శలతో - చండాకోలుతో - మాటలతో.... తను అనుకున్నవైపుగా ముఖంత్రిప్పి పరిగెత్తేటట్లు చేసుకుంటున్నాడు.

ఆ గుర్రపు రౌతులాగానే మానవుడైనవాడు ఈ మనో అశ్వమును నయాన-భయాన-వేద-వేదాంగములు-స్మృతులు-పెద్దలు-గురువులు ప్రబోధిస్తున్న సాధన సంపత్తియొక్క సహాయముతో తనవశం చేసుకోవాలి.

ఈ మనస్సు నిశ్చలత్వం పొందేవరకూ ఈ జీవుడు సాధనలను - తత్త్వజ్ఞానమును ఆశ్రయించాలి. ఈ దృశ్యములో అనుభవమగుచున్న స్థూలదేహమునుండి మహత్తత్త్వము వరకు గల సర్వ పదార్థములను

- అనులోమక్రమ **సృష్టి** గురించి (How from nothing every thing is coming out and appearing)

- ప్రతిలోమ క్రమ **ప్రళయము** గురించి (How everything is eventually getting into nothing)

మనో–బుద్ధుల సహాయంతో యోచించాలి. గమనించాలి. నిర్వేదము (Non-worrying) వైరాగ్యయుక్తము (Detatchment) అగు చిత్తమును సంపాదించుకోవాలి. ఒకవైపునుండి అటువంటి నిర్మల–నిశ్చల చిత్తముతో గురూపదేశములను – గురువుల ఉద్దేశ్యములను పఠించి – పాటించి మరొకవైపు నుండి ప్రాణాయామ–పూజాది కార్యక్రమములకు ఉపక్రమిస్తూ – క్రమంగా దేహాభిమానమును త్యజించాలి.

----

దృశ్యాభిమానం త్యజించటం (లేక) జయించటం మాటలతో చెప్పుకొనేంత తేలికైనది కాదు. అందుకుగాను యమము–నియమము–ధారణ ఇత్యాది యోగమార్గములకు (సాధనలకు) ఉపక్రమించాలి. మరొకవైపుగా వస్తుతత్త్వమును పరిశీలనచేస్తూ తర్క విద్యద్వారా సర్వాధారమైన పరతత్త్వముయొక్క అవగాహనను పెంపొందించుకుంటూ ఉండాలి. ప్రతిమలను అర్చించటం – ధ్యానించటం ఇవన్నీకూడా ఏకాగ్రతకు ఉపాయాలై ఉన్నాయి. అవన్నీ అవసరమే!

దేహమున్నంతవరకు కర్మలు అనివార్యం. కర్మలు కొంత దోషముతో కూడుకొనియే ఉంటాయి. అందుచేత యోగి అయినవాడు ప్రమాదవశాత్ ఏమైనా నిందితకర్మలు నిర్వర్తిస్తూ ఉంటే... వాటిని లోకానుకూలంగా మరల్చుకోవాలి. మరొకవైపుగా వాటి–వాటి దోషముల నివృత్తికొరకై ప్రాణాయామాది యోగసాధనలద్వారా ప్రయత్నము కొనసాగిస్తూ ఉండాలి కూడా!

**ఆ ప్రాయశ్చిత్తకర్మలు కూడా– సులభంగాను–సహజనులకు అనుకూలంగాను ఉండాలేగాని... లోకాలను బాధించేటట్లు, తనను తాను బాధించుకునేటట్లు ఉండరాదు సుమా!**

----

ఓ ఉద్ధవా! ఈవిధంగా మన కర్మయోగాధికారి–భక్తియోగాధికారి – జ్ఞానయోగాధికారిల గురించి చెప్పుకుంటున్నాం కదా! అయితే ఈ ముగ్గురికి గురువు–తల్లి కూడా వేదమాతయే! ఈ త్రివిధసాధకులు సద్గుణులు – ఏకాగ్రచిత్తులు అవ్వాలనునదే వేదహృదయం. ఒకనికి కర్మ–భక్తి–జ్ఞాన అధికారమును అనుసరించి ప్రయత్నములచే ఏర్పడే ఏకాగ్రతనే **సగుణము** అనే పేరుతో పిలుస్తున్నారు. గుణములవలన కొంచెము దోషముకూడా

ఉంటుందని అనుకున్నాంకదా! అటువంటి గుణదోష విధానముల వలన కలిగే సాంగత్యమును (side effect of relatedness (or) confinement) ప్రాయశ్చిత్త విధానాలచే పరిహరించుకొంటూ ఉండాలి కూడా! ఎందుకంటే, కర్మలు సహజంగా చూస్తే కొంత దోషభూయిష్టముగానే ఉంటాయి. అశుద్ధత కొంత ఉంటుంది.

శ్లో॥ **స్వేస్వే అధికారే యా నిష్ఠా సగుణః పరికీర్తితః**
**కర్మాణాం జాతి అశుద్ధానాం అనేన నియమః కృతః**
**గుణదోష విధానేన సంగానాం త్యాజనేచ్ఛయా ॥** **(అధ్యా 20, శ్లో 26)**

అని పెద్దలు చెప్పుచున్న విషయమే కదా! కర్మలు అనర్థములకు మూలములని కూడా చెప్పబడుతోంది. అందుచేత "కొంత కొంతవరకు దృశ్య వ్యవహారములందు ప్రవృతిని సంకోచింపచేసుకుంటూ ఉండాలికూడా!..." అనేది ఏమరువరాదు.

----

అందుచే ఓ ఉద్ధవా! "కర్మ విశేషములందు ఉద్విగ్నుడు అయినవానికి ఆ విషయ సమూహములన్నీ దుఃఖాత్మకములౌతాయని గమనించండి!..." అని నా లీలావిశేష కథలద్వారా గుర్తుచేస్తూనే ఉన్నాను. ఒకవేళ విషయ సమూహములను విడవలేకపోతూ ఉంటే.... "నాయందలి భక్తియొక్క ప్రభావంచేత విషయ వాసనలు తొలగుతాయి" అని కూడా నా లీలలచే బోధిస్తూ వస్తున్నాను. భక్తియొక్క ప్రభావంచేత కర్మలకు సంబంధించిన దోషములు తమకుతామే తప్పక తొలగుతాయి. క్రమంగా భక్తియొక్క విశిష్ఠత చేత - దుఃఖ పరిణామములగు విషయములు అనివార్యంగా అనుభవిస్తూ ఉండవలసి వస్తున్నప్పటికీ... వాటియందు ప్రీతిని కలిగి ఉండకుండెదవు గాక! సర్వాత్మకుడగు పరమాత్మయే నీకు ప్రీతిపాత్రమగుగాక! అట్టి అప్రీతి భావన స్వభావసిద్ధంగా భక్తిచే పెంపొంద గలదు. అద్దాని వలన హృదయంలో ఉండే విషయవాసనలన్నీ వినష్టమౌతాయి.

శ్లో॥ **భిద్యతే హృదయగ్రంధిః ఛిద్యంతే సర్వసంశయాః**
**క్షీయంతే చ అస్య కర్మాణి మయిదృష్టే అఖిలాత్మని॥** **(అధ్యా 20, శ్లో 30)**

సర్వాంతర్యామిని - పరమాత్మ స్వరూపుడను అగు నన్ను సాక్షాత్కరింపజేసుకొనే ప్రయత్నంలో ఉంటూ ఉండగా....,

- ఈ జీవునియొక్క జీవాహంకారము స్వయంగా వినష్టమౌతూ వస్తుంది.
- హృదయంలో తిష్ఠవేసుకొనియున్న సర్వ సంశయాలు తొలగుతూ వస్తాయి

ఛిన్నమైపోతూ వుంటాయి.

– సర్వ కర్మబంధాలు – కర్మరాశి కూడా క్షయం అవుతూ వస్తుంది.

పరమాత్మ పట్ల ప్రియము – ఇష్టము... ఇదే **భక్తి.**

ప్రాపంచక విషయములపట్ల ఇష్టము – ప్రియమే **సంసారము**.

ఎవరి చిత్తమైతే నాపట్ల ఏకాగ్రమౌతూ – భక్తిపారవస్యమౌతూ వస్తోందో (ఇష్టము అధికమవుతూ ఉంటుందో)... అట్టివానికి జ్ఞాన–వైరాగ్యములు స్వభావ సిద్ధమగుచూ, భక్తియే సర్వమునకు సాధనాసంపత్తిగా అగుచున్నది. జ్ఞాన–వైరాగ్యములు స్వభావమే అవుతాయి.

అంతేకాదు!

కర్మ–తపస్సు–జ్ఞానము–వైరాగ్యము–యోగాభ్యాసము – తీర్థయాత్రలు – వ్రతములు మొదలైన ఆయా సాధనలచే లభించగలదానిని సర్వదేవతాస్వరూపుడనగు నాయొక్క భక్తుడు భక్తియోగముచే అనాయాసముగా పొందుచున్నాడయ్యా! ఒకవేళ నా భక్తుడు ఎప్పుడైనా స్వర్గమో–మోక్షమో–వైకుంఠధామమో కోరుకుంటాడనుకో...! అవన్నీ భక్తునికి అనాయాసంగా లభించగలవని చేతులెత్తి ప్రకటిస్తున్నాను.

చమత్కారం ఏమిటో గమనిస్తున్నావా?

సర్వాంతర్యామిఅయిన నాపట్ల భక్తిని పెంపొందించుకొన్నవారు "భక్తికి ఫలితంగా భక్తియే మాకుచాలు! మాకు ఇంకేమీ అఖర్లేదు ..." అని నిర్ణయించుకొని ఉంటున్నారు. భక్త్యానందమునకు సాటిఏది? "నాయనా! నీకు మోక్షము ప్రసాదిస్తాను"... అని నేను ముందుకువచ్చినాకూడా "**సర్వతత్త్వ స్వరూపుడవగు నీపట్ల మాకు సర్వదా ఇష్టరూపమైన భక్తి ఉంటేచాలయ్యా,** .... " అని ఎలుగెత్తి సమాధానం చెప్పుచున్నారు.

----

స్వప్నసదృశమైనట్టిలోక సంఘటన – సందర్భములపట్ల అపేక్షయే బంధము.

నిరపేక్షయే సర్వోత్కృష్టము. అత్యధికవంతము. సకల శ్రేయోప్రసాదకము.

నిరపేక్షత – నిష్కామము ఎక్కడ ఉంటాయో... అక్కడ నా పట్ల భక్తి అవిచ్ఛిన్నంగా వికాసమానమౌతూనే వుంటుంది.

భక్తియొక్క ప్రభావంచేత రాగము స్వయంగా తొలగుతుంది. రహితమౌతుంది. భక్తియొక్క

ప్రభావంచేత మాయాతీత భగవత్ వస్తువును స్వయముగా పొందుచున్నారు. అట్టి భక్తునికి విధి-నిషేధములకు సంబంధించిన పుణ్యపాపములు తాకజాలవు. శాస్త్రములు కూడా ఆతనిపట్ల ఎట్టివిధి - నిషేధములు విధించవు. "బాగా చదువుకుంటున్న బాలునికి బాగా చదవటానికి ఏఏ జాగ్రత్తలు కావాలి".... అని నియమాలు చెప్పంకదా! ఇదీ అంతే!

---

నేను చెప్పిన ఈ కర్మ-జ్ఞాన-భక్తి మార్గములను ఆచరిస్తూ వస్తున్నవారు... అట్టి జ్ఞానభక్తియొక్క ప్రభావముచేత కాలము - మాయలచే స్పృశించబడనట్టి వైకుంఠధామము పొందుచున్నారు.

**పరబ్రహ్మతత్త్వమును ఎరిగినవారై బ్రహ్మమే తామై వెలుగొందుచున్నారు.**

## 29. గుణదోష వ్యవస్థాస్వరూప రహస్యము

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ ప్రియ ఉద్ధవా! ఇప్పటివరకు కర్మ-జ్ఞాన-భక్తియోగ మార్గముల ప్రాసస్త్యమేమిటో చెప్పాను కదా!

**శ్లో॥ య ఏతాన్ మత్పథో హిత్వా భక్తి-జ్ఞాన-క్రియాత్మకాన్**
**క్షుద్రాన్ కామాన్ చలైః ప్రాణైః జుషన్తః సం సరంతి తే ॥ (అధ్యా 21, శ్లో1)**

నేను చెప్పుతూ వస్తున్న భక్తి-జ్ఞాన-కర్మయోగసంబంధములగు మార్గములను అనుసరించకుండా, అశ్రద్ధ - బద్ధకము - వ్యతిరిక్త భావన - అల్పావగాహనలతో చంచలమగు మనస్సుగలవారియొక్క, తుచ్ఛములైనట్టి ఇంద్రియ విషయములపై ఆసక్తి పెంపొందిచుకొనువారియొక్క - గతి ఏమిటో (The path they are walking ) అది కూడా వివరిస్తాను విను.

---

ఇంద్రియములకు తారసబడుచున్న విషయములే గొప్పవి... అని తలచి రోజులు గడుపువారు నానావిధ యోనులలో సుదీర్ఘప్రయాణము చేస్తూ ఉంటారని గుర్తుచేస్తున్నాను.

**సగుణము :** తనకు అర్హమైన ఆశ్రమము - అధికార మార్గమును సశాస్త్రీయముగా ఆశ్రయించటం, ప్రేమ-దయ-దానము-దైవోపాసన-ఇత్యాధివి పెంపొందించుకొనే ప్రయత్నంలో వుండటం - **సగుణము.**

–      అట్లా ఆచరించకపోవటమే **దుర్గుణము.**

**శ్రీ ఉద్ధవుడు :** పరంధామా! సర్వము పరబ్రహ్మమేకదా! సర్వం ఖల్విదం బ్రహ్మ – అనికదా ఉపనిషత్ మహావాక్యము! మరి శాస్త్రములలో మరికొన్ని విభాగములు "ఇది యోగ్యము – ఇది అయోగ్యము" అని వస్తుసముదాయములగురించి, ఇది "శుద్ధము – ఇది అశుద్ధము, ఇది శుభము – ఇది అశుభము" అని విధి–నిషేధ ప్రతిబంధక – అనుబంధక విషయముల గురించి ఎందుకు చెప్పుచున్నాయ్?

ఈ రెండు ప్రవచనములను సమన్వయించుకోవటం ఎట్లా?

**శ్రీకృష్ణుడు :** ఈ జీవుడు స్వాభావికవృత్తిచే ద్రవ్య విశేషములపట్ల ఆరర్షితుడగుచు **ఆత్మదృష్టి – పరాదృష్టి** ఏమరుస్తున్నాడు. ఫలితం? కల్పితము – క్షణక్షణ పరివర్తనము అగు దృశ్యధ్యాస ఈతనిని దుఃఖితునిగా, అల్పాశయునిగా, బలహీనునిగా చేసివేస్తోంది. మహనీయులగు మహర్షులు తమబిడ్డలగు అజ్ఞానజీవుల అపార జన్మ–జరా–సంసార దుఃఖాలకు హృదయం ద్రవించి, వారి దుఃఖాలు తొలగించ పూనుకొనుచున్నారు. అందుకు ప్రారంభ పాఠ్యాంశంగా...,

- ఇది యోగ్యము. ఇది కాదు.
- ఇది పుణ్యము – ఇది పాపము.
- ఇది శుద్ధము – ఇది అశుద్ధము.
- ఇది విధి – ఇది నిషిద్ధము.

మొదలైనవన్నీ శాస్త్రరూపంగా రచించి జనులకు ప్రసాదించటం జరుగుతోంది. అట్టి ధర్మశాస్త్రములు, శాస్త్రప్రవచిత తదితరమార్గములు మొదలైనవి అనుసరణీయమని, ఆచరణకు సాధ్యమేనని మనువు మొదలైన నా అవతారములద్వారా నేను జనులకు దృష్టాంతపూర్వకంగా సర్వజనులకు బోధిస్తూ వస్తున్నాను.

---

ఓ ఉద్ధవా! స్వప్నము స్వప్న దర్శిలోంచే బయల్వెడలుతోంది కదా! సర్వమునకు మూలము స్వస్వరూపమగు పరబ్రహ్మమే! అట్టి పరబ్రహ్మమునుండే ఆకాశము – వాయువు – అగ్ని – జలము – భూమి అనునవి బయల్వెడలుచున్నాయి. ఆ పంచభూతములే బ్రహ్మనుండి – స్థావరము వరకు గల సర్వప్రాణుల శరీరాలకు మూలకారణం. అందుచేత పంచభూతములు – పంచభూత నిర్మిత భౌతికదేహములు పరమాత్మ వస్తువుతో

సంబంధము కలిగి ఉన్నాయి. అనేక రకాలైన కుండలకు మట్టియే అధిష్ఠానం అయినట్లు సర్వప్రాణులకు మూలవస్తువు సచ్చిదానంద బ్రహ్మమే!

అయితే....,

ప్రాణుల దేహములు, భౌతిక పదార్ధముల దృష్ట్యా సమానములే అయినప్పటికీ... గుణములదృష్ట్యా భిన్నముగా ఉంటున్నాయి. అట్టి ఈ జీవుల పురుషార్ధసిద్ధి కొరకై వేదములు సాధనాక్రమమును (The techniques and methods for practising) ప్రతిపాదిస్తున్నాయి. పరమాత్మ సర్వదా ఒక్కటే అయినప్పటికీ జీవుల వివిధ మనోస్థితిగతులకు ఔషధరూపంగా వివిధ దేవతా ఉపాసనలను - పూజాక్రమములను - యజ్ఞ యాగ విధానాలను కల్పించి మంత్ర - తంత్ర - విధి - విధానములను వేదములు అందించటం జరుగుతోంది!

ఓ సాధుశ్రేష్ఠా! విధి-నియమము లేకుంటే సాధన-సార్ధకత అనేవి లభించవు. కర్మల నియమము ( conditioning the functioning) లేకపోతే ఈ జీవుడు ఈ సంసారారణ్యంలో చిక్కుకొని దిక్కుతోచని బాటసారియే అయిపోతాడు.

**శ్లో॥ దేశ-కాలాది భావానాం వస్తూనాం మమ సత్తమ।**
**గుణదోషౌ విధీయేతే నియమార్థం హి కర్మణామ్ ॥ (అధ్యా 21, శ్లో 7)**

అది దృష్టిలో పెట్టుకునే నేను దేశము - కాలము ఇత్యాది పదార్ధములకు, ధాన్యము-ధనము ఇత్యాది వస్తువులకు గుణదోషములను - కాలదోషములను విధించాను సుమా!

---

ఓ ఉద్ధవా! సర్వము బ్రహ్మమే! అని చెప్పే వేదములే అనేక దేవతా ఉపాసనలు - వివిధ రీతులైన విధి-నిషేధములు - బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రవర్ణ విభాగ ధర్మములు కూడా ప్రతిపాదిస్తూ భేదత్వము కల్పిస్తున్నాయి. ఎందుచేత?.... అనే నీ ప్రశ్నకు కొన్ని విశేషాలను సమాధానంగా చెప్పుకుంటున్నాము కదా! ఇంకా మరికొంత వివరణను విను.

- అన్ని అడవులు ఒక్కతీరైనవే! అయితే అడవులలో సాత్విక జీవులైన మృగములు (జింకలు మొదలైనవి) ఉన్న ప్రదేశములు పవిత్రమైనవి.
- అన్ని ప్రదేశములు ఒక్కతీరైన భూమి- ఆకాశము - గాలి - అగ్ని - జలముల

సమ్మేళనమే! అయితే, ఏ ప్రదేశంలో బ్రాహ్మజ్ఞానులు - బ్రాహ్మణులు (వేద-పరిజ్ఞాన నిష్ఠులు) పూజించబడుచు, గౌరవించబడుచూ ఉంటారో... ఆ ప్రదేశములు పవిత్రములని, అట్లు కాని ప్రదేశములు అపవిత్రములని - పవిత్రాశయులకు నివాసయోగ్యం కాదని చెప్పబడుతోంది.

- ఏకాలములో ఉత్తమ కర్మలకై అవసరమగు ఉత్తమ ద్రవ్యములు లభిస్తాయో... ఆ కాలము శుభప్రదం - పవిత్రము. గుణవంతులు- ఉత్తమ కర్మలు, అందుకు అవసరమైన ద్రవ్యములు లభించని కాలము అశుభప్రదంగా - భావిస్తూ ఉంటారు. కాలము ఎప్పుడూ ఒక్కటే అయినప్పటికీ - శుభ - అశుభ కాలములను ఈవిధంగా బుధులు నిర్ణయిస్తూ ఉంటారు.
- ఆగంతుకమైన దోషములు గల కాలము - ప్రదేశము - పదార్ధములను త్యజించటానికి అర్హమైనవిగా భావించబడతాయి.
- వాక్కు ఒక్కటే అయినప్పటికీ శుభ-అశుభవాక్ భేదం గమనించి విజ్ఞులు వాక్తపోధనులై ఉంటారు.

ఈవిధంగా...,

- పదార్ధములకు శుచిత్వము - అశుచిత్వములు,
- ద్రవ్యములకు పవిత్ర - అపవిత్రములు,
- వచనములకు శుభ - అశుభములు,

కాలమునకు

- ప్రదోషకాలం (సూర్యాస్తమయ సమయములో చేయకూడనివి),
- ప్రాతఃకాలము - బ్రహ్మీముహూర్తము (ఉపాసనలు చేయవలసిన సమయం ఉదా. ఉదయం 4.00),
- మధ్యాహ్నకాలము (తర్పణలు ఇత్యాదులు నిర్వర్తించవలసిన సమయములు),
- ఉదయ - మధ్యాహ్న-సాయం-రాత్రి - అర్ధరాత్రులలో నిర్వర్తించవలసినవి - నిర్వర్తించకూడనవి.

ఇత్యాది మంచి - చెడు కాలనియమాలు,

- వచనములకు - ససంస్కార - కుసంస్కార సంబంధమైన శబ్దార్థాలు,

- జనులలో మహనీయులు - మహదాశయులు - అల్పాశయులు ఇత్యాదులన్నీ విభేధించబడుచున్నాయి. వేదములు - శాస్త్రములు మానవాళికి మార్గదర్శకత్వం వహించటానికే భేదములను కల్పించే ఆయా విశేషాలన్నీ ప్రతిపాదిస్తున్నాయి.

  ఇంకా దృష్టాంతపూర్వకంగా చెప్పుకోవాలంటే

వస్త్రము ఒక్కటే! ఆ వస్త్రము జలముతో పరిశుద్ధపరచి, ఆరవేసి అప్పుడు కట్టుకుంటే పరిశుద్ధవస్త్రము అంటాము. స్వీకరిస్తాము. ధరిస్తాము. మరొకరికి ధరించటానికి ఇస్తాము. అదే వస్త్రము మల-మూత్రములతోను, మురికిగాను ఉంటే? ఇది అపవిత్రవస్త్రము అని పిలుస్తాము కదా! ఇంటికి వచ్చినవారు ధరించటానికి అటువంటి అశుభ్రవస్త్రమును ఇస్తామా? లేదు కదా!

**ఉద్ధవుడు :** అవును కృష్ణా! మీరు చెప్పే భేద దృష్టి ఉత్తమమైన మార్గదర్శనం కొరకై శాస్త్రకల్పితమని నేను ఒప్పుకుంటున్నాను. ఆమాత్రంచేత **సర్వమ్‌ఖల్విదం బ్రహ్మ ( అంతా బ్రహ్మమే)** అనే ఆప్తవాక్యానికి లోటేమీ ఉండదనుట యుక్తియుక్తమే!

అయితే…

- ఏ ఏ పదార్ధము - ద్రవ్యము - వచనము - కాలము - సందర్భము - స్థలము - స్థానము - వ్యక్తులు పవిత్రములు? స్వీకరించటానికి అర్హములు? అనుసరనీయులు?
- ఏవేవి అనుసరణీయం కావు? త్యజించటం సముచితం?

ఇది మేము నిర్ణయించుకునేది ఎట్లా? శాస్త్రహృదయం - శాస్త్రవాక్యం సమన్వయించుకోవటం చేతకాకపోవటంచేత మేము దుర్మార్గానువర్తనులం (Followers of wrong path) అగుచున్నామేమోనని కొన్ని సందర్భాలలో మాకు అనిపిస్తోంది! అప్పుడు అట్టి సందర్భాలలో మేము ఏమి చేయాలి?

**శ్రీకృష్ణభగవానుడు :** అవునయ్యా! అటువంటి సందర్భముల కొరకేగదా,… విధాత-సృష్టికర్త యగు బ్రహ్మదేవుడు మానవాళికి గురువులను ప్రసాదిస్తున్నారు! బ్రహ్మముఖం నుండి వేదములు బయల్వెడలుచున్నది అందుకొరకేకదా, మరి!

ఒక తెలియని ఊరుకు బాటవెంబడి నడుస్తూ వెళ్ళేవాడు ఏం చేస్తాడు? త్రోవలో తారసబడే అనుభజ్ఞులను - విజ్ఞులను సమీపించి, అయ్యా! నేను ఈపేరు గల ఊరు వెళ్ళాలి.

కుడివైపుకు వెళ్ళనా? ఎడంవైపుకు వెళ్ళనా? ఎంతెంత దూరం?.... అని సంప్రదిస్తున్నాడా, లేదా! అట్లాగే ఆత్మానుభూతివైపుగా ప్రయాణించే మార్గాన్వేషకుడు (లేక) ముముక్షువు ఏం చేయాలి? **"ఏది ఔను? ఏది కాదు?"** అనే సందేహం వచ్చినప్పుడు...,

- విజ్ఞుల - అనుభవజ్ఞుల వచనములు - నిర్ణయములు పవిత్రములు. అజ్ఞులు చెప్పే మాటలు, సూచనలు, నిర్ణయములు అనుసరణీయములు కావు.
- బ్రహ్మజ్ఞుల మాటలు వినాలి. అనుసరించాలి.

సంసార స్వభావమును పుణికి పుచ్చుకొని లౌకికమైన ఆశయములతో చెప్పుమాటలు - అభిప్రాయములు అనుసరించకూడదు - అని గమనించాలి.

----

ఓ మిత్రమా! శివుని పూజకై పుష్పములు తీసుకువస్తాం. అయితే... జలముతో సంప్రోక్షం చేయబడి, చక్కగా - ప్రకాశవంతంగా - నవనవంగా ఉండే పుష్పాలను పవిత్రంగా భావించి చక్కటి వస్త్రములోకట్టి జాగ్రత్తగా తీసుకువస్తాం

అంతేకాని...,

నలిగిపోయినవి, వెలవెలపోయినవి, ఎవ్వరో వాసన చూచిచూచి ప్రక్కకు పడవేసినవి, ధరించివదలినవి - పూజకు ప్రోగు చేస్తున్నామా? లేదు. అట్టి పూలను పూజకు అపవిత్రంగా భావిస్తాం కదా! లేత పూలను గుప్పిటలో నొక్కినొక్కి పూజకు తెస్తామా? తేముకదా!

దశాహము - అభిషేకము మొదలైన పితృదేవతా - దైవకార్యములు నెరవేర్చు సందర్భములలో నూతనజలముతో జలజలపారే సరస్సు - తటాకము - నదుల జలం పట్టుకు వస్తాం. అంతేకాని, నీరు నిలచిపోయిన మురికిగుంటలలోని నీళ్ళు బిందెలతో నింపుకొని తెచ్చుకుంటామా? లేదే!

- పెద్ద పెద్ద సరస్సులలో నీరు పవిత్రము
- చిన్న చిన్న గుంటలలో బురదతో కూడిన నీరు అపవిత్రము.

అని ఏవిధంగా భావిస్తూ ఉంటామో...,

ఆవిధంగానే....,

అనుభవజ్ఞులను, మహనీయులను, శాస్త్ర - లోక విధానములు ఎరిగిన బ్రహ్మజ్ఞులను, భక్తులను, జ్ఞానులను, యోగులను, మంచి - చెడు, శుభ - అశుభ సమయ - సందర్భములు ఎరిగినట్టి మహనీయులను సమీపించి, వారి అభిప్రాయములను అవగాహనలను - అనుభవములను - అనుభూతులను తెలుసుకొని, దేశ-కాల-పదార్ధములను విశ్లేషించుకొని..., ఇకప్పుడు, "**ఇది ఇట్లా చేసెదనుగాక! అది అట్లా చేయనుగాక!**" అని తెలివిగా, లోకకళ్యాణ దృష్టిని కూడా కలుపుకుని సమరసభావనను సంరక్షించుకుంటూ విధి-విధానాలు, నిషేధాలు నిర్ణయించుకోవాలి సుమా!

**శ్రీ ఉద్ధవుడు :** మరి,... కొందరేమో అపవిత్రమైన - సంసార సంబంధమైన - సంకుచితమైన అభిప్రాయములు ఎలుగెత్తి ప్రకటిస్తూ..., మాకు అల్పాశయములను-కుమార్గములను తెలిసో-తెలియకో చూపటంకూడా జరుగుతోంది కదా? అశాస్త్రీయంగా చెప్పటం జరుగుతోంది కూడా కదా!

**శ్రీకృష్ణుడు :**

ఔను. నిజమే!

**శ్లో॥ శక్త్యా శక్త్యాథవా బుద్ధ్యా సమృద్ధ్యా చ యదాత్మనే**
**అఘం కుర్వంతి హి యథా దేశావస్థానుసారతః ॥ (అధ్యా 21, శ్లో 11)**

కొందరు సామర్థ్య - అసామర్థ్యములను, బుద్ధిని అనుసరించి అల్పదృష్టిని, సాంసారిక దృష్టిని, సంపద - ఆపదల భావావేశంతో సంకుచిత స్వభావమును వదలలేక.... అశుభంగా కర్మలు నిర్వర్తిస్తున్నారు. తదనుకూలమమైన తత్సంబంధమైన విషయాలను పదేపదే ఇతరులకు సంబోధించటం జరుగుతూ ఉంటుంది కూడా! "అదంతా ఆరీతిగా జదరగటం దేశ-కాలమాన పరిస్థితుల ప్రభావం కదా!..." అని గమనించి బుద్ధి సూక్ష్మతతో స్వీకరించవలసినది - స్వీకరించవలసినంత వరకు స్వీకరించాలి. త్యజించవలసినది - త్యజించవలసినంతవరకు త్యజించాలి. దేనినైనా మహదాశయముతో, సూక్ష్మబుద్ధితో, యుక్తాయుక్త విచక్షణతో సద్గురుబుద్ధి - మహావాక్యముల సహాయంతో పవిత్రము - అపవిత్రము అనుసరణీయము - అననుసరణీయం... ఇత్యాదులు బహుజాగరూకతతో నిర్ణయించుకోవాలి. అందుకేకదా, స్వబుద్ధి ఉన్నది!

---

లభించిన సమాచారమును పెద్దల అభిప్రాయములు - విశాలమైన దృక్పథము - పవిత్రమైన హృదయము - సునిశితమైన బుద్ధిల సహాయంతో ఏది పవిత్రమో - ఏది కాదో విచక్షించుకొని అటుపై అనుసరించాలి. దృష్టాంతానికి....,

**శ్లో॥ ధాన్య దార్వస్థితంతూనాం రస తైజస చర్మణామ్**
**కాల-వాయుః-అగ్ని-మృత్తోయైః పార్థివానాం యుతాయుతైః॥** (అధ్యా 21, శ్లో 12)

ధాన్యము మొదలైన ఆహారసంబంధమైన పదార్థములు, పెసలు - మినుగులు ఇత్యాది తైలపదార్థాలు, ఏనుగుదంతము, ఎముకలు, ఇటువంటి ఉపసామాగ్రి, బంగారు ఖనిజము మొదలైన లోహపదార్థాలు, చర్మము మొదలైన ఉపకరణపదార్థాలు.... ఇటువంటివన్నీ తారసబడినప్పుడు - లభించినప్పుడు జనులు ఏం చేస్తున్నారు చెప్పు? వాటివాటిని జలముతోను, అగ్నితోను, వాయువుతోను, మృత్తిక (మట్టి) తోను పరిశుభ్రం చేసుకుంటున్నారుకదా!

అట్లాగే లౌకిక జీవితంలో ఆయా ప్రదేశ-సందర్భములలో ప్రాప్తించే యుక్తాయుక్త విశేషయములనుకూడా శాస్త్రవాక్యములు - మహనీయుల అభిప్రాయములు - స్వబుద్ధి మొదలైనవాటిని ఉపయోగించుకొని పరిశుభ్రపరచుకోవాలి! అనుసరణీయాలను అనుసరించాలి. త్యజించవలసినవి త్యజించాలి.

వంటపాత్ర అపరిశుభ్రంగా ఉంటే ఒక ఇల్లాలు ఏం చేస్తున్నారు? మృత్తిక (మట్టి) మొదలైనవాటితో అపరిశుభ్రతను తొలగించి, ఆ తరువాత ఆ పాత్రలను ఉపయోగించి వంట చేస్తున్నారు. పూర్వరూపము వచ్చిన తరువాత పరిశుభ్రమైనదికదా!... అని భావిస్తున్నారు. ఆ ఇల్లాలు "పాత్రలు అశుభ్రంగా వున్నాయి. వంట ఏమి చేస్తాములే?"... అని అనుకుంటోందా? లేదుకదా!శుభ్రంలేదు - అశుభ్రం లేదు అనుకుంటోందా? అదీ లేదుకదా!

శాస్త్రవిహిత ఉపాసన - పూజ - ధ్యానము - తపస్సు... ఇత్యాది పవిత్ర కర్మలను ఆచరించటమే శాస్త్రోద్దేశ్యం. అటువంటి విధి - విధ్యాపూర్వక ఉపాసనాకర్మలు నిర్వర్తించాలనుకునేవాడు మునుముందుగా స్నానము-దానము-స్వధర్మ నిర్వహణ ఇత్యాదులతో సంసిద్ధపడాలి. ఉపనయనము - ఆసనము ఇత్యాది శాస్త్రప్రవచిత సంస్కారములను ఆశ్రయించాలి. సంధ్యోపాసన - భగవన్నామస్మరణ మొదలైనవాటితో

బుద్ధిని పవిత్రము - సునిశితము - విస్తారము చేసుకోవాలి. అటువంటి ప్రయత్నములో శాస్త్రములు చెప్పే విహిత-అవిహితములను, నియమ-నిష్ఠలను సూచనలుగా భావించి అనుసరించటమే ఉచితం!

"నేను నిర్వర్తించవలసిన నియమిత (Alloted) శాస్త్రీయ (ఉపాసనాపూర్వక) కర్మలు- నా బుద్ధిని పవిత్రము - విస్తారము చేసుకోవటానికి సుమార్గము - అవకాశము కదా! -అను అవగాహనతో, సదుద్దేశ్యముతో కర్మలు నిర్వర్తించాలి.

**శ్లో॥ మంత్రస్య చ పరిజ్ఞానం కర్మ శుద్ధిర్మదర్పణం**
**ధర్మ సంపద్యతే షట్భిః! అధర్మస్తు విపర్యయః ॥ (అధ్యా 21, శ్లో 15)**

సద్గురు ముఖతః మంత్రం స్వీకరించుటచే లక్ష్యశుద్ధి ఏర్పడుతుంది. పరమాత్మనగు నాకు సమర్పణభావంతో కర్మ నిర్వర్తిస్తూ ఉంటే,... ఆ కర్మ పవిత్రమౌతుంది.

ఈవిధంగా 1. దేశము (Place)) 2. కాలము (Time) 3. ద్రవ్యము (Material) 4. కర్త (Doer) 5. మంత్రము (Chanting) 6. కర్మ (Function)... ఈ ఆరు పవిత్రం చేసుకోబడుతూ ఉండాలి. ఈ ఆరు పవిత్రము - సుసంపన్నము అవుతూ ఉండగా క్రమంగా చేసే సాధన పరిఢవిస్తూ ఉంటుంది. ధర్మముతో కూడిన భావాలు బలం పుంజుకుంటూ వుంటాయి.

అట్లా కాకుండా ఉంటే? అధర్మము ప్రవృద్ధమయ్యే ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరిక చేస్తున్నాను! ధర్మము శ్రద్ధగా ఆశ్రయించబడనిచోట అధర్మము స్వయముగా వృద్ధి పొందుచున్నది. చిత్తడిరాయిపై నిలవనీటి ప్రభావంచేత పాచి తనంతటనే ప్రవృద్ధమౌతోంది చూచావా? అది అంతే!

## 30. ధ్యాసలు - పర్యవసానములు

**శ్రీకృష్ణుడు :** ఓ ఉద్ధవా! ఒక గుణము (One type of quality (or) Approach) దేశ - కాల - సందర్భ - సంఘటనలను అనుసరించి మరొకచోట దోషము అవుతుంది. అట్లాగే వేరొకచోట గుణమయినది ఇక్కడ దోషము అవుతుంది. ఒకే విషయము ఒకచోట గుణము (Acceptable, Positive), మరొకచోట దోషము (Fault, Non-acceptable, Negative) అవటం ఇదంతా సాంఘిక సందర్భ - సంబంధానుచితంగా ఉంటూ ఉంటుంది. ఈవిధంగా గుణముగాని, దోషముగాని ఆయా సందర్భములలో వేరువేరుగా

ఉండటం అందరికీ విదితమైనదే! దీనివలన మనం గమనించవలసినది ఏమిటి? ఇది **సద్గుణము, ఇది దోషము** – అనేది ఆచారాది వ్యవహారాదుల దృష్ట్యా చూస్తే కల్పితమే గాని సహజం కాదు.

కానీ....,

కొన్ని గుణముల విషయంలో "ఏదోలే! ఒకరకంగా మంచి మరొకరకంగా చెడు కదా" అని శాస్త్రవిహిత కర్మలవిషయంలో బద్ధకంతో సరిపెట్టుకోకూడదు. అతి జాగరూకులై సమయము – అవకాశములను పరిశీలించుకుంటూ – సమన్వయించు కోవాలి సుమా! అంతేగాని అశ్రద్ధ–బద్ధకము, ఆలస్యము సత్కర్మల విషయంలో పనికిరాదు. మహనీయులు జనులగుణ దోషములను – బలహీనతలను – పరస్పర సానుకూల్యతలను దృష్టిలో వుంచుకొని విధి–నిషేధములను శాస్త్ర రూపంగా ప్రవచిస్తున్నారు. కనుక అవి అనుసరణీయం!

ఇక

- సురాపానము (Intoxicated Drinks) సేవించటం చేత మంచివారు కూడా చెడ్డగా వ్యవహరిస్తారు. కనుక అది నిషేధమే! కాని పతితుతుడైన వ్యక్తికి సురాపానం వలన పతితమవటం క్రొత్తగా ఉండదుకదా!
- యతులకు స్త్రీ సంగము నిషిద్ధము. మరి గృహస్థులకో! భార్యతో సంగమము దోషము కాకపోగా, "ఈ భగవత్ స్వరూప జీవిత భాగస్వామిని సంగమము ద్వారా ఉపాసిస్తూ పరమాత్మను సేవిస్తున్నాను..." అనే భావన ఒక ఉపాసన, సద్గుణము కూడా!

మంచముపై పరుండినవాడు "ఆదమరచిక్రిందపడ్డాడే!..." అనేది సందర్భపడవచ్చు. క్రింద పరుండినవాడో, క్రిందపడటం ఎక్కడుంటుంది?

అందుచేత "**ఆతడు దుర్గుణము సేవిస్తున్నాడుకదా! పరులను దూషించటం మొదలైనవి చేస్తున్నాడు కదా! ఇక నేనూ అట్లాగే చేస్తే తప్పా? ఏమీ కాదు...**" అని ఒక సద్గుణుడు దుర్గుణ ప్రయత్నశీలుడు కాదలచరాదు సుమా!

ఇక్కడ ఇంకొక విషయము కూడా గుర్తుచేస్తున్నాను విను.

**శ్లో॥ యతోయతో నివర్తేత విముచ్యేత తతస్తతః**
**ఏషధర్మో నృణాం క్షేమః శోక–మోహ–భయాపహః ॥** (అధ్యా 21, శ్లో 18)

**ఎవ్వడైతే ఎంతెంతవరకు ఏఏ దృశ్యవిషయముల నుండి విరమిస్తున్నాడో, నివర్తుడగుచున్నాడో... ఆతడు అంతతంతవరకు ఆయా విషయములనుండి నివృత్తుడు** (Relieved) **అగుచున్నాడు.**

ఎవడు ఏఏ ప్రాపంచక విషయములందు కర్మచేతగాని మనస్సు-భావలనచేతగాని, ఆవేశ-కావేశములచేతగాని, కోప-తాప-భయములచేతగాని ప్రవృత్తుడు అగుచున్నాడో, ఆతడు **అంతతంత వరకు బద్ధుడు** (Bounded) **అగుచున్నాడు.**

ఒక ముఖ్య విశేషం ఏమంటే...,

**నివృత్తి లక్షణ ధర్మమే జీవునికి పరమసుఖము కలిగించగలదు సుమా! నివృత్తి క్రమంగా శోక-మోహ-భయములను సన్నగిల్లజేచేస్తూ వాటిని నశింపజేయగలదు.**

విషయచింతనయే సంసారము అనబడుదానికి మూలము.

**శ్లో॥ విషయేషు గుణాధ్యాసాత్ పుంసః సంగస్తతో భవేత్**

**సంగాత్ తత్ర భవేత్ కామః కామాత్ ఏవ కలిః నృణామ్ ॥ (అధ్యా 21, శ్లో 19)**

| | | | | |
|---|---|---|---|---|
| గుణములపట్ల ధ్యాస Avocation | విషయ చింతన Chanting Memorizing | సంగం Attach-ment | కామము Desire | కలనము సంసారము Relatedness |
| కలనము / సంసారము | క్రోధము Emotional / Angry | మోహము Misconcep-tion, illusion | తమస్సు All bondages ignorences | వ్యవహార సంకుచితత్వము Bilittleness in situations |

ఈవిధంగా విషయములు సదా మననము చేస్తూ ఉండగా వాటితో **సంగము**, సంగము వలన **కామము**, తద్వారా **క్రోధము, మోహము**... మోహము నుండి అజ్ఞాన భ్రమ రూపమగు **సంసారము** వచ్చి కప్పివేస్తున్నాయి.

మరి ఇప్పుడు ఉపాయమో?

ఏది కార్యము? ఏది అకార్యము?

ఏది ఉచితము? ఏది అనుచితము?

ఏది ముక్తి ? ఏది బంధము? ఏది అనుసరణీయము - ఏదికాదు?

ఏది ఆదరణీయము? ఏది అనాదరణీయము?

ఏది మార్గము? ఏది అడ్డు?

ఇటువంటి విచారణతో కూడిన కార్య-అకార్యములను విశ్లేషించక-ఆశ్రయించక కాలం వెళ్ళబుచ్చే జీవుడు అసత్తుల్యుడే సుమా! ప్రాపంచక సంఘటనలను మననం చేస్తూ ఆదుర్దా - ఆవేశము-అసూయ-అసంతృప్తి-భయ ఉద్వేగాలు మొదలైనవి పొందువాడు - ఎవరో వ్రాసిన కథలోని పాత్రలమధ్య గల సంబంధములను చదువుతూ వెక్కివెక్కి ఏడ్చు వంటివాడు! అదంతాకూడా ఏదో నాటకం చూస్తూ, అందులోని సంఘటనలకు స్పందించి ఇంటికివచ్చి తెల్లవార్లూ కోప-ఆవేశాలతో ప్రగ్గటం వంటిది.

**తతోఽస్య స్వార్థ విభ్రంశో! మూర్ఛితస్య మృతస్య చ ॥ (అధ్యా 21, శ్లో 21)**

స్వస్వరూపార్థము నుండి భ్రంసము పొందినవాడే అగుచున్నాడు. దృశ్యముతో తదాత్మ్యము చెంది రోజులు గడుపువాడు ఆధ్యాత్మశాస్త్రానుసారం మూర్ఛితుడు, మృతుడు! భ్రష్టుడు! విషయములందు మిక్కిలి అభినివేశము కలవాడు చేతనశూన్యుడై ... తనను తాను గుర్తించలేడు! పరమాత్మనూ గుర్తించలేడు! ఒక వృక్షమువలె ప్రాణధారణ చేయటానికి ఉపయోగబడే భౌతిక వస్తువులను మాత్రమే (భౌతిక దేహములను మాత్రమే) గుర్తించగలడు.

ఆతడు ఊపిరి పీల్చడం - వదలటం - అదంతా కొలిమితిత్తిలో గాలి యొక్క ప్రవేశ-నిష్క్రమణములవంటిదే అవుతోంది. అనగా, అదంతా నిష్ప్రయోజనమే!

**శ్రీ ఉద్ధవుడు :** ఆయా కర్మలవలన స్వర్గము మొదలైన సుఖలోకాలు లభిస్తాయికదా, కృష్ణయ్యా! వేదశాస్త్రములు అట్టి ఫలశ్రుతులను చెప్పుచున్నాయి కదా!

**శ్రీకృష్ణుడు :** అవును. కానీ ఏం లాభం? అవన్నీ పరమపురుషార్థమును కలిగించలేవయ్యా! వేదములు స్వర్గము -ఇత్యాది ప్రయోజనములగురించి ఎందుకు వర్ణిస్తున్నాయంటావా? విను.

ఒక తండ్రి తన కుమారినికి రోగనివారణం కొరకై ఒక ఔషధం తెచ్చాడు. ఆ ఔషధము పిల్లవాడిని ఆరోగ్యంగా తీర్చిదిద్దగలదు. ఆ విషయం పిల్లవాడికి కూడా తెలుసు. కానీ ఆ ఔషధము యొక్క రుచి పిల్లవాడికి నచ్చక, విముఖుడై, త్రాగటానికి మారాం చేస్తున్నాడు. అప్పుడు ఆ తండ్రి ఏదో మిఠాయివంటి మధుర పదార్థములను చూపించి "ఈ మిఠాయి

ఇస్తాను. కానీ వెంటనే ఈ ఔషధం మింగాలి! మరి నీకు ఇష్టమేనా?..." అంటాడు. అప్పుడు ఆ పిల్లవాడు మిఠాయికోసం ఔషధాన్ని సేవించటానికి ఒప్పుకుంటాడు. అటు తరువాత ఒకటి-రెండు రోజులకు రుగ్మతనుండి ఔషధము కలిగించే ఉపశమనమును గమనించి తనకు తనే, "నాన్నగారూ! ఔషధం ఇవ్వండి! చాలు..." అనటం ప్రారంభిస్తాడు. స్వర్గాది లోక ఫలాలన్నీ కూడా-ఒక తండ్రి తన బిడ్డను ఏమర్చటానికి, ఔషధసేవకు సిద్ధం చేయటానికి చేసే ప్రయత్నము వంటిదే! బుజ్జగింపు మాటలవంటివి! ఎందుకంటే స్వర్గలోకాలవంటి ఫలాలు ప్రాపంచకమైన సంపదల వంటివే!

వేదశాస్త్రములు మోక్షరూపమగు పరమ శ్రేయస్సును కలుగజేయానికి వ్రతాలు చేయండి! కష్టాలు పోతాయి.... ఇటువంటి వాక్యాలు ఆ తీరుగా అందిస్తున్నాయని గమనించు!

## 31. అనర్ధ హేతువులందు ఆసక్తి

**శ్లో॥ ఉత్పత్త్యైవహి కామేషు ప్రాణేషు స్వజనేషు చ**
**ఆసక్త మనసో మర్త్యా ఆత్మనో అనర్ధ హేతుషు ॥ (అధ్యా 21, శ్లో 24)**

ఓ ప్రియ ఉద్ధవా! ఈ మానవులలో అనేకులు స్వభావసిద్ధంగానే అనర్ధములు కలిగించగల కోరికలు - దేహము - స్వజనలు - వ్యవహారములపట్ల అత్యంత ఆసక్తిని పెంపొందించుకొని ఉంటున్నారు. **మేము ధన-జన-యౌవన-వస్తు-గృహ సంపదల కోసమే జీవించాలి!...** అని భావావేశము ప్రదర్శించుకుంటున్నారు. ఇక్కడ కనబడే ఇంద్రియ విషయములపట్ల అత్యంతాసక్తతతో జీవిస్తూ- **ఇంద్రియ సందర్భములను ఆత్మజ్ఞానానందము కొరకు ఏరీతిగా ఉపయోగించవచ్చు?.....** అను విషయమై అత్యంత అనాసక్తులై, ఏమరచినవారై "మానవజన్మ" అనే సదవకాశమును వృధా చేసుకుంటున్నారు.

అందుచేత శాస్త్రములు మునుముందుగా "జగత్ లాభములు" అనే తాయిలం చూపించి జీవులను "సాధన" అనే మార్గమునకు ఎలుగెత్తి పిలుస్తున్నాయి.

మిత్రమా!

పరమ సుఖమే (ఆత్మ సుఖమే) శాస్త్రకారుల మహదాశయమని గుర్తించు. అంతేగాని భౌతిక సుఖ సంపదలు ముఖ్యోద్దేశ్యమే కాదు!

**పునరావృత్తి దోషము :**

పరమసుఖమును తెలుసుకోక, (అనగా) ఆత్మతత్త్వము గురించి (లేక) స్వస్వరూపము గరించి సమాచారము సంపాదించి, అనుభవైకవేద్యం కొరకై ప్రయత్నించకుండా,

ఎవ్వరైతే...,

ఈలోకంలోనో (లేక) మరొకలోకంలోనో ఏదో సాధించాలి... అనే కామమార్గములో అడుగులు వేస్తూ ఉంటారో..., కామ మార్గ సంచారాలు ఆవేశంగా కొనసాగిస్తూ ఉంటారో...,

అట్టివారిపట్ల **పునరావృత్తి** అనే దోషము కొనసాగుతూనే వుంటుంది. అట్టివారు మరల అనేక తామసయోనులలో ప్రవేశించవలసిన అగత్యమును తొలగించుకోనివారే - అగుచున్నారు.

వేదములలో చెప్పిన దృశ్యసంబంధమైన ఫలములు - ప్రయోజనములు సత్యమే! అయితే, కామ కామాః లభంతి.... అనునది ఆశయంగా కలవాడు వేదహృదయమైన వేదాంత విద్యలో ఎలా ప్రకాసిస్తాడు చెప్పు? జీవునకు మోక్షమే ప్రసాదించగల మహదాశయ స్వరూపమైన వేదమాత అల్పలక్ష్యములను మహాశయంగా చెప్పుతుందా? లేదు.

పిల్లవాడిచేత బాగా చదివించి విజ్ఞానదురంధరునిగాను, మహాపండితునిగాను తీర్చి దిద్దాలనే ఉద్దేశ్యంగల అమ్మ "మా అబ్బాయి తియ్యటి లడ్లు, చెక్కిలాలు తింటే చాలండీ! చదివి తెలివికలవాడు కానఖర్లేదు..." అని అనుకుంటుందా? కానేకాదు.

పసిబిడ్డ స్వభావులగు జీవులను బుజ్జగించటానికి ఏదో స్వర్గ-తదితర సుఖలోక ఫలములు - ప్రయోజనములు కొద్ది సమయం చెప్పుచున్నప్పటికీ... వేదమాత యొక్క సహృదయత - అంతిమలక్ష్యము మోక్షమే! ఆత్మజ్ఞానమే! ఆత్మానుభూతియే!

## అవాంతర - ఆత్యంతిక ఫలన్యాయం

**శ్లో॥ ఏవం వ్యవసితం కేచిత్ అవిజ్ఞాయ కుబుద్ధయః**

**ఫలశ్రుతిం కుసుమితాం న వేదజ్ఞా వదంతి హి ॥** (అధ్యా 21, శ్లో 26)

ప్రతిఒక్క కార్యమునకు రెండువిధాలైన ఫలములు - (లేక) ప్రయోజనములు ఉంటూ ఉంటాయి.

1. అవాంతర ఫలములు - Temporarily appearing result / achievement

2. ఆత్యంతిక ఫలములు - Final Result. Final outcome.

వేదములు ప్రతిపాదించే యజ్ఞయాగాదులకు అంతిమఫలము ఉత్తమ లోకములే!... అనే ఉద్దేశ్యమును కొందరు కలిగి ఉంటున్నారు. వారిని అవిజ్ఞాతులని, అల్పబుద్ధికి పరిమితులగుచున్నారని చెప్పబడుతోంది. అట్టి ఫలములగురించిన వాక్యములు (ఊర్ధ్వలోకములలో లభించే ఇంద్రియ సంబంధమైన సుఖముల గురించిన ప్రసంగాలు) వినటానికి కొందరికి కమనీయంగా అగుపిస్తాయి. (పుష్పితాంవాచః ప్రవదంతి అవిపశ్చితః).

అయితే, వేదజ్ఞులు అట్లా అనుటలేదు. స్వర్గలోకసుఖాలను దృష్టిలోపెట్టుకొని అగ్నికార్యము మొదలైన కర్మలయందు అభినివేశము కలవారిని గమనించినప్పుడు వేదజ్ఞుల ఉద్దేశ్యంలో వారు అల్పజ్ఞులు, అల్పకాముకులు, దీనులుగా చెప్పబడుచున్నారు. కర్మఫలములందు ఆసక్తి గలవారి గురించి "వీరు ధూమమార్గమును అవలభించువారు (This path is towards increasing ignorence, innocence and darkness)..." అని చెప్పుచున్నారు. "ఏదో పొంది సుఖించెదముగాక..." అను భావావేశము, ఆశయములు - కొన్ని సందర్భాలలో - ఆత్మతత్త్వమును తెలుసుకొనే అగ్నియానం (మార్గము)లో - అడ్డుగా నిలుస్తున్నాయి.

ఓ ఉద్ధవా! మిత్రమా! చూపు సన్నగిల్లినట్టి గ్రుడ్డివాడు అతి సమీపంలో ఉన్న అత్యంత విలువైన వస్తువును గుర్తించలేడు, గమనించలేడు కదా! అట్లాగే, కర్మఫలవాదులు "దృశ్య విషయములు - హింస" ఇత్యాదులతో కూడిన యజ్ఞములు మొదలైనవాటిపట్ల మాత్రమే శ్రద్ధ-ఆసక్తి కలిగి ఉంటారు. అంతేగాని, యజ్ఞపురుషుడను, ఈ దృశ్యమాన జగత్తుకు కారణభూతుడను, సర్వుల అంతః - హృదయాంతరంగుడు, సర్వాంతర్యామిని, స్వస్వరూపుడను, అగు నన్ను తెలుసుకోలేకపోతున్నారయ్యా!

ఓ ఉద్ధవా! "స్వకీయాత్మయే జగత్తుగా కనిపిస్తోందికదా!..." అనే ఆత్మదేవోపాసనను ఏమరచి, అపరోక్షజ్ఞానాశ్రయమును నిర్వర్తించక, కొందరు పరోక్షజ్ఞాన విశేషముల వరకు మాత్రమే వేదములనుండి స్వీకరిస్తున్నారు. కర్మవాదులై - వారు యజ్ఞయాగాదులద్వారా స్వర్గాది దేవతలను పరోక్షవిధిగా ఉపాసిస్తున్నారు. హింస-

పశుమాంస భక్షణలతో కూడిన యజ్ఞములద్వారా కేవలం దేవతలను, పితృదేవతలను, భూతములను ఆరాధిస్తూ ఉన్నారు. "యజ్ఞ-యాగాదుల ఆత్యంతికోద్దేశ్యము ఆత్మోపాసనయే! ఆత్మ సాక్షాత్కారమే!..." అనేది గమనించటం లేదు. సర్వ కర్మలు - ఉపాసనలు - తపోధ్యానముల అంతిమలక్ష్యము ఏమిటి? - **సర్వము ఆత్మస్వరూపంగా సందర్శించి ఆత్మానందము - అలౌకికానందము అనునిత్యం చేసుకోవటమే!** అంతేగాని, (వేదముల ఉద్దేశ్యము) పరిమితములు - పరోక్షరూపములు అగు స్వర్గాదులు, ఉపాసనా ఫలప్రద దైవలోకాలు కాదయ్యా!

ఒక దృష్టాంతము విను!

బాగా కష్టపడి ధనం సంపాదించిన ఒక వ్యాపారికి ఒక ఆలోచన వచ్చిందట. నా దగ్గర ఉన్న డబ్బుతో సముద్ర జలాన్ని కొని అందులో వెతికి రత్నరాసులు పట్టుకొని కోటానుకోట్ల ధన సంపన్నుణ్ణి అవుతాను కదా - అని అనుకున్నాడు. డబ్బంతా వెచ్చించి సముద్రములో 2 చ॥మైళ్ళ విస్తీర్ణంగల సముద్ర జలముపై హక్కులు కొనుక్కున్నాడు. ఆ 2 చ॥ మైళ్ళ విస్తీర్ణంలో ఆతనికి కొన్ని చేపలు తప్పించి రత్నాలేవీ దొరకలేదు. ఆ 2 చ॥ మైళ్ళ విస్తీర్ణ సముద్రము ఆతనికి మరొకమైన ఏరీతిగాను ఉపయోగించటం చేతకాదు. ఆవిధంగా ఆ ధనికునికి డబ్బుపోయింది. రత్నాలు లభించలేదు. ఏమీ చేయలేకపోయాడు. మరల బికారి అయ్యాడు.

పైన చెప్పిన వ్యాపారి దృష్టాంతంలాగా మందబుద్ధికలవారు "మాకు స్వర్గాది లోకాలలో ఆనందమయ సుఖాలు లభించాలి" అని అనుకొని యజ్ఞ-యాగ-క్రతు ఇత్యాదులు నిర్వర్తిస్తున్నారు. లేదా, ఇహలోకంలో రాజ్యాధికారం కావాలి.... ఇత్యాదులు లక్ష్యంగా ఆశయంగా కలిగి యజ్ఞ-తదితర సాధనకర్మలకు ఉపక్రమిస్తున్నారు. అటువంటి ఫలములు లభిస్తాయి. కాని ఏం లాభం? అవన్నీ కూడా...,

- స్వప్నతుల్యము (Some Posh Building one happened to have been seeing in his Dream)
- నశ్వరము (It is going to slip from hands after some time)
- కేవలము శ్రవణ ప్రియము (Happy to hear but not going to give real happiness)

అల్పాశయము కలిగి – శ్రమతో, ఆయా వేద ప్రవచిత ఉపాసనాది యజ్ఞములు మొదలైనవి నిర్వర్తించటం ఉభయభ్రష్టత్వమే! శ్రమకు శ్రమ! లభించబోయేది క్షణభంగురం (మరియు) భ్రమాత్మకం మాత్రమే! అందుచేత, అల్పాశయములను ప్రక్కకుపెట్టి, మహదాశయముతో అవి నిర్వర్తించటమే ఉచితం!

ఈవిధంగా రజోగుణ తమోగుణ ప్రేరితులైన కొందరు సాధకులు లౌకికమైన ప్రయోజనము కొరకై **అన్య** దేవతోపాసనలకు ఉపక్రమిస్తున్నారు. కర్తకు **అనన్య** స్వరూపుడను – సర్వాత్మకుడను అగు నన్ను ఉపాసించటం ఏమరుస్తున్నారు. **అనన్యోపాసనయే ముఖ్యము సుమా!**

ఆత్మసాక్షాత్కారమే లక్ష్యమగుగాక!

**శ్లో॥ అనన్యాశ్చిన్తయన్తో యోతోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥** (భగవద్గీత)

ఈ విషయమే అర్జునునికి యుద్ధభూమిలో చెప్పిన గీతలో బోధించిఉన్నాను కదా!

అనన్యం – ఉపాసకునికి వేరైనది కానిది.
– ఉపాసకునికి ఎదురుగా కనిపించేదంతా తానే అయిఉన్నది.

ఇక్కడ అన్య దేవతోపాసనకుల గురించి మరొక్క విషయం కూడా చెప్పుచున్నాను. విను

- మేము ఈ లోకంలో యజ్ఞములు – యాగములు క్రతువులు నిర్వర్తిస్తాము.
- ఇంద్రాది అన్యదేవతలను సంతోషింపజేస్తాము.
- స్వర్గలోకం సంపాదించుకుంటాము.
- ఆ స్వర్గలోకంలో కొంతకాలం హాయిగా విహరిస్తాము. పుణ్యక్షయం వరకు ఆనందిస్తాము.
- అటుతరువాత భూమిపై ఉత్తమ వంశములలోను – సంపదలతోను విలసిల్లే గృహాలలో జన్మిస్తాం.

ఇటువంటి చంచలచిత్తులు, దృశ్యాభిమానులు, లుబ్ధస్వభావులు – ఆత్మావలోకనమునకు సంబంధించిన ఆత్యంతిక ఫలముపై ధ్యాస కలిగిఉండలేక పోతున్నారయ్యా!

## త్రికాండ విషయా వేదః - పరరోక్ష వాదా!

**శ్లో॥ వేదా బ్రహ్మాత్మ విషయాః త్రికాండ విషయా ఇమే**

**పరోక్షవాదా ఋషయః పరోక్షం మమ చ ప్రియమ్॥** **(అధ్యా 21, శ్లో 35)**

వేదములలో 3 విభాగాలు ఉన్నాయి.

1. కర్మకాండ (సంహిత)
2. ఉపాసనాకాండ (బ్రాహ్మణములు)
3. జ్ఞానకాండ (ఉపనిషత్తులు)

ఈ మూడింటిలో కూడా ఈ జీవాత్మ బ్రహ్మమే అను విషయమే ప్రతిపాదితమై ఉంటోంది. ఈ మూడిటిలోని మంత్రములు, ఆ మంత్రములను దర్శించిన మంత్రద్రష్టలగు ఋషులు కూడా ఈ విషయమునే ప్రత్యక్షముగా - పరోక్షంగా కూడా నొక్కి వక్కాణించి లోకములకు చేతులెత్తి ప్రకటిస్తున్నారు. జీవో బ్రహ్మైఽతి నాపరః సర్వం ఖల్విదం బ్రహ్మ... ఇత్యాది మహావాక్యాలను ఆత్యంతికాశయంగా విశదీకరిస్తున్నారు సుమా!

(ఉదా - పితృకార్యాలలో - అన్నం బ్రహ్మ - అహం బ్రహ్మ - భోక్తా బ్రహ్మ అని చెప్పుచున్నట్లు)

ఓ ఉద్ధవా! ఆవిధంగా పరమసత్యమును గుప్తంగాను - ప్రదర్శితంగాను కూడా చెప్పటం నాకు ఇష్టమే!

అయితే "**అంతా నా ఆత్మ స్వరూపమే అయి ఉండి, యధాతథమై కూడా ఉన్నది...**" అను మహత్తర - అనుక్షణిక - పరమసత్యమునకు అంతఃకరణ శుద్ధులగు వారే అర్హులగుచున్నారు సుమా! వారే ఇటు ప్రత్యక్ష, అటు పరోక్ష - ఆపై అపరోక్షవాదముల అంతర్లీన గానాన్ని అద్వైత తత్త్వమును ఎరుగగలుగుచున్నారు.

వేదములు శబ్ద బ్రహ్మము. అది స్వరూపముగాగాని, అర్థముగా గాని తెలియవచ్చేది కాదు. అయితే, వేదము ప్రాణమయము - ఇంద్రియమయము - మనోమయము అయి ఉన్నది.

వేదము - యొక్క శబ్దార్థము --- తెలియబడునది.

వేదాంతము - యొక్క శబ్దార్థము --- తెలియబడుదానికి ఆవలగల తెలుసుకొనువాడు తెలుసుకొనువాని గురించి తెలియజెప్పే శాస్త్రమే - వేదాంత శాస్త్రము!

తెలియబడుదానిలో తెలుసుకొనువాని గురించి వెతికితే లభించటం దుర్లభం. కల ఎవ్వరిదో... ఆతడు తనకొర్కకై ఆ కలలో వెతికితే లభిస్తాడా? లేదే! ఈవిధంగా వేదములు అనంతము - అపారము - గంభీరము అగు సముద్రమువలె దుర్గ్రాహ్యము.

అయితే...,

వేదాంత స్వరూపుడనైన నేను

- చతుర్వేదసారుడను. వేదములలో దాగివున్న వాడను!
- సర్వ వ్యాపకుడను!
- అనంతశక్తి స్వరూపుడను!
- అపరిచ్ఛిన్నుడను!
- తామరతూడునందలి దారము వలె ప్రాణులయందు తెలివి-నాదము రూపముతో లక్షితుడనై ఉన్నాను!

సాలెపురుగు యొక్క హృదయం నుండి - ముఖమునుండి దారములు బయల్వెడలు చున్నాయి. కదా! ఆరీతిగానే...,

- హిరణ్యగర్భ భగవానుడు ఛందోమయుడు. అమృతమయుడు.
- నాదరూపమగు ఉపాదానముతో కూడుకొని ఉన్నవాడు. నాదరూపుడు.

ఆయన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాదులతో కూడిన మనస్సుతో హృదయాకాశం నుండి ఓంకారనాదముతోకూడిన వేదములను ప్రకటించుచున్నారు. అట్టివేదములు ...,

- ఆరోహణ - అవరోహణ శబ్దజాలముతో నిర్మించబడుచున్నాయి.
- విచిత్రములైనట్టి వైదిక - లౌకిక పరిభాషాదులతో విస్తృతమైనట్టివి.
- ఉత్తరోత్తరా నాలుగు - నాలుగు అక్షరములతో వృద్ధి పొందు ఛందస్సులచే ఉపలక్షితమైనట్టివి.
- శబ్దములచే - అర్థములచే సమాప్తి చెందినట్టివి.
- అనేక మార్గములతో కూడినట్టిది.
- **వైఖరీ** (Style) ప్రధానమైనట్టిది.

అట్టి అనంతము - అపారము అగు శ్రుతులను (వేదములను) హృదయమునుండి స్వయముగా సృష్టికర్త సృజించుచున్నారు! మరొకప్పుడు ఉపసంహరించుచున్నారు.

**శ్లో॥ గాయత్రి ఉష్ణిక్ అనుష్టుప్ చ బృహతీ పంక్తి రేవ చ**

**త్రిష్టుప్ జగతి అతిఛందో హి అత్యష్టి ఇతి జగద్విరాట్ ॥** (అధ్యా 21, శ్లో 41)

గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి, అతిఛందము, అత్యష్టి, అతిజగతి, అతివిరాట్, ఈ ఛందస్సులన్నీ "వైఖరి" అను వేదములోనివే! వేదము సృష్టికర్తయగు బ్రహ్మదేవుని హృదయమే! బ్రహ్మదేవుని హృదయం సదా బ్రహ్మమే! ఈ విధంగా అంతా బ్రహ్మమే! (వైఖరి = Technique Style)

జీవుడు బ్రహ్మమే! ఆతనిచే తెలియబడుచున్నదికూడా బ్రహ్మమే!

బ్రహ్మ సాక్షాత్కారమే బ్రహ్మదేవుని హృదయం.

**ఈ జీవుడు సర్వము బ్రహ్మముగా ఆస్వాదించటమే సృష్టికర్తయగు బ్రహ్మదేవుని ఉద్దేశ్యము!**

కర్మకాండయందు కనిపించే విధి వాక్యములచే విహితమైనదేది? అవిహితమైనదేది?

ఉపాసనాకాండలోగల మంత్ర వాక్యములచే ప్రకాశితమౌతున్నదేమిటి?

జ్ఞానకాండచే నిషేధింపబడుచు (నేఽ తి) చెప్పబడుచున్నదేది?

ఈవిధమగు వేదవాక్యముల ప్రకృతి తాత్పర్యము పరమాత్మనగు నాకే ఎఱుక! అది చర్చనీయాంశము కాదు!

నేను బ్రహ్మమునే! "అహమ్ బ్రహ్మాస్మి" అనునది నిశ్చలం చేసుకోవటమే మహత్ ఆశయం! మిగిలినదంతా సందర్భ సత్యము. సహజసత్యము కాదు.

సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ అనునదే సత్యవాక్కు! ఋషివాక్కు! నా వాక్కు ఇదియే సహజసత్యము! పరమరహస్యమైన నిత్య సత్యము!

- వేదములు ..., కర్మకాండచే విధించుచున్నది నేనే!
- ఉపాసనాకాండమునందు ఉపాస్యదేవతా రూపముగా అభివర్ణించుచున్నది నన్నే!
- జ్ఞానకాండలో ఆకాశ-అంతఃకరణాది రూపంతో అన్యవస్తువులను ఆరోపించటం-నిషేధించటం కూడా జరుగుచున్నది - నాయందే!

ఇక, ఇక్కడ ఎదురుగా ఉన్నదంతా....,

- మనయేవ ఇదమాప్తవ్యం !
- మనోయః కరోతి తత్ కృతంభవతి ॥

- జగత్ స్వమనోరూపమేవ! ఇదంతా మనస్సే!
- కానీ..., మనస్సనేది కల్పితమే! వాస్తవానికి మనస్సనేదే ఆత్మకు వేరుగా లేదు.
- ఆత్మోపమ్యేవ సర్వత్రా!
- అద్వితీయం ఆత్మః ।

సర్వశ్రుతులు నన్నే ఆశ్రయించి నాయందు భేదమును ఆరోపిస్తున్నాయి.

మాయాప్రదర్శకుడనని చెప్పి నినదిస్తున్నది నన్నే!

- చివ్వరికి శ్రుతులు నా సమక్షంలో అన్నిటినీ నేఽతి నేఽతి వాక్యాలతో నిషేధించి నాయందు సశాంతిస్తున్నాయి.
- అధిష్ఠాన రూపంలో త్రికాలాలలో సర్వదా నేనే శేషిస్తున్నాను.
- **శేషసారమగు నేనే జగత్తులోని నేనుగా, జీవునిలోని నేనుగా, సాక్షిలోని నేనుగా ఆస్వాదించబడుచున్నాను! ఆస్వాదిస్తున్నాను, ఆస్వాదించబడుచున్న జగత్తు రూపంగా కనబడుచున్నాను! నాకు వేరుగా ఎప్పుడూ-ఎక్కడా ఏదీ లేదు!**

ఓ ఉద్ధవా! **నేనే నీవు! నీవే నేను!** తత్త్వమసి! వేదములు ఇది గానం చేస్తూ ఉన్నాయయ్యా! ఇదే తత్త్వశాస్త్ర సారం!

## 31. తత్త్వ సంఖ్య
## ప్రకృతి - పురుష వివేకము

**శ్రీ ఉద్ధవుడు :** ఓ దేవాదిదేవా! విశ్వేశ్వరా! విశ్వంభరా! మీ ప్రవచనం అమోఘం! ఇప్పుడు సాంఖ్యయోగం దృష్ట్యా కొన్ని విశేషాలు మీవద్ద వినాలని కుతూహలపడుచున్నాను స్వామీ!

వేరువేరు ఋషులు లోకములకు తాత్త్విక విశేషాలను అనేక సిద్ధాంతద్వారా విశదపరచారు. విశదపరుస్తున్నారు.

అయితే...,

ఋషులు తత్త్వమును ఏఏవిధంగా విభజించి సిద్ధాంతీకరించి చెప్పారు? ఎందుకని అట్లా చెప్పారు? మీరు ఇతఃపూర్వం... (19వ అధ్యాయంలో)

జీవుడు = 9 + 11 + 5 + 3 (మొత్తం 28) తత్త్వాలుగా చెప్పియున్నారు. నాకు గుర్తు ఉన్నది. కానీ... ఈ జీవునికి సంబంధించి

కొందరు .... 26 తత్త్వములని,

మరికొందరు .... 25 తత్త్వములని,

వేరే కొందరు .... 7 తత్త్వములని,

ఇంకొందరు .... 9 తత్త్వములని

ఇట్లాగే 17 అనీ, 14 అని, 13 తత్త్వాలని వేరువేరు గురువులు వారివారి శిష్యులకు, వారివారిప్రవచన గ్రంథములలోను చెప్పుతూ వస్తున్నారు. ఈ విభాగ సంబంధమైన తత్త్వ విశేషాల గురించి వివరించి చెప్పవలసినదిగా ప్రార్థిస్తున్నాను. ఇటువంటి వివిధ రీతులైన విభాగముల పాఠ్యాంశాలు వేరువేరు గురువులచే ఎందుచేత వేరువేరుగా చెప్పబడుచున్నాయి?

**శ్రీకృష్ణభగవానుడు :** అవును! ప్రకృతి తత్త్వములను ఒక్కొక్క మహనీయుడు ఆయా సంఖ్యాయుతంగా విభజించి మనస్సు - బుద్ధి - చిత్తము - అహంకారము - ఇంద్రియములు - ఇంద్రియార్థములు ... ఈవిధంగా (వేరువేరుగా) చెప్పటం - బోధించటం – సిద్ధాంతీకరించటం జరిగింది. జరుగుతోంది. జరుగబోతూ ఉంటుంది.

అవన్నీ యుక్తి యుక్తమే! వారంతా కూడా నాయొక్క మాయాశక్తిని ఆశ్రయించి తత్త్వ విశ్లేషణ చేసి చెప్పటం జరుగుతోంది. అదంతా అసందర్భం కాదు.

మాయా - యామా - ఏదైతే స్వతఃగా లేదో, అద్దానిని విశ్లేషించి, చెప్పేదంతా ఆత్మ తత్త్వాన్ని విశదపరచటానికే! అదంతా పరతత్త్వాన్ని నిర్వచించటానికి ఉద్దేశ్యించ బడుతోందయ్యా! అంతిమ సత్యమువైపుకు దారితీసే వివిధ మార్గవిశ్లేషణలు – విశేషాలు అవన్నీ!

**నదీనాం సాగరోగతిః!**

దృష్టాంతంగా ...,

**శ్లో॥ నైతదేవం యథాఽఽత్థ త్వం యదహం వచ్మి తత్తథా ।**

**ఏవం వివదతాం హేతుం శక్తయో మే గురత్యయాః ॥ (అధ్యా 22, శ్లో 5)**

ఉదాహరణకు : నీవు ఒకటి సిద్ధాంతపూర్వకంగా విభాగించి చెప్పుతావనుకో! నేను

వేరొకవిధంగా విభాగిస్తూ - "నేను చెప్పేదే సరి అయినది. ఉద్ధవుడు విభాగించినది కాదు" .. అంటూ ఉండటం జరుగుతూ వుంటుంది.

ఈవిధంగా వివిధ గురువులు వివిధరీతులుగా విభాగిస్తూ.... ఒక విభాగము మరొక విభాగమునకు కొంత వేరైనట్లు భాష్యం చెప్పబడటం, ఈ వ్యవహారాలన్నీ వివాద విషయములవలె కనిపించటం - ఇదంతా కూడా దురత్యయమగు నా మాయా విశేషమేనని గమనించు. నాయొక్క సత్త్వము - క్రియ - దర్శనము ఇత్యాది శక్తుల కించిత్ చమత్కారమైన క్షోభచేతనే వాదించుకొనువారి **వివిధ విషయభేదములు** జగత్తులో ఏర్పడి ఉండటం జరుగుతోంది. అవన్నీ వివిధ శ్రోతలకు వివిధమైన రీతులుగా విశదీకరించబడుచూ కొన్ని- కొన్ని కొందరి - కొందరికి ఎక్కువ సానుకూలమై ఉంటున్నాయి.

అయితే...,

ఇంద్రియ - మనో నిగ్రహము ఇంకా తగినంత రూపుదిద్దుకోనిచోట మాత్రమే వివిధ గురువుల సిద్ధాంతాలు వేరు వేరు రూపంగా అనిపిస్తోంది. ఆ సాధకుడు (లేక) ముముక్షువు శమ-దమములు పొందుతూ ఉండగా ఆ వికల్పములన్నీ తమంతట తామే లయమగుచున్నాయి. ఒకే నాదము భిన్న భిన్న రాగములుగా సంతరించుకొని శ్రోతలకు ఆనందం కలుగజేయటంవంటిదే..., అదంతా!

ఏది ఏమైతేనేం! వికల్పములు సన్నగిల్లుచుండగా వివాదములు కూడా సమసిపోతాయి!

వేరు వేరు రీతులుగా తత్త్వము వేరువేరు ద్రష్టలచే (గురువులచే) చెప్పబడుటానికి ముఖ్యకారణం ఏమంటే శిష్యుల వేరువేరైన ఇతః పూర్వపు సంస్కారములే! శ్రద్ధగా పరిశీలిస్తూ పోతూ వుంటే - తత్త్వవిచారణకు సంబంధమైన ఒకరీతైన విచారణలో మరొక రీతి అయిన విచారణ (అంతరంగా గమనిస్తే) ఉండనే ఉంటోంది. ఒకటితో మరొకటి అనుప్రవిష్టములై ఉంటాయి. ఇక విలక్షణ విశేషములను విచక్షణను అనుసరించి....,

| | |
|---|---|
| ఆ అభిప్రాయం | ఈ సిద్ధాంతములో విభాగమే! |
| ఈ అభిప్రాయం | ఆ సిద్ధాంతములో అంతర్లీనమే! |
| ఒక సిద్ధాంతంలో | ఒకటి కార్యము! |
| మరొక సిద్ధాంతంలో | అదే కారణము! |

ఒక సిద్ధాంతములో      ఒకటి మార్గాన్వేషణం!
మరొక సిద్ధాంతంలో     అదే మార్గదర్శనం!
(ఉదా : ద్వైత – విశిష్టాద్వైత – అద్వైతాలు)

ఆధ్యాత్మశాస్త్ర సిద్ధాంత విశేషాలలో ఒకదానిని అనుసరించి మరొకటి, మరొకదానిని అనుసరించి ఇంకొకటి... ఈవిధమైన సమీక్షా సిద్ధాంతాలు అనుగతమై ఉంటూ ఉంటాయి. వాస్తవానికి శ్రోతకు లాభించటానికి ఉద్దేశ్యించే **ఆత్మానుభవం (లేక) పరతత్త్వానుభవం వాక్కుకు – (చెప్పటానికి) – నిరూపణకు** (To prove or define) సిద్ధాంతీకరించి **ఇది ఇంతే అని** పరిమితం చేయటానికి సాధ్యపడేది కాదు.

- అది అనుభవైకవేద్యం!
- సిద్ధాంతాలన్నీ సూచనామార్గాలు మాత్రమే!

కాని ఆయా సిద్ధాంతాలన్నీ – శ్రోతయొక్క శ్రద్ధ – సునిశిత బుద్ధిని అనుసరించి విశ్లేషణ విమర్శ – ఆచరణలచే అనిర్వచనీయమగు ఆత్మానుభూతికి (లేక) ఆత్మ సాక్షాత్కారానికి తప్పక దారితీయగలవు. అవగాహన–సాధన–శ్రద్ధల సహాయంచేత **ఆత్మౌపమ్యేవ సర్వత్ర** అను మత్‌స్థానం (The state where I am placed (or) The state that I am experiencing) లభించగలదు. అట్టి అనుభవమునకు చేరుచుండగా సిద్ధాంతములు తమ విధి (Duty) పరిసమాప్తమైనది కాబట్టి స్వయంగా – సహజంగానే ఉపశమిస్తున్నాయి. (ఉదా : గణితశాస్త్రంలో x అనుకొనుము – అనునది సమాధానం లభించేంతవరకే కదా!)

అందుచేత..., ఎవ్వరు ఏఏ రీతులుగా

- తత్త్వశాస్త్రమునకు సంబంధించిన కార్య–కారణ విశ్లేషణను,
- ఇది ఇట్లు – అది అట్లుకాదు – ఇది ఉత్తమము – అది అల్పము అని చెప్పుచుండే న్యూనాధిక భావములు,
- వివిధ రీతులైన సంఖ్యావర్ణనములు,

విశ్లేషిస్తూ వివరణ చేస్తున్నారో,

- ఏఏ గురువులు – మార్గదర్శకులు, ఏఏ ఉద్దేశ్యాలతో ఏఏవిధమైన సిద్ధాంతాలను (To establish various Theories) ప్రవృత్తులగుచున్నారో...,

అవన్నీ ఆయా రీతులుగా యుక్తియుక్తములే అయి, **నాచే స్వీకరించబడుచున్నాయి.**

- తత్త్వానుభవానికి అవి మార్గదర్శకములు, ఉపకరణములుగా మలచుకొనుచున్నది ఆ సిద్ధాంతముల శ్రోతయే! కనుక ఓ శ్రోతలారా! మీ బుద్ధిని విస్తారము, సునిశితము, నిశ్చలము చేసుకొని సిద్ధాంతాలను పరిశీలిస్తూ ఉపయోగించుకుంటూ ఉండండి!

ప్రియ ముముక్షువులారా! ఆయాగురువుల సిద్ధాంతములతో బయటకు (బాహ్యానికి) కనిపించే కొన్ని భేదములను పెద్ద-పెద్దగా భావించి ఒకరి సిద్ధాంతములను మరొకరు దూషణములతో విమర్శించుకోవటానికి సంసిద్ధులు కాకండి! సారమును గ్రహించండి. తస్మాత్ సారం విజానీయాం! సిద్ధాంతముల హృదయమును ఏరీతిగా సమన్వయించుకొని ఉపయోగించుకోవాలో గమనించే సామర్ధ్యతను కలిగి ఉండండి. అవాక్ మానసగోచరముగా చెప్పబడే "ఆత్మౌపమ్యేవ సర్వత్ర సమం పస్యతి" అను స్థానమునకు వివిధ సాధనములు - వివిధ సిద్ధాంతములు, వాటియందు కనిపించే విభాగ భేదములు సూచన చేస్తూ ఉన్నాయి. మార్గమును చూపుచూ వున్నాయి. సమన్వించుకుంటూ ఆధ్యాత్మిక మార్గంలో అడుగులు వేయవలసినది శ్రోతయే సుమా!

ఈవిధంగా వివిధ విభాగ పూర్వక సిద్ధాంతములు సంభవమే! యుక్తియుక్తమే! **అవన్నీ నేను స్వీకరించుచునే ఉన్నాను.**

----

ఈ జీవుడు అనాది కాలమునుండి అవిద్యాగ్రస్తుడై ఉన్నాడు.

**శ్లో॥ అనాద్యవిద్యాయుక్తస్య పురుషస్యాత్మ వేదనమ్**
**స్వతో న సంభవాత్ అన్యః తత్త్వజ్ఞో జ్ఞానదో భవేత్ ॥** (అధ్యా 22, శ్లో 10)

**అవిద్య** = ఒకడు ఒకరోజు ఒక నాటకం (లేక, సినిమా లేక, టివి సీరియల్) చూస్తూ అందులోని కల్పితమైన సంఘటనలతో తాదాత్మ్యము చెందుతూ కోపము - ప్రేమభావము - శృంగారభావము - భయము - సంతోషము మొదలైనవి పొందటం.... ఏవిధంగా జరుగుతోందో,.... అదేవిధంగా - ఈ జీవుడు ఈ దృశ్యమును చూస్తూ, స్వస్వరూపమును ఏమరచి కోపము-ఆవేశము మొదలైనవి పొందుతూ దుఃఖితుడు - మూర్ఖుడు అవటం జరుగుతోంది! **ఇదియే అవిద్య.**

అవిద్యయొక్క చమత్కారంచేత ఈ జీవుడు తనసుతాను ఎరుగలేకున్నాడు. అట్టి అజ్ఞానమును ఆవరణగా కలిగియుండి అనేక వేదనలతో – దుఃఖములతో మ్రగ్గుచున్న జీవునికి ఉపశమనం కలిగించగలిగినదెవ్వరు? జ్ఞాని మాత్రమే! దేహములు – దేహి, జాగ్రత్ స్వప్న సుషుప్త సాక్షిని ఎరిగిన ఆత్మజ్ఞాని మాత్రమే అజ్ఞానికి (దుఃఖము – ఆదుర్దాలు తొలగటానికి) అత్యావస్యకమయ్యా! జ్ఞాని చెప్పేవిశేషాలచేత అజ్ఞాని స్వస్వరూపాత్మ యొక్క ఔన్నత్యమేమిటో ఎరుగుచున్నాడు!

## వేరు వేరు గురువుల విభాగయోగములు

ఇప్పుడు ఆత్మజ్ఞాన సంబంధంగా వేరువేరు గురువులు అధ్యాత్మశాస్త్ర పాఠ్యాంసాలుగా తమ శిష్యులకు బోధిస్తున్న విభజన – విశ్లేషణా విశేషాలు కొన్ని ఇక్కడ ఉదహరిస్తున్నాను.

## 1. జీవ–ఈశ్వరులు చిత్ అభేదత్వం (అద్వైతం)

జీవుని రూపము --- చిత్ (ఎరుగుట) చైతన్య రూపం

ఈశ్వరుని రూపముకూడా --- చిత్ చైతన్యరూపమే!

**శ్లో॥ పురుష – ఈశ్వరయోః అత్ర న వైలక్షణ్యమ్ అణ్వపి**
**తత్ అన్యకల్పనా అపార్థా జ్ఞానం చ ప్రకృతేర్గుణః॥**

జీవ – ఈశ్వరులకు భేదమే లేదు. ఒక నాటకం పాత్రగా కనిపిస్తున్న ఒక వ్యక్తికి (నటునికి) – బాహ్యాన మరొక సమయంలో స్నేహితులతో షికారుకు వెళ్ళుచున్న అదేవ్యక్తికి భేదమేమున్నది? నాటకంలో నాటకరంగముపై ఏక–అనేక పాత్రుడుగా కనిపిస్తున్నది అతడే! వ్యక్తిగత జీవితంలో స్నేహితులతో నవ్వులు చిందిస్తున్నదీ ఆతడేకాదా! అంతేగాని, "ఈ నాటకంలోని పాత్రగా ఇతను వేరు–ఈతడే ఇంటివద్ద వున్నప్పుడు ఇతను వేరు" – అని అంటామా!

జీవుడు – అందరిలో ఒకడు. ఈశ్వరుడు – అందరిగా ఉన్నవాడు.

జీవుడు – ఈశ్వరుడు .... ఈ ఇద్దరికి భేదం కల్పించటం అపార్థమే! అజ్ఞానమే! **ప్రకృతికి** సంబంధించిన గుణముల భేదంచేత వేరువేరుగా కనిపించవచ్చుగాక! గుణి దృష్ట్యా (గుణములకు మునుముందే ఉండి గుణములను ప్రదర్శించే చైతన్యసత్త దృష్ట్యా) జీవుడు – ఈశ్వరుడు ఒక్కటే! ఒక్క తీరైనవారే! **(జీవో శివః! శివో జీవః! జీవో బ్రహ్మేతి నాఽపరః!)**

## 2. త్రిగుణములు

1. సత్త్వము 2. రజము 3. తమము. ఈ మూడు గుణముల వివిధ పాళ్ళ కలయిక, వాటి సామ్యావస్థయే ప్రకృతి అను శబ్దముయొక్క అర్థమైయున్నది.

| | | | | |
|---|---|---|---|---|
| సృష్టి | --- | సత్వగుణము | ---- | జ్ఞానము |
| స్థితి | --- | రజోగుణము | ---- | కర్మ |
| లయము | --- | తమోగుణము | ---- | అజ్ఞానము |

సృష్టి-స్థితి-లయములకు హేతువు ఏమిటి? అని ప్రశ్నిస్తే.... త్రిగుణములే! అని సమాధానం అవుతుంది.

అటువంటి త్రిగుణములు

--- ప్రకృతికి సంబంధించినవి మాత్రమే!

--- ఆత్మకు సంబంధించినవి కానే కావు.

ఈశ్వరుడు – గుణములకు కారకుడు

– గుణములను వ్యక్తీకరించువాడు

– కాలస్వరూపుడు. కాలనియామకుడు. కాలః కాలః!

– స్వభావమునకు అధిపతి (One who is exhibiting Features & Qualities)

– సర్వమునకు సూత్రధారి.

చమత్కారం ఏమిటంటే – త్రిగుణసమన్వితమగు నటనకు సూత్రధారి ఆతడే! పాత్రధారి ఆతడే!

---

## 3. పంచభూతములు :

| | | |
|---|---|---|
| క్షితిః | భూమి | (Solid) |
| ఆపః | జలము | (Liquid) |
| జ్యోతిః | అగ్ని | (Heat) |
| అనిలః | వాయువు | (Vapour) |
| నభః | ఆకాశము | (Space-Placement) |

ఈ ఐదు మహాపంచ భూతములు. వీటి వివిధ పాళ్ళ కలయికయే దృశ్యప్రపంచము. ఇంతకుమించి ఎక్కడా ఏదీ లేదు! ఏదైనా ఉంటే అది కూడా ఇవే!

## 4. నవతత్త్వములు :

పై పంచభూతములు " 5 " మరియు

6. పురుషుడు - వ్యష్టికర్మలకు కర్త. (Individual Experiencer)
7. ప్రకృతి - స్వభావము (Features)
8. అవ్యక్తము - దేహమనోబుద్ధులను వ్యక్తీకరిస్తూ ఉంటున్నది. తాను వ్యక్తము కాక, సర్వము వ్యక్తీరించుచున్నట్టిది.
9. అహంకారము - ఇది నాది - మనస్సు నాది అని తలచు తత్త్వము.

## 5. జ్ఞానేంద్రియ పంచక - కర్మేంద్రియ పంచక దశ తత్త్వములు + మనస్సు

| జ్ఞానేంద్రియములు | కర్మేంద్రియములు |
|---|---|
| 1. శ్రోత్రము (చెవులు) | వాక్కు |
| 2. చర్మము | చేతులు |
| 3. చక్షువులు (కళ్ళు) | పాదములు |
| 4. నాశిక(ముక్కు) | పాయువు (మలద్వారం) |
| 5. నాలుక | ఉపస్థ |

ఈ పది జ్ఞానేంద్రియములు మరియు కర్మేంద్రియములను తన ఉపకరణంగా ఉపయోగిస్తున్న 11వది --- మనస్సు. ఈ ఏకాదశ విశేషాలే ఇదంతా!

## 6. అంతరంగ చతుష్టయం

1. మనస్సు - ఆలోచనావిభాగం (Thought)
2. బుద్ధి - ఏది ఆలోచించాలో నిర్ణయించుకునే విభాగం (Intellectual)
3. చిత్తము - ఇష్ట విభాగము. ఏది ఆలోచించాలో అది అభిరుచినిబట్టి ఉంటుంది. అదియే ఇష్టము (లేక) చిత్తము (Interest)
4. అహంకారము - ఇది నా ఆలోచన
   ఇది నా తెలివి
   ఇది నా ఇష్టము
   నాది - నాది అనుకునే విభాగం ( "I" "My")

## 7. జ్ఞానేంద్రియ విషయములు

| | |
|---|---|
| శబ్దము | (ఉపకరణం - చెవులు) |
| స్పర్శ | (ఉపకరణం - చర్మము) |
| రూపము | (ఉపకరణం - కళ్ళు) |
| రసము | (ఉపకరణం - నాలుక) |
| గంధము | (ఉపకరణం - ముక్కు) |

ఈ ఐదు తత్త్వములు - శక్తి తత్త్వములు.

(Veriety manifestations of the Universal Energy)

వీటి పరిణామమువల్లనే ఆకాశము - వాయువు - అగ్ని - జలము - భూమి రూపు దిద్దుకుంటున్నాయి.

---

## 8. కర్మాయతన సిద్ధములు లేక కర్మేంద్రియ ఫలములు - నాలుగు

**శ్లో॥ శబ్దః స్పర్శో రసో గంధో రూపంచేత్ అర్థజాతయః**
**గక్త్యుత్సర్గ శిల్పాని కర్మాయతన సిద్ధయః ॥ (అధ్యా 22, శ్లో 16)**

| | | |
|---|---|---|
| గతి | - | Motion |
| ఉక్త్యుత్ | - | Raise |
| ఉత్సర్గము | - | Relationship |
| శిల్పము | - | Form |

*పంచతన్మాత్రలు - శబ్ద స్పర్శ రూప రస గంధములు. వీటన్నిటి రచయిత యజమాని, ఆస్వాదకుడు పరమాత్మయే!*

---

## 9. వ్యక్తా వ్యక్తములు : సప్త ధాతువులు

**వ్యక్తము** (That being Exhibited and manifested) : ఈప్రదర్శించబడుచూ ఇంద్రియములకు తారసడుచున్న (కంటికి కనబడేవి - చెవులకు వినబడేవి మొదలైనవి) సృష్టికి-ఇద్దాని స్థితికి - లయమునకు కారణము - కార్యకారణ రూపిణియగు ప్రకృతియే! - ఇదంతా అనుభవించబడునది ప్రకృతిచేతనే అయిఉన్నది (that being experienced)

**అవ్యక్తుడు :** సంభవింపజేయువాడు. ఈతడు **అనుభవించబడుచున్నదానిని** (That

being experiencesd) – **అను దానికి వేరుగా – "అనుభవించువాడు One who is experiencing"** – గా ఉన్నవాడు. అనుభవములకు – అనుభవించబడుదానికి సాక్షి (Beyond and mere witness) గా ఉన్నవాడు. అనుభవించబడుదానిని పర్యవేక్షిస్తున్నవాడు. నిర్వచిస్తున్నవాడు. ఆస్వాదిస్తున్నాడు.

**శ్రీ ఉద్ధవుడు :** కృష్ణయ్యా! అట్టి అనుభవము (experiencing) కు విషయము (Material) అయి చెన్నొందుతున్న ఈ ప్రకృతి ఎక్కడినుండి ప్రదర్శితమౌతోంది. ఈ ప్రకృతికి ఉత్పత్తి స్థానమేది?

**శ్రీకృష్ణుడు :**

**శ్లో॥ వ్యక్తాదయో వికుర్వాణా ధాతవః పురుష ఈక్షయా ।**
**లబ్ధవీర్యాః సృజంతి అండం సంహతాః ప్రకృతేర్బలాత్ ॥** (అధ్యా 22, శ్లో 18)

పురుషుడు – ప్రకృతి అని రెండు విశేషాలు చెప్పుకుంటున్నాము కదా!

| | | |
|---|---|---|
| పురుషుడు | – | Perceiver |
| ప్రకృతి | – | Perception - objects of perception |

పురుషుని ఈక్షణ (visualization, perception) యే ప్రకృతి అను శబ్దము యొక్క ఉత్పత్తి, నిర్వచనము కూడా!

– పురుషుని నుండే ప్రకృతి బయల్వెడలుతోంది. (The nature of the Being is emitting out of the said being only)

ప్రకృతి నుండి – ఆకాశము – వాయువు – అగ్ని – జలము – భూమి (Space - Vapour - Heat - Liquid - Solid) అనే పంచభూతములు – జీవుడు – ఈశ్వరుడు అనబడే సప్తధాతువులు (సప్తతత్త్వములు) ఉత్పన్నమగుచున్నాయి. ఈ సప్తధాతువులు పరస్పరం వేరువేరు విధాలుగా సమ్మిళితమై ఈ వివిధరీతులుతో కూడిన బ్రహ్మాండము ప్రదర్శితమౌతోంది.

సప్తధాతువుల సమ్మేళనమునుండి చలనము – గతి రూపంగా ప్రాణశక్తి ఉత్పన్నమౌతోంది. శక్తియొక్క చమత్కారంగా దేహములు – ఇంద్రియములు – ఇంద్రియ శక్తులు ప్రదర్శితమౌతున్నాయి.

అనగా...,

(ఆత్మాత్ – ఆకాశమ్ :: ఆకాశాత్ – వాయుః :: వాయుః – అగ్ని :: అగ్నిః – ఆపః :: ఆపః – పృధ్వి)

దేహము - ఇంద్రియములు,

ప్రాణము - శక్తి

మనో–బుద్ధి–చిత్త–అహంకారాలు ఇవన్నీ ఆత్మ నుండి బయల్వెడలి, వాస్తవానికి ఆత్మకు అభిన్నమై చెన్నొందుతున్నాయి. ఆత్మయందు బయల్వెడలినవన్నీ..., ఆత్మకు అభిన్నమై ఆత్మయందే లయమౌతున్నాయి. మట్టి నుండి తయారైన వివిధ ఆకారములు గల పాత్రలన్నీ మట్టికి అభిన్నమేకదా! త్రికాలములలోనూ అంతా మట్టియే!

## 10. షట్ తత్త్వము

మరొక గురువు శిష్యులకు ఈ విభజనను 6 తత్త్వములుగా బోధిస్తున్నారు. ఆ గురువుల దృష్టిలో... (వారి నిర్వచనములను అనుసరించి)...

- పంచమహా భూతములు (ఆకాశాదులు)
- 6వ వాడు – పరమ పురుషుడు – పరమాత్మ

పరమ్ – ఆవల! **ఈవల** ప్రదర్శితమయ్యే పంచమహాభూతాది జగద్వ్యవహారమంతా ప్రకృతి. జన్మలు – కర్మలు, మనోబుద్ధి చిత్త అహంకారాలు ప్రకృతిలోని అంతర్విభాగ చమత్కారాలు! ఆవల సాక్షిగా ఉన్న ఆత్మ చైతన్యమే పరమాత్మ!

- పరమాత్మ.... సంకల్పనిష్ఠుడైనప్పుడు...,
- తన నుండి తనకు అభిన్నంగా సంకల్పచమత్కారంగా బహిర్గతమై ప్రదర్శితమగుచున్న పంచమహాభూతముల ద్వారా...,
- ఈ పరిదృశ్యమానమగు జగత్తును సృష్టించుకొని....,
- స్వయముగా తనకు తానే తన కల్పనా చమత్కార సదృశ జగత్తులో ప్రవేశించి..
- **తన జగత్తు అనే క్రీడా స్థలంలో తానే క్రీడాకారుడై విహరిస్తున్నాడు! వ్యవహరిస్తున్నాడు!**

## 11. చతుర్విధ తత్త్వములు

కొందరు మహనీయ గురువులు తత్త్వములు 4 విధములు అని చతుర్విధ తత్త్వములుగా విభజించి చెప్పటం జరుగుతోంది.

**శ్లో॥ చత్వార యేవేతి తత్రాపి తేజ-అపో-అన్నమ్-ఆత్మనః ।**
**జాతాని తైరిదం జాతం జన్మావయవినః ఖలుః ॥** (అధ్యా 22, శ్లో 21)

చతుర్విధ తత్త్వవిభాగ వేదుల దృష్టిలో...,

1. భూమి  2. జలము  3. తేజస్సు  4. ఆత్మ

అంతా కలిపి ఈ నాలుగే! ప్రతి జీవుడు - జంతువు - దేవత... ఈ నాలుగు విశేషముల సమ్మేళనమే!

ఈ చతుర్విధ (కారణరూప) తత్త్వములనుండి కార్యరూపంగా ఈ సృష్టి అంతా పరిఢవిల్లుతోంది!

అట్టి సృష్టిలోంచి జగత్తు ఉత్పన్నమౌతోంది.

చతుర్విధ మహాతత్త్వములు —— సృష్టి —— జగత్తు

## 12. సప్తదశ (17) సంఖ్యా విభాగాలు

| | | |
|---|---|---|
| 1. | పంచమహాభూతములు | 5 |
| 2. | పంచ తన్మాత్రలు<br>(శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలు) | 5 |
| 3. | పంచేంద్రియములు | 5 |
| 4. | మనస్సు | 1 |
| 5. | ఆత్మ | 1 |

ఈ 17 తత్త్వములే సర్వము కూడా!

## 13. షోడష (16) సాంఖ్యా వేదులు

వీరు 17 తత్త్వములు చెప్పు వారి వలనే విభజిస్తున్నారు. అయితే వీరి దృష్టిలో మనస్సు - ఆత్మ వేరైనవి కావు. ఆ రెండు అభిన్నములు. మనస్సు ఆత్మలోనిదే! ఆత్మయే మనస్సుగా కనిపిస్తోంది!

## 14. త్రయోదశ (13) సాంఖ్యవేదులు

| | |
|---|---|
| పంచ మహాభూతములు | 5 |
| పంచేంద్రియములు | 5 |
| మనస్సు | 1 |
| జీవాత్మ | 1 |
| పరమాత్మ | 1 |

అని విభాగించి ప్రవచిస్తున్నారు.

## 15. ఏకాదశ (11) తత్త్వ సాంఖ్యవేదులు

| | |
|---|---|
| పంచమహాభూతములు | 5 |
| పంచేంద్రియములు | 5 |
| ఆత్మ | 1 |

## 16. నవ (9) తత్త్వవిదులు

అష్టవిధ ప్రకృతులు  దృశ్యము - దేహము - ప్రాణము - మనస్సు-బుద్ధి - చిత్తము - వ్యష్టి అహంకారము (జీవాత్మ) -

దీనికి ఆవల - పురుషుడు. ఆతని కావల పరమపురుషుడు!

జీవాత్మ ---- పరమాత్మ

# 33. అధ్యాత్మము - అధిభూతము - అధి దైవము

వింటున్నావా? మిత్రమా, ఉద్ధవా! ఈవిధంగా సత్యాన్వేషకులై, సత్యద్రష్టలగు వేరువేరు కాలాలలో ఋషులు గురువులై వారివారి యుక్తియుక్తములు - లెక్కలను, ఆత్మతత్త్వమును బోధించటానికి వారనుకొన్న ఉపాయములను అనుసరించి - విభాగములు చేసి చెప్పటం జరుగుతోంది. జరగబోతోంది. సత్యమును నిర్వచించి చెప్పేదంతా సత్యమే! అవి ఋషివాక్కులు. అసత్యమెందుకౌతాయి?

**శ్రీ ఉద్ధవుడు :** కృష్ణయ్యా! ప్రకృతి :: పురుషుడు ఈ రెండూ సహజంగా విలక్షణులు కదా! ప్రకృతి - పురుషులు (My qualities + I) ఈ రెండు కలసి ఉండటంచేత లౌకిక - సామాన్య దృష్టిచే ఆ రెండిటికీ భేదము కనిపించదు.

**ఈ దేహము - ప్రకృతిచే నిర్మితమౌతోంది! (ప్రకృతి - కారణము : దేహము -**

**కార్యము). ప్రకృతియో - ఆత్మకు అంతర్గతము. ఆత్మయందు ప్రకృతి - ప్రకృతియందు ఆత్మ లక్షితములై (ఒకదానికి మరొకటి లక్ష్యరూపములై -Aimed at) ఉంటున్నాయి.**

ఓ పుండరీకాక్షా! సర్వజ్ఞా! శ్రీకృష్ణా!

ఇప్పుడు నేను చెప్పినపై విశ్లేషణ యుక్తియుక్తమేనా? (Is it so or not?)

**శ్లో॥ త్వత్తో జ్ఞానం హి జీవానాం ప్రమోషస్తే అత్ర శక్తితః ।**
**త్వమేవ హి ఆత్మమాయాయా గతిం వేత్థ న చ అపరః ॥ (అధ్యా 22, శ్లో 28)**

స్వామీ! మీ యుక్తియుక్తమైన వాక్కులతో నాలో శేషించియున్న (ఇంకా మిగిలిపోయి ఉన్న) సందేహములను తొలగించవలసినదిగా మిమ్ములను వినమ్రుడనై వేడుకుంటున్నాను.

నీ అనుగ్రహముచేతనే జీవులకు జ్ఞానము కలుగుచున్నదయ్యా!

అట్లాగే....,

నీ మాయాశక్తి వలననే జీవులలో జ్ఞానము అజ్ఞానముచే కప్పబడి ఉంటోంది!

నీమాయా శక్తి స్వరూపమును నీవు మాత్రమే ఎరుగగలవు. ఇతరులెవ్వరు ఎరుగజాలరయ్యా!

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ పురుషశ్రేష్ఠుడా! ప్రియ మిత్రమా! ఉద్ధవా! ప్రకృతి - పురుషులు వేరుగా విభాగించుకున్నంత మాత్రంచేత తత్త్వం ప్రస్ఫుటం కాదు. బోధన సంపూర్ణం కాదు. సామాన్యంలోంచి విశేషమును బుద్ధితో విభాగించి, ఆ తరువాత బుద్ధితో ఆ విశేషముకు సామాన్యముతో ఏకము, సామాన్యమునందు లయము చేయటమే తత్త్వశాస్త్ర పఠనము సుమా!

నిర్వికారమగు మట్టితో సాకారమగు అనేక బొమ్మలు తయారు చేయవచ్చునుగదా! అయినాకూడా, మట్టిబొమ్మలుగా కనిపించేదంతా మట్టియేకదా! బొమ్మల దృష్ట్యా చూస్తే - అనేక విశేషములతో కూడిన ఆకారాలు! **మట్టి దృష్ట్యా? అంతా ఒక్కటే!**

అట్లాగే...,

ఆత్మ --- నిర్వికారము. **నిరాకారము**

ప్రకృతి --- గుణముల క్షోభతో కూడుకొనినది. దేహాదుల సంరభముతో వెల్లివిరిసేది. సవికారము. **సాకారము.**

గుణమయమగు నా మాయ -- సత్త్వ - రజ - తమో గుణ చమత్కారములతో కూడిన భేదానుభవమునకు కారణమగుచున్నది. భేదదృష్టిని సృష్టిస్తోంది! అట్టి భేదములన్నీ క్రోడీకరించి,....

1. అధి భౌతికము – Differences being experienced because of Physical factor)
2. అధి దైవికము – Differences being experienced because of incidents, relationships and points of view
3. అధ్యాత్మికము – జలము - అనేకతరంగాలుగా కనిపిస్తున్నట్లు గాలి -- అనేక వస్తువులలో ప్రవేశించి ఆయా ఆకారములుగా అయి -- వస్తువుల రూపంగా కనిపిస్తున్నట్లు ఏకము **అఖండమగు ఆత్మ అనేకముగా కనిపించటం**

బంగారము అనేక ఆభరములుగా విభాగమౌతోందా? లేదే! ఆభరణములెన్ని ఉన్నా బంగారం ఒక్కటే కదా!

అంతే కాకుండా... ఇంకా విను! త్రివిధ విశ్లేషణము గురించి చెప్పేడప్పుడు శాస్త్రకారులు, సిద్ధాంచీకరించే మహర్షులు ఏవిధంగా విశ్లేషించి వివరించుచున్నారో చెప్పుచున్నాను.

- నేత్రేంద్రియములు – అధ్యాత్మము
- చూడబడే దృశ్య విశేషాలు – అధిభూతము
- నేత్రగోళములో ఏర్పడి ఉన్నదై ప్రకాశించే సూర్యగోళము – అధి దైవము

ఈ మూడు కూడా (నేతేంద్రియము + దృశ్యము + చూపు శక్తి) పరస్పరాశ్రయముచే సిద్ధించటం జరుగుతోంది.

అయితే...

ఈ ముడింటికి మూలకారణము మరొకటున్నది. అదియే.... ఆత్మ!

ఆకాశంలో స్వప్రకాశముచే సూర్యునికి దేనిపట్ల ఆపేక్ష అనేది లేక పోయినప్పటికీ.... అన్నిటినీ నిరపేక్షగానే ప్రకాశింపజేస్తూ ఉంటాడు చూచావా?

అట్లాగే....,

ఆత్మ భగవానుడు కూడా అధ్యాత్మ – అధిభూత – అధి దైవముల ఉనికికి, తత్సంబంధమైన కార్యక్రమములకు మూలకారణము – కారణ కారణము అయి ఉన్నారు. అట్లాగే, దేనికీ కారణము కాదు!

అందుచేత ఏకరూపము – అభిన్నము అగు ఆత్మ..., త్రివిధతత్త్వములకంటే భిన్నరూపమై ... స్వయం ప్రకాశమై..., ప్రకాశించే సర్వవస్తువులకు (మనో-ప్రాణ-బుద్ధి-చిత్త-అహంకారాదులకు, దృశ్యమునకు కూడా) ప్రకాశకమై యున్నది!

ఇప్పుడు నేత్రములగురించి చెప్పుకున్నాం. అట్లాగే...,

**శ్లో॥ ఏవం త్వక్ ఆది-శ్రవణ ఆది చక్షుః ।**
**జిహ్వాది నాసాది చ చిత్త యుక్తమ్ ॥** **(అధ్యా 22, శ్లో 32)**

చర్మము - చెవులు - నాలుక - ముక్కు - చిత్తము బుద్ధిలకు కూడా త్రివిధ తత్త్వ విశేషాలున్నాయి.

తాపము -- తపించబడునది. (that which is functioning)

తపించువాడు -- (one who is making to function) ఆత్మ !

| | **అధ్యాత్మము** (Product) | **అధిభూతము** (Purpose) | **అధి దైవము** (Producer) |
|---|---|---|---|
| 1. | త్వక్ ఇంద్రియము స్పర్శేంద్రియము (చర్మము) | స్పర్శ | వాయు దేవుడు |
| 2. | శోత్రము (చెవులు) | శబ్దము (Sound) | దిక్ దేవతలు |
| 3. | జిహ్వ (నోరు) | రసము (Taste) | వరుణ దేవుడు |
| 4. | నాసిక (ముక్కు) | గంధము (Smell) | అశ్వనీ దేవతలు |
| 5. | చిత్తము | ఇష్టము (Interest) | వాసుదేవుడు |
| 6. | మనస్సు | మనోవిషయము | చంద్రుడు |
| 7. | బుద్ధి | తెలుసుకొనబడుచున్నది | బ్రహ్మదేవుడు |
| 8. | అహంకారము | అహంకరించబడుచున్న విషయము | రుద్రుడు |

ఈవిధంగా అధ్యాత్మము, అధిభూతము, అధిదైవము ఏర్పడినవై ఉన్నాయి.

వికారాత్మకమగు అహంకారము 1. వైకారము 2. తామసము 3. ఇంద్రియము (ఇంద్రియ సంబంధమైన ఈ దృశ్యము) అనే ఈ మూడు మోహ వికారములకు (Ilusinary misconceptions) కారణమై ఉంటోంది.

అనగా...,

అహంకారము...

1. వైకారికము - దృశ్య విషయములను చూచి భావావేశము పొందటం – తాపము – తపన – అవినాభావత్వము మొదలైనవి సంతరించుకోవటం.

2. తామసము - కోపముతో కూడిన ఆవేశము, అధర్మయుతమైన మార్గములో బాధించటం (Hurting) పగ (Revenge) సాధించటం వేధించటం (Teasing)

3. ఇంద్రియము - ఇంద్రియములకు వశం అయి అవిచారణ పూర్వకంగా కాలము వెచ్చించటం, వెల్లబుచ్చటం, దురభ్యాసముల నుండి వెనుకకు మరలలేకపోవటం

ఈ మూడు వికారములను ప్రదర్శించటం జరుగుతోంది!

**శ్రీ ఉద్ధవుడు :** మహాత్మా! శ్రీకృష్ణా! ఇక్కడ నాదొక మరొక సందేహము. ఆత్మ అఖండము, అని వేదోపనిషత్తులు, ఋషి వాక్యములు ఎలుగెత్తి ప్రకటిస్తున్నప్పటికీ అఖండమగు ఆత్మ ఉన్నదో? లేదో?... అనే సందేహం కూడా కొందరు కలిగియే ఉంటున్నారే?

**శ్రీకృష్ణుడు :** అవును! అఖండమగు ఆత్మ ఉన్నదని శాస్త్రాదులు నిర్వచిస్తూ ఉండగా "అటువంటి అఖండమగు ఆత్మ ఏదీ లేదు!" అని కొందరు ఆ విషయమును తిరస్కరిస్తూ ఉన్నారు.

అయితే...,

"ఆత్మ అనేది లేదు అద్దాని గురించి చర్చ, పరిశీలన అవసరంలేదు కూడా!" – అని నమ్మేవారు – వాదించేవారి విషయంలో కూడా, "ఏది సత్యము?" అనే ప్రశ్నకు

సమాధానం లభించక, "ఈ జీవుడు ఎట్టివాస్తవ స్వభావుడు?".... అనే విషయంలో వారు ఒక కొలిక్కి తీసుకు రాలేక ఆ ప్రశ్న నివృత్తం కావటంలేదు! ఈ జీవుడెవరు? పంచభూతముల కలయిక నుండి ఏర్పడిన ఏదైనా నూతన శక్తియా? దేహపతనంతో లేనివాడగుచున్నాడా? వేరు వేరు అభిరుచిలుగల జీవులు, వారి స్వభావములు రక్త-మాంస - బొమికలవా?

సత్యము -- యమ్ సత్

యొక్క అవగాహనకై తగిన ప్రయత్నమునకు ఉద్యుక్తుడు కానంతవరకు ఇటువంటి అభిప్రాయ పరంపరలు బుద్ధిని భ్రమింపజేస్తూనే ఉంటాయి. బుద్ధి చంచలత్వమును వీడదు. జీవునికి వాస్తవమైన - స్వభావసిద్ధమైన ప్రశాంతత లభించదు.

జీవుని వాస్తవ - సహజ-శాశ్వత స్వభావమును గురించి వినటం-పఠించటం-తెలుకోయత్నించటం అనుక్షణికం చేసుకోవటముచే - **ఈ జీవుడు దేహ మనో చిత్త అహంకారాదులకు యజమాని**...అని తెలియబడగలదు.

**శ్రీ ఉద్ధవుడు :** ఓ దేవదేవా! నీవు సర్వతత్త్వ స్వరూపుడవు! నీ నుండి **ప్రవృతమైన** బుద్ధిగల మానవులు వారివారి స్వయంకృత కర్మలను అనుసరించి - ప్రవాహంలోపడి తరంగాలచే ఎటెటో కొట్టుకు పోబడుచున్న చెక్కముక్కవలె... అనేక ఉచ్ఛ-నీచ ఉపాధులలో సంచారాలు చేయవలసి వస్తోంది. జగత్ విషయాలచే వారి బుద్ధి **ఆవృతమై** ఉంటోంది. నీ తత్త్వమును గ్రహించటం అసాధ్యం! కానీ నీ కరుణచే మాత్రమే అగ్రాహ్యమగు దివ్యతత్త్వాన్ని ఎరుగగలం... అని విజ్ఞులు అంటూ ఉంటారు.

మేమందరము నీ మాయచే మోహితలమైన వారము! అయితే, నీవు ఆశ్రిత వత్సలుడవు! భక్తవత్సలుడవు! మీ తత్త్వము మీరు మాత్రమే ఎరుగగలరు! తెలియజెప్పగలరు!

మాయా మోహితుడనైన నన్ను మీరే రక్షించాలి. మీ తత్త్వమును ఎరుగుటమే దురత్యయమైన మీ మాయను దాటటానికి ఉపాయం కదా! అందుకే మహనీయులందరు కృష్ణచైతన్య తత్త్వమును గానంచేస్తూ నావంటి ఆర్తులగు జనుల చెవులకు - హృదయాలకు ఔషధంగా ప్రసాదిస్తూ ఉంటారు.!

# 34. దేహము - దేహాభిమానము - దేహి

**శ్రీ ఉద్ధవుడు :** ఓ కృష్ణయ్యా! ఇప్పుడు ఈ సందర్భంలో నీ తత్త్వమును నీ నుండే వినాలని నీకు విన్నవించుకుంటున్నాను.

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! వేద – ఉపనిషత్ – మహర్షి ప్రవచనాలు నాయొక్క ఏ తత్త్వము గురించి ఎలుగెత్తి గానం చేస్తూ వినిపిస్తున్నాయో అట్టి విశేషాలు చెప్పుతాను విను.

---

ఈ **భౌతిక దేహము** పంచభూతము (భూ – జల – అగ్ని – వాయు ఆకాశము)లచే నిర్మితమై యున్నది కదా! అటువంటి ఈ భౌతిక దేహము పంచేంద్రియములు (చెవులు, చర్మము, కళ్ళు, నోరు, ముక్కు) కార్యక్రమములకు ఉపయుక్తమగు ఒక యంత్రము వంటిది.

ఈ పంచేంద్రియములు తన ఉపకరణములుగా ఉపయోగించుకొనుచున్నది – **మనస్సు.** మనస్సుకు యజమానియగు జీవుడు ఆ మనో ఉపకరణముతో ఒక దేహము నుండి మరొక దేహమునకు, ఒక లోకము నుండి మరొక లోకమునకు సుదీర్ఘ – అవిశ్రాంత ప్రయాణీకుడిలాగా బహుదూరపు బాటసారిగా కొనసాగించటం జరుగుతోంది. ప్రయాణాలు చేస్తున్నాడు.

**ఈ జీవుని వాస్తవరూపం ఏమిటి?** అని పరిశీలిస్తే **ఆత్మయే** అనునదే సమాధానం. ఆత్మయే దేహి. అట్టి ఆత్మ దేహముకంటే భిన్నమే అయినప్పటికీ.... అహంకారము ద్వారా మనస్సు వెంట అనువర్తిస్తూ లోకాలోకాలలో దేహత్వమును అనుభవించటం జరుగుతోంది. మనస్సు కర్మలకు అధీనమై ఎదురుగా ఇంద్రియములకు తారసబడే విషయములను, ఆ విషయముల సంస్పర్శ – తాదాత్మ్యముచే సందర్భమౌతున్న కర్మ–కార్య క్రమములను క్షణక్షణం – క్షణమునకు ఒకవిధంగా చింతన చేయటం కొనసాగిస్తోంది!

ఈ మనస్సు ఏఏ విషయ సమూహములను చింతన చేస్తూ ఉన్నదో.... ఆ చింతనల మధ్య మరల పుట్టి మరల–మరల ఆ చింతనలలోనే లయిస్తూ, ఉన్నది! స్మృతిని కోల్పోతూ, ఎప్పటికప్పుడు అనేక చింతనల మధ్య ప్రవర్తిస్తోంది

అనగా,...

ఈ మనస్సు దృశ్య సంబంధమైన - వేద విధి విధాన సంబంధమైన ఏవేవో చింతనలలో జనిస్తోంది. లయిస్తోంది. మరల వేరైన విషయ చింతనలమధ్య జనిస్తోంది. మరల లయిస్తోంది! పూర్వ చింతనల గురించి, పూర్వదేహ వ్యవహారముల గురించి స్మృతి కోల్పోతోంది. విస్మృతి పొందుతోంది. పూర్వదేహముల వ్యవహారములచే రూపుదిద్దుకున్న సంస్కారములచే మరల దేహ ప్రకాశ నిష్క్రమణలు (Manifesting and withdrawing of Physics) కొనసాగిస్తోంది!

- ఒక దేహము
- ఆ దేహముతో అనేక కర్మల నిర్వహణ
- అట్టి కర్మల నిర్వహణచే అనేక చింతనలు.
- ఆ చింతనలచే ప్రోత్సహించబడిన మరికొన్ని కర్మ- పరంపరలు.
- ఆ కర్మల ఫలములు. తద్వారా మరికొన్ని వేరైన కర్మలు - చింతనలు.
- ఎప్పుడో ఈ భౌతిక దేహపతనము. వర్తమాన దేహమును త్యజించి ఈ జీవుడు మరొక దేహాన్ని ఆశ్రయించటం.
- ఆ మరొక దేహముతో వేరైన చింతనలు - కర్మలు - కర్మ ఫలములు - కర్మ ఫలితానంతర చింతనలు.
- ఆ చింతనల నుండి మరికొన్ని కర్మలు.
- ఆ చింతన - కర్మ - చింతనల నుండి సుఖ దుఃఖానుభవాలు.
- నూతన దేహముతో తారసపడే చింతన - కర్మలలో అత్యంత అభినివేశము వలన పూర్వదేహమునకు చెందిన సంబంధ బాంధవ్యాదులు విస్మరించటం. (విస్మృతి కలగటం).
- ఒక దేహ చింతనా వ్యవహారం నుండి మరొక దేహమునకు ప్రయాణించటం (మృత్యువు)

చూచావా ఉద్ధవా! అటువంటి ఈ జన్మ - జన్మాంతర ప్రయాణం ఎటువంటిదంటే...

- ఒకడు ఒక స్వప్నమునుండి మరొక స్వప్నములోనికి ప్రయాణించటం వంటిదే!
- ఒక మనోరథము నుండి మరొక మనోరథానికి మనస్సును మరల్చటం వంటిది. ( From one type of Wants, Wishes, Exepctations, desires etc., to another such types of all those)

స్వప్నము – మనోరథము (Dreaming & wishing) ... ఎట్లా తయారవుతున్నాయి? వాటికి మూలము అభిమానమే (A kind of fondness) కదా!

ఆ రీతిగానే కొన్ని విషయములపట్ల – విశేషముల పట్ల – నామరూపాదులపట్ల – సంగతి, సందర్భ, సంఘటనల పట్ల విశేషమైన అభిమానము కలిగివుండుటచేతనే, అదంతా కూడా జీవునిపట్ల **"పునర్జన్మ"** అను తతంగమునకు కారణభూతమైయున్నది.

ప్రస్తుత స్వప్నంలో ఉన్న ఒకానొకడు– వెనుకటి రాత్రి స్వప్నంలోని అనుభూతులను– విశేషాలను స్మరిస్తున్నాడా? లేదు కదా! విస్మరించినవాడై వుంటున్నాడు కదా!

వర్తమాన మనోరథములలో (ఉదాహరణకు – యౌవన మనోరథములలో) ఉన్న జీవుడు బాల్యములోని ఆట పాటలకు సంబంధించిన మనోరథములను స్మరిస్తున్నాడా? గుర్తుచేసుకొని వాటివెంట పరుగులు తీస్తున్నాడా? లేదు.

అట్లాగే...,

వర్తమాన దేహమునందు – సంబంధిత వ్యవహారములయందు అభిమానము కలిగియున్న ఈతడు పూర్వదేహ సంబంధములైన అభిమానములను సంస్మరించటంలేదు.

అయితే...,

పూర్వదేహమును (పూర్వ సందర్భమును) ధారణ చేసిన ఆత్మయే వర్తమాన దేహము సందర్భములో కూడా ఆస్వాదించుతోంది. సద్యోజాతము అగు (అదియే ఇక్కడికి వచ్చింది) ఆత్మ ఉభయ దేహములను ఆస్వాదించటం జరుగుతోంది. ఇంకా విను.

ఒక జీవుడు ఒక స్వప్నంలో అనేకమంది స్నేహితులను – శత్రువులను – బంధువులను – తెలిసినవారిని – తెలియనివారిని చూస్తున్నాడనుకుందాం!

ఆ స్వప్న ద్రష్టకు కనిపిస్తున్నవారందరూ ఎవ్వరు? ఆ స్వప్నద్రష్ట యొక్క స్వయంకృతమైన స్వప్నదృష్టి – స్వప్నసృష్టియే కదా! అంతేగాని, ఆతని స్వప్నములోకి మరొకరెవరో వచ్చి ఆయా జనములను – దృశ్యములను సృష్టించారా? కల్పించి ఆ స్వప్నద్రష్టకు అవన్నీ చూపిస్తున్నారా? లేదు కదా!


జీవుడు తన జాగ్రత్‌లోంచి ఏవేవో ఆలోచిస్తూ – ఆలోచిస్తూ స్వప్నంలోకి జారుకుంటున్నాడు. స్వప్న దృష్టియే స్వప్న దృశ్యంగా పరిఢవిస్తోంది.

అనగా....

జీవుడు తన స్వప్నమునందు తానే తన స్వప్న చైతన్యమునకు చెందిన సంస్కారములచేత వివిధములగు దేహములను సృష్టించుకుంటున్నాడు. దర్శిస్తున్నాడు. ఆ స్వప్నాంతర్గత స్వయంకృత దేహములతో సంచారాలు చేస్తున్నాడు. ఆడుకుంటున్నాడు. పాడుకుంటున్నాడు. దుఃఖిస్తున్నాడు. భయము – ఆవేశము మొదలైనవన్నీ అనుభ విస్తున్నాడు. స్వప్నద్రష్ట యొక్క స్వప్నచైతన్యమే స్వప్నాంతర్గత సర్వరూపనామాదులన్నీ ధరిస్తోంది. స్వప్న ద్రష్టకు నవరసానుభవములు కలిగిస్తోంది. నిద్రనుండి లేవగానే – ఆ స్వప్న చైతన్యంలోనే **స్వప్నాంతర్గత విశేషాలు – తరంగం జలంలో లయిస్తున్నట్లు– లయిస్తున్నాయి. స్వప్న చైతన్యమేమో స్వప్నద్రష్ట యొక్క స్వస్వరూపంలోనే లయిస్తున్నది కదా!**

**జాగ్రత్‌లో కూడా జరుగుచున్నది అదే! జాగ్రత్ చైతన్యము స్వస్వరూపము నుండి బయల్వెడలి, జాగ్రత్ వ్యవహారమంతాఆస్వాదించబడిన తరువాత ఆత్మ చైతన్యమునందే లయమౌతోంది.**

మనస్సుయొక్క దేహ–దేహాంతర అభినివేశమువలన దృశ్య–దృశ్యాంతర్గత విశేషములన్నీ ఆత్మయందే  అసద్రూపంగా వెల్లడి అగుచున్నాయి.




కనుక....,

ఆత్మయే అసద్రూపములగు బాహ్య–అభ్యంతర కార్య కారణములకు, తత్భేదములకు మూలకారణమగుచు, తాను అప్రమేయమై నిత్యమై సర్వదా సద్రూపమై ప్రకాశిస్తోంది... అనునది గమనించు. ఆత్మయే జాగృత్ సాక్షిగా, జాగృత్ ద్రష్టగా, జాగృత్ దృశ్యముగా స్వకీయ కల్పనా కళా విశేషం చేత అగుచున్నది. అదే రీతిగా – స్వప్నసాక్షిగా, స్వప్నద్రష్టగా, స్వప్నదృశ్యముగా కల్పనాకళా విశేషం ఆస్వాదిస్తోంది. అట్లే సుషుప్తి కూడా!

––––

ఓ ఉద్ధవా! కాలము (ఇది నా లక్ష్యము – అనునదేమీ లేకుండా....) అలక్ష్య వేగముతో ప్రయాణిస్తూ ఉండగా, ప్రతిక్షణము అనేక దేహములు పుట్టుచున్నాయి. గిట్టుచున్నాయి.

అయితే…,

**శ్లో॥ నిత్యదా హి అంగభూతాని భవంతి, న భవంతి చ।**
**కాలేన అలక్ష్య వేగేన సూక్ష్మత్వాత్ తత్ న దృశ్యతే ॥** (అధ్యా 22, శ్లో 43)

కాలముయొక్క గతి (The flow and movement of time) అత్యంత సూక్ష్మమైనది అయి ఉండటంచేత అవివేకులైన (ఆత్మ తత్త్వ వివేకము సంపాదించుకోనంత వరకు) మానవులు ఆ కాలచమత్కారమును గమనించలేకపోతున్నారు.

కాలగతిచే ఈ కనబడే దేహాలన్నీ కూడా పుట్టటం - బాల్య యౌవన వార్ధక్యాలు - మరణము ఇత్యాది గతులకు నిరంతరం గురి అగుచున్నాయి. కాలముచే వాయువు అగ్నిరూపంగాను, అగ్ని స్థూల రూపములగు వస్తు రూపములుగాను, మానవ - జంతు దేహములుగాను వివర్తము పొందుచూనే ఉన్నాయి. మరల ఈ భౌతిక వస్తు జాలమంతా గాలిలో కలిసిపోతున్నాయి.

కాలముచే పరివర్తనము కానిది ఏమున్నది? అయినప్పటికీ అవివేకులైన జీవులు వర్తమానం నిత్యమేకదా - అని భ్రమిస్తున్నారు. భ్రమచేత…,నిన్ను కాలాతీతుడగు ఆత్మగా గ్రహించు!

- దీప జ్వాలకు హేతువు దీపము
- జల తరంగానికి హేతువు జలము

అని అనుకొంటూ ఉంటారు. దీపాగ్ని జ్వాలగా మారుతోందా? నదీ జలము తరంగాలుగా మారుతోందా? అట్లాగే ఆత్మయే ఈ జీవుడు - దేహములకు హేతువు అయినట్లో (లేక) ఆ రీతిగా కల్పించుకున్నట్లో(కాక) ఆవిధంగా అగుచున్నట్లో అనిపించవచ్చుగాక! మట్టిబొమ్మ - మట్టి… బొమ్మగా మారిందా? బంగారు ఆభరణం -- బంగారము.. ఆభరణముగా మారిందా? ఆత్మ సర్వదా యథాతథమేగాని, జీవుడుగా మారుచున్నది ఎన్నడూ లేదు! ప్రజ్వలించే అగ్ని-అగ్ని జ్వాల, నదీ జలం-జలతరంగము ఒక్కటే అయినట్లు పరమాత్మ-జీవాత్మ ఒక్కటే!

మండుచున్న కట్టెను నీళ్లతో ఆర్పామనుకో! అనగా, ఆ కట్టెను మండిస్తున్న అగ్ని నశించిందా? లేదు కదా! అగ్నికి ఉత్పత్తి-వినాశనములు కట్టెను మండించటముచేత - ఆర్పుటచేత కలుగుచున్నాయి… అని అనలేముకదా!

అట్లాగే కర్మలవలన జన్మ కలుగుతోంది. అప్పుడు జీవుడు పుట్టుచున్నాడు. ఆ కర్మలచే దేహము నశించినప్పుడు ఆ జీవుడు (దేహి) నశిస్తున్నాడు అని అనుకోవటం కూడా! జీవుని జన్మ-కర్మ-మరణములు కలగటమంతా దేహసంబంధమాత్రమే అయి ఉండగా,... అవన్నీ అజ్ఞులు దేహికి (లేక) ఆత్మకు **భ్రాంతిచే ఆపాదిస్తున్నారు.** ఆత్మజ్ఞానము సంపాదించుకోకపోవటంచేత "నేను దేహంతో పుట్టుచున్నాను. చస్తున్నాను. మరొక దేహంలో ప్రవేశిస్తున్నాను..." అనునవన్నీ సత్యమువలె అనిపిస్తున్నాయి. భ్రాంతిచేతనే జీవుడు పుట్టుక-చావు కలవానివలె ఉపలక్షితుడు అగుచున్నాడు. అగుపిస్తున్నాడు (లేక అట్లా అనిపిస్తోంది). వాస్తవానికి - **ఈ జీవుడు దేహముతో జనించటములేదు. (అంతకుముందే వున్నాడు) దేహంతో నశించటములేదు. (ఆ తరువాత కూడా వుంటాడు)**

**దేహాలు మాత్రమే వస్తున్నాయి - పోతున్నాయి.**

ఈ భౌతిక శరీరావస్థలు ఏవేవి?

**శ్లో॥ నిషేక గర్భ జన్మాని బాల్య కౌమార యౌవనమ్**

**వయోమధ్యం జరా మృత్యుః ఇతి అవస్థాః తనోః నవ ॥ (అధ్యా 22, శ్లో 47)**

దేహికి దేహముతో కలుగుచున్న సంబంధ - వ్యవహారములన్నీ 9 అవస్థలుగా చెప్పబడుచున్నాయి.

1. నిషేకము - దేహాభివాన ఆవేశము 2. తల్లి గర్భములో ప్రవేశము 3. భూమిపై జననము 4. బాల్యము 5. కౌమారము 6. యౌవనము 7. ప్రౌఢత్వము 8. వార్ధక్యము 9. మరణము.

ఈ 9 అవస్థలు భౌతికదేహ-సంబంధమైనవి మాత్రమే! చిత్ చైతన్య స్వరూపుడగు దేహి - సంబంధమైనవి కావు. ఇక వాటియొక్క అనుభూతి - మనస్సుయొక్క తీరుపై ఆధారపడి ఉంటోంది.

దేహము వేరు - దేహి వేరు.

**ఈ జీవుడు స్వాభావికమైన అవివేకముచేత, మనోరథముల ప్రభావంచేత, మనో వికార జనితములైన తాదాత్మ్యముచేత - దేహమునకు సంబంధించిన అవస్థలను తనవిగా భావించి అభిమానించి, తనయొక్క అప్రమేయత్వమును ఏమరస్తున్నాడు.**

- ఈ బాల్యం నాది! ఈ యౌవనం నాది! ఈ కష్ట సుఖాలు నావి!
- ఈ వార్ధక్యం నాది! ఈ మృత్యువు నాది! ఈ పునర్జన్మ నాది!

  నావి! నావి! నావి!

అని అతడు స్వప్నసాదృశంగా భ్రమిస్తున్నాడు. రాత్రి స్వప్నంలో పుట్టాను. తిరిగాను. పరుగులెత్తాను. తరువాత మెళుకువ వచ్చింది! – అనే స్వప్నానుభవం విషయంలో స్వప్నానికి ముందు – ఆ స్వప్నానంతరం స్వప్న ద్రష్ట వున్నాడు కదా!

పరమేశ్వరానుగ్రహం చేత వివేకబలం పెంపొందించుకొన్న జీవుడు నాది అనే అభిమనమును పాము కుబుసములాగా విడచి వేస్తున్నాడు. "**జగత్ రచనా దురంధరా! ఇదంతా నీదికదయ్యా!**" అని గమనిస్తున్నాడు! అప్పుడు ఈ జన్మకు ముందు – ఆ తరువాత కూడా నేను వున్నాను... అని గమనించటానికి అర్హుడగుచున్నాడు.

---

తండ్రి దేహియొక్క దేహమునుండి పుత్రదేహియొక్క దేహము బయల్వెడలుతోంది. పుత్ర జననము వలన తండ్రి మరణించి పుత్రుడుగా జన్మిస్తున్నాడా? తండ్రి మరణమువలన పుత్రుడు తన దేహం నశిస్తోందని అనుకుంటున్నాడా? లేదుకదా! దేహముల ఉత్పత్తి–వినాశనముల ధర్మములు ఎరిగినవాడు "పుత్రదేహం పుడుతోంది, తండ్రి దేహం నశిస్తోంది" అన్నట్లుగా చూస్తాడు. తండ్రి మరణిస్తూ వుంటే ఈ దేహముయొక్క వినాశము నాకు సంబంధించినదే – అని కొడుకు అనుకోడు కదా!

వివేకి చావు – పుట్టుకలకు దేహ ధర్మములుగా చూస్తున్నడేగాని తన ధర్మములుగా కాదు. తనను తాను ఆత్మస్వరూపుడుగాను, చావు–పుట్టుకలు తనయొక్క జగత్–క్రియా విశేషములుగాను గమనిస్తున్నాడు. వివేక – అవివేకములకున్న భేదం ఇంతవరకే!

బీజము నుండి వృక్షము వస్తోంది. బీజము నశించిందా? లేదు. బీజము వృక్షముగా పరిణమించింది. అట్లాగే, " జననమరణ – పునర్జన్మాదులు ఒక దశనుండి మరొక దశకు కాలగతిచే జరుగుచున్న స్వభావ సిద్ధమైన పరిణామం" – అనే దృష్టితో జ్ఞాని చూస్తున్నాడు అంతేగాని,ఈ దేహపరంపరలను "దేహం నశిస్తోంది. జనిస్తోంది..." అనే దృష్టితో కూడా చూడడు. జడమైన దేహమునకు చావు ఏమిటి? పుట్టుక ఏమిటి? బాల్యదశ దాటి ఒకడు యౌవ్వనంలో ప్రవేశిస్తున్నాడేగాని, – బాల్యం నశించి యౌవ్వనం

జనిస్తోందా? అట్లాగే జడ దేహమునకు పుట్టుక లేదు. చావు లేదు. చేతనమగు ఆత్మ దేహంతో పుట్టదు. దేహంతో చావదు.

----

ఈ పురుషుడు (జీవుడు) తన స్వస్వరూపము యొక్క స్వరూప-స్వభావాలు గమనించకపోవటంచేత "ఆత్మ ప్రకృతికంటే భిన్నమైనది" అనేది గుర్తించటంలేదు. విషయములందు ఆసక్తుడై దేహాభిమానమును ఆవేశంగా కొనసాగిస్తున్నాడు. ఫలితంగా సంసార దశలను తెచ్చిపెట్టుకొని అనుభవిస్తున్నాడు. అభిమాన - ఆవేశములే సంసారమునకు మూలకారణం! వాస్తవానికి దేహము పుట్టుట లేదు. చచ్చుట లేదు. **ఇక మృత్యుభయం వుండవలసిన పనేమున్నది?**

అజ్ఞానంతొలగి ఆత్మజ్ఞానం వికశించి వెల్లివిరయటానికే కర్మలు ఉద్దేశ్యించ బడుచున్నాయి. కనుకనే, "ఉత్తమ కర్మలు మొట్టమొదట శ్రద్ధగా ఆశ్రయించండి! నిర్వర్తించండి!" అని శాస్త్రములు ప్రారంభ పాఠంగా బోధిస్తున్నాయి. దేహమున్నంత వరకు నిర్వర్తిస్తూ వస్తున్న కర్మలే, తదనంతర ఉపాధులను నిర్ణయిస్తున్నాయి.

శ్లో॥ **సత్త్వసంగాత్ ఋషీన్ దేవాన్**
**రజసా అసుర మానుషాన్**
**తమసా భూత తిర్యక్త్వం**
**భ్రామితో యాతి కర్మభిః ॥** **(అధ్యా 22, శ్లో 52)**

కర్మలను అనుసరించే బుద్ధి రూపుదిద్దుకుంటూ ఉంటుంది. (బుద్ధిః కర్మాణుసారిణీ) వర్తమాన కర్మలయొక్క ఫలములను అనుసరించే ...., తదనంతర జన్మలు రూపుదిద్దు కుంటున్నాయి.

- ఒకానొకడు సత్త్వగుణాధిక్యత చేత ఋషిత్వమో - దేవత్వమో సంపాదించుకొను చున్నాడు.
- మరొకడు రజోగుణ ప్రాబల్యంచేత అసురత్వమో - మానుష్యత్వమో పొందటం జరుగుతోంది.
- ఇంకొకడు తమోగుణముయొక్క ఆధిక్యతచేత భూత-పశు-పక్షి ఇత్యాది జన్మ పరంపరలు పొందటం జరుగుతోంది.

వాస్తవానికి ఈ జీవాత్మ మౌనము - ప్రశాంతము - అప్రమేయము - నిత్యము - సర్వాతీతము అగు కేవలాత్మ స్వరూపుడే! అయితే ఏం? ఒకడు ఒక నర్తకినో (లేక) గాయకునో (లేక) ఒక ప్రసిద్ధ వ్యక్తినో అనుకరిస్తూ (Imitate) ప్రవర్తిస్తూ (mimicree) వుంటాడు. చూచావా?

శ్లో॥ **నృత్యతో గాయతః పశ్యన్ యథైవ అనుకరోతి తాన్**
**ఏవం బుద్ధిగుణాన్ పశ్యన్ననీహోఽప్యనుకార్యతే ॥** (అధ్యా 22, శ్లో 53)

జీవాత్మ స్వస్వరూపము దృష్ట్యా సర్వక్రియాతీతుడే అయి ఉండి కూడా బుద్ధిగుణములను అనుసరించి ఆయా ఉపాధులతో తాదాత్మ్యము చెందుతూ ఉన్నాడు. అనగా, ఆత్మ - బుద్ధియొక్క గుణములను అనుకరించి బుద్ధి గుణములకు పరిమితమై ప్రవర్తించటం జరుగుతోంది. ఎంతటి చమత్కారం!

ఒక రాజుగారు- మంత్రిని అనుకరించటం ప్రారంభించి, "**నేను రాజును**" అనునది ఏమరచి, "నేను మంత్రినే! రాజును కాదు" - అని అనుకోవటం వంటిదే కదా!

మరొక రాజుగారు సింహాసనం దిగి నేను రాజును కదా అనునది ఏమరచి నృత్యం - గానం చేసే నర్తకితో నృత్యం చేయటం ప్రారంభించారట అటువంటిదే, **ఈ జీవుడు ఆత్మ స్వరూపమును ఏమరచి మనో-బుద్ధులతో మమేకమగుచు - నేను దృశ్యాంతర్గతమగు దేహమును కదా!** -అని బుద్ధితో తలచటం!

- కదలుచున్న నీటి తరంగాలు గల తటాకజలంలో ప్రతిబింబిస్తున్న మహా వృక్షములు (ఆ ప్రతిబింబమును చూస్తే)... నీటిలో చలించుచున్నట్లు అగుపించవచ్చు గాక! వాస్తవానికి ఆ మహావృక్షములు అక్కడినుండి కదలుచున్నాయా? లేదు కదా!
- అసలు జలంలో వృక్షాలు వున్నాయా? లేవు! ఇక "అవి నీళ్ళలో కదలుచున్నాయి" అనే మాట వ్యావహారికంగా (దృశ్యంగా) సత్యమేనని (చూచేవానికి) అనిపించ వచ్చునేమోగాని,... వాస్తవానికి అది సత్యమా కాదు!
- పైత్యప్రకోపంచేత కళ్ళు తిరుగుచున్న సమయంలో భూమిపై వస్తువులన్నీ గిఱ్ఱున తిరుగుచున్నట్లు కనిపించవచ్చు గాక! వస్తువులు పైకి - క్రిందికి - ప్రక్కప్రక్కలకు కదలటం నిజమా? కాదు!
- తన మనోరథంలో (ఊహాపథంలో) ఒకానొకడు... ఒక సంఘటనను

జరుగుచున్నట్లు అనుభవిస్తున్నాడనుకో! (ఉదా - ఒకడు "తాను గొప్ప విద్యాకోవిదుడై, ఒక గొప్ప సభలో ప్రవేశించి అక్కడి పండితులను తన వాదోపవాదములతో తలవంచేటట్లు చేయుచుండగా రాజుగారు ఆశ్చర్యపడి మెచ్చుకుంటూ ధనంగల మూటను ఇవ్వటానికి తెస్తున్నట్లు" - ఊహిస్తున్నాడనుకో!) ఆ ఊహాదృశ్యము వాస్తవమా? లేనే లేదు కదా!

- ఒక పెద్ద మనిషి తన కలలో ఏదో అరణ్యంలో ప్రవేశించి సంచారాలు చేస్తుంటే ఆ స్వప్నబుద్ధికి తోచుచున్నది, అనుభూతమగుచున్నది నిజమా? కానేకాదు కదా!

అట్లాగే...,

ఈ జీవుడు పొందుచున్న విషయభోగములు, సంసార వ్యవహార తతంగము.... అదంతా **మిథ్యయే!** ఒక ప్రేక్షకుడు నాటకం చూస్తూ, నాటకంలోని పాత్రల మధ్య జరిగే సంఘటనలకు కోప-తాపాలు పొందటం వంటిదే!

## 35. పరమేశ్వర నిష్ఠ

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీకృష్ణా! మనం ఇప్పుడు సిద్ధాంతీకరించుకుంటున్నట్లు, అప్రమేయము - ఆనందస్వరూపము - సర్వమునకు పరము - అతీతము అగు ఆత్మయే ఈ జీవుని వాస్తవ స్వరూపం కదా! మరి అట్టి ఈ జీవునికి సుఖ-దుఃఖానుభవాలు ఎందుకు సంప్రాప్తిస్తున్నాయి? ఎవ్వరు కలుగజేస్తున్నారు? ఎందుకు కలుగజేస్తున్నారు? అట్లా కలుగజేస్తే, వారికి వచ్చే లాభమేమిటి?

**శ్రీకృష్ణభగవానుడు :**

**శ్లో॥ అర్థే హి అవిద్యమానే అపి సంసృతిః న నివర్తతే**
**ధ్యాయతో విషయాన్ అస్య స్వప్నే అనర్థాగమో యథా ॥** (అధ్యా 22, శ్లో 56)

ఆయా విషయములను - సందర్భములను - సంబంధ బాంధవ్యములను రోజంతా ఆవేశపూరితంగా మననం చేస్తున్న ఒకానొకడు రాత్రి పరుండినపుడు ఆయా సంబంధిత విషయములను స్వప్నంలో అనుభవిస్తున్నాడు చూచావా?

ఆ రీతిగానే ఈ జగదనుభవం - దీర్ఘకాలంగా మరల మరల నిర్వర్తించే విషయమననము వలన - ఈ జీవునికి ప్రాప్తిస్తోంది.

ఆత్మకు సంసారబంధము స్వప్నాంతర్గత విశేషములవలె మిథ్యయే! కలలో ఎవ్వరో కనబడి చేతులు – కాళ్ళు త్రాడుతో కట్టివేస్తే.... అది నిజమా? సంసార బంధము జీవునకు అట్టిదే!

ఓ స్నేహితుడా! ఈ జీవుడు "నేను సుఖములను ఆస్వాదించాలి! పొందాలి" – అని అనుకొని విషయములను ధ్యానిస్తున్నాడు. విషయ ధ్యానము వలన సుఖదుఃఖ వృత్తులు కలుగుచున్నాయి!

అందుచేత ఓ ప్రియమిత్రమా! ఉద్ధవా!

**శ్లో॥ తస్మాత్, ఉద్ధవ! మా భుంక్ష్వ విషయాన్ అసత్ ఇంద్రియైః**
**ఆత్మాగ్రహణ నిర్భాతం పశ్య వైకల్పికం భ్రమమ్ ॥** (అధ్యా 22, శ్లో 57)

నీవు అసత్తుమాత్రమే అయినట్టి ఇంద్రియములకు అనుభూతములగుచున్న ఇంద్రియ విషయములను సేవించటంలో నిమగ్నం (immersed, entangled) కావద్దు. స్వప్నదర్శనముతో పోల్చతగినట్టి అజ్ఞానము వలననే ఈ జీవునికి వికల్పములన్నీ కలుగుచున్నాయి. అదంతా అనేక భ్రమ–విభ్రమములకు దారితీయటం గమనించమని గుర్తు చేస్తున్నాను. ఈ కనబడేదంతా ఏమిటో గమనించి, జాగరూకుడవై ఉండవలసిన పనిలేదా? కష్ట సుఖ భావనావేశమును ప్రక్కకు పెట్టి స్వబుద్ధితో సర్వాంతర్యామియగు పరమాత్మను శరణువేడటమే సర్వదా క్షేమకరం సుమా!

అనగా ...., పరమేశ్వర నిష్ఠను సర్వకాల – సర్వావస్థలయందు ఆశ్రయించు.

- దుర్జనులు నిన్ను వెళ్ళగొట్టవచ్చు గాక! అదలించవచ్చు గాక!
- ఎవ్వరో వచ్చి నిన్ను అవమానించవచ్చు గాక! బాధ కలిగించే మాటలతో దూషించ వచ్చు గాక!
- ఇంకొందరు నిన్ను పరిహాసం చేయవచ్చుగాక! నిన్ను చూచి గేలి చేస్తూ పకపకా నవ్వుకోవచ్చును గాక!
- మరికొందరు దోషములు ఆరోపించి నిన్ను దూషించవచ్చు గాక! లేనిపోని మాటలతో సతాయించవచ్చు గాక! ఎగతాళి చేయవచ్చు గాక!
- నీవు బంధింపబడవచ్చును గాక!
- నిన్ను ఎవ్వరో మోసము చేయవచ్చును గాక!

- పైన ఉమ్మివేయవచ్చు గాక!
- నీపై మూత్రము విడవవచ్చు గాక!

ఇట్లా ఏఏ సందర్భములు - సంఘటనలు ఎంతగా ఏర్పడినప్పటికీ నీవు మాత్రం పరమేశ్వరనిష్ఠ నుండి విచలితుడవు కానేవద్దు. వారి-వీరిపై ఆపాదించి విషాదం పొందవద్దు. మౌనమును, ప్రశాంతతను వీడకుండానే-సాక్షివై, అతీతుడవై వుంటూనే జగన్నాటకంలో సందర్భానుచితంగా మాత్రమే ప్రవర్తించు. శ్రేయస్సును కోరుకొన్నవాడు నానా కష్టములు అనుభవిస్తున్న సందర్భాలలో కూడా స్వబుద్ధితో పరమాత్మను శరణు వేడుకుంటూనే ఉంటాడు. తద్వారా తనను తాను రక్షించుకొనుచున్నాడు! "సర్వము పరమాత్మతత్త్వమే కదా!" అనే అవగాహన - అభిప్రాయములను స్వీయ శ్రేయస్సు కొరకై దీపమును రక్షించుకొన్నట్లు రక్షించుకుంటున్నాడు. హే పరమాత్మా! నీవుకదయ్యా, నాకు సర్వదా తోడు-నీడ!.... అని హృదయభాషణ కలిగినవాడై వుంటాడు!

**శ్రీ ఉద్ధవుడు :** దేవా! వక్తలలో శ్రేష్ఠుడా! శ్రీకృష్ణా! అటువంటి సర్వసందర్భాలలో పరమాత్మవగు నిన్నే గుర్తు చేసుకొని ఉండి శరణువేడటం ఎట్లాగో వివరించండి. అది మావంటి అల్పజీవులకు సాధ్యమా?

ఎందుకంటే...,

ప్రకృతి అత్యంత బలీయమైనది కదా!

పండితులైనవారు, ధర్మనిరతులు, శాంతులు, భక్తులుకూడా ఆయా అవమాన సంఘటనల సందర్భాలు కష్టమనియే తలుస్తున్నారే! అంతేగాని, "**సర్వతత్త్వ స్వరూపమగు ఆత్మయే నేను కదా!**" .. అనే ఆత్మదేవ మననం ఆయా కష్ట-నిష్ఠుర సందర్భాలలో గుర్తు పెట్టుకోలేకపోతున్నారు. "**ఈ కనబడేదంతా - కనబడేవన్నీ నేనే...**" అనే మననము కలలో కూడా గుర్తుకు రావటం లేదే! ఇక మేమెంతటివారము చెప్పండి!

ఇది దృష్టిలో పెట్టుకొని...,

సర్వకాల సర్వావస్థలలోను నిన్ను మాత్రమే గుర్తుపెట్టుకొని బుద్ధితో మిమ్ములను శరణువేడి ఉండటం ఎట్లాగో మరికొంత సోదాహరణంగా వివరించండి స్వామీ! "**ఇదంతా కృష్ణ చేతన్యమే! ఆత్మ చైతన్యమే... ఈ జగత్తంతా నా స్వస్వరూపమే...**" అని సర్వదా గుర్తులో ఉంచుకోవటం ఎట్లా?

# 36. భిక్షు గీత - వైరాగ్యము

**శ్రీ శుక మహర్షి :** ఓ పరీక్షన్మహారాజా! యాదవ శ్రేష్ఠుడు - పుణ్యశ్లోకుడు - శ్రీకృష్ణ భక్తుడు అగు ఉద్ధవుడు "సర్వమునకు అతీతంగా ఉండి సర్వేశ్వరుని సర్వదా స్మరించటం ఎట్లా?..." అని ప్రశ్నించగా.

ఆ ప్రశ్నకు సంతోషించి కృష్ణ భగవానుడు ఉద్ధవుని ప్రశంసించి, ఆపై ఈరీతిగా చెప్పసాగారు.

---

**శ్రీకృష్ణుడు :** బృహస్పతి శిష్య సమానుడవగు ఓ ఉద్ధవా! నీవు చెప్పినట్లుగా ఒక సజ్జనుడు దుర్జనుల దుష్టవాక్కులను, ఎత్తిపొడుపు మాటలను, దూషణవచనములను విని, కలతచెందిన మనస్సును శాంతపరచి ఉంచటం కష్టతరమైన విషయమే! దుష్టుల దుష్టపలుకులు బాధించినంతగా బాణముల మర్మభేదములు కూడా బాధించలేవు.

అయితే ఇందుకు పరిష్కారమార్గంగా పెద్దలు మహాపుణ్య జనకమైన **భిక్షుగీత** అనే యితిహాసమును ముముక్షువులకొరకై చెప్పుతూ ఉంటారు. ఆ ఇతిహాస విశేషాలు నీ ప్రశ్నకు సమాధానంగా మనం చెప్పుకుందాం! విను.

ఈ మనం చెప్పుకోబోవుచున్న యితిహాసంలో ఒకానొక భిక్షువు దుర్జనులచే ఎంతగానో అవమానించబడి... అప్పుడు కూడా ధైర్యమును విడువకుండా, "ఇదంతా నా పూర్వజన్మ దుష్కృత ప్రభావం మాత్రమే కదా!" అని భావించాడు. భిక్షుగీతను గానం చేశాడు. **"సర్వము సర్వదా ఆత్మ చైతన్య చమత్కారమే కదా! సర్వత్రా సచ్చిదానందమేగా!"** - అనే అంతిమ నిర్ణయానికి వచ్చాడు! అది వివరిస్తున్నాను. విను!

----

మాలవ దేశములో ఒకానొక విప్రుడు ఉండేవాడు. ఆతడు ఐశ్వర్యవంతుడు. కృషి-వాణిజ్యము మొదలైన వ్యాపార దక్షత గలవాడు. అయితే బహుసంపద-ధన కాముకుడు. అత్యంత లోభికూడా! అంతేకాదు. భార్య - పుత్రులను కూడా బాధించే దుష్టస్వభావి. అత్యంత కోపిష్టికూడా!

ఆతడు ఎప్పుడూ అతిథులనుగాని, బంధువులనుగాని మాటమాత్రంగా కూడా సంతోష పెట్టేవాడు కాదు. ధర్మహీనుడై జీవితమును గడపుచూ ఉండేవాడు. ఆతని పలుకు-

మాట ఎంతో కరకుగా ఘాటుగా ఉండేది.

ఆతడు ఎంతటి లోభి అంటే..., గొప్ప సంపదలు సంపాదించుకొని ఉండికూడా తాను తిని సుఖపడడు. ఇతరులకు కొంచెమైనా పెట్టి ఆనందించడు. పాపం లేదు. పుణ్యం లేదు. ముందు డబ్బు సంపాదించటం-దోచటం-దాయటం ఇదే ముఖ్యం అని అనుకునేవాడు.

ఆతడు దుశ్శీలుడై, భార్య - పిల్లలు - తల్లి - తండ్రి తదితర బంధువులను, మిత్రులను ద్వేషించటం - దూషించటం - అవమానించటం చేస్తూ ఉండేవాడు! ఇటువంటి చర్యల కారణంగా అందరూ అతనిని తమలో ఎంతగానో ద్వేషించేవారు. ధనలోభంచేత ఆతడు ఎవ్వరికీ ప్రియం కలిగించేవాడు కాదు. "ఈ భార్య - ఈ పిల్లలు నా డబ్బు తినడానికే పుట్టారు" అని అరుస్తూ ఉండేవాడు. ఏమాత్రం కనికరం ఆతనిలో లేదు. హృదయమంతా లోభత్వమే! ధన కాంక్షయే!

ఈవిధంగా కేవలము డబ్బు దాచుకోవటం, ధర్మముపట్ల విరతిచే ఉభయ భ్రష్టుడు అగు ఆ విప్రుని దుష్టచర్యలు గమనిస్తున్న దేవ-పితృ-అతిథి ఇత్యాది పంచ యజ్ఞ భాగులగు దేవతలు ఆతనిపై  ఒకానొక సమయంలో కోపగించటం ప్రారంభించారు.

దేవతలు ప్రసాదించినది పొందుతూ వారికి సమర్పించవలసినది సమర్పించకపోవటం అనర్ధహేతువు కదా! దొంగతనంతో సమానము కదా! దేవతలకు కోపం వస్తే ఇంకేమన్నా ఉన్నదా?

ఆవిధంగా ఆతడు - ఇంద్రియములు - దేహము ప్రసాదించి సంరక్షిస్తున్న దేవతలను, సంపద- సంతానములను కనికరించే పిత్రుదేవతలను, సహకారికారకులగు సహ జీవులను - ఆదరించకపోవటంచేత ఆతని పుణ్యభాగము క్రమంగా క్షీణించసాగింది. ఆతడు రాత్రింబవళ్ళు కష్టించి ప్రోగుచేసుకున్న ధనమంతా అనుకోని ఆపత్తులకు క్రమంగా వెచ్చించవలసి వచ్చేది. ఆవిధంగా అంతా నష్టమైపోయింది. ఆతని ధనములో కొంత భాగం ఆతని కొందరు జ్ఞాతులు మోసంచేసి హరించారు. మరికొంత భాగం దొంగలు ఎత్తుకుపోయారు. ఇంకొంత భాగం దైవవశంగా - కాలవశంగా నష్టమైపోయింది. కొంతకొంత రాజులచేత-సేవకులచేత అపహృతం అయింది. ఈవిధంగా ధనమంతా నష్టమైపోగా... ధర్మ-అర్ధములను పోగొట్టుగొన్న ఆతనిని స్వజనులే  పట్టించుకోవటం మానివేశారు. అందరు ఆతనిని ఉపేక్షించసాగారు. ఛీదరించుకోసాగారు.

అదంతా చూచిన ఆ విప్రుడు దుస్తరమైనటువంటి పరిస్థితులను పొందుచూ, ఇక విషాదముతో విచారములో నిమగ్నము కాసాగాడు. విచారణలో పడిపోయాడు.

- ధనాశ – పిసినారి అగు ఆతడు చాలా సంతప్తుడైనాడు. ఎవరికీ చెప్పుకోవటానికి కూడా లేక, కృంగిపోసాగాడు.
- క్రమంగా – ఏమిటిరా ఇదంతా? పుట్టినప్పటినుండీ ఇప్పటిదాకా జరుగుచున్నదంతా ఏమిటి?– అని దీర్ఘచింతలో మునిగిపోయాడు.
- ధనం పోతూవుంటే రాత్రి – పగలు పెద్ద గొంతుకతో ఏడవటం ప్రారంభించాడు.

ఇటువంటి దుఃఖాలు పొందుతూ పొందుతూ ఉండగా అతనిలో ఒకానొక సమయంలో గొప్ప **వైరాగ్యము** రూపుదిద్దుకొనసాగించి.

ఆ విప్రుడు ఈవిధంగా ఆలోచించసాగాడు!

---

**విప్రుడు :** ఆహాఁ! నేను ఎంతో కష్టబడి శ్రమించి సంపాదించి దాచుకున్న ధనమంతా అటు ధర్మమునకు గాని ఈవైపు నా భార్యా బిడ్డలకుగాని, – ఇటు నా కామ భోగములకైనాగాని, చేతికి రాకుండా అంతా వ్యర్ధంగా వ్యయం అయిపోయిందే? ఈ నా శరీరాన్ని ఇప్పటిదాకా వ్యర్ధంగా అనేక ధన సంపాదన సంబంధమైన కార్య కలాపాలలో నియమించుకున్నాను. ఇప్పుడు నాకు వచ్చిన కష్టాలు ఎంత భరించరానివి! దుస్సహవము! నా కష్టాలు చెప్పుకోటానికి ఎవ్వరూ లేరు! చెప్పటానికి అలవికాదు కూడా! ఇంత జీవితంలో నేను ఏమి సాధించినట్లు? సర్వం వ్యర్ధం అయిపోయింది! (సర్వ వ్యర్ధం మరణసమయమే సాంబ ఏకః సహాయః.... అను) పెద్దల వాక్యాలు ఇప్పటికి గుర్తుకొస్తున్నాయి.

అయ్యో! నావంటి నీచుల – కృపణుల – లోభుల సంపదలు, అధికారాలు ఎప్పుడూ సుఖప్రదములు కాదు. దుఃఖప్రదములే! అంతేకాదు! ఈ సంపదలు ఇహలోకంలో కష్టాలకు – పరలోకంలో నరకాదులకు కారణం అవుతాయికదా! ఈ విషయం మును ముందుగానే నేను ఎందుకు గమనించలేదు? మూర్ఖుడనై జీవితాన్నంతా వృధా చేసుకున్నానే!

అల్పమైన శ్వేకుష్ఠువు (చర్మమును తెల్లగా మార్చే చర్మవ్యాధి) క్రమంగా సుందరమైన ముఖాన్ని అందవిహీనం చేసేస్తుందే! ఆవిధంగా (ధనసముపార్జనం జీవితంలో ఒక చిన్న విషయమే అయినప్పటికీ) లోభగుణం అల్పమైనదైనప్పటికీ - సద్గుణవంతుల సద్గుణములను, కీర్తిమంతుల నిర్మలమైన కీర్తిని నాశనం చేసివేయగలదని ఇప్పటికిగదా, నేను గమనిస్తున్నాను!

**శ్లో॥ అర్థస్య సాధనే సిద్ధే ఉత్కర్షే రక్షణే వ్యయే**
**నాశోపభోగ ఆయాసః త్రాసః చింతా భ్రమో నృణామ్ ॥** (అధ్యా 23, శ్లో 17)

ఈ ధనమును -

- సంపాదించుకోవటంకోసం సాధనలు (పద్ధతులు) సమకూర్చుకోవటంలోను,
- ఆ సాధనలను సిద్ధింపజేసుకోవటంలోను,
- సంపాదించిన దానిని వృద్ధిపరచుకోవటంలోను,
- వృద్ధిపొందుచున్న ధన సంపదను రక్షించుకోవటంలోను,
- రక్షించుకుంటున్న ధనమును ఖర్చుచేయటంలోను,
- ఆ ధనమును అనుభవించటంలోను,
- అది ఖర్చుఅవుతుండగా "పోగొట్టుకుంటున్నామే?" అని వేదన చెందటంలోను

ఈ మానవులు ఎంతగా శ్రమ పొందుచున్నారు! ఎంతగా భయము - చింత - భ్రమ ఎదురౌతున్నాయి! ఇదా జీవితం? ఇందుకోసమా, పుట్టింది?

నిజమైన శ్రేయస్సు కోరుకొనేవాడు - కళ్యాణకాముకుడు అగు వ్యక్తి అర్థములను (సంపదలను) అనర్థంగానే చూస్తున్నాడు. అర్థములో పెద్దలు గుర్తుచేసే పంచదశ (15) అనర్థములను ఆతడు గమనిస్తున్నాడు. మమకారము మొదలంట్లా త్యజించి జాగరూకుడై ఉంటున్నాడు.

**అర్థమును ఆశ్రయించి ఉంటున్న పంచదశ (15) అనర్థములు :**

**శ్లో॥ స్తేయం హింసా అనృతం దంభః కామః క్రోధః స్మయో మదః**
**భేదో వైరమ్ అవిశ్వాసః సంస్పర్ధా వ్యసనాని చ**
**ఏతే పంచదశ అనర్థా హి అర్థమూలా మతా నృణామ్ ।**
**తస్మాత్ అనర్థమ్ అర్థాఖ్యం శ్రేయోఽర్థీ దూరతఃత్యజేత్॥** (అధ్యా 23, శ్లో 18, 19)

దొంగతనము (చౌర్యము) హింస అసత్యము దంభము కామము క్రోధము విస్మయము గర్వము భేదబుద్ధి వైరము అవిశ్వాసము స్పర్ధ స్త్రీ జూదము దుర్వ్యసనము - ఈ 15 ప్రమాదాలు అర్థము వెంటనంటి ఉండే అనర్థాలని పెద్దలు చెప్పుచున్నారు. నేను విననే లేదు కదా! ఆ రోజులలో ఆ మాటలు విని నవ్వుకున్నాను. ఇప్పుడేమైనది? చిన్న విషయమైనట్టి ఈ అర్థము వలన తల్లి-తండ్రి-భార్య-సోదరులు-బంధువులు-మిత్రులు వీళ్ళంతా శత్రువులుగా కనిపించసాగారు. మనస్సంతా **అకారణమైన శత్రుత్వము** అనే పశుస్వభావమగు అత్యంత ప్రమాదకరమైన దుష్టపదార్థంతో నిండిపోయింది కదా! ధన సంపదను చూచుకొనిన మరుక్షణం నేను లోభగుణం అబ్బటంచేత - క్షుద్రుడను-కోపిష్టిని అయ్యాను. అయినవారిని, శ్రేయోభిలాషులను అంత దూరంగా ఉంచి, అందుకు ఫలితంగా ఎంతగానో నష్టపోయాను.

సోదరులు-శ్రేయోభిలాషులు-విజ్ఞులు ధనవంతుని చూచి "ఈతనితో మనకెందుకులేరా బాబూ!..." అని అల్లంత దూరంగా ఉండిపోతారు. మిత్రులు కూడా "వీడివల్ల మాకేమిటి లాభం?..." అని తలుస్తూ ద్వేషం పొందినవారై ఇక మోసం చేయటానికైనా - చంపటానికైనా కూడా సిద్ధపడతారు.

భార్య-బిడ్డలే నావంటి లోభిని చూచి "వీడు మా చావుకు వచ్చాడురా!" అని దూరమైపోయారు. అప్పుడేమో "వీళ్ళంతా పోతే పోనీ!" - అనుకుని సంపాదించుకున్న ఒంటరితనము ఇప్పుడు శాపమై కూర్చున్నది.

అయ్యయ్యో! దేవతల కరుణచే ఈ మానవజన్మ లభించింది. అందులోనూ వేదాధ్యయనం చేసి తరించవలసిన విప్రజన్మ ఎంతటి గొప్ప అవకాశం! అట్టి మహత్తరమైన దేవతా ప్రసాదిత మహదవకాశమును ధనము ప్రోగుచేయటానికి మాత్రమే వెచ్చించి, లోభినై ఆత్మహితమును నాశనము చేసుకొని అశుభగతిని ఆహ్వానించానే! కించిత్ అయినా తెలివి ఉన్నదా, నాకు?

లేదు. ఎందుకంటే...,

మానవదేహం పొందటం ఏమైనా చిన్న విషయమా? కాదు. కానేకాదు. ఈ మానవదేహము స్వర్గ - మోక్షములకు ముఖద్వారము వంటిది! అటువంటి అవకాశమును సద్వినియోగపరచుకోకుండా అర్థముకొరకై (సంపదలు సంపాదించి ప్రోగుచేసుకోవటానికై) అఱ్ఱులు చాచి రోజులు గడపటం- బ్రతికినన్నాళ్లూ చావుకొరకై

సరంజామా తయ్యారు చేసుకోవటం వంటిదేకదా!

ధనమును దేవతలకు – ఋషులకు – పితరులకు – సహప్రాణులకు – జ్ఞాతులకు – బంధువులకు – దాయాదులకు వారివారి భాగములు వారికి ఇచ్చి సంతోషపరచకుండా, తాను అనుభవించకుండా యక్షునివలె దాచి రక్షించుకోవటం, కుక్కవలె కాపలా కాయటం– అధఃపతనానికి నాందీవాక్యాల ఉచ్ఛారణయే! ఎంతమంది ఎంతగా చెప్పినా... ఇది నేను చెవినపెట్టానా? లేదు! పెడచెవిన పెట్టాను. "లోభిగా ఉండకురా, నాయనా!" –అని పెద్దలు చెప్పుతుంటే, "వీళ్ళెవరు, నాకు చెప్పేది?"... అని విర్రవీగాను.

వివేకవంతులగు పురుషులు యాధృచ్ఛికంగా దేవతల దయచే లభించిన ధనసంపదలను సరిఅయిన మార్గంలో వినియోగించి సిద్ధిని పొందుచున్నారు. మరి నేనో? ధనమును ఆర్జించే వ్యాపారంలో మునిగి – తేలుతూ చివరికి ధనమును, ఆయుష్షును, బలమును – అన్నిటినీ పోగొట్టుకొన్నాను. సాధన సంపత్తి గురించి పట్టించుకోనే లేదు. ఇప్పుడిక వార్ధక్యము (ముసలితనము) వచ్చిపడింది. ఇక చేసేది ఏమున్నది? ధనమంతా చేయి జారింది. బుద్ధి అనే విలువైన రత్నమును ధనదాహము అను రూపముగల మలములో దాచుకున్నవాడినైనాను!

విప్రుడను, వేదాధ్యయనము చేసినవాడను, ద్విజుడను, గురువులు చెప్పగా వేదాంత విద్యను వినినవాడను – అగు నేను ఎందుచేత వ్యర్థమగు ధనోపార్జన – అనే వ్యసనంలో మునిగిపోయానోకదా! ఎందుచేత భ్రమించాను? ఎందుకు మోసపోయాను? ఆహాఁ! ఏదో అనిర్దేశ్య శక్తి–అదృశ్యశక్తి కల్పించే మాయచే లోకజనులంతా – నాతో సహ – మోహితులమై చరిస్తున్నామనుటలో ఏ సందేహము లేదేమో! అసలీ శరీరమేమిటి? ఇది ఏమి కాబోతోంది?అతి త్వరలోనే మృత్యువుచేత కబళించబడబోతోంది కదా! పోనీ నాకు చాలా ఆయుష్షు వున్నదిలే! – అని మురిసిపోదామా? ఎప్పుడు ఏ శరీరం శ్మశానము జేరబోతోందో ఏమీ చెప్పలేం! మరణించిన జీవుని వెంటనంటి ధనముగాని, వస్తుసంపదగాని, భోగములుగాని వస్తున్నాయా? మరణ సమయంలో అన్నిటిని వదలవలసిందే! వెంటనంటి రావు కదా! మరెవ్వడో వచ్చి ఈ ఇల్లు–ఈ సంపద – ఈ ధనము నాది.... అని మురిసిపోతూ వుంటే వాటిని కష్టపడి సంపాదించి మరణించినవాడు– **ఇవన్నీ నావిరా!** – అని పలుకగలడా? తిరిగి భూమిపైకి రాగలడా? రాలేడు. అటువంటి అల్పమగు మరొక జన్మలోనికి త్రోసివేయగల –ధనాదులను చూచి

గర్వించటం ఏమిటి? జన్మపరంపరా చక్రమునుండి బయల్వెడలి జన్మరాహిత్యమును సిద్ధించుకోవటానికి గదా, జన్మ అనే సందర్భమును ఉపయోగించుకోవలసినది?

---

ఇతఃపూర్వం నేను సంపాదించుకున్న ధనమంతా పోయింది. అదంతా ఎంతో కష్టపడి – కక్కుర్తిపడి అత్యంత లోభత్వంతో నేను తినక – ఎవ్వరికీ పెట్టక, అనేకులను బాధించి –వేధించి మరీ సంపాదించాను. ఆ ధనమంతా ఇప్పుడు దొంగలచేత – బంధువులచేత – ప్రకృతి వైపరీత్యములచేత – స్నేహితులచేత – వైద్యులచేత తలొకకొంత లాగుకొని పోబడింది. ఈ ఖాళీ చేతులు మాత్రం నాకు మిగిలాయి!

అయితే... వారందరిని ఇప్పుడు పేరుపేరున తిట్టనా? తిట్టి ఏమిలాభం? ఇదంతా నడిపిస్తున్న చరాచర సృష్టికర్త మరొకాయన ఉన్నారు. ఆయన కదా, అన్నింటికి కారణం! అంతేగాని మరెవ్వరూ కాదు! హే పరమాత్మా! ఇదంతా చేస్తున్నది నువ్వయ్యా!

---

*(కొంత నిశ్శబ్దంగా సమయం గడపిన తరువాత)*

ఒకవేళ వాళ్ళంతా నా ధనాదులను దొంగిలించి, లాగుకొని ఉండకపోయినప్పటికీ కొద్దిరోజులు – సంవత్సరములలోగా ఒకానొక (ముందుగా అనుకోని) క్షణంలో – నేను ఈ దేహమును విడువవలసిందేకదా! కాల దేవత నన్ను ఇక్కడినుండి – ఈ దేహంలోంచి బలవంతంగా బహిర్గతం చేసి మరొక తల్లి గర్భంలోకి ప్రవేశింపజేయక మానదుకదా! అప్పుడైనా ఇవన్నీ వదలవలసినదే! మరొకడెవడో వచ్చి నావలెనే "**ఇవన్నీ నావి!**" అని భావించటం ఎవ్వరూ ఆపగలిగేది కాదు కదా! ఎప్పుడో ఒకప్పుడు నేను వదలక తప్పని అర్ధ సంపదను ఇప్పుడే ఎవ్వరెవ్వరో వచ్చి లాక్కుపోయారు. కనుక ఇప్పుడు నాకు వచ్చిన నష్టమేమున్నది? ఏది ఎటుపోవాలో... అటే పోయింది.

అవును! ఏ కష్టము వచ్చిందీ లేదు!

అమ్మయ్య! ఇప్పుడు అర్ధమైనది. అవును! అవునవును! నేను ఇంతకాలం ఈ అర్ధసంపదను చూచుకొని – తొర్రలో దాగిన ముసలి పందికుక్క "ఈ ధాన్యరాసులన్నీ నావే" అని అరుస్తున్నట్లు – "నావి నావి" అని అహంకరించాను. ఘీంకరించాను. తల్లి తండ్రులు – భార్య – బిడ్డలు – బంధువులు – స్నేహితులు – పేదవారు.... వారందరిపై రుసరుసలాడాను. నా ఉత్తరోత్తరగతుల దౌర్భాగ్యమేమిటో గమనించిన నా తండ్రి,

జగతః పితయగు పరమాత్మ నేను సంపాదించి ప్రోగు చేసిన ధన సంపదను నానుంచి వదలించారు! లాక్కున్నారు. **ఆహాఁ! ధనం తొలగటం గొప్ప అదృష్టమే!**

అవును! ఇది శాపం కాదు! వరం! సర్వదేవతా హృదయ స్వరూపుడగు శ్రీహరి నాపట్ల ప్రసన్నుడైనారు. ఇందులో సందేహమే లేదు. ఎవరి ప్రేరణ - కృపలవలన నాకు ఈ ధనహీన దశ ప్రాప్తించినదో... ఎవరి ప్రేమ-కరుణా కటాక్షవీక్షణలచే నేను సంసార సముద్రమును దాటటానికి గొప్ప యంత్రశక్తిగల నావ వంటి వైరాగ్యము ప్రాప్తించిందో... అట్టి శ్రీహరీ! లోక కళ్యాణమూర్తీ! పరంధామా! అంతా ఇచ్చింది నీవేకదయ్యా! నాదైనదంతా నీదే! నాపై వాత్సల్యంతో ఇప్పుడు నన్ను ధనహీనుణ్ణి చేసి ఆదుకున్నావయ్యా! కుక్కలాగా కాపలా కాసే శ్రమనుండి తప్పించావు! **నా హృదయం పవిత్రం చేసి నీవు ప్రవేశించాలనే నన్ను నిరుపేదగా బాటలో నిలబెట్టావు.** నన్ను కన్నతండ్రివైన నిన్ను శరణు వేడుచున్నాను! క్షమించు! కరుణించు! ఇదంతా నీ దయయే!

ఈ రోజుకూ ఇంకా ఈ వార్ధక్యదేహము నావద్దనే ఉన్నది. ఒకవేళ-నాకు ఈ దేహంతో ఆయుష్షు కొంత మిగిలి ఉంటే నేను దైవోపాసనకు సంబంధించిన సాధనములపట్ల శ్రద్ధ వహిస్తాను. అప్రమత్తుడనై ఉంటాను. "శ్రీహరియే నా ఆత్మకదా" - అను ఆత్మ సంతుష్టిని పెంపొందించుకుంటాను. ఇతఃపూర్వపు లోభ-దురాశ సంస్కారాలు పూర్తిగా తొలిగేయత్నం చేస్తాను. తపస్సుకొరకై ఈ శరీరమును ఉపకరణముగా ఉపయోగిస్తాను. ఈ దేహము ఎంతకాలం ఉంటుందో అంత కాలంవరకు-తుది క్షణం వరకు సర్వ తత్త్వస్వరూపుడగు శ్రీహరి పాదపద్మములను నా మనస్సు ఆశ్రయించును గాక!

శ్రీహరిని ఆశ్రయించి ఉపాసించాలనుకునే నా యీ ప్రయత్నములకు సహకరిసస్తూ... త్రిలోకాధిపతులగు దేవతలు నాపై అనుగ్రహము చూపుదురు గాక! వారి దయవల్లనే కదా, ఖట్వాంగ చక్రవర్తి మొదలైనవారు కొద్దికాలంలో వైకుంఠధామం చేరారు! నాపట్ల దేవతలు ఆవిధంగానే దయచూపి నన్ను క్షమించి, శ్రీహరి పాదాలుచేరటానికి నన్ను ఆశీర్వదిస్తూ, నాపై ప్రేమతో సహకరించెదరు గాక! నాకు దారి చూపెదరుగాక!

---

వింటున్నావా? ఉద్ధవ మహాశయా! అవంతి దేశస్థుడైన ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఆవిధంగా సర్వసంపదలు కోల్పోయిన ఆ సందర్భాన్ని విశ్లేషించుకొని బుద్ధితో ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

- హృదయ గ్రంధులైనట్టి అహంకార-మమకారములను మొదలంట్లా హృదయం లోంచి పెకలించి ఆవలపారవేయసాగాడు. **"అవి నావి! ఇవి నావి"** అనుకునే బుద్ధి విభాగమును **"కావు! కావు!"** అనే మంత్ర మననంతో శాంతపరచసాగాడు.
- శాంతుడు - మౌని - సన్యాసి అయ్యాడు.
- భిక్షకుడై దేహానికి ఆహారం అందిస్తూ తన దేహమును ఒక ఉపకరణంగా మలచుకొని విదేహముక్తికి ప్రయత్నించటానికై సంసిద్ధుడైనాడు.
- సన్యాసి అయి మనస్సును - ఇంద్రియములను - ప్రాణములను శాస్త్ర ప్రవచిత మార్గంగా నిగ్రహించి పరమత్మతత్త్వము వైపుగా ప్రేమగా నడిపించటం ప్రారంభించాడు.
- **"అంతా శ్రీహరే! ఇక కళ్ళుమూతలెందుకు?"** అని భావిస్తూ ఉత్తమమైన మానసిక నిగ్రహాన్ని క్రమక్రమంగా సముపార్జించుకోసాగాడు.
- ఆసక్తి శూన్యుడై పైకి దీనంగాను, లోలోన ఆత్మభావనాపరవశంతోను భిక్షాటన చేస్తూ గ్రామాలు - నగరాలు సంచరించసాగాడు. త్రిదండము - భిక్షాపాత్ర - కమండలము - జపమాలలతో దేశద్రిమ్మరిగా తిరుగసాగాడు.

ఓ ఉద్ధవా! వృద్ధుడు - మలిన వస్త్రములు ధరించినవాడు అగు ఆ విప్రుడిని చూచి అసత్పధులగు కొందరు ఆకతాయిలు గేలిచేస్తూ ఉండేవారు. అవమానిస్తూ ఉండేవారు. చిన్న కర్ర చూపించి బెదిరిస్తూ ఉండగా ఆతడు వేగంగా అడుగులు వేస్తూ ఉంటే పకపకా నవ్వుకొంటూ ఉండేవారు. అనేకులు అజ్ఞులు ఆతనికి ఆహారం ఇవ్వకపోగా "ఓయ్! పోఁ! తంతా! పిచ్చివాడా! చెత్త ముఖమా!..." ఇటువంటి తిరస్కార భాషణతో, దూషణతో అవమానించ సాగారు.

- కొందరు ఆతని త్రిదండమును లాక్కున్నారు.
- మరికొందరు ఆతని భిక్షకపాత్రను, కమండలమును దొంగిలించారు.
- ఇంకొందరైతే ఆతని జపమాలను - బొంతను కూడా ఆతని నుండి పెరుక్కున్నారు.

ఆతడు ఒకానొక సమయంలో ఏదో దొరికిన పాత్రలో ఎవ్వరో ఇచ్చిన ఆహారం తింటూ ఉంటే, ఆతనిని ఏడిపించి - ఆనందించాలనే ఉద్దేశ్యంతో ఆ పాత్రలో పనిగట్టుకొని మూత్రమును కూడా విసర్జించారు. శిరస్సుపై కాండ్రించి ఉమ్మివేశారు.

మహానుభవాడగు ఆ మునిని కొందరు అకతాయిలు రహదారిలో నిలబెట్టి "ఆ విషయం చెప్పు! ఈ విషయం చెప్పు! శృంగారం గురించి మాటలు చెప్పు!" అని వేధించేవారు. ఆతడు ఏమీ మాట్లాడక ఊరుకొని ఉంటే, "అడుగుతుంటే చెప్పవేరా? ఏమిరా నీ పొగరు?" అని కఱ్ఱతో అదిలించేవారు. "వీడిని చెట్టుకు బంధించండిరా!" అని త్రాళ్ళు తెచ్చి బంధించి తిట్లు-శాపనార్ధములతో వినోదించేవారు. అవును. కొందరు మూర్ఖజనులు యుక్తాయుక్తములు, తదనంతర పరిణామములు మరచిపోతూ వుంటారు. ఇతరులను బాధించుటలో వినోదమును పొందటం, తద్వారా అనేక పాప-అల్ప-దుఃఖపూరిత స్థితి-గతులకై వారికి వారే తలుపులు (ద్వారాలు) తెరుచుకొని పరుగులు తీయటం లోకంలో కొందరు అజ్ఞాన జనుల విన్యాసమేకదా!

ఇతఃపూర్వము ఆ విప్రుని పూర్వవిషయాలు తెలిసిన కొందరు ఆ విప్రవర్యుని వైపుగా కుడిచేతి క్రింది నాలుగు వ్రేళ్ళతో (బొటనవేలు నిలువుగాను) చూపిస్తూ...,

- ఈతడెవ్వడో మాకు తెలుసు.
- ఉట్టి పిసినిగొట్టు. మన డబ్బంతా ఎక్కడో దాచాడు.
- లోక వంచకుడు.
- దొంగ సన్యాసి. వేషాలు వేస్తున్నాడు.
- ధనమంతా కోల్పోవడంచేత ఈతని బంధువులంతా కలసి ఊరినుండి వెళ్లగొట్టారు కాబోలు! కానీ ఈతని ధనమును ఈతడు ఎక్కడో దాచియే ఉంటాడు.
- ఈ భిక్షకవృత్తిని అవలంబించి జనాలని మోసగించి ఆహారం సంపాదించు కుంటున్నాడు. ఇంతటి లోభిని మరెక్కడా చూచివుండం!
- ఒకప్పుడు ఈతడు ఎటువంటివాడో మీకు తెలుసా? డబ్బుమదంతో ఎవ్వరినీ లెక్కచేసేవాడు కాదు. గొప్ప బలవంతుడు. దగ్గరకు వెళ్ళితే పలికేవాడా? లేదు. మీసాలు మెలేసేవాడు! కొంగలాగా అందరినీ అణగద్రొక్కి తన పనులు తాను సాధించుకునేవాడు. కృత నిశ్చయంతో - మోసపూరిత భావాలతో అందరినీ బాధించి, వీడి హాయి వీడు చూచుకునేవాడు. తల్లితండ్రులను, భార్య బిడ్డలను కఱ్ఱలతో హింసించాడు.

ఈవిధంగా ఆతనిని అవమానించేవారు. ఎగతాళి చేసేవారు. కొందరు ఆతనిపై

అపానవాయువు వదులుతూ వుండేవారు!

మరికొందరైతే "ఈతడు ఏమాత్రం మంచివాడు కాదురా! ఈతనికి అనుభవిస్తేగాని తెలియదు..." అని పలుకుచు బంధించి చిన్న గదిలోను – వాకిట్లోను – తోటలోను – దొడ్డి స్థలాలలోను ఒకటి రెండు రోజులు పడవేసి ఉంచేవారు.

-----

**శ్రీ ఉద్ధవుడు :** కృష్ణా! ఆ విప్రుడు పొందిన బాధలను సత్యానందస్వరూపుడవగు నీవు వర్ణిస్తూ ఉంటే నాకే దుఃఖం వస్తోంది. ఇక ఆతని మానసిక స్థితి ఏమిటో? ఆతడు ఎంతో వేదన చెందేవాడు కదా!

**శ్రీకృష్ణుడు:** లేదు!

**శ్లో॥ ఏవం స భౌతికం దుఃఖం దైవికం దైహికం చ యత్**
**భోక్తవ్యం ఆత్మనోదిష్టం ప్రాప్తం ప్రాప్తమబుధ్యత ॥ (అధ్యా 23, శ్లో 40)**

ఆ సన్యాసి...,

భౌతికము (దుర్జనులచే కలిగేవి)

దైహికము ( జ్వరము మొదలైన దేహసంబంధమైనవి)

దైవికము (శీతోష్ణాదులచే కలిగేవి)

అయినట్టి కష్టములను చూచి....

- ఇవన్నీ దేవనిర్దిష్టములు! దైవ కల్పితములు!
- అనివార్యములు – అపరిహార్యములు!
- కాబట్టి అవస్యము అనుభవించవలసినవే! అవస్యమనుభోక్తవ్యం!

అనే నిశ్చయమును కలిగియుండేవాడు. (తస్మాత్ అపరిహార్యే అర్థే న త్వమ్ శోచితమ్ అర్హసి). దుర్జనులు కొందరు నేను వర్ణించినట్లుగా " ఈతనిని సన్యాసాశ్రమ స్వధర్మచ్యుతునిగా చేయాలి!" – అని ఉద్దేశ్యించి అనేక అవమానాలు చేసినప్పటికీ... ఆ సాధువు సాత్వికమైన ధైర్యమును అవలంభించాడు.

సన్యాస సంబంధమైన స్వధర్మమును అనుసరిస్తూనే ఈవిధంగా కార్య కారణ వ్యవహారమును కీర్తించసాగాడు.

# 37. భిక్షక గీతా గానము
## (The Song of interpreting the incidents of life)

**భిక్షకుడు (విప్రుడు) :** ఈ కష్టాలన్నీ నాకెందుకొచ్చినట్లు? అసలు ఏజీవుడికైనా- కష్ట సుఖాలు కలగటానికి అసలు కారణం ఏమై ఉన్నది? దీనిని ముందుగా మనం కనిపెట్టాలి!

- పూర్వజన్మ కర్మల వలననా?
- గ్రహములు వక్రించుట చేతనా?
- సహజీవులు, వారి కుబుద్ధుల వలననా?
- కాల చక్ర చమత్కారమా?
- దైవేచ్ఛయా? దైవమాయయా?
- మరింకేవన్నా కారణాలు ఉంటాయా?

ఆఁ! ఆఁ! తెలిసింది. ఇవేవీ అసలు కారణాలు కావు!

**శ్లో॥ నాయం జనో మే సుఖ-దుఃఖ హేతుః**
**న దేవత, ఆత్మా, గ్రహ, కర్మ, కాలాః,**
**మనః పరం కారణ మామనంతి**
**సంసార చక్రం పరివర్తయేత్ యత్॥** **(అధ్యా 23, శ్లో 42)**

- ఈ జనులు నా సుఖ దుఃఖాలకు హేతువులా? కాదు. వారు అందరినీ ఈ విధంగా ఏడిపించటం లేదుకదా! నన్నుమాత్రమే ఏడిపిస్తున్నారుమరి!
- దేవతలా? ఊహూ! కాదు. వాళ్ళు ఎప్పుడూ దయామయులే. నన్నెందుకు కష్టపెడతారు.
- ఆత్మయా? ... కానే కాదు! ఆత్మ నిర్వికారము - నిర్వికల్పము కదా!
- గ్రహములా? ... లేదు! లేదు! వారు జీవునికి దేహం నిర్మించి ప్రసాదించేవారు. కర్మ మార్గంలో మార్గ దర్శకులు. సర్వదా జీవులకు శ్రేయోభిలాషులు.
- కర్మలా? .... కాదు! అవి ఆత్మజ్ఞానానికి సాధనములుకదా! పైగా, జడములు!
- కాలమా? ... కాదు కాదు! అన్నీ ఇచ్చేది - పుచ్చుకునేది కాలమే! అది సదా సర్వమునకు అప్రమేయము! కాలానికి ఏ ఉద్దేశ్యాలు ఉండవు.

మరి?..ఆఁ ఆఁ! ఇప్పుడికి కనిపెట్టాను!

**నా మనస్సే అన్నిటికీ కారణం.**

మనస్సే సంసారము అనే మహాచక్రమును తన కల్పనా చమత్కారంచేత తనకు తానుగా నిర్మించుకొంటోంది. తానే అందులో ప్రవేశించి, ఆ మహా చక్రములో తానే గొప్ప పరిభ్రమణము నిర్వర్తిస్తూ సుఖ-దుఃఖాలన్నీ కల్పించుకొంటోంది. అద్దానియందు తనకు తానే బద్ధుడుగా అగుచున్నది.

ఈ సృష్టిని కల్పించుకొనేది, సృష్టిగా ఉన్నది, సృష్టిచే చంచలత్వము పొందేది, సృష్టిలో బంధనము పొందేది, సృష్టిని త్యజించి ఒనానొకప్పుడు ఆత్మతో అద్వితీయత్వము పొందేది - అంతా మనస్సే! మనస్సే బంధ - మోక్షములను కల్పనచేసుకుంటోంది.

మనస్సు కల్పనచేసుకోకపోతే వాస్తవానికి బంధము లేదు. మోక్షము లేదు. సుఖము లేదు. దుఃఖము లేదు. **గుణ - కర్మల రచయిత మనస్సే!**

సర్వబలసంపన్నమగు మనస్సే సత్వము - రజము - తమము - అనబడే త్రిగుణములకు ఒక గొప్ప రచయిత అయి - మహాకల్పనాచమత్కారి అయి ఈ దృశ్యమును సృష్టించు కుంటోంది. ఆ త్రిగుణముల నుండి విలక్షణములైనటువంటి త్రివిధ కర్మలు బయల్వెడలు చున్నాయి.

శుక్ల కర్మలు - సాత్విక (ప్రేమ-దయ-దాక్షిణ్యము-ధర్మనిరతి మొదలైనవి)

కృష్ణ కర్మలు - రాజసిక (ఏదో నిర్వర్తించాలి అనే అభినివేశము)

లోహిత కర్మలు - తామసిక (ప్రమాదో-క్రోధ-లోభ-ఆలస్య-నిద్ర ఇత్యాది)

అట్టి త్రిగుణములనుండి (వివిధములైన సత్వ రజ తమో గుణ మిశ్రమ చమత్కారంచేత) వేరువేరు అధిక - అల్ప కర్మల నిర్వహణచే వివిధ వర్ణములైన జీవులు బయల్వెడలుచున్నారు. అనగా కర్మానురూపులైనటువంటి దేవ-మానవ - తిర్యక్ జన్మాది గతులు(Sequencial paths) ఏర్పడుచున్నాయి.

ఈ జీవుడు వాస్తవానికి సర్వదా హిరణ్మయుడు. జ్ఞానానంద స్వరూపుడు. సర్వదా క్రియాశీలకమైనట్టి మనస్సుతో ఉన్నవాడు. ఆతని యొక్క కేవల జ్ఞానానంద ఆత్మస్వరూపము సర్వదా సర్వమునకు కేవలసాక్షి అయి, సర్వక్రియలకు అతీతమై (మనస్సుకు సాక్షి మాత్రమై) సర్వమును వీక్షిస్తోంది! అట్టి కేవలసాక్షి స్వరూపమగు

పరమాత్మ నుండి "నేను మనో సమన్వితుడను కదా!..." అనే తలపుగల జీవాత్మ బయల్వెడలుతోంది. ఆ జీవాత్మ సంసారద్యోతకమైన మనస్సుతో తన్మయమై, మనస్సుకు సంబంధించిన క్రియలతో కూడుకున్నదై, భోగ-రాగములను సేవిస్తూ, మనస్సును-మనో కల్పితాన్ని ఆత్మభావనతో సందర్శిస్తూ **సంసారాసక్తుడు** అగుచున్నది.

జీవాత్మయొక్క సంసారాసక్తతయే సర్వ దుఃఖములకు, గతి-దుర్గతులకు కారణం. మనస్సు శాంతిస్తే సంసారము లేదు - సంసారగతులు లేవు. సర్వము సర్వదా ఆత్మానందమే! జ్ఞానానందమే! అఖండమే! ఏ నీవు-నేను-దృశ్యము-కష్టము-సుఖము ఇత్యాది భేదత్వమంతా మనస్సు పొందుతోందో.... అదంతా అఖండాత్మయొక్క సత్‌విన్యాసము దృష్ట్యా లేనేలేదు. అద్దంలో దృశ్యము ప్రతిబింబించినంత మాత్రంచే ఆ అద్దంలో వస్తుజాలము ఉన్నట్లా? కాదు కదా! అద్దంలోని ప్రతిబింబముయొక్క కుడి-ఎడమలు, ముందు వెనుకలు బింబస్వరూపుడగు నాకు చెందవుకదా!

కనుక నేను చంచలమగు మనస్సును నిగ్రహించి... సరి అయిన మార్గంలో నియమించానా అప్పుడిక నాయొక్క సంసారాసక్తి ఉపశమించి అఖండాత్మానుభూతి, ఆత్మ సాక్షాత్కారం పరిఢవిల్లగలదు కదా! అటువంటి ఈ మనస్సును నిరోధించటానికి సమాయత్తమయ్యెదను గాక! అందుకుగాను ఇంద్రియములు - ఇంద్రియ విషయములపై యుద్ధం ప్రకటించి సర్వశక్తులను ఒడ్డి ఈ మనస్సును నిరోధిస్తాను.

----

మనస్సును నిరోధించటానికే పెద్దలు కొన్ని ఉపాయాలు, సాధనామార్గాలు చెప్పుచున్నారు.

**శ్లో॥ దానం స్వధర్మో నియమో యమశ్చ**
**శ్రుతం చ కర్మాణి చ సద్వ్రతాని**
**సర్వే మనోనిగ్రహ లక్షణాంతాః**
**పరో హి యోగో మనసః సమాధిః ॥** **(అధ్యా 23, శ్లో 45)**

దానము - ఇతరుల సంతోషం కొరకై మాటలతో, సేవలతో, సమర్పణతో, సహకారములతో - ఇటువంటి ఆయా మొదలైన విధాలుగా స్వకీయ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవటం.

స్వధర్మ నిర్వహణ– ఆశ్రమ ధర్మము – **నియమిత ధర్మములను** లోకకళ్యాణ దృష్టి, సహజీవుల క్షేమస్థైర్య అభయ విజయ దృష్టితో కౌశలంగా నిర్వర్తించటం.

యోగః కర్మశుకౌశలం

నియమము – ఇంద్రియములను భగవంతుని ఉపాసించే మార్గంలో **నియమించటం.**

యమము – అహింస, ప్రేమ–వాత్సల్యము మొదలైన అభ్యాసములచే ఇంద్రియములను **నిగ్రహించటం.**

శ్రుతము – శాస్త్రముల – మహనీయుల వచనములను నిర్వచనములను వినటం. ఆకళింపు చేసుకోవటం. విచారణ చేయటం. ఏకాంతంగా స్మరించటం. నలుగురితో కలసి **సత్సంగపూర్వకంగా** సంభాషించుకోవటం.

కర్మాణి – వ్రత – పూజ – దేవాలయసేవ ఇత్యాదులు.

మొదలైనవన్నీ మనో నిగ్రహానికి ఉపాయాలు. **మనో నిగ్రహమే పరమ యోగము.**

ఓ సజ్జనులారా! దానము ఇత్యాదులగురించి చెప్పాను కదా! అయితే... ఇక్కడ కొన్ని చమత్కారమైన విశేషాలు చెప్పుతాను, దయచేసి వినండి!

**దుఃఖాదులకు కారణం దాన–ధర్మాలు చేయలేదు కాబట్టా?**

**శ్లో॥ సమాహితం యస్య మనః ప్రశాంతం**
**దానాదిభిః కిం వద, తస్య కృత్యమ్?**
**అసంయతం యస్య మనో వినశ్యత్**
**దానాదిభిశ్చేత్ అపరం కిమేభిః? (అధ్యా 23, శ్లో 46)**

సమాహితము – వశీభూతము అయినట్టి **నిర్మల మనస్సు** కలవానికి మనం చెప్పుకున్న దానము – స్వధర్మనిర్వహణ–నియమము – యమము మొదలైనవాటివలన క్రొత్తగా వచ్చే ప్రయోజనం ఏమున్నది? ఆతనికి అంతా కృష్ణచైతన్యానందముగానే సర్వే సర్వత్రా ద్యోతమౌతోంది! ఆతని స్వభావంలో త్యాగము అంతర్లీనమై వుంటుంది!

ఇక, అసమాహితమై (Going on getting immersed in number of differences) అలసత్వమునకు (delaying and lazy)వశమై... ఏమాత్రం నియమితముగాని మనస్సు కలవానికి దానము - ధర్మము - నియమము మొదలైనవి నిర్వర్తిస్తే మాత్రం ఏంప్రయోజనం? మనస్సు "నీది-నాది", జీవాత్మ-పరమాత్మ మొదలైన భేదభావాలు వదలనంత వరకు జాడత్వము తొలగదు కదా!

## పంచేంద్రియాలవలన దుఃఖం వస్తోందా?

ఈ ఇంద్రియాలు స్వతంత్రించి ఈ జీవునికి సుఖ-దుఃఖాలు కలిగించగలవా? లేదు. వాటికా స్వతంత్రం లేదు. ఈ కళ్ళు-చెవులు.... ఇవన్నీ మనస్సు యొక్క వశంలో వుంటున్నాయి.

**శ్లో॥ మనోవశే అన్యే హి అభవన్ స్మ దేవా**
**మనశ్చ న అన్యస్య వశం సమేతి** **(అధ్యా 23, శ్లో 47)**

మనస్సు ఇంద్రియముల వశంలో లేదు. ఇంద్రియములే మనస్సుకువశమై వుంటున్నాయి.

ఆహాఁ! ఈ మనస్సు బలవంతులందరికంటే కూడా బలవత్తరమైనది కదా! ఏమని చెప్పాలి? గొప్ప గొప్ప సాధనలు చేస్తున్న యోగులంతటి వారు కూడా ఈ మనస్సుకు దాసోऽహమ్ అంటూ, వశమైపోతున్నారే! ఆశ్చర్యమే మరి!

ఎవ్వరైతే ఈ మనస్సును తమవశం చేసుకుంటారో.... వారు దేవదేవుడే అవుతారు. మనస్సు తనవశమయిందా, అంతకుమించిన స్నేహితుడు మరొకడుండడు. వశంకాలేదా... అంతకుమించిన శత్రువు మరొకరెవరూ లేరు. ఎందుకంటే,.... రాగము-మోహము-మమకారము-అపార్ధము మొదలైనవన్నీ కల్పించి,.... ఈ మనస్సు ఈ భౌతిక శరీరముపై- హృదయమర్మ స్థానముపై కూడా దండయాత్ర చేసి పెత్తనము చెలాయిస్తోందికదా!

శ్లో॥ **తం దుర్జయంశత్రుమ్ అసహ్యవేగం**
**అరుంతుదం తన్నవిజత్య కేచిత్**
**కుర్వంతి అసత్ విగ్రహమ్ అత్ర మర్త్యైః**
**మిత్రాణ్ ఉదాసీన రిపూన్ -విమూఢాః ॥** (అధ్యా 23, శ్లో 48)

దుర్జయము, సహించలేనంత వేగంతో చరించేది అయినట్టి ఈ మనస్సు అనే శత్రువు దేహము-హృదయములను ఆక్రమించుకొని-తిష్ఠవేసుకొని వుండగా, ఈ జీవుడు అది

గమనించడేం? "మనస్సును వశంచేసుకొనేది-జయించేది ఎట్లాగురాబాబూ"... అనే ఆలోచనయే చేయడాయె! చేయకపోగా, "ఇదిగో! వాళ్ళు నాశత్రువులు! వీళ్లేమో మావారు! మిత్రులు! ఇక వీరువీరున్నారు చూచారూ! వీరు పరాయివాళ్ళు! నాకు వాళ్లతో పనియే లేదు!" అని, తదితరులగురించి వ్యవహారాలు నడుపుచున్నాడు.

ఇంతకన్నా మూఢత్వం-తెలివితక్కువదనం మరొకటి వుంటుందా?

అసలీ దేహము ఏమైవున్నది? మనస్సు అనే మాయగాడు కల్పనచేసిన మాయా విశేషం అటువంటిది. ఈ భౌతికదేహాన్ని చూచుకొని, ఈ జీవుడు మురిసిపోతున్నాడు. "ఆహాఁ! నా దేహము! నా ముక్కు! నాపెదవులు! నా కనుబొమ్మలు! మిసమిసలాడే నా మీసాలు కందరాలు!"... అని అద్దంలో చూచుకొని సంతోషపడి పోతున్నాడు.

- ఈ దేహము నాది! నేను ఈ దేహమునకు చెందినవాడను - ఈ దేహమే నేను!

అని భ్రమిస్తున్నాడు. ఫలితం? అటువంటి భ్రమచేత "దురంతము-దురత్యయము-అపారము" అగు సంసార సముద్రంలో మునుగుచున్నాడు.

కాబట్టి నా దుఃఖములకు పంచేంద్రియములు కారణం కాదు. అవి వున్నప్పుడు (జీవించి వున్నప్పుడు) – లేనప్పుడు (స్వప్నసమయం – మరణానంతరము) నన్ను సుఖ దుఃఖాదులు వదలటం లేదుకదా!

సహజనులు నా దుఃఖాలకు కారణమా?

నేను ఆత్మ స్వరూపుడనని మహనీయులగు ఆత్మశాస్త్రజ్ఞులు గుర్తు చేస్తూనే వున్నారు కదా! ఆత్మ సర్వదా పరము-అప్రమేయము కూడా! మరి ఈ భౌతిక దేహమో! ఇది మనోకల్పన మాత్రమేనని అనుకున్నాం కదా! భౌతికదేహము నేను కాదు - నాది కాదు! మరి ఇక తదితర భౌతిక దేహముల వలనగాని, ఈ దేహమువలనగాని నాకు సుఖ-దుఃఖాలు ఎట్లా కలుగుతాయి.

సరేఁ! సహజనులు నాకు సుఖ దుఃఖ కారకులా? – అనే ప్రశ్నను మరొకకోణంనుంచి పరిశీలిద్దాం!

- నేను ఆత్మ స్వరూపుడను!
- తదితరులో-వారూ ఆత్మస్వరూపులే!
- ఆత్మ వేరువేరు ఖండములుగా అగుచున్నదా? లేదు! "ఆత్మ సర్వదా అఖండము"

అని కదా, వేద-వేదాంత ప్రవచన నినాదము!

- అనగా నేను-తదితరులు....అందరముకూడా ఏకము - అక్షరము అగు అఖండాత్మ స్వరూపులం! (ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ!)

ఇప్పుడు... ఈ "నాదేహం-తదితర దేహులు"... అనే విషయాన్ని గమనిస్తే...,

**శ్లో॥ జిహ్వాం క్వచిత్ సందశతి స్వదద్భిః**
**తత్ వేదనాయాం కతమాయ కుప్యేత్? (అధ్యా 23, శ్లో 50)**

నేను భోజనం చేస్తూ వున్నాననుకోండి! అలా కొంచెం పరధ్యానంలో వుండగా,.... నా పళ్ళు నా పెదిమలను గాయపరచాయి.

- అప్పుడు నాకు నా పళ్ళపై కోపం వస్తుందా?
- కోపంవచ్చి, ప్రక్కనే వున్న కంచు చెంబుని చేత్తో తీసుకొని, "ఓ నా దంతములారా! మీ సంగతి చూస్తాను!".... అని బాదుకుంటానా?

మరి సహజనులంతా నా ఆత్మయొక్క ప్రత్యక్ష రూపాలే కదా! పెదిమలను గాయపరచిన నా పళ్ళపై (దంతములపై) కోపగించనట్లే,.... ఆత్మస్వరూపులగు సహజీవులపై కోపగించటం ఎట్లా?

## నా దుఃఖాలకు కారణం దేవతలా?

"దేవతలు" అనగా ఎవ్వరు? (ద - ఇచ్చువారు). నాకు పంచేంద్రియములను (కొంతకాలము వరకు) ప్రసాదించి, వీటిని పరిపోషిస్తున్న సంకల్పశక్తి స్వరూపులు కదా! అంతేగాని, ఈ పంచేంద్రియములు నేను తయారుచేసుకోలేదే! ఇవి దేవతలు ప్రసాదించినవి కాబట్టి వారి సొత్తు!

అనగా, ఈ పంచేంద్రియముల యొక్క కర్తృత్వ-భోక్తృత్వములు ఇంద్రియాభిమానులగు దేవతలకు సంబంధించినవి మాత్రమే! ఆత్మస్వరూపుడనగు నాతో దేవతల సొత్తయినట్టి ఇంద్రియములకు గల సంబంధం ఏమున్నది? అవి నాకు సుఖ-దుఃఖాలు కలిగించ వలసిన అగత్యమేమున్నది?

ఇంద్రియాధిష్ఠాన దేవతలు = The creaters, contributers, owners,
Possessors and also Enjoyers of :
Eyes _ Eye-functions,

Ears - Ear-functions,
Skin - Skin features and functions
Nose - Nose functions
Tongue - Tongue features and functions

ఆ అధిష్ఠాన దేవతలు సర్వదేహాలలోను స్పర్శ-శబ్ద-రూప-రస-గంధ కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు. అంతేగాని నా ఒక్క దేహములోనే కాదు. అటువంటప్పుడు ఒక దేహము-ఇంకొక దేహము తాకుచున్నప్పుడు ఎవరు వారిని తప్పు పట్టుకోవాలి? ఒకే స్పర్శాధిష్ఠాన దేవతయే అన్ని దేహాలలో వేంచేసి వున్నారు కదా!

**ఆత్మయే దుఃఖ కల్పన చేసుకుంటోందా.**

ఆత్మయే మనస్సుద్వారా తనయొక్క సుఖ-దుఃఖములను కల్పించుకొనుచుండగా... ఇక ఒకని సుఖ-దుఃఖములకు మరొకరినెవరినో దూషించి, వారివి-వీరివి తప్పులు పట్టుకొని, వారిపై-వీరిపై ఆపాదించి గంటల తరబడి మాటలు చెప్పుకొని ఉండుటవలన ఏమి లాభం? వృధాయాసం!

- **ఆత్మ మనస్సును కలిగి ఉండటం అనేది** - ఆత్మయొక్క స్వభావమే అయిఉన్నది!
- మనస్సుకు **జగత్కల్పన మనోస్వభావమే!**
- జగత్తు అనగా సుఖ-దుఃఖమయముగా ఆస్వాదించబడే దృశ్య తతంగమే!

బంగారమునకు "ఇది ఆకారం" - అనేదేమీ లేనప్పటికీ, ఆకారం లేకుండా బంగారం ఉంటుందా? ఉండదుకదా!

అంతా ఆత్మస్వభావమే! ఆత్మతత్త్వమే! ఆత్మకు అన్యమైనదేదీ లేదు! (ఇదియే అద్వైత సిద్ధాంతము). ఆత్మ జగద్రూపాన్ని కలిగియే వుంటుంది!

ఒకవేళ ఆత్మకు అన్యంగా ఏదైనా అనుభూతమైతే - అదంతా మిధ్యయే! ఒకడు తాను వ్రాసుకొన్న ఒక కథను చదువుచూ, ఆ కథలోని ఒక దుఃఖ సంఘటనను చూచి తానే దుఃఖం పొంది వెక్కి వెక్కి ఏడ్వటం వంటిదే!

సుఖముగాని - దుఃఖముగాని వాస్తవానికి స్వకీయమైన భావన- నిర్ధారణ (Assuming-Deciding) లకంటే వేరుగా లేనప్పుడు ఇక ఎవరిమీద కోపం? క్రోధం ఎందుకు? క్రోధానికి ఏమి కారణమున్నది? తనకు తానే అన్నిటికీ కారణమై ఉండగా, అంతా ఏకైకాత్మయే (అఖండాత్మయే) అయి ఉన్నప్పుడు ఇక ఎవరిని ఏమని అనాలి? **దుఃఖము**

**ఎవరికి?** తస్య కో మోహః? కో శోకః?

ఇంకొక విషయం. దుఃఖము ఆత్మకా! అది అప్రమేయము-నిత్యానందముకదా! పోనీ జీవునికా! ఈతడు ప్రతిబింబమాత్రుడు కదా! "నాకు దుఃఖాదులు లేవు.కానీ దర్పణం (అద్దం)లో కనిపించే నా ప్రతిబింబానికి దుఃఖం.." అని అంటే... అదీ అర్థం లేని మాటయే కదా!

కాక, దుఃఖమనబడేది ఈ భౌతిక దేహానికా? ఇది జడముకదా! జడమాత్రమగు దర్పణమునకు సుఖమేముంటుంది? దుఃఖమేముంటుంది? జడమాత్రమగు దేహానికి కూడా సుఖము లేదు. దుఃఖము లేదు.

----

**ఆత్మయే సుఖదుఃఖ కారణమందామా?**

అంతా ఆత్మయే అయిఉండగా ఆత్మ అనన్యమై ఉండగా సుఖముగాని దుఃఖముగాని వేరుగా లేనట్లే కదా! **అనగా, అవి కూడా ఆత్మస్వరూపమేగా! కాంతి వలన మెరుస్తూ కనిపించే రత్నములను చూచి కాంతికి సుఖమేమిటి? దుఃఖమేమిటి?**

**గ్రహములు సుఖ దుఃఖ కారణములా?**

గ్రహముల ప్రభావంచేత సుఖ-దుఃఖాలు వస్తున్నాయని కాసేపు అనుకుందాం. కొందరు దైవజ్ఞులు ఆకాశములో ఉండే గ్రహములచేత దేహములో ఉండే గ్రహములు బాధింపబడు చుండటంచేత సుఖ-దుఃఖాలు ఏర్పడుచున్నాయని అంటున్నారు.

- దేహమునకు పుట్టుక - నాశనములున్నాయి.
- దేహి దేహముకంటే విలక్షణమైనవాడు. దేహికి జన్మలేదు-మరణము లేదుకదా!
- దేహియే కదా, ఆత్మ స్వరూపుడు!
- సర్వ దేహములలో గ్రహదేవతల కార్యక్రమవిధులు అంతర్లీనమై వుంటాయి.

కాబట్టి గ్రహముల ప్రభావం దేహముపై ఉంటే ఉండవచ్చుగాక! ఆ గ్రహములకు దేహము కంటే భిన్నమైనట్టి ఆత్మపై కోపం చూపించవలసిన పనేమున్నది? గ్రహబలం - తారాబలం గురించి చెప్పువారు మనో బలహీనతయొక్క ఓదార్పు కొరకో, మనస్సును ఏదో రీతిగా ఉత్సాహపరచటానికో ఉద్దేశ్యిస్తున్నారు. బుద్ధి ఆత్మబలం పుంజుకున్నదా- ఇక గ్రహ-తారాబలముల గురించిన అగత్యం ఏముంటుంది. లోక రక్షకులగు గ్రహ-దేవతలకు కొందరిపై ఆగ్రహం -మరికొందరిపై అనుగ్రహం నిష్కారణంగా ఎందుకుంటుంది?

**కర్మలు సుఖ దుఃఖ హేతువందమా?**

- జడమైన దేహమునకు స్వకీయకర్మలు లేవు.
- అజడమైన ఆత్మయో - సర్వమునకు అప్రమేయము, కర్మ వ్యవహారములకు అతీతము.

  జడము-అజడము కాని దానికి మాత్రమే కర్మలు - కర్మప్రభావములు సంభవమౌతాయి.
- ఈ జీవుడు స్వతఃగానే సర్వదా సుపర్ణుడు. అనగా శుద్ధజ్ఞాన-శుద్ధచైతన్య స్వరూపుడు. కర్మకిం ఫలం? అనికదా పెద్దల అభిప్రాయం!
- కర్మతత్ జడమే! కర్మములుకూడా దేహమువలెనే - జడరూపములే!

ఈ జీవునికి సంబంధించి జడము-అజడము కానిదంటూ ఇంక ఏదీ లేదు.

అనగా, కర్మలే లేవు! కర్మలే లేనప్పుడు "అవి సుఖ-దుఃఖాలు కలుగజేస్తున్నాయి" అని ఎట్లా అనగలరు? ఈ జీవుడు ఆత్మస్వరూపుడు కదా! జడమగు కర్మలకు చైతన్య స్వరూపమగు ఆత్మపట్ల సుఖ దుఃఖాలు కలిగించగల సామర్థ్యము ఎక్కడున్నది?

**సుఖ దుఃఖాలు కాల ప్రభావమా? అంతా కాలమహిమ అంటారు కొందరు!**

ఆత్మ కాలః కాలము. కాలమును నియమించునది. కాలముచే మార్పుచేర్పులు లేనిది. అంతేకాదు! **ఆత్మ సర్వమునకు ఆత్మయే! కాలమునకు కూడా ఆత్మయే!** కాలాత్మకమైనది కూడా! జాగృత్‌లోని కాలము జాగృత్‌కే పరిమితం. ఆత్మయో, జాగృత్-స్వప్న-సుషుప్తులకు సాక్షియగు తురీయ స్వరూపం కదా! అటువంటప్పుడు, కాలము ఆత్మను ఎట్లా క్షోభింపజేయ గలుగుతుంది?

ఎక్కడన్నా...,

అగ్నియొక్క వేడి అగ్నిని బాధిస్తోంది - అనగలమా? మంచుయొక్క చల్లదనము మంచుకు చలి కలిగిస్తోంది - అని అనవీలున్నదా? ఏ ఆత్మకు వేరైనదంటూ లేదో, సర్వజీవులకు-కాలమునకు కూడా అది ఆత్మయే అయి ఉన్నదో... అట్టి నా స్వస్వరూపాత్మను కాలము బాధించటమేమిటి? సుఖ దుఃఖాలు కాలమహిమచేత, కాలచమత్కారంచేత వస్తున్నాయి... అనునది కుదిరే వాక్యము కాదు. యుక్తికి సరిపోదు. (It is not logically acceptable)

కనుక, ఆత్మస్వరూపుడగు నాకు కాలప్రభావంగా సుఖాలు లేవు. దుఃఖాలు లేవు. నీవు-నేను అనునవన్నీ అప్రమేయమగు ఆత్మస్వరూపులము కానిదెన్నడు? ఎప్పుడు? ఎప్పుడూ లేదు.

**అహంకారము దుఃఖములను పొందుతోందా?**

ఒక రచయిత ఒక నవల వ్రాశాడు. ఆ నవలలో ఒక పాత్ర ఉన్నది. ఆ పాత్ర ఎటువంటిదో సంసారము అనే నాటకములో అహంకారము అనునది అటువంటిది.

నవలలోని పాత్రకు వచ్చే కష్ట-సుఖాలకు ఆ నవలా రచయితకు సంబంధమేమున్నది? "ఆ కష్ట సుఖాలు నవలా రచయితవే!" అని ఎవ్వరైనా అంటారా? "కాదండీ! కల్పనామయ మగు నవలలోని ఆ పాత్రవండీ! అని మాత్రం అనగలరా? అదీ కుదరదు కదా!

అహంకారము ప్రకృతిలోనిది. ఆత్మ ప్రకృతికి అతీతమైనది. **ఆత్మకు అహంకారముతో ఏక్షణంలోనూ సంబంధమే లేదు**-నాటక రచయితకు, నాటకంలోని పాత్రయొక్క గుణ-గణములకు సంబంధమే లేనితీరుగా!

ఈ విషయం గమనించి గ్రహించిన మానవుడికి భూత ప్రకృతికి ఇక భయమొందదు. భూత ప్రకృతి నుండి మోక్షము పొందినవాడే అవుతాడు.

అందుచేత ప్రాచీనులగు మహర్షులు ఏ ఆత్మ తత్త్వమును సేవించారో... అటువంటి ఆత్మజ్ఞానమును ఆశ్రయిస్తాను. (శృణ్వంతి విశ్వే అమృతస్య పుత్రః - అని) ఏమి చెప్పుకుంటూ వచ్చారో అట్టి పరమాత్మయే-పరతత్త్వమే నా ధ్యేయం.

**ఎందుకంటే అదియే నా స్వస్వరూపం!** అట్టి స్వస్వరూపాస్వాదనకు సర్వాంతర్యామి - మాయాతీతుడు - కేవలసాక్షి - సర్వతత్త్వ స్వరూపుడు అగు శ్రీకృష్ణ పరమాత్మ యొక్క పాదపద్మాలను (అ ఋషులవలెనే) ఆశ్రయిస్తాను. ఇక కష్ట-సుఖముల గురించి, సుఖ-దుఃఖముల గురించి, పట్టించుకోను. మాట్లాడను. ఊసైనా ఎత్తను. అస్సలు వాటిని గుర్తించను. గమనించను. లెఖచేయను. ఎవ్వరికీ ఆపాదించను. పరుగెత్తే కుందేటి రెండు కొమ్ములులాగా కష్ట-సుఖములు వాస్తవానికి మొదలే లేవు!

**ఒకవేళ వుంటే, అవి మనో కల్పితాలు మాత్రమే!**

మొదలే లేవు అని గమనించవలసిన కష్టసుఖాలను "నాకున్నాయో"? అని తలచి-తెచ్చి పెట్టుకొను దుస్తరమగు సంసారగతి నుండి నన్ను నేను తరింపజేసుకుంటాను గాక!

---

**శ్రీకృష్ణభగవానుడు :** వింటున్నావా మిత్రమా! ఉద్ధవా! సర్వ భౌతికసంపదలను పోగొట్టుకున్నవాడగు ఆ భిక్షువు సర్వభేదభావాలను క్రమంగా త్యజించసాగాడు. సన్యాసి

అయి ఈ భూమిపై చరించాడు. కొందరు దుర్జనులు బాధలు కలుగజేసినప్పటికీ ఆతడు స్వధర్మము - సన్యాసి ధర్మము నుండి ఏమాత్రం చ్యుతి పొందుటయే లేదు!

ఇతఃపూర్వమే మహర్షులచే ప్రతిపాదించబడిన ఆత్మ తత్త్వమును కీర్తిస్తున్నాడు. ఆశ్రయిస్తున్నాడు.

కనుక..., సఖుడా!

**శ్లో॥ సుఖ దుఃఖప్రదో నాఽన్యః పురుషస్య ఆత్మ విభ్రమః**
**మిత్రో- ఉదాశీన రిపవః సంసారస్తమసః కృతః ॥** **(అధ్యా 23, శ్లో 59)**

దుఃఖదాతా న కోఽప్యస్తి! సుఖదాతా నకశ్చన! ఈ జీవునికి సుఖము ఇచ్చేవారెవ్వరు లేరు? దుఃఖ ప్రదాతలు లేరు.

ఆత్మ తత్త్వమును ఏమరచటంచేత సుఖదుఃఖాలు కల్పితంగా (As an illusion) మనస్సుకు అనుభవమగుచున్నాయి. " ఇది కష్టము-ఇది సుఖము, ఇతడు మిత్రుడు. ఆతడు సేవకుడు - ఈతడు శత్రువు" మొదలుగాగల సంసారమంతా కేవలము అజ్ఞాన కల్పితము మాత్రమే! అట్టి సంసారరోగమునకు ఉపశమనోపాయము ఏమిటో చెప్పుచున్నాను విను.

- నాయందు నీ బుద్ధిని పరిపూర్ణంగా నియమించు! "నాటకంలో పాత్రగా నటిస్తున్నప్పుడు, ఆ పాత్రయొక్క కష్ట-సుఖాలు ఆ నటుడివి అవుతాయా?" అనురీతిగా గమనించు!
- పరిపరివిధములైన భావావేశములను ఆశ్రయిస్తున్న నీ మనస్సును నిగ్రహించు.

**ఇదియే భిక్షు గీతాసారము!**

---

**శ్లో॥ గీయ ఏతాం భిక్షుణా తాం, బ్రహ్మనిష్ఠాం సమాహితః ।**
**ధారయన్ శ్రావయన్ శృణ్వన్ ద్వంద్వైర్నైవాభిభూయతే ॥ (అధ్యా 23, శ్లో 61)**

ఆ భిక్షునిచే గానము చేయబడిన బ్రహ్మజ్ఞాన తత్త్వమును ప్రశాంత-సమాహిత చిత్తముతో ఎవ్వరైతే పఠిస్తారో, ధారణ చేస్తారో, వినిపిస్తారో, వింటారో.., వ్యాఖ్యానిస్తారో...

వారు సుఖ దుఃఖాలకు వశులు కారు! ద్వంద్వాతీతులై ఏకస్థమగు ఆతమతత్త్వమును సంపాదించుకునే బుద్ధిని ప్రవృద్ధపరచుకోగలరు.

# 38. సాంఖ్యతత్త్వోపదేశము

**శ్రీకృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! ప్రాచీనులగు మహర్షులు ఆత్మతత్త్వమును అన్వేషించి, కృతనిశ్చయించి **సాంఖ్యయోగమును** వివేచనచేయు వారికొరకై ప్రసాదించటం జరిగింది. అట్టి సాంఖ్యయోగము శ్రద్ధగావింటే అట్టి శ్రోత భేదమూలకములగు సుఖ దుఃఖములు మొదలైనవాటిని త్యజించివేస్తాడు. ఈ దృశ్యజగత్తును పీడగా కాకుండా క్రీడగా, బాలా లీలా వినోదంగా చూడగలుగుతాడు.

ఒక్క విషయము. కృతయుగములోగాని, మరొక యుగంలోగాని, ప్రళయంలోగాని... ఏ కాలమందైనాసరే... వివేకులైనట్టి పురుషులు ఉంటారు.

**అట్టి వివేకవంతులకు సర్వకాల-సర్వావస్థలయందును సర్వత్రా అఖండమగు బ్రహ్మమే ద్యోతకమై అనుభవైకవేద్యమై ఉంటోంది.**

---

స్వతఃసిద్ధమైనట్టి అఖండ పరబ్రహ్మమగు నేను మాత్రమే ఉన్నాను. (అనగా) మొట్టమొదటగా ఏకము-అనునిత్యానుభవసిద్ధము అగు బ్రహ్మమొక్కటే ఉన్నది. అట్టి మనో వాక్కాయములకు అగోచరము, వికల్పరహితము (నిర్వికల్పము), భేదరహితము, ఏకము, సత్యము (Beyond thought and not expressible by throught . The Thinker prior to thought. The Talker before talking, The one before and beyond visualazation, before and beyond the perspective of differences. The Unity prior to and during Diversity. Ever as it is existant) అగు పరబ్రహ్మమే నేను! నాయొక్క మాయా విలాసంచే (through my own playful sense of illusion) నాకు నేనే రెండు - (2) గా అగుచున్నాను.

అనగా... ఆత్మ 1. పరమాత్మ 2. జీవాత్మ Self and self related గా! (లేక)
1. ఆత్మ 2. ప్రకృతిగా!

ప్రకృతి నాయొక్క అంశయే! ఆత్మాంశయే! అట్టి నా ప్రకృతి రెండు విధములుగా ఉంటోంది.

1. కారణము (Cause) 2. కార్యము (Effect).

ప్రకృతి యొక్క ఒకానొక అంతర్లీనమైన అంశ ఎరుగుట - జ్ఞానము (Knowledge).

అట్టి ప్రకృతియొక్క జ్ఞానాంశ స్వరూపమే ఈ జీవుడు లేక పురుషుడు అని కూడా గమనించు! నా అంశయే ఈ జీవుడు!

పురుషోత్తముడను - పరమేశ్వరుడను అగు నేను నా భావనాసదృశమగు ప్రకృతిని కించిత్ క్షోభింపజేయటం చేత త్రిగుణముల అభివ్యక్తమునకు కారణకారణుడనగుచున్నాను.

1. సత్త్వగుణము 2. రజో గుణము 3. తమో గుణము.

పై గుణత్రయము నుండి - క్రియా శక్తి సంపన్నమగు సూత్రము (Activity) ప్రదర్శనమౌతోంది.

క్రియా వ్యవహారమెనట్టి సూత్రము నుండి - జ్ఞానశక్తి ప్రధానమగు మహత్తత్వము (The feature of ability) ప్రదర్శితమౌతోంది.

అనంతమగు మహత్తత్త్వము (Agility and ability) నుండి - సర్వజీవులను - మోహింపజేసే అహంకారము (నేను-నేను-నాది-నాది) బయల్వెడలుతోంది.

అహంకారము

| వైకారికము | తైజసము | తామసము |
|---|---|---|
| (జాగృత్) | (స్వప్నము) | (గాఢనిద్ర) |

అహంకారము

| చిన్మయము (చైతన్యము) | అచిన్మయము (జడము) |
|---|---|
| Active | Passive |

అహంకారము

| శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములనబడే తన్మాత్రలకు! | చెవులు-చర్మము కనులు-నోరు-ముక్కు అనే పంచేంద్రియములకు | మనస్సుకు |
|---|---|---|

వీటన్నిటికీ అహంకారమే కారణముగా అగుచున్నది!

ఓ ఉద్ధవా! ఈ జగత్తంతా కూడా కాలాత్మకుడను-పరమేశ్వరుడను అగు నాచే కర్మయుక్తమై ఉంటోంది. అది అట్లా ఉండగా...,

నా అంశయే అయినట్టి ఈ జీవుడు సత్వము-రజము-తమము అనే త్రిగుణములనబడే జలముతో నిండిన సంసార సాగరములో ఒకసారి మునుగుచున్నాడు. మరొకసారి లేచుచున్నాడు. మరల మునుగుచున్నాడు.

ఈ జగత్తులో కనిపించే-అనుభవమయ్యే చిన్న-పెద్ద-స్థూల-సూక్ష్మములగు పదార్థాలన్నీ కూడా ప్రకృతి-పురుషుడు... ఈ రెండింటినుంచీ బయల్వెడలినవే సుమా!

ఇక్కడ ఒకసూత్ర వాక్యం (సిద్ధాంత వాక్యం) చెప్పుచున్నాను. విను.

**శ్లో॥ యస్తు యస్య ఆదిః - అంతశ్చ**
**స వై మధ్యం చ తస్యసన్**
**వికారో వ్యవహారార్థో**
**యథా తైజస, పార్థివాః ॥** **(అధ్యా 24, శ్లో 17)**

ఒకానొకటి మొట్టమొదలు - చిట్టచివర ఏది అయి ఉన్నదో... మధ్యలో కూడా అదే అయి ఉన్నది. మధ్యలో మరొకటేదోగా చూడబడుచున్నా (లేక) అనుభూతమౌతూ ఉంటే ... అప్పుడు అదంతా మనోవికారం (లేక) దృష్టియొక్క భేదముచే అనిపించేది మాత్రమే! వ్యవహారం కొరకు సంభాషణకొరకు చెప్పుకునే మాటలు మాత్రమే! లేక కల్పనయే! భావావేశానుభూతియే!

ఉదాహరణకు

- స్వప్నంలో కనిపించేదంతా స్వప్న చైతన్యమే కదా! స్వప్నంలో కనిపించిన జంతువు-మనిషి వేరువేరైనవవుతాయా? లేదు. అంతా స్వప్నచైతన్యముయొక్క చిత్కళా సంప్రదర్శనమే! (లేక) ఊహా చమత్కారమే!
- మట్టికుండ... మట్టిలోంచివచ్చి మరల మట్టిలోనే కలిసిపోతోంది. మరి మట్టినుండి కుండగా కనబడేది మట్టికి వేరైనదా! మట్టికుండ అనే మాట వికారో - నామధేయము- వ్యవహారార్థం కల్పించబడినదే కదా! కుండగా వున్నప్పుడు కూడా అది మట్టియే!
- బంగారు ఆభరణములో బంగారముకంటే ఆభరణము వేరా? కాదు. కనుక

బంగారు ఆభరణము అనుమాట వికారమాత్రం - వ్యవహారార్థ కల్పితం. "ఇది బంగారమండీ! ఇదేమో ఆభరణము" - అని ఎవ్వరైనా విడదీసి చూపగలరా! ఆభరణముగా కనిపించేది బంగారము కానిదెన్నడూ లేదు!

- జలతరంగము అనే దానిలో జలము వేరు తరంగము వేరు - అవుతాయా? కాదు. కనుక జలతరంగము అనేమాట వ్యవహారార్థం చెప్పబడేదే కాని, తరంగం అనేది జలమునకు వేరుగా లేదు. తరంగము జలంలో ఉదయిస్తోంది. జలములోనే ఉంటోంది. జలంతోనే లయిస్తోంది. తరంగము జలము కానిదెప్పుడు? కాబట్టి

తరంగము జలమునకు అభిన్నము. బంగారు లోహము నుండి ఆభరణరూపంగా తయారు చేబడిన ఆభరణము బంగారమునకు అభిన్నము. మట్టితో తయారు చేయబడిన మట్టి ఏనుగు-మట్టి రాజు - మట్టి మంత్రి - మట్టి శత్రు సైనికులు - ఇవన్నీకూడా మట్టికి అభిన్నము.

అట్లాగే...,

- పరమాత్మ అనే సాగరజలములో పుట్టి - లయించు జీవాత్మ తరంగము పరమాత్మకు అభిన్నము.
- పరమాత్మ అనే మృత్తిక (మట్టి)తో తయారైన జీవాత్మాహంకారము పరమాత్మయందే జనించి పరమాత్మయందే లయిస్తోంది. కాబట్టి అహంకారము (జీవాహంకారము-వ్యష్ఠి అహంకారము-దేహాహంకారము-ఈశ్వరాహంకారము మొదలైనవన్నీ) పరమాత్మకు అభిన్నము.
- పరమాత్మ అనే బంగాముతో తయారైన మహత్తత్త్వము - మనో బుద్ధి చిత్త అహంకారాలు-త్రిగుణములు ఇవన్నీ కూడా పరమాత్మ అనే మూల పదార్థానికి అనన్యము. వేరు కాదు. అవన్నీ వేరువేరు బంగారు ఆభరణముల వంటివి.

అనగా...,

పరమాత్మ అనే నిమిత్త కారణము (లేక) మూలకారణము నుండి బయల్వెడలిన

- జీవాత్మ
- వ్యష్ఠి అహంకారము
- ప్రకృతి

- దేహ-మనో-బుద్ధి-చిత్త అహంకారాలు
- మహత్తత్త్వము (The 'Ahamkara' that is present in all 3 states Jagruth, Swapna & Sushaptha)
- జగదనుభవాహంకారము మొదలైన

ఇవన్నీ - పరమాత్మనుండి బయల్వెడలుచు, పరమాత్మలోనే లయం అవబోతూ, వర్తమానంలో కూడా పరమాత్మతత్త్వమునకు అభిన్నమై చెన్నొందుచున్నాయి. ఆయా నామధేయాలన్నీ ఆయా సందర్భాల గురించి సంభాషించుకోవటానికి చెప్పబడుచున్న వ్యవహార కల్పిత సత్యములే కాని సహజసత్యములు కాదు. మూల సత్యము కాదు. వికారో నామధేయాలు. మట్టికుండ-మట్టి మూకుడు-మట్టి పిడత... ఇవన్నీ ఒకే మట్టికి కల్పించబడటం- ఆపాదించబడటం వంటిది. మనో-బుద్ధి-చిత్త-అహంకారాల విషయం కూడా అటువంటిదే! అవన్నీ ఆత్మకు అభిన్నములు!

ఈవిధంగా....

- బ్రహ్మ సత్యమ్ జగన్మిధ్య
- జోవో బ్రహ్మేతి నాపరః
- అద్వితీయం బ్రహ్మ
- అహమ్ బ్రహ్మాఽస్మి

ఇత్యాది మహా వాక్యార్థాలు "**సర్వము ఆత్మకు అభిన్నము - ఈ జీవుడు ఆత్మ స్వరూపుడే..**"అనియే సిద్ధిస్తున్నాయి. అనగా ఋషిప్రవచిత వేద-వేదాంత మహా వాక్యార్థాలు ఈవిధంగా నిరూపితమౌతున్నాయి.

**జగత్తు** అనే కార్యము (work) నకు ఉపాదాన కారణము (Worker) **ప్రకృతి**.

**ప్రకృతి** అనే కార్యమునకు ఉపదానకారణము (లేక) అధిష్ఠానము **పురుషుడు** (Individual Self)

**పురుషుడు (లేక జీవుడు)** అను కార్యము(Work)నకు ఉపాదాన కారణము (Worker) త్రిగుణముల క్షోభను అభివ్యక్తం చేసే **కాలము.**

**పురుషుడు - గుణములు - కాలము** అను మూడిటికి ఉపాదాన కారణము పరమాత్మ-పరబ్రహ్మము అని వేదోపనిషత్తులచే చెప్పబడే నేనే!

నాకంటే భిన్నమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు. నీవుగా కనిపించేది నేనే-త్వమేవాహమ్! బంగారపు గొలుసు-గాజులు-ఉంగరము-వడ్డాణము-ఉగ్గుగిన్నె-ముక్కుపుడక మొదలైనవన్నీ బంగారముకంటే వేరా? అవన్నీ ఆకార భేదంచేత సందర్భోచితంగా సంభాషణయొక్క వసతి కొరకు కల్పించబడి చెప్పే పేర్లే కదా! నాకంటే జీవాత్మ - మహత్తత్త్వము - గుణములు - జీవాత్మలు - అనుభూతులు - దేహములు - దేహపరంపరలు - దృశ్యపరంపరలు వేరుకాదు. అన్నిటికీ మూలకారణము - నిమిత్త కారణము నేనే! మిలిగినవన్నీ వికారోనామధేయాలు. సందర్భానుచితంగా కల్పించబడిన పేర్లు. ఉపాదాన కారణాలు. భేదదృష్టిగల శిష్యునికి పరతత్త్వము- బ్రహ్మతత్త్వము అగు నా గురించి విడమర్చి చెప్పటానికి తత్త్వవేత్తలచే కల్పించబడిన నామ-రూప వర్ణనా చమత్కారాలు. సందర్శనా చమత్కారాలు. పరమాత్మయొక్క యీక్షణా విశేషణా చమత్కారాలు Perceptual creations). లీలా కల్పితాలు(created for a play). స్వప్నాంతర్గతవస్తు భేదాలు!

ఈ కనబడేదంతా కూడా.... నాయొక్క లీలా వినోదవమే! ఇంకా చెప్పాలంటే అద్వితీయుడనగు నేనే! అఖండమగు నేనే జీవాత్మదృష్టిచే "**అనేకము**" గాను పరమాత్మ దృష్టిచే "**ఏకము**" గాను అనుభాతమగుచున్నాను.

అట్టి జగత్తు - కల్పన - సృష్టి అనే లీలా వినోదము - యీక్షణా విన్యాసము కొనసాగేంతవరకు సృష్టి-స్థితి-లయాలు, త్రిగుణాత్మక భావనానుభూతులు, వివిధ స్వభావాలతో కూడిన జీవాత్మ పరంపరలు, ఆ జీవుల ఉపభోగములైన పిత్రు-పుత్రాది రూప వ్యవస్థలు, సృష్టి చక్ర పరిభ్రమణములు - ఇవన్నీ నిరంతరము ప్రవర్తిస్తూనే ఉంటాయి. కొనసాగుతూనే ఉంటాయి. కాలాత్మకుడనగు నాచేతనే సృష్టి-స్థితి-ప్రళయములకు ఆధార స్వరూపమైన బ్రహ్మాండముల కల్పన-ఉనికి-వినాశనము నాయందు ఒకానొక **విభాగంగా** నా **విభవంగా** ప్రదర్శితమౌతూ ఉంటాయి.

నేను యథాతథస్వరూపుడనై స్వప్న సదృశంగా ఇదంతా కల్పించుకొని వినోదంగా సృష్టించుకొంటున్నాను. పరిపోషిస్తున్నాను. లయింపజేస్తున్నాను. ఆస్వాదిస్తున్నాను. సృష్టి-స్థితి-లయాలు అప్రమేయుడనగు నాస్వకీయ కల్పనలే!

ఈ ఇంద్రియములకు కనిపిస్తున్న దృశ్యజగత్తులు, బ్రహ్మాండ ప్రదర్శనములు... ఇవన్నీ ఏమి కానున్నాయి? ఎటునుండి ఎటు వెళ్ళుచున్నాయి? - అని ప్రశ్నిస్తే...

- ఈ దేహాలన్నీ అన్నమునుండి బయల్వెడలుచున్నాయి కదా!
- ప్రళయకాలంలో ఈ కనబడే భౌతిక దేహాలన్నీ అన్నమునందు, అన్నము ధాన్యము (బీజముల)యందు, ధాన్యము (బీజతత్త్వము) భూతత్త్వమునందు, భూతత్త్వము గంధతత్త్వము నందు...,
- గంధ తత్త్వము జలమునందు,
- జలము తన "గుణము" అగు రసమునందు,
- రసము తేజస్సులోను,
- తేజస్సు రూపములోను,
- రూపము వాయువునందు,
- వాయువు స్పర్శ తన్మాత్రయందు,
- స్పర్శ ఆకాశమునందు,
- ఆకాశము శబ్ద తన్మాత్రయందు విలీనమగుచున్నాయి.

ఇంద్రియములు తమ మూల (ఉపాదాన) తత్త్వములగు దేవతలయందు లీనమగు చున్నాయి.

- దేవతలు తన్నియామకమగు మనస్సులోను, మనస్సు - శబ్ద తత్త్వము పంచభూతములకు కారణమగు అహంకారమునందు,
- ఆ అహంకారము సర్వజగత్తును మోహింపజేస్తున్న త్రివిధాహంకార రూపమగు (జాగ్రత్ - స్వప్న - సుషుప్తిలలో కనిపించే 3 రకముల అహంకారముల రూపమగు) మహత్-తత్త్వమునందు లీనమగుచున్నది.

జ్ఞానక్రియాశక్తి ప్రధాన రూపమగు మహత్తత్త్వము తనకు కారణభూతమైనట్టి గుణములలో...,

ఆ గుణములు - అవ్యక్త ప్రకృతి (తాను వ్యక్తము కాకుండా... సర్వము వ్యక్తీరించే ప్రకృతి) యందు,

ఆ అవ్యక్త ప్రకృతి - తనకు మూలము - ప్రేరకము - నాశన రహితము అగు కాలమునందు లీనమగుచున్నాయి.

ఒకవేళ కొద్దిసేపు జగత్తు (లేక) దృశ్యము (లేక) బ్రహ్మాండము (లేక) అనేకత్వము అగు మాయాకల్పిత విశేషాలు ప్రదర్శితమైనా కూడా "**ఇదంతా నాదేకదా! నేనే కదా! అఖండము అప్రమేయము - నిత్య సత్యము అగు నాకల్పనయే కదా!**" అను అహం బ్రహ్మాస్మి భావన వీడకుండానే నాచే ఇదంతా ప్రదర్శించబడుచు సర్వదా వినోదముగా అగుచున్నది! అజ్ఞానము కూడా నాయొక్క చిత్కళయే! "**మనో బుద్ధి చిత్తాహంకారాలు నాకు ఆభరణములై అప్రమేయుడనగు నేను వాటిని ధరించి వినోదిస్తున్నాను...! జగత్తు నా ఆభరణమే!**" అని నీవు గ్రహించిన తరువాత... ఇక జగత్తు నీకు బంధమవటం ఎక్కడున్నది.

ఓ ఉద్ధవా! సర్వకార్యకారణ తత్త్వవేత్తను - తత్త్వమును అగు నేను ఈ కనబడే జగద్రూప ధారణచే వినోదిస్తున్నాను! ఇదే నా సాంఖ్యయోగం! సృష్టి-స్థితి-ప్రళయ నిర్వచనములతో కూడిన, సర్వసంశములను ఛేదించునట్టి **సాంఖ్య విధి!**

విన్నావు కదా! యోచనతో - బుద్ధితో నీ స్వస్వరూపము ఎట్టిదో........ గ్రహించి **బ్రహ్మాండ దర్శనములను అప్రమేయుడవై ప్రకాశించెదవుగాక! మత్ స్థానమును సముపార్జించుకునెదవు గాక!**

## 39. త్రిగుణ వృత్తులు - గుణాతీతత్త్వం

**శ్రీ ఉద్ధవుడు :** హే పరబ్రహ్మమూర్తీ! చిదానంద స్వరూపా! శ్రీకృష్ణా! సాంఖ్యయోగ సారమును పూసగ్రుచ్చినట్లు చెప్పారు. అప్రమేయమగు నాయొక్క పరతత్త్వాన్ని ఆస్వాదించే మార్గం చూపారు. ఈ సందర్భంలో... కనబడేదంతా త్రిగుణములు - గుణియొక్క సంయోగమేనని కూడా మీ మాటలలో అభివ్యక్తం అవుతూ వస్తోంది! ఇప్పుడు - అసంమిశ్రమము (Non-mixed) అనగా విభక్తిగా (వేరువేరుగా) ఉన్న ఒక్కొక్క గుణముచేత ఈ పురుషుడు (జీవుడు) ఏ ఏ రూపంగా ఉంటూ ఉంటాడో వివరించ ప్రార్థన.

**శ్రీకృష్ణ భగవానుడు :** విభక్తమగు (Non combined) త్రిగుణములలోని ఏఏ గుణముచే ఈ జీవుడు ఏఏ రీతిగా ఉంటాడో... ఆతని వృత్తులు (Avocations, Behaviour) ఏఏ విధంగా ప్రదర్శితం అవుతాయో... అద్దానిని నీవు అడిగినట్లు చెప్పుచున్నాను. విను!

---

**విభక్తంగా** (Sperately each of the thru qualities)

## 1. సత్త్వగుణవృత్తుల లక్షణాలు

**శ్లో॥ శమో దమస్తితిక్షేక్షా తపస్సత్యం దయా స్మృతిః**
**తుష్టిస్త్యాగో ఽస్పృహా శ్రద్ధా హీర్దయాదిస్స్వనిర్వృతిః ॥ (అధ్యా 25, శ్లో 2)**

శమము – మనో నిగ్రహము (Control over Thought)

దమము – ఇంద్రియ నిగ్రహము (Control over Physical Functions)

తితిక్ష – ఓర్పు. (Forbearence)

ఈక్ష – వివేకపూరితమైన దృష్టి. (Right Perception)

తపస్సు – పరమాత్మతత్త్వము గురించి తపనయే తపస్సు. (Fondness towards Divinity)

సత్యము – యమ్ సత్ – సర్వవస్తువును అసత్‌నుండి వేరుగా దర్శించటం (Pondering over Truth)

దయ – నేనెట్లా సహకరించగలను? అనే యోచన. (Kind hearted)

స్మృతి – విన్నది – కన్నది విశ్లేషణకై జ్ఞాపకముంచుకోవటం! (Evaluating Events)

తుష్టి–సంతోషము – లభించినదానికి తృప్తితో కూడిన భావన. (Wel-sastisfied with possessions)

త్యాగము – సమర్పణ – పరోపకారము–సేవాభావము. (Sacrifice)

అస్పృహా – ప్రాపంచక విశేషాలు – సందర్భములపట్ల వైరాగ్యము – అతీత్వము–అప్రమేయత్వము. (To be beyond)

శ్రద్ధ – పరమాత్మ – ఆధ్యాత్మశాస్త్ర–వేదాంత విషయములపట్ల, శాస్త్ర ప్రవచనములపట్ల దైనందికమైన కార్యక్రమములను ఆశ్రయించటం. ఆసక్తిని పరిరక్షించుకోవటం. (Attention)

లజ్జ – మహనీయుల మహదత్వము – గురువుల జ్ఞానైశ్వర్యముపట్ల అణకువ, తనలోని అల్పగుణములను గుర్తించి నివర్తించుకొనే ప్రయత్నము చేయటం. (Shy of own mistakes)

దయ - ఇతరులపట్ల దాక్షిణ్యము. (Helpful)

ఆత్మరతి - ఆత్మయందు రమిస్తూ జగత్‌రతిని త్యజిస్తూ ఉండటం. జగత్తును పరమాత్మ స్వరూపంగా భావనచేసే అభ్యాసమును ఆశ్రయించటం. (Enjoying everything as one's own self)

## 2. రజోగుణ వృత్తుల లక్షణాలు

**శ్లో॥ కామ ఈహా మదస్తృష్ణా స్తంభ ఆశీర్భిదా సుఖమ్**

**మదోత్సాహో యశఃప్రీతిర్హాస్యం వీర్యం బలోద్యమః ॥ (అధ్యా 25, శ్లో 3)**

కామము - ఏదో కావాలని – పొందాలని, అప్పటికిగాని సుఖం లభించదనే తీవ్ర తపన. (I have yet to get something to be happy)

ఈహాప్రయత్నము - ప్రాపంచకమైన ఆశయములతో ఏవేవో ప్రయత్నములతో, సంరంభములతో, కార్యక్రమములతో నిమగ్నమై ఉండటం. (Involving in worldly aims)

మదము - "ఇది నాసొంతము" అనే భావనతో అభినివేశము. గర్వము. (Proud)

తృష్ణ - ఆవేశముతో కూడిన దురాశ. (Craving)

దంభము - గర్వము. ప్రదర్శనావేశము. (Exhibitive)

ఆశ - ఎప్పుడూ ఏదో ఒకటి ఆశించటం. లభించకపోతే నిరాశ. (Cragily Expecting)

అర్భదా - భేదబుద్ధి (Looking at Differences)

సుఖము - సుఖములకై ఆశయ శక్తిని వ్యర్థం చేయుట. (Self-Comfort)

మదోత్సాహో - మదగర్వముతో కూడిన ఉత్సాహము. పోట్లాడటం–తగాదాలపట్ల అభినివేశము, అభిరుచి. ఎవరినైనా అవమానించేటప్పుడు, బాధించేటప్పుడు మరింతగా ఉత్సాహపడటం. (Fault-Finding / Belithling others)

యశః - యశః కాముకత్వం. "ఇతరులు మనలను గురించి గొప్పగా చెప్పుకోవాలి సుమా!" అను రూపమైన అనునిత్య ప్రయత్నం.

(For popularity)

ప్రీతి - కొన్ని కొన్ని దృశ్య వస్తు విషయ రూపములపట్ల ప్రీతిగొని ఉండటం. (Attchment)

అపహాస్యం - ఇతరులను అపహాస్యం చేయటానికి వెనుకాడకపోవటం. ఇతరుల లోపములను వెతికి-వెతికి సంభాషించుకోవటం. (Heckling)

వీర్యం - ప్రతాపము చూపాలనే ఉబలాటం. (Dominating)

బలోద్యమం - హఠపూర్వకమైన ప్రయత్నములందు నిమగ్నం కావటం. (Emotionally Efforting)

ఇవన్నీ రజోగుణ ప్రవృత్తుల ప్రవృద్ధమును సూచిస్తాయి.

## 3. తమో గుణ వృత్తుల లక్షణాలు

**శ్లో॥ క్రోధో లోభో అనృతం హింసా యాచ్నా దంభః క్లమః కలిః**
**శోక మోహా విషాద ఆర్తీ నిద్రాశా భీః అనుద్యమః ॥ (అధ్యా 25, శ్లో 4)**

క్రోధము - ఇతరుల తప్పులను తీవ్రమైన ఆవేశంతో ఎంచటం, దూషించటం. (Anger / Revngeful)

లోభము - "నాది-నాదే-నాకు సంబంధించినదే" అనే మమకారము. "ఎవ్వడైనా అడుగుతాడమో మరి?" అని దాచుకోవటం. (Miserly)

అసత్యభాషణ - సత్-అసత్, శాశ్వత-అశాశ్వత విషయమును విశ్లేషించకుండా అసత్‌ను సత్‌వలె భావిస్తూ సంభాషించటం. లేనిది ఉన్నట్లు భావించి నమ్మి మాట్లాడటం. మానావమానములు - మమకారములు అహంకారాలు ఉంటే తప్పేమున్నది? అని నమ్మటం. (Misconception)

హింస - ఇతరులను మాటలచేతగాని, చేతలచేతగాని బాధించటానికి సంసిద్ధం కావటం. ఇతరులకు దుఃఖము కలిగించటానికి

వెనుకాడకపోవటం. (Violent / Unhezitatingly hurting)

యాచన – ఇతరులనుండి ఏదో – ఏదేదో – ఏదో ఒకటి కోరుకోవటం. "ఇతరులు నాకోసం శ్రమించాలి, మీరు ఎందుకు చేయరు? ఎవరికోసం చేస్తారేం?..." అనే వృత్తి.

(Begging / Demanding)

దంభము – తనది దాచుకొని – చూచుకొని గర్వించటం. మురిసిపోవటం. రాయివలె ఇతరుల కష్టాలు పట్టించుకోకపోవటం.

(Posing / unresponsive to other's trouble)

క్లమః/శ్రమ – అలిసిపోయినట్లు ఎంతో కష్టపడుచున్నట్లు, ఇతరులు హాయిగా ఉన్నారు! ఊసురో!... ఇత్యాదిభావాలు ముఖంలో ప్రతిబింబించటం. (Self-Sympathy / Dull)

కలిః – కలహము (Quarelling)

శోకము – దుఃఖించటం. "నా బాధలు నావి. ఎవ్వరేమి చేయలేరు! గతి ఇంతే" అని తీవ్రంగా అనుక్షణికంగా బాధపడుచూ ఉండటం.

(Lamenting)

మోహము – సత్యము పరిశీలించే దృష్టిని ఆశ్రయించక, లేనిది ఉన్నట్లు భావించటం. ఉన్నది గుర్తించలేకపోవటం. (Illusion)

విషాదము – దిగులు. (Meloncholy / Gloomy)

ఆర్తి – దైన్యము – బాధ – ఆవేదనలు. (Hungry of something)

నిద్ర – సోమరితనము. బద్ధకము. ఎక్కువ సమయం నిద్రపోవాలనే అభిలాష. (Sleepy / Drowsy )

ఆశ – ఏవేవో ఆశలు వృద్ధి చేసుకోవటం. నిరాశపడటం. దురాశ! పేరాశ! (Deep Expectation)

భీతి భీః – దానివలన – దీనివలన ఏమౌతుందో! వాళ్ళెట్లా ఉంటారో! రేపు మాపు భీభత్సం కాదుకదా!... అని ప్రతిదానికీ భయపడుతూ ఉండటం. (Timidity)

అనుద్యమః - నైరాశ్యము, ఉద్యమించటము / ప్రయత్నించటానికి సిద్ధం కాకపోవటం. (Gloomy, Dull, )

ఇవన్నీ తమోగుణవృత్తులు వృద్ధి పొందుచున్నాయనటానికి సంకేతాలు.

----

ఓ ఉద్ధవా! ఇప్పటివరకు సత్త్వ - రజ - తమో గుణములు విడివిడిగా ఎటువంటి లక్షణాలు, వృత్తులు కలిగి ఉంటాయో చెప్పుకుంటూ వచ్చాను.

ఇప్పుడు ఈ త్రిగుణములు కలిసి ఉన్నప్పుడు గుణ వృత్తులు సంమిశ్రమైనప్పుడు ఏవిధంగా ఉంటాయో కూడా ఇక్కడ చెప్పుకుందాం.

----

ఈ జీవులు నేను - నాది అను బుద్ధిని పెంపొందించుకొంటూ ఉండటం సమ్మిశ్రమములైన త్రిగుణములకు సంబంధించినదేనయ్యా!

- మనస్సు వలన అనుభూతమయ్యేది,
- శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములనబడే ఇంద్రియార్థముల వలన అనుభవమయ్యేది,
- ఇంద్రియములకు ఎదురుగా తారసబడే విషయాలు,
- ప్రాణముల వలన (ప్రియత్వము వలన) ఏర్పడే వృత్తులుగా బయల్వెడలేవి

ఇవన్నీకూడా త్రిగుణములయొక్క మిశ్రమ వృత్తులేనని గమనించు.

ఈ పురుషుడు...,

- ధర్మ-అర్థ-కామ విషయములందు ఆసక్తుడవటం!
- వాటిపట్ల ఏర్పడే శ్రద్ధ-ఆసక్తి-రతి!
- సంపదలపట్ల ఏర్పడే అహంకార-మమకారములు.

ఇవన్నీకూడా త్రిగుణ మిశ్రమవృత్తుల విన్యాసమే!

## త్రిగుణ సంబంధంగా....

### త్రిగుణ లక్షణ - గుణప్రవృద్ధములు

ప్రవృత్తి లక్షణములైనట్టి కామ్యకర్మలయందు (Acts with expectations) పురుషునికి

ఆసక్తి కలిగినప్పుడు అట్టివాడు **లౌకిక వ్యవహారములలో** నిమగ్నుడౌతున్నాడు.

క్రమంగా ఎప్పుడో విసుగుచెంది "పరమాత్మను సమీపించటం ఎట్లాగురా?" అని యోచన ప్రారంభిస్తున్నాడు. అప్పుడిక **నివృత్తి-ఉపాసనా ధర్మములవైపుగా** దృష్టిని సారిస్తూ ఉన్నాడు. క్రమంగా పూజ-ధ్యానము-నిత్యధర్మము-నైమిత్తిక ధర్మములయందు రతుడు అగుచున్నాడు. ఇదంతా కూడా త్రిగుణముల సమ్మిశ్రమ చమత్కారమే!

శమము-దమము... ఇటువంటి లక్షణాలు ప్రవృద్ధము అవుతూ ఉంటే... ఈతడు సత్త్వగుణ యుక్తుడు అగుచున్నాడని చెప్పబడుచున్నాడు. కామము-ప్రాపంచక కర్మ వ్యవహారములపట్ల అభిరుచి పెరుగుతూ ఉంటే అది రజోగుణ వృత్తుల ప్రవృద్ధి. క్రోధము-లోభము ఇత్యాదులు తమోగుణ లక్షణాలు.

## త్రిగుణ ప్రకృతి

ఫలము-ప్రతిఫలము కోరకుండా భక్తితో స్వకర్మలచే నన్నే సేవించాలనే ఉద్దేశ్యములను వృద్ధి చేసుకుంటూ ఉంటే ఆతడు సత్త్వప్రకృతి కలవాడగుచున్నాడు. **ఈతడు నాకొరకై జగత్తులో జీవిస్తున్నాడు.**

అట్లాకాకుండా, విషయములను అపేక్షించి స్వకర్మలతో నన్ను సేవిస్తూ ఉంటే... ఆతడు రజోగుణ ప్రకృతి (స్వభావము) కలవాడు. **జగత్ విషయములు- సంపదలకొరకై నన్ను ఆరాధిస్తునాడు!**

హింసను సంకల్పించి నన్ను ఆరాధిస్తూ ఉంటే ఆతనిది తమోగుణ ప్రకృతి! ఇతరులను బాధించటానికి, ఇతరులపైఅధికారము కొరకో నన్ను ఉపాసిస్తున్నాడు.

----

**ఉద్ధవుడు :** శ్రీకృష్ణా! ఇప్పుడు నాదొక సందేహము స్వామీ!

ఈ జగత్తంతా త్రిగుణాత్మకం మాత్రమేనని చెప్పబడుతోంది కదా! అట్టి త్రిగుణములు పరమాత్మ స్వరూపుడవగు మీకు చెందినవా? లేక, జీవాత్మలగు మాకు చెందినవా? కాక, అవి ఈ దృశ్యజగత్తుకు సంబంధించినవా?

**శ్రీకృష్ణుడు :** త్రిగుణములు జీవాత్మకు చెందినవి కావు. పరమాత్మను-నిర్మలాత్మ స్వరూపుడను అగు నాకు చెందినవీ కావు.

మరి?

## ఈ త్రిగుణములు జీవుని యొక్క మనోసంభంధమైనవి మాత్రమే!

ఆత్మ స్వరూపుడగు జీవుడు మనో దేహముయొక్క త్రిగుణములు- అనే హస్తాలతో దేహములు-దేహసంబంధమైన విషయాలైన దృశ్యములు, లోకములు-ఇవన్నీ ఆస్వాదిస్తూ, ఆస్వాదిస్తూ... ఎప్పుడో వాటియందు ఆసక్తుడు అగుచున్నాడు. ఆ ఆసక్తి ప్రియత్వము (చిత్తము)గాను, అవినాభావత్వము (అవి లేకుంటే నేనే లేను అనువిధం)గాను పరిణమించటం జరుగుతోంది. ఈవిధంగా ఈ జీవుడు క్రమంగా సంసార బద్ధుడగుచున్నాడు. అనగా,

సంసార బంధము అనబడేది జీవునియొక్క స్వకీయ విరచితము-స్వకీయ కల్పన-స్వకీయ భావావేశమేగాని ఈ జీవునికి పరమాత్మయగు నేను కల్పించిది కాదు. నేను సంసార బంధముతో సంబంధమేలేనట్టి అప్రమేయుడను, నిష్క్రియుడను!

ఎప్పుడైతే...,

సత్త్వ-రజో-తమో గుణములు, (లేక) ప్రకాశము-ప్రవృత్తి - మోహము అనే వ్యవహారములను (త్రిగుణములను)- సత్వగుణముచే, (అనగా)

**"జ్ఞానము - స్వచ్ఛత - శాంతము"**

అనే ఔషధములచే (లేక ఆయుధములచే) ఈ జీవుడు జయిస్తాడో... అప్పుడు ఆ పురుషుడు (జీవుడు) త్రిగుణములను దాటివేసినవాడగుచున్నాడు!

తమోగుణము అధికమౌతూ వుంటే సత్వ-రజములు అల్పము అవుతూ వుంటాయి. అప్పుడు బద్ధకము-నిద్ర-ఆలస్యము మొదలైన తమోలక్షణాలు అధికమౌతూ వుంటాయి. ఈ జీవుడు కోపిష్ఠి-బద్ధకస్తుడు-ఇతరులను దూషించువాడు తప్పులు పట్టుకొనువాడు, విచారణ-వివరణ-పరిశీలనలకు సిద్ధపడనివాడు అగుచున్నాడు. మూఢత్వము-లయము (Immersed) -జడములతో కూడిన ఆ మానవుడు శోకము-మోహము-హింస ఇత్యాది గుణములతో కూడి ఉంటున్నాడు.

**రజోగుణ ఆధిక్యత:** సంగహేతువు(cause for attachement), భేద హేతువు (cause for seeing and searching for differences), ప్రవృత్తి స్వభావము (a quality of involving in multiple aspects) అయినట్టి రజోగుణము-అధికమౌతూ ఉన్నప్పుడో (while dominating)... అప్పుడు? ఆ జీవుడు

దుఃఖము - Worrying

యశస్సు - Craze for popularity

సంపద - Attraction towards possessions

మొదలైన ఆశయములు, స్వభావములు కలిగినవారై ఉంటాడు.

## గుణాధిక్యత - ఆయా ఫలితములు

**సత్త్వము**: చిత్తము నిర్మలమౌతూ ఉంటే, ఇంద్రియములు ప్రశాంతము పొందుతూ వుంటే, దేహము అభయమును (భయరాహిత్యము) పొందుతూ వుంటే..., మనస్సు విషయ సాంగత్య రహితం అవుతూ వుంటే..., పరమాత్మనగు నన్ను పొందటానికి అధిష్ఠానభూతమైనట్టి సత్త్వగుణము వృద్ధిచెందుతూ ఉన్నట్లు (getting increased) అని గ్రహించు.

**రజము :** ఈ జీవుడు అనేక కర్మ వ్యవహారములందు ఆసక్తుడై వికృతుడు అవుతూఉంటే, చిత్తము చంచలంగా విక్షిప్తి చెందుతూ ఉంటే, బుద్ధి "ఏదో కావాలి-ఏదో కావాలి", అనే రూపంగా అసంతుష్ఠి పొందుతూ ఉంటే, మనస్సు చాంచల్యం పొందుతూ ఉంటే, కర్మేంద్రియములు వికారం పొందుతూ ఉంటే... దాని అర్ధం?

**ఈ సర్వ కారణముల వలన రజోగుణము ఉద్రిక్తత పొందుచున్నట్లు.**

**తమోగుణము**

- చిత్తము కలత చెందుతూ ఉంటే...,
- చిత్తము చిత్‌తత్త్వమును పూర్తిగా ఏమరుస్తూ ఉంటే,
- సంకల్పాత్మకమైన మనస్సు బలహీనమౌతూ ఉంటే,
- అజ్ఞానము-విషాదము వృద్ధి చెందుతూ ఉంటే,

**తమోగుణము ఉద్రిక్తం అగుచున్నట్లు!**

## బలము

సత్త్వగుణము వృద్ధి అయ్యేడపుడు - దేవతలతకు,

రజోగుణము వృద్ధి చెందేడప్పుడు - అసురులకు,

తమోగుణము వృద్ధి పొందేటప్పుడు - రాక్షసులకు బలము వృద్ధి చెందుతూ ఉంటుంది!

## త్రి అవస్థలు

సత్త్వగుణము ప్రవృద్ధమైనప్పుడు – జాగరణము, (More Alert)

రజోగుణము ప్రవృద్ధమైనప్పుడు – స్వప్నము, (More Illusionary)

తమోగుణము వృద్ధి చెందేటప్పుడు – సుషుప్తి (More Sleepy)

అధికమై ఉంటాయి.

**తురీయమును ఈ మూడు అవస్థలకు సాక్షియై, ఆత్మస్వరూపమై చెన్నొందుతోంది.**

## ఉత్తరోత్తర గతులు

సత్త్వగుణ సంపన్నులు క్రమముగా బ్రహ్మమును దర్శించు మార్గములో బ్రహ్మోపాసకులై ఊర్ధ్వలోకాల వైపుగా యానం కొనసాగిస్తున్నారు. బ్రహ్మలోకమునకు చేరుతూ ఉంటారు.

రజో గుణయుక్తులగువారు మానవలోకమును పొందుతూ ఉంటారు.

తమో గుణమును ఆశ్రయించువారు స్థావరములవరకు అధోగతిని పొందుతూ ఉంటారు.

అనగా...,

సత్త్వగుణము వృద్ధి పొందుచుండగా మరణించినవారు స్వర్గము మొదలైన ఊర్ధ్వలోకాలు పొందుచున్నారు. (ఊర్ధ్వంగచ్ఛంతి)

రజో గుణము వృద్ధి చెందుచున్నప్పుడు మరణిస్తున్నవాడు మరల మానవ జన్మకు అర్హుడగుచున్నాడు. (మధ్యేతిష్ఠంతి)

తమోగుణము వృద్ధి పొందుచున్నప్పుడు నరకము మొదలైన అధోలోకములకు చేరుచున్నారు. (అధోగచ్ఛంతి)

**నిర్గుణులైన వ్యక్తులు జీవించి ఉన్నప్పుడే సర్వలోకాతీతులై నన్ను చేరుచున్నారు! 14 లోకాలకు కేవలసాక్షి – అతీతుడు అయి, వాటిని ఆస్వాదిస్తున్నారు**

## కర్మలు

**సాత్త్విక కర్మలు** – సర్వాంతర్యామియగు పరమాత్మకు ప్రీతి కలిగించే ఉద్దేశ్యముతో, ఫలాభిలాష రహితంగా, సమర్పణ భావంతో అనుష్ఠింపబడే నిత్యము (Daily) – నైమిత్తకము (Occasional / Incidental) మొదలైన కర్మలు.

**రాజస కర్మలు** – లోకసంబంధమైన ఫలమును సంకల్పించి – ఉద్దేశ్యించి చేసే కర్మలు.

**తామస కర్మలు** – సహజీవులను బాధిస్తూ, హింసతో కూడినవి. దంభము–మాత్సర్యముతో కూడినవి. ఇతరుల తప్పులను ఎంచటమే ప్రధాముగా కలిగియున్నవి. ఇతరులపై పెత్తనము–ఆధిక్యత ఉద్దేశ్యించేవి.

**కర్త–కర్మ–క్రియ–కర్మసాధనములు–ఫలములు–అంతా పరమాత్మ స్వరూపంగా బ్రహ్మముగా భావిస్తూ నిర్వర్తించే కర్మలు– గుణాతీత కర్మలు. (అద్వితీయం బ్రహ్మ!)**

## జ్ఞానము

**సాత్విక జ్ఞానము : దేహమును–గుణమును అధిగమించి– దేహి–గుణి** గురించి ప్రవచించే – నిర్వచించే – తెలియజేసే జ్ఞానము. ఇదియే **కైవల్య జ్ఞానము** కూడా!

**రాజస జ్ఞానము:** దేహమునకు – ఇంద్రియములకు – విషయములకు సంబంధించిన –భేదవివరణంతో కూడిన –లోక విశేషాలకు సంబంధించిన జ్ఞానము. దీనినే **వైకల్పిక జ్ఞానము** అనికూడా అంటారు!

**తామసజ్ఞానము :** పెత్తనము–అధికారము–ఇతరులను లొంగతీసుకోవటం–బాధించటం–లోభము ఇట్టి జ్ఞానము. ఇది **ప్రాకృతజ్ఞానము.** ఇంద్రియ సుఖములకు సంబంధించిన జ్ఞానము.

**పరమేశ్వర సంబంధమైనది – పరతత్త్వ విరణగురించినది నిర్గుణ జ్ఞానము.**

## వాసము (Place of Stay)

వనవాసము – సాత్విక వాసము.

గ్రామవాసము – రాజసవాసము.

జూదమాడు గృహములలో వాసము – తామసిక వాసము.

**పరమాత్మ సన్నిధిలో ఉండటం (దేవాలయాదులలో ఉండటం) – నిర్గుణము.**

## కర్త (కర్మ నిర్వర్తించువాడు)

**సాత్వికకర్త : అనాసక్త భావనతో** కర్మలు ఆచరించేవాడు – సాత్వికుడు.

**రాజసిక కర్త : రాగముతో** జ్ఞానచక్షువులు మూసుకొని కర్మలు చేయువాడు – రాజసికుడు.

**తామసిక కర్త: స్మృతి భ్రష్టుడై,** పూర్వాపూర్వ విచారణ చేయకుండా కర్మలు చేయువాడు.

**కేవలము సర్వాంతర్యామి – సర్వ బాహ్య అభ్యంతర స్వరూపుడగు పరమాత్మను ఉద్దేశ్యించి**

**కర్మలు నిర్వర్తించువాడు - నిర్గుణుడు.** My work is my worship **అని భావించి కర్మలు చేయువాడు నిర్గుణకర్త. అకర్త.**

## శ్రద్ధ

**సాత్విక శ్రద్ధ :** అధ్యాత్మ శాస్త్రము సూచిస్తున్న బోధిస్తున్న మార్గము - ఆశయముల పట్ల గల శ్రద్ధ - సాత్వికము. నేనెంత వరకు నిర్మల హృదయము, సునిశితమైన - విస్తారమైన బుద్ధి సంపాదించుకుంటూ శాస్త్రముల-ఆత్మజ్ఞుల బాటలో - నడుస్తున్నాను?... అను శ్రద్ధ స్వాతిక శ్రద్ధ!

**రాజసిక శ్రద్ధ :** ఇంకేదేదో ముందుముందు చెయ్యవలసి యున్నది - ఎంతెంత పొంచున్నాము? - అని కర్మలపట్ల శ్రద్ధచూపుతూ చరించేవాడు - రాజసికుడు.

**తామసిక శ్రద్ధ : అధర్మమే నా ధర్మము** అని భావించి శ్రద్ధ చూపువాడు - తామసికుడు.

**భక్తియొక్క ప్రవృద్ధియే ఆశయముగా కలిగి, పరమాత్మను సేవించుటయందు శ్రద్ధగల వాడు - నిర్గుణుడు. గుణాతీతుడు.**

## ఆహారము

**సాత్వికాహారము :** హితకరము (పథ్యము), శుద్ధము, ఇతరులను బాధించకుండా సంపాదించుకొన్నది (అనాయాస లబ్దం - అబాధిత లబ్దము-అనింద్యమైన యత్నముల వలన లభించే ఆహారము.

**రాజసాహారము :** ఇంద్రియ సుఖము లక్ష్యముగా కలిగినవి, వగరు, పులుపు, ఉప్పు పదార్థములు. సహ జీవుల బాధలను లెక్కచేయకుండా, పాప-పుణ్యాలు గమనించకుండా సంపాదించుకునే ఆహారము.

**తామసికాహారము :** దాహము - దైన్యము - మత్తు కలిగించేవి. అపవిత్రములు. ఇతరులను బాధించి మోసగించి సంపాదించుకునే ఆహారము.

**నాకు సమర్పించబడినది నిర్గుణాహారము. సాత్వికము-దైవార్పితము-న్యాయార్జితము మితము అయినది- గుణాతీతమైన ఆహారరూపం. (తస్మాత్ అన్నమయమ్ మనః)**

## సుఖము

**సాత్విక సుఖము :** ప్రేమ-దయ-కర్తవ్య నిర్వహణ-పరోపకారము మొదలైన కర్మల

నుండి లభించే సంతోషము వలన కలిగే సుఖము – సాత్వికము

**రాజసిక సుఖము :** విషయభోగమువలన కలిగే సుఖము – రాజసము.

**తామసిక సుఖము :** మోహము–దైన్యము – మత్తువలన ఇతరుల సాధక బాధకములను లెక్క చేయకుండా కలిగే సుఖము – తామసికము.

**పరమాత్మను కీర్తించుటవలన కలిగే తన్మయతా–తదర్పితా ఇత్యాదుల వలన కలిగే సుఖము – నిర్గుణము, గుణాతీతము.**

----

ఓ ఉద్ధవా!

ద్రవ్యము :: దేశము :: ఫలము :: కాలము :: జ్ఞానము :: కర్మ :: కర్త :: శ్రద్ధ :: అవస్థ :: ఆకృతి :: నిష్ఠ

ఇటువంటి భావములన్నీ త్రిగుణాత్మకములేనయ్యా! అవి సాత్విక–రాజసిక–తామసిక మూడు విధాలుగా వుంటూ వుంటాయి. అంతే కాదు!

చూడబడినవి :: చూస్తున్నవి :: వినబడినవి :: వింటున్నవి :: ఆలోచించబడినవి :: ఆలోచిస్తూ వున్నవి :: ప్రకృతి – పురుషుడు అను ద్వంద్వ భావములు – ఇవన్నీ కూడా త్రిగుణాత్మకములే! త్రిగుణములలో ఏదో ఒకదానికి చెందివుండటం–విజ్ఞతతో గమనించవచ్చు.

ఈ పురుషునకు (జీవునకు) కలిగే సంసారభావములన్నీ త్రిగుణ కర్మ–త్రిగుణ సంబంధమైన ఆలోచనలవలననే కలుగుచున్నాయి. త్రిగుణములు కానిదంటూ దృశ్యములో ఎక్కడా ఏదీ లేదు.

**త్రిగుణములు చిత్తమునుండే ఉత్పన్నమౌతున్నాయి.**

ఎవ్వడైతే...,

చిత్తముచే జనింపజేయబడుచున్న త్రిగుణములను చిత్తము చేతనే జయిస్తాడో...,

అట్టివానికి స్వభావసిద్ధంగానే నా పట్ల భక్తియోగం ఏర్పడుతోంది. భక్తియొక్క నిష్ఠచే విచక్షణుడై పరమాత్మత్వమును సమీపిస్తున్నాడు. సంతరించుకుంటున్నాడు. పరమాత్మతో మమేకమవటానికై భక్తిగుణములు ఆశ్రయిస్తున్నాడు. భక్తి త్రిగుణాతీతస్థానమునకే దారి తీస్తోందిసుమా!

అందుచేత...,

కాస్త విచక్షణ గల జీవుడు యుక్తాయుక్త విచక్షణ చేయగల – జ్ఞాన విజ్ఞాన సంభవమగు మానవ దేహము పొందిన తరువాత... ఇక తాత్సారం చేయరాదు. చేయడు. సదుపాయములను తెలివితక్కువగా వృధా చేసుకోడు. ఇక విచక్షణ –విచారణ చేయనివానికి నేను చెప్పేదేమున్నది?

మరి ఏమి చెయ్యాలి?

**గుణములయందు ఆసక్తిని త్యజించి గుణాతీతుడను – తురీయుడను – సర్వసాక్షిని అగు నన్నే సేవించాలి! నన్నే అంతటా అన్ని రూపాలుగా దర్శించాలి.** తనయందే సర్వదా వేంచేసియున్న నన్ను గుర్తించాలి. గమనించాలి. ఆస్వాదించాలి.

– క్రమక్రమంగా – అప్రమత్తుడు, జితేంద్రియుడు, విషయాసక్తి శూన్యుడు అయి నన్నే శరణువేడును గాక!

**సాత్విక గుణము – ద్రవ్యము – స్వభావములను** సేవించి రజస్తమోగుణములను జయించాలి.

ఆ తరువాత క్రమంగా **గుణాతీతుడై, గుణములకు కేవలసాక్షి** అయి సర్వమును ఆస్వాదించాలి!

అనగా...,

– ఉపశమనాత్మకమగు సత్వగుణముతో కూడినవాడై మిశ్రమ సత్వగుణములను కూడా జయించాలి.

– గుణత్రయ విముక్తుడై లింగదేహము (సంస్కారదేహము)ను కూడా అధిగమించి, తనలోనే మనో–బుద్ధి–చిత్త–అహంకారములకు ఆవల సర్వదా వేంచేసియున్న నన్ను పొందాలి.

ఈవిధంగా చిత్తమునుండి జనిస్తున్న గుణముల నుండి – లింగ దేహమునుండి విముక్తుడై – బ్రహ్మరూపుడనైన నా అనుభూతిచే ఈ జీవుడు పరితృప్తుడు కాగలడు!

అట్టి పరితృప్తుడు ఇక ఇక్కడి విషయభోగములకు గాని, అంతర్బహిశ్చ దృశ్య విషయముల చేతగాని బద్ధుడు కాడు! జగత్ విషయములపట్ల మౌనం వహిస్తాడు. ముక్తుడై చరిస్తాడు! చిరునవ్వు సదా చిందిస్తూ – అతీతుడై వుంటాడయ్యా!

# 40. పురూరవ వైరాగ్య ఉక్తి (ఐలవ గీతము)

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీకృష్ణా! మాయను అధిగమించటం ఎట్లా! నిన్ను చేరే మార్గమేమిటి?

**శ్రీకృష్ణుడు :** ఓ ఉద్ధవా!

**శ్లో॥ మల్లక్షణమిమం కాయం లబ్ధ్వా మద్ధర్మ ఆస్థితః**

**అనందం పరమాత్మానం ఆత్మస్థం సముపైతి మామ్॥** (అధ్యా 26, శ్లో 1)

పరమాత్మనగు నాయొక్క తత్త్వమును తెలుసుకోవటానికి అత్యంత ఉపయుక్తమైన ఉపకరణము ఈ మానవ దేహము. అట్టి మానవ దేహోపకరణము సహాయంతో భాగవత ధర్మమును – ఆశ్రయించి, నన్ను – **ఆత్మ స్థితుడనుగా, పరమానందరూపుడనుగా, పరమాత్మనుగా** ఎఱిగి – నన్నే పొందుచున్నాడు. కాబట్టి మానవ జన్మ బహుదుర్లభమగు మహత్తరమైన అవకాశముగా శ్రోతలు గమనించెదరు గాక! ఇది కాల బద్ధమైన అవకాశము కూడా! (This is Time-Bound, but not permanent opportunity).

ఇది గమనించి గుణమయమగు ఈ సూక్ష్మోపాధి నుండి విముక్తులయ్యెదరు గాక! గుణములు మాయా సంజాతములు కదా!

ఇక్కడి విషయములన్నీ స్వప్నాంతర్గత విశేషాలవలె –అవాస్తములు, మాయామాత్రములు. గుణాతీతుడు ఈ విషయం గమనిస్తున్నాడు. గమనించి ఇక – విషయాసక్తుడు అగుటలేదు! ఇక్కడ కొన్ని జాగ్రత్తలు ఉదహరిస్తున్నాను.

– విషయభోగములందు, కేవలము పొట్టనింపుకోవటానికో–సంపద మొదలైనవాటి కొరకో రోజులన్నీ వెచ్చించే వారిని, తదితర సాంసారిక భావ–ఆవేశములు కలవారిని "అసత్పురుషులు" అని అంటారు. అధ్యాత్మ మార్గాణ్వేషకులు అట్టివారితో స్నేహము చేయకపోవటమే ఉచితము. ఎందుకంటావా? గ్రుడ్డివాడిని అనుసరిస్తున్న మరొక గ్రుడ్డివాడు ఏమౌతాడు? పోయి ఇద్దరు అంధకారంలోనే పడతారుకదా! అట్లాగే అసత్పురుషుని అనుసరించేవాడు సద్వస్తువును ఎట్లా చేరుతాడు చెప్పు!

ఈ సందర్భములో మహా యశస్వి–ఇలానందనుడును అయినట్టి, పురూరవ చక్రవర్తి యొక్క ఒక సందర్భంలోని–ఒక అనుభవం గుర్తుకొస్తోంది. ఆతడు మొదట ఊర్వశిని

కామించి విరహం పొందాడు. అత్యంత దుఃఖితుడైనాడు. ఆ తరువాత విచారణచే విరాగి అయినాడు. ఆ విశేషం చెప్పుచున్నాను. విను.

---

**పు**రూరవ చక్రవర్తి మహా ధైర్యవంతుడు! ప్రజారంజక పాలకుడు! గొప్ప తపస్వి! మహా మేధావి. గొప్ప యజ్ఞములు చేసినవాడు. ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలిస్తూ ఉండేవాడు. ప్రజలంతా ఆ చక్రవర్తిని తమ ఆత్మ బంధువుగా-ఆత్మీయ భావనతో ప్రేమిస్తూ గౌరవించేవారు. ఆయన ప్రకృతిని జయించివేసినట్లుగా చెప్పుకోబడుచూ వుండేవాడు.

రోజులు ప్రశాంతంగా గడచిపోతున్నాయి.

ఒకానొకరోజు...,

పురూరవుడు వాహ్యాళికై ఒంటరిగా వెళ్ళుతూ ఉండగా, ఒక సరస్సు ఒడ్డున ఒకనొక సౌందర్యరాశిని చూచాడు. ఆమె వన్నెలు చూచి అత్యంతాశ్చర్యం పొందాడు. "జగత్తులో ఇంతటి కోమలమైన సుందర స్త్రీ ఉండటమే నాకు ఆశ్చర్యం వేస్తోందే!" అని అనుకున్నాడు.

ఆమెను సమీపించాడు.

"ఓ కన్యకా! ఎవరు నీవు? నీ వన్నెలు ఈ వనానికే సిరివెన్నెలలు తెచ్చాయి. నేను ఈ రాజ్యానికి చక్రవర్తిని. పురూరవ చక్రవర్తిని. నీ సౌందర్యం చూచి ఆశ్చర్యపోతున్నాను. దేవకాంతవలె ప్రకృతిని రంజింపజేస్తున్నావు సుమా! ఇదిగో! నీ సౌందర్యానికి నేను దాసుణ్ణి అవుచున్నాను. నా మహాసామ్రాజ్యము నీ పాదాలకు సమర్పిస్తున్నాను. నాకు మహారాజ్ఞివై ఈ రాజ్యమును-నన్ను ఏలుకో! నీ సౌందర్యానికి దాసుడనై నేను అన్నీ ఇచ్చివేస్తాను. నా సింహాసనాన్ని అధిరోహించు. దేవకాంతవలె మెరిసిపోతున్న నీకు దాసానుదాసుణ్ణి అవటంచేత నాకు ఎంతగానో గర్వముగా ఉన్నది! ఓ సుందరీ! ఒకసారి నీ పెదిమలు విప్పవూ? ఎవరునీవు! మనవకాంతవా! దివినుండి భువికి దిగివచ్చిన గంధర్వకాంతవా?"...

అని పలకరించాడు.

**ఊర్వసి :** ఓ చక్రవర్తీ! పురూరవా! మహాప్రాజ్ఞా! అవును! నేను మానవ కాంతను కాను!

దేవకాంతను. నాపేరు ఊర్వసి. దేవసభలో మిమ్ములను ప్రశంసిస్తూ వుంటే మహానుభావుడగు మిమ్ములను సందర్శించాలనే కోరిక నాకు కలిగింది. మహాప్రభూ! పుణ్యమూర్తీ! ప్రకృతి సౌందర్యం ఆస్వాదించటానికి, మరియు మిమ్ములను చూడటానికి వచ్చాను. మీరు వేదవేదాంగాలు ఎరిగిన కర్మయోగులని విన్నాను. ఈ రోజు నాకు సుదినం! సంతోషం! మీకు నమస్కరిస్తున్నాను. నాకు భూలోకంలో నియమితమైన కాలము అయిపోవస్తుంది. కొద్ది క్షణాలలో తిరిగి దేవలోకం వెళ్ళక తప్పదు. ఇది అప్రతిహతమగు ఇంద్రుని ఆజ్ఞ. ఊర్వశీలోకం తిరిగివెళ్ళాలి! మీ రాజ్యాదులు నాకెందుకు చెప్పండి? మీ దర్శనం అయింది. నాకు చాలా సంతోషం. ఇక శెలవు ఇప్పించండి!

**పురూరవుడు :** ఓ దేవతాలోక విహారిణీ! ప్రణయేశ్వరీ! ఊర్వశీ! నీవు నా హృదయాన్ని దోచావు. నన్ను పుణ్యమూర్తీ – అని సంబోధించావు కదా! పుణ్యఫలితంగానే నీ దర్శన భాగ్యం నాకు కలిగింది కాబోలు! నీవు నన్ను విడిచి వెళ్ళవద్దు. ఇక్కడే నాతోనే ఉండు. ఇప్పుడు నా మనఃస్థితి ఎమిటో తెలుసా? నిన్ను విడచి ఒక్కరోజు కూడా ఉండలేను. ఒక్కక్షణం కూడా బ్రతకలేను.

**ఊర్వశి :** మహనీయా! మీరు ఇట్లా మాట్లాడుచున్నారేమి? ప్రాకృత దేహాలు చూచి మీవంటివారు భ్రమించటమేమిటి? ఈ దేవ–మానవ దేహాలన్నీ ప్రకృతి కల్పనయే కదా! స్వప్నంలో చూచిన దేహాలు ఎటువంటివో, జాగ్రత్‌లో కనిపించే దేహాలు అటువంటివే కదా! భౌతిక దేహాకర్షణలకు లోను అవటం ఊర్ధ్వగతులకు – అధ్యాత్మయానానికి అవరోధాలని మీకు తెలియంది కాదు కదా!

**పూరూరవుడు :** అదియేమో నాకు తెలియదు. అవన్నీ ఇప్పుడు నాకు చెప్పవద్దు! నిన్ను విడచి ఉండలేను. అంతే! నన్ను విడచి వెళ్ళవద్దు. నీవంటి సుందర దేహము పురుషుని రంజింపచేయటానికే కదా, బ్రహ్మదేవుడు సృష్టించేది! మేము నిర్వర్తించియున్న యజ్ఞ–యాగముల ప్రయోజనము నీవంటి దేవకాంతలతో సమాగమమే కదా!

**ఊర్వశి :** చక్రవర్తీ! దేహములను చూచి భ్రమించటం మాయకు లోబడటమేకదా! నన్ను విడవండి. నామాట వినండి. ఈ భౌతిక దృష్టినుండి దయచేసి మరల ఆధ్యాత్మదృష్టికి మరలండి.

ఈవిధంగా ఊర్వశి మనోదౌర్బల్యం వీడవలసినదిగా ఎంతగానో బోధించింది. బ్రతిమలాడింది. అనేక సోదాహరణములు–దృష్టాంతాలు గుర్తుచేసింది. పురూరవుడు

ఆ మాటలన్నీ "ఈ దేవకన్య నన్ను ఏమరచటానికి ప్రయత్నిస్తోంది..." అన్న దృష్టితో చూచాడేగాని, ఆమె చెప్పే భౌమావిశేషాలను (ఆత్మతత్త్వ ప్రవచనములను) వినటమేలేదు.

ఇక ఊర్వశి చేసేదేమి లేక ఆకాశంలో ప్రయాణిస్తూ నిజమార్గంలో అతర్ధానమైనది. పురూరవునకు అది చూచి పిచ్చిపట్టినట్లు అయింది. దుఃఖముతో కేకలు పెట్టాడు. బట్టలు చింపుకున్నాడు.

**పురూరవుడు :** దేవీ! ఊర్వశీ! ఇది ఘోరం! నన్ను విడచి వెళ్ళిపోతున్నావా! నిలువు! నిలువు! పరుగెత్తి పోవద్దు! ఏదీ! నీ ముఖపద్మం మరొక్కసారి చూపించవూ!

అని దీనంగా కేకలు వేయసాగాడు. ఉన్మత్తుడైనాడు. చెట్లలోను- పొదలలోను ఊర్వశి దాగుకున్నదేమోనని వెతకసాగాడు. దిగంబరుడై మరింకేమి పట్టించుకోక ఊర్వశి ఎక్కడ – ఎక్కడ? అని అనుకుంటూ పిచ్చివాడై అనేకచోట్ల సంచరించాడు. ఆతని వేదన- రోదన గమనించిన ఊర్వశికి మనసు కరిగింది.

తిరిగి వచ్చిన ఊర్వశిని చూచి పురూరవుడు అత్యంత ఉత్సాహంతో సమీపించాడు. ఆమెను ఆలింగనం చేసుకొన్నాడు. ఇరువురు ఊర్వశీలోకం చేరారు. ఆమెతో సాంగత్యం పొందాడు. ఆ ఇరువురి సాంగత్యంలో అనేక సంవత్సరాలు గడచిపోయాయి.

**కాలచక్రము మౌనముగా, అప్రమేయంగా తిరుగసాగింది.**

చాలా కాలం తరువాత ఎప్పుడో క్రమంగా పురూరవుడు ఊర్వశీ సాంగత్యము పట్ల విరక్తుడు కాసాగాడు. అవును మరి! సుదీర్ఘమైన అభ్యాసంచేత ఇంద్రియానుభవాలు మనస్సుకు అరుచి కావటం ఇంద్రియ విషయముల విషయంలో స్వాభావికమేకదా!

---

ఊర్వశీలోకంలో ఊర్వశీ సాంగత్యంలో అనేక సంవత్సరాలు గడపినప్పటికీ ఆతనికి తృప్తి కలుగలేదు. రాత్రులు-పగళ్ళు-నెలలు-సంవత్సరాలు గడచిపోతున్నప్పటికీ "ఇకచాలు" అని అనిపించటమూ లేదు. కానీ క్రమంగా అలసట-విసుగు పొందసాగింది. ఒకానొకరోజు ఆ పురూరవుడు ఒక వంటరి ప్రదేశం చేరాడు. "**నేను ఇంతకాలం చేస్తున్నదేమిటి? ఊర్వశితో సాన్నిధ్యంవలన పొందినదేమిటి?...**" అని ఆలోచించ సాగాడు. అతనిలో ఏదో వైరాగ్యం బయల్వెడలింది.

ఇట్లు ఈవిధంగా గానం చేయసాగాడు!

పురూరవుడు :

**శ్లో॥ అహో! మే మోహవిస్తారః కామ కశ్మల చేతసః**

**దేవ్యా గృహీత కంఠస్యన్ ఆయుఃఖండా ఇమే స్మృతాః ॥** (అధ్యా 26, శ్లో 7)

ఆహాఁ! కామముచే నా మనస్సు దూషితమైపోయింది కదా! నా మోహమునకు అంతులేకుండా పోయింది! ఊర్వశీ ఆలింగనంలో నాకు పగలు-రాత్రి తెలియకుండానే అనేక రోజులు-నెలలు-సంవత్సరాలు ఇట్టే గడచిపోయాయి. "ఆహాఁ! ఈమెతో సాంగత్యం ఎంత మధురం!" అని తలుస్తూ సుదీర్ఘకాలం గడిపాను.

లాభం? కామము శమించాలి కదా? శమించిందా? లేదు. బెంగ-తపన-ఆవేదన ఇంకా ఇంకా పెరిగాయి. "ఏ రోజు ఈ ఊర్వశి నన్ను విడచి వెళ్ళిపోతుందో? ఎప్పుడు ఇంద్రుడు ఈమెను వెనక్కి రమ్మని ఆజ్ఞాపిస్తాడో? అప్పుడు నా గతి ఏమిటి?..." అని ప్రతిరోజు దిగులు అనుభవించాను. ఇప్పటికీ పరిస్థితి అంతే!

నష్టము! **"చదువుకుని బాగుపడరా బాబూ!"** అని తండ్రి ధనము వెచ్చించి మరీ పిల్లవాడిని విద్యాలయంలో జేర్పిస్తాడే! ఆవిధంగా ఈ విశ్వము అనబడే విద్యాలయంలో (విశ్వ విద్యాలయుము - Univerce-University)లో నా ఆత్మయొక్క దివ్యత్వాని సుస్పష్టపరచుకోవటానికి "మానవజన్మ" అనే తరగతిలో జగతః పితయగు పరమేశ్వరుడు జేర్పించారు.

నేను నేర్చినదేమిటి?

స్త్రీ సాంగత్యమే సర్వస్వము- అని అహోరాత్రములు గడపటమా? "ఇప్పుడు నాకు ఈ లాభించినది ఎవ్వరైనా తొలగించరు కదా? అప్పుడు నాగతి?".... అని వర్తమానమును కామ-రాగ-లోభములతో కప్పిఉంచటమా? ఆకాశము వైపుచూచి ఏదో లభించక పోతుందా?- అని నోరుతెరచి ఉంచుకున్నవాడికి ఆకలి తీరుతుందా? కామ-రాగములతో రోజులు గడిపిన నాకు ఇప్పుడు ఆగతే పట్టింది!

ఈలోగా ఆయుర్దాయం చేజారిపోతూ ఉన్నది! అది నేను గమనించటమే లేదు! ఇప్పుడిక క్రమంగా వార్ధక్యం నన్ను సమీపిస్తోంది. నేను జీవితంలో ఏమి సాధించినట్లు? ఏమి ఉద్ధరించినట్లు? ఎవరిని సంతోషపెట్టినట్లు? ఆత్మద్రోహీ-కరణవివశో!

**శ్లో॥ నాహం వేదాభి నిర్ముక్తః సూర్యోవా అభ్యుదితోఽముయా**
**ముషితో వర్ష పూగానాం బతాహాని గతాన్యుత ॥** (అధ్యా 26, శ్లో 8)

ఊర్వశియొక్క నామ-భౌతిక రూపాదులచే వంచించబడినట్టి నేను అనేక రోజులు తెల్లవారటం-ప్రొద్దుగూకటం కూడా గుర్తించలేక పోయాను! అయ్యో! ఎన్ని రోజులు-ఎన్ని సంవత్సరాలు నిష్ప్రయోజనంగా ఈ నాజీవితంలో గడచిపోయాయి. వృధా అయిపోయాయి! ఆ గడచిపోయిన ఆయుష్షును తిరిగి ఎవ్వరిస్తారు? ఎవ్వరూ ఇవ్వరు! ఆహాఁ! నామనో మోహం ఎంతటిది. (ఆయుషః క్షణ ఏకోఽపి సర్వరత్నైః న లభ్యతే॥)

**శ్లో॥ అహో మే ఆత్మసమ్మోహో యేన ఆత్మా యోషితాం కృతః**
**క్రీడా మృగః చక్రవర్తీ నర దేవశిఖామణిః ॥** (అధ్యా 26, శ్లో 9)

రాజశ్రేష్ఠుడను, చక్రవర్తిని, గొప్ప భక్తి-జ్ఞాన సంపన్నుడను అని అందరు చెప్పుకొనే నేను... ఈనాడు ఒక స్త్రీ చేతిలో క్రీడామృగంగా, కీలుబొమ్మగా అయిపోయానే! ఇందుకు ( ఊర్వశి లభించినందుకు) సంతోషించాలా? లేక ఒక ఆడుదాని చేతిలో చిక్కి ఉత్తమ ఉపాసనామార్గమునుండి చ్యుతిపొంది కుమార్గంలో చాలా దూరం ప్రయాణించి వచ్చినందుకు దుఃఖించాలా? అరెరె! రాజ్యాదులతో కూడిన నాయొక్క చక్రవర్తిత్వమును, తత్సబంధమైన స్వధర్మమును గడ్డిపోచలాగా చూచి, ఉన్మత్తుడునై (పిచ్చివాడినై) దిగంబరుడనై యేడ్చుచు... నానుండి వెడలిపోవుచున్న ఊర్వశి వెంటబడి "పోకు! నా వెంటనే ఉండు!..." అని యాచించి మరీ బంధమంతా తెచ్చిపెట్టుకున్నానే! వెనుక కాళ్ళతో తన్నించుకొనికూడా గాడిదవెంట పడటం ఎటువంటిదో.. "వద్దురా బాబూ.." - అని అంటున్నాకూడా, గీపెట్టి-ఏడ్చి ఊర్వశితో సాంగత్యము తెచ్చి పెట్టుకొనటం అటు వంటిది కదా! నన్ను ఏమనాలి? మహనీయులు నాగురించి ఏమని చెప్పుకుంటారు? స్త్రీ లోలుడనై జడ దేహముతో ఆలింగనము కొరకై దేవురించిన నావెంట ఇక మహత్యము గాని, తేజస్సుగాని, సర్వజన నియంతృత్వముగాని ఇంకా ఎందుకుంటాయి?

**శ్లో॥ కిం విద్యాయా? కిం తపసా? కిం త్యాగేన శ్రుతేన వా?**
**కిం వివిక్తేన మౌనేన? - స్త్రీభిర్యస్య మనో హృతమ్?** (అధ్యా 26, శ్లో 12)

స్త్రీ దేహమును చూచి (లేక స్త్రీ-పురుషుని దేహమును చూచి) మురిసిపోయి మనసంతా దేహ విశేషములతో నింపుకున్న వారిగతి ఏమిటి? నిర్గతే! ఆ వ్యక్తియొక్క తపస్సు,

గ్రంధ పఠనముచే సంపాదించుకున్న విద్యావిశేషాలు, సన్యాసినై కాషాయ వస్త్రాలు ధరించటం, ఏకాంతవాసము, తెలివితేటలు, వికాసము - ఈ కష్టపడి సంపాదించుకున్నవన్నీ బూడిదలో పోసిన పన్నీరే కదా! వృధాయే కదా! వ్యర్ధమే కదా!

**శ్లో॥ స్వార్ధస్యాకోవిదం ధిఙ్మాం, మూర్ఖం పండిత మానినమ్**
**యోఽహం ఈశ్వరతాం ప్రాప్య స్త్రీభిర్గోఖరవత్ జితః ॥** (అధ్యా 26, శ్లో 13)

సర్వజనులపై నియంతృత్వము చెలాయించే చక్రవర్తినయ్యాను. "పండితుడు-శ్రేయామార్గము పొందినవాడు మన ఈ పురూరవ చక్రవర్తి ..." అని నన్ను సభలో కవిత్వముతో కవులు శ్లాఘించారు. "ఈతడు జ్ఞాని. మనకు అనుసరణీయుడు. మహనీయుడు!..." అని సభికులంతా నాగురించి నిండు సభలో పాటలు పాడుతూ ఉంటే..నేను ఆ సమయములలో, ఆరోజులలో "ఓహోఁ! నిజమే కాబోలు" అని నేను లోలోన చాలా సంతోషించాను. గర్వించాను. కించిత్ అహంకరించాను కూడానేమో! కానీ కాలక్రమేణా ఏమైయ్యింది? ఒక ఆవు-గాడిదవలె స్త్రీ సాంగత్యానికి వశుడనైపోయాను. పోనీ స్త్రీ సాంగత్యం పొందినందుకు తృప్తి పొందానా?

**శ్లో॥ సేవతో వర్షపూగాన్ మే ఊర్వశ్యా అధరాసవమ్**
**న తృప్యత్యాత్మభూః కామో వహ్నిః ఆహుతిభిః యథా॥** (అధ్యా 26, శ్లో 14)

కట్టెలు వేసినకొలదీ, నేయి పోసినకొలదీ అగ్ని అధికమే అవుతుంది గాని,... తరుగుతుందా? అనేక సంవత్సరాలు ఊర్వశియొక్క అధరామృతమును గ్రోలినాకూడా నాపట్ల కామము శమించలేదు. మనస్సు తృప్తి పొందలేదు. పైగా కామజ్వరం ఇంకా ఇంకా వృద్ధి పొందింది! ఇక శాంతి ఎక్కడిది?

ఈ స్త్రీ పురుష పరస్పర దేహసంబంధములలో ఇరుక్కొని పోయిన చిత్తమును వెనుకకు మరల్చుటం తేలికైన విషయమా? నావల్ల అయ్యేదే కాదు! నా చిత్తమునకు కామజ్వరం నుండి విముక్తి కలిగించటానికి ఆత్మారాములకు ఆరాధ్యుడైనట్టి ఆ అధోక్షజుడే దిక్కు! దేవుడే దిక్కు! ఇంకెవ్వరు నన్ను రక్షించేది?

---

ఆహాఁ! ఆనాడు ఊర్వశి మొట్టమొదటే అనేక యుక్తియుక్తమైన వాక్యములతో నన్ను సమాధానపరచటానికి ప్రయత్నించింది. నాకెంతగానో బోధించింది. ఇంద్రియములకు

వశుడైనవాడను, మందమతిని, దుర్మతిని అయినట్టి నేను ఆమె మాటలు విన్నానా? విని కూడా ఏమైన విచారణ-విచక్షణ చేశానా? లేదు. మనోగతమైన మోహంతో "నీవు లేకపోతే నేను చచ్చిపోతాను. దిగంబరినై బాటలవెంట తిరుగుతాను ..." అని బెదిరించి మరీ ఆమెతో భౌతిక సాంగత్యమును బలవంతంగా సంపాదించుకున్నాను. నా మనో గతమైన మోహము అప్పటికిగాని-ఇప్పటికిగాని ఏమాత్రం తొలగలేదు.

ఊర్వశిని దర్శించటం చేతనేనా, నాకీగతి పట్టింది? **కాదు. కానే కాదు.**

ఊర్వశి నాకేమి అపకారము చేసింది? ఏమీ చేయలేదు.

ఒకానొకడు బాటలో పోతూ బాటకు అడ్డంగా మెలికలు తిరిగి కనిపించిన త్రాడును చూచి "చచ్చాన్రా బాబోయ్! ఈ పాము కరచిందా! అంతే!..." అని అనుకొని పాముగా భ్రమిస్తే... ఆ తప్పు త్రాడుదా? కాదే! ఆ త్రాడు బాటసారిని పిలచి, "నన్ను పాము అని అనుకోవయ్యా!" - అని ఏమన్నా బ్రతిమలాడిందా? లేదే!

అట్లాగే అజితేంద్రియుడినని (ఇంద్రియములను జయించక-పైగా వాటికి వశుడు అయిన వాడను) అగు నాదే తప్పంతా? దోషమంతా నాదగ్గరపెట్టుకొని ఊర్వశినో- మరొకరినో తప్పు ఎంచి మరొక తప్పు చేయను.

ఆహాఁ! ఆహాఁ!

ఆ ఊర్వశిని మొట్టమొదటగా చూచినప్పుడు "ఈమె శరీరము అప్పుడే వికశించిన లేత సౌగంధిక పుష్పమే!.." అని పరవశించాను. అది ఎంతటి అజ్ఞానకృతమైన ఉత్ప్రేక్షాలంకారము!

సుకుమారము- సుగంధములతో కూడినది - అత్యంత ఆహ్లాదకరము అగు ఆ సౌగంధిక పుష్పము యొక్క సౌందర్యము ఎక్కడ? అతి దుర్గంధభూయిష్టము, అనేక మలిన పదార్ధములతో కూడినవి, అశుచి అయినవి అగు ఈ స్త్రీ-పురుషుల శరీములెక్కడ?

నాయొక్క దట్టమైన అజ్ఞానము-ఇంద్రియ దృష్టి చేతనే... ఆ ఊర్వశి దేహము చూచి ఏవేవో సౌందర్య వర్ణనములు చేసే కవుల కల్పిత వాక్యములను మనస్సులో గుర్తు చేసుకుని భ్రమతో సౌందర్యమును ఆరోపించాను. బద్ధుడనయ్యాను. ఎవ్వరిని ఏమి అనను? ఏమి అనుకుని ఏమి లాభం, తప్పంతా నాదగ్గిరే ఉంచుకొని?

## ఓ శరీరమా!

ఎవరివి నీవు? ఎవ్వరిచే కల్పించబడ్డావు? ఎవ్వరికి చెందినదానవు? కాలగతిచే అనేక పదార్థముల సమీకరణముగా రూపు దిద్దుకున్న నీజన్మ రహస్యం ఏమిటి? నీ సొంతదారు ఎవరు?

**శ్లో॥ పిత్రోః కిం? స్వం ను భార్యాయాః? స్వామినో? అగ్నేః? శ్వ గృధ్రయోః**
**కిమాత్మనః? కిం సుహృదామ్ ఇతి యో నావసీయతే?** (అధ్యా 26, శ్లో 19)

తల్లిదండ్రులు బిడ్డపుట్టగానే చూచి, మురిసిపోయి "**నా బిడ్డ! మా బిడ్డ...**" అని అందరికీ చూపి మురిసిపోతారు. అమ్మ వాత్సల్యంగా చూచి "నా గర్భంలో 9 నెలలు ఎదిగిన ఈ బిడ్డ నా గర్భవాసి కాబట్టి నాబిడ్డయే..." అని తలచి ఆనందబడిపోతుంది. కనుక ఈ దేహము అమ్మ యొక్క ఆస్థియా? తండ్రియొక్క ఆస్థియా? వారిద్దరి సొత్తా?

యుక్త వయస్సులో వివాహమౌతుంది. వివాహం జరిగిన పందిరిలో భార్య భర్తను చూచి స్పృశిస్తూ "ఈ పురుష దేహం నాది?..." అని అనుకొని సంతోషపడుతోంది. ఆ పురుషుడో "ఈ స్త్రీ దేహము ఇప్పుడు నాకు చెందినదే కదా! ..." అని ఆహ్లాదబడి పోతున్నాడు. కనుక స్త్రీ **దేహము ఆమె భర్తయొక్క ఆస్థియా? పురుష దేహము ఆ భార్య యొక్క ఆస్థియా**? వారిరువురి దేహాలు పరస్పరం ఒకరిది మరొకరి సొత్తా? సొంతదారు ఎవరు? (Is this body a belonging of Better-Half?)

ఒక యజమాని తన సేవకుని దేహము చూచి, "ఈతనిని జీత-భత్యాలు ఇచ్చి నియమించుకున్నాను కదా! నేను ఏమి చెప్పితే అది చేస్తున్నాడు. కనుక ఈ సేవకుని దేహము నాదే! ఇంకెవరూ ఈతనికి ఏ పనీ చెప్పటానికి వీలులేదు. ఈతడు నా మాటే వినాలి! ఇంకొకరి మాట వింటే నేనూరుకుంటానా? ..." అని తలుస్తున్నాడు. కనుక **ఈ దేహము ఆ యజమానిదా**? (Is the physical body of the servant a belonging of the master?)

ఒకానొకప్పుడు ప్రాణముపోయిన తరువాత బంధువులు ఈ భౌతిక దేహమును శ్మశానానికి తీసుకొనిపోయి కట్టెలతో కాలుస్తున్నారు? కనుక **ఇది అగ్ని దేవుని సొత్తా? శ్మశానికి చెందిన ఆస్థియా? కట్టెలయొక్క సొంతమా!** (Is this the property of Fire, fire-wood, or Burrial Ground?)

కొందరు చనిపోయిన తమ బంధువుయొక్క భౌతిక దేహమును అడవిలో విడచి వస్తున్నారు. జంతువులు-పక్షులు ఆ దేహమును ఆహారంగా మెక్కుచున్నాయి. కాబట్టి ఇది **కాకులయొక్క, కుక్కలయొక్క, గ్రద్దలయొక్క సొత్తా?** (Is this physical body a food stuff belonging to insects?)

లేక, **దేహము జీవునిదా?** నాది-నాది అని అనుకుంటూ దీనికి అందంగా వస్త్రధారణ చేసి, బొట్లు అలంకరించి ఊరు ఊరు త్రిప్పుచున్నాడు కదా! కాబట్టి **"నేను"** అను రూపముగల జీవునిదే అని అందామా? ఈ జీవుడేమన్నా ఈ దేహమునకు తానుగా కాళ్లు-చేతులు-పొట్ట-జీర్ణవిధానం అమర్చాడా? తానుగా ఒక వెంట్రుక అయినా మొలిపించాడా? పోనీ, ఏ తల్లి గర్భవాసం నుండి బయల్వెడలిందో-అది ఈ జీవునియొక్క నిర్ణయమా?

స్నేహితులు కొంతమంది వీడు మా వూరివాడే! మావాడేనండీ! మాజాతి వాడే! మా పాఠశాలలోని వాడే! అని చెప్పుకొంటూ ఆ మిత్రుని దేహమును తమసొత్తువలె చూస్తున్నారు. మరి **ఈ దేహము అటువంటి స్నేహితులదా?**

ఎంతగా ఆలోచించికూడా ఈ దేహమునకు సొంతదారు ఎవరని చెప్పాలి? ఎందుచేతనని చెప్పాలి? ఏ నిర్ణయానికి రాగలం? దేనిని కాదని తిరస్కరించగలం?

**ఇది ఇట్లా ఉండగా... మరొక విచిత్రమైన విషయం!**

"ఆహా! ఆ స్త్రీయొక్క ముక్కు పలువరుస - పెదిమలు - బుగ్గలు ఎంత అందం! ఎంత బాగున్నాయి.." అని పురుషుడు స్త్రీని చూచి అనుకుంటున్నాడు. ఇక స్త్రీయో "ఆ భుజములు! వాటి బలం! ఆ నుదురు! అద్భుతం! అబ్బో ఆ ముక్కుతీరు, ఆ కళ్ళు, ఆ పెదవులు, ఆ జుట్టు... ఎంత బాగున్నాయి! తనివితీరా చూడబుద్ధి అవుతోంది..." అని అనుకుంటోంది. ఇంతకీ అక్కడున్నదేమిటి? ఒకరిని మరొకరు చూచుకొని మురిసిపోతూ ప్రేమావేశంతో ముసి-ముసి నవ్వులు నవ్వుకుంటున్నది దేనిని గురించి?

- మలమూత్రములతో - చీము నెత్తురులతో నిండినది...,
- బొమికల అమరికను కప్పి ఉంచుచున్న చర్మము కలిగిఉన్నది....,

... ఇటువంటివాటితో కూడిన రక్తమాంస నిర్మితమైన శరీరములను చూచి, "ఆహాఁ! ఆ ముక్కు ఎంత అందమైనది? ఈ నుదరు! ఆమె బుగ్గలు! ఈతని పెదిమలు! నల్ల కలువల వంటి కళ్ళు! తెల్లటి జాతి రత్నాలతో పోల్చతగ్గ పలువరుసలు!..." ఇటువంటి

వర్ణనలు కవులు ఎట్లా చేస్తున్నారు? వాటిని వింటూ, చదువుతూ పాఠకులు ఎందుచేత రసాస్వాదులగుచున్నారో ... ఇప్పుడు నాకు అర్థమే కావటం లేదు. ఎందుకు దేనిని చూచి ఆ పరవశం?

**శ్లో॥ త్వక్ మాంస రుధిర స్నాయు మేదో మజ్జా అస్థి సంహతౌ**
**విణ్మూత్రపూయే రమతాం కృమీణాం కియదంతరమ్?** (అధ్యా 26, శ్లో 21)

చర్మము-మాంసము-రక్తము-క్రొవ్వు-మేదస్సు-మజ్జ-ఎముకలు-మలము-మూత్రము-చీము ... ఇటువంటి పదార్థములతో కూడిఉండే ఈ మానవదేహముల పట్ల "రమించాలి" అని భావావేశం పొందుచున్న స్త్రీ - పురుషులకు "ఇదే జీవితాశయం" అనుకునే వారిదేహాలకు...మల మూత్రములందు తిరుగాడే లద్దె పురుగుల దేహాలకు ఉన్న అంతరమేమిటి?

అందువలన...,

వివేకవంతుడైన మానవుడు స్త్రీ-పురుషుల శృంగార విశేషములతోను, శృంగార లంపటులతోను స్నేహము చేయనే చేయరాదు.

ఎందుకంటే... విషయేంద్రియ సంయోగముల వలన - ముఖ్యంగా శృంగారముచేత - మనస్సు చంచలమైనంతగా మరింకే విషయములోను చంచలము కాదేమో!

తదితర దృశ్య విశేషాలు- ఎదురుగా కళ్ళకు కనబడితేనే- మనస్సు కలత చెందుతుంది. ఈ సపరస్పర దేహాకర్షణ విషయములో... కొంచము చూచీ-చూడకపోయినా కూడా, ఆలోచించినంత మాత్రం చేతనే మనస్సు వికలమైపోగలదు. కనబడీ-కనబడకుండానే దేహాకర్షణలు ఊహ-అపోహలు కల్పించగలవు. ..

"ఆహాఁ! ఆమె నావైపే చూచి చిరునవ్వు నవ్వుతోంది.

ఓహో! ఈతడు నావంకే చూచి నా బుగ్గల సౌందర్యానికి ముగ్ధుడు అవుతున్నాడు.

అరె! ఆమె మాటలు నాపట్ల ఏదో ఇష్టమున్నట్లు సూచిస్తున్నాయి. ఊ! ఈతడు నా అందానికి ఆకర్షితుడు అవటంచేతనే కలుపుగోలుగా ఉంటున్నాడు..." ఇటువంటి అర్ధం పర్ధం లేని ఆలోచనలు-ఊహలు హృదయములోని "దేహాకర్షణ" అనే దోషంచేత అసందర్భ ప్రదేశములలో కూడా నిద్రలేపబడగలవు!

ఎవ్వడైతే ఇంద్రియ నిగ్రహమును అభ్యసిస్తూ ఉంటాడో... అట్టివాని మనస్సు మాత్రమే నిశ్చలమై, శాంతిని పొందగలుగుతోంది.

అందుచేతనే శృంగార సంబంధమైన దేహాకర్షణలకు, అట్టి ఆకర్షణలతో నిమగ్నమయ్యే సంఘటణ-సందర్భములకు  బహుదూరంగా ఉండటమే ఉచితం!

నేను ఈ ఊర్వసీ లోకమును అధ్యాత్మ జ్ఞాన శ్రేయస్సు కొరకై వెంటనే ఇప్పుడే త్యజించెదను గాక!

♦

**శ్రీకృష్ణుడు :** వింటున్నావా? ఉద్ధవా? రాజశ్రేష్ఠుడగు ఆ పురూరవుడు ఆవిధంగా విచారణ చేసి వెంటనే ఊర్వశీ లోకమును విడచిపెట్టాడు. **తనకు అభిన్నమును - పరమాత్మను** అగు నన్ను తెలుసుకొని జగద్విషయములను దాటవేయటానికి ఉపక్రమించాడు. తపో-ధ్యానములను పునః శ్రద్ధతో ప్రారంభించాడు.

క్రమంగా నా తత్త్వమేమిటో తెలుసుకున్నాడు! అజ్ఞానము నశించసాగింది. శాంతిని పొందాడు.

---

అందుచేత ఉద్ధవా! బుద్ధిమంతుడై పరమాత్మను తెలుసుకొనే ఉద్యమము ప్రారంభించువాడు మొట్టమొదటగా దుష్టవిషయాలతో, ఇంద్రియములను ప్రలోభపెట్టే సందర్భాలలో తనకు ఏర్పడియున్న సాంగత్యమును త్యజించనారంభించాలి.

సత్సాంగత్యమునందు ఆసక్తుడు కావాలి.

సత్పురుషులతో ఆధ్యాత్మిక సంబంధము పెంపొందించుకోవాలి. వారిని సేవించి సంతోషింప చేయాలి. అట్టి సత్పురుషులు తమయొక్క సదుపదేశములతో మనో వ్యాసంగమును, ఇంద్రియ వృత్తులను శమింపజేయగల సమాచారమును, ఉపాసనలను ప్రసాదిస్తూ ఆసక్తిని సన్నగిల్ల చేయగలరు.

కనుక సత్పురుషలను సదా ప్రతిరోజు ఆశ్రయించాలి.

---

**శ్రీ ఉద్ధవుడు :** సత్పురుషుల లక్షణములు ఎటువంటివి? వారు ఎట్లా ఉంటారు? ఎక్కడ వుంటారు? ఏమి చేస్తూ వుంటారు?

**శ్రీకృష్ణుడు :**

**శ్లో॥ సంతో అనపేక్షా మచ్చితాః ప్రశాంతాః సమదర్శినః**
**నిర్మమా నిరహంకారా నిర్ద్వంద్వా నిష్పరిగ్రహాః ॥ (అధ్యా 26, శ్లో 27)**

సత్పురుషులు....

నిష్కాములై ఉంటారు. ఏదీ కోరుకోరు. త్యజించరు. (తొలగాలి అనే ఆవేశము కలిగి ఉండరు). అదేదో కావాలి– ఇదేదో తొలగాలి – రెండింటినీ అధిగమించినవారై ఉంటారు.

- వారి మనస్సు – చిత్తము పరతత్త్వ స్వరూపుడనైన నాపైనే నిలిపి ఉంచుతారు. కనబడేదంతా శ్రీకృష్ణ చైతన్యానందంగా ఉపాసిస్తూ – ఆస్వాదిస్తూ ఉంటారు.
- ప్రశాంత చిత్తులై లోక సంఘటనలచే, సందర్భములచే స్పృశించబడనివారై ఉంటారు. చిద్విలాసులై–అసంగులై–అతీతులై ఇదంతా క్రీడా విశేషమాత్రంగా చూస్తూ వుంటారు!
- సమదర్శులై సర్వే సర్వత్రా ఆత్మ సాక్షాత్కారమే సందర్శిస్తూ ఉంటారు. మట్టిని చూచేవారికి – మట్టి బొమ్మల ఆకారముల దృష్టిచే కనిపించే – వేరు వేరైనదంతా కనిపించదు కదా! వారికి అనేకంగా కనిపిస్తున్నదంతా ఒక్కటిగా అనిపిస్తూ ఉంటుంది. ఇక, సంగతి–సంఘటనపూర్వకంగా చూచేవారికో?
- మనరాజు–శత్రురాజు–శత్రుసైనికులు... ఇత్యాది వ్యవహారాలు (ఆ బొమ్మలో) కనిపిస్తాయి.
- సత్పురుషులు – మమత్త్వ బుద్ధి లేనివారై ఉంటారు. "ఇది నాకు చెందినది. దీనికి నేను చెందినవాడను" అనే భ్రమను జయించినవారై ఉంటారు.
- అహంకార శూన్యులై ఉంటారు. జీవుడుగా నేను చీమకంటే కూడా గొప్పవాడిని కాదు. ఎందుకంటే చీమలో – చీమగా ఉన్నది నా ఉపాసనా వస్తువగు పరబ్రహ్మమే కదా! ఇక పరబ్రహ్మముగా అంతా నేనే... అనునది గమనిస్తున్నవారై ఉంటారు.
- అపరిగ్రహులై ఉంటారు. ప్రపంచంలో కనబడే దేనినీ స్వీకరించరు. స్వప్నంలో

కనిపించిన వస్తు జాలమును మూటకట్టుకొని జాగ్రత్తులోకి తెచ్చుకొంటున్నాడా, ఎవ్వడైనా?

ఓ ఉద్ధవా! అట్టి మహానుభావులు ఎల్లప్పుడూ నా అవతార కథలను, ప్రవచనములను, ఆ ప్రవచనముల అంతర్లీన గానాన్ని వింటూ-సంభాషిస్తూ-కీర్తిస్తూ ఉంటారు. నా అవతార కథలు శ్రద్ధతో వినుచున్న మానవుల పాపములను అవి నశింపజేయగలవు!

**శ్లో॥ తా యే శృణ్వంతి గాయంతి హి అనుమోదంతిచాదృతాః**
**మత్పరాః శ్రద్ధదానాశ్చ భక్తిం విందంతి తే మయి ॥**
**భక్తిం లబ్ధవతః సాధోః కిమ్ అన్యత్ అవశిష్యతే**
**మయ్యనంతగుణే బ్రహ్మణి ఆనందానుభవాత్మని ॥ (అధ్యా 26, శ్లో 29, 30)**

నా లీలలను శ్రద్ధగా-ఆదరముగా విని కీర్తించి తాత్త్వికార్థాన్ని అర్థం చేసుకొని నాయందు ఆసక్తి పెంపొందించుకోవటం చేత స్వభావసిద్ధమైన భక్తి-ప్రపత్తి పెంపొందుతూ వుంటాయి. సర్వసాక్షిని, అనంతగుణ విశేషుడను, చిదానందమయుడను, పరబ్రహ్మ స్వరూపుడను అగు నాయందు **భక్తి కలిగియున్న వానికి భక్తియే మహత్తరమైన ప్రయోజనం. ఆతనికి ఈ ముల్లోకాలలో కోరుకొనవలసినది, పొందవలసినది అంటూ మరింకేమీ ఉండదు.** అగ్నిని (దీపమును) వెలిగించేచోటు వేడిని వేరుగాఆహ్వానించాలా? చీకటిని పోగొట్టమని వేరుగా విన్నవించుకోవాలా? సత్పురుషులు చేతులెత్తి వివరిస్తున్న శ్రీకృష్ణచైతన్యానందమును పొందుచున్నవానిపట్ల కర్మబంధము, సంసార భయము, సంసారమునకు మూలమైన అజ్ఞానము వాటంతటఅవే స్వభావసిద్ధంగా తొలగిపోతాయి.

## సత్పురుషులతో సాంగత్యము

ఒకడు నీటిలో మునిగిపోతున్న తరుణంలో, ఆ మార్గంలో బహు దగ్గిరగా ఒక నౌక వస్తూ ఉంటే? ఆతనికి ఎంతటి ఆనందం! ఇక భయం - శ్రమ - ఆక్రందన- అన్నీ కూడా శమిస్తాయి కదా! "**ఓ నావ నడిపే పెద్దమనిషీ! రండి! నన్ను కాపాడండి!...**" అని మాత్రమే కేకవేస్తాడు కదా!

**అట్లాగే...,**

సంసార సముద్రంలో మునిగి తేలుచున్న మానవునకు శాంతచిత్తులు, బ్రహ్మవేత్తలగు

సత్పురుషుల సాంగత్యమే గొప్ప నౌక!

**అంతేకాకుండా,**

ఓ ఉద్ధవా! సత్పురుషుల వెంటనంటి నేనుంటాను! ప్రాణులకు అన్నము ఏవిధంగా రుచికరము-జీవనముకూడా అయి ఉంటోందో, శరణాగతులగు ఆర్తులకు సత్పురుషుల సాంగత్యము-నా రక్షణ ఆవిధంగా ఉభయతారకమై ఉండగలవు.

---

ధర్మమే పరలోకమునకు ధనము కదా!

ఆ రీతిగానే,

సంసారమున పడి, సర్వభయములు, వేదనలు పొందుచున్న జీవునకు సత్పురుషుల సాంగత్యము, వారు గుర్తు చేస్తున్నట్టి ఆత్మజ్ఞానము, బోధిస్తున భక్తి మార్గములే పరమరక్ష. వారే ఆర్త జన రక్షకులు!

సూర్యుడు ఉదయించగానే చీకటి పటాపంచలౌతుంది కదా! జనులు జగత్తును చూడగలుగుతారు కదా! అదేవిధంగా సత్పురుషులు పరమాత్మను దర్శించటానికి జీవులకు జ్ఞానచక్షువులను ప్రసాదిస్తున్నారయ్యా!

అట్టి సత్పురుషులే ఈ జీవునికి దేవతలు, బంధువులు, ఆత్మ కూడా అయి ఉన్నారు.

ఓ ఉద్ధవా!

**స్వయంగా నేనే సత్పురుషుల రూపముగా ఉన్నాను.**

కనుక ఓ జనులారా! సత్పురుషులను ఆశ్రయించటం నేర్చుకోండి. అహంకారమును వీడండి. మమకారమును త్యజించండి. సత్స్వరూపమగు మత్‌స్థానమునకు చేరండి!

---

ఓ మిత్రమా! ఉద్ధవా! ఆవిధంగా పురూరవుడు ఊర్వశితో సందర్శన-సరాగేచ్ఛను త్యజించాడు. ఇక అక్కడినుండి సత్సాంగత్యమును ఆశ్రయించాడు.

- ముక్త సంగుడైనాడు.

**ఆత్మారాముడై ఈ భూమిపై సంచరించాడు.**

# 41. క్రియా యోగము - అర్చనా విధి

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీ కృష్ణా! యాదవ శ్రేష్ఠా! భక్త జనాశ్రయా! దేవాది దేవా! వసుదేవనందనా! ఏ ఏ విధమైన భక్తులు, ఏఏ విధంగా... ఏఏ విధమైన క్రియా యోగం చేత నిన్ను అర్చిస్తూ ఉంటారో...

అట్టి ఆరాధనరూపమైన క్రియా యోగముల విశ్లేషణ - విశేషాలను వివరించండి!

"ఓ జనులారా! నాయనలారా! పరమాత్మను అర్చించండి! అదే మీకు శ్రేయస్సు కలుగ జేస్తుంది!..." అని మహనీయులైన నారదమహర్షి, వ్యాసభగవానులవారు, దేవతలకు ఆచార్యులైన బృహస్పతులవారు... మొదలైనవారంతా మాటిమాటికి ఎలుగెత్తి చెప్పుచున్నారు.

ఏ క్రియాయోగమైతే...,

- మీ ముఖారవిందమునుండి మొట్టమొదటగా వెలువడిందో..,
- మీచేత మీ పుత్రులగు బ్రహ్మదేవునికి బోధించబడినదో...,
- సృష్టికర్తయగు బ్రహ్మ దేవునిచే భృగువు మొదలైన సప్తర్షులకు తదితర మహనీయులకు చెప్పబడిందో, విశదపరచబడిందో...,
- ఆ తరువాత కొన్ని సందర్భాలలో భగవానుడగు శంకరునిచే, జగన్మాతయగు పార్వతీదేవికి బోధించబడిందో...,

**ఆ క్రియాయోగమును** నాకు చెప్పండి. నాకు బోధించండి.

మీయొక్క ఉపాసనయే సర్వవర్ణములవారికి, సర్వ ఆశ్రమములలోని వారికి, సర్వ స్త్రీ-పురుషులకు సర్వ శ్రేష్ఠమని, శ్రేయోదాయకమని నేను గ్రహిస్తున్నాను.

ఓ కమలనయనా! విశ్వేశ్వరా! విశ్వంభరా! మీకు భక్తులము, మీపట్ల అనురక్తులము అగు మేము కర్మబంధముల నుండి విడవడగల ఉపాయంగా చెప్పబడే క్రియాయోగము గురించి వివరించండి.

**శ్రీ కృష్ణభగవానుడు :** ఓ ఉద్ధవా! నీవు అడుగుచున్న క్రియాయోగము లేక భగవంతుని జేర్చగల కర్మకాండకు ఇది ఇంతమాత్రమే-అని ఒక పరిధిలోనికి తెచ్చి చెప్పలేము. అంతము లేదు. (వేదోఽనంతః) అందుచేత ఒకానొక పూర్వ-పర క్రమమును దృష్టిలో పెట్టుకొని కొన్ని కొన్ని విశేషాలు వర్ణించి చెప్పుచున్నాను. విను.

పరతత్వ స్వరూపడనగు నన్ను అర్చించే విధానాలు ముఖ్యంగా 3 గా విభజించవచ్చును.

1. వైదికము - (వేదోక్తమైనది - మంత్రములతో కూడినది.)

2. తాంత్రికము (భౌతిక సంబంధమైన విధి-విధానములతో కూడినది)

3. మిశ్రమము (మంత్ర-తంత్ర విధిపూర్వకమైనది.)

ఈ మూడింటిలో ఎవ్వరికి ఏది ఇష్టమని అనిపిస్తుందో వారు ఆ విధిని అనుసరించ వచ్చును. ఈ మూడింటినీ ఒక్కసారే కూడా అనువర్తించవచ్చు.

మొట్టమొదటగా...,

తన ఆర్హత - ఆచారము - అధికారములను అనుసరించి ఒకనొక సమయంలో "**ఈ రోజు నుండి శాస్త్ర విధిగా దైనందికమైన శ్రద్ధాసక్తులతో కూడినవాడనై ఈ ఉపాసనా క్రమములను అభ్యసిస్తాను. నిర్వర్తిస్తాను...**" అని నిర్ణయించుకోవటం ఉచితం. అదియే "ఉపనయన సంస్కారము" అని (లేక) ఉపనయన ప్రక్రియ అని శాస్త్రోక్తంగా - మంత్రతంత్రయుక్తంగా శాస్త్రకారులు సూచిస్తున్నారు. నియమిస్తున్నారు. ఇక ఆతడు నన్ను శ్రద్ధాసక్తులతో అర్చించటం ప్రారంభించు గాక! ఇప్పుడు ఆ సాధకుడు ద్విజుడుగా చెప్పబడతాడు. (One that is adapting II Phase)

## పూజ

ఆ ద్విజుడు (one who commenced second phase of life and shaping the routine with adoration) భక్తితో

ప్రతిమలయందు..., (లేక)

ఒకానొక భూస్థలమునందు..., (లేదా)

అగ్నియందు...,

సూర్యునియందు...,

జలమునందు లేదా తన హృదయమునందు

- ఎటువంటి కాపట్యము ( Artificiality) లేకుండా,
- విద్యుక్తములైన - పెద్దల ప్రవచనములను (లేక) శాస్త్ర విధి-విధానములను

అనుసరిస్తూ

- తన యొక్క స్వస్వరూపుడనే అయిఉన్న నన్ను తనకు ఇష్టమైన నామ-రూపాలతో పూజించటం ప్రారంభించాలి.

**శ్లో॥ పూర్వం స్నానం ప్రకుర్వీత ధౌతదంతో అంగశుద్ధయే**
**ఉభయైరపి చ స్నానం మంత్రైః మృత్‌గ్రహణాదినా ॥** (అధ్యా 27, శ్లో 10)

తెల్లవారుఝామున (బ్రాహ్మీ ముహూర్తంలో) నిదుర లేవాలి. దంత ధావనం చేసుకొని, దేహశుద్ధి కొరకై స్నానం చేయాలి. అటుతరువాత వైదిక-తాంత్రిక మంత్రములను ఉచ్చరిస్తూ - అనుసరిస్తూ మట్టి మొదలైన లేపనములతో మరల స్నానం నిర్వర్తించాలి.

ఆపై పరమేశ్వరుడనగు నాపై భక్తితో తమకు విహితము-అనుకూలము అయినట్టి వేదోక్త-శాస్త్రోక్త-ఆర్యోక్తమైన విధి విధానములతో "పూజ" అనే కర్మను - కర్మపాశములు త్రెంచుకోవటానికై - నిర్వర్తించాలి.

## ప్రతిమ

ప్రతిమ (లేక) విగ్రహము ఎందుకు? ధ్యాసను ఏకాగ్రపరచటానికే!

పూజకు ప్రతిమ సహకారికం కదా! అట్టి ఇష్టదైవము యొక్క ప్రతిమయొక్క వివిధ రీతులు - 8 గా చెప్పబడుచున్నాయి.

1. శిలామయము (Made up of stone)
2. దారుమయము (Made up of wood)
3. లోహమయము (బంగారు వెండి - పంచలోహాలు ఇత్యాదివాటితో తయారైనది. (Made up of some metal)
4. లేప్యము - చందనము మట్టి మొదలైన వాటితో తయారైనది. (Made of Chandana wood powders - Mud etc.,)
5. లేఖ్యము (Painting)
6. సైకతము (ఇసుకతో నిర్మించినది) (Made up of sand)
7. మనోమయము. (Visualized)
8. మణి మయము (Made of pearls)

ఈ విధంగా ప్రతిమలు ఈ ఎనిమిదింటిలో ఏదో ఒక్కటి (లేదా) కొన్ని సాధకుని మనో

అనుకూల్యతను అనుసరించి ఉండవచ్చు!

ప్రతిమ **చలము** (can be moved), **అచలము** (Embeded) అని రెండుగా ఉంటాయి.

ఆ ఉభయములు, పైన చెప్పిన 8 విధములైన ప్రతిమలు - నేను వేంచేసి ఉండే మందిరాలుగా భావించాలి! అచలప్రతిమ (un moved / embeded form) పూజించేడప్పుడు ఆవాహన-ఉద్వాసనలతో పనిలేదు.

అస్థిరమైన ప్రతిమలు (ఉదా : మట్టి ప్రతిమలు) ఉపయోగించేడప్పుడు కొన్నిచోట్ల ఆవాహన-ఉద్వాసనలు ఉంటాయి. మరి కొన్నిచోట్ల ఉండవు. పిండితో తయ్యారైన ప్రతిమలకు మాత్రం ప్రతిరోజు ఆవాహన-ఉద్వాసనలు తప్పక ఉంటాయి.

మృత్తికా ప్రతిమ - చిత్రలేఖనం (Form made up of mud-painted form) ఈ రెండిటికీ రోజూ జలంతో స్నానం చేయించఖర్లేదు. తుడిస్తే చాలు. తదితరములైన ప్రతిమలకు రోజూ స్నానము చేయించటం ఉచితం.

మరొక్క విషయం!

ప్రసిద్ధములై సులభంగా లభించే పదార్ధములతో గృహంలో ప్రతిమలు పెట్టుకొని పూజించటం ఉచితం. అంతేగాని, ఎప్పుడో ఎక్కడో (లేక) గొప్ప ఖర్చుచే లభించే పదార్ధాలగురించి తపనపడి అవి పొందనపుడు పూజకే ఉపక్రమించకపోవటం ఉచితము కాదు. **విగ్రహం నిగ్రహం కొరకు మాత్రమే!** నిష్కాముడైన భక్తుడు అనాయాసంగా లభించే పదార్ధాలతో నన్ను పూజిస్తున్నాడు. ఉత్తమమైన భావన-శ్రద్ధతో కూడిన ఉపాసన ముఖ్యము గాని "ఎంత ఖరీదైన - కష్టలభ్యమైన వస్తుజాలముతో పూజిస్తున్నాము?..." అనేది నాకు ముఖ్యము కాదు. భావనానుసారంగా నేను వేంచేస్తాను. అంతేగాని, వస్తుప్రాముఖ్యంబట్టి కాదు!

ఓ ఉద్ధవా!

ప్రతిమకు స్నానాదులు సమర్పించటం, పసుపు-గంధము-కుంకుమలతో, పుష్పాదులతో అలంకరించటం - ఇటువంటి కార్యక్రమములు నేను చాలా ఇష్టపడుతూ ఉంటాను.

మట్టితోను - కొయ్యతోను వేదికలు తయారుచేసి - అలంకరించి ఆ వేదికపై ప్రతిమను ఉంచి అంగప్రధానంగా అక్కడ పూజించటం నాకు ఇష్టం. అట్లాగే అగ్నిని నేయితో పూజించాలి. తిలలను, చందన పదార్ధములను సమర్పించటం కూడా నేను ఇష్టపడుతూ ఉంటాను.

సూర్యునికి అర్ఘ్యం ఇస్తూ గాయత్రీ, సూర్యస్తోత్రం-సూర్యసూక్తము - సూర్యకవచం మొదలైన మంత్రాలతో నన్ను ఉపాసించటం నాకు సంతోషం కలుగజేస్తాయి.

జలమునందు తర్పణ మొదలైనవాటితో కూడా నన్ను ఉపాసించవచ్చు. భక్తితో జలము సమర్పించినా సరే, నేను ప్రియముగా స్వీకరిస్తాను.

ఏదైనా భక్తితో సమర్పించాలి సుమా! భక్తిలేని పూజ పత్రిచేటు! భక్తి లేకుండా (without Devine Love) ఎవ్వడు ఎన్నెన్ని విశేష పదార్థాలు సమర్పించినా... అవన్నీ నాకు సంతుష్టిని కలుగజేయవు. భక్తితో లభ్యమయినంత వరకు సమర్పించే గంధ-పుష్ప-అక్షింతలు, ధూప-దీప-నైవేద్యాలకే నేను తృప్తిపడతాను. సంతోషిస్తాను. పెద్దగా చెప్పేదేమున్నది? ద్రవ్యములు - విధి విధానములు ప్రావీణ్యత-వీటన్నిటికన్నా నాకు భక్తి ముఖ్యము. నేను చూచేది - నేనుకోరేది - భక్తియే!

## ప్రతిమను నిలిపే విధానం :

పూజ చేయాలనుకునేవాడు ముందుగా తాను శుచి అవ్వాలి.

**శ్లో॥ శుచిస్సంభృత సంభారః పాగ్దర్భైః కల్పితాసనః**
**ఆసీనః ప్రాగుదగ్వార్చేత్ అర్చాయామథ సమ్ముఖః ॥** **(అధ్యా 27, శ్లో 19)**

- అర్పించువాడు ముందుగా చక్కగా శుచుడవ్వాలి.
- పూజా సామాగ్రిని సానుకూలంగా అమర్చుకోవాలి.
- దర్భాసనాన్ని తూర్పుదిక్కుగా ఉండేటట్లు అమర్చుకోవాలి. అనగా, పూజించువాడు తూర్పుముఖంగా ఆశీనుడవటం ప్రశస్తము. లేదా, ఉత్తరదిక్కుగా ముఖం ఉండేట్లుకూడా బాగే! ఏదిఏమైనా స్థిరప్రతిమకు ఎదురుగా కూర్చోవాలి.

మొట్టమొదట గురువులకు - దేవతలకు నమస్కారము సమర్పించాలి! **త్వదనుజ్ఞయా** అని వారి దగ్గిర అనుజ్ఞను అభ్యర్థన పూర్వకంగా తీసుకోవాలి.

| | | అంగన్యాసం | కరన్యాసం |
|---|---|---|---|
| తరువాత కరన్యాసం | - | అంగుష్ఠాభ్యాం నమః ... | హృదయాయనమః |
| | - | తర్జనీభ్యాం నమః .... | శిరసే స్వాహా |
| | - | మధ్యమాభ్యాం నమః .... | శిఖాయాయవౌషట్ |
| | - | అనామికాభ్యాం నమః ..... | కవచాయహుమ్ |
| | - | కనిష్ఠికాభ్యాం నమః... | నేత్రత్రయాయవేషట్ |

- కరతలకరపృష్టాభ్యం నమః... అస్త్రాయఫట్ **ఇతిదిగ్బంధం:**

అంగన్యాసం - దైవ ప్రతిమయొక్క పాదములు మొదలైన ప్రతిమావయవములను ఒక్కొకటిగా భక్తితో పూజించనారంభించాలి.

ప్రోక్షణపాత్రలోని జలముతో...

- ముందుగా పూజా స్థానమును (దేవం-దేవీం సంప్రోక్ష్య)
- తరువాత పూజార్థం తెచ్చియున్న పూజా ద్రవ్యములను (పూజా ద్రవ్యాని సంప్రోక్ష్య)
- ఆ తరువాత తన శిరస్సును - దేహమును (ఆత్మానం చ సంప్రోక్ష్య) సంప్రోక్షణ చేయాలి.

ఆతరువాత పరమాత్మ విగ్రహమునకు (ప్రతిమకు) ఎదురుగా కొంచెం దూరంగా 3 పాత్రలను ఉంచుకోవాలి.

1. పాద్యముకొరకు (పాదములు కడిగిన జలము జారవిడవటానికి)
2. ఆచమనీయము (స్వామి- ఓం కేశావాయ స్వాహా :: ఓం నారాయణాయ స్వాహా ఓం మాధవాయి స్వాహా :: అను మంత్రముతో త్రి ఆచమనముగా - స్వీకరించే జలము జారవిడవటానికి)
3. అర్ఘ్యము కొరము (స్వామి చేతులు కడిగే జలమును జారవిడవటానికి)

ఆ మూడు పాత్రలను క్రమంగా
హృదయ మంత్రముతోను (హృదయాయ నమః)
శిరో మంత్రముతోను (శిరసే స్వాహా)
శిఖా మంత్రముతోను (శిఖయాయ ఔషట్).
గాయత్రీ మంత్రముతోను (ఓం భూర్భువసువః మొదలైనవి) సంస్కరించాలి.

అటుతరువాత...,

**శ్లో॥ పిండే వాయ్వగ్ని సంశుద్ధే**
**హృత్ పద్మస్థాం పరాం మమ**
**అణ్వీం జీవకలాం ధ్యాయేత్**
**నాదాంతే సిద్ధభావితామ్ ॥** **(అధ్యా 27, శ్లో 23)**

స్వదేహమును పరిశుద్ధపరచుకొని పూజకు

- భౌతిక దేహమును (పాంచభౌతిక దేహమును) వాయువుతో నింపి శరీరమంతా అణువణువూ అగ్నిని భావనచేసి పరిశుద్ధం చేసుకోవాలి. ప్రాణాయామం ద్వారా దేహములోని అణువణువులోను వాయువుతో నింపి, స్థిరంగా ఉంచి ఉష్ణమును ఆహ్వానించి శుద్ధపరచుకోవాలి.
- హృత్ స్థానంలో హృత్ పద్మాసనముపై ఆహ్వానించబడిన పరమాత్మను భావనచేసి - ధ్యానించి - నమస్కరించి,
- నాదాంతము - ఓం = అ + ఉ + మ ...మ్మ్మ్ అకార-ఉకార-మకార-బిందు-నాదములనే ఐదింటిని వాగింద్రియము (నోటి) తోను, మనో భావముతోను ఉచ్చరించి
- సూక్ష్మాకారము-శ్రేష్ఠము-జీవకళాంసుడు అగు కేవల పరమాత్మను మనో హస్తములతో - మననం చేస్తూ ఉపాసించాలి.

ఆత్మరూపముచే ఆవాహితమూర్తిత్వము దేహమంతా వ్యాప్తము కాగా

- ఆ భగవత్ ప్రతిమామూర్తిని మానసికోపచారములతో పూజించి,
- **తన్మయమైన భావనతో** రెండుచేతల ముని వ్రేళ్ళతో బాహ్యావిగ్రహము (లేక) ప్రతిమ యొక్క పాదములను స్పృశిస్తూ, **తన్మయమైన భావనను** ఆ ప్రతిమలో ప్రవేశింప జేయాలి.
- ఆ ప్రతిమయందు ఆవిధంగా ఆహ్వానిస్తూ నన్ను స్థాపింపచేయాలి.

అటు తరువాత అంగన్యాస - కరన్యాసములతో ఆ ప్రతిమగా ఉన్న నన్ను పూజించాలి. వింటున్నావా! మిత్రమా!

ఇప్పుడు మానసిక పూజ కూడా ఇట్లా కొనసాగించాలి.

- ధర్మ-జ్ఞానాది-(జ్ఞానము-విజ్ఞానము-యోగము-ఉపాసన-సమర్పణ-దర్శన-స్పర్శన-ధర్మము-భక్తి) నవవిధ శక్తులతోను నాకు స్వీయ హృదయంలో ఆసనం కల్పించాలి.
- ఆ ఆసనంపై కర్ణిక - కేసరములతో సముజ్వలమైన అష్టదళముల పద్మమును కల్పించాలి.

- ఆ అష్టదళ పద్మముపై సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడనగు నన్ను వారివారి ఇష్ట దైవరూపంగా ఆసీనుణ్ణి చేయాలి.
- వేదోక్తములు - తంత్రోక్తములు అయినట్టి వివిధ మంత్రములతో పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము మొదలైనవి ఉపచారములను ఆ హృదయస్థ దేవ దేవునికి సమర్పించాలి.

అలా పూజించిన తరువాత..., నా గురించిన భావనగా...

- సుదర్శన చక్రమును,
- పాంచజన్య శంఖమును,
- గదను,
- ఖడ్గమును,
- బాణమును,
- ధనస్సును,
- హలమును,
- ముసలమును,
- కౌస్తుభమాలను,
- శ్రీవత్సమును

ఒక్కొక్కటిగా-స్థిరోభవ, వరదోభవ, సుస్థిరాసనం కురు,
మాకరుణాదృక్ ప్రసాదయ - మొదలైన మర్యాదపూర్వక వచన-భావనలతో
పూజించాలి.

ఆ పిమ్మట...,

ఎనిమిది దిక్కులలోను ప్రతిష్ఠేపించుచు...,

నందుడు : సునందుడు

ప్రచండు : చండుడు,

మహాబలుడు : బలుడు,

కుముదుడు : కుముదేక్షణుడు

అని పిలవబడే 8 పార్షదులను, (అష్టదిక్స్థాన అధిపతులను) ఎదురుగా గరుడుని

పూజించాలి.

ఆ తరువాత...

నాలుగు కోణములందు

- దుర్గాదేవి
- వినాయకుని,
- వ్యాసుని,
- విష్వక్సేనుని

ఎడమవైపుగా..., గురువులను

తూర్పు ఇత్యాది దిక్కులలో... ఇంద్రుడు, వరుణుడు, వాయవు, యముడు ఇత్యాది దేవతలను ప్రోక్షణము-పూలు-అక్షతలు.. ఇత్యాదులతో పూజించాలి.

"వీరందరూ కూడా తమతమ స్థానములయందు ఉండి నా యిష్టదేవతకు అభిముఖముగా ఉన్నారు..., నాపై కరుణను ప్రసాదిస్తున్నారు"... అని భావన చేయాలి!

అటు తరువాత...., ఇష్టదైవమును ఉద్దేశ్యించి

- సువర్ణమంత్రము - ఘర్మమంత్రముల ఉచ్ఛారణతో, "**జితతే పుండరీకాక్ష**", **సహస్ర శీర్షా పురుషః** మొదలైన పురుష సూక్తి ఇత్యాది మంత్రములను,
- "ఇంద్రం నరో నేమధితా హవంత" మొదలైన మంత్రోక్తమైన రాజసాది సామములను పఠిస్తూ...,

  చందనము - వట్టివేరు - కర్పూరము - కుంకుమ - అగరు

మొదలైన ద్రవ్యములతో, సువాసితమైన జలముతో భగవత్ ప్రతిమకు స్నానం చేయించాలి. పరిశుభ్రపరచాలి.

వస్త్రము - ఉపవీతము - ఆభరణము - పత్రరచన - తులసీమాల - పుష్పమాల - గంధము - అను లేపనము మొదలైనవాటిచే ప్రతిమను తగినవిధంగా అలంకరించాలి.

బెల్లము - పాయసము - నేతితో చేసిన పిండిపదార్ధాలు - చక్కెలములు - ఆపూపములు- ఉండ్రాళ్ళు - పులిహోర - పెరుగు - పప్పు మొదలైన పదార్ధములు నాకు సమర్పించాలి. భగవత్ విగ్రహాన్ని రోజూగాని (లేదా) పర్వదినాలలో గాని

- అభ్యంగన స్నానం చేయిస్తూ ఉండాలి.

- పరిశుభ్రపరచుకుంటూ ఉండాలి
- రంగు-మెరుపు దగధగ్గాయమానంగా ఉండేటట్లు చూచుకోవాలి.
- అభిషేక ద్రవ్యములు, భక్ష్య భోజ్యములు రుచికరమైనవి నైవేద్యంగా ఇస్తూ ఉండాలి.
- వేదములలో చెప్పినరీతిగా వేదికను వ్రేలాడే పూలు-ఆకులు-ఫలములతో మందిరము చుట్టూ అలంకారం చేయాలి.
- సమిధలను - వాటియొక్క చివరలను ఒకచోటికి ప్రోగుచేసి - అగ్ని గుండమును ప్రజ్వలింప చేయాలి!
- నిప్పు కణముతో కూడిన సమిధలను (పుల్లలను) రెండు - మూడింటిని దర్భలపై ఉంచటం అనే **అన్వాధానకర్మను** నిర్వర్తించాలి.
- హోమమునకు ఉపయోగపడే ద్రవ్యములను అగ్నికి ఉత్తర దిక్కుగా ఒకానొక వరుసగా ఉంచుకోవాలి.
- ప్రోక్షణ పాత్రలో ఉన్న జలముతో హోమద్రవ్యమును, ప్రజ్వలితమైన అగ్నికి సంప్రోక్షించి ఆ అగ్నియందు పరమాత్మయగు నన్ను ధ్యానించాలి.

అనగా...

- తప్తకాంచన వర్ణము (మిలమిల మెరిసే బంగారుఛాయగలది),
- చతుర్భుజములతో-చతుర్హస్తములతో శంఖ-చక్ర-గదా-పద్మములతో కూడియున్నది,
- పరమప్రశాంతము,
- పద్మమణివలె పచ్చనైన వస్త్రముతో శోభిల్లునది,
- శోభాయమానముగా వెలుగొందుచున్న కిరీటము-కంకణము-కటిసూత్రము-నూపురము మొదలైన ఆభరణములతో ప్రకాశించునది.
- శ్రీవత్సముతో కూడిన వక్షస్థలము గలది.
- ధగధగాయమానమగు కౌస్తుభమణిచే విరాజిల్లునది,
- వనమాలచే విభూషితము.

అగు నా రూపమును అగ్నియొక్క తేజస్సుతో ధ్యానించాలి. ధ్యానిస్తూ పూజించాలి. ఆవిధంగా ధ్యానిస్తూ నేయిలో ముంచిన సమిధలను (పుల్లలను) అగ్నియందు ఆహుతి చేయాలి. ఆ తరువాత రెండు-రెండు ఆహూతులతో హవనము చేయాలి. (నేయిని ప్రజ్వరిల్లుతున్న సమిధలపై పోయాలి). ఆ రెండు ఆహూతులను 1. ఆఘారము 2. ఆజ్యభాగము అను పేర్లతో చెప్పుతారు.

"ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరిని మొదలు - చివర ఉచ్ఛరిస్తూ హవనము నిర్వర్తించాలి. ధర్మదేవతకు - తదితర దేవతలకు **స్వాహా** అను శబ్దముతో అంతమగు మంత్రములతో నేయితో హవనము చేస్తూ పురుషసూక్త మంత్రములను గానం చేస్తూ ఉండాలి.

**శ్లో॥ అభ్యర్చ్యాథ నమస్కృత్య పార్షదేభ్యో బలిం హరేత్**
**మూలమంత్రం జపేత్ బ్రహ్మన్ స్మరన్ నారాయణాత్మకమ్ ॥** (అధ్యా 27, శ్లో 42)

ఆ తరువాత అగ్నియందు వేంచేసియున్న భగవానునిపూజించి, నమస్కరించి పాలు-తేనె-పళ్ళరసం ఇత్యాదుల నివేదనలను - బలిని సమర్పించాలి. నారాయణ స్వరూపమగు పరబ్రహ్మమును స్మరించి యథాశక్తిగా "ఓం నమో నారాణాయ" అను మూల మంత్రమును (11మార్లు :: 21మార్లు :: 36 మార్లు :: 54మారు :: 108మార్లు ... ఇట్లా అవకాశాన్ని అనుసరించి) జపించాలి.

**శ్లో॥ దత్త్వాఽఽచమనం ఉచ్ఛేషం విష్వక్సేనాయ కల్పయేత్**
**ముఖవాసం సురభిమత్ తాంబూలాద్యమథార్హయేత్ ॥** (అధ్యా 27, శ్లో 43)

ఆ తరువాత నివేదనానంతరం మిగిలియున్న కొన్ని మధుర పదార్థములను విష్వక్సేనునికి సమర్పించాలి. సుగంధయుక్తమైనటువంటి తాంబూలమును **ప్రతిగృహ్యతామ్**... అని పలుకుతూ ప్రేమతో సమర్పించాలి.

**శ్లో॥ ఉపగాయన్ గృణన్ నృత్యన్ కర్మాణి-అభినయన్ మమ**
**మత్కథాః శ్రావయన్ - శృణ్వన్ ముహూర్తం క్షణికో భవేత్॥** (అధ్యా 27, శ్లో 44)

పూజ అయిన తరువాత

- పరమాత్మయొక్క అవతారముల - భక్తుల కథలు గానం చేస్తూ
- పరమాత్మయొక్క మహిమను కీర్తిస్తూ,
- ఇతరులకు ఆ కథలను వినిపిస్తూ, తాను స్వయముగా (ఇతరులు చెప్పుచుండగా) వినుచూ,
- నా కర్మలను (చిన్ని కృష్ణుని ఆట-పాట-అల్లరి.. ఇత్యాదులను) అభినయిస్తూ,
- "ధీంత ధీంత తకతధీంత - తకత ఝుణత తక్కిటతక - తరికిటతక తళాంగు తద్ధిత్తకిటతకతరికిటతోం" - ఇటువంటి నృత్య శబ్దములకు లయగా నృత్యం చేస్తూ...

కొద్ది సమయము ఈఈ రీతి అయిన ఉత్సవపూర్వక ఉపాసనలు నిర్వర్తించాలి.

**శ్లో॥ స్తవైరుచ్చావచైః స్తోత్రైః పౌరాణైః ప్రాకృతైరపి**
**స్తుత్వా ప్రసీద భగవన్ ఇతి వందేత దండవత్ ॥ (అధ్యా 27, శ్లో 45)**

ప్రాచీనులచేత (Ancestral and Traditional)- నవీనులచే (Present time) గానం చేయబడిన ఉత్కృష్ట-అపకృష్టమగు (సంగీత-జానపద)- రాగములతో కూడిన స్తోత్రములతో నన్ను స్తుతిస్తూ... "దేవా! దేవాదిదేవా! ప్రసన్నుడవు అగుము" అని ప్రార్థించి సాష్టాంగదండ ప్రణామములు చేయాలి!

**శ్లో॥ శిరో మత్పాదయోః కృత్వా బాహుభ్యాం చ పరస్పరమ్**
**ప్రసన్నం పాహి మామీశ భీతం మృత్యు గ్రహార్ణవాత్ ॥ (అధ్యా 27, శ్లో 46**

నాయొక్క పాదయుగళమునందు శిరస్సును - నుదురును స్పర్శింపజేస్తూ చేతులతోను నా రెండు పాదములను స్పృశిస్తూ....,

"హే పరంధామా! దీనజనబంధూ! ఆర్తత్రాణ పరాయణా! నేను భీతుడను. నీకు శరణాగతుడను. అతి భయంకరము-మృత్యువుతో సమానము అగు సంసార సముద్రములో పడి మునిగిపోతున్న నన్ను కాపాడండి! ఉద్ధరించండి!" - అని ఎలుగెత్తి గానం చేస్తూ నమస్కరించాలి.

ఆవిధంగా ప్రార్థన చేస్తూనే నా నిర్మాల్యమును - అక్షితలను భక్తితో ప్రసాదభావనా పూర్వకంగా శిరస్సుపై ధరించాలి. వాటిని వదల దలచుకొంటే ప్రతిమయందు

అభ్యస్తమైయున్న జ్యోతిని మరల మరల తన హృదయమందు వేంచేసియున్న జ్యోతియందు లీనం చేస్తూ పూజించబడిన శిరోధార్యమైన పుష్పాక్షతలను హృదయముపై స్పృశింపజేసి ఒక పళ్లెములో విడవాలి!

**శ్రీ ఉద్ధవుడు :** స్వామీ! శ్రీకృష్ణ ప్రతిమ ఎట్లా ఏ రీతిగా ఉంటే...అది ప్రాసస్త్యం? ఏఏ దేవతా ప్రతిమలంటే నీకు ఇష్టం?

**శ్రీకృష్ణుడు :** (పకపక నవ్వుచూ) ఓ ఉద్ధవా! **నా భక్తునికి ఏది ఇష్టమైతే అదే నాకూ ఇష్టము. ఎప్పుడు ఎవరికి ఏ ప్రతిమయందు ఇష్టము కలుగుతుందో... అప్పుడు ఆ రూపముగల ప్రతిమతో నన్ను పూజించవచ్చు!** ఎందుచేతనంటే, నేను...

సర్వాంతర్యామినై - సర్వభూతములందు ఆత్మస్థుడనై, సర్వభూతజాలము అస్మదాత్మ యందు వేంచేసియే ఉండగా... సర్వప్రకాశకుడను (one who is exhibiting and manifesting as every thing) అయి ఉన్నాను కదయ్యా!

నాపై భక్తి-ప్రపత్తులచే కొందరు నా పూజ-ధ్యానము మొదలైనవాటికై మందిరములు నిర్మిస్తున్నారు. సుందరమైన ఉద్యానవనములను నిర్మిస్తున్నారు. పూజాదులు చక్కగా నిర్వహింపబడటానికి భూమిని, సంపదను సమర్పణ చేస్తున్నారు. నాకు సమర్పించబడిన సంపద ద్విగుణీకృతమై ఆ ప్రదాతయొక్క ఇహ-పరములను పవిత్రము-ఐశ్వర్యమయము చేయగలవు.

**శ్లో॥ ప్రతిష్ఠయా సార్వభౌమం**
**సద్మనా భువన త్రయం**
**పూజాదినా బ్రహ్మలోకం**
**త్రిభిర్మత్సామ్యతామి యాత్ ॥** **(అధ్యా 27, శ్లో 52)**

- విగ్రహ ప్రతిష్ఠచేత - సార్వభౌమ పదవి,
- మందిర నిర్మాణంచేత - త్రిలోకాధిపత్యము,
- పూజచే బ్రహ్మలోకము,
- ఈ మూడింటిచే నాతో సమానత్వము లభించగలదు.

# శ్రీరామ మానసిక పూజ

శ్రీరామ జయరామ – శ్రీకర శృంగార రామ
మా రామ రఘురామ – మానస పూజలను గొనుమ శ్రీరామ॥
అఖిలాంబర ముని నాయక – **ఆవాహన**మిదో మీకు
అఖిలలోక రక్షకా – **సింహాసన** మిదోమీకు
పాతక సంహరణ మీకు – **పాద్యమిదో** పాదములకు
అంతరాత్మ అమరవంద్య – **అర్ఘ్యమిదో** హస్తములకు
సతతదీనమందార – **స్నానమునకు** జలంబిదిగో
వ్రతఫల సంధానశీల – **వస్త్రయుగ్మ** మిదో మీకు
యదుకులావతార ధీర – **యజ్ఞోపవీత** మిదిగొమీకు
చతురానన జనకదేవ – **చందనం** బిదోమీకు
పూతచరిత పురుషోత్తమ – **పుష్పధామ** మిదోమీకు
అతి దయకర పతితపావన – **అగరుధూప** మిదోమీకు
కరుణాకర సుగుణధామ – **కర్పూరదీప** మిదోమీకు
నరమృగావతార ధీర – **నైవేద్యం** బిదోమీకు
దారుణదారిద్ర్య హరణ – **తాంబూలము** స్వీకరించు
నీరజాసనాది వినుత – **నీరాంజన** మిదోమీకు
మారకోటి సుందరాంగ – **మంత్రపుష్ప** మిదో మీకు
పరమపురుష రామచంద్ర – **ప్రదక్షిణం** బిదోమీకు

**శ్యామసుందర షోడషోపచారములను స్వీకరించు**
**కామేశ్వరదాస వరద –కరుణతోడ కైవల్యమొసగు ॥**
**శ్రీరామ జయరామ – శ్రీకర శృంగార రామ**
**మారామ రఘురామ – మాసపూజలను గొనుమ ॥**

(A Song sung by Sri Sri Kameswara Dasu)

చూచావా ఉద్ధవా!

నిష్కామ భక్తియోగంతో నన్ను అర్చించేవాడు నన్నే పొందుచున్నాడు. పూజ-మందిర నిర్మాణము విగ్రహ ప్రతిష్ఠలచే భక్తియోగము ప్రవృద్ధమౌతోంది.

## నేను సదా భక్త సులభుడను.

తనచే ఇవ్వబడినదిగాని - పరులచే ఇవ్వబడినదిగాని... అయినట్టి దేవాలయపు సొమ్ములను హరించువాడు, బ్రాహ్మణ విత్తము హరించువాడు - కోట్లాది సంవత్సరాలు మలమును భక్షించే క్రిమి-కీటకముల జన్మలు ఎత్తవలసి వస్తుంది సుమా! ఆవిధంగా అపహరించు వాడే కాదు! అతనికి సహకరించువాడు, ప్రేరేపించువాడు, ఆమోదించువాడు కూడా తనకు తానే అల్పజన్మలకు ఎర అగుచున్నాడు.

- నా భక్తులను, సాత్వికులను భాధించువాడు అల్పజన్మల రూపంగా నాచే శిక్షించ బడటానికి అర్హుడగుచున్నాడు.
- **నా భక్తులను సేవించువారు, వారికి సహకరించువారు, వారికి తనకున్న సంపదలో కొంత భాగము సమర్పించువారును నాకు ప్రియతములగుచున్నారు.**

## 42. యోగాభ్యాసోపాయాలు

**శ్రీకృష్ణుడు :**

**శ్లో॥ పర స్వభావ - కర్మాణి న ప్రశంసేత్ న గర్హయేత్**
**విశ్వమ్ ఏకాత్మకం పశ్యన్ ప్రకృత్యా పురుషేణ చ ॥ (అధ్యా 28, శ్లో 1)**

ఓ ఉద్ధవా! ఎదురుగా ఇంద్రియములకు తారసబడే దృశ్య ప్రపంచము, ఈ కనబడే విశ్వము - ఇదంతా కూడా -నిత్యము-అప్రమేయము-కేవలము-సత్-చిత్, ఆనందస్వరూపము అగు అఖండ-ఏకాత్మ యొక్క పురుష-ప్రకృతుల (Experience - experiences - perceiver - perception) కల్పనా సంయోగమే.

"ఈ కనబడే విశ్వ దృశ్యమంతా - ఇందులోని కాలాంతర్గత సంగతి-సంబంధము-సందర్భము-వ్యవహారములు, వాటి యొక్క స్థితి - గతి-నిర్గతులతో సహా అంతర్యామియగు పరమాత్మచే నిర్దేశితమైనదే కదా! శివాజ్ఞయే కదా!" అని గమనించినవాడు - గ్రహించినవాడు - అర్థము చేసుకొన్నవాడు ... దీనినంతా మౌనంగా

అతీతుడై హాయిగా చూస్తూ ఉంటాడు. ఇక్కడి శాంతము - ఘోరము మొదలైన స్వభావములను, వ్యక్తులను, సంఘటనలను చూస్తూ కూడా ఎవ్వరినీ - దేనినీ ప్రశంసించడు. నిందించడు! ఎవ్వడైతే ఇక్కడి స్వభావములను, కర్మవ్యవహారములను, సంఘటన-సందర్భములను

- ప్రశంసిస్తూనో...,
- వారిని - వీరినీ నిందిస్తూనో...

రోజులన్నీ గడిపివేస్తూ ఉంటాడో... అట్టివాడు అధ్యాత్మ శాస్త్ర పండితులచే - "ఈతడు అసత్యమునందు అభినివేశము కలిగియున్నవాడు" - అని చెప్పబడుచున్నాడు.

కథ చదువుతూ పాత్రల సంబంధ-కష్ట-సుఖములను చూచి ఆ పాఠకుడు సుఖమో-దుఃఖమో పొందటమేమిటి?

కలలో కనబడిన అద్దాలమేడ మెళుకువ వచ్చిన తరువాత "అయ్యో! లేదే? ఏమైయ్యింది? పోయిందా?" అని దుఃఖము - వేదన పొందటం ఎటువంటిది?

ఈ దృశ్య సంఘటనల గురించి ప్రశంసించటం, నిందించటం ఆత్మజ్ఞుల దృష్టిలో అటువంటిది!

ఎవ్వడైతే దేహ-గృహ-సంగతి-సంఘటనలపట్ల ఆసక్తిని పెంపొందించుకుంటూ రోజులు గడుపుచున్నాడో ఆతడు ఆత్మద్రోహి - ఇంద్రియములకు వశుడు-తెలివితక్కువగా తనకు తానే అగుచున్నాడు. ఆతడు స్వఅర్థము- సత్యములనుండి భ్రష్టుడగుచున్నాడు.

జాగ్రత్‌లో ఉత్సాహంగా ప్రవర్తిస్తూ దృశ్యానుభవముల వెంటబడుచున్న ఇంద్రియములు రోజులో కొంత సమయంలో నిద్రాణమగుచున్నాయి. అప్పుడు తైజసానుభవం (స్వప్నావస్థ) పొందుచున్న శరీరస్థుడగు జీవుడు స్వప్నరూపమగు మాయను తన హృదయమునందే కల్పించుకొని అనుభవిస్తున్నాడు. స్వప్నంలో కనిపించేదీ భ్రాంతియే! ఆ తరువాత స్వప్న మనస్సు కూడా లయంకాగా... అప్పుడు సుషుప్త్యస్థితి మృత్యువుతో (మృతానుభవముతో) సమానమే కదా! సుషుప్తిలో మౌనము-నిర్విషయము-అలౌకికము అగు నిర్విషయ వృత్తిని ఆస్వాదిస్తున్న ఈ ద్రష్ట (లేక) జీవాత్మ తిరిగి ఎప్పుడో మెళుకవవచ్చి జాగృత్‌లో ప్రవేశిస్తున్నాడు. ప్రవేశించి ఊరుకుంటున్నాడా? లేదు.

- ద్వంద్వాభినివేశి అయి,

- జాగృత్ దృశ్యములో సుఖదుఃఖములు, నిందా- ప్రశంసలు... దృశ్య-ద్రష్టత్వములు, మంచి-చెడ్డ, బంధము-ముక్తి మొదలైనవన్నీ ఒక్కసారిగా పొందినవాడై మరల స్వప్నదశ పొందేకొరకు జాగృత్‌లోనే అనుభవపరంపరలు కొనసాగిస్తున్నాడు.
- ఇదినాది. ఎవ్వరినీ రానివ్వను.
- వారు మంచివారు. వీరు చెడ్డవారు.
- వారు నావారు. వీరు కాదు.
- నావారి చెడుకూడా మంచియే!
- పరాయివారి మంచి కూడా చెడ్డయే!

ఇట్లా ఉంటున్నాయి, ఆతని స్వకల్పనా పరంపరలు! సుషుప్తిలో మౌనమువహించి అప్రదర్శితంగా వున్నట్టి ఇవన్నీ-జాగ్రత్‌లో మరల నిద్ర లేస్తున్నాయి. వాస్తవానికి ద్వైతముగా కనిపించేదంతా కూడా విక్షేపముచే అనుభవమయ్యే మిధ్యయే! - జాగ్రత్‌లో అయినా, స్వప్నంలో అయినా!

**శ్లో॥ కిం భద్రం? కిమ్ అభద్రం వా? ద్వైతస్య అవస్తునః కియత్?**
**వాచోదితం తదనృతం మనసా ధ్యాతమేవ చ ॥ (అధ్యా 28, శ్లో 4)**

ఇక్కడ వేరువేరుగా ద్వితీయముగా (రెండవదిగా) కనిపించే ద్వైతము మొదలే కలలో కనిపించిన రెండస్తుల అద్దాలమేడ వలె అవస్తువు అయి ఉన్నది. **ఇలలో కనిపించేదంతా కలలోని చమత్కారమువంటిదే?** ఇక ఇక్కడ భద్రమేమిటి? అభద్రమేమిటి? ఏది మంచి? ఏది చెడు? అటువంటి ప్రసక్తి మొదలే లేదు.

"కలలో కనిపించిన ఆతడు అట్లా ఎందుకున్నాడు? అదే కలలోని ఈతడు ఇట్లా ఎందుకున్నాడు?" - అనే ప్రశ్న-దాని సమాధానాలు... ఏముంటాయి? బంగారు ఆభరణంలో **ఆభరణము** అనే - బంగారమునకు వేరైన - వస్తువేదైనా ఉన్నదా? ఇక్కడ మాటలలో ఏభేద దృష్టులు చెన్నొందుచున్నాయో అవన్నీ - అదంతా వాక్ ఆడంబరము (కథలోని మహారాజు-తెలివిగల మంత్రివలె)... మాత్రమే! అనగనగా ఒక రాజు అని ఏదో కథ గురించి అనుకోగా-అనుకోగా... చెప్పుకోగా-చెప్పుకోగా ఆ పాత్రలు-స్వభావాలు ఉన్నట్లే జనులు భావించి... అందులోని ధర్మ-అధర్మాల గురించి వాదోప వాదములులు చేసుకోవటం వంటిది!

ఓ మిత్రమా! ఉద్ధవా! ఇక్కడ మనస్సుచేత చింతింపబడుచు, ఫలితంగా వాక్కుచేత

మాట్లాడబడుచున్నదంతా కూడా మిధ్యాభూతమే (Experience out of illusion) అయి ఉన్నదయ్యా!

- ఒకానొకాయన తెల్లటి గోడను చూస్తూ ఉండగా తన ఛాయ (Reflection of own form because of light from behind) కనబడితే దానిని చూచి "వీడెవ్వడో నావెంటబడ్డాడురోయ్..." అని అరవడం ఎటువంటిది?
- ఒకడు ఒక గుహలో ప్రవేశించి "ఓయ్" అని ధ్వనిచేయగానే "ఓయ్ ఓయ్ ఓయ్" అని ప్రతిధ్వనిస్తూ ఉంటే "ఆc! ఎవ్వడో ఈ గుహలో ఉండి నాతో మాటకు మాట అని నన్ను ఎగతాళి చేస్తున్నాడురా?..." అని అనుకోవడం ఎటువంటి చమత్కారం?
- ఒక ముత్యపు చిప్పను చూచి, "అబ్బో! ఇందులో వెండి ఉన్నదిరా?.." అని అనుకోవటం, ఇంటికి తీసుకువెళ్ళి కరిగించటం ఆరంభించటం ఏతీరైనది?

అవన్నీ మిధ్యయేకదా! మిధ్యయే అయి ఉండికూడా అవి భయము-మోహము- కోపము-ఆవేశము-విస్మయము (అజ్ఞానికి-విషయమేమిటో తెలియనివానికి) కలిగిస్తున్నాయి కదా?

అట్లాగే...,

ఈ భౌతిక దేహము మొదలైనవన్నీ మిధ్యావస్తువులే అయినప్పటికీ కూడా, ఈ జీవునికి ముక్తి కలిగేవరకు భయము-మోహము-విస్మయము మొదలైన సంసార సంరంభమును, సంసారానుభవములను కలుగజేస్తూ పోతున్నాయి.

**శ్లో॥ ఆత్మైవ తదిదం విశ్వం సృజ్యతే సృజతి ప్రభుః**
**త్రాయతే త్రాతి విశ్వాత్మా హ్రియతే హరతీశ్వరః ॥ (అధ్యా 28, శ్లో 6)**

పరమాత్మ ఈ విశ్వమునకు ప్రభువు, ఈ విశ్వమునకు ఆత్మ (విశ్వాత్ముడు) కూడా! అట్టి పరమాత్మ ఆత్మకు అభిన్నమైనటువంటి ఈ విశ్వమును సృష్టించుచున్నాడు. కర్త-భోక్త-క్రియ-క్రియా విషయం కూడా ఆత్మయే! అనగా ఈ విశ్వము ఆత్మస్వరూపము ఆత్మయొక్క విన్యాసము కూడా! విశ్వమునకు అభిన్నమైన విశ్వేశ్వరుడు...

- ♦ సృష్టించుచున్నాడు. స్వయముగా సృష్టిరూపుడు అగుచున్నాడు. అనగా సృష్టించబడుచున్నాడు కూడా!
- ♦ భావనలు రచిస్తున్నాడు. భావనలలో చిక్కుకుని వుంటున్నాడు.

♦ రక్షిస్తున్నాడు. రక్షింపబడుచున్నాడు కూడా!

♦ ఇదంతా ఆస్వాదిస్తున్నాడు. ఆస్వాదించబడుచున్నాడు!

♦ భ్రమిస్తున్నాడు - భ్రమింపజేస్తున్నాడు కూడా!

♦ దీనిని హరిస్తున్నాడు. హరింపబడుచున్నాడు కూడా!

♦ పునఃగా కల్పిస్తున్నాడు-కల్పన చేయబడుచున్నాడు.

ఈ విధంగా,

ఈ కనబడే సృష్టి అంతా ఇందులోని విషయాలు సందర్భాలు మొదలైనవి స్వతంత్రములైనవి కావు. అనగా అవన్నీ పరమాత్మకు వేరైనవి కావు. పరమాత్మయొక్క స్వయంకల్పిత భావనాతరంగ విన్యాసములే! అట్టి ఆత్మపట్ల (లేక జీవాత్మపట్ల) ఆధ్యాత్మిక - ఆధిభౌతిక - ఆధి దైవికమైన జ్ఞానమంతా - స్వప్నంలో ఒకానొకడు ప్రదర్శించే తెలివితేటలు (జ్ఞానవైశిష్ట్యము వలె) భ్రమరూపము - భ్రాంతియుక్తమేనయ్యా!

ఇదంతా త్రిగుణాత్మకమైనదేనని, త్రిగుణాత్మకమైనదంతా మాయయేనని గమనించు. మాయకు యజమానియో... జీవాత్మ స్వరూపుడై, క్రీడగా-లీలగా ప్రదర్శితుడు అగుచున్న **పరమాత్మయే! నేనే! ఈ సర్వ జీవాత్మలు - వారివారి అనేకరూపములైన దృష్టులు - ఇదంతా నాయొక్క ఒకనానొక అంశావిశేషమే!**

---

ఎవ్వడైతే నేను ఉపదేశిస్తున్న ఈ జ్ఞాన-విజ్ఞానయుక్తమైన వాక్యములను అన్వయించుకుంటూ స్వస్వరూపం-తన సహజరూపం గురించి తెలుసుకుంటాడో... ఇక ఆతడు ఎవ్వరినీ నిందించడు. స్తుతించడు. ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తూ తాను సర్వమును ప్రకాశింపజేస్తున్న లోకాలన్నిటికీ అతీతుడై, నిర్లిప్తుడై- అప్రమేయుడై- కేవలసాక్షి అయి చూస్తూ ఉంటాడు కదా! ఆత్మ తత్త్వముగా ఎరిగినవాడు సూర్యునివలె ఆరీతిగా సమభావసంపన్నుడై మెలగుతూ ఉంటాడు! ఇక్కడి విషయాల మధ్య ఉంటూనే వీటికి అతీతుడై, కేవలసాక్షియై, మౌని అయి ఉంటాడు!

ఓ ఉద్ధవా! ప్రత్యక్షము-అనుమానముల సహాయంలో "ఆత్మౌపమ్యేవ సర్వత్రా" అను ఆత్మానుభూతి సహాయం చేతను, శాస్త్రములు చెప్పే వివరణను చెవులతో విని బుద్ధితో గ్రహించుట చేతను

- ఈ జగత్తు మిధ్యమాత్రమే!
- ఇదంతా ఉత్పత్తి-వినాశన శీలము!
- మనోనుకూలము (అనగా) మనస్సు ఏరీతిగా ఉంటే, ఇది, అట్లే అనుభవమౌతుంది.

కాబట్టి ఇది ఇట్టిది అని ఏమీ చెప్పలేము అనిర్దేశ్యము...

**అని గ్రహించిన విజ్ఞుడు** నిస్సంగుడై-నిస్సంకోచుడై ఈ జగత్తులో వ్యవహరిస్తున్నాడు. లీలా వినోదంగా ఆస్వాదిస్తున్నాడు. **నేను చూస్తున్నది (జగత్) నాటకమే!** - అని గ్రహించి ఉన్నవాడు, "నాటకములోని సంఘటనలకు పాత్రధారుడు - చూచేవాడు కూడా అగు నేను సుఖదుఃఖాదులు పొందవలసిన అగత్యమేమున్నది?...." అని గమనిస్తున్నాడు. అజ్ఞులను ప్రశ్నిస్తున్నాడు.

## 43. సుఖ దుఃఖాలు ఎవరికి? ఎవరివి?

**శ్రీ ఉద్ధవుడు :** ప్రియ స్వస్వరూపాత్మ చైతన్య స్వరూపా! అవతారమూర్తీ! శ్రీకృష్ణయ్యా! నీవు కొంత వివరించి యున్నప్పటికీ మరల అదే ప్రశ్న ఒకటి నిన్ను అడగాలనిపిస్తోంది!

ఆత్మ-దేహముల కలయికచేతనే కదా. జీవుడు అనబడేది ప్రదర్శితం అగుచున్నది? అనగా, ద్రష్ట-దృశ్యములను ఆత్మస్వరూపుడగు జీవుడు పొందుచుండటం ఇక్కడ జరగుతోంది కదా! ఇప్పుడు చెప్పండి? సుఖ దుఃఖాలు ఎవరికి? ఎవరివి? ఎవరివలన? ఎందుకు? ఆత్మకా? దేహమునకా? అనుభవములగుచున్నాయి కాబట్టి ఉన్నట్లా? భ్రమ వంటివి కాబట్టి లేనట్లా?

ఈ ద్రష్ట-దర్శనముల చమత్కారము ఆత్మకు సంబంధించినదా? దేహానికి సంబంధించినదా? జీవుడు అనబడువానికి సంబంధించినదా? జగత్తుకు సంబంధించినదా? ఈశ్వరునిదా?

**శ్లో॥ నైవాత్మనో న దేహస్య సంసృతిః ద్రష్టృ - దృశ్యయోః**
**అనాత్మస్వదృశోరీశ కస్యస్యాదుపలభ్యతే?**

**శ్లో॥ ఆత్మా అవ్యయో అగుణః శుద్ధః స్వయంజ్యోతిరనావృతః**
**అగ్నివత్ దారువదచిద్దేహః కస్య ఇహ సంసృతిః?** (అధ్యా 28, శ్లో 10, 11)

ఆత్మ స్వతఃసిద్ధంగానే జ్ఞాన సంపన్నము. అవినాశనము. అవ్యయము (మార్పు-చేర్పులు లేనిది). గుణాతీతము. శుద్ధము. అగ్నివలె స్వయంప్రకాశము. ఆవరణశూన్యము (దేనిచేతా ఆవరించబడేది కాదు). అందుచేత - సుఖ దుఃఖాలు ఆత్మకు కలుగుచున్నాయి అని, (లేక) సుఖ దుఃఖాలు ఆత్మవి... అని అనటానికే వీలే లేదు. **ఆత్మ సర్వదా అప్రమేయమే కదా!**

ఇక ఈ భౌతిక దేహానికి వచ్చి పరిశీలిస్తే? ఈ దేహము జడము. స్వతఃగా కదలలేదు. ఆత్మ స్వరూపుడగు దేహియొక్క చైతన్య విన్యాసముచే మాత్రమే కదలుతోంది. ఒక కట్టెవలె జడమైనది. కనుక **సుఖ-దుఃఖములు జడదేహమునకు కలుగుచున్నాయని గాని, సంబంధించినవనిగాని అనలేము**. ఆత్మ కదలించునది. దేహము కదలునది. సుఖ-దుఃఖాది అనుభవాలు ఈ రెండిటిలో దేనివి? దేనికియు లేక, ఈ రెండుకాక, సుఖ దుఃఖాలకు సొంతదారు మరొకటేదైనా వున్నదా?

**శ్రీ కృష్ణభగవానుడు :** ఈ ప్రశ్న మరొక్కసారి నీవు అడగటం ఉచితమే! సందేహాలు పూర్తిగా తొలగాలి కదా! విను!

**శ్లో॥ యావత్ దేహ-ఇంద్రియ-ప్రాణైః ఆత్మనః సంనికర్షణమ్**
**సంసారః ఫలవాం తావత్ అపార్థోఽపి అవివేకినః ॥ (అధ్యా 28, శ్లో 12)**

ఓ ఉద్ధవా! ఆత్మకు దేహ-ఇంద్రియ-ప్రాణములతో ఎంతెంతవరకైతే సంబంధము ఉంటుందో... అంతంత వరకు అవివేకులైన పురుషులకు మిథ్యాభూతమైన ఈ ప్రపంచము "**సత్యమే కదా!**" అనువిధంగా **స్ఫురిస్తూ** ఉంటుంది! అట్లు అనిపించటమే **సంసారము** అను శబ్దముచే చెప్పబడుతోంది.

వివేకముచేతనో, "**ఈ ప్రపంచము స్వప్నసదృశమే! మిథ్యయే! ...**" అని తెలియవస్తోంది. అప్పుడిక సంసారము అని చెప్పబడే దానియొక్క ఊసైనా ఉండదు!

ఒకాయన సుష్ఠుగా తిని, తాంబూలం సేవించి హాయిగా నిద్రకు ఉపక్రమించాడు. నిద్రలో ఏదో స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో ఆతడు బాటలో వెళ్ళుచుండగా ఒక పులి- ఒక విషసర్పము, వెంటబడ్డాయి. ఇక ఆ పెద్ద మనిషి భయగ్రస్తుడై కేకలు వేస్తూ... పరుగులు తీయసాగాడు.

ఇప్పుడు చెప్పు! ఆతనికి అంతటి భయము ఎందుకు కలిగింది? ఎవరివలన కలిగింది? బయటనుండి ఎవ్వరైనా ఆతనిమీద కోపంతో ఆతని స్వప్నములోనికి పులిని-

విషసర్పమును తీసుకొచ్చి పెట్టారా? లేదే? మరి? ఆ స్వప్న ద్రష్టయొక్క స్వప్నభావన చేతనే పులి-విషసర్పము కల్పించబడ్డాయి. స్వప్న భావన చేతనే ఆతడు వాటిని చూచి భయపడుచు గజ గజ వణుకుచు (స్వప్నంలోనే) బాటలలో పరుగులు తీస్తున్నాడు! అంతాకూడా స్వయంకృతమే! మరింకెవరికీ పాత్రయే లేదు. మెళుకువ వచ్చిన తరువాతనో "పులి లేదు. విషనాగు లేదు! అంతా నా ఊహయే! భ్రమయే! నాయొక్క కల్పనయే!..." అని ఆతడు ఎవ్వరూ చెప్పకుండానే తెలుసుకుంటున్నాడా, లేదా? లేక, "ఓ మిత్రులారా! నా కలలోకి పాము వచ్చింది! చంపుదాం రండి!..." అని (నిదురలేచిన తరువాత) పిలుస్తున్నాడా? లేదే!

అట్లాగే...,

కలలో కనబడిన పులి-పాము మిధ్యయే అయినప్పటికీ చూడటం వలన ఏర్పడిన కలలోని భయంలాగానే..., స్వకీయ భ్రమ-కల్పనలచేత ఆశ్రయించబడిన విషయచింతన యందు వ్యాకులత చెందినట్టి (లేక) పొందినట్టి ఆత్మకు మిధ్యామాత్రము (Merely illusion / ideation / own Mind - Making) అయిన సంసారము - వాస్తవానికి మిధ్యయే అయి ఉండి కూడా - అవివేకమువలన సత్యమువలె స్ఫురించటం జరుగుతోంది!

కలగంటున్నవానికి కలలో ఎన్నో అనర్ధమైన-అర్ధరహితమైన స్వప్నదృశ్య పదార్ధాలు కనిపించవచ్చు గాక! మేలుకొన్న తరువాత కలలో కనిపించినవి మోహమును కలుగజేయలేవు కదా? నిద్ర లేచిన తరువాత "కలలో కనిపించిన నా భవనము ఏమైనది?" అని ఎవ్వడైనా జాగ్రత్‌లో వెతుకుతాడా? జ్ఞానము అనే మెలుకవ తెచ్చుకొన్నవానికి దృశ్య మోహము అనే జాడ్యము ఉండదు! "ఈ లోకాలేమిటి? నేనేమిటి? వారేమిటి? వీరేమిటి" - అనే ప్రశ్నలే ప్రశ్నించటానికి అనర్హమౌతున్నాయి.

ఆత్మ ఒకానొకప్పుడు అనిర్వచనీయ కారణంగా అహంకారము అనే ద్వైతము (ద్వితీయత్వము)ను ఆశ్రయిస్తోంది. అది లీల-క్రీడ (సరదా) అని అనవచ్చునేమో! అహంకార కారణంగా దేహాభిమానము అను కార్యము రూపు దిద్దుకుంటోంది.

అట్టి అహంకారము, దేహాభిమానము యొక్క క్రియావిశేషాలే శోకము-హర్షము-భయము-క్రోధము-లోభము-మోహము-స్పృహ-జననము-మరణము.... ఇత్యాదులన్నీ కూడా! అనగా... అవన్నీ అహంకార కార్యములు! దేహాభిమాన కార్యములు. ఆత్మకు వాటితో సంబంధము లేదు. జడమగు దేహానికీ వాటితో సంబంధము లేదు.

## దేహాదుల అభిమాని

**శ్లో॥ దేహేంద్రియ ప్రాణమనో అభిమానో**
**జీవో అంతరాత్మా గుణకర్మ మూర్తిః**
**సూత్రం మహానిత్యురుధేవగీతః**
**సంసార ఆధావతి కాల తంత్రః ॥ (అధ్యా 28, శ్లో 16)**

ఈ జీవుడు వాస్తవానికి అంతరాత్మానంద స్వరూపుడే! గుణ-కర్మలకు యజమానియే గాని బద్ధుడు కాడు. సూత్రాత్మ స్వరూపుడు! (అనేక పూలతో గ్రుచ్చబడిన పూదండలోని దారమువంటి స్వరూపుడు) నిత్య-సత్య-బుద్ధాత్ముడే! ఎందుకంటే- ఈ జీవుని సహజస్వరూపము సర్వదా అప్రమేయమగు ఆత్మయే! అయితే ఏ జీవుడైతే తన సహజానంద రూపమును ఏమరచి దేహాభిమాని - మొదలైనవి అగుచున్నాడో..., ఆ అభిమానమే ఇవన్నీ పొందుతోంది!

దేహాభిమాని - భౌతిక దేహము నాకు అవినాభావ సంబంధము ఉన్నది అని తలచువాడు.

ఇంద్రియాభిమాని - కనిపించేవి - వినిపించేవి - తదితర శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాదుల పట్ల "నావే! నాకు కావాలి - నేను వీటికి చెందినవాడను. ఇవి నాకు చెందినవి" అని భావించువాడు.

ప్రాణాభిమాని - ప్రాణములకు (శక్తికి) సంబంధిచిన వాడను. ప్రాణములుంటేనే నేను. లేకుంటే లేను... అని ప్రాణములతో అవినాభావావేశము పెంపొందించుకొని ఉంటున్నవాడు. "ప్రాణాలు పోతే నేనూ పోతాను..." అని ఉద్వేగాభిప్రాయము కలిగి వుంటున్నాడు.

మనో అభిమాని - మనస్సుయొక్క ప్రియాప్రియత్వము-చంచలత్వము మొదలైన లక్షణములు తనకు సంబంధించినవిగా భావించువాడు. మనస్సులో చేరుచున్న అనుభూతులు, అభిమానాలు, సుఖదుఃఖ భావాలు తన స్వరూప-స్వభావాలుగా భావించువాడు.

అట్టి దేహ - ఇంద్రియ - ప్రాణ - మనో అభిమాని మహాసూత్ర నరకము చేరుచున్నాడని చెప్పబడుచున్నాడు. అనగా కాలమునకు అధీనుడై అజ్ఞానముచేత సంసారారణ్యములో

తిరుగాడుచు దేహ–మనో–బుద్ధి–చిత్త– లక్షణాలను అప్రమేయమగు ఆత్మపై ఆపాదిస్తూ తత్ఫలితంగా అనేక ఉపాధిపరంపరలు పొందుచు–విడచుచు తన్మయుడౌచున్నాడు.

**శ్రీ ఉద్ధవుడు :** కృష్ణయ్యా! మీరు చెప్పే అహంకారము – సంసారము అనువాటియొక్క వాస్తవ స్వరూపమేమిటి? అవి ఎట్లా, ఎందుచేత ఎప్పటి నుండి ఏర్పడినవై ఉంటున్నాయి? ఎందుకు ఆత్మానంద స్వరూపుడగు ఈ జీవుని తమవైపు ఆకర్షించి నిబద్ధునిగా చేస్తున్నాయి?

**శ్రీకృష్ణుడు :** ఓ ప్రియ ఉద్ధవా! వాస్తవానికి అహంకారమునకుగాని, అహంకారము కలిగిస్తున్న బంధమునకుగాని, ఆ బంధము వలన ఏర్పడే **సంసారము** అను శృంఖలాలకుగాని వాస్తవమైన రూపం అంటూ ఏదీ లేదు. ఒక మూలము (A source where from they come out) అనునది కూడా ఏదీ లేదు. **అజ్ఞానమే అన్నిటికీ కారణం!**

అహంకార రూపమగు సంసారము అనుదానికి ఉనికి అంటూ ఏదీ లేకపోయినప్పటికీ... అది జీవుని అజ్ఞానకారణంగా–గారడివాడు చూపే లేనివస్తువు వలె– అనేక రూపాలుగా వెల్లడి అవుతోంది. పరవశం కలుగజేస్తోంది.

మనస్సు–వాక్–ప్రాణ–శరీర–కర్మల ద్వారా సంసారము రూపుదిద్దుకొని పరిణితమౌతోంది. సాధకుడగు మౌని అహంకారరూప సంసారము కలుగజేసే నిమ్నగతులను గమనించి విజ్ఞుడగు గురువును ఆశ్రయిస్తున్నాడు.

"నేనెవరు? అహంకార దోషం ఎక్కడినుండి వచ్చింది? సంసారము అనగానేమి? ఇది ఎట్లా రూపుదిద్దుకొంటోంది? నేను తరించగల మార్గమేమిటి?" – అను ప్రశ్నలతో గురువుకు శరణువేడుచున్నాడు. గురువులు ఉపదేశిస్తున్న తత్–త్వమ్ అనబడు తత్త్వ శాస్త్ర ప్రవచనాలను, వేదాంతశాస్త్ర విశేషాలను వింటున్నాడు. ఆకళింపు చేసుకుంటున్నాడు. గురూపదేశముచే అతితీక్షణమైన–పదునైన జ్ఞానాసి (జ్ఞాన ఖడ్గము)ను సంపాదించు కుంటున్నాడు. హృదయములోని లౌకికసంబంధమైన వాసనలను ఛేదించివేస్తున్నాడు. ఆత్మజ్ఞానియై ఆత్మతత్త్వమునందు ప్రశాంతంగా, హాయిగా సంచరిస్తున్నాడు. అప్పుడిక సంసారమనబడేది ఆతనికి ఆతనియొక్క భావసంబంధమైన **లీల–క్రీడ–ఆత్మ విన్యాసం** అవుతోంది! ఆత్మ – అనాత్మ వివేకమే జ్ఞానము!

జగత్తు అనబడేదానియొక్క మొదలు – చివర ఏమై ఉన్నదో.... అదే వర్తమానంలోకూడా

అయి ఉన్నది. మొదలు – చివర అనేకము లేదు. మధ్యలోనూ లేదు! ఆత్మయే జగద్రూపంగా మనస్సుచే ఆస్వాదించబడుతోంది. బంగారు ఆభరణములన్నీ బంగారమే కదా! జీవులందరు (మనో–బుద్ధి–చిత్త–అహంకారాలతో సహా) ఆత్మయొక్క ప్రత్యక్ష స్వరూపులే! ఆత్మ సర్వదా యథాతథము, అఖండము, అప్రమేయము, ఆనందస్వరూపము.

**"ఈ జగత్తు కూడా సర్వదా ఆత్మ స్వరూపమే!"** – అనునది ఆయా ప్రమాణములద్వారా నిరూపమణ మగుచున్నది.

ప్రమాణములు – వేద ప్రమాణము
– గురూపదేశ ప్రమాణములు
– ఇతిహాసముల ప్రమాణములు
– కాలము
– హేతువు (Reasoning) ప్రమాణము
– అనుమానము

బంగారు నాణెమును ఒక ఆభరణంగా తయారుచేసి, చాలాకాలం ధరించి, దానిని కరగించి తిరిగి బంగారపు నాణెముగా మార్చామనుకో! అనగా... బంగారము ఆభరణంగా ఉన్నపుడు ఆభరణాకారం తొలగించినప్పుడు కూడా బంగారమే అయిఉన్నది కదా! అయినా కూడా – బంగారు లోహము (Gold Metal) బంగారు ఆభరణము (ornaments) అనే పదాలు ప్రయోగిస్తాము. ఆభరణములను కూడా ఇవి బంగారు గాజులు. ఇవి బంగారు గొలుసులు ఇత్యాది మాటలు(శబ్దాలు) చెప్పుకుంటాము. ఆభరణములు బంగారము కానిది ఎప్పుడు? అట్లాగే...

❖ ఈ విశ్వమునకు కారణభూతుడును విశ్వేశ్వరుడను–విశ్వరూపుడను (బంగారము ఆభరణమునకువలె) నేనే!
❖ నాకంటే భిన్నంగా విశ్వము లేదు. జీవులు లేరు! జగత్తు లేదు!
❖ జాగ్రత్ – స్వప్న – సుషుప్తి మూడు అవస్థలు,
❖ ఆ మూడు అవస్థలకు (అవస్థాత్రయము) కారణభూతంగా చెప్పబడుచున్న సత్త్వ – రజో – తమో త్రిగుణములు (గుణత్రయము),
❖ ఆ మూడు అవస్థలతో కూడిన మనస్సు,
❖ త్రిగుణములబనడే కారణమునకు కార్యభూతమైన స్వర్గ–భూ–పాతాళములనబడే త్రివిధ జగత్తులు,

♦ ఆధిభౌతిక - అధిదైవిక - అధ్యాత్మకములనబడే త్రివిధ తాపములు,

ఇవన్నీ నాయొక్క తురీయ చైతన్యము యొక్క బహురూప చమత్కారములే! సమాధి-అసమాధులకు **కేవలసాక్షి అయిన బ్రహ్మము మాత్రమే సత్యము**. మిగిలినవన్నీ కల్పితము- వికారోనామధేయములు! జగన్మిథ్యా! **అట్టి పరబ్రహ్మమే నేను!**

♦ ఈ జీవుడు తరంగమైతే పరబ్రహ్మము జలము వంటిది (యో౽పా మాం యతనమ్ వేదా)

♦ ఈ జీవుడు ఆభరణమువంటివాడైతే పరబ్రహ్మము బంగారు లోహము వంటిది.

అనగా...,

ఈ జీవుడు పరమాత్మ అనే తత్త్వముయొక్క ఆభరణ స్వరూపము.

ఒక ముఖ్యమైన విషయం!

ఏదైనా ఒకానొక వస్తువు నాకు వర్తమానంలో నామ-రూపాత్మకంగా కనిపిస్తున్నప్పటికీ... అది మొట్టమొదట (సృష్టికి ముందు) లేనిది - ప్రళయంలో లేకుండా పోవుచున్నది అయి ఉంటే... అట్టిది స్థితికాలంలో కూడా మూలపదార్థం కంటే వేరు కాదు. బంగారు ఆభరణము బంగారమునకు మధ్యలో వచ్చి కనబడుచున్నప్పటికీ... ఆ ఆభరణము బంగారమే అయి ఉన్నది కదా!

ఏ పదార్థము దేనినుండి పుట్టుచున్నదో, దేనిచే ప్రకాశితం అగుచున్నదో అదియే ప్రకాశిత వస్తువుయొక్క పరమార్థ సత్యమై యున్నది.... అనునది వేదాంతశాస్త్ర ప్రవచన సిద్ధాంతము.

♦ స్వప్నంలో కనిపించేవన్నీ స్వప్న చైతన్య స్వరూపమే!

♦ జాగ్రత్‌లో కనిపించేవన్నీ జాగ్రత్ చైతన్య స్వరూపమే!

ఈ జగత్తు మొట్టమొదట బ్రహ్మమే! లయించిన తరువాత బ్రహ్మమే! కనుక, వర్తమానంలో కూడా ఇదంతా బ్రహ్మమే! పరమాత్మ స్వరూపమే!

♦ జగత్తు జగదీశ్వర స్వరూపమే!

♦ విశ్వము విశ్వేశ్వరరూపమే!

♦ దృశ్యము ద్రష్ట యొక్క స్వరూపమే!

♦ ద్రష్ట దృక్ స్వరూపమే! (ఆ ద్రష్టను చూచువాని స్వరూపమే!)

♦ దృక్–ఆత్మస్వరూపమే!

బ్రహ్మముయొక్క సమక్షంలో జీవుడు అనే పరిణామము ఏనాడు వాస్తవానికి లేనేలేదు. జీవుడు అనే వికారము మొదలే లేకపోయినప్పటికీ జీవుడు – ఆతని అనుభమైనట్టి ఈ దృశ్యజగత్తు – ఉన్నట్లే **అగుపిస్తోంది.** (అజ్ఞాన దృష్టికి) **అనిపిస్తోంది!**

ఆవిధంగా వాస్తవంగా లేకున్నప్పటికీ ఉన్నట్లే అనిపించటమును రాజసికదృష్టి (లేక) రాజసిక సృష్టి – అని పిలుస్తూ ఉంటారు. ఇదంతా సదా సర్వదా స్వయం ప్రకాశమగు బ్రహ్మమే! బ్రహ్మము రజోగుణమును తనకుతానుగా ఉత్తేజ పరచుకొనుచున్నప్పుడు జగదనుభవము అనునది బయల్వెడలటం జరుగుతోంది!

కనుక ఇంద్రియములు, పంచతన్మాత్రలు, మనస్సు, పంచమహాభూతములు అనే రంగు రంగులచే చిత్రించబడిన – చిత్రితమైన ఈ విశ్వమంతయు బ్రహ్మమే! వేదము–ప్రత్యక్షము – ఉపదేశము – అనుమానము మొదలైన మీమాంసా విభాగులు సుస్పష్టముగా "ఇదంతా బ్రహ్మమే! మనయేవ ఇదమాప్తవ్యం!" అని యుక్తియుక్తంగా నిరూపిస్తూ వస్తున్నాయి. ఇక సందేహం దేనికో చెప్పు!

సద్గురూపదేశముచేత "ఈ దేహమే నేను – వారు తదితర దేహములు..." అను దేహాత్మ భావన స్వయంగా తొలగిపోగలదు. కనుక ఓ జనులారా! మీరంతా ఆత్మానంద పరితుష్టులు అవండి! కామపరతంత్రములగు ఇంద్రియములు – ఇంద్రియ విషయముల నుండి ఉపరతులు (withdrawn) అవండి! ఇంద్రియార్ధములు–మనో–బుద్ధి–చిత్త–అహంకారములు దాటివేయండి.! అవన్నీ ఆత్మకు ఎందుకు అభిన్నమో గమనించండి!

ఆత్మ కేవలసాక్షి! సర్వమునకు యజమాని! రాజాధిరాజు! అందుచేత...

భౌతికమైన ఈ దేహము ఆత్మకాదు. అదేవిధంగా..,

ఈ ఇంద్రిములు, వాటికి అధిష్ఠాతలైన దేవతలు, ప్రాణములు, బుద్ధి, మనస్సు, చిత్తము, అహంకారము ఇవన్నీ కూడా ఆత్మకాదు. అవన్నీ అన్నమును (ఆహారమును) ఆశ్రయించి ఉంటాయి. సవికారములు. ఆత్మయో... నిర్వికారము!

అట్లాగే.... వాయువు – జలము – తేజస్సు – ఆకాశము – భూమి అనబడే పంచభూతములు, శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములనబడే ఇంద్రియవిషయములు,

ప్రకృతి... ఇవన్నీ భౌతికమే కాబట్టి అవికూడా ఆత్మస్వరూపములు కావు!

ఆకాశమును మేఘములు ఆవరించినా - ఆవరించకపోయినా సూర్యునికి ఎటువంటి హాని-వృద్ధులు ఉండవు కదా! సాక్షాత్ స్వస్వరూపుడనగు నాయొక్క స్వరూపము తెలుసుకొన్నవానికి,... " **ఇక త్రిగుణములగు ఇంద్రియములు నిశ్చలమైనా (లేక) చంచలమైనా కూడా (విక్షిప్తములైనా కూడా) ఆత్మకు ఎట్టి గుణదోషములు ఉండవు. అంటవు!**" - అనునది గమనిస్తున్నాడు!

**శ్లో॥ యథా నభో వాయుః అనల అంబు భూ గుణైః**
**గతాగతైః వర్తుగుణైః న సజ్జతే**
**తథా అక్షరం సత్త్వరజస్తమోమలైః**
**అహం మతే సంసృతి హేతుభిః పరమ్ ॥** **(అధ్యా 28, శ్లో 26)**

వాయు వీచికలచేతగాని, అగ్ని శిఖలచేతగాని, జలతరంగముల ఉధృతముచేతగాని, భూమియొక్క విస్తారముచేతగాని, వచ్చి పోయే శీతోష్ణాదులచేతగాని ఆకాశము ఏదైనా మార్పు-చేర్పులు పొందుచున్నదా? లేదుకదా? **అహంకారము కంటే కూడా పరమై, అహంకారమునకు ఉత్పత్తి స్థానమైన పరమాత్మ- ప్రపంచమునకు కారణభూతమైన సత్త్వ-రజ-తమోగుణములచే మలినము కాదు!**

అయినప్పటికీ కూడా.... (Even though it is so)...,

**శ్లో॥ తథాపి సంగః పరివర్జనీయో**
**గుణేషుమాయా రచితేషు తావత్**
**మద్భక్తి యోగేన దృఢేన యావత్**
**రజో నిరస్యేత మనః కషాయః ॥** **(అధ్యా 8, శ్లో 27)**

ఎంతెంతవరకైతే పరతత్త్వ స్వరూపుడునగు నాపట్ల భక్తియోగము యొక్క ప్రభావముచే ఇంద్రియ విషయములనుండి, త్రిగుణ విశేషములనుండి మనస్సు తొలగడం జరుగుటలేదో... అంతంత వరకు ఈ జీవుడు మాయా రచితములైన దృశ్య విషయముల నుండి ఆసక్తి (Attachment) ని పూర్తిగా విడిచే ప్రయత్నంలో ఉంటూనే ఉండాలి.

ఎందుచేతనంటావా?

రోగము పూర్తిగా తొలగనంతవరకు చికిత్స కొనసాగిస్తూనే ఉండాలికదా? లేకపోతేనో?

రోగము మరల మరల వృద్ధి చెందుతూ, తిరగబెడుతూ ఆ రోగికి బాధ కలిగిస్తూనే ఉంటుంది కదా! అదే రీతిగా...,

1. మనోగతములైన (మనస్సులో పేరుకొనియున్న) దృశ్య సంబంధమైన వాసనలు (Tendencies that are being carried since long and that are thickly formed in the inner zone)

2. అట్టి వాసనల ప్రభావముచేత తన్మూలములైనట్టి కర్మబంధము (బంధభావన).

పై రెండూ సంపూర్ణముగా నశించవు. నశించకపోతేనో? ధన-పుత్ర-కళత్ర-పేరు-ప్రతిష్ఠ ఇటువంటి ఆసక్తులు మనస్సులో ఉన్నంతవరకు మనస్సే పెత్తనం చెలాయిస్తుందే గాని, **దృశ్యమునకు-ద్రష్టకు సాక్షి** అయినట్టి ఆత్మానుభవమునకు మనస్సు సహకరించదు. దృశ్య విషయములపట్ల ఆసక్తమైన మనస్సు అల్పజ్ఞాని అయిన జీవుని స్వా-అర్థము (ఆత్మానుభవము) నుండి భ్రష్టునిగా చేయగలదు సుమా!

అందుకే దృఢమైన భక్తియోగమును, భక్తి గుణములను (అద్వేష్టా సర్వభూతానాం, అమానిత్వమదంభిత్వం - ఇత్యాది భక్తి-జ్ఞాన అభ్యాసములను) జీవుడు అభ్యసించ వలసినదే!

---

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీకృష్ణా! నాదొక సందేహము. ఒకానొకడు భక్తియోగ మార్గంలో నిన్ను ఉపాసించడం ప్రారంభించికూడా, ఏకారణంచేతనో ఏవేవో చిక్కులవలన ఆ భక్తి లక్షణములు అభ్యసించే మార్గములో అంతరాయాలు-విఘ్నాలు కలిగాయనుకోండి! మీరు భక్తి మార్గాన్ని వదలకూడదని అంటున్నారు. మరి అట్టి విఘ్నములవలన యోగభ్రష్టుడైతేనో? ఆతని గతి ఏమిటి? నిర్గతి కాదు కదా?

**శ్రీకృష్ణుడు :** ప్రియమిత్రమా! ఆయా విఘ్నముల వలన భక్తిమార్గమును కొనసాగించలేక యోగభ్రష్టుడైనవాడు, మరల ఎప్పుడో ఏ సందర్భంలోనో భక్తియోగము యొక్క పూర్వస్థితి నుండి పునః ప్రయత్నశీలుడగుచున్నాడు. జన్మాంతర సంస్కార బలంచేత మరల భక్తి యోగ మార్గమునందు ఆసక్తుడౌతున్నాడు. ఇతఃపూర్వపు భక్తి మార్గమునందు ఎంతవరకు కృతకృత్యుడై ఉంటాడో, అంతంతవరకు కర్మ మొదలైన దృశ్య వ్యవహారాదులందు అనాసక్తుడవటం ప్రారంభిస్తున్నాడు.

## అజ్ఞులు

ఈ జీవులు సామాన్యంగా పూర్వ సంస్కారములచే ప్రేరితులై ఆజన్మాంతరము కర్మలయందు నిమగ్నులై ఉండటం జరుగుతోంది. అంతేకాదు! ఆయా కర్మలచే, వాటి ఫలితములచే హర్ష-విషాదములు పొందటం, కొన్ని కర్మల ఫలితంగా మరికొన్ని కర్మల పట్ల ఆసక్తులై ఉండటం కూడా జరుగుతూ ఉన్నది

## విద్వాంసులు

**అయితే ఆత్మతత్త్వమును ఎరిగిన విద్వాంసుల విషయం వేరుగా ఉంటోంది.**

వారు దేహధారులై, దేహాంతర్గతులై, దృశ్యాంతర్గతులై ఉంటూ కూడా... స్వానుభవముచే ఆత్మానంద పరితృప్తులై, నిరహంకారులై ఈ సంసార సంరభమునకు ఆవల సాక్షీభూతంగా చిరునవ్వుతో చూస్తూ ఉన్నారు. సర్వ సాంసారిక విషయములపట్ల మౌనము - అతీతత్వము వహించి ఉంటున్నారు. వారు సంసారమును పొందుటయే లేదు. పడవ నీళ్ళలో ఉంటుంది. కాని పడవ తనలోకి నీళ్ళను రానిస్తుందా? విజ్ఞులగు విద్వాంసులు సంసార వ్యవహారముల మధ్య దేహధారులై ఉండికూడా.... తమయందు సంసారము రహితము చేసుకొన్నవారై ఉంటున్నారు.

**శ్లో॥ తిష్ఠంతం ఆసీనమ్ ఉత వ్రజంతం**
**శయానం ఉక్షంతమ్ అదంతమన్నమ్**
**స్వాభావ మన్యత్ కిమపీహమానమ్**
**ఆత్మానమాత్మస్థమతిః న వేద ॥** **(అధ్యా 28, శ్లో 31)**

ఆత్మయందు - సర్వం ఆత్మస్వరూపంగా ఆస్వాదించుటయందు నిలకడ - నిశ్చలత సంపాదించుచున్నట్టి మనుజుడు...,

- ❖ ఈ దేహము ఉండటం - లేకుండటం,
- ❖ కూర్చుని ఉండటం, నడుస్తూ ఉండటం,
- ❖ స్వీకరించటం - విసర్జించటం,
- ❖ అన్నమును భక్షించటం - త్యజించటం,
- ❖ తదితరములైన సర్వ స్వాభావిక కర్మలు,

ఇవన్నీ నిర్వర్తించబడుచుండగా తాను ఏదీ నిర్వర్తించనివాడుగా - కర్మరహితునిగా చూస్తూ అతీతుడై - యథాతథుడై ఉంటున్నాడు! అవన్నీ గుర్తించనివాడై (లేక) గుర్తిస్తూ

సంబంధించనివాడై ఉంటున్నాడు. కల కంటున్నవాడు, నిదురలేచిన "కలలో కనిపించినవి నేను కోల్పోయాను కదా!" అని అనుకుంటున్నాడా? లేదు. "అవన్నీ వాస్తవమే కాదు! నా ఊహాపరంపరలు రూపుదిద్దుకోగా అది అట్లు స్వప్నంలో కనిపించింది కదా!" అని తలచి కలలో ఏదీ పొందనట్లు, ఏదీ త్యజించనట్లు (మెలుకువ వచ్చిన తరువాత) ఉంటున్నాడు కదా!

అట్లానే వివేకవంతుడైనవాడు అసత్తగు ఇంద్రియ విషయ స్వరూప జగత్తును చూస్తూ ఉండి కూడా... ఆత్మకు వేరైనదేదీ అంగీకరించడు.

అనగా...,

**సర్వము ఆత్మ స్వరూపంగానే దర్శిస్తూ ఉంటాడు**. ఆత్మ సర్వదా యథాతథము కదా! మట్టిని ఎవ్వరైనా ఒక మట్టిబొమ్మగా తయారు చేస్తున్నప్పుడు ఆ మట్టి ఏదైనా కోల్పోతోందా? ఆ బొమ్మ ఖండమై మరల మట్టిగా మారుచున్నప్పుడు మాత్రం? మట్టి బొమ్మ ఏదైనా కోల్పోతోందా? రెండూ లేదు కదా! మట్టి బొమ్మగా మలచబడుచున్నప్పటికీ మట్టి యథాతథం కదా! "ఆత్మ జగత్తు రూపంగా కల్పన చేయబడుచున్నప్పటికీ ఆత్మ యథాతథం!" అని ఆత్మజ్ఞుడు గమనిస్తున్నవాడై ఉంటాడు!

**శ్రీ ఉద్ధవుడు :** కృష్ణయ్యా! ఈ జీవుడు ఆత్మయే వాస్తవ స్వరూపముగా కలిగి ఉన్నాడు కదా! అట్టి నిర్మల - అప్రమేయ ఆత్మతత్త్వమును అజ్ఞానము ఎక్కడినుండి వచ్చి ఆవరిస్తోంది? మరల అది ఎట్లా తొలగుతోంది? అనగా బంధ - మోక్షములు ఆత్మకు ఏ ఆవస్యకతచేత ఎట్లా ఏర్పడుచున్నాయి.

**శ్రీకృష్ణుడు :** (పకపక నవ్వుతూ) ప్రియ ఉద్ధవా! ఆత్మకు బంధము లేదు! మోక్షము లేదు!

**శ్లో॥ పూర్వం గృహీతం గుణకర్మ చిత్రమ్**
**అజ్ఞానమాత్మన్య వివిక్త మంగమ్**
**నివర్తతే తత్ పునరీక్ష యైవ**
**న గృహ్యతేనాఽపి విసృజ్య ఆత్మా! (అధ్యా 28, శ్లో 33)**

ఆత్మ - విషయములచేతగాని, కర్మలచేతగాని, గుణములచేతగాని - కప్పబడటమూ లేదు! అవి తొలగించబడటమూ లేదు. ఆత్మ దేనిచేతా స్వీకరించబడటమూ లేదు. త్యజించబటమూ లేదు!

ఒక పలకపై రంగురంగుల బలపములతో ఒక పిల్లవాడు ఏవో బొమ్మలు చిత్రించి తుడిచివేస్తూ ఉంటాడు చూచావా? **ఆ పలకకు బలపములతో చిత్రించబడిన చిత్రముతో సంబంధమేమన్నా వున్నదా?**

ఆత్మ ఒకానొకప్పుడు లీలగా క్రీడగా స్వప్న స్వీకరణవలె తనయందు గుణ కర్మలను స్వీకరించి వాటితో కించిత్ తన్మయము అవుతోంది! అవిచారణచే గుణ-కర్మ-సందర్భముల అభినివేశము ఆత్మచే స్వీకరించబడుతోంది. అనగా ఆత్మచే అన్యమైనది గృహీతము అవుతోంది. అదియే అజ్ఞానముగా వేదాంత శాస్త్రముచే వర్ణించి చెప్పబడుతోంది. అదియే సంసారము అనబడునది కూడా! ఆత్మ గురించిన తత్త్వ జ్ఞానము ఏమరచటమే అజ్ఞానము - అనే శబ్దముచే ఉద్దేశ్యించబడుచున్నది. ఆ అజ్ఞానము - **"ఆత్మకు సంబంధించిన జ్ఞానము, ఆత్మగా సర్వమును సందర్శించుటచే** తొలగిపోతోంది. అయితే... **ఆత్మ దేనిచేత (అజ్ఞానముచేతగాని - జ్ఞానముచేతగాని) స్వీకరించబడటమూ లేదు! విడువబడటమూ లేదయ్యా!" అజ్ఞానముకూడా ఆత్మానందముయొక్క ఒకానొక విశేష చమత్కారం మాత్రమే అని ఆత్మజ్ఞాని గమనిస్తున్నాడు.**

ఒక దృష్టాంతం చెప్పుతాను. విను. ఒక బాటసారి ఒక ప్రదేశంలో ఆశీనుడైనాడు. అది అర్ధరాత్రి. కటిక చీకటిగా ఉన్నది. చుట్టు ప్రక్కల ఎక్కడ ఏమున్నదో ఏమీ ఏమాత్రము కనబడుటలేదు. కొంతసేపైన తరువాత సూర్యోదయం అయింది. ఇప్పుడు ఆ బాటసారి కనులు తెరిచాడు. ఆహాఁ! ఒకవైపు కొండలు మరొకవైపు తటాకం. దగ్గిరలో వృక్షాలు. పక్షులు ఇవన్నీ కనిపించసాగాయి. ఆ ప్రదేశమంతా పచ్చటి గడ్డి మొక్కలతో-పూల మొక్కలతో బహుసుందరంగా కనిపిస్తోంది!

ఎప్పుడైతే చీకటి తొలగిందో... అంతా సుస్పష్టంగా కనిపించసాగింది. ఇప్పుడు చెప్పు! సూర్యకాంతి క్రొత్తగా ఏదైనా సృష్టించిందా? లేక, రాత్రిపూట అంధకారము దేనినై మ్రింగిందా? ఏదీ లేదు.

**"ఆత్మ విద్య"** అనే సూర్యుడు ఉదయించగానే అజ్ఞానము అనే చీకటి - బుద్ధి నేత్రము నుండి తొలగిపోతోంది. "ఆత్మ జ్ఞానముచే - సర్వదా ఇతఃపూర్వమే సిద్ధంచియున్న, అనునిత్య స్వస్వరూపతత్త్వమైన ఆత్మ తిరిగి అనుభవమునకు వస్తోంది" అని అనవలసిందే!

**జీవాత్మ** ప్రకాశించబడుచున్నవాడు (That being exhibited / manifested) !

పరమాత్మయో–జీవాత్మను–జీవాత్మయొక్క సర్వ అనుభవములను ప్రకాశింపజేసే వాడు!

అట్టి పరమాత్మ ....

- స్వయంప్రకాశకుడు (పరమాత్మను ప్రకాశింపజేసేది మరొకటేదీ లేదు. తనకు తానే ప్రకాశిస్తోంది).
- అజుడు (జన్మరహితమైనది).
- అప్రమేయుడు. (దృశ్యమునకు వేరై ఉన్నట్టి కేవల ద్రష్ట).
- సర్వవ్యాపకుడు. (స్వప్న ద్రష్ట తన చైతన్య విశేషంచేత స్వప్న దృశ్యమంతా వ్యాపించి ఉన్నట్లు).
- చిత్సమూహుడు. ఎరుక అను కిరణములను ప్రదర్శించువాడు! (One who emits the rays of knowing)
- సర్వజ్ఞుడు {జాగ్రత్ – స్వప్న – సుషుప్తులను, దృశ్య – దేహ – మనో – చిత్త – బుద్ధి అహంకారాలను ఎరుగుచున్నవాడు. (one who is knowing all else)}
- స్వజాతీయ – విజాతీయ భేదము లేనివాడు (మట్టితో కొన్ని బొమ్మలు చేస్తే ఆ మట్టి– "ఈ మట్టి బొమ్మలు నావి – ఆ మట్టి బొమ్మలు నావి కావు" అని అనుకుంటుందా?)
- అవాక్ మానస గోచరుడు

అట్టి పరమాత్మయొక్క ప్రేరణ (Inspiration) చేతనే ప్రాణములు – వాక్కు – మనో బుద్ధి – చిత్త అహంకారాలు ... ఇవన్నీ తమతమ స్థానాలలో ఉండి జగన్నాటకంలో తమ తమ పాత్రలు నిర్వర్తిస్తున్నాయి.

అటువంటి అభిన్నము – వికల్ప రహితము అగు ఆత్మపట్ల ఇది జీవాత్మ – ఇది పరమాత్మ అనే భేద కల్పన కూడా మనో భ్రమయే! ఎందుకంటే ఆత్మ ఏర్పరచుకొంటున్న మనో భ్రమకు కర్తృత్వము – అధిష్ఠానము మరొకటేదీ లేదు.

పంచభూత సమ్మేళనము – నామరూపాత్మకము అగు ఈ ద్వైతమును – ద్వైత ప్రపంచమును కొందరు భాషాకోవిదులు – "ఈ పంచరంగుల నామరూపాత్మక దృశ్యము ఈఈ కారణాలుగా సత్యమే..." అని అభివర్ణించటం – అదంతా అర్థరహితమగు వాక్ ఆడంబరము మాత్రమే!

# 44. యోగాభ్యాసంలో అడ్డంకులు తొలగించుకోవటం ఎట్లా?

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీకృష్ణ స్వామీ! ఒకడు యోగాభ్యాసం సందర్భంలో ఆ యోగసాధన కొనసాగించుచూ... ఇంకా యోగసాధన ముగియకముందే (పూర్తికాకుండానే) ఏవైనా అనారోగ్యము - మొదలైన ఉపద్రవములు వస్తూ ఉంటే అప్పుడు ఆ యోగి ఏ ఉపాయములు అనుసరించాలి? వాటిని ఆతడు ఎట్లా ఎదుర్కోవాలి?

**శ్రీకృష్ణుడు :** మనం ఆత్మతత్త్వమును చర్చిస్తున్నాం. నీవేమో యోగులు భౌతికమైన ఇబ్బందులకు ఏ ఉపాయాలు (క్రియా యోగసాధనా సమయంలో) ఆశ్రయియించాలి... అని ప్రశిస్తున్నావు! సరే చెప్పుతాను. విను.

వారు..., (యోగాభ్యాసులు)

**శీతోష్ణ తాపములను** : సూర్యోపాసన - చంద్రోపాసనల (సూర్య చంద్ర ధారణోపాసనల సహాయంతో) అధిగమిస్తున్నారు. నేనే సూర్య-చంద్రుల స్థానంలో ఆత్మ స్వరూపుడనై ఉన్నాను కదా! ...అనే భావనను ఆశ్రయిస్తున్నారు. తద్వారా శీత-ఉష్ణ సంబంధమైన బాధను జయించివేస్తున్నారు!

**వాతము - పిత్తము - ఇత్యాది శారీరక రుగ్మతలను:** ఆసనము - ప్రాణాయామముల ద్వారా జయిస్తున్నారు.

**బాహ్యమైన నిరోధములను** : **తపస్సు - మంత్రములద్వారా** దూరంగా ఉంచుచున్నారు.

**దేహబాధలను** - బాహ్యమైన ఔషధము - పౌష్ఠికాహారము- జలము - పండ్లరస పానీయముల వంటివాటిచే నిరోధిస్తున్నారు. బాధకు సాక్షిగా వుండటమనే అభ్యాసము కూడా నిర్వర్తిస్తున్నారు!

**కామము మొదలైన విఘ్నములను** నన్ను ధ్యానిస్తూ కృష్ణతత్త్వమును బుద్ధితో గ్రహిస్తూ ఎదుర్కొంటున్నారు. కామము మొదలైనవి పసిపిల్లలవలె వాత్సల్యముగా మార్చుకోవటంచేత తప్పక జయించవచ్చు.

**క్రోధ-లోభ-మోహాలను :** శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందం... ఇటువంటి నామ సంకీర్తనల ద్వారా అణచి - రహితం చేసుకుంటున్నారు.

అశుభ ప్రదములగు **దంభము** మొదలైన వాటిని -మహనీయులగు **యోగీశ్వరులను దర్శించి వారి బాటను** అనుసరించి క్రమంగా త్యజిస్తున్నారు.

ఈవిధంగా యోగులు యోగసాధనకు ఉపకరణము అగు ఈ భౌతిక దేహమును స్థిరంగాను, ఆరోగ్యవంతంగాను, రోగరహితంగాను చేసుకొంటున్నారు. ఇంకొందరు యోగులు పరకాయ ప్రవేశము ద్వారా ఉపాధి పరంపరలను ఆశ్రయిస్తూ యోగసాధన కొనసాగించటం కూడా జరుగుతోంది. ఒక దేహం శిధిలం అవుతూ ఉంటే ప్రకృతి నిర్మితమైన మరొక ఉపాధిలో ప్రవేశించి ధారణ కొనసాగిస్తున్నారు. మరికొందరు యోగసాధకులు ప్రకృతిలోను – వాయువులోను ప్రకృతిచే ప్రక్షిప్తం చేయబడిన ఔషధ రసాలను ప్రాణాయమాది ప్రత్నములతో స్వీకరించి ఈ భౌతిక దేహములో మనోచిత్త హస్తములతో తెచ్చి నింపి నిత్యయౌవ్వనులై యోగసాధన కొనసాగిస్తున్నారు కూడా!

అయితే..., దేహసంబంధమై... ఆత్మ విద్యాకోవిదుల అవగాహన – మరొకవిధంగా వుంటోంది!

**శ్లో॥ నహి తత్కుశలాదృత్యం తదాయాసోహి అపార్థకః**
**అంతవత్వాత్ శరీరస్య ఫలస్యేవ వనస్పతేః ॥** (అధ్యా 28, శ్లో 42)

వారు ఈ భౌతిక దేహ సంరక్షణకై ఉద్దేశ్యించిన ఔషధములను రసములను, మంత్రములను, పరకాయ ప్రవేశమువంటి ఉపయోగసాధనములను – పెద్ద విషయములుగా లెక్కలోకి తీసుకోరు. ఎందుచేత నంటావా?

- ఆత్మ వృక్షమువలె స్థిరమైనది.
- ఈ భౌతిక దేహములో? – ఫలములవలె (Like fruits) నశ్వరము (Physical body is any way time-bound)

అందుచేత "ఈ భౌతికదేహమును స్థిరంగాను, యౌవనవంతముగాను సుదీర్ఘకాలం ఉంచాలి! తద్వారా క్రియా యోగ సాధన సుదీర్ఘకాలం కొనసాగించాలి ..." అని ఎవ్వరైనా సరే – మరీ పట్టుదలగా అనుకుంటే – అదంతా నిరర్ధకమేనని గుర్తుచేస్తున్నాను. నిత్యము యోగసాధనచేస్తూ ఉండే అభ్యాసపరులకు ఈ దేహము సుదృఢంగాను, ఆరోగ్యంగాను, ఉత్సాహవంతం గాను, నైరాస్యరహితంగాను, గొప్ప ఉపకరణంగాను ఉండగలదనుమాట నిర్వివాదాంశమే!

అయినప్పటికీ, బుద్ధిమంతులగు యోగాభ్యాసులకు యోగానుష్ఠానము పైనే శ్రద్ధ–ధ్యాసలు ఉంటాయి. అంతేగాని నశ్వరము–వినాశన శీలము అగు ఈ భౌతిక దేహముపై కాదు! "దీనిని ఎట్లా రక్షించుకుంటామురా బాబూ!..." అనే విషయం మీద కాదు!

**శ్లో॥ యోగచర్యాం ఇమాం యోగీ విచరన్ మదపాశ్రయః**

**నాంతరాయైర్విహన్యేత నిఃస్పృహః స్వసుఖానుభూః ॥** (అధ్యా 28, శ్లో 44)

సర్వాంతర్యామిని - సర్వతత్త్వ స్వరూపుడను - యోగి యొక్క స్వస్వరూపమునకు అభిన్నుడను - అగు..., నన్ను ఆశ్రయించుచున్న యోగి,

**అంతరాయములు అవే వస్తాయి. అవే పోతాయి! నా కార్యక్రమమును అవి నిరోధించవు. నిర్దేశించవు!**

అని భావిస్తూ లోకరీతులకు, దేహములకు, సందర్భములను, సంగతులకు సర్వదా అతీతుడై భక్తి-క్రియాయోగసాధనలను కొనసాగిస్తూ ఉంటాడు. సర్వలౌకిక విషయాలకు అతీతుడు - నిస్పృహుడు అయి ఉంటాడు. విఘ్నములు ఆతనిని జయించలేవు. పట్టుదల కలవారికి దేహబాధలు దైనందికమైన స్వల్ప విషయాలుగా అనిపిస్తూ ఉంటాయి. దేవభక్తులు-రాజభక్తులు అగు యుద్ధవీరుల విషయంలో ఇట్టిది గమనిస్తాము కదా!

మత్ప్రసాదముచే సర్వ విఘ్నములను ఆతడు తప్పక జయిస్తున్నాడు. "కొంచము ఓపిక పడితేచాలు..." అని ఆతడు గ్రహించి ఉంటున్నాడు.

ఈ దేహముల ఆయురారోగ్య వ్యవహారములు, కష్ట సుఖములు ఆతని ధారణకు ఎటువంటి విఘ్నములు కలిగించ జాలవు.

లక్ష్య శుద్ధి కలవానికి విఘ్నములు ఏమి చేస్తాయయ్యా! మిత్రమా! లక్ష్యశుద్ధి లేనివానికి ఆతనియొక్క అల్పమైన ఆశయములే ఆతని నిజమైన విఘ్నములు

## 45. భాగవత ధర్మములు - భక్తియోగ సాధనములు

**శ్రీ ఉద్ధవుడు :** ఓ అచ్యుతా! మనస్సు స్వాధీనంలో లేనంతకాలము మానవుడు మీరు బోధించే యోగ-భక్తి సాధనలు అనుష్ఠించటం చాలా కష్టమేమోనని నాకు అనిపిస్తోందయ్యా!

అందుచేత..., ఈ సందర్భములో

కొంత అనాయాసంగా పురుషుడు ఉత్తమసిద్ధిని పొందటానికి సులభము - సుగమము అయిన సాధనములను బోధించవలనసినదిగా నిన్ను అర్థిస్తున్నాను!

ఎందుకంటావేమో? పుండరీకాక్షా!

యోగులు కొందరు తమ మనస్సును సమాధానపరచుకోవటానికి – నిగ్రహపరచుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పటికీ... వారు ఆ కార్యక్రమములో కృతకృత్యులు కాలేకపోవటం కొన్నిచోట్ల జరుగుతోంది! "మేము ఆశయము – యోగసాధనలలో పటిష్టులము కామేమో!" – అని కూడా మాకు అనిపిస్తోంది.

ఓ కమలనయనా! విశ్వేశ్వరా!

ఇంకొక విషయం కూడా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఈ దృశ్యమును అధిగమించిన కొందరు సార–అసార వివేకులు సంపూర్ణమగు ఆనందము ఆశయముగా కలిగినవారై నీ పాదపద్మములను సుఖముగా–హాయిగా ఆశ్రయిస్తున్నారు!

కుయోగులు – అల్పబుద్ధి – అల్పయోగ సంపన్నులు "మేము క్రియాయోగమే ఆశ్రయిస్తాం!..." అని తలచి తత్ కర్మలయందు అభిమానము – అభినివేశము కలిగియున్నవారై ... నీ చరణకమలములను ఆశ్రయించక పోవటాన్ని (భక్తి యోగం ఆశ్రయించక పోవటం) కూడా కొందరి విషయంలో చూస్తూ ఉంటాం! వారు మాయామోహితులై, నీయొక్క మాయకు బద్ధులై ముక్తిని కాంచలేకపోతున్నారేమోనని నాకు అనిపిస్తోంది.

నిఖిల బాంధవా! అచ్యుతా! అది అట్లా ఉండగా...,

బ్రహ్మ – శివుడు మొదలైన దేవతలు కూడా ప్రకాశమానమగు కిరీటములు ధరించి తమ శిరస్సులను వంచి మీ పాదపద్మములకు నమస్కరించి మిమ్ములను విష్ణులోకానికి తిరిగి రమ్మని ఆహ్వానించటం ఈ ఉదయం నేను గమనించాను.

నీవు భక్త వత్సలుడవు. నీకు అయినవారు లేరు. కానివారు లేరు. అందరు నీవారే! శరణన్నవారిని తప్పక రక్షిస్తావు. అటువంటి నీవు (రామావతారములో) వానరులతో స్నేహం చేశావు. (ఈ అవతారములో) – అనన్య శరణార్తులైనట్టి నందుడు, గోపికలకు, (వామనావతారంలో) – బలిచక్రవర్తి మొదలైన వారికి అధీనుడవైయ్యావు.

ఇందులో ఆశ్చర్యమేమున్నది? భక్తులకు వశుడవై ఉండటం, వారిని సర్వవిధాల రక్షించటం నీ స్వభావమే కదా!

ఎవ్వరైనా సరే, బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు మొదలైన వారిపై నీవు చూపిన వాత్సల్యము – అనుగ్రహము తెలియజేసే విశేషకథలను విన్నతరువాత, సర్వతత్త్వస్వరూపుడవు – సర్వజీవుల యొక్క ప్రియ అంతర్యామివి – ఈశ్వరుడవు, చతుర్విధ పురుషార్థములను

ప్రసాదించు వాడవు అని గమనించిన తరువాత - నిన్ను వదులుకుంటారా? తెలివితక్కువ వారౌతారా? లేదు. లేదు.

అది అట్లా వుండగా, కొందరైతే నీవు ప్రసాదిస్తున్న స్వర్గలోక సుఖములు చూచుకొని తెలివితక్కువగా నిన్నే మరుస్తున్నారు! తెలివిగలవాడెవ్వడైనా నిన్ను వదలుకొని స్వర్గలోకాలు కోరుకుంటాడా? లేనేలేదు. కోరుకోడు!

నీ పాదధూళిని ఆశ్రయించి సేవించే మాకు ఇంకేమి కొదువ?

దేవా! ఎవ్వరైతే నిన్ను భక్తితో శరణువేడతారో... వారి అశుభములను, విఘ్నములను, విషయవాసలను తొలగిస్తున్నావు. బయట ఆచార్యరూపంగాను, లోపల అంతర్యామిగాను ఉండి, నీ నిజరూపమును మాకు ప్రసాదిస్తున్నావు.

మాయందే శ్రీకృష్ణతత్త్వమును ఆశ్రయిస్తున్నట్టి మేము భక్తి అనే పరమానందమునందు నిమగ్నులమై బ్రహ్మజ్ఞాన సంపన్నులం అగుచున్నాము. కల్పాంతము వరకు నీ నియమానుసారంగా నీ సేవయందు నియుక్తులమగుచున్నాము. నీవు ప్రసాదిస్తున్నది స్మరిస్తూ పరమానందమును అనుభవిస్తున్నాము. అందుచే శ్రీకృష్ణా! నీ ఋణమునుండి మేము విముక్తులము అయ్యే ప్రసక్తే లేదు!

---

**శ్రీ శుకమహర్షి :** ఓ పరీక్ష్మిణ్మహారాజా! ఓ సుభికులారా! ఈవిధంగా అంతరాంతరంగ అనురక్తచిత్తుడు - భక్తి పారవస్యముతో హృదయమును నింపుకున్నవాడు అయినట్టి ఉద్ధవుడు అనేక స్తోత్రాలు శ్రీకృష్ణ భగవానుకి సమర్పించాడు. ఈ జగత్తంతా తనకు క్రీడోపకరణం అయినవాడు, స్వశక్తిచే త్రిమూర్తులుగా ప్రదర్శనమగుచు లోకములకు- సర్వజీవులకు ఆనంద ఐశ్వర్యములను ప్రసాదించువాడు, బ్రహ్మవంటి సృష్టికర్తకు కూడా ఈశ్వరుడు అగు శ్రీకృష్ణుడు ముగ్ధమనోహరముగా నవ్వుచూ ప్రేమగా ఈవిధంగా పలికాడు.

---

**శ్రీకృష్ణ భగవానుడు :** ప్రియ ఉద్ధవా! సర్వజనావళియొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని "నిన్ను చేరటానికి సులభమైన మార్గము చెప్పు!" అని నన్ను కోరావు.సహజీవుల పట్ల నీవలె ప్రేమ-వాత్సల్యము కురిపించువారంటే నాకు చాలా ఇష్టము.

మరణశీలుడగు మానవుడు ఏ శ్రద్ధతో ఏఏ ధర్మములను ఆచరించటంచేత అతి

దుర్జయమగు మృత్యువును కూడా సులభముగా జయించటానికి సమర్థుడు అగుచున్నాడో అట్టి భాగవత ధర్మములు గురించి చెప్పుచున్నాను. శ్రద్ధగా విను.

**శ్లో॥ కుర్యాత్ సర్వాణి కర్మాణి మదర్థం శనకైః స్మరన్**

**మయ్యర్పిత మనశ్చిత్తో మద్ధర్మాత్మమనోరతిః ॥** **(అధ్యా 29, శ్లో 9)**

ఎవ్వరు ఏ వర్ణాశ్రమ ధర్మములోనైనా ఉండవచ్చుగాక! "**నాకు నియమితమైన నా ఈ స్వధర్మ–కర్మలను సర్వాంతర్యామియగు పరమాత్మకు ప్రేమతో – భక్తితో సమర్పణగా నిర్వర్తించెదను గాక!...**" అను భావాలతో ఆచరిస్తూ ఉండుగాక! శాంత–మృదు భావాలతో నాయందే మనోవృత్తులను నిలిపి, నాపట్ల సర్వదా అనురక్తులై నన్నే ధ్యానించుచు నాకొరకే అనువర్తించటమే సులభమైన మార్గము. ఎందుకంటే, జీవునకు కర్మ నిర్వహణ ఎటుతిరిగీ అనివార్యం కదా! "ఇది నా భగవదోపాసనయే (This work is my worship towards Al-Pervading Divine Presence)" అని భావించి కర్మలు నిర్వర్తించటంలో కష్టమేముంటుంది చెప్పు!

**ఎక్కడ నివసించాలి :** ఎక్కడైతే నా భక్తులు నివసిస్తూ ఉంటారో... అది పవిత్రమైన పుణ్య ప్రదేశము. దేవతలలోను, మానవులలోను, అసురులలోను, వారిమధ్యగల నా భక్తుల ప్రవర్తన – సంభాషణలే అనుసరణీయాలు. భక్తులున్నచోట నేనుంటాను!

**స్వామి ప్రీతి కొరకై :** నా ప్రీతికొరకై నృత్య – గీత – వాద్యాదులను చక్కగా నిర్వర్తించి ఒంటరిగా గాని, ఇతరులతోగాని కలసి యాత్రలు, మహోత్సవములు నిర్వర్తిస్తూ ఉండెదరుగాక!

**పరమాత్మ దర్శనం :** నన్ను దర్శించటమంటే భౌతిక రూప సందర్శనమాత్రం కాదు సుమా! "ఈ కనబడేవారంతా కృష్ణచైతన్య స్వరూపులే..." అను భావన రూపుదిద్దుకోవటమే అది! సర్వము పరమాత్మయొక్క ప్రత్యక్షరూపంగా దర్శించటమునే **ఆత్మ సాక్షాత్కారము అని, శ్రీకృష్ణ సాయుజ్యము** అని చెప్పబడుతోంది. ఆకాశమువలె లోపల – బయట (అంతర్బహిశ్చ తత్సర్వమ్) పరిపూర్ణుడనై ఉన్నవాడను, ఆవరణ శూన్యుడను, ఈశ్వరుడను అగునన్ను ఎవ్వడైతే **తనయందును, సర్వ సహజీవులయందును, సర్వమునందును సదా** సందర్శిస్తూ ఉంటాడో.... ఆతడే నన్ను దర్శిస్తున్నటు! అదియే భగవత్ దర్శనము. భాగవతుల మహదాశయము!

**పండితుడు :** ఎవ్వరైతే...

- కేవలము ఆత్మజ్ఞానమును ఆశ్రయించి,
- సర్వభూతములందును నారూపమే ఉన్నదని గమనించి, భావించి,
- సమదర్శి అయి
- విద్యావినయ సంపన్నుడగు బ్రాహ్మణునియందును,
- చండాలుడు అని చెప్పబడువానియందు,
- ఒక దొంగయందు,
- గొప్ప దానగుణము గల దాతయందు,
- ఆ దానము స్వీకరిస్తున్న భోక్తయందు,
- సూర్యునియందు,
- ఒక నిప్పురవ్వ యందు,
- ఒక పరమ శాంత చిత్తునియందు,
- ఒక క్రూరునియందు

అంతటా – అన్నిటా, నన్నే సర్వస్థితి – గతులయందు సందర్శిస్తూ ఉంటాడో...

**ఆతడే నిత్యానిత్య వివేకియగు పండితుడు! అతడే శ్రీకృష్ణ తత్త్వ సందర్శనుడు!**

---

ఓ ఉద్ధవా! సములు (Peers) – ఉత్తములు(Great People) – హీనులు (Ordinary People) అగు సర్వ మానవులయందు, సర్వ జీవరాసులయందు నేనే ఉన్నానని భావించు. అప్పుడు ఆ మరుక్షణం అహంకారము – ఆ అహంకాముతోపాటు స్పర్థ, స్పర్థతోబాటు అసూయ – తిరస్కార భావాలు మొదలైనవన్నీ స్వభావసిద్ధంగానే వినష్టమైపోగలవు.

**శ్లో॥ విసృజ్య స్మయమానాన్ స్వాన్ దృశం వ్రీడాం చ దైహికీమ్**
**ప్రణమేద్దండవత్ భూమావ అశ్వచాండాలగోఖరమ్ ॥** (అధ్యా 29, శ్లో 16)

బంధువులు చేసే పరిహాసాలను పట్టించుకోకుండా "సర్వభూతములందు పరమేశ్వరుడున్నాడు" అను బుద్ధితో ఒక బిచ్చగానికి, అపరిచయస్తునికి, చండాలునికి, ఒక కుక్కకు, గోవుకు, గాడిదకు... అట్లాగే తదితర సర్వజీవులకు భూమిపై పడి సాష్టాంగ దండ ప్రమాణము మనస్సుతోనో – దేహంతోనో చేస్తూ వుండు!

"నేను కొందరు-కొందరు కంటే అధికుడను! నా నిపుణత కొంత - కొంతమందికి ఎట్లా వస్తుందిలే! వారి-వీరి ముందర నన్ను ఎవ్వరైనా తక్కువచేసి మాట్లడితే నాకు సిగ్గు, కోపం!".... ఇటువంటి అహంకారము-లజ్జలను **సమరసభావన** అనే జలంతో పరిశుద్ధము చేసుకోవాలి.

**శ్లో॥ యావత్ సర్వేషు భూతేషు మద్భావోనోఽపజాయతే**
**తావత్ ఏవమ్ ఉపాసీత వాఙ్మనః కాయవృత్తిభిః ॥** (అధ్యా 29, శ్లో 17)

ఎంతెంతవరకైతే సర్వప్రాణులయందు భగవత్ భావన నీయందు సుస్థిరంకాదో.... అంతంత వరకు మనో-వాక్-కాయ కర్మలచే, ఆయా ప్రణామాదులు-ఉపదేశములు - సాధనములను ఆశ్రయించటం ద్వారా నన్ను ఉపాశిస్తూనే ఉండాలయ్యా!

**ఈ దేహము ఉన్నప్పుడు - ఇది పోతున్నప్పుడు - మరొక దేహం వస్తున్నప్పుడు కూడా ఉపాసనను విడువరాదు.**

ఆవిధంగా ఉపాసించువాడు క్రమంగా ఆత్మబుద్ధికి సంబంధించిన విద్యను మరల మరల అభ్యసిస్తూ సర్వము బ్రహ్మాత్మకమే!... అని భావిస్తూ, సంశయములను తొలగించుకుంటూ..., ఇక ఆపై సర్వ క్రియలనుండి విరమితుడు కాగలడు!

## సులభోపాయం!

ఉపాయాలన్నిటిలో..., సర్వభూతములయందు నన్నే - నన్నే సర్వభూతములుగా సందర్శించటం గొప్పదైన, సులభమైన మహత్ప్రభావము అయిన **ఉపాయం!** అని నా అభిప్రాయం. ఇదియే ముఖ్యమైన భాగవత ధర్మము. **అనుకుంటూ-అనుకుంటూ వుంటే,.... అనిపించక ఏం చేస్తుంది?**

ఎక్కడైతే నిష్కామమగు భాగవత ధర్మము అభ్యసించటం - అనువర్తించటం ప్రారంభమౌతుందో..., అక్కడ ఇక ద్వేషము - అసూయ - కోపము - బాధించటం ఇత్యాది దుర్గుణములకు చోటు ఉండదు! ఎందుకంటే సర్వజ్ఞుడనగు నేను దుష్టభావములన్నీ మొదలంట్లా తొలగించటంలో తోడుగా ఉంటాను కనుక! నేనే తొలగిస్తాను కనుక!

**శ్రీ ఉద్ధవుడు :** శ్రీకృష్ణా! నీకు ఏఏ కర్మలు సమర్పించాలి. ఎటువంటి - ఎటువంటి కర్మలు నీకు సమర్పించటానికి అర్హము కాదు? వివరించ ప్రార్థన!

**శ్రీకృష్ణుడు :** సర్వకర్మలు నన్ను ఉద్దేశ్యించి నాకు సమర్పించటానికి సంసిద్ధమై "పరమాత్మా! ఈ కర్మ ద్వారా నిన్ను ఉపాసిస్తున్నానయ్యా!" అని పలికి నిర్వర్తిస్తే.... అట్టి కర్మలు ఏవైనా

సరే పవిత్రమే కాగలవు.

- భయము–శోకము–దుఃఖము–అవమానము మొదలైనవి గాని
- ఆ భయ – శోకాదులతో కలిగిన పలాయనము–ఆక్రందనము మొదలైన

కార్యములు కాని,

అవన్నీ కూడా ఆత్మ రూపుడనైనట్టి నన్ను ఉద్దేశ్యించి అనన్యభావంతో నిర్వర్తిస్తే... అవికూడా త్వరితగతిని ధర్మ స్వరూపములు – కర్మ పుష్పములు కాగలవు. అందుచేత, ఏ కర్మచేసి నాకుడా... **"ఇది నీకే ప్రేమతో సమర్పిస్తున్నానయ్యా!...**" అని భావించువాని కర్మ మార్గమును నేను తప్పక సరిచేసుకుంటాను. అందుచేత, అవినాశనము – సత్యము అగు నా తత్త్వమును గ్రహించి నన్నుపొందటమే...,

- బుద్ధిమంతుల సుతీక్ష్ణబుద్ధి యొక్క **సత్‌ప్రయోజనము,**
- చతురులలోని చతురతయొక్క **సత్ఫలము.**
- నశ్వరము–అసత్యము అగు ఈ భౌతిక దేహము ధరించినందుకు **సద్వినియోగము!**

## ఫలశ్రుతి

విన్నావు కదా! ప్రియ ఉద్ధవా! నాకు భక్తుడువగుటచేత, ప్రేమ–వాత్సల్యములతో నిండిన పరమసాత్వికుడవు అవటంచేత – దేవతలకు కూడా దుర్గ్రాహ్యమైనట్టి బ్రహ్మతత్త్వమును సంగ్రహంగా, సంక్షిప్తంగా, కొన్ని కొన్ని విషయాలుకొంతవివరంగా కూడా ఇప్పుడు నీకు చెప్పాను. విస్పష్టము, యుక్తియుక్తము అయినట్టి ఆత్మసందర్శన – ఆత్మసాక్షాత్కార విశేషాలు విన్నావు కదా! ఈ విషయాలు తెలుసుకొన్నవారు సంశయరహితులౌతారు! ముక్తిని పొందగలరు.!

మన ఉద్ధవ – శ్రీకృష్ణ సంవాదములోని **నీ ప్రశ్నలు నేనిచ్చిన సమాధానాలు** ఎవ్వరైతే పరిశీలించి సారమును గ్రహిస్తారో, అట్టివారు సనాతనము – పరమ రహస్యము అగు బ్రహ్మమును పొందగలరు.

నేను నీకు ఈ సందర్భములో ఉపదేశించిన ఆత్మతత్త్వ జ్ఞానమును ఎవ్వరైతే నా భక్తులకు అందజేస్తారో...,

**శ్లో॥ య ఏతన్మమమ భక్తేషు సంప్రదద్యాత్ సుపుష్కలమ్**
**తస్యాఽహం బ్రహ్మదాయస్య దదామి ఆత్మానమాత్మనా ॥** (అధ్యా 29, శ్లో 26)

... అట్టి జ్ఞానోపదేష్టకు ప్రేమగా నన్ను నేనే సమర్పించుకుంటాను సుమా!

ఎవ్వరైతే పరమపవిత్రము – చిత్తశోధకము – మనో శుచి ప్రదాయకము అగు మన ఈ తత్త్వశాస్త్ర సంవాదమును ఎలుగెత్తి తాను పఠిస్తూ – ఇతరులకు చక్కగా శ్రద్ధగా శ్రావ్యమైన పలుకులతో వినిపించుతాడో ఆతడు పవిత్రుడౌతాడు. అంతేకాకుండా శ్రోతలకు కూడా జ్ఞానకాంతి దీపమును వెలిగించి వారివారి అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయుచున్న నిపుణుడు అవుతాడు. స తరతి! స తారయతి!

**శ్లో॥ య ఏతచ్ఛ్రద్ధయా నిత్యమవ్యగ్రః శృణుయాన్నరః**
**మయిభక్తిం పరాం కుర్వన్ కర్మభిర్న స బధ్యతే ॥** (అధ్యా 29, శ్లో 28)

ఎవ్వరైతే సావధానముగాను – శ్రద్ధగాను అనుదినము మన ఈ సంభాషణను శ్రవణం చేస్తారో... వారు నాయందు స్వభావసిద్ధమైన భక్తి–ప్రపత్తులను పెంపొందించుకొన గలరు. తద్వారా కర్మబంధములనుండి సులభంగా విముక్తిని పొందగలరు!

మిత్రమా! ఉద్ధవా! నేను చెప్పిన ఈ బ్రహ్మతత్త్వము నీకు వినటానికి సులభముగానే ఉన్నదికదా? తేలికగా అవగతం అయిందికదా! నీ మోహము, శోకము, వేదన తొలగినాయా?

**శ్రీ ఉద్ధవుడు :** ధన్యోస్మి స్వామీ! ధన్యోస్మి. మీరు నాకు ఇప్పుడు చెప్పియున్న తత్త్వసార విశేషాలను అనేకులకు బోధిస్తూ... వారితోపాటు నేను ధన్యుడను అవుతాను. అధ్యయనుడను అవుతాను.

**శ్రీకృష్ణుడు :** ఈ తత్త్వ రహస్య సమన్వితమైన సంవాద విశేషాలను నీవు..., దాంభికునికి – నాస్తికునికి – మోసము చేయు స్వభావము గలవానికి, వినటానికి ఇష్టం లేనివానికి – భక్తి లేనివానికి, శుశ్రూష (సేవా) నిరతి లేనివానికి, దుర్నీతి పరునికి.... ఉపదేశించవద్దు సుమా! ముఖ్యార్థానికి సంసిద్ధులు కానందువల్ల వారిపట్ల బూడిదలో పోసిన పన్నీరే!

ఆ తీరైన దోషములను సన్నగిల్లచేసుకొన్న వానికి, బ్రాహ్మణులకు – భక్తులకు, సాధు స్వభావులకు, శుచి అయిన భావములు – ఆశయములు కలవానికి తప్పకుండా ఉపదేశించు. నాయందు భక్తి ఉన్నచో ... స్త్రీ – శూద్రులు కూడా ఈ బ్రహ్మతత్త్వ జ్ఞానము వినటానికి అర్హులే అని అనటంలో కించిత్ కూడా సందేహం లేదు.

అమృతము త్రాగినవానికి ఇంక క్రొత్తగా త్రాగవలసిన పానీయము ఏముంటుంది? అట్లాగే... మన ఈ సంభాషణాసారమైన ఆత్మజ్ఞాన విశేషాలను చక్కగా తెలుసుకున్న తరువాత...,

**నైతద్విజ్ఞాయ జిజ్ఞాసోః జ్ఞాతవ్యం అవశిష్యతే ।**
**పీత్వా పీయూషమమృతం పాతవ్యం నావశిష్యతే ॥** (అధ్యా 29, శ్లో 32)

క్రొత్తగా తెలుసుకొనవలసినదేముంటుంది? ఇదంతా పరిశీలించిన శ్రోతలకు వారివారి అర్హతను ఆశయమును అనుసరించి జ్ఞానము - కర్మ - యోగము - వాణిజ్యములకు సంబంధించిన చతుర్విధ (4 రకములైన) ధర్మార్థకామమోక్ష పురుషార్థ ఫలములు లభించగలవు. ఇక నీవంటి అనన్యభక్తునికైతే ... చతుర్విధపురుషార్థ ఫలములుగా నేనే అగుచున్నాను.

**ఒక్క సారవాక్యం మరొక్కసారి విను.**

**శ్లో॥ మర్త్యో యదా త్యక్త సమస్తకర్మా**
**నివేదితాత్మా విచికీర్షితో మే**
**తదామృతత్వం ప్రతిపద్య మానో**
**మయా ఽఽత్మ భూయాయ చ కల్పతే వై ॥** (అధ్యా 29, శ్లో 34)

సర్వ కర్మలు నాయందు వదలి, సర్వ కర్మలను మనస్సుచే త్యజించి - సమర్పించి- సర్వము నాకు సమర్పణ చేసినవాడు.... యోగులకంటే - జ్ఞానులకంటే కూడా నా ఇచ్ఛచే మిక్కిలి జ్ఞాన సంపన్నుడు కాగలడు.

క్రమంగా అమృతత్వమగు ఆత్మతత్త్వమే తానై వెలుగొందగలడు! నాతో సమానమైన **మమాత్మా సర్వ భూతాత్మా** అను ఐశ్వర్యమునకు అర్హుడగుచున్నాడు.

---

**శ్రీ శుకమహర్షి :** ఓ మహనీయులు - తత్త్వస్వరూపులు అగు శ్రోతలారా! సభికులారా! శ్రీ ఉద్ధవ - శ్రీకృష్ణ సంవాదమగు మహత్తర తత్త్వశాస్త్ర సారవిశేషాలు మీముందు ఉంచగలగడం శ్రీకృష్ణ ప్రసాదితమైన- మహత్తరమైన అవకాశంగా భావిస్తూ సభలోని మాన్యులకు - పెద్దలకు పేరుపేరున నమస్కరిస్తున్నాను.

ఆవిధంగా సంపూర్ణముగా శ్రీకృష్ణ ప్రవచనమైనట్టి యోగ మార్గోపదేశమును పొందినట్టి మహనీయుడగు ఆ ఉద్ధవుడు భాష్పపూరితలోచనుడయ్యాడు. సత్పురుషులచే మనసా- వాచా సేవించబడుతూ కీర్తించబడే శ్రీకృష్ణబోధ విని ప్రీతిచే రుద్ధమైన కంఠము కలవాడయ్యాడు. అంజలి బద్ధుడైనాడు. కాసేపు ఏమీ మాట్లాడలేక పోయాడు!

క్రమంగా ప్రేమతో నిండిన చిత్తముతో మాట్లాడటానికి సంసిద్ధుడైనాడు. కృతార్థోఽస్మి!

నేను కృతార్థుడను అయ్యాను కదా!.... అని భావించి లేచి శ్రీకృష్ణుడిని సమీపించాడు. భగవానుని పాదపద్మములను శిరస్సుతో స్పృశిస్తూ కృతాంజలి సమర్పించాడు. ఇట్లు పలుకసాగాడు.

**శ్రీ ఉద్ధవుడు :** దేవదేవా! ఆది పురుషా! ఆత్మబంధూ! అస్మత్ చైతన్యాత్మ స్వరూపమా! శ్రీకృష్ణా! మిత్రమా! సద్గురూ!

**శ్లో॥ విద్రావితో మోహ మహాంధకారో**
**య ఆశ్రితో మే తవ సన్నిధానాత్**
**విభావసోః కిం ను సమీపగస్య**
**శీతం తమో భీః ప్రభవంత్య జాద్య ॥** **(అధ్యా 29, శ్లో 37)**

మోహాంధకారములో సుదీర్ఘకాలంగా పడియున్న నేను నీ సాంగత్యం చేత, తత్త్వ సంభాషణా మాధుర్యము చేత ఉత్సాహ వర్ధనుడనయ్యాను! ఉత్సాహవర్ధనమహమ్! చీకట్లోంచి నీ సాన్నిధ్యం వైపుగా బయల్వెడలి వచ్చేశాను! సూర్యునియొక్క - అగ్ని యొక్క సమీపము పొందినవానిపట్ల ఇక చలి-చీకటి-భయము ఉంటాయా? ఉండవు! తొలగిపోతాయి! నీ సామీప్యత పొందిన నాకు అజ్ఞానాంధకారము వలన భయం ఇక శేషించదు. ప్రజ్ఞా తత్త్వస్వరూపుడవగు నీ సాన్నిధ్యములో అజ్ఞానాంధకార వీచికలు నన్ను స్పృశించనే లేవు.

నీకు భృత్యుడనైన నాపట్ల దయగలవాడవై, నీ మాయచే అపహరించబడిన విజ్ఞాన స్వరూప జ్ఞాన దీపమును తిరిగి నాయందు వెలిగించావు. నీ ఉపకారమును నేను మాటలలో వర్ణించగలనా? జన్మల జన్మలకు మరువగలనా?

నీ మాయచే యాదవ వంశాభివృద్ధికై దాశార్హ - వృష్ణి - అంధక సాత్విత వంశీయుల యాదవులతో బాటు నన్నుకూడా నీ దృఢస్నేహ పాశములతో కట్టి ఉంచావు. ఇప్పుడో! ప్రేమాస్పదంగా ఆత్మతత్త్వ జ్ఞానము ప్రసాదించి సర్వ సంసార సృంఖలములను, స్నేహపాశములను ఖండించివేసి నన్ను అనుగ్రహించావు.

ఓ యోగీశ్వరా! నీకు సహస్రకోటి సాష్టాంగ దండ ప్రణామాలు! నేను సదా ఆర్తుడనై నిన్ను శరణు వేడినందుకుగాను ప్రతిఫలంగా ఆత్మజ్ఞానామృతాన్ని పంచి ఇచ్చావు. నిన్నొక్క వరం కోరుకుంటున్నాను.

**నాకు నీ చరణ కమలముల పట్ల అనన్య భక్తిని జన్మ-జన్మలకు ప్రసాదించమని వేడుకుంటున్నాను.**

నా భౌతికమైన కళ్ళకు కనిపించేది - చెవులకు వినిపించేది... ఇదంతా శ్రీకృష్ణ చైతన్యానందమే... అనే విషయం జన్మజన్మలకు మరువకుండునట్టి మనోబుద్ధులను వరంగా ప్రసాదించమని మిమ్ములను మనసా-వాచా-కర్మణా వేడుకొంటున్నాడు.

**శ్రీకృష్ణ భగవానుడు :** ఓ ఉద్ధవా! సంతోషము! నేను సూచించిన విధంగా నా ఆశ్రమమే (నివాసస్థానమే) అయినట్టి బదరికాశ్రమమునకు ఇప్పుడిక బయలుదేరి వెళ్ళు. అక్కడ విష్ణు పాద రజముచే పవిత్రముగా చేయబడిన గంగానదీ తీర్థములో స్నానము ఆచరించి, ఆచమనములను నిర్వర్తించి పవిత్రుడవయ్యెదవు గాక! గంగానదీ తీర్థముచే నీమనస్సు నిర్మలమౌతుంది! ఇక అటు తరువాత..,

నారచీరలు ధరించి, కందమూల ఫలములు భుజించి విషయ సుఖములపట్ల ఇచ్ఛ-ధ్యాసలను త్యజించిన వాడవై ఉండెదవుగాక!

- శీతము - ఉష్ణము ఇత్యాది ప్రకృతి విషయములపట్ల సహనము కలవాడవయ్యెదవు గాక!
- సహనశీలుడవై - సుశీలుడవై, ఇంద్రియములను వాటి వాటి విషయములతో సహా జయించివేసి ఉండెదవు గాక!
- పరమశాంతుడవు - జ్ఞాన విజ్ఞానయుక్తుడవు అయ్యెదవు గాక!
- ఇప్పుడు మనం సంభాషించుకున్నట్టి భక్తి - జ్ఞాన - వైరాగ్య మొదలైన విశేషములపట్ల మననశీలుడవయ్యెదవు గాక!
- అట్టి మనో మనన శీలత్వము సహాయంతో నీ మనో-వాక్కులను నిష్ఠతో నాయందుంచుము!
- నిత్యము - సదా భాగవత ధర్మమునందు, ఆత్మ సందర్శన ధర్మమునందు ఆసక్తుడవై ఉండెదవు గాక!
- అర్హులగు సహజీవులకు బోధించెదవు గాక! వారి చెవులలో ఆత్మతత్త్వ జ్ఞానగానము మార్మోగుచుండునుగాక!
- క్రమంగా త్రిగుణాతీతత్వమును అభ్యసిస్తూ దేవ-మనుష్య-తిర్యక్ సంస్కారములను అధిగమించి త్రిగుణాతీతుడను - నిర్గుణుడను అగునన్ను చేరుకొనెదవు గాక!

---

**శ్రీ శుకమహర్షి :** ఓ పరీక్షణ్మహారాజా! ఆవిధంగా ఆ ఉద్ధవుడు శ్రీకృష్ణ భగవానునిచే ఆజ్ఞాపించబడ్డాడు.

శ్రీకృష్ణునికి ప్రదక్షిణం 3 సార్లు చేసి ఆయన చరణయుగళమును శిరస్సుపై ఉంచుకొని ప్రేమాస్పదచిత్తుడైనాడు. ఆనంద భాష్పబిందువులచే శ్రీకృష్ణ భగవానుని పాదపద్మములను అభిషేకించాడు.

ఏమాత్రం వదలలేక, ప్రేమవలన కలిగే ఎడబాటు సహించలేక ఆయన సమక్షంలోనే కొంతసేపు మౌనంగా కూర్చునిపోయాడు. అయినప్పటికీ "భగవానుని ఆజ్ఞ అనుల్లంఘ్యనీయం కదా!..." అని నెమ్మది నెమ్మదిగా గుర్తుచేసుకున్నాడు! ఆయన పాదుకలను శిరస్సుపై ఉంచుకొని మాటి మాటికి వెనుకకు తిరిగి నమస్కరిస్తూ నెమ్మదిగా బదరికాశ్రమం వైపుగా అడుగులు వేయసాగాడు.

---

భక్తాగ్రేసరుడు - పరమభాగవతోత్తముడు అగు ఆ ఉద్ధవుడు తన హృదయములో శ్రీకృష్ణుని రూపమును నిండుగా నింపుకొని బదరికాశ్రమం చేరాడు.. శ్రీకృష్ణుడు ఉపదేశించిన విధంగా గంగానదీ స్నానం నిర్వర్తించాడు. భాగవతోత్తములచే అనుసరించబడుచు - శ్రీ లీలాకృష్ణునిచే ప్రవచించబడిన **భాగవత ధర్మాలు** స్వీకరించాడు.

భగవత్ సారూప్యము - సామీప్యమును - సాలోక్యమును - సాయుజ్యమును అతి స్వల్ప కాలములో సముపార్జించుకున్నాడు.

## 46. భక్తిమార్గ సంమిశ్రితమైన జ్ఞానామృతం

**శ్రీ శుకమహర్షి :** ఓ భాగవతోత్తములారా! శ్రోతలారా! యోగజన - యోగేశ్వర సేవితుడు అగు శ్రీకృష్ణ పరమాత్మ భాగవత ప్రధానుడగు మన ఉద్ధవునకు ఏ

**"భక్తిమార్గంతో సంమిశ్రితమైన జ్ఞానామృతం"**

ను ఉపదేశించారో... అట్టి జ్ఞాన-విజ్ఞాన పవిత్రజలమును కొలదిగా సేవించినా కూడా... ఈ జీవుడు ముక్తుడు కాగలడు. అట్టివాని సంసర్గముచే జగత్తు-జగత్తులోని అనేకమంది ముముక్షువులు కూడా ముక్తి పొందగలరు.

**శ్లో॥ భవభయమపహంతుం జ్ఞాన - విజ్ఞాన సారం**
**నిగమకృదుపజహ్రే భృంగవత్ వేదసారం**
**అమృతముదధితశ్చాపాయయత్ భృత్యవర్గాన్**
**పురుషమృషభమాద్యం కృష్ణసంగం నతోఽస్మి ॥** **(అధ్యా 29, శ్లో 49)**

- వేదవేద్యుడు - వేదపురుషుడు - వేదకర్తయగు జనార్ధనుడు
- జీవుల సంసారభయమును పోగొట్టటానికికై
- తుమ్మెద అనేక పూలపై వ్రాలి తేనెను సేకరించువిధంగా
- సర్వవేదముల నుండి
- సారరూపంగా
- జ్ఞాన విజ్ఞాన శ్రేష్ఠమైనట్టి భాగవతుల భక్తిరసామృతాన్ని వెలికి తీశారు.

క్షీరసారగమధనానంతరం ఏవిధంగా విష్ణుభగవానుడు మోహినీరూపంగా మధింపబడిన క్షీరసాగర జలం నుండి అమృతమును వెలికితీసి తామసిక స్వభావులు, క్రూర కర్మలయందు ఆసక్తులు అగు అసురలను వంచించి - సాత్వికులు, భక్తులు, తన్ను సేవించువారు అయినట్టి దేవతలకు పంచిపెట్టారో...

ఆవిధంగా...,జగత్కారణుడు - ఆద్యుడు - శ్రీకృష్ణనామ సంజ్ఞుడు అగు శ్రీకృష్ణ చైతన్యానందమూర్తి "ఉద్ధవునితో సంభాషించటం" అనే మిషతో ఉద్ధవ-శ్రీకృష్ణ సంవాద రూపంగా భక్తిరస పూరిత మాధుర్యముతో కూడిన ఆత్మతత్త్వ జ్ఞానాన్ని - మనలోని అల్పజ్ఞత-అల్పాశయత్వం తొలగటానికై

**మందరికీ పంచిపెట్టారు.**

అట్టి మమాత్మ స్వరూపులగు శ్రీ కృష్ణయోగీశ్వర భగవానునికి కృతజ్ఞతాపూర్వకంగా సాష్టాంగ దండ ప్రణామములు.

శ్రీ వ్యాస భగవాన్! నమో నమో నమో నమః!

---

## ఇతి

**శ్రీమద్భాగవతే - మహా పురాణే బ్రహ్మసూత్ర భాష్యే**
**పారమహంస్యాం సంహితాయాం వైయాసిక్యామ్**
**ఏకాదశ స్కంధే భగవదుద్ధవ సంవాదే**
**అధ్యయన పుష్పము**
**శ్రీకృష్ణ పరబ్రహ్మణి పాదరవిందార్పణమస్తు**

---

**చిన్ని కృష్ణుని లీలలు మనకు గ్రంథస్థం చేసి ప్రసాదించిన శ్రీ వ్యాస మహర్షికి,**
**శ్రీ శుక మహర్షికి, శ్రీ పోతనామాత్యుల వారికి నమో నమో నమో నమః**

# గొ ల్ల వా ర ము

గొల్ల...వారమూ సద్గురుకృపచే పాలవారము.....

1. వరయోగీ.... తిరుమణి గురుసేవ...
   వదలక మిము.... కొలచే వారికి...
   సాధునెరిగి....రామానుచార్యుల
   వార్తలందు.... చల్ల...లమ్మే ॥గొల్లవారము॥
2. గోత్రమనియె....తిరుమంత్రముచే
   గొడ్డ...లొకటి.... చేత...బూనీ
   అండ...గోరాండమనియె
   అడవినరకి దొడ్డి.... కట్టే ॥గొల్లవారము॥
3. చీకటనియె...కోనలోన
   చిట్టడివి మే...సేటి పసువుల
   చిత్తమందున....దొడ్డీ...లోన
   చెదరకుండ....మంద...చేసే ॥గొల్లవారము॥
4. అందమైన....బిందెనిండ
   చిందకుండ.... పాలు పితకే
   పొందికైనా... అనువుమీరా
   పొంగకుండా.... పాలు.. కాచే ॥గొల్లవారము॥
5. శాంతమను...పా...లారాబోసి
   చిత్రాక్షనియె...తోడు చేసి
   ఆత్మ అనియె... భాండవలోన
   అందముగా...తాయారునచె ॥గొల్లవారము॥
6. తిరుమంత్రమనియె... కవ్వముతోడ
   భుజమంత్రమనియె .... పెరుగుచిలికి
   తిరుమార్ధమనియె.... వెన్న...తీసి
   చెదరకుండా... ముద్ద...చేసే ॥గొల్లవారము॥
7. అన్నీ విధముల.... అమర కాచీ
   వన్నెమీరగ ... నేయి చేసి
   వినయమనియె... విన్నపముతో
   నిష్టతో... నిజగురునిచేరే... నిష్ఠతో శివగురుని చేరే
   నిష్టతో కృష్ణ గురుని చేరే.... ॥గొల్లవారము॥